1)నాట
ప॥ మర్ద మర్ద మమ బంధాని। దుర్ధాంత మహాదురితాని॥
చ॥ చక్రాయుధ రవిశత తేజోంచిత। సక్రోధసహస్ర ప్రముఖ।
విక్రమక్రమా విస్ఫులింగకణ। నక్రహరణ హరినవ్యకరాంక॥
చ॥ కలితసుదర్శన కఠినవిదారణ। కులిశకోటిభవ ఘోషణా।
ప్రళయానలసంభ్రమ విభ్రమకర। రళితదైతగళ రక్తవికీరణా॥
చ॥ హితకరశ్రీవేంకటేశప్రయుక్త। సతతపరాక్రమ జయంకర।
చతురోஉహంతే శరణమ్ గతోஉస్మి। యితరాన్ విభజ్య యిహ మాం రక్ష॥
2)శంకరాభరణం
ప॥ చేపట్టి మమ్ము గావు శ్రీనరసింహా నీ-। శ్రీ పాదములే దిక్కు శ్రీనరసింహా॥
చ॥ చెలగువేయిచేతుల శ్రీనరసింహా। చిలికేటినగవులశ్రీనరసింహా।
సిలుగులేనిమంచి శ్రీనరసింహా। చెలి దొడెక్కించుకొన్న శ్రీనరసింహా॥
చ॥ క్షీరసముద్రమువంటి శ్రీనరసింహా దైత్యు। జీరినవజ్రపుగోళ్ళ శ్రీనరసింహా।
చేరి ప్రహ్లాదునిమెచ్చే శ్రీనరసింహా నుతిం-। చేరు దేవతలు నిన్ను శ్రీనరసింహా॥
చ॥ శ్రీవనితతో మెలగు శ్రీనరసింహా। చేవదీరె నీమహిమ శ్రీనరసింహా।
శ్రీవేంకటాద్రిమీది శ్రీనరసింహా సర్వ-। జీవదయాపరుడవో శ్రీనరసింహా॥
3)కాంభోజి
ప॥ విచారించు హరి నావిన్నప మవధరించు। పచారమే నాదిగాని పనులెల్లా నీవే॥
చ॥ తనువు నాదెందుగాని తనువులోనింద్రియములు। అనిశము నాచెప్పినట్టు సేయవు।
మనసు నాదెందుగాని మర్మము నాయిచ్చ రాదు। పనివడిదూరు నాది పరులచే భోగము॥
చ॥ అలరి నానిద్దుర నాదెందుగాని సుఖమెల్ల। కలలోని కాపిరాలతలపాలె।
తెలివి నాదెందుగాని దినాలు కాలముసొమ్ము। యెలమి బేరు నాది యెవ్వరిదో బలువు॥
చ॥ కర్మము నదెందుగాని కర్మములోఫలమెల్ల। అర్మిలి నాజన్మముల అధీనమె।
ధర్మపుశ్రీవేంకటేశ దయానిధివి నీవు। నిర్మితము నీ దింతే నెరుపు నీమాయది॥
4)ముఖారి
ప॥ అతిసులభం బిది యందరిపాలికి। గతియించి శ్రీపతికైంకర్యంబు॥
చ॥ పాలసముద్రము బలిమి దచ్చి కొని-। రాలరి దేవత లమృతమును।
నాలుక నిదె హరినామపుటమృతము। యేల కానరో యిహపరసుఖము॥
చ॥ అడరి బాతిపడి యవని దేవతలు। బడివాయరు యజ్ఞ భాగాలకు।
విడువక చేతిలో విష్ణుప్రసాదము। కడిగడియైనది కానరుగాని॥
చ॥ యెక్కుదురు దిగుదు రేడులోకములు। పక్కన దపముల బడలుచును।
చిక్కినాడు మతి శ్రీవేంకటేశ్వరు-। డిక్కదితుదుపద మెఱుగరుగాన॥
5)భూపాలం
ప॥ హరివారమైతిమి మమ్మువు గాదనగరాదు। తరముగా దికను మాతప్పులు లోగొనరో॥
చ॥ వెన్నడించిసూడువట్టేవిష్ణుమాయ నీకు నేము। యిన్నిటా బంతమిచ్చేము యింక గానరో।
నన్నల వెట్టిగొనేటి సంసారబంధము నీకు। మున్నె కిందుపడితిమి ముంచి దయజూడవో॥
చ॥ ఆడించేటి కామక్రోధాదిజాజరులాల। వోడితిమి మీకు దొల్లె వొరయకురో।
వీడనికర్మమ నీకు వెఱచి పూరి గఱచే-। మీడనె ధర్మదార మాకికనైనా బట్టవో॥
చ॥ దక్కగొన్న మాలోనితనుభోగములాల। మొక్కితిమి మాకు గొంతమొగమోడరో।
యెక్కువ శ్రీవేకటేశు డేలె మాజన్మములాల। గక్కన వేడుకొంటిమి కపటాలు మానరో॥
6) భైరవి
ప॥ దైవమా నీమాయ తలమొ లెఱగనీదు। కావరపువిశయాలకట్లు వదలవు॥

చ॥ గక్కున బెరిగివచ్చి కాలము మీదమీద। వొక్కనాటి కొక్కనాటి కొత్తు కొత్తుక।
నిక్కి తుమ్మిదలవంటి నెరులెల్లా దెల్లనాయ। కక్కరమాయ మేను కాంక్షలూ నుడుగవు॥
చ॥ చిన్ననాడు మోహించినాచెలులు నేజూడగానే। పన్నినవయసుమీరి ప్రౌఢలైరి।
వన్నెకుబెట్టినసొమ్ము వడి రాసి యెత్తుదీసె। మున్నిటివే వెనకాయ ముచ్చటా దొలగదు॥
చ॥ సిగ్గులెల్లా బెడబాసె చేరి యవ్వరు నవ్వినా। యెగ్గుపట్టదు మనసు యెఱుకతోనే।
నిగ్గుల శ్రీవేకటేశ నీవు నన్ను నేలుకొని। దగ్గరి నాలోనుండగా తలపూ గైవాలదు॥

7)ముఖారి

ప॥ పులుగు చెప్పెడి నదె పొంచి మాగురుడు నీకు। తలచుకో నేడు నీవు దాచినర్థము॥
చ॥ యిలమీద తమసొమ్ము లెవ్వరివద్ద నుండినా। తలపడి కొలుపిడి తగిలినట్టు।
తొలుత పంచేంద్రియపుదొంగలవద్ద నున్నాడ। వెలయ నీసొమ్మనుచు విడిపించుకొనవే॥
చ॥ చేరి తమవూరివారి చెఱవట్టుకొని పోతే। కోరి కుయివోయి తెచ్చుకొన్నట్టు।
వూరక నీకుక్షిలోనవున్ననన్ను నీమాయ। వీరాన జెఱపట్టెను విడిపించుకొనవే॥
చ॥ బడిదప్పి తిరిగేటిపడచుల తమవారు। తడయక తెచ్చుక ఆదరించినట్టు।
వెడబుద్ధి దిరిగేను వెఱ్ఱిని శ్రీవేకటేశ। విడువక అజ్ఞానినన్ను విడిపించుకొనవే॥

8)ఆహిరి

ప॥ ఇందులో మొదలికర్త యెవ్వడు లేడుగాబోలు। ముందు కరివరదుడే ముఖ్యుడుగాబోలు॥
చ॥ ఆడితిబో బహురూపా లన్ని యోనుల బుట్టి। తోడనే బ్రహ్మాదులనేదొరలెదుటా।
జాడలు మెచ్చాలేరు చాలునన్నవారు లేరు। వేడుక నడవిగాసేవెన్నెలాయ బ్రదుకు॥
చ॥ అన్ని కర్మములు జేసి ఆటలో బ్రాహ్మణుడనైతి-। నన్ని వేదములనేటి యంగడివీధి।
నన్ను జూచేవారు లేరు నవ్వేటివారు లేరు। వన్నెలసముద్రములో వానలాయ బ్రదుకు॥
చ॥ సంసారపు నాటకసాలలో ప్రతిమనైతి। కంసారి శ్రీవేంకటపతిమాయలోన।
యింస లిన్నియు దేరె నిందరు జుట్టములైరి। హంసచేతిపాలునీరునట్లాయ బ్రదుకు॥

9)లలిత

ప॥ ఒల్లడుగాక దేహి వుద్యోగించడుగాక। కొల్లలైనమేలు తనగుణములో నున్నది॥
చ॥ తలచుకొంటేజాలు దైవమేమి దవ్వా। నిలుచుక తనలోనే నిండుకున్నాడు।
చలపట్టితేజాలు సర్గమేమి బాతా। చలివేడి నాలికపై సత్యములోనున్నాడు॥
చ॥ ఆయమెఱిగితే జాలు నాయుష్యము గరవా। కాయపుటూపిరిలోనే గని వున్నది।
చేయబోతే పుణ్యుడుగా జీవునికి దడవా। చేయూర గర్మము తనచేతిలోనే వున్నది॥
చ॥ మొక్కనేరిచితే జాలు మోక్షమేమి లేదో। యెక్కువ శ్రీవేంకటేశు డిదె వున్నాడు।
దక్కగొంటేజాలు పెద్దతనమేమి యరుదా। తక్కక శాంతముతోడిదయ లోన నున్నది॥

10)సామంతం / సావేరి

ప॥ నూతులు దవ్వగబోతే బేతాళములు పుట్టె। కాతాళపులోకులాల కంటిరా యీసుద్దులు॥
చ॥ మీఱినపుత్రకామేష్టి మించి లంకకు బై వచ్చె। ఆఱడి రామావతార మసురబాధ।
తూఱి సీతపెండ్లి హరుదొడ్డ వింటిపండుగాయ। పాఱి పాఱి నమ్మ నెటువలెవచ్చు వీరిని॥
చ॥ చూడ కేకయరాజ్యము చుప్పనాతిపాపమాయ। వేడుక మాయామృగము వేటాయను।
వాడికె సుగ్రీవుమేలు వాలికి గండాన వచ్చె। యీడుగాని రాచపుట్టు యెట్టు నమ్మవచ్చును॥
చ॥ వుమ్మడి గోతులకూట ముదధికి గట్లు వచ్చె। తమ్ముని బుద్ధి రావణుని తల వోయను।
పమ్మి శ్రీవేంకటేశునిపట్టానకే యింతానాయ। యిమ్ముల నిట్టిదేవర నెట్టు నమ్మవచ్చును॥

11)సాళంగనాట / తోడి

ప॥ అన్నిటి కెక్కుడుయీని హరియిచ్చేది। మన్నించువానికంటే మఱి లేరు దొరలు॥
చ॥ తగుబ్రహ్మలోకముదాకా నెక్కిచూచిన। మగుడ బుట్టేలోకాలే మనుజులకు।
తెగ యిచ్చే యింద్రాదిదేవతలవరములు। యెగువదిగువలను యీసందివే॥

చ॥ మాయలోన బుట్టేది మాయలోన బెరిగేది। కాయదారులకు నెల్లా గలిగినదే।
సేయరానిపుణ్యమెల్లా జేసి గడించుకొనేది। చాయల బహురూపపుసంసారమే॥
చ॥ చెడనివైకుంఠ మిచ్చు జేటులేనిపర మిచ్చు। వెడమాయ బెడబాపు విష్ణు డితడే।
యెడయక శ్రీవేంకటేశుడై వున్నాడు వీడె। జడియ కితడే కాచు శరణంటే జాలును॥

12)సామంతం / బహుదారి

ప॥ ఏమి సేయుదు నింక నిందిరాధీశ్వరుడా। నీమఱుగు చొచ్చితిని నెరవేర్తుగాక॥
చ॥ కడి వోనిజవ్వనము కలిమిలేమెఱుగునా। బడినుండి మిగుల ఋణపరచుగాక।
అడియాసలెల్లా బుణ్యముబాప మెఱుగునా। వెడగుదనలో దయ విడిపించుగాక॥
చ॥ వలపువెఱ పెఱుగునా వాడిమొనలకు నైన। బలిమి దూరించ జలపట్టుగాక।
చలనమందినమనసు జాతి నీ తెఱుగునా। కలిసి హేయమున కొడిగట్టించుగాక॥
చ॥ యెలమి రతివశము యెగ్గుసిగ్గెఱుగునా। బలిమి దిట్లకు నొడబఱచుగాక।
యిలలోన శ్రీవేంకటేశ నీమాయ లివి। తలగించి యేలితివి దయసేతుగాక॥

13)భైరవి

ప॥ అయ్యో మాయల బొంది అందు నిందు నున్నవారు। యియ్యగొన గర్తలుగా రెఱుగరు జడులు॥
చ॥ చుక్కలై యుండినవారు సురలై యుండినారు। యిక్కడనుండిపోయినయాజివులే।
దిక్కుల వారి నిందరు దేవతలంటా మొక్కేరు। యెక్కుడైనహరి నాత్మ నెఱుగరు జడులు॥
చ॥ పాతాళవాసులకు పలులోకవాసులును। యాతరువాతనుండినజీవులే।
కాతరాన వారిపుణ్యకతల వినేరుగాని। యాతల శ్రీహరికత లెఱుగరు జడులు॥
చ॥ యిరవెఱిగినముక్తు లెఱుగని బుద్ధులు। యిరవై మనలోనున్న యాజీవులే।
సిరుల మించినవాడు శ్రీవేంకటేశ్వరుడే। శరణాగతులు చక్క చక్కగారు జడులు॥

14)శుద్ధవసంతం

ప॥ ఛీ ఛీ వివేకమా చిత్తపువికారమా। యేచి హరి గొలువక హీనుడాయ జీవుడు॥
చ॥ బతికేనంటా బోయి పయిడి వుచ్చుక తన-। పతియవసరముల బ్రాణమిచ్చిని।
బతు కందులోన నేది పసిడి యెక్కడ నుండు। గతిహరి గొలువక కట్టువడె జీవుడు॥
చ॥ దొడ్డవాడనయ్యేనని దొరల గొలిచి వారి-। కడ్డము నిడుపు మొక్కు నతిదీనుడై।
దొడ్డతన మేది యందు దొర యాడనున్నవాడు। వొడ్డి హరి గొలువక వోడుపడె జీవుడు॥
చ। చావనేల నోవనేల సారె గిందుపడనేల। యావల శ్రీవేంకటేశు డింట నున్నాడు।
దేవు డాతడే నేడు తెలిసి కొలిచేగాని। భావించ కిన్నాళ్ళదాకా భ్రమ బడె జీవుడు॥

15)రామక్రియ

ప॥ అనుచు నిద్దరునాడే రమడలవలెనే। మొనసి యివెల్లా జూచి మ్రొక్కిరి బ్రహ్మాదులు॥
చ॥ రాముడ పండ్లు నాకు రండు వెట్టరా। యేమిరా యిట్లానె నాకు యిత్తువా నీవు।
ప్రేమపుతమ్ముడగాన పిన్ననే నీకు। యామాట మఱవకు యిందరా కృష్ణుడా॥
చ॥ యెక్కినవుట్టిపై నన్ను నెక్కించరా వోరి। వుక్కున బడేవు రాకు వద్దురా నీవు।
పక్కున మొక్కేరా నీపయిడికాళ్ళకు వోరి। అక్కతో జెప్పేగాని అందుకొనే రారా॥
చ॥ యెవ్వరు వొడవో సరి నిటు నిలుతమురా వోరి। నివ్వటిల్ల నీవింత నిక్కవొద్దురా।
రవ్వల శ్రీవేంకటాద్రిరాయడనేరా, అయితే। యివ్వల నీకంటె బెద్ద యిది నీవెఱుగవా॥

16)ధన్యాసి

ప॥ పెట్టిననీ వెఱుగుదు పెనుదిక్కు। జట్టిగా శ్రీహరి నీకు శరణు చొచ్చితిమి॥
చ॥ కర్మమూలమైనట్టికాయము మోచి నేను। కర్మము విడువబోతే కడుసంగతా।
మర్మమెఱిగిననీవే మాయల గట్టుండగాను। పేర్మి నే విడువబోతే బిగియదా కట్టు॥
చ॥ బంధమూలమైనట్టిప్రపంచమందు నుండి। బంధము బాసేనంటే బాసునా అది।
అంధకారమైనట్టి అజ్ఞానాన దోసితివి। అంధకారమున వెలు గరసితే గలదా॥

చ|| నిచ్చలు నీసంసారపునీరధిలోన మునిగి | చొచ్చి వెళ్ళి చేరేనంటే జోటు గలదా |
యిచ్చట శ్రీవేంకటేశ యిహమందే పరమిచ్చి | అచ్చు మోపి యేలగా నే నన్నియు దెలిసితి ||

17)మలహరి

ప|| అంతరుమాలినయట్టి అధములాల | పొంత సంతకూటమి పొరిచూపు గాదా ||

చ|| కనక మిత్తడితోడ కలయ సరిదూచితే | అనువవునా అది దోష మవుగాక |
ఘనుడైనహరితో గడుహీనదేవతల | ననిచి సరివెట్టితే నయ మవునా భువిని ||

చ|| పట్టభద్రుడు గూర్చుండేబలుసింహాసనముపై | వెట్టిబంటు బెట్టేవారు వెఱ్ఱులేకారా |
గట్టిగా శ్రీహరితోడ కలగంపదేవతల | బెట్టి కొలుచుట విందువెట్టి పగగాదా ||

చ|| కొంచక సింహముండేటిగుహ నుండవచ్చునా | పొంచి నక్కలకెల్ల బొక్క లేకాక |
అంచెల శ్రీవేంకటేశు డాత్మలోనే వుండగాను | కొంచెపుదైవాల పలువంచలనేకాక ||

18)దేవగాంధారి

ప|| కల్లమాడ దొడ్డముద్ర కటకటా | చెల్లుబడికల్లలు చెప్పేరు లోకులు ||

చ|| యిప్పుడేబ్రహ్మదేవు డిట్టేవుండగ మీదటి- | వొప్పగుబ్రహ్మపట్టము వొకరికి వెచ్చపెట్టి |
అప్పటి మూడుమూర్తులయందులో నీతని సరి- | చెప్పబొయ్యే రీమాట చెల్లునా లోకులకు ||

చ|| కైలాసము రుద్రుడుగలబ్రహ్మాండ్లకోట్లు | పోలించి విష్ణుడు కడుపున నించుకుండగాను |
చాలి మూడుమూర్తులలో సరి యీత డంటాను | కూళలై యాడేరుగాక కూడునా లోకులకు ||

చ|| ఘనుడీతనిపాదము గడిగె బ్రహ్మదేవుడు | మునుముట్టి శిరసున మోచె శివుడు |
వొనర మూడుమూర్తులం దొకడు శ్రీవేంకటేశు- | డనుమాట యిది తగవవునా లోకులకు ||

19)పాడి

ప|| తెలిసితే మోక్షము తెలియకున్న బంధము | కలవంటిది బదుకు ఘనునికిని ||

చ|| అనయము సుఖమేడ దవల దుఃఖమేడది | తనువుపై నాసలేని తత్త్వమతికి |
పొనిగితే బాపమేది పుణ్యమేది కర్మమందు | వొనర ఫలమొల్లని యోగికిని ||

చ|| తగినయమృతమేది తలపగ విషమేది | తెగి నిరాహారియైనధీరునికిని |
పగవారనగ వేరె బంధులనగ వేరీ | వెగటుప్రపంచమెల్ల విడిచేవివేకికి ||

చ|| వేవేలువిధులందు వెఱపేది మఱపేది | దైవమునమ్మినయట్టిధన్యునికిని |
శ్రీవేంకటేశ్వరుడు చిత్తములో నున్నవాడు | యీవలేది యావలేది యీతనిదాసునికి ||

20)భైరవి

ప|| నీదాస్యమొక్కటే నిలిచి నమాగలది | శ్రీదేవుడవు నీచిత్తము నాభాగ్యము ||

చ|| అనుష్ఠానములు గతియని నమ్మి చేసితినా | తనువిది మలమూత్రములప్రోగు |
జనులలో నుత్తమపుజన్మమే నమ్మితినా | వొనర గర్మమనేవోదాన బడితిని ||

చ|| చదువులశాస్త్రములజాడలు నమ్మితినా | పొదలినమతములపోరాట మది |
మదిమదినుండిననామనసే నమ్మితినా | అదియును నింద్రియాల కమ్ముడువోయినది ||

చ|| పుత్రదారధనధాన్యభూములు నమ్మితినా | పాత్రమగురుణానుబంధము లవి |
చిత్రముగ నను గావు శ్రీవేంకటేశ నీవే | పత్రపుష్పమాత్రమే నాభక్తియెల్లా నీకు ||

21)బౌళి

ప|| నందగోపనందనుండే నాటిబాలుడు | ఇందు నేడే రేపల్లె నేచి పెరిగెను ||

చ|| పువ్వువంటిమఱ్ఱియాకుపొత్తి బవళించనేర్చె | యెవ్వడోకాని తొల్లె యీబాలుడు |
ముప్వంకవేదములను ముద్దుమాట లాడనేర్చె | యెవ్వరూ గొంత నేర్పనేటికి ||

చ|| తప్పటడుగు లిడగనేర్చె ధరణియందు నాకసమున | నెప్పుగా రసాతలమున నొంటి తొల్లియే |
రెప్పలెత్తి చూడనేర్చె రేసీ జెంద్రునందు పగలు | గొప్పసూర్యునందు నింక గొత్త నేర్పనేటికే ||

చ|| మంచివెన్నబువ్వ లిపుడు మలసి యారగించనేర్చె | సంచితముగ శ్రీవేంకటాద్రిమీదను |
యెంచి యప్పలప్పలనుచు యెనసి కాగలించనేర్చె | దించరానివురముమీద దివ్యకాంతము ||

22)సామంతం/హుసేని
ప॥ నీరువట్టు గొన్న వేళ నేయి మందదవునా। కూరిమి మమ్మిద్దరిని గూరుచరే చెలులు ॥
చ॥ నెలత చెక్కులే నాకు నిలువుటద్దములు। అలరుల తావి పూర్పులాల వట్టాలు।
సె;అవుల నగవులే చేతికిచ్చే కప్పుఆలు। చలిమందు లిక నన్నీ జాలునే నాకు ॥
చ॥ వనిత మాటలే నాకు వలరాచ మంత్రాలు। నినుపు జెమటలే పన్నీటి సోనలు।
ఘనమైన సరశాలే గందపు కస్తూరి పూత। యెనలేని వుపచారా లివియేలే నాకు ॥
చ॥ సతితోడి పానుపే చంద్రకాంతపు వేది। యితవుగ గూడించితి రిందరూ మమ్ము।
రతుల శ్రీ వేంకటాద్రి రాయడ నేనది వో। మితిమీర నూచకురే మేలాయ బనులు ॥

23)రామక్రియ/హిందోళం
ప॥ కట్టెదుర వైకుంతము కాణాచయిన కొండ। తెట్టలాయ మహిమలే తిరుమలకొండ ॥
చ॥ వేదములే శిలలై వెలసినది కొండ। యేదెస బుణ్యరాసులే యేరులైనది కొండ।
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ। శ్రీదేవుడుండేటి శేషాద్రి కొండ ॥
చ॥ సర్వదేవతలు మృగజాతులై చరించేకొండ। నిర్వహించి జలధులే నిట్టచరులైన కొండ।
వుర్విదపసులే తరువులై నిలచిన కొండ। పూర్వటంజనాద్రి యీ పొడవాటి కొండ ॥
చ॥ వరములు కొటారుగా వక్కాణించి పెంచే కొండ। పరగు లక్ష్మీకాంతుసోబనపు గొండ।
కురిసి సంపదలెల్ల గుహల నిండిన కొండ। విరివైన దదివో శ్రీవేంకటపు గొండ ॥

24)సామంతం/ద్విజావంతి
ప॥ నీయంత వాడనా నేను నేరము లే మెంచేవు। యీయెడ నిరుహేతుక కృప జూడు నన్నును ॥
చ॥ నిరతి నిన్నెఱుగను నీవు నన్నెఱుగుదువు। ధర యాచకుడ నేను దాతవు నీవు।
వరుస నీచుడ నేను వైకుంతపతివి నీవు। నరుడ నేను నీవు నారాయణుడవు ॥
చ॥ సారె నలసుడ నేను సర్వశక్తివి నీవు। ధీరుడవు నీ వతి దీనుడ నేను।
కారుణ్య మూర్తివి నీవు కఠిన చిత్తుడ నేను। మేరతో నీ వేలికవు మీ దాసుడ నేను ॥
చ॥ జనక శీలుడ నేను జనకుడవు నీవు। ఘనవేదాంత నిధివి కర్మిని నేను।
అనిశము శ్రీ వేంకటా చలేంద్రుడవు నీవు। పనుల నీ సంకీర్తన పరుడ నేను ॥

25)సామంతం/ఆనందభైరవి ... పెదతిరుమలాచారి కృతి
ప॥ అందులోనె వున్నా వాడు ఆది మూరితి। అందరాని పదవియైన నందిచ్చు నతడు ॥
చ॥ ఘనులిండ్ల వాకిళ్ళు కావ బొయ్యే జీవుడా। కని జీ యాత్మ వాకిలి కావరాదా।
యెనసి పరుల రాజ్య మేలబొయ్యే జీవుడా। అనిశము నీ మనో రాజ్యము నేలరాదా ॥
చ॥ చెలుల రూపము లెల్ల చింతించే జీవుడా। చెలగి నీ రూప మేదో చింతించ రాదా।
కెలన సుఖములు భోగించేటి జీవుడా। పొలసి సుజ్ఞానము భోగించరాదా ॥
చ॥ చేవ సంసారాన బలిసిన యట్టి జీవుడా। భావపు టానందాన బలియ రాదా।
కోవరపు సంపదల కోరేటి జీవుడా। శ్రీ వేంకటేశుని సేవగోర రాదా ॥

26)సామంతం/ఖరహరప్రియ
ప॥ చూడరమ్మా చెలులాల సుదతి చక్కదనాలు। కూడుకొన్న పతి కాంతి గురులే పోలెను ॥
చ॥ మొగము చందురు బోలె ముంచిన యీ యిందిరకు। తగిన తోడ బుట్టుగా నాతడే కనక।
నగ నమృతము బోలె నలినాక్షి కదియును। తగిన పుట్టిన యింటి ధనమే కనక ॥
చ॥ సతి గుణ మింతాను సముద్రమునే పోలె। తతి నాతడీకెకు తండ్రి గనక।
మితిగా గన్నులు గండు మీసముల బోలె నవి। గతి గూడి తమ వారి కడవే కనక ॥
చ॥ తరుణి పాదాలు కల్పతరువు చిగురు బోలె। పరగగ దనవెను బల మంటాను।
గరిమ శ్రీ వేంకటేశు గైకొని పెండ్లాడి యీపె। సరవు లాతని బోలె సరసుడంటాను ॥

27)సామంతం/రాగమాలిక
ప॥ వెనక ముందరికి బెద్దల కెల్లను వివరపు సమ్మతి యీ వెరవు।

వెనుకొని తన గురు నాథుని యనుమతి వేదోక్తంబగునీ తెరవు ॥
చ॥ కనకాసక్తుడు గాకుండుట మది కైవల్యమునకు నొక తెరువు ।
వనితల భ్రమలకు వలల దగులని వైకుంఠమునకు నొక తెరువు ।
మును కోపము బెడ బాసిన మతి మోక్షంబునకును నొక తెరువు ।
యెనసి యిందుపై హరి దలచిన మతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు ॥
చ॥ నిరతి విషయముల నణచిన ధృఢ మతి నిశ్శ్రేయసమున కొక తెరువు ।
విరతి తోడ నెలవైన మతి విభవపు బరమున కొక తెరువు ।
వెరవున నిందరి మీదటి సమమతి విష్ణులోకమున కొక తెరువు ।
యిరవెరి గంతట హరి నమ్మిన మతి యిన్నిటి కెక్కుడు యీ తెరువు ॥
చ॥ జనక శీలుడ నేను జనకుడవు నీవు । ఘనవేదాంత నిధివి కర్మిని నేను ।
అనిశము శ్రీ వేంకటా చలేంద్రుడవు నీవు । పనుల నీ సంకీర్తన పరుడ నేను ॥

28)ఛాయానాట
ప॥ ఎఱుగనైతి నిందాకా నేటిదో యంటానుంటి । నెఱి దొరలనాడీని నేనే మందు నికను ॥
చ॥ కొండలలో నెలకొన్న కోన చెన్న రాయడిదే । బొండు మల్లెల వేసెనేపూచి నన్నును ।
పండుముత్తేల సొమ్ములప్పటి నామెడ బెట్టి । దుండగము సేసె నేమందు నేనికను ॥
చ॥ గొప్పయైన యేటిదరి గోన చెన్న రాయడిదే । దప్పికి గప్పురదుంపె దరుణి చేత ।
చెప్పరాని మాటలెల్ల జెవిలో దానే చెప్పి । దుప్పటి గప్పీ నేమందు నికను ॥
చ॥ గుఱితో శ్రీ వేంకటాద్రి కోన చెన్న రాయడిదే । చెరుగు పట్టి ప్రియురాలు చెప్పికూడెను ।
జఱయుచు వచ్చి వచ్చి చనవు లెల్లా నొసగి । మెఱసి తొరల నాడి మఱే మందు నికను ॥

29)నాట/రాగమాలిక
ప॥ రాముడు లోకాభిరాముడందరికి రక్షకు డీతని దెలిసి కొలువరో ।
కామిత ఫలదుడు చరాచరములకు గర్తయైన సర్వేశ్వరుడితడు ॥
చ॥ తలప దశరథుని తనయుడట తానె తారక బ్రహ్మట ।
వెలయ మానుషపు వేషమట వెగటు హరువిల్లు విరిచెనట ।
అలరగ తానొక రాజట పాదాన నహల్య శాపము మాన్పెనట ।
సొలవక దైవిక మానుషలీలలు చూపుచు మెరసీ జూడరో యితడు ॥
చ॥ జగతి వసిష్ఠుని శిష్యుడట జటాయువుకు మోక్షమిచ్చెనట ।
అగచరులే తనసేనలట అంబుధి కొండల గట్టెనట ।
మగువ కొరకుగానట కమలాసను మనుమని రావణు జంపెనట ।
తగలౌకిక వైదికములు నొక్కట తానొరించీ జూడరో యితడు ॥
చ॥ వెస నమరుల వరమడిగెనట విభీషణ పట్టము గట్టెనట ।
యెసగ నయోధ్యకు నేలికట యింద్రాదులకు గొలువిచ్చెనట ।
పొసగ శ్రీ వేంకటగిరి నివసమట భువనము లుదరంబున ధరించెనట ।
సుసరపు సూక్ష్మాధికములు తనందు జూపుచునున్నాడు చూడరో యితడు ॥

30)నాట
ప॥ ఎన్ని చేత లెన్ని గుణాలెన్ని భావాలు ॥
చ॥ యేమి లీలలు నటియించే వేమయ్య దేవుడా । భూమిలో జీవులనెల్ల బుట్టింపుచు ।
ప్రేమతో మాటలాడే పిన్న వాడవూ గావు । నీ మహిమ లిన్నియూ నీకె తెలుసు ॥
చ॥ యెంతని వదరుకొనే విందిరా నాథుడా । అంతరంగముల నుండె అందరిలోన ।
వింతలు లేవు నీకు వెఱ్ఱివాడవు గావు । యింతేసి విచారాలు యివి నీకె తెలుసు ॥
చ॥ చెలగి వరాలిచ్చేవు శ్రీ వేంకట నాథుడా । తలకక నిన్ను గొల్చే దాసులకు ।
అలరి నీవైతేను అశక్తుడవు గావు । నెలవైన నీ సుద్దులు నీకె తెలుసు ॥

31)నాట
ప|| నీపాపమే కాదు, ఇది నిండిన లోకము జాడ|పైపై వచ్చిన వలపు పాటించరెవ్వరును ||
చ|| అట్టే మంచిమాటలాడే అతివ బాతి పడగ | చిట్టకములాడే యింతిజెనకేవు |
అట్టే కాదా పంచదార అండనెంత వుండినాను | పట్టి పెనగేటి నిమ్మపంటికి నోరూరును ||
చ|| చేతులెత్తి మొక్కేటి చెలి గాచుకుండగాను | ఆతలిమోమైన వారి కాసపడేవు |
జాతితో బాలపండ్లు సంగడినే వుండగాను | ఘాత బెరిగే బూరుగు గాయలు చూపట్టును ||
చ|| నెట్టన బెండ్లాడిన నేనే నీ కుండగాను | అట్టు గొల్లెతలచే నాఱడి బొందితి |
ఇట్టెనిన్ను గూడితిని యిందాకా శ్రీవేంకటేశ | వొట్టితే పాలును జల్లా నొక్కరీతి నుండును ||

32)నాట/హిందోళ
ప|| అన్నిటా జాణ వౌదువు ఓభళేశ్వర | యెన్ని చూచుకొంటేను ఇట్టుండు మోహము ||
చ|| మరు గొండలపైన నుండి మగువ బాయగ లేక | కోరివచ్చితి విందిర గుడిలోనికి |
ఆరితేరిన దేవుడ వగ్గళ్ళురుకుదురా | యేరీతి వారికైనా నిట్టుండు మోహము ||
చ|| నడుమను భవనాశినిది వారుచుండగాను | కడు దాటి వచ్చితివి కాంతయింటికి |
వడి బారగానేరీది వత్తురా సాహసమున | యెడయ కెవ్వరికైనా నిట్టుండు మోహము ||

33)వరాళి
ప|| నడువరో జడియక సవ్యమార్గమిది | మడుగరి వైష్ణవ మార్గమిది ||
చ|| ఘన శుకముఖ్యులు గన్న మార్గమిది | జనకాదుల నిశ్చల మార్గమిది |
సనత్కుమారుడు జరపు మార్గమిది | మనువుల వైష్ణవ మార్గమిదీ ||
చ|| నలుగడ వసిష్ఠు నడుచు మార్గమిది | యిల వేదవ్యాసుల మార్గంబిది |
బలిమిగలుగు ధృవపట్టపు మార్గమిది | మలసినవైష్ణవ మార్గమిది ||
చ|| పరమ మార్గంబిదె ప్రపంచ మార్గమిది | గురు మార్గంబిదె గోప్యమిదే |
గరిమెల శ్రీవేంకటపతి మాకును | మరిపెను వైష్ణవ మార్గమిదే ||

34)వరాళి/అమీర్కల్యాణి
ప|| ఇసుక పాతర యిందుకేది కడగురుతు | రసికుడ నన్ను నింత రవ్వ శాయ నేటికి ||
చ|| బయలు వలె నుండును పట్టరాదు వలపు | మొయిలి వలె నుండును ముద్దు శాయరాదు |
నియతము లేదిందుకు నేరిచిన వారి సొమ్ము | క్రియ యెరుంగు తా నన్ను గెరలించ నేటికి ||
చ|| గాలివలె బారుచుండు కానరాదు మనసు | పాలవలె బొంగుచుండు పక్కన నణగదు |
యేలీలా గెలువరాదు యెక్కితే యేనుగ గుజ్జు | లోలోనే మమ్ము నింత లోచి చూడనేటికి ||
చ|| వెన్నెలే కాయుచు నుండు వింతగాను వయసు | అన్నిటా వసంత ఋతువై యుండ బోదు |
వున్నతి శ్రీవేంకటేశుడుండ నుండ జవి బుట్ట | మన్నించె యింక మారు మాటలాడ నేటికి ||

35)వరాళి
ప|| విచ్చేయరాదా వెలది కడకు నీవు | యిచ్చ నాసపడు వారి నెలయించదగునా ||
చ|| నిలిచి నిలిచి నీకు నిక్కి యెదురు చూచీని | వలచిన సతి నీవు వచ్చేవంటా |
మలసి మలసి నీ మాటలే ఆలకించీని | యెలమి నేమని యానతిత్తువో యనుచు ||
చ|| చిమ్మి చిమ్మి నీ యింటికి చేతులే చాచీని | తెమ్మల ఆసన్న నీవు తెలుతు వంటా |
కుమ్మరించి గుట్టుమాని నవ్వీని | పమ్మినీవు తన కొంగు పట్టుదువో యనుచు ||
చ|| పూచి పూచి నీ వద్దికి పొలతుల నంపీని | యేచక నీ విప్పుడిట్టె యేలుదు వంటా |
రేచి రేచి వలపుల రేసువాయ గూడితివి | దాచెను శ్రీవేంకటేశ తమక మేలనుచు ||

36)వరాళి/కాంభోజి
ప|| ఇప్పుడిటు విభుబాసి యింతలోనె నేడు | తప్పు లోపలి తప్పు దైవమా చెలికి ||
చ|| నగవు లోపలి యలపు నంపైన పొలయలుక | పగటు లోపలి వెరగు పచ్చివేడి |
మొగము కాంతుల మెఱపు ముంచు నలుకల చెదరు | పగలు చీకట్లాయె బాపురా చెలికి ||

చ॥ బలిమి లోపలి భయము పలుకుదేనెల కనరు। చెలిమి లోపలి చేదు చింత చెలికి।
బలుపు కుచములలోని బట్టబయలగు నడుము। కలిమి లోపలి లేమి కట కటా చెలికి॥
చ॥ నిడుపు లోపలి కురుచ నీడ లోపలి యెండ। వడి మంచి తరువు వడువని తమకము।
కడు వేంకటేశ్వరుని కౌగిటను పరవశము। మడుగు లోపలి మైల మాన దీచెలికి॥

37)రామక్రియ
ప॥ అటుచూడు సతినేర్పు లవుభళేశ। అటుమటములు గావు అవుభళేశ॥
చ॥ యెదురు గొండల మీద నెక్కినట్టి లకిమమ్మ। అదివో నీ తొడ యెక్కెనౌభళేశ।
వుదుటున నంతలోనే వురముపై నెలకొని। అదిమీ జన్నుల నిన్ను నౌభళేశ॥
చ॥ ముంగోపముతోడను మొక్కలీడవైన నిన్ను। నంగన గద్దెపై బెట్టె నౌభళేశ।
కంగక వేదాద్రి నిన్ను గరుడాద్రికి దీసె। అంగా లంటె నింటిలోన నౌభళేశ॥
చ॥ చేరి నీవు నవ నారసింహరూపులైతే జెలి। ఆ రీతుల నిన్ను గూడె నౌభళేశ।
గారవాన నీవు శ్రీవేంకటముపై నుండగాను। అరసి రతి మెప్పించె నౌభళేశ॥

38)రామక్రియ
ప॥ గుట్టుతోడి బ్రదుకొక కొలదైన జాలురా। గట్టిగా నీవు మన్నించే కరుణే చాలురా॥
చ॥ మొదల నలుగలేను ముంచి నీకు మొక్కలేను। కదిసి యున్న పెద్దరికమే చాలురా।
పెదవుల దిట్టలేను పెంచి పంత మియ్యలేను। అదన నీవు నవ్విన ఆపాటే చాలురా॥
చ॥ బిగిసి యుండగలేను ప్రియము చెప్పగలేను। మొగము చూడగలిగితే ముచ్చటే చాలురా।
తగవులు చెప్పలేను తగ నిచ్చలాడలేను। తగువైన వావులతో తత్తరాలే చాలురా॥
చ॥ అటు పరాకు గాలేను ఆనవెట్టు కోలేను। యిటు నిన్ను గూడితి నాకిది చాలురా।
ఘటన శ్రీవేంకటేశ కరగించి మానలేను। తటుకున నీకు దక్కినదే చాలును॥

39)బిలహరి
ప॥ అరయశ్రావణ బహుళాష్టమి చంద్రోదయాన। సిరులతో నుదయించె శ్రీకృష్ణుడిదివో॥
చ॥ వసుదేవుని పాలిట వర తపోధనము। యెసగి దేవకీదేవి యెదపై సొమ్ము।
సురాసుర గొల్లెతల సొంపు మంగళసూత్రము। శిరులై వుదయించె శ్రీకృష్ణుడిదివో॥
చ॥ నంద గోపుడుగన్న నమ్మిన నిధానము। పొందగు యశోదకు పూజదైవము।
మందల యావులకును మంచి వజ్రపంజరము। చెంది యుదయించినాడు శ్రీకృష్ణుడిదివో॥
చ॥ సేవ సేసే దాసుల చేతిలోని మాణికము। శ్రీవేంకటాద్రినేచిన బ్రహ్మము।
వోవరి నలమేల్మంగ నురముపై బెట్టుగొని। చేవ దేర నుదయించె శ్రీకృష్ణుడిదివో॥

40)ఝుంఝూటి
ప॥ చూడవమ్మ యశోదమ్మ। వాడ వాడల వరదలివిగో॥
చ॥ పొంచి పులివాలు పెరుగు। మించు మించు మీగడలు।
వంచి వారలు వట్టిన। కంచపుటుట్ల కాగులివో॥
చ॥ పేరీ బేరని నేతులు। చూరల వెన్నల జున్నులును।
ఆరగించి యట నగుబాళ్ళు। పార వేసిన బానలివిగో॥
చ॥ తెల్లని కను దీగల సోగల। చల్ల లమ్మేటి జవ్వనుల।
చెల్లినట్లనె శ్రీవేంకటపతి। కొల్లలాడిన గురుతు లివిగో॥

41)భూపాలం
ప॥ మేలుకో శృంగారరాయ మేటి మదనగోపాల। మేలుకోవె నాపాల ముంచిన నిధానమా॥
చ॥ సందడిచే గోపికల జవ్వనవనములోన। కందువందిరిగే మదగజమవు।
యిందుముఖి సత్యభామ హృదయ పద్మములోని। గంధము మరిగినట్టి గండు తుమ్మెద॥
చ॥ గతిగూడి రుక్మిణికౌగిట పంజరములో। రతిముద్దు గురిసేటి రాచిలుకా।
సతుల పదారువేల జంట కన్నుల గలువల-। కితమై పొడిమిన నా యిందు బింబమ॥

చ|| వరుసం గొలనిలోని వారి చన్నుంగొండలపై। నిరతి వాలిన నా నీలమేఘమా।
శిరనురమున మోచి శ్రీవేంకటాద్రి మీద। గరిమ వరాలిచ్చే కల్పతరువా॥

42)సామంతం/కాపీ
ప|| ఇద్దరి కిద్దరే సరి యీడుకు జోడుకు దగు। గద్దరికన్నుల జూడ గలిగెగా మనకు॥
చ|| పంతపు చెలిచన్నుల పసిడి కాంతులకు। కాంతుని పీతాంబరపు కాంతులు సరి।
దొంతల చెలినీలపుతురుము కాంతులకు। వంతుల మేనినీలవర్ణము సరి॥
చ|| జలజాక్షి వెలలేని జఘనచక్రమునకు। చలమరివల కేలిచక్రము సరి।
కులికేటి యీయింతి కుత్తిక శంఖమునకు। చలివాయ రమణుని శంఖము సరి॥
చ|| కమలాక్షి శ్రీవేంకటపతి గూడుటకు। రమణుడంటిన సమరతులు సరి।
తమితోడి నిద్దరికి తారుకాణలై నట్టి। సముకపు మోహముల సంతసములు సరి॥

43)కురంజి
ప|| తొల్లింటి వలె గావు తుమ్మెదా యింక। వొల్లవుగా మమ్ము వో తుమ్మెదా॥
చ|| తోరంపు రచనల తుమ్మెదా కడు। దూరేవు గొందులే తుమ్మెదా।
దూరినా నెఱుగవు తుమ్మెదా మమ్ము। వోరగా చూడకు వో తుమ్మెదా॥
చ|| తొలి ప్రాయపు మిండ తుమ్మెదా కడు। తొలిచేవు చేగలే తుమ్మెదా।
తొలకరి మెరుగువే తుమ్మెదా ఇంక। ఉలికేవు మముగని వో తుమ్మెదా॥
చ|| దొరవు వేంకటగిరి తుమ్మెదా మా। తురుమేల చెనకేవు తుమ్మెదా।
దొరకెనీ చనవులు తుమ్మెదా ఇంక। ఒరులెఱింగిరి గదవో తుమ్మెదా॥

44)కురంజి
ప|| లెండో లెండోమాటాలించరో। కొండలరాయనె పేర్కొన్నదిదె జాలి॥
చ|| మితిమీరె జీకట్లు మేటి తలవరు లాల। జతనము జతనము జాలో జాలి।
యితవరులాల వాయించే వాద్యాలకంటె-। నతి ఘోషముల తోడ ననరోజాలి॥
చ|| గాములు వారెడి పొద్దు కావాలి కాండ్లాల। జాము జాము దిరుగరో జాలో జాలి।
దీమసపు పరితార దివ పంజాలు చేబట్టి। యేమరక మీలోమీరు యియ్యరో జాలి॥
చ|| కారు కమ్మె నడురేయి గడచె గట్టిక వార। సారె సారె బలుకరో జాలో జాలి।
యీరీతి శ్రీవేంకటేశుడిట్టె మేలుకొన్నాడు। గారవాననిక మానగదరో జాలి॥

45)మాళవిగౌళ/తోడి
ప|| కలియుగ మెటులైనా గలదుగా నీకరుణ। జలజాక్ష హరిహరి సర్వేశ్వరా॥
చ|| పాప మెంత గలిగిన బరిహరించేయందుకు। నాపాల గలదుగా నీనామము।
కోపమెంత గలిగిన కొచ్చి శాంతమిచ్చుటకు। చేపట్టి కలవుగా నాచిత్తములో నీవు॥
చ|| ధర నింద్రియా లెంత తరముకాడిన నన్ను। సరి గావగద్దుగా నీశరణాగతి।
గరిమ గర్మబంధాలు గట్టినతాళ్ళు వూడించ। నిరతి గలదుగా నీభక్తి నాకు॥
చ|| హితమైనయిహపరా లిష్టమైనవెల్లా నియ్య। సతమై కలదుగా నీసంకీర్తన-।
తతి శ్రీవేంకటేశ నాతపము ఫలియింపించ। గతి గలదుగా నీకమలాదేవి॥

46)గుండక్రియ
ప|| జయమంగళము నీకు సర్వేశ్వర। జయమంగళము నీకుజలజవాసినికి॥
చ|| శరణాగతపారిజాతమా। పారి నసురలపాలిభూతమా।
అరుదయిన సృష్టికి నాదిమూలమా వో-। హరి నమో పరమపుటాలవాలమా॥
చ|| సకలదేవతాచక్రవర్తి। వెకలిపై నిండినవిశ్వమూర్తి।
అకలంకమైనదయానిధి। వికచముఖ నమో విధికివిధి॥
చ|| కొలిచినవారలకొంగుపైడి। ములిగినవారికి మొనవాడి।
కలిగినశ్రీవెంకటరాయా। మలసి దాసులమైనమాకు విధేయా॥

47)కేదారగౌళ
ప॥ అడుగరే యాతనినే అంగనలాలా। గుడిగొని తానే వట్టి గొరబాయగాక॥
చ॥ యెదురాడేదాననా యెంతటి పనికినైనా। పదరి తానే మారువలికీ గాక।
తుదమీఱేదాననా దూరైయంత దిరిగినా। ముదమునదానే మారుమలసీగాక॥
చ॥ కక్కసించే దానవా కడలెంత దొక్కినాను। వెక్కసీడై తానై యిటు వెలసీగాక।
మొక్కలపుదాననా ముందు వెనకెంచితేను। పక్కనె దానె ముంచి పంతమాడీగాక॥
చ॥ తడబడేదాననా తనరతి వేళను। బడిబడి దానే చొక్కి భ్రమసీగాక।
అడిగేటి దాననా అందరిలో నన్ను గూడి। అడరి శ్రీవేంకటేశు డాదరించీగాక॥
48)సామంతం/కాంభోజి
ప॥ అలుక లేటికి రావే యాతనివద్దకి నీవు। బలిమైతే వలపులు పదనుకు వచ్చునా॥
చ॥ సంగడి నున్న సతికి చనవులు గలుగుగాక। కంగి కడనుండితేను కలదా పొందు।
చెంగటనున్న రుచులు చేరి నోరూరించుగాక। అంగడినున్న సొమ్ములు ఆసలు పుట్టించునా॥
చ॥ వినయపుటింతికిని వేడుక లీడేరుగాక। పెనగుచు బిగిసితే ప్రేమపుట్టునా।
తనువున బూసిన గంధము చల్లనౌగాక। వనములో తరువులు వడదీర్చవోపునా॥
చ॥ సేవచేసే మగువకు చేతలెల్లా జెల్లుగాక। యీవల నొడ్డారించితే నింపు వుట్టునా।
శ్రీవేంకటేశుడిందు విచ్చేసి తానిన్ను గూడెను। పూవులు పిందెలౌగక పొల్లు వెలవెట్టునా॥
49)పాడి
ప॥ ఆడువారు కడుగోపులవుట నీ వెరగవా। నేడు గొత్తలుగా భూమి నేర్పుక వచ్చేరా॥
చ॥ వలచిన యాడువారు వాదులాటకు వచ్చిన। చలము సాధించువాడు జాణడా వాడు।
కలయని కాకతోడ కమ్మటి నలిగిపోగా। పిలిచి మాటాడకున్న ప్రియుడా వాడు॥
చ॥ చనవుగలుగువారు సణగులదిట్టగాను। కనలియెగ్గువట్టితే ఘనుడా వాడు।
గునిసి సవతులపై కోపాన పతి నంటేను। విని నవ్వకుండేవాడు విభుడా వాడు॥
చ॥ పాయరానియటివారు బలుములు చూపితేను। నాయాలబెట్టెడివాడు నాథుడా వాడు।
యీయెడ శ్రీవేమ్కటేశ యింతినిట్టె గూడితివి। చాయకు రాకుండువాడు సరసుడా వాడు॥
50)దేసాళం/కాపీ
ప॥ ఆలికి మగనికి నాఱడేటికి। కాలిమితోడ లోలో తనివందరాదా॥
చ॥ దొంతిబెట్ట వలపులు తోరపుబూజగుండలా। పంతాలు సంగడి బొర బండికండ్లా।
యింతేసి మీ రిద్దరును యేటికి బెచ్చు రేగేరు। యెంతకెంత సేసేరు యెనసివుండరాదా॥
చ॥ మమతలు పేరబెట్ట మందలపాలా యేమి। తమకము తలదూచ తాసు చిప్పలా।
జమళి నిద్దరూనెంత సరులకు బెనగేరు। తిముర నేటికి మీలో దిండుపడరాదా॥
చ॥ సరిబేసి మాటలాడ జంట జాజాలా యివి। సిరులతో బెనగగ జెట్టిసాదనా।
గరిమె శ్రీ వేంకటేశ కాంతా నీవు గూడితిరి। గరువాలేటికి నింకా గలయగ రాదా॥
51)పాడి
ప॥ ఇంతులాల చూడరమ్మ ఇద్దరు జాణలే వీరు। చెంత రమాదేవిగూడె శ్రీ నరసింహుడు॥
చ॥ సరిగొండ లెక్కుకొని సరసములాడుకొంటూ। సొరిదిమోములు తొంగి చూచుకొంటాను।
విరులచెండులగొని వేటులాడుకొంటాను। సిరితోడ విహరించీ శ్రీనరసింహుడు॥
చ॥ భవనాశిలోని నీరుపై జల్లులాడుకొంటాను। నవకపు సిరులను నవ్వుకొంటాను।
జవళిగెమ్మోవులు సన్నలజూపుకొంటాను। చివన నిందరినంటె శ్రీనరసింహుడు॥
చ॥ వేమరు దొడలెక్కుక వీడుదోడులాడుకొంటా। ప్రేమమున గౌగిళ్ళ బెనగుకొంటా।
ఆముక శ్రీవేంకటాద్రి నౌభళాన నిలిచిరి। శ్రీ మహాలక్ష్మితోడ శ్రీనరసింహుడు॥
52)శుద్ధవసంతం
ప॥ ఇద్దరి భావములును యీడుజోళ్ళాయ నిదె। అడ్డుకొని తులదూగినట్టి చందమాయెను॥

చ|| తళుకున నీవిప్పుడు తరుణి జూచితేను | తొలకి చెక్కుచెమట దొరుగ జొచ్చె |
లలి మీరి ఆమెరుపులకు యీ తురుము మేఘ- | మలరి వాన గురిసినట్టి చందమాయెను ||

చ|| చదురుమాటల నీవు జలజాక్షి బిలిచితే | పొదిగొని నిలువెల్ల బులకించెను |
కదిసి ఆమాటల గాలికి యీమైదీగె | అదనుగూడ ననిచినట్టి చందమాయెను ||

చ|| ననుపై శ్రీ వేంకటేశ నవ్వి నీవు గూడితేను | యెనసి కామిని చిత్తమెల్ల గరగె |
వొనరి ఆ వెన్నెలకీ మనసనే చంద్రకాంత | మనువుగా గరగినయట్టి చందమాయెను ||

53)శంకరాభరణం

ప|| ఇద్దరు జాణలేమీరు యెంచి చూచితే | పొద్దులు గడుపుదురా పొరుగునను ||

చ|| దిగ్గన సరసమున దిట్టులెన్ని దిట్టినాను | యెగ్గులు వట్టుదురా యింతలోననే |
వెగ్గళించి చనవున వెస మర్మము లంటితే | సిగ్గులు వడుదురా జిగిమించను ||

చ|| జవ్వనపాయముతోడ సారె సారె జెనకితే | నవ్వులు నవ్వుదురా నట్టనడుమ |
నివ్వటిల్లు సన్నలెల్లా నెట్టుకొన జేసితేను | రవ్వలు సేయుదురా రచ్చలోనను ||

చ|| సమ్మతించి కాగిళ్ళను సమరతి బెనగితే | బొమ్మల జంకింతురా పూచిపట్టుక |
యిమ్ముల శ్రీవేంకటేశ యిట్టె మీరు గూడితిరి | దొమ్ములు సేయుదురా తోడదోడను ||

54)నాదరామక్రియ

ప|| ఎదురుబడి కాగిళ్ళ యేరులాయ మీ వలపు | అదను బదనుగూడి అడుసాయె వలపు ||

చ|| చిక్కని చెమటలను చిప్పిలీని వలపు | చొక్కపు కరగులను జొబ్బిలీని వలపు |
చక్కని సరసముల జాలు వాలీ వలపు | తెక్కుల మచ్చికలచే దీగె వారీ వలపు ||

చ|| జవ్వనము కళల రసములబ్బీ వలపు | నివ్వటిల్లు కోరికల నీరుకమ్మీ వలపు |
రవ్వల తమకముల వువ్విళ్ళూరీ వలపు | చివ్వన దరితీపుల జిడ్డుకట్టీ వలపు ||

చ|| పంతపు రతులనే పాలుగారీ వలపు | బంతి మోవులనే కడు బచ్చిదేరీ వలపు |
ఇంతలో శ్రీ వేంకటేశ యెనసి మీరుండగాను | దొంతరచుట్టరికాన దొప్పదోగీ వలపు ||

55)కేదారగౌళ

ప|| ఎప్పుడును గుట్టుతోడి యిల్లాండ్లము నేము | వొప్పుగ సిగ్గు విడువనోజగాదు మాకును ||

చ|| మాట మాటలను నీకు మనసిచ్చి మెచ్చి యాపె | కాటుక కన్నుల జూచి కరగించీని |
తేటలు నేరుచునాపె తేలించనోపు నాపె | యేటికి యవ్వరిపొందులేమి బాతి యికను ||

చ|| చేయివేసి చేయివేసి చెక్కునొక్కి చేత మొక్కి | మాయపు నవ్వులు నవ్వి మరగించీని |
చాయలకు వచ్చునాపె సరసములాడు నాపె | ఆయనాయ వున్న సుద్దులాడ నేల యికను ||

చ|| వలపులు చల్లి చల్లి వాడికెగా నిన్ను గూడి | వెలయించ నేర్చునాపె యిన్నిటా నాపె |
అలరి శ్రీ వేంకటేశ అప్పటి నన్ను గూడితి | తొలుతటి సద్దులేల దొమ్ములేల యికను ||

56)రామక్రియ/అఠాణ

ప|| ఎవ్వడోకాని యెఱుగరాదు కడు | దవ్వులనే వుండు తలపులో నుండు ||

చ|| యెడయవు తనరెక్క లెగసి పోలేడు | కడు దాగుగాని దొంగయు గాడు |
వడి గిందుపడును సేవకుడునుగాడు | వెడగుగోళ్ళ వెంచు విటుడును గాడు ||

చ|| మిగుల బొట్టివాడు మింటికిని బొడవు | జగడాలు తపసి వేషములును |
మగువకై పోరాడు మరి విరక్తుండును | తగు గాపుబనులు నెంతయు దెల్లదనము ||

చ|| తరుణుల వలపించు దగిలి పైకొనడు | తురగము దోలు రౌతును గాడు |
తిరువేంకటాద్రిపై దిరుగు నెప్పుడును | పరమమూర్తియై పరగు నీ ఘనుడు ||

57)ముఖారి

ప|| ఏటికే యీ దోసము మీ రెఱుగరటే | ఆట దాననింతే నన్ను ఆఱడిబెట్టకురే ||

చ|| తామర మొగ్గలవంటి తగిన నా చన్నులివి | కాముని యమ్ములనేరు కాంతలదేమే |
నా మగని కౌగిటలో ననిచే జక్క వలవి | ప్రేమమున మారుబేరు పెట్టుదురటే ||

చ॥ చందురుని బోలేటి సరసపు నా మోము । అందపు బూబంతియంటా నాడు కోకురే ।
ముందు నా రమణునికి మోము చూచేటద్దమిది । కందువలేని నిందలు గడింతురటే ॥
చ॥ తీగెవంటి నామేను దిక్కుల మెఱుగనుచు । పోగులుగా సారె సారె బొగడకురే ।
బాగుగ శ్రీవేంకటేశు పానుపుపై చిగురిది । మోగము గూడెను వేరే వుప్పటించ నేటికే ॥
58)శంకరాభరణం
ప॥ తినరాని కొనరాని దేవలోకపుబండు । మనసున దలచితే మరగించే పండు ॥
చ॥ పంటకెక్కి పాలవెల్లి బండిన పాలపండు । తొంటి గొల్లెతల మోవి దొండపండు ।
అంటుకొన్న మేనిచాయ అల్లు నేరేడుబండు । ముంటి సింహపుగోళ్ళ ముండ్లపండు ॥
చ॥ ఇచ్చల వేదశాస్త్రాలు దెచ్చిన పేరీతపండు । తచ్చిన దైత్యమారి దేవదారుబండు ।
పచ్చిదేర మెరసిన బండి గురువిందపండు । యిచ్చవలెనన్న వారియింట నంటిపండు ॥
చ॥ తెమ్మగా మునులపాలి తియ్యని చింతపండు । తిమ్మల సిరివలపు దేనెపండు ।
యిమ్ముల శ్రీవేంకటాద్రి నింటినింట ముంగిటిపండు । కొమ్మల పదారువేల గొప్ప మామిడిపండు ॥
59)నాదరామక్రియ/ఆనందభైరవి
ప॥ ఏమని నుతించవచ్చు యీతని ప్రతాపము । కామించి యీరేడు లోకములెల్లా నిండెను ॥
చ॥ యీవల దేవుడు రథమెక్కితేను దైత్యులెల్ల । కావిరి జక్రవాళాద్రి కడ కెక్కిరి ।
భావించి చక్రమీతడు పట్టితే నసురలెల్ల । ధావతి తోడుతను పాతాళము వట్టిరి ॥
చ॥ గరుడధ్వజము హరి కట్టెదుర నెత్తించితే । పరువెత్తిరి దానవ బలమెల్లను ।
గరిమ నితేరి బండికండ్లు గదలితేను । ఖరమైన దైత్యసేన క్రక్కదలి విరిగె ॥
చ॥ ధృతి శ్రీవేంకటేశుడు తిరువీధులేగితేను । కుతిలాన శత్రులు దిక్కుల కేగిరి ।
తతి నలమేల్మంగతో తన నగరు చొచ్చితే । సతమై బలిముఖ్యులు శరణము జొచ్చిరి ॥
60)దేసాక్షి/దేశి
ప॥ ఏమరక తలచరో యిదే చాలు । కామించినవియెల్ల గక్కున కలుగు ॥
చ॥ దురితములెల్ల దీరు దుఃఖములెల్ల నణుగు । హరియని వొకమాటు అన్నా జాలు ।
సురలు పూజింతురు సిరులెల్ల జేరును । మరుగురుని నామమటు పేరుకొన్న జాలు ॥
చ॥ భవములన్నియుబాయు పరము నిహముజేరు । ఆవల నారాయణ యన్నా జాలు ।
భువి యెల్లా దానేలు పుణ్యములన్నియు జేరు । తవిలి గోవిందునాత్మ దరచిన జాలు ॥
చ॥ ఆనందము గలుగు నజ్ఞానమెల్లబాయు । ఆనుక శ్రీవేంకటేశ యన్నా జాలు ।
యీనెపాన నారదాదులిందరు నిందకు సాక్షి । దానవారి మంత్ర జపతపమే చాలు ॥
61) గుజ్జరి
ప॥ ఆర్తుడ నేను నీకడ మెందును లేను । మూర్తిత్రయాత్మక మొగి గరుణించవే ॥
చ॥ సర్వసాక్షివి నీవు సర్వాంతరంగుడవు । సర్వసర్వంసహాచక్రవర్తి ।
నిర్వాణమూర్తి నిగమాంతకీర్తి । సర్వాపరాధములు క్షమియింపవే ॥
చ॥ పరమాత్ముడవు నీవు పరంజ్యోతివి నీవు । పరమ పరానంద పరమపురుషా ।
కరిరాజవరదా కారుణ్యనిలయా । శరణాగత నన్ను సరి గావవే ॥
చ॥ అణువులోపలినీవు ఆదిమహత్తును నీవు । ప్రణుతశ్రీవేంకటప్రచురనిలయా ।
అణిమాదివిభవా ఆద్యంతరహితా । గణుతించి నాపాల గలుగవే నీవు ॥
62)కేదారగౌళ
ప॥ ఓరుచుకోవే యెట్టయినా వువిద నీవు । నేరుపరి నీ విభుడు నేడే వచ్చీ నీడకు ॥
చ॥ కలువల వేసితేనే కాముడు చుట్టము గాడా । వెలయు విరహులకు వెగటు గాక ।
చలివెన్నెల గాసితే చందురుడు పగవాడా । పొలయలు కలవారే పొగడరుగాక ॥
చ॥ కొసరుచు బాడితేనే కోయిల గుండె బెదరా । అసదు విరహులు కాదందురు గాక ।
ముసరితే దుమ్మిద మూకలు దయలేనివా । విసిగిన కాముకులే వినలేరు గాక ॥
****************************************************************************************************

******************************************************************************************

చ|| వనము సింగారించితే వసంతుడు క్రూరుడా। వొనరని విరహుల కొంటదుగాక।
యెనసి శ్రీవేంకటేశుడేలె నిన్ను చిలుకలు। కినిసేనా పాంథులకు కేరడముగాక॥

63)భైరవి
ప|| ఓరుపే నేరుపు సుమ్మీ వువిదలకు। మారుకోకు మగవాని మనసు మెత్తనిది॥
చ|| చలము సంపాదించవద్దు చనవే మెఱయవే। చెలువుడాతడే నీచేత జిక్కిని।
బలములు చూపవద్దు పకపక నగవే। అలరిన జాణతనమందులోనే వున్నది॥
చ|| పగలు చాటగవద్దు పైకొని మెలగవే। సొగసి ఆతడే నీ సొమ్మై వుండీని।
తగవుల బెట్టవద్దు తమకము చూపవే। అగపడ్డ నీ పంతములందులోనే వున్నవి॥
చ|| మొక్కల మేమియు నొద్దు మోహములు చల్లవే। నిక్కి శ్రీవేంకటేశుడు నిన్ను గూడెను।
తక్కల బెట్టగవొద్దు దయలు దలచవే। అక్కజపు నీ రతులు అందులోనే వున్నవి॥

64)దేసాళం/మోహన
ప|| కనకగిరిరాయ యేగతి నొడబరచేవో। వినవయ్య సతినీకు విన్నవించుమనెను॥
చ|| చెలియకు నీ విచ్చిన చెంగలువ పూదండ। కలికి యెవ్వతె నీకు గానుకిచ్చెనో।
పలుచగా నిందు మీద బసపంటి వున్నదిలె। నెలత యీగురుతులు నీకు జూపుమనెను॥
చ|| కాంతకు నీవు మెడ గప్పినట్టి కంటసరి। చెంతల నీకెవ్వతె వుచిత మిచ్చెనో।
పంతాన నొక దిక్కున బసిడిపూస వున్నది। అంతయు దెలియ నిన్ను నడిగె రమ్మనెను॥
చ|| భామగూడు నీవిచ్చినపైడి వ్రాతచీర యిది। కామించి యెవ్వతె నీకు గట్నమిచ్చెనో।
ఆమీద శ్రీవేంకటేశ అదె విలాసమున్నది। యేమతకమో యిది యెరిగించుమనెను॥

65)శ్రీ
ప|| అల్పశక్తివాడ నేను అధికశక్తివి నీవు। పోల్ప నెంతపనికి బూనితివయ్యా॥
చ|| నీపదధ్యానములోనే నిండెను నామనసెల్ల। యేపున నీసాకార మేమిట భావింతునయ్య।
చూపు నీసింగారమందే చొక్కి తగులాయ నిదె। ఆపి నీ యంగకాంతు లవేమిటి జూతునయ్య॥
చ|| నాలుక నీకడలేనినామములే నుడిగీని। మేలిమి నీగుణము లేమిట బొగడుదునయ్య।
గాలివంటివీనులు నీకథల దనిసెనయ్య। యీలీల నీయనంతమహిమ యెందు విందునయ్య॥
చ|| నీకు శరణని యిట్టె నే ధన్యుడనైతి। యీకడ నీసేవ సేసి యేమి గట్టుకొందునయ్య।
శ్రీకాంతుడవైన శ్రీవేంకటేశ నీకు। వూకొన నాజన్మఫల మొకమొక్కు చాలునయ్య॥

66)మలహరి
ప|| కంచూగాదు పెంచూగాదు కడుబెలుచు మనసు। యెంచరాదు పంచరాదు యెట్టిదో యీమనసు॥
చ|| పట్ట బసలేదు చూడ బయలుగా దీమనసు। నెట్టన బారుచునుండు నీరుగా దీమనసు।
చుట్టి చుట్టి పాయకుండు జుటమూగా దీమనసు। యెట్టనెదుటనే వుండు నేటిదో యీమనసు॥
చ|| రుచులెల్లా గానుపించు రూపు లేదు మనసు। పచరించు నాసలెల్లా బసిడిగా దీమనసు।
యెచటా గరగదు రాయీగాదు మనసు। యిచటా నచటా దానే యేటిదో యీమనసు॥
చ|| తప్పక నాలో నుండు దైవము గాదు మనసు। కప్పి మూటగట్టరాదు గాలీ గాదు మనసు।
చెప్పరానిమహిమలశ్రీవేంకటేశు దలచి। యిప్పుడిన్నిటా గెలిచె నేటిదో యీమనసు॥

67)ముఖారి
ప|| నేమే బ్రహ్మ మను కోనేరము నేము-। కామించిన స్వతంత్రము గడు లేదుగాన॥
చ|| క్షణములోపలనె సర్వజీవావస్థలూను। గణుతించేవా డొకడు గలడు వేరే।
అణుమహత్త్వములందు నంతర్యామైనవాని। ప్రణుతించి దాసులమై బ్రదికేముగని॥
చ|| పనిగొని యేలుటకు బ్రహ్మాదిదేవతల। గనిపించేవా డొకడు గలడు వేరే।
ననిచి సిరుల లక్ష్మీనాథుడైనవాని-। పనులవారము నేము బ్రదికేముగాని॥
చ|| సతతరక్షకుడయి శంఖచక్రధరుడయి। గతి శ్రీవేంకటపతి గలడు వెరే।
ఆతనిమఱుగు చొచ్చి యానందపరవశాన। బ్రతిలేక యిందరిలో బ్రదికేము గాని॥

******************************************************************************************

68)రామక్రియ
ప॥ అయ్యో వారిభాగ్య మెంతెకాక।నెయ్యపువెన్న వట్టుక నెయ్యి వెదకేరు॥
చ॥ దేవుడు వెల్లవిరై దిక్కులెల్లా నిందుండగా।సోనల నాస్తికుడు శూన్యమై తోచు।
యీవల వాన గురిసి యేరెంతబంటి వారినా।కావరపుజీవునకు గతుగతుకే॥
చ॥ హరి శరణంటే గాచేఅట్టియుపాయమే వుండగ।విరసానకు గర్మమే వెగ్గళమాయ।
పరగ నరులకెల్లా బట్టబగలై యుండగా।అరయ గొన్నిజంతుల కంథకారమాయను॥
చ॥ యిక్కడ శ్రీవేంకటేశు డెదుటనే వుండగాను।అక్కటా మూఢున కెందు ననుమానమే।
మక్కువ నింతా నమృతమయమైన గోడికి।తెక్కుల దవ్వబొయ్యేది తిప్పపెంటలే॥

69)పాడి/తోడి
ప॥ వేసరకు వీడేల యనకుము విడువ నిన్నిక శరణు చొచ్చితి।
నీసరెవ్వరు లేరు వెదకిన నిండుబండికి జేట వేగా॥
చ॥ మీరునాకు గలరు నేనేమి సేసిన గాతురనియెడి।
ధీరతను జము సరకు గొనకే తివిరి సేసితి బాపము।
వోరసేయుచు నెంతలేదని వూరకే మీరుంటిరేనియు।
వారికిని గొరగాను నేనెవ్వరిని నెఱుగను మిమ్మేకాని॥
చ॥ మిమ్ము గొలిచినగర్వమున నేమీ జేయక కాలమందే।
నమ్మి కర్మములెల్ల మానితి నాకునాకే వేసరి;।
దొమ్మి కోపక మీకు నాకును దూరమనుచు బరాకుచేసిన।
యిమ్ములను నన్నవియు రోసును యేల నా కవి నీవేకాక॥
చ॥ నీకు మొక్కినమందెమేళము నే నొక కొండసేసుక।
లోకములదేవతలకెల్లను లోను వెలిగానైతి।
యీకడను శ్రీవేంకటేశుడ యిప్పుడిటు ననుగరుణజూచితి।
చేకొనుచు వారె మెత్తురు చెలగి నీకింకరుడననుచు॥

70)సాళంగనాట
ప॥ ఆమీదినిజసుఖ మరయలేము।పామరపుచాయలకే భ్రమసితిమయ్యా॥
చ॥ మనసున బాలు దాగి మదియించివున్నయట్టు।ననిచి గిలిగింతకు నవ్వినయట్టు।
యెనసి సంసారసుఖ మిది నిజముసేసుక।తవిదొంది యిందులోనే తడబడేమయ్యా॥
చ॥ బొమ్మలాట నిజమంటా బూచి చూచి మెచ్చినట్టు।తెమ్మగా శివమాడి తా దేవరైనట్టు।
కిమ్ముల యీజన్మమందు కిందుమీదు నేఱక।పమ్మి భోగములనేతెప్పల దేలేమయ్యా॥
చ॥ బాలులు యిసుకగుళ్ళు పస గట్టు కాడినట్టు।వీలి వెఱ్ఱివాడు గంతువేసినయట్టు।
మేలిమి శ్రీవేంకటేశ మిమ్ము గొలువక నేము।కాల మూరకే యిన్నాళ్ళు గడిపితిమయ్యా॥

71)కన్నడగౌళ
ప॥ నన్ను నింతగా గడించి నాయమా దిగవిడువ।అన్నిటా రక్షించకపో దంతర్యామి॥
చ॥ సొమ్ము వోవేసినవాడు చుట్టిచుట్టి వీథులెల్లా।కమ్మిక వెదకీనట కన్నదాకాను।
నమ్మిన అజ్ఞానములో నన్ను బడవేసుకొని।అమ్మరో వూరకుందురా అంతర్యామి॥
చ॥ వోడబేరమాడేవాడు వొకదరి చేరిచి।కూడినయర్థము గాచుకొనీనట।
యీడనే ప్రపంచములో నిట్టె నన్ను దరిచేర్చి।వోడక కాచుకోరాదా వోయంతర్యామి॥
చ॥ చేరి వుప్పమ్మేవాడు చిట్లు వే గనడట।వూరకే శ్రీవేంకటేశ వోపికతోడ।
అరయ నన్ను బుట్టించినట్టివాడవు నాభార-।మేరీతినైన మోవు మిక నంతర్యామి॥

72)దేసాక్షి/శహన
ప॥ ఏవీ నుపాయాలుగావు యెక్కువ భక్తేకాని।దావతి బడక యిది దక్కితే సులభము॥
చ॥ ముంటిపై సుఖమందుట ముక్కున నూరుపువట్టి।దంటవాయువు గెలువదలచేదెల్లా।

వెంటికవట్టుక పోయి వెస గొండ వాకుట। వెంట గర్మమార్గమున విష్ణుని సాధించుట॥
చ॥ యేనుగుతో బెనగుట యిల నిరాహారియై। కాననిపంచేంద్రియాల గట్టబోవుట।
నానిం చినుపగుగిళ్ళు నమలుట బలిమిని। ధ్యానించి మనసుబట్టి దైవము సాధించుట॥
చ॥ దప్పికి నెండమావులు దాగ దగ్గరబోవుట। తప్పుజదువులలో దత్త్వము నెంచుట।
పిప్పిచవి యడుగుట పెక్కుదైవాల గొలిచి। కప్పిన శ్రీవేంకటేశుకరుణ సాధించుట॥

73)మలహరి

ప॥ ఏమి సేసేమిక నేము యెంతని దాచుకొందుము। నీమహిమ యింతింతననేరము నేమయ్యా॥
చ॥ అందు నిన్ను నొకమాటు హరి యను నుడిగితె। పొందినపాతకమెల్లా బొలిసిపోయ।
మందలించి మఱి యొకమాటు నుడిగినఫల-। మందె నీకప్పగించితి మదిగోవయ్యా॥
చ॥ యిట్టె మీకు రెండుచేతులె త్తొకమాటు మొక్కితే। గట్టిగా నిహపరాలు గలిగె మాకు।
దట్టముగ సాష్టాంగదండము వెట్టినఫల-। మట్టె నీమీద నున్నది అదిగోవయ్యా॥
చ॥ సరుగ నీకొకమాటు శరణన్న మాత్రమున। సిరుల బుణ్యుడ నైతి శ్రీవేంకటేశ।
ధరలోన నే నీకు దాసుడనైనఫల-। మరయ నీమీద నున్న దదిగోవయ్యా॥

74)శ్రీ

ప॥ వివేకించ వేళ లేదు విజ్ఞానమార్గమందు। భవసంపదలపెద్దపౌజు చూచీ జీవుడు॥
చ॥ చిత్తమనియెడిమహాసింహాసనం బెక్కి। హత్తిబహుపరాకాయ నదె జీవుడు।
గుత్తపుదేహమనేటికొలువు కూటములోన। జొత్తు బ్రకృతినాట్యము చూచీని జీవుడు॥
చ॥ పంచేంద్రియములనేబలుతేజీలపై నెక్కి। అంచల వయ్యాళిదోలీ నదె జీవుడు।
ముంచినకర్మములనే ముద్రల పెట్టెలు దేచ్చి। సంచముగా లెక్కవెట్టి సరి దాచీ జీవుడు॥
చ॥ యిచ్చ గామక్రోధాలనే హితమంత్రులును దారు। తచ్చి తలపోసుకొనీ దగ జీవుడు।
అచ్చపుశ్రీవేంకటేశు డంతరాత్మై యుండగా। పచ్చిగా నాతని జూచి భ్రమసీని జీవుడు॥

75)సామంతం/యదుకులకాంభోజి

ప॥ చెల్లబో తియ్యనినోర జేదేటికి యీ-। పల్లదపుగోరికలపాలు సేయనేమో॥
చ॥ ఆసలకు నాదేహ మమ్ముకొంటి వింటింట। దాసునుగా నాపాలిదైవమా నీవు।
పోనరించి భూమిలోన బుట్టించి రక్షించి। యీసులేక భంగపెట్టు టిది గొంత వలెనా॥
చ॥ పామరపుటింద్రియాలబారి దోసితివి నన్ను। దామెనకట్టుగా గట్టి తత్వమా నీవు।
దోమటి నామతిలోన దోడునీడవై యుండి। పామేటి సుఖములనే భ్రమయించవలెనా॥
చ॥ గక్కన నింతట నన్ను గరుణించితివి నేడు। మొక్కితి శ్రీవేంకటాద్రిమూలమా నీకు।
దిక్కుదెసవై నాకు దేవుడవై యేలికవు। చొక్కి నామన సింత సోదించవలెనా॥

76)భూపాళం

ప॥ చూపజెప్పగలభక్తసుజనుడవు మాకు। దాపైనహరి యిట్టె తప్పె దారెననక॥
చ॥ కోరి పాండవులయింట గూర లారగించినట్టు। సారపుశబరివిందు చవిగొన్నట్టు।
వూరకే మాయింట నీవు వొదవినపాటి నీ-। వారగించవయ్య చవు లౌగాములెంచక॥
చ॥ తొల్లియు రేపల్లె గొల్లదొమటి దొడికినట్టు। తల్లిఅనసూయపాల దనిసినట్టు।
చిల్లరైనమాయింట జేసినపా టారగించు। చల్లతోడిబోనమైన చాలుజాలదనక॥
చ॥ అంకెల శ్రీవేంకటాద్రి నారగించినయట్టు। కొంకులేక సిరితోడ గోనేటిరాయ।
లెంకనయిననాయింటిలేశమైన నారగించు। అంకించి నీనాలోనిఅంతరము లెంచకా॥

77)లలిత

ప॥ ఏగతి నుద్ధరించేవో యింతటిమీదట మమ్ము। భోగపుగోరికలచే బొలిసెబో పనులు॥
చ॥ పరగి నాలుకసొంపు వరసిపోయ। పరులనే నుతియించి పలుమారును।
విరసపుబాపములవినికిచే వీనులెల్లా। గొరమాలె మాకు నేటికులాచారములు॥
చ॥ మొక్కలాన బరధనమునకు జాచి చాచి। యెక్కువ జేతులమహి మెందో పోయ।

తక్కక పరస్త్రీల దలచి మనసు బుద్ధి। ముక్కపోయ మాకు నేటిముందరిపుణ్యములు॥
చ॥ యెప్పుడు నీచుల ఇండ్లకెడ తాకి పాదములు। తప్పనితపములెల్లా దలగిపోయ।
యిప్పుడే శ్రీవేంకటేశ యెటు నిను కొలువగా। నెప్పున నే జేసినట్టి నేరమెల్లా నడగె॥

78)ముఖారి
ప॥ పాప మెఱుగను పుణ్యఫల మెఱగను। యేపనులు నీకు నెల విన్నియును గావా॥
చ॥ మునుప నీవిషయముల ముద్ర మానుసులగా-। నునిచితివి నామీద నొకటొకటినే।
అనిశంబు నవి చెప్పినట్ల జేయకయున్న। ఘనుడ నీయాజ్ఞనే గడచుటకేకాదా॥
చ॥ కలిమిగలయింద్రియపుగాపులుండినవూరు। యెలమి నా కొసగితివి యేలు మనుచు।
అలసి వీరల నేను నాదరించక కినిసి। తొలగద్రోచిన నదియు ద్రోహమే కాదా॥
చ॥ కుటిలముల బెడబాసి కోరినచనవులెల్ల। ఘటన జెల్లించితివి ఘనుడ నేను।
అటుగనక శ్రీవేంకటాద్రీశ నీదాసి-। నెటుచేసినా నీకు నితవేకాదా॥

79)శుద్ధవసంతం
ప॥ చిక్కువడ్డపనికి జేసినదే చేత। లెక్కలేనియప్పునకు లేమే కలిమి॥
చ॥ తగవులేమి కెదిరిదహ్నమే తనసొమ్ము। జగడగానికి విరసమే కూడు।
తెగుదెంపులేమికి దీనగతే దిక్కు। బిగువుగూటికి వట్టిబీరమే తగవు॥
చ॥ పతిలేనిభూమికి బలవంతుడే రాజు। గతిలేనికూటికి గన్నదే కూడు।
సతిలేనివానికి జరగినదే యాలు। కుతదీరుటకు రచ్చకొట్టమే యిల్లు॥
చ॥ యెదురులేమికి దమకేదైన దల పిది। మదమత్తునకు దనమఱపే మాట।
తుదిపదమునకు జేదోడైన విభవము। పదిలపుశ్రీవేంకటపతియే యెఱుక॥

80)శ్రీ
ప॥ అన్నిటికి నొడయడవైనశ్రీపతివి నీవు। యెన్న రాదు మాబలగ మెంచుకో మాపౌజు॥
చ॥ జ్ఞానేంద్రియము లైదు శరీరిలోపల। ఆనక కర్మేంద్రియము లైదు।
తానకపుకామక్రోధాలవర్గము లారు। యీనెలవు పంచభూతాలెంచు మాపౌజు॥
చ॥ తప్పనిగుణాలు మూడు తనువికారము లారు। అప్పటి మనోబుద్ధ్యహంకారాలు।
వుప్పతిల్లువిషయము లుడివోని వొక అయిదు। యిప్పటి మించేకోపము యెంచుకో మాపౌజు॥
చ॥ ఆకలి దప్పియును మానావమానములును। సోకినశీతోష్ణాలు సుఖదుఃఖాలు।
మూకగమికాడ నేను మొక్కెద శ్రీవేంకటేశ। యేకటార గడపేవా నెంచుకో మాపౌజు॥

81)లలిత/ఝుంఝూటి
ప॥ ఈడ నుండె నిందాకా నింటిముంగిట। ఆడ నెందు బోడుగద అప్పుడే యీకృష్ణుడు॥
చ॥ యేడ పూతకి జంపె నింతపిన్న వాడంటా। ఆడుకొనే రదే వీధి నందరు గూడి।
వేడుకతో మనగోవిందుడు గాడుగదా। చూడరమ్మ వీడు గడుచుల్లరీడు పాపడు॥
చ॥ మరలి యప్పటివాడె ముద్దులు విఱిచెనంటా। పరువులు వెట్టేరు పడతులెల్లా।
కరికరించగ రోల గట్టితే నపుడు మా-। హరి గాడుగాదా ఆడనున్న బిడ్డడు॥
చ॥ వింతగాగ నొకబండి విఱిచె నప్పటినంటా। రంతు సేసే రదివో రచ్చలు నిండి।
అంత యీశ్రీవేంకటేశు డైనమనకృష్ణుడట। యింతేకాక యెవ్వరున్నా రిటువంటిపాపడు॥

82)పాడి/మోహన
ప॥ విభుడ వింతటికి వెరవుతో ననుగావు। అభయహస్తముతోడిఆదిమూలమా॥
చ॥ పలులంపటాలచేత బాటువడి పాటువడి। అలసితి గావవే వోఆదిమూలమా।
చలమరి యితరసంసారభ్రాంతి జిక్కితి న-। న్నలరించి కావవే వోఆదిమూలమా॥
చ॥ యెంతకైనా నాసలచే యేగేగి వేసరితి-। నంత కోప గావవే వోఆదిమూలమా।
సంతలచుట్టరికాల జడిసితి నిక గావు। అంతరాత్మ నాపాలిఆదిమూలమా॥
చ॥ రంటదిప్పటింద్రియాల రవ్వైతి గావవే వో-। అంటినశ్రీవేంకటాద్రి ఆదిమూలమా।

గెంటుక ముమ్మాటికిని నీకే శర-।ణంటి గావవేవో ఆదిమూలమా॥

83)శ్రీ

ప॥ ఏటిమాట లివి విన నింపయ్యీనా మది-।నేటవెట్టి దాసుడౌ టిదిసరియా॥

చ॥ జీవుడే దేవుడని చెప్పుదురు గొందరు।దైవముచేతలెల్లా దమ కున్నవా।
ఆవల గొందరు కర్మ మది బ్రహ్మ మందురు।రావణాదు లవి సేసి రతికెక్కిరా॥

చ॥ మిగుల గొందరు దైవమే లేదనెందురు।తగ నీప్రపంచమెల్లా దనచేతలా।
గగన మతడు నిరాకార మందురు గొంద-।రెగువ బురుషసూక్త మెఱగరా తాము॥

చ॥ యెనిమిదుగుణములే యితని వందురు గొంద-।రనయము మిగిలిన వవి దమవా।
యెనయగ శ్రీవేంకటేశ్వరుదాసులై।మనుట నిత్యముగాక మరి యేమినేలా॥

84)రామక్రియ

ప॥ అన్నిటా శ్రీహరిదాసుడగువానికి।కొన్ని దైవముల గొలువగ దగువా॥

చ॥ విహితకర్మముసేసి వెదకేటిహరి నిట్టె।సహజమై కొలచేటిసరసునికి।
గహనపుగర్మాలు కడమలైన నేమి।మహి గనకాద్రికి మరి పైడి వలెనా॥

చ॥ పలుదానములకెల్ల బలమైన విట్టె।బలువుగ జేకొన్న భక్తునికిని।
నెలకొని యాత డన్ని యును జేసినవాడె।తెలిసి సూర్యుని జూడ దీపాలు వలెనా॥

చ॥ వేదవేద్యుడు శ్రీవేంకటపతినామ-।మాదిగా బఠియించే యధికునికి।
ఆదైవచదువులు అఱచేతి వతనికి।మేదిని దిరుగాడ మెట్లు వలెనా॥

85)మలహరి

ప॥ ఈహీ శ్రీహరిగంటే యింత లేదుగా వట్టి-।దాహపుటాసల వెఱ్ఱి దవ్వు టింతేకాకా॥

చ॥ పలుమారు నిందరిని భంగపడి వేడేది।యిలపై దేహమువెంచేయిందు కింతేకా।
కలికికాంతలచూపుఘాతలకు భ్రమసేది।చెలగి మైమఱచేటిచేత కింతేకా॥

చ॥ పక్కన జన్మాలనెల్లా బాటువడేదెల్లాను।యెక్కడో సంసారాన కిందు కింతేకా।
వొక్కరి గొలిచి తిట్టు కొడిగట్టే దెల్లాను।చక్కుముక్కునాలికెపైచవి కింతేకా॥

చ॥ గారవాన ధనములు గడియించేదెల్లాను।ఆరయ నాదని వీగేయందు కింతేకా।
చేరి శ్రీవేంకటపతి సేవకు జొరనిదెల్లా।భారపుగర్మపుబాధ బట్టువడికా॥

86)బౌళి

ప॥ ఎంత బాపనా సోద మింత గలదా।అంతయు నీమహిమే హరిభట్లూ॥

చ॥ సూరిభ ట్లొకవంక చొరనిచోట్ల చొచ్చి।వారబియ్య మెత్తి యెత్తి వడదాకి।
నీరువట్టుగొని భూమి నీళ్ళెల్లా వారవట్టీ।కేరికేరి నగవయ్య కృష్ణభట్లూ॥

చ॥ దేవరొజ్ఝ లొకవంక దిక్కులలో బొలగూడు।దీవెనతో నారగించి తీపుమరిగి।
యీవల బెట్టినవారి కేమైనా నొసగీని।వేవేలుమాయలవిష్ణుభట్లూ॥

చ॥ సోమయాజు లొకవంక సారిది సురలకెల్లా-।నామనతో విందువెట్టీ ననుదినము।
హోమపువిప్రులసొమ్ము లొడిసి తా బుచ్చుకొనీ।వేమరు శ్రీవేంకటాద్రివెన్నభట్లూ॥

87)గుండక్రియ

ప॥ అటుగన నే రోయగ దగవా।నటనల శ్రీహరి నటమింతే॥

చ॥ చిడుముడి మూగజీవులలోపల।కడగి నే నొక్కడ నింతే।
విడువక పక్షులు వృక్షము లిలపై।వెడగుభోగములు వెదకీనా॥

చ॥ తనువులు మోచినతగుప్రాణులలో।గనుగొన నొకమశకమ నింతే।
మునుకొని కీటకములు జీమలు నిల।చెనకి దొరతనము సేసీనా॥

చ॥ శ్రీవేంకటపతిసేవవారిలో।సోవల నొకదాసుడ నేను।
భావించి సురలు బ్రహ్మాదు లతని-।దైవపుమాయలు దాటేరా॥

88)రామక్రియ

************************************************************************************************************

ప॥ సేయనివా డెవ్వడు చేరి చిల్లరదోషాలు। యేయెడ జీవులజాడు లీశ్వరకల్పితమే॥
చ॥ దేవునినమ్మినయట్టిదేహియట యాతనికి। యీవల నెంతటిపాప మేమిసేసును।
భావించి యన్నినేరాలు పరిహరించు నతడే। ఆవటించుసూర్యునికి నంధకార మెదురా॥
చ॥ పూజింపించుకొనేవాడు భువనరక్షకుడట। తేజముతో దురితాలు తెంచగలేడా।
రాజసేసినయా జ్ఞ రాజుకంటే నెక్కుడా। వోజతో వజ్రాయుధాన కోపునా పర్వతాలు॥
చ॥ చేతనాత్మకుడట శ్రీవేంకటేశ్వరుడు। జాతిలేనిజీవునికి స్వతంత్ర మేది।
కాతరపుజన్మానకు గార్యకారణ మేది। యేతున గరుడనికి నెదురా పాములు॥
89)మాళవి/కాంభోజి
ప॥ ధృవవరదా సంస్తుతవరదా। నవమైనయార్తుని నను గావవే॥
చ॥ కరిరాజవరదా కాకాసురవరదా। శరణాగతవిభీషణవరదా।
సిరుల వేదాలు నిన్ను జెప్పగా వినీని। మరిగి మఱుగుచొచ్చే మమ్ము గావవే॥
చ॥ అక్రూరవరదా అంబరీషవరదా। శక్రాదిదివిజనివయవరదా।
విక్రమించి యిన్నిటా నీవే ఘనమని నీకు। చక్రధర శరణంటి సరి గావవే॥
చ॥ ద్రౌపదీవరదా తగ నర్జుననివరదా। శ్రీపతీ ప్రహ్లాదిశిశువరదా।
యేపున శ్రీవేంకటాద్రి నిటు నేను నాగురుడు। చూపగా గొలిచే నచ్చుగ గావవే॥
90)గుండక్రియ
ప॥ నమ్మిన దొకటే నాకు నీశరణము। యెమ్మెలసంసార మింతే యిందేమిగలదు॥
చ॥ యేటికర్మము నాకేటిధర్మము। యేటిదో నే జేయగా నీ కేమి గూడెను।
నాటకపుతొంటివారు నడిచినమార్గమని। యీటుకు జేసెగాక యిందేమి గలదు॥
చ॥ యేడతపము నా కేడజపము నే। వాడిక జేయగ నీకు వచ్చినదేమి।
బెడిదపుబెద్దలెల్లా బెట్టినతిట్టములంటా। యీడుకు జేసెగాక యిందేమి గలదు॥
చ॥ యెక్కడిపుణ్యము నా కెక్కడిభోగములు। యిక్కువ నన్నిట్ల జేసి యేమిగంటివి।
నిక్కెపుశ్రీవేంకటేశ నిన్ను గనుటగాక। యెక్కడి కెక్కడిమాయ లిందేమి గలదు॥
91)బౌళి/సావేరి
ప॥ అన్నియును హరినేనేయటమటాలే యివి। పన్నిన సుజ్ఞానికి బయలై తోచును॥
చ॥ తిరుపై యవ్వలవ్వల దిరుగుచుండేటివేళ। దిరిగినట్ల నుండు దిక్కులెల్లాను।
సిరులసంసారభ్రమ జిక్కినజీవునికిని। సరిగ నైహికము పరమై తోచు॥
చ॥ సొగిసి యద్దమునీడ చూచినవేళ దనకు। మగుడ వేఱొకరూపు మతి దోచును।
తగిలి యిట్లానేపో తనుదా నెఱగకున్న। నిగిడినపుట్టువులు నిజమై తోచు॥
చ॥ కదిసినసకలాంధకార మంతటా గప్పి। వుదయమైతే నన్నీ నొదిగినట్టు।
హృదయపుశ్రీవేంకటేశుడు వెల్లవిరైతే। మదిలో నజ్ఞానము మాయమై తోచు॥
92)లలిత/ద్విజావంతి
ప॥ అవి యటు భావించినట్లాను। కవగొని యిందుకు గలగరు ఘనులు॥
చ॥ అరయగ నేబదియక్షరములె పో। ధరలోపల నిందాస్తుతులు।
సరి బురాణములు శాస్త్రవేదములు। యింపుగ పన్నియు నిండి పొడమె॥
చ॥ వొక్కదేహమున నున్నయంగములు। పెక్కువిధములై బెరసినివి।
చిక్కుల గొన్నిటి సిగ్గుల దాతురు। యెక్కువయతులకు నిన్నియు సమము॥
చ॥ అంతరాత్మలో నంతర్యామై। బంతుల దిరిగేటిబంధువులు।
చింతింప నతడే శ్రీవేంకటేశ్వరు-। డింతకు గర్తని యెంతురు బుధులు॥
93)మాళవి/ఆనందభైరవి
ప॥ బలుపుడు హరి జేపట్టితిని। తలచినదెల్లా దక్కెను నాకు॥
చ॥ దురిత ధ్వంసుడు దుఃఖవిదారుడు। అరిభయంకరు డచ్యుతుడు।

************************************************************************************************************

సిరివరు డితనిని జేకొని కొలిచిన। పరమసుఖమెపో భయ మెక్కడిది॥
చ॥ దానవాంతకుడు దైవశిఖామణి। మానరక్షకుడు మాధవుడు।
నానాముఖముల నాపాల గలడు। యేనెపముల నా కెదురే లేడు॥
చ॥ అనయము నిర్మలు డఖిలానందుడు। ఘను డీశ్రీవేంకటవిభుడు।
కనుకొని మము నిటు గాచుక తిరిగీ। యెనయగ నేలికె యితడేమాకు॥

94)దేవగాంధారి

ప॥ మేలు లేదు తేలు లేదు మించీ నిదే హరిమాయ। కాలమందే హరి గంటి మొకటే॥
చ॥ సురలును జీవులే నసురలును జీవులే। ధర నిందు బ్రకృతిభేదమేకాని।
సురలకు స్వర్గ మసురలకు నరకము। పరగ నీరెంటిగతి పాపపుణ్యములే॥
చ॥ పొలతులు జీవులే పురుషులు జీవులే। తలప భావభేదములేకాని।
బలిమి స్వతంత్రము బరతంత్ర మొకరికి। యెలమి నిందులో జెల్లే హీనాధికములే॥
చ॥ రాజులును జీవులే రాసిబంట్లు జీవులే। వోజతో సంపద చెల్లే దొకటే వేరు।
సాజపుశ్రీవేంకటేశు శరణ మొక్కటే గతి। బాజు గర్మ మొండొకటి బంధమోక్షములు॥

95)సాళంగనాట/అఠాణ

ప॥ అదె వచ్చె నిదె వచ్చె నచ్యుతుసేనాపతి। పదిదిక్కులకు నిట్టె పారరో యసురలు॥
చ॥ గరుడధ్వజం బిదె ఘనశంఖరవ మదె। సరుసనే విష్ణుదేవుచక్ర మదె।
మురవైరిపంపు లవె ముందరిసేన లవె। పరచి గగ్గుల కాడై పారరో దానవుల॥
చ॥ తెల్లని గొడుగు లవె దేవదుందుభులు నవె। యెల్లదేవతలరథా లింతటా నవె।
కెల్లురేగీ నిక్కి హరికీర్తి భుజములవె। పల్లపుపాతాళాన బడరో దనుజులు॥
చ॥ వెండిపైడిగుదె లవె వెంజామరము లవె। మెండగుకై వారాలు మించిన వవె।
దండి శ్రీవేంకటపై దాడిముట్టై నదె యిదె। బడుబండై జజ్జరించి పారరోదై తేయులు॥

96)లలిత

ప॥ అయ్యో నేనేకా అన్నిటికంటె దీలు। గయ్యాళినై వృథా గర్వింతుగాని॥
చ॥ తడిపివుదికినట్టిధౌతవస్త్రములు నా-। యొడలు మోచినమీద యోగ్యము గావు।
వుడివోక వనములో వొప్పైనవిరులు నే-। ముడిచివేసినంతనే ముట్టరాదాయను॥
చ॥ వెక్కసపురచనలవేవేలురుచులు నా-। వొకనాలు కంటితేనే యోగ్యముగావు।
పక్కనదేవార్హపుబరిమళ గంధములు నా-। ముక్కుసోకినంతలోనే ముట్టరాదాయను॥
చ॥ గగనానుండి వచ్చేగంగాజలములైన। వొగి నాగోరంటితేనె యోగ్యము గావు।
నగుశ్రీవేంకటపతి నన్నే రక్షించినదాక। మొగడై యెరుకతుది ముట్టరాదాయను॥

97)కాంభోజి

ప॥ చెల్ల నెక్కికొంటివిగా జీవుడ యీబలుకోటా। బల్లిదుడ నీకు నేడు పట్టమాయ గోటా॥
చ॥ తొమ్మిదిగవనులైన దొడ్డతోలు గోటా। కొమ్మలవవులమూలకొత్తళాలకోటా।
వమ్ములేనిమెడవంపువంకదారకోటా। పమ్మి పగవారినెల్లా పట్టుకొన్న కోటా॥
చ॥ తలవాకిలిదంతపుతలపులకోటా। తలిరుజేతుల పెద్దదంతెనాలకోటా।
వెలియాసలనేదండువిడిసినకోటా। గులుగై యింద్రియములు కొల్లగొన్న కోటా॥
చ॥ నడచప్పరములనేనలువైనకోటా। జడిసినచెవుల మించుసవరణకోటా।
పడనిపాట్ల బడి ఫలియించె గోటా। యెడమిచ్చి శ్రీవేంకటేశు డేలె గోటా॥

98)శంకరాభరణం

ప॥ నాటికి నాడు గొత్త నేటికి నేడు గొత్త। నాటకపుదై వమవు నమో నమో॥
చ॥ సిరుల రుక్మాంగదుచేతికత్తిధార దొల్లి। వరుస ధర్మాంగదుపై వనమాలాయ।
హరి నీకృపకలిమి నట్లనే అరులచే। కరిఖడ్గధార నాకు గలువదండాయ॥
చ॥ మునుప హరిశ్చంద్రమొనకత్తిధార దొల్లి। పొనిగి చంద్రమతికి బూవుదండాయ।

వనజాక్ష నీకృపను వరశత్రులెత్తినట్టి- । ఘనఖడ్గధార నాకు గస్తూరివాటాయ ॥
చ॥ చలపట్టి కరిరాజు కరణంటే విచ్చేసి । కలుషము బెడబాసి కాచినట్టు ।
అలర శ్రీవేంకటేశ ఆపద లిన్నియు బాసి । యిలనన్ను గాచినది యెన్న గతలాయ ॥

99)సాళంగనాట
ప॥ కంటిమి రెంటికి భూమి గలుగుదృష్టాంతరము । గొంటరిరావణునందు గుహునియందు ॥
చ॥ నీదాస్యము గలనీచజన్మమైన మేలు । యేదియునెఱగనట్టియెక్కువజన్మానకంటే ।
వాదపుగర్వము లేదు వట్టియాచారము లేదు । సాధించి నైచాన్యుసంధానమేకాని ॥
చ॥ మిమ్ము దలపుచు జేయుమృగయానమైన మేలు । సొమ్ముపోక మీకుగని సుకృతము సేయుకంటె ।
దిమ్మరిజన్మము లేదు తెగనికోరిక లేదు । పమ్మి నీపై బెట్టినట్టిభారమేకాని ॥
చ॥ దిక్కులు సాధించుకంటె తెలిసి శ్రీవేంకటేశు- । దిక్కు నీనామమే కా సాధించుటే మేలు ।
యెక్కువ తక్కువ లేదు యెఱు కెఱుగమి లేదు । చక్కజాడతో నీకు శరణంటేగాని ॥

100) లలిత/ఝుంఝూటి
ప॥ కామధేనువై కలిగె నీధరణి । వాములు వలసినవారికి విధులు ॥
చ॥ అందరు జీవులే ఆయాకర్మము । బొంది బుద్ధి లెప్పుడు వేరు ।
కొందరు స్వర్గము గోరి సుఖింతురు । కొందరు నరకాన గూలుదురు ॥
చ॥ దేవు డిందరికి దిక్కై యుండును । భావాభావమే బహువిధము ।
దేవత లమృతాధీనమై మనిరి । తోవనె దనుజులు దురిత మందిరి ॥
చ॥ పుట్టుగందరికి పొంచి కలిగినదె । దట్టపుమనసులే తమకొలది ।
యిట్టె శ్రీవేంకటేశుడు సేసిన- । యట్టొ నాతడు అదివో యెదుట ॥

101)రామక్రియ/కురంజి
ప॥ సందెకాడ బుట్టినట్టి చాయల పంట యెంత । చంద మామ జూడ రమ్మ చందమామ పంట ॥
చ॥ మునుప బాలవెల్లి మొలచి పండిన పంట । నినుపై దేవతలకు నిచ్చలపంట ।
గొనకొని హరికన్ను గొన చూపుల పంట । విను వీధి నెగడిన వెన్నెలల పంట ॥
చ॥ వలరాజు పంపున వలపు విత్తిన పంట । చలువై పున్నమినాటి బౌజర పంట ।
కలిమి కామిని తోడ కారుకమ్మిన పంట । మలయుచు దమలోని మఱ్ఱి మాని పంట ॥
చ॥ విరహుల గుండెలకు వెక్కసమైన పంట । పరగ చుక్కలరాసి భాగ్యము పంట ।
అరుదై తూరుపు గొండ నారగ బండిన పంట । యిరవై శ్రీ వేంకటేశు నింటిలోని పంట ॥

102)రామక్రియ
ప॥ ఎందరు సతులో యెందరు సుతులో । యిందు నందు నెట్లెరిగే నేను ॥
చ॥ మలయుచు నాయభిమానములని నే- । కెలన నిపుడు వెదకే నంటే ।
పలుయోనులలో పలుమారు బొడమిన । చలమరి నా తొలి జన్మంబులను ॥
చ॥ గరిమెల బాణి గ్రహణము సేసిన । సిరుల చెలుల గలనే నంటే ।
తరుణుల గురుతుల తలపున మరచితి । పరగిన బహు కల్పంబుల యందు ॥
చ॥ శ్రీవేంకటగిరి చెలువుని యాజ్ఞల । భావించియె కరి చైకొంటి ।
తావుల జూడగ తగిలిన కోర్కుల । భావరతుల బెంబడి మనసందు ॥

103)రామక్రియ/హుసేని
ప॥ అవునయ్య నీ సుద్దు లటు వంటివి । జవళితో నంటు బచ్చలి వంటి వాడవు ॥
చ॥ చెలరేగి యేడ లేని చేతలెల్లా జేసివచ్చి । వెలయు నిప్పుడు నన్ను వేడుకొనేవు ।
పలుమారు నీచేత బాసలు గొన వెరతు । కలువ కంటుల యెడ కాత రీడ వనుచు ॥
చ॥ వాడ వారిపై నెల్లా వలపుల చల్లి వచ్చి । యీడ నాతో నెడలేని యిచ్చలాడేవు ।
కోడె కాడ నీ వోజ కొనియాడ నిచ్చితయ్యా । జాడతో నింతుల యెడ చంచలుడ వనుచు ॥
చ॥ పెక్కు గోపికల నెల్లా బెండ్లాడి యిట వచ్చి । గక్కన నా కౌగిట గలసితివి ।

నిక్కి శ్రీవేంకటేశుడ నే నలమేల్మంగను। కక్కసించ నోప నీవు గబ్బి వాడవనుచు॥

104)రామక్రియ

ప॥ ఎంత లేదు చిత్తమా యాతలేల మోతలేల। వంతులకు బారనేల వగరించనేలా॥

చ॥ దక్కనివి గోరనేల తట్టుముట్టు పడనేల। చిక్కి నంతకే సంతసించ రాదా।
ఒక్కమాటే వుప్పుదిని వుపదాప మందనేల। చక్క జూడ దగినంతే చవి గొనరాదా॥

చ॥ పారి పారి వేడ నేల బడలిక పడనేల। మీరిదైన మిచ్చినంతే మెచ్చరాదా।
వీరిడై పొడవెక్కి విరుగ బడగనేల। చేరి యుండినంతకే చేచాచరాదా॥

చ॥ జీవులుగొలువనేల సిలుగుల బడనేల। శ్రీవేంకటేశుడాత్మ జిక్కి వుండగా।
దావతి పడగనేల దప్పుల బొరలనేల। కైవశమైనందుకే గతి గూడ రాదా॥

105)బౌళి రామక్రియ/సావేరి

ప॥ ఇద్దరు నొకటే యెప్పుడును। బుద్ధులు చెప్పరే పొలతుకలూ॥

చ॥ చలమున నూరకే సాదించీ జెలి। తలపు దెలియకే తన పతిని।
కలి ముదిసి మేడిదె గాక తొలుతనె। కలక దేరుచరే కామినులు॥

చ॥ విచ్చల విడిగా వెంగెము లాడి। గచ్చుల యలుకల కాంతుని।
హెచ్చి గోరి రేక యేరుగా నెపుడే। మచ్చికసేయరే మానినులు॥

చ॥ పనివడి కూడుచు బంతము లాడి। ఘనుడగు శ్రీవేంకటపతి విభుని।
ననలే విరులై నాటకమునుపనె। పెనగి మొక్కించరే ప్రియ సఖులు॥

106)బౌళి రామక్రియ/కాంభోజి

ప॥ అన నింకే మున్నది అలుగ నేమున్నది। కనుగొనలనే చూచి కరగుట గాక॥

చ॥ నవ్వూ నవ్వా జెల్లును నాలిసెయ జెల్లు నీకు। రవ్వగా నే మోహించి రాపైన యందుకు।
యెవ్వరితో దగవూ లిక నాడే నేను। జవ్వనాన నొంటి నేను జడియుట గాక।

చ॥ బిగియూ నమరునూ బీరాలు నమరునూ। తగవు లెంచక నిన్ను దగ్గరిన యందుకు।
జగడమూ జెల్లదూ సాదించ జెల్లదూ। మొగమోటమున నేనే ములుగుట గాక॥

చ॥ సరసము దక్కెనూ చనవెలా నెక్కెనూ। మరగి నీ కౌగిట నేను మఱచిన యందుకు।
తెరయెత్త బనిలేదు దిష్టము శ్రీవేంకటేశ। సరుగ నీ రతిజిక్కి సత మౌట గాక॥

107)గుండక్రియ

ప॥ ఏపురాణముల నెంత వెదికినా। శ్రీపతిదాసులు చెడ రెన్నడును॥

చ॥ వారివిరహితములు అవి గొన్నాళ్ళకు। విరసంబులు మరి విఫలములు।
నరహరి గొలి చిటు నమ్మినవరములు। నిరతము లెన్నడు నెలవులు చెడవు॥

చ॥ కమలాక్షుని మతిగాననిచదువులు। కుమతంబులు బహుకుపథములు।
జమళి నచ్యుతుని సమారాధనలు। విమలములే కాని వితథముగావు॥

చ॥ శ్రీవల్లభుగతి జేరనిపదవులు। దావతులు కపటధర్మములు।
శ్రీవేంకటపతి సేవించునేవలు। పావనము లధికభాగ్యపుసిరులు॥

108)ముఖారి

ప॥ ఏలోకమందున్నా నేమీ లేదు। తాలిమి నందుకుదగ్గదావతేకాని॥

చ॥ సురల కసురలకు సూడునుబాడునే కాని। పొరసి సుఖించగ బొద్దు లేదు।
ధరలో ఋషులకును తపము సేయనేకాని। మరిగి భోగించగ మరి పొద్దు లేదు॥

చ॥ గక్కన సిద్ధులకైనా గంతయు బొంతయేకాని। చిక్కిపరుసము గలిగి నెలవులేదు।
రెక్కలు గలపక్షికి రేసుతిమ్మటలేకాని। చక్క వైకుంఠాన కెగయ సత్తువ లేదు॥

చ॥ సకల జంతువులకు జన్మాదులేకాని। అకటా నిత్యానంద మందలేదు।
వెకలి శ్రీవేంకటేశు విష్ణుదాసులకే మంచి-। సుకములెల్లా గలవు సుడివడలేదు॥

109)దేవగాంధారి

****************************************************************************************************

పll అన్నియును దన ఆచార్యాధీనము। చెన్ను మీఱ హరిపాదసేవసేయు మనసా॥
చll దైవమూ గొంచము గాడు తానూ గొంచము గాడు। భావించికొలచేవారిపరిపాటి।
చేవల బత్తిముదుగు చేనిముదుగూ లేదు। వావిరి బోగెత్తెటివారివారినేరుపు॥
చll కాలము కడమలేదు కర్మము కడమలేదు। కేలి విశ్వాసముగలిగినపాటి।
వ్రాలకి ముదిమీ లేదు వక్కణ ముదిమీ లేదు। పోలించేటివిద్వాంసులబుద్ధిలోనినేరుపు॥
చll జ్ఞానానకు దప్పు లెదు జన్మానకు దప్పు లేదు। నానాటికి వివేకించి నడచేపాటి।
పానిపట్టి శ్రీవేంకటపతి యింతకు మూలము। ఆనుక యీతని శరణనేవారినేరుపు॥

110)సాళంగనాట

పll విఱిగిరి దానవవీరు లదె। అఱిముఱి దేవత లాడే రదె॥
చll సరగునకంభ మదె పగిలె నదె। హరినరసింహంబాయ నదె।
గరుడధ్వజ మదె ఘనచక్రం బదె। మొరసేటిశంకపుమ్రోత లవె॥
చll వెడలె వెడలె నదె పెనుకొని హిరణ్యు। దొడికిపట్టె నదె తొడమీద।
విడువక చించిన వేయిచేతులవె। కడపమీదనే కదల డదె॥
చll అదె వామాంకంబందు లక్ష్మి యదె। కదిసి శాంతమదే కరుణ యదె।
వుదుటున ప్రహ్లాదు నూరడించె నదె। యిదె శ్రీవేంకట మెక్కె నదె॥

111) మోహన

పll ఎంత బత్తో నీ మీద నీ రమణుడు। చెంత నుండి ఇయ్యగదే చేతికి బాగాలు॥
చll పయ్యెద కొంగు వట్టి పతి నీతో బెనగీని। ఇయ్యకొని రాగదవే ఇంటికి నేడు।
చెయ్యార నప్పటి నీ చెక్కు నొక్కి వేడుకొనీ। వుయ్యాల మంచముపై గూచుండ గదె సరుస॥
చll నెట్టుకొన గాగలించి నిన్ను నొడ బరిచీని। అట్టెకానిమ్మని గదె అతని తోను।
వొట్టుకొని పాదము నీ వొడి మీద జాచీని। గుట్టుతో నానతిచ్చి నూకొన గదె మాట॥
చll చెలరేగి మంతనాన శ్రీ వేంకటేశు డెనసె। అలమేలు మంగవు నీ వలమ గదె।
పలు మారు నవ్వుతాను బాసికము గట్టీని। చలమెల్లా నీడేరె చల్లగదె సేస॥

112) మోహన

పll తలచిన దేహము నిలువదు తా నను దలచునొ తలచడొ।
వలనుగ జెలి మాటలు విని వచ్చీనో రాడో॥
చll శిరసున నంటిన పునుగిటు చెక్కుల జారెడి ననుచును।
ఉరవిడి దివియుచు గొన గోరూదిన చందములు।
మురిపెపు మొలనూళ్ళపై మొగపుల సొబగులు చూచుచు।
నరుదుగ గరమున నక్కడ నంటెడి యాసలును॥
చll చెనకుల వీడెపు రసమిదె సెలవుల జెదరెడి ననుచును।
నునుపగు గోళ్ళ వాతెర నొక్కిన చందములు।
పెనగొను ముత్యపు సరముల పెక్కువ దీర్చెద ననుచును।
చనవున జనుగవపై జే చాచిన చందములు॥
చll వుద్దపు నడపుల లోపల నొయ్యన పాదము జారిన।
నొద్దికతో నునుగౌగిట నొరసిన చందములు।
నిద్దపు దిరువేంకటగిరి నిలయుడు నను దనకౌగిట।
నద్దిన కస్తురి చెమటల నలమిన చందములు॥

113) తోడి

పll ఏల వూరుకొన్నాడవు ఇంకా నీవు। పాలించి మన లోనివే పంతాలు గావా॥
చll మచ్చికతో నీవు నేను మాటలాడినందుకే। తచ్చి యాపె దిట్టుకొనీ దానే తాను।
విచ్చన విడి నందుకు వేడు కొనవయ్య నీవు। నెచ్చలి తన్నును కొంటే నిను నంట గాదా॥

చ॥ ఇద్దరము నేక తాన ఇట్లనుండి నందుకే। కొద్దిమీర చెలులపై గోపగించీని।
బుద్ధి చెప్పి చేయివట్టి బుజ్జగించవయ్య నీవు।పెద్దరిక మాపెదె నీ పేరే యింతాగాదా॥
చ॥ మక్కువ శ్రీవేంకటేశ మనము గూడినందుకే। కక్కసించి వూరకైనా గాతాళించీని।
వొక్కటే ఆపే నేను వొరసి కూడితి విదె। నిక్కము దెలుసుకొంటే నీవు నీవే కావా॥

114) తోడి

ప॥ ఇంతే యింతే యింకా నెంత చూచినా। చింతల జిగురు లెక్కి చేగ దేరినట్లు॥
చ॥ వుల్లములో నెంచ నెంచ నుద్యోగములే పెక్కు। పొల్లకట్టు వంచ దంచ బోగులైనట్లు।
బల్లిదుని హరినాత్మ భావించుటొకటే। ముల్లు ముంట దీసి సుఖమున నుండినట్లు॥
చ॥ ఆనిన సంసారమున నలయికలే పెక్కు। చానిపి జవి వేడితే జప్పనైనట్టు।
పూని హరి జేతులారా బూజించు టొకటే। నూనె గొలిచి కుంచము నుసికిలినట్లు॥
చ॥ వెనక దలచుకొంటే విజ్ఞానములే పెక్కు। తిన దిన వేమెల్లా దీపైనట్టు।
చనవై శ్రీవేంకటేశు శరణనుటొక్కటే। పని వడి చెఱకున బండు వండినట్లు॥

115) భూపాళం

ప॥ ఆకాశ మడ్డమా అవ్వలయు నడ్డమా। శ్రీకాంతు భజియించు సేవకులకు॥
చ॥ పాతాళ మడ్డమా బలిమథన దాసులకు। బూతలం బడ్డమా పుణ్యులకు।
సేతు కైలాసములు చిర భూములన్నియును।పైత్రోవలట పరమ భాగవతులకును॥
చ॥ అమరావతడ్డమా హరి దాసులకు మహా-। తిమిరంబు లడ్డమా దివ్యులకును।
కమలాసనముని లోకం బదియు నడ్డమా। విమలాత్ములై వెలుగు విష్ణుదాసులకు॥
చ॥ పరమ పద మడ్డమా బ్రహ్మాండ ధనుడైన। ధర వేంకటేశ్వరుని దాసులకును।
యిరవైన లోకము లన్నిటా భోగించి। వరుసలను విహరించు వర వైష్ణవులకు॥

116) భూపాళం/కాపీ

ప॥ మూలనున్న వారి నీవు ముంగిట వేసేవు గాక। గోలవై యూర కుండితే కొంగు వట్టేనా॥
చ॥ పిలువగాబో నీతో ప్రేమమున నూ కొంటి। అలిగినట్టే వుంటే నదేమనేనా।
నిలిచి చూడగబోనే నిన్ను జూచితిని। తలవంచుకొనియుండే దడవబోయేనా॥
చ॥ చెనకగాబోనే జే బలిమి చూపితిని। కొనగొనలనే వుంటే గోర దీసేనా।
మనసిచ్చి నవ్వగాబో మారుకొని నవ్వితిని। వెనకటివలె నుండే వేగరించేనా॥
చ॥ పైనొరగగానే పో పంతానకే కూడితిని। మాని నీవూరకుండితే మాయ సేసెనా।
యీ నెపాన శ్రీవేంకటేశ నన్ను నేలితివి। నేనే నీవైన మీద నేరమెంచేనా॥

117) ధన్యాసి/రాగమాలిక

ప॥ ఏలయ్య పరమాత్మ యేలికవు మాకునై। నాలినే పెట్టితివి నాడూను॥
అప॥ కాలునికి మమ్ము సరిగాపులే కమ్మనుచు। నేలనే తిప్పేవు నేడూను॥
చ॥ ఖారమగు నీటిలో బవళించి నీవాది। నారాయణుడవైతి నాడూను।
పైరుగా నిందరిని ప్రకృతి లోపలదెచ్చి। నారుగా బోసితివి నాడూను॥
నారపేరిడి తండ్రి నందనుని బిలువ గరు-। ణారసము నించితివి నాడూను।
చేరికడు మమ్ము రక్షింప నోపక వట్టి। నేరములె యెన్నేవు నేడూను॥
చ॥ దట్టముగ జొచ్చి యిందరి దేహములలోన। నట్టనడు మెక్కితివి నాడూను।
అట్టలుగ బ్రహ్మాండ మవియించి జంతువుల। నట్టేటముంచితివి నాడూను।
ఒట్టి యిందరికి సరయూదరిని మోక్షంబు। నట్టు కొట్టితి గొంత నాడూను।
పొట్టపొరుగున దెచ్చి భూతముల మెడగట్టి। నిట్ట పిడి నేసేవు నేడూను॥
చ॥ పొలుపుగా మమ్మిట్లు బుట్టించు కొరకు నే। నలిన నాభుడవైతి నాడూను।
పలువేలుపులకెల్ల పదవులన్నియు నొసగి। నలుగడల నునుచితివి నాడూను।
చలముకొని దానవుల జక్కాడి దేవతల। నలకువలు దీర్చితివి నాడూను।

చెలగి యిందరి గావ శ్రీవేంకటాద్రిపై। నెలకొనినిటు నిలిచితివి నేడూను॥

118) ధన్యాసి

ప॥ చిత్తగింతువు రావయ్య చెలికడకు। పొత్తుల తలపోతల బోగించీని॥

చ॥ మనసు నిలువ రాక మాటలను బొద్దువోక। వొనరి విరహమున నున్నది చెలి।
కొనలు సాగిన యాల కొప్పున బెట్టేసేస। దనివోక కూటమికి దమకించీని॥

చ॥ చెమటల దొప్పదోగి సిగ్గులనే కడుమాగి। అమరిన జవ్వనాన నలసీజెలి।
తిమురు వలపులను తియ్యని సొలపులను। జమళిపులకలతో జాజుకొనీని॥

చ॥ యెగురు చూపులు చూచి యిట్టె కౌగిటికి లాచి। ముదమున జేతులెత్తి మొక్కీ జెలి।
అదన శ్రీవేంకటేశ అట్టె నీవు గూడగాను। వుదుటు గళలు రేగి వూరుపు లాగీని॥

119) ధన్యాసి/హిందోళ

ప॥ ఒక్కటి విన్నపమే వున్నమాట లికనేల। యిక్కువతో రమణున కెరుగించ గదవే॥

చ॥ యెడమాటలాడే నంటే యెందాకా దిరుగవచ్చు। నడుమ దనచిత్తము నాభాగ్యము।
తడయక చూచేనంటే తనివి యెంతటగలు। చిడి ముడి నాచనవు చెల్లించుమనగదే॥

చ॥ యెలమి చెనగేనంటే యెంతట దీరీనాస। బలిమికాడు తాను భామను నేను।
వెలయ బిలిచేనంటే వేళ యెట్టుగా దెలుసు। తలకొని నను నిట్టే దయజూడు మనుమీ॥

చ॥ వెస బెండ్లియాడేనంటే వేడుకకు విలువేది। వసమాయదా నాకు వలపు నాది।
యెసగి శ్రీవేంకటేశుడేలె నన్ను దూరనేల। పొసగ నన్నికనిట్టే భోగించుమన వే॥

120) ధన్యాసి/అఠాణ

ప॥ ఇది కల్లయనరాదు యిది నిశ్చయింపరాదు। పదిలాన గొలువగా ప్రత్యక్షమయ్యేవు॥

చ॥ యెదలో నుండుదువని యివన్ని వేదాలు చెప్పగా। వెదకి ధ్యానము సేతు వెస గనుగొంటలేదు।
చెదరకందే మరి జీవుడు నున్నాడందురు। పదిలముగా జూతు భావించరాదు॥

చ॥ అంతటా నుందువని ప్రహ్లాదుడు చెప్పెననగా। చింతించి పట్టదలతు చేతికి చిక్కుటలేదు।
సంతతజ్ఞానాన నీ సాకార మున్నదందురు। మంతనాన బిల్తునొకమాట వినబడదు॥

చ॥ రవిలో నుందువని సురలు గొలువగా। తవిలి పూజించేనంటే దగ్గరి వచ్చుటలేదు।
యివల శ్రీవేంకటాద్రి నిరవై నీ వున్నాడవు। తివిరి సేవించితిమి ద్రిష్టమాయ మాకు॥

121) ధన్యాసి

ప॥ పుట్టినట్టె వున్న వాడ పోలేదు రాలేదు। యిట్టె నీదాసుడనైతే యెంగిలెల్ల బాసె॥

చ॥ వెలినున్న జగమెల్ల విష్ణుడ నీమహిమే। అలరి నాలోన నీవే అంతరాత్మవు।
తెలిసి నేనున్న చోటే దివ్యవైకుంఠము। వెలలేని నరకముల వెరపెల్ల దీరె॥

చ॥ తనవుతో నుండేది నీ తలచిన తలపేనా। మనుపు సంసారము నీమాయచేతిదే।
పనుల నాకర్మము నీపంచినట్టి పనుపే। మనసులోపలి యనుమానమెల్ల బాసె॥

చ॥ తెరమరుగు దినాలు దేవుడ నీకల్పితమే। సొరది యాసురలెల్ల చుట్టాలె నాకు।
నిరతి శ్రీవేంకటేశ నీమరుగు చొచ్చినేడు। గురునియానతి చేత గొంకులెల్లబాసె॥

122) సామంతం

ప॥ ఇద్దరు దేహసంబంధ మిదివో మాయ। గద్దించి యాడవుండునో కడసారీ తాను॥

చ॥ తోడబుట్టినమమత తొడగి కొన్నాళ్ళకు। వాడికె పుత్రులమీదవలె నుండుదు।
వేడుక వారెవ్వరో వీరెవ్వరో కాని। కూడపెట్టీ వీరికే కొట్లాడీ వారికే॥

చ॥ తల్లిమీద గలభక్తి తనకే కొన్నాళ్ళకు। యిల్లాలుమీదవలె నింత వుండదు।
వెల్లవిరి నది యెంత విచారించ నిది యంత। యిల్లుముంగి లొక్కరిది యెరవు వొక్కరిది॥

చ॥ నీతితో శ్రీవేంకటేశునిత్యసేవ కొన్నాళ్ళ-। కీతల సంసారమెంత యితవుగాదు।
ఆతడెట్టు యివియెట్టు అందరూ నెఱిగినదే। చేతు లొకటిమీదట చిత్త మొకయందు॥

123) రామక్రియ

ప॥ ఇందరి బుద్ధులు యీశ్వరేచ్ఛకు సరిరావు। గొందినున్న మానుషము కొలువ దెంతైనా॥
చ॥ తనంత దా నూరకున్న దైవమే తోడౌను। కినిసి తా బదరితే కిందుమీదౌను।
తనుదానే చెరె హరి దధివిభాండకునకు। కొనకెక్క బోయి నీవి కొంచపడె దొల్లి॥
చ॥ వొక్కటివాడు దానైతే వున్నచోనే మేలు చేరు। పెక్కుల బుద్ధుల బోతేను పిరివీకౌను।
పక్కన నంబరీషుడు పట్టినవ్రతాన గెల్చె। దిక్కులెల్లా దుర్వాసు తిరిగి బడలెను॥
చ॥ శ్రీవేంకటేశ్వరుచేతి లోవీజగములు। భావించి యాతడు నడపక మానడు।
వావిరి నిదెఱగక వట్టియలమటబడి। జీవులేల బడలేరు చింత లిట్టే పాయరో॥

124) శ్రీ

ప॥ ఎంత వాటువడె నీశ్వరుడు। జంతువుల కేది సతమోకాని॥
చ॥ వోయుచు లోలో నొకదేహమునకె। యేమి రచించెను యీశ్వరుడు।
కామించి మోక్షమునకునైతే। వోమినస్రిష్టులు వొకటీ గావు॥
చ॥ భోగించబుట్టిన భూతకోట్లను। యెగతి మోచీ నీశ్వరుడు।
చేగదేర తనసేవకు జొచ్చిన-। యోగము సులభం బొకటొకటిని॥
చ॥ పన్ని నజగముల ప్రాణాధారము। యెన్నిట నున్నా డీశ్వరుడు।
కన్నులశ్రీవేంకటపతి యని కని। వున్నవేళ తమవునికే సుఖము॥

125) దేసాక్షి/తోడి

ప॥ నమ్మలేము కానలేము నరులాల మనమింతే। సమ్మతించి యేలేవాడు సర్వేశ్వరుడే సుండీ॥
చ॥ కంటికి గంటిరెప్ప కాచుకవుండినయట్టు। వొంటి దేహమెల్లాజేవొడ్డుకొన్నట్టు।
అంటుక దేహి నేపొద్దు అంతరాత్మమై వుండీ। జంటయై కాచుకున్నాడు సర్వేశ్వరుడే సుండీ॥
చ॥ చీకటి నోటికి గడి చేయే కొంటవచ్చినట్టు। ఆకటికి గుక్కిళ్ళు ఆసయినట్టు।
వీకల జంతువులకు వెలుపల లోనలనుండి। సాకుచున్నాడిదివో సర్వేశ్వరుడే సుండీ॥
చ॥ తమదేహ మెంతైనా తానే యింపయి మోచినట్టు। తెమలి ప్రాణ మిన్నిటా దీపయినట్టు।
అమరినభోగమోక్షా లడిగినవారి కిచ్చి। సముడు శ్రీవేంకటాద్రి సర్వేశ్వరుడే సుండీ॥

126) రామక్రియ

ప॥ ఇట్టిజీవుల కింక నేది వాటి। దట్టమై దేవుడ నీవే దయజాతుగాకా॥
చ॥ తనజన్మవిధులను దలచు నొక్కొకవేళ। వొనర మఱచు నట్టె వొక్కొకవేళ।
విను బురాణకథలు వివరించి యొకవేళ। పెనచి సందేహములె పెంచు నొకవేళ॥
చ॥ విసిగి సంసారమందు విరతిడౌ నొకవేళ। వొసగి యందె మత్తుడౌ నొకవేళ।
పసిగొని యింద్రియాలబంటై వుండు నొకవేళ। ముసిపితో దైవానకు మొక్కు నొక్కవేళ॥
చ॥ కోరి తపములు చేసి గుణియౌ తా నొకవేళ। వూరకే అలసివుండు నొక్కవేళ।
యీరీతి శ్రీవేంకటేశ యెదలో నీ వుండగాను। బీరాన నీకే మొఱవెట్టు నొకవేళ॥

127) సామంతం/సామ

ప॥ ఎంత చదివి చూచిన నీతడే ఘనముగాక। యింతయు నేలేటిదైవ మిక వేరే కలరా॥
చ॥ మొదల జగములకు మూలమైనవాడు। తుద బ్రళయమునాడు తోచేవాడు।
కదిసి నడుమ నిండి కలిగివుండెడివాడు। మదనగురుడేకాక మఱి వేరే కలరా॥
చ॥ పరమాణువైనవాడు బ్రహ్మాండమైనవాడూ। సురలకు నరులకు జోటయినవాడు।
పరమైనవాడు ప్రపంచమైనవాడు। హరి యొక్కడేకాక అవ్వలను గలరా॥
చ॥ పుట్టుగులయినవాడు భోగమోక్షాలైనవాడు। యెట్టనెదుర లోనను యిన్నిటివాడు।
గట్టిగా శ్రీవేంకటాద్రి కమలాదేవితోడి-। పట్టపుదేవుడేకాక పరు లిక గలరా॥

128) పాడి

ప॥ భోగసహాయులె పొరుగెల్లా। ఆగమవిధులును ననంతములు॥
చ॥ కులమున జుట్టాలు కోటానుగోట్లు। కలిమిలేమి కొక్కడనే గుఱి।

పలులంపటములప్రజలే యిందరు। నిలిచినచోటికి నే నొక్కడనే॥
చ॥ చెట్టడిచిన నిదె చేటడుపండ్లు। గుట్టు దెలుసుకొన గురి నేను।
వొటుక సంసార మూరల్లా నిదె। పుట్టినప్పటికి భువి నొక్కడనే॥
చ॥ చనవుమనవులకు జగమెల్లా నిదె। కొనకు మొదలికిని గురి నేను।
యెనయుచు శ్రీవేంకటేశు డేలెగన। నినుపుగమికాడ నే నొక్కడనే॥

129) మలహరి
ప॥ కోరి మాభుజముల డాగులు మోచుకున్నారము। ధారుణిలోపల మమ్ము దయజూచుగాక॥
చ॥ సతతము హరిచేతిశంఖచక్రములే। గతియై మాపాలనుండి కాచుకాక।
అతిరయమైనట్టి అచ్యుతుని ఆయుధాలే। హితవుగ మమ్ము నిట్టె యేలుగాక॥
చ॥ కమలాపతిచేతులగదాపద్మములు। మమకారముతో మము మన్నించుగాక।
సమరవిజయమైన శార్ఙాదిశరనులు। తమితోడ మాకు దాపుదండై వుండుగాక॥
చ॥ ముంచి శ్రీవేంకటేశుడు మొలగట్టినకతారు। అంచెల మాకెల్ల రక్షై అమరుగాక।
అంచ నీతని కైదువులమరినహస్తములు। పంచల మాకిట్టే వజ్రపంజరా లవుగాక॥

130) లలిత
ప॥ ఎన్నడొకో బుద్దెరిగి యీడేరేది జంతువులు। యిన్నిటా నీమహిమలు యెదిరించి వున్నవి॥
చ॥ కావించి నీపాదతీర్థగంగ ప్రవాహమైనది। పావనులై యిందరిని బ్రదుకమని।
లావుగా నీప్రసాదతులసి నారువోశున్నది। వేవేలుపాతకాలెల్ల విదళించుమనుచు॥
చ॥ చింతల నీమూర్తులు శిలాశాసనాలై నవి। పంతముతో గొలి చిట్టె బ్రదుకమని।
బంతినే నీనామములు ప్రతిధ్వనులై వున్నవి। దొంతలై నభవముల తుదగనుమనుచు॥
చ॥ అందరికి నీసేవలు హస్తగతాలై వున్నవి। బందె దీర నీకు మ్రొక్కి బ్రదుకమని।
అందపుశ్రీవేంకటేశ అంతరాత్మవై వున్నాడ-। వెందు చూచిన విజ్ఞాన మింద కొండో యనుచు॥

131) దేసాళం/సావేరి
ప॥ జీవునికి నిటు బుద్ధి చెప్పవయ్యా హరి నీవు। కావక పోరాదు మాకుగలయంతర్యామివి॥
చ॥ పైపై నెదురుకట్ల బంచదార వుండగాను। చేపట్టి యడిగి తెచ్చి చేదు దిన్నట్లు।
పూపలైన చేతిలోనే పుణ్యములు వుండగాను। పాపములు చవియంటా బట్టబొయ్యీ జీవుడు॥
చ॥ యింటిలోనే నవరత్న లెన్నియైనా నుండగాను। కంటిగించి గాజుబూస గట్టుకొన్నట్లు।
వెంటనే హరినామాలు వేయివేలై వుండగా। జంట నితరమంత్రాలు జపియించీ జీవుడు॥
చ॥ చేసుకొన్న యిల్లాలు చేరువనే వుండగాను। వేసరక వెలయాలి వెతికినట్లు।
మేనుల శ్రీవేంకటేశ మీదాస్యమే వుండగా। వాసి బరుల గొలువనే వడి గోరీ జీవుడు॥

132) భైరవి
ప॥ ఏమిసేతు దైవమా యెన్నడు గరుణించేవో। దామెనసంసారములో దట్టువడీ మనసు॥
చ॥ యెక్కడిపగయొకో ఇంద్రియాలు నన్ను బట్టి। చక్కుముక్కు సేసి యెంచి సాధించీని।
గుక్కక యేమిసేసినకొలయొకో వెంటవెంట। వెక్కసపు పుట్టువులై వెనుతగిలీని॥
చ॥ యెన్నాళ్ళపాపమొకో యెడతెగక నాలోన। వున్నతపుగోపమై వుమ్మగిలీని।
తిన్ననై యెవ్వరిచేతితిట్టు దాకినవిధమో। విన్ననై విజ్ఞానమెల్లా వీటిబోయ దుదిని॥
చ॥ యేవేళగుణమో యెడతెగనికర్మాలు। రావిమానిజిగురై వూరక యంటీని।
శ్రీవేంకటేశుడ నీవు చిత్తములోపల నుండి। కావగగదా నీవే గతి యనవలనె॥

133) ముఖారి
ప॥ నిరుహేతుకనిధివి నీవు। కరుణించు నీకు నొక్కటి విన్నపము॥
చ॥ దేవా నీమహిమ తెలియనెవ్వరివశ-। మీవల నీవే గతను టింతేకాక।
భావించలేరు నిన్ను బ్రహ్మాదులుసహితము। నీవేడ నేనేడ నేనొక జంతువను॥
చ॥ చిత్తానహరి నాదిక్కు చేకొని యవలోకించవే। యిత్తల సంసారవార్ధి యీదుచున్నాడ।

***********************************************************************************************

హత్తి చూచేవారేకాని అడ్డగించేవారు లేరు। పొత్తుల నాధర్మము పుణ్యము నీచేతిది ॥
చ॥ అవధారు శ్రీవేంకటాధీశ నాజన్మము। కవిసి యింద్రియముల గట్టువడ్డాడ।
జవళి నీపాదములే శరణము చొచ్చినాడ। తవిలి నీచిత్త మింతే తరవాత నికను ॥
134) బౌళి
ప॥ శ్రీవేంకటేశ్వరుడు చేరి విజయము బొంది। దేవతలు చూడ దశదిక్కులకు నేసెను ॥
చ॥ ఆరికమ్ము వేసెనట్టె అల్లనరకాసురుపై। మేరమీర రావణునిమీద నేసెను।
సారపుజలధిమీద జలములింకగ నేసె। దారి దప్పకుండ నేడుదాళ్ళు దెగనేసె ॥
చ॥ పగదీర మింటిమీదిబాణునిమీద నేసె। మిగుల మెరసి మాయామృగము నేసె।
జగములో రాక్షసుల సంహారముగ నేసె। నిగిడి రక్తగుండాలు నిండ నేసెను ॥
చ॥ ఖరదీషణాదుల కడిఖండలుగ నేసె। సరుస గుంభకర్ణుని జావనేసెను।
అరిది శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి। గరుడునిమీద నెక్కి కంటువాయ నేసెను ॥
135) బౌళి
ప॥ అర్పులు బొబ్బలు నవె వినుడు। యేర్పడ నసురల నిటువలె గెలిచే ॥
చ॥ కూలినతలలను గుఱ్ఱపుడొక్కలు। నేలపై బొరిననెత్తురులు।
వోలి జూడ డిదె వృద్ధగళలీరణ-। కేలిని విష్వక్సేనుడు గెలిచె ॥
చ॥ పడినరథములు బాహుదండములు। కెడసినగజములు గొడుగులును।
అడియాలము లివె అక్కడ విక్కడ। చిడుముడి విష్వక్సేనుడు గెలిచె ॥
చ॥ పగుల పగుల వృషభాసురుని జంపె। పగ నీగె ఆతనిబలములతో।
అగపడి శ్రీవేంకటాధిపుపంపున। జిగి గలవిష్వక్సేనుడు గెలిచె ॥
136) లలిత
ప॥ సకలంబులు నీవే సర్వేశ్వర నాకు। అకలంకంబగుసుఖమే అన్నిట నిదే నాకు ॥
చ॥ పొందుగ జక్రాంకితమే భుజబల మిదె నాకు। అందినహరి నీచింతే ఆత్మబలము నాకు।
సందడి బేరుబలము కేశవనామము నాకు। యిందును నందును భవభయ మిక లేదిదే నాకు ॥
చ॥ అంగపుదిరుమణు లివి పంచాంగబలము నాకు। సంగతి నీపై పాటలె స్వరబలి మిదే నాకు।
రంగుగ నీగుణరాసులే రాసిబలము నాకు। యింగితముగ నిహపరముల కెదురేదిదే నాకు ॥
చ॥ కనుగొనునీవిగ్రహమే గ్రహబలి మిదె నాకు। విను నీదాసులసేవే వెనుబలి మిదె నాకు।
తనరిన శ్రీవేంకటపతి దైవబలము నాకు। ఘనమే చెప్పగ నింతట గలిగెబో యిదే నాకు ॥
137) సాళంగనాట/ఆఠాణ

ప॥ ఇదివో వీధివీధుల నీతనితేరు। యెదుట శ్రీవేంకటాద్రిని తేరు ॥
చ॥ చట్టువడ దోలె నాడు సముద్రాలపై దేరు। ఘొట్టుగా దోలెను పౌండ్రకునిపై దేరు।
జట్టిగొని తోలె జరాసంధునిపై నదె తేరు। కొట్టి తోలె హంసడి భక్తులపై తేరు ॥
చ॥ ఘోరమై కుంగగ దోలె కులగిరులపై దేరు। కౌరవసేనపై దోలె గక్కన దేరు।
కోరి మధురమీద నక్రూరు గూడి తోలె దేరు। ఆరసి సందిమాటలు ఆడదోలె దేరు ॥
చ॥ తచ్చి శిశుపాలాది దైత్యులపై దోలె దేరు। పెచ్చుగా దోలె రుక్మిణి పెండ్లితేరు।
అచ్చపు శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి। చెచ్చెర దోలె దిక్కుల సింగారపు దేరు ॥
138) పాడి
ప॥ అనుచు లోకములెల్ల నదె జయవెట్టేరు। నిను గొల్చితి గానవే నీరజాక్షుడా॥
చ॥ అదివో కోనేటిలోన నదివో సర్వతీర్థములు। అదివోపైడిమేడలహరినగరు।
పొదలి పరుషలెల్లా పొదిగి సేవించేరు। యిదివో వరము లిచ్చె నిందిరానాథుడు ॥
చ॥ అదివో వేదఘోషము అదివో సురలమూక। అదివో విశ్వరూపము అద్భుతమందె।
గుదిగొనె బుణ్యములు కోట్లసంఖ్యలు చేరె। యిదివో దయదలచె నీశ్వరుడు ॥

***********************************************************************************************

********************************************************************************************

చ॥ అదివో శ్రీవేంకటేశు డక్కున నలమేల్మంగ । అదివో నిత్యశూరులు ఆళువారలు ।
నిదులశేషాచలము నిక్కి పైపై బొడచూపె । యిదివో కొలువున్నాడు హృదయాంతరాత్ముడు ॥

139) లలిత

ప॥ అరసినన్ను గాచినాతనికి శరణు । పరము నిహము నేలే పతికిని శరణు ॥
చ॥ వేదములు దెచ్చినట్టివిభునికి శరణు । ఆదిమూలమంటే వచ్చినతనికి శరణు ।
యేదెసా తానైయున్న యీతనికి శరణు । శ్రీదేవి మగడైన శ్రీపతికి శరను ॥
చ॥ అందరికి ప్రాణమైన ఆతనికి శరణు । ముందు మూడు మూర్తుల మూర్తికి శరణు ।
దిందుపడి దేవతల దేవుడికి శరణు । అంది మిన్ను నేలనేకమైనతనికి శరణు ॥
చ॥ తానే చైతన్యమైన దైవానకు శరణు । నానా బ్రహ్మాండాలనాథునికి శరణు ।
ఆనుక శ్రీవేంకటాద్రి యందునుండి వరములు । దీనుల కిందరి కిచ్చే దేవునికి శరణు ॥

140) సాళంగనాట/కల్యాణి

ప॥ సిరి దొడపై నిడి శ్రీనరసింహుడు । యిరవుగ వరముల నిచ్చిని వాడే ॥
చ॥ ఘనమగుకోరలు కరాళవదనము । చెనకుచు గొడ సెటిజిహ్వయును ।
ఎనుపుగటమరులు నిటలలోచనము । నొనరగ గొలువై యున్నాడు వాడే ॥
చ॥ చటులచక్రకరంబును శార్ఙకరంబును । అటు వరదాభయహస్తములు ।
పటుతరయోగపట్టబంధమును । కటితటి జెలగగ గడగీ వాడే ॥
చ॥ పరపగుశేషునిపడగలనీడల । అరుదగురవిచంద్రాంకముల ।
సిరులగద్దెపై శ్రీవేంకటేశుడు । పరిపూర్ణుడై పరగీ వాడే ॥

141) శ్రీ

ప॥ నిర్మలులు వీరు నిత్యసుఖులు । కర్మదూరులు విష్ణుకైంకర్యపరులు ॥
చ॥ పరమజ్ఞానసంపన్నులగువారికిని । అరుదుగా దిచటిమహదైశ్వర్యము ।
హరికృపాధనము చేనబ్బినమహాత్ములకు । సరకుగాకుండు పంచల నిధానములు ॥
చ॥ బలిమిని వేదాంతపట్టభద్రులకు నిల । బలురాజ్యపదవు లిరుగడబంట్లు ।
లలిమీర హరిచక్రలాంఛనపుశూరులకు । యెలమి విజయములెల్ల నింటిలో నుండు ॥
చ॥ యీవలను శ్రీవేంకటేశుశరణాగతుల- । కావటించినపుణ్య మడువుగాదు ।
దైవజ్ఞులయినయీధర్మస్వరూపులకు । వేవేలభోగములు వెనుతగులుచుండు ॥

142) శంకరాభరణం

ప॥ చీచీ వో జీవుడా చింతించుకో జీవుడా । ఆచందాన కీచందము అరుహమా జీవుడా ॥
చ॥ వుత్తము డయినహరివుండేటియాతుమలోన । తత్తరపుగాంతలను తలపోసేదా ।
వొత్తి నారయణనామ ముచ్చరించేనోరను । రుత్తయధరపుదోలు రుచిగొనేదా ॥
చ॥ పొందుగా గోవిందుని బూజించేటిచేతులను । సందడి జన్నులమీద జాచబొయ్యేదా ।
కందువ దేవునిరూపు కనుగొనేచూపులు । ముందరి మర్మపుటంగములమీద బెట్టేనా ॥
చ॥ వేవేలు విష్ణుకథలు వినియేటి చెవులను । ఆవటించి యాడసుద్దులాలకించేదా ।
శ్రీవేంకటేశ్వరుని సేవించేయీజీవనము । భావించక విషయాలపాలు సేసేదా ॥

143) దేసాక్షి/ఖరహరప్రియ

ప॥ ఇంతదేవు డింక వేడీ యెంచి చూపుడా । చెంతనుండితే రక్షించు చేకొని కొలువరో ॥
చ॥ వేసితే వేయిరూపులు విశ్వరూప మితడు । శ్రీసతీశు డిందరిలో శ్రీమంతుడు ।
భాసురపుభూమిమోచేబలవంతు డిన్నిటాను । దాసులైతే మన్నించు నీదైవము గొలువరో ॥
చ॥ గుట్టున బ్రహ్మాండాలు కుక్షిలో నించినవాడు । అట్టె దేవతలమొర లాలించేవాడు ।
చిట్టకపుదానవుల చించిచెండాడేటివాడు । ఇట్టె శరణంటే గాచు నీతని గొలువరో ॥
చ॥ కాలము గర్మము మాయ గల్పించినయట్టివాడు । ఆలించి సర్వజీవుల అంతర్యామి ।
వాలి శ్రీవేంకటపతై వరములిచ్చేటివాడు । యేలీ గొల్చిన మెచ్చు నీవిభు గొలువరో ॥

********************************************************************************************

************************************************************************************************************

144) భూపాళం
ప॥ అప్పుడు చూచేదివో అధికుల నధముల। తప్పక యెచ్చరి యిదే తలచవో మనసా॥
చ॥ కొండలవంటిపనుల కోరి ముంచుకుంటే నూర-। కుండి కికొననివాడే యోగీంద్రుడు।
నిండినకోపములకు నెపములు గలిగితే। దండితో గలగనియాతడే ధీరుడు॥
చ॥ సూదులవంటిమాటలు సొరిది జెవి సోకితే। వాదులువెట్టుకొననివాడే దేవుడు।
పాదుకొన్న సంసారబంధము నోరూరించితే। ఆదిగొని మత్తుడు గానట్టివాడే పుణ్యుడు॥
చ॥ గాలాలవంటియాసల కడు దగిలి తీసితే। తాలిమితో గదలనాతడే ఘనుడు।
మేలిమి శ్రీవేంకటేశుమీద భారము వేసుక। వీలక తనలో విఱ్ఱవీగువాడే నిత్యుడు॥
145) మలహరి
ప॥ కొన మొద లేదో గుఱిగాన రొరులు। మునుకొనుసంసారమోహాంధమందు॥
చ॥ తలచును బ్రహ్మాండతతులకు నవ్వల। తలచేటిజీవుడు తా నణువు।
అలరినయాసల ననలును గొనలను। వెలసీ సంసారవృక్షములోన॥
చ॥ పుట్టును బొదలును భువి బహురూపుల। పుట్టేటియాతడు పొరి నొకడే।
వొట్టుక యీదును వుభయకర్మముల। చట్టెడుసంసారసాగరములను॥
చ॥ తగులు నన్నిటా తనుభోగంబుల। తగిలేటిపురుషుడు తా ఘనుడు।
నిగిడి శ్రీవేంకటనిలయుడు గతైతే। అగపడ సంసారనందమందు॥
146) ఆహిరి
ప॥ కలిదోషములాల కడు నేల మీరేరు। యిలధరు డుండగాను యికనేటిసుద్దులు॥
చ॥ జగములేలెడువాడు సర్వాంతరాత్ముడు। జిగి నింక నీకీబుద్ధి చెప్పనోపడా।
నిగిడి పుట్టించేవాడు నిండుక వుండేటివాడు। తెగనికర్మము లెల్ల తిద్దనేల మానును॥
చ॥ దనుజుల గొట్టేవాడు ధర్మము నిలిపేవాడు। పనిగొన్న దురితాలు పాపనేరడా।
కొనమొదలైనవాడు గురి దానైనవాడు। వునికి మనికి సేయ కూరకుండీనా॥
చ॥ స్వతంత్రుడైనవాడు స్వామియైనవాడు। గతియై దాసులనెల్ల గావకుండీనా।
యితడే శ్రీవేంకటేశు డిందిరాపతైనవాడు। సతతము మాకు నిట్టే సంపద లొసగడా॥
147) దేసాళం/శహన
ప॥ వాదమేల సారెసారె వడి ముక్తి లేదంటా। వేదాంతశ్రవణము వెట్టిక జేసిరా॥
చ॥ అరయ జీవులకెల్లా నభేదమైతే। గురుడు శిష్యుడు లేడు కూడ దర్థము।
సొరిది నాతుమలోపల సోహంభావనయైతే। నర మునులదేవపూజలు చెల్లవు॥
చ॥ సహజలీలానుభూతి సర్వము మిథ్య యైతే। బహుయుగాదికర్మాల పస లేదు।
మహిలోఁ నిజననాలు మరణాలు మాయమైతే। విహితాచారాలు సేయ విధే లేదు।
చ॥ ఘటనబ్రహ్మము నిరాకార మైతే బఱియింప। యిటు పురుషసూక్తాదు లివి మరేల।
అటు శ్రీవేంకటేశు దాస్యము లేక బిగిసితే। నటలాడుకొనేడిరాక్షసమత మవును॥
148) ముఖారి
ప॥ ఏ దుపాయము యే నిన్ను జేరుటకు। ఆదినంత్యములేని అచ్యుతమూరితివి॥
చ॥ వెలయ నీగుణములు వినుతించేనంటే। తెలియ నీవు గుణాతీతుడవు।
చెలరేగి నిను మతి జింతించేనంటే। మలసి నీ వచింత్యమహిముడవు॥
చ॥ పొదిగి చేతుల నిన్ను బూజించేనంటే। కదిసి నీవు విశ్వకాయుడవు।
అదన నేమైన సమర్పించేనంటే। సదరమై అవాప్తసకలకాముడవు॥
చ॥ కన్నులచేత నిన్ను గనుగొనేనంటే। సన్నిధి దొరక నగోచరుడవు।
యిన్నిటాను శ్రీవేంకటేశ నీవు గలవవి। వన్నెల శరణనేవాక్యమే చాలు॥
149) పాడి
ప॥ వేళొకభావనలేల వీనితో బెనగనేల। తూఱినందే హరిగూర్చి తుదగంటగాక॥

************************************************************************************************************

చ॥ చూచేకన్నుల నేమీ జూడకుండవచ్చునా। చూచినందెల్లా హరి జూచుటగాక।
వేచినవీనుల నేమీ వినకుండవచ్చునా। కాచి యవే హరికథగా వింటగాక॥
చ॥ కోరేటిచవుల జిహ్వ గోరకుండవచ్చునా। కోరినచవుల హరి గూర్చుటగాక।
ఆరీతిబారేమనసు అడచగవచ్చునా। ఆరితేరి అన్నిటాను హరి గంటగాక॥
చ॥ వొడలు మోచినదేహి వోమకుండవచ్చునా। వొడలు శ్రీహరిదనే వోముటగాక।
బడినే శ్రీవేంకటేశు బాసివుండవచ్చునా। యెడయ కందె సుఖియించుటగాక॥

150) గౌళ

ప॥ ఏడనుందురో తాము యెన్నికెపౌజులు దాటి-। రాడకాడే పొడచూపే రాహో మేలు॥
చ॥ యెలమి స్వప్నమనేయెడపుజావడిలో। వొలిసి జీవుడు కొలువున్నపుడు।
వెలినున్న చైతన్యవిధులదొరలచేతి-। యలబలము గాన మహో మేలు॥
చ॥ ఉప్పడమయి దేహమనేవూర బెద్దచావడి। ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు।
చప్పుడుతో నింద్రియవిషయపరివారము। అప్పుడు పారాడుదురు ఆహో మేలు॥
చ॥ అక్కడ నిద్దురలనేఅంతఃపురాల కేగి। వుక్కున భోగాన నాత్మ వున్నపుడు।
యెక్కువశ్రీవేంకటేశ యెవ్వరూ నాడకబోరు। అక్కడా నీవే వుందు వాహో మేలు॥

151) బౌళి

ప॥ నానామార్గముల నాటుకొను నొకయోగి। మానిమీదితపసి సామాన్యు డాయోగి॥
చ॥ వున్ననునమాస గూడ బొదిగీ నొక్కొకయోగి। కన్నులచూపులు సరిగా చూచు నొకయోగి।
మిన్ను నూయి చేతాట జేది మెచ్చు మింగు నొకయోగి। వెన్న సన్న ముగ నూరి వీగు నొకయోగి॥
చ॥ గాలి ముడియగ గట్టి కలుగుడిగట్టుయోగి। నాలిమింటివిత్తి వెట్టి నగు నొకయోగి।
మూలనిధానము గని ముందు గానడొకయోగి। నేల దలకిందుసేసి నిక్కు నొకయోగి॥
చ॥ గతజలములకెల్ల గట్టుగట్టు నొకయోగి। తతి బూవులమాటల దడిగట్టు యోగి।
యితవైనశ్రీవేంకటేశునిమఱగు చొచ్చి। గతిగనె నాతడొక్కడే యోగి॥

152) ముఖారి

ప॥ హరియే సకలక్రియలై తృప్తి యిచ్చుగాక। యెరవులచేత లెందాకా వచ్చీని॥
చ॥ నరులకు నరులే పరలోకక్రియలు। సిరిమోహాచారాల జేతురుగాక।
తరుపాషాణపశుతతుల కెవ్వరు సేసే-। రరయగ భ్రమగాక అవి పస్తులున్నవా॥
చ॥ కొడుకులుగలవారు కోరి పితృముఖమున। కుడుపులు దమవారి గూర్చిపెట్టగా।
అడరి శ్రీహరియే అన్నియు జా జేకొని। తడవివారి గొంత దయజూచుగాక॥
చ॥ తారేడ వారేడ దైవము శ్రీవేంకటేశు-। డారయ నంతరాత్ము డని తెలిసి।
ధారతో యాతనియాజ్ఞ దప్ప కాదివసాన। చేరువ జేసేవెల్లా జేయుడీ యాతనికి॥

153) గుండక్రియ/రాగమాలిక

ప॥ హరిహరి నీమాయాజగ మిది అండనే చూచుచు నవ్వుచు।
అరసి యందులో నిను భావించేటిఆత్మభావమిది యెన్నడొకో॥
చ॥ సకలోద్యోగంబులు మాని సకలోపాయంబులు విడిచి।
సకలేంద్రియములజాలటు మాని సకలవిషయములరహితుడై।
సకలము దనవలె భావించి సర్వాంతరాత్మవు నిను దెలెసి।
అకలంకంబున నుండెడిభావం బది యిక నెన్నడొకో॥
చ॥ ఘనమగు కోర్కుల జాలించి ఘనకోపంబు నివారించి।
ఘనకాముకత్వముల నటు దనిసి ఘనమగునాసల దొలగించి।
ఘనముగొంచముల నిను దలచి ఘనాఘనుడవు నీవనుచు।
అనుమానములటు సుఖియించే దది యిక నెన్నడొకో॥
చ॥ పరచింతలలో దడబడక పరమార్గంబుల కగపడక।

పరహింసలకును యెన్నడు జొరక పరదూషణలకు నెడగిలిసి।
పరదేవుడ శ్రీవేంకటభూధరపతి నీకే శరణనుచు।
ఆరమరపులనే జొక్కితి తనిసే దది యికనెన్నడొకో॥

154) బౌళి/రాగమాలిక

ప॥ ఏది వలసె నీవది సేయు యిందులోన నోజీవాత్మ।
పాదగుమనలో నంతరాత్మవై పరగిన శ్రీహరిపనుపునను॥

చ॥ మనవంటిజీవులే మహిలోన నొకకొన్ని।
శునకములై కుక్కుటములై సూకరములైనవి।
దినదినము గర్మపాశముల దిరిగెడిదుర్దశ లటు చూడు।
సనకాదులై కొందరు జీవులు శౌరిదాసులై రటు చూడు॥

చ॥ కన్నులుగాళ్ళు మనవలె దనువులు గైకొని కొందరునరులు।
పన్నినతొత్తులు బంట్లై మనపనులు సేయుచున్నారు।
యెన్నగ శ్రీహరి నెఱగక యిడుమలబొరలెడి దది చూడు।
మున్నె హరిదాసులై నారదముఖ్యులు గెలిచిన దది చూడు॥

చ॥ యింతగాలమును యీపుట్టుగులనె యిటువలె బొరలితి మిన్నాళ్ళు।
యింతట శ్రీవేంకటేశుడు దలంచి యీజన్మంబున మము నేలె।
వింతలబొరలిననరకూపముల వెనకటి దైన్యము లటు చూడు।
సంతసమున ముందరిమోక్షము సర్వానందం బది చూడు॥

155) శంకరాభరణం

ప॥ నీవు సర్వసముడవు నీవు దేవదేవుడవు। యీవల నాగుణదోషా లెంచ నికనేలా॥

చ॥ పూవులపై గాసీ బొరి ముండ్లపై గాసీని। ఆవల వెన్నెలకేమి హానివచ్చీనా।
పావనుల నటు గాచి పాపపుంజమైననన్ను। గావగా నీకృపకు గడమయ్యీనా॥

చ॥ గోవుమీద విసరీ గుక్కమీద విసరీని। పావనపుగాలికిని పాపమంటీనా।
దేవతలరక్షించి దీనుడనైననాకు। దోవచూపి రక్షించితే దోసమయ్యీనా॥

చ॥ కులజునియింటనుండీ కులహీనునియింటనుండీ। యిలలో నెండకు నేమి హీనమయ్యీనా।
వలసి శ్రీవేంకటాద్రి వరములు యిచ్చి నాలో। నిలిచి వరములిచ్చి నేడు గావవే॥

156) సామంతం

ప॥ నెప్పున ధర్మపుణ్యము నీచేతి దింతే। యెప్పుడు గాచిన గావు మింతా నీచిత్తము॥

చ॥ యేవల నరుడు లేక యెద్దే తా దున్నునా। నీవు సేయించక వేరే నే బుణ్యము సేసేనా।
దేవుడ సూర్యుడు రాక తెల్లవారునా రేయి। వేవేగ నీకృపగాక విజ్ఞానినౌదునా॥

చ॥ కమ్మరవాడు లేకే కుండ తా బుట్టునా। నెమ్మి నీవు పుట్టించక నేనే పుట్టితినా।
వమ్ముల రాట్నము నిలువక గుండ్రలు నిల్చునా। పమ్మి నీయప్పణ లేక భవములు మానునా॥

చ॥ మక్కువ మగడులేనిమనువు గలుగునా। లెక్కించి యంతర్యామివి లేనినే నున్నాడనా।
చక్కగ శ్రీవేంకటేశ శరణనేబుద్ధి నాకు। తక్కక నీవియ్యకుంటే దాసుడు నేనౌదునా॥

157) మాళవగౌళ

ప॥ ఏమీ నెఱుగనినాడు యిటు నిన్ను గొలిచేనా। నీమాయ దెలుపగా నిను ననేగాకా॥

చ॥ పసురముగ జేసితే బడి నిన్ను దలచేనా। వెస రాయిజేసితే వెదకి నిన్నెఱిగేనా।
పొసగ మానుగ నన్ను బుట్టించితే బొగడేనా। ముసిపి నరుజేయగా మొరయిడేగాక॥

చ॥ మొగి మృగము జేసితే మొక్క నెఱిగేనా। తగ బక్షి జేసితే దరి బూజ సేసేనా।
జిగి నితరజంతువుగ జేసితే దగిలేనా। అగపడి వివేకి జేయగ ననేగాక॥

చ॥ యింత కధికారి జేసి యీప్రపంచజ్ఞాన-। మింత యొసగితివి మర గికనేలా।
చింత లిన్నియు దీర శ్రీవేంకటేశ నను। సంతతము నేలగా శరణనేగాక॥

158) శుద్ధవసంతం
ప॥ పరమాత్ము డొక్కడే పరమపావనుడుగన। పరిపూర్ణుడనెడియీభావమే చాలు॥
చ॥ హేయ మిందే దుపాదేయ మిందేది। బాయిటనే హరి సర్వపరిపూర్ణుడు।
సేయునెడ గుణభావజీవకల్పనము లివి। రోయజూచిన దనదుకాయమే రోత॥
చ॥ జాతి యిందే దమ్త్యజాతి యిందేది। జాతులన్నిటా నాత్మ సర్వేశ్వరుడు।
ఆతలను అంటుముట్టనెడిబావనలెల్ల। బాతిపడి యెఱుగనోపనివెలితే తనది॥
చ॥ తెలివిగలదాకా దెగనినుఱగ లివి। తెలిసినంతటిమీద దీరు సంశయము।
యిలలోన శ్రీవేంకటేశ్వరునికరుణచే। వెలసి యీజ్ఞానంబు విడువకు మననా॥

159) రామక్రియ/రాగమాలిక
ప॥ వెలుపల మఱవక లోపల లేదు వెలుపల గలిగిన లోపల మఱచు।
చలమున నిదియే ఘడియ ఘడియకును సాధించినసుఖ మటు దోచు॥
చ॥ వెలుపల వెలిగే చూడగ లోపలి వెడచీకటి గాననియట్లు।
అలరి ప్రపంచజ్ఞానికి దనలో నాత్మజ్ఞానము గనరాదు।
పలుమరు చీకటి చూడగ జూడగ బయలే వెలుగై తోచినయట్లు।
అలయక తనలోచూపు చూచినను అంతరంగమున హరి గనును॥
చ॥ జాగరమే కడు జేయగ జేయగ సతతము నిద్దుర రానట్లు।
చేగలనింద్రియములలో దిరిగినచిత్తవికారము లయపడదు।
యీగతి నిద్దుర వోగా బోగా నిలలో సుద్దులు యెఱగనియట్టు।
యోగపుటేకాంతంబును దనమన సొగి మరవగ మరవగ హరి గనును॥
చ॥ దేహపుటాకాశపునిట్టూర్పులు బాహిరపుబయట నడగినయట్లు।
ఆహా జీవునిజననమరణములు అందే పొడముచు నందడగు।
వూహల శ్రీవేంకటపతివాయువు కొగి నాకాశము నొక్కసూత్రము।
ఆహా ప్రాణాపానవాయువులు ఆతుమనిలుపుటేహరి గనుట॥

160) గుజ్జరి/రాగమాలిక
ప॥ ఇందరిలో నే మెందుబోలుదుము యిందరి బోలినజీవులమే।
కందువ వీరల దలచి చిత్తమిది కలగెడి దైవము కావగదే॥
చ॥ యెందరొకో జరాదుఃఖము లేచి యనుభవించేటివారు।
యెందరొకో దరిద్రదుఃఖము లెసగి యలమటించేటివారు।
యెందరొకో బంధనతాడనహీనదెసల నుండెడివారు।
యెందరొకో దాసదాస్యవిధి నెడయరాక చెఱ లయినవారు॥
చ॥ యెందరొకో మరణదెసలచే నిల సంయోగవియోగదుఃఖితులు।
యెందరొకో జన్మరోగముల నెక్కువభయమందేటివారు।
యెందరొకో రాజులచోరులహింసలకు లోనయిన వారు।
యెందరొకో పొడమినజీవుల కెక్కడ నెక్కడ నేపాటో॥
చ॥ యెందరొకో యీదుఃఖనివృత్తికి యెడసి మిమ్ము గొలిచినవారు।
యెందరొకో సంపదలకు లోనై యేతాయాతన బడువారు।
యెందరొకో శ్రీవేంకటేశ యిపు డెక్కువ నీశరణము చొచ్చి।
యిందును నందును సుఖులై లోకుల నిందరి జూచుచు నవ్వెడివారు॥

161) గుండక్రియ
ప॥ నిన్నూ నన్నూ నెంచుకోనినేరమిగాక। పన్నినసూర్యునికాంతి ప్రతిసూర్యుడౌనా॥
చ॥ జలధిలోపలిమీను జలధి దా నౌనా। జలములాధారమైనజంతువుగాక।
నెలవై నీలోనివాడ నీవే నే నౌదునా। పొలసి నీయ్యాధరువుబొమ్మ నింతేకాక॥

చ॥ రాజవద్ద నున్న బంటు రాజే తా నౌనా। రాజసపుచనవరిరచనే కాక।
సాజమై నిన్ను గొలిచి సరిగద్దె నుందునా। వోజతో నిన్ను సేవించి వుందు నింతేకాక॥
చ॥ ముత్తెపుజిప్పలనీరు మున్ని టివలె నుండునా। ముత్తెములై బలిసి లో మొనపుగాక।
నిత్తెపుశ్రీవేంకటేశ నీశరణాగతులము। మొత్తపులోకులమా ముక్తులముగాక॥

162) మాళవి
ప॥ ఇందుకు జింతించనేల యీశ్వరునిమాయ లివి। యెందుకు మూలము హరి యీతని జింతించరే॥
చ॥ అల నారికడపుగాయకు నీరు వచ్చినయట్టు। తలచి రాగలమేలు తన్ను దానే వచ్చురే।
లలి నేనుగుదిన్న వెలగవంటిబేసము-। వలెనే పోగలవెల్ల వడి దానే పోవురే॥
చ॥ నిండినయద్దములోన నీడ వొడమాపినట్టు। దండియైనపుట్టుగులు తన్ను దానే వచ్చురే।
పండినపండ్లు తొడమబాసి వూడినయట్టు। అండనే మరణములు అందరికి సరిరే।
చ॥ పెనురాతిపై గడవ పెట్టగా గుదురైనట్టు। తనుదానే చింతింప దలపు నిలుచురే।
ఘనుడు శ్రీవేంకటేశు గని శరణన్న జాలు। వెనక పాపాలు మంచు విచ్చినట్టు విచ్చురే॥

163) శ్రీ
ప॥ బిరుదులన్నియు నీవే బిరుదులోకములెల్ల। అరయ నీపాదమందె అణగుండెగాన॥
చ॥ బహుదేవతాసార్వభౌమబిరుదు నీకే। సహజము నీవు భూపతివిగాన।
నహి దేవతాచక్రవర్తిబిరుదు నీకే। విహితము చక్రముచే వెలసేవు గాన॥
చ॥ పెనుదేవశిఖామణిబిరుదు నీకే చెల్లు। ఘనకౌస్తుభమణి గలవాడవుగాన।
మును దేవదేవోత్తముడను బిరుదు నీకే। ననిచె బురుషోత్తముడవుగాన॥
చ॥ వొట్టుకొని దేవరాహుత్తరాయబిరుదు నీదే। కిట్టి రాతిగుఱ్ఱము నెక్కితివిగాన।
తిట్టమై శ్రీవేంకటేశదేవ సింహము నీవే। అట్టె నారసింహుడవై అమరితిగాన॥

164) రామక్రియ
ప॥ ఏల మమ్ము గాసిసేసే రింకా మీరు। కాలముతో నిలిచెను కైవల్యపదవి॥
చ॥ పాదములు హరినామపఠనచే బాపుకొంటి। కైపుగ జిత్రగుప్తుడా కవిలె గట్టు।
కోపుల బుణ్యములెల్ల గోవిందుని కిచ్చితిమి। పూపలస్వర్గముత్రోన భుజవేయరో॥
చ॥ ఆతుమలో నజ్ఞాన మాచార్యుడే పాపె। ఆవల జన్మాలవాకి లటు ముయ్యరో।
చేత హరిదాస్యమున జీవన్ముక్తుడనైతి। జాతియధర్మములాల సంబంధము విడరో॥
చ॥ పరమాత్ము చింతచేత బదుకు నిశ్చయమాయ। ధర గైవసము గావో తగుచిత్తమా।
యిరవైనశ్రీవేంకటేశు డేలుకొనె మమ్ము। పరదేవతలు మాకు బనిలేదు మీరు॥

165) భైరవి
ప॥ మఱి యెందూ గతిలేదు మనుప నీవే దిక్కు। జఱసి లక్ష్మీశ నీశరణమే దిక్కు॥
చ॥ భవసాగరంబులోబడి మునిగిననాకు। తివిరి నీనామమనుతేపయే దిక్కు।
చివికి కర్మంబునెడిచిచ్చు చొచ్చిననాకు। జవళి నాచార్యు కృపజలధియే దిక్కు॥
చ॥ ఘనమోహపాశములగాలి బొయ్యెడినాకు। కొనల నీపాదచింతకొమ్మయే దిక్కు।
కవలి మనసనెడియాకనముననున్న నాకు। కనుగొనగ నీదాస్యగరుడడే దిక్కు॥
చ॥ మరిగి సంసారమనెడిమంటికిందటినాకు। ధర భక్తియనుబిలద్వారమే దిక్కు।
యిరవైన శ్రీవేంకటేశ యిన్నిటా నాకు-। నరుదైన నీవంతరాత్మవే దిక్కు॥

166) రామక్రియ
ప॥ శ్రీపతి నీయాజ్ఞ నేనెద మిదివో। పూపలమాయల బొరలగనేలా॥
చ॥ కాయము సుఖదుఃఖములకు మూలము। పాయము యింద్రియపరవశము।
ఆయము రెంటికి నన్న పానములు। మోయనిమోపిది మొలుగగనేలా॥
చ॥ తలపు పుణ్యపాతకములమూలము। కలిగినపుట్టువు కర్మగతి।
ఫలమిది రెంటికి బలుసంసరము। కలిగిన వెట్టికి కాదన నేలా॥

చ|| జీవు డింతటా సృష్టికి మూలము | భావము బ్రకృతికి బ్రపంచము |
చేవగ రెంటికి శ్రీవేంకటేశ్వర | నీ వంతరాత్మవు నెమకగ నేలా ||

167) శ్రీ
ప|| లావణ్యశృంగారరాయ లక్ష్మీనాథ | యేవేళ నీవినోదాన కేదాయ నేమి ||
చ|| పాలజలధివంటిది పవ్వళించు నామనసు | గాలివూర్పులే కడళ్ళు కలదు లోతు |
చాలగ దొల్లి నీవు సముద్రశాయివట | యీలీల నీవినోదాన కేదాయ నేమి ||
చ|| నిక్కపుభూమివంటిది నెలవుకో నామనసు | పెక్కులిన్నియు గలవు పెరుగుచుండు |
పుక్కట దొల్లియు నీవు భూసతిమగడవట | యెక్కువ నీవినోదాన కేదాయ నేమి ||
చ|| నిండుగొండవంటి దిదె నిలుచుండు నాభక్తి | వుండుచోటనేవుండు నొక్కచోటను |
కొండలరాయడవట కోరికె శ్రీవేంకటేశ | అండ నీవినోదానకేది యాయ నేమి ||

168) రామక్రియ
ప|| మెచ్చు మెచ్చకుంటే మాను మించి నే నాడకమాన | అచ్చపునీసూత్రధారి నవధారు దేవ ||
చ|| వొక్కడ నే జీవుడను వోహో హరీ | పెక్కుబహురూపాలే పెంచి యాడితి |
తక్కినయింద్రియములే తగుమేళము | అక్కజపువిద్యవాడ నవధారు దేవ ||
చ|| సూటి నించుకంతవాడ జూడవేహరీ | వీటిసంసారపుబారి విద్య లాడితి |
పాటినాకర్మమే క్రియాభాషాంగము | ఆటవాడ నింతె నేను అవధారు దేవ ||
చ|| చేరి చిత్తగించుమీ శ్రీవేంకటేశ నేడు | మేరతో భక్తినేమోకుమీద నాడేను |
యీరానిపదవులు యిచ్చితి నాకు | ఆరితేరి గెలిచితి నవధారు దేవ ||

169) లలిత
ప|| కటకటా కర్మమా కాలములో మర్మమా | మటమాయైపోతివంటా మది నమ్మివుంటిగా ||
చ|| పాపబుద్ధి యాడనుండె పాయము రానినాడు | కోప మేడ నుండె గర్భగోళమున నున్ననాడు |
దీపన మేడ నుండె దేహధారి గానినాడు | యేపున భూమి బుట్టితే నేడనుండి వచ్చెనో ||
చ|| నగుసంసార మెందుండె నరకాననుండునాడు | తగిలి మరణదెస ధనవాంఛ లెందుండె |
వొగి లోభ మేడ నుండె వొంటి నున్ననాడు | వెగటై నేడెట్టు నన్ను వెదకి పైకొనెనో ||
చ|| బహుబంధా లేడ నుండె ప్రళయకాలమునాడు | మహి గోరికె లెందుండె మతి మఱచిననాడు |
యిహమున శ్రీవేంకటేశు శరణంటి నేడు | విహితమై మాకు నెట్టు వెఱచెనో తాము ||

170) సామంతం
ప|| హరి నీప్రతాపమున కడ్డమేది లోకమున | సరి వేరీ నీకు మరి సర్వేశ్వర ||
చ|| నీవు నీళ్ళు నములితే నిండెను వేదములు | యీవల దలెత్తితేనే యింద్రపదవులు మించె |
మోవ మూతి గిరిపితే మూడు లోకాలు నిలిచె | మోవిబార నవ్వితేనే ముగిసి రసురులు ||
చ|| గోర గీరితే కొండలెల్ల దెగబారె | మారుకొంటే బయటనే మడుగులై నిలిచె |
చేరి యడుగువెట్టితే శిలకు బ్రాణము వచ్చె | కూరిమి గావలెనంటే కొండ గొడగాయను ||
చ|| కొంగుజారినంతలోనే కూలెను త్రిపురములు | కలగి గమనించితేనే కలిదోషములు మానె |
రంగుగ నీశరణంటే రక్షించితి దాసులను | ముంగిట శ్రీవేంకటేశ మూలమవు నీవే ||

171) సాళంగనాట/మోహన
ప|| అనుచు దేవగంధర్వాదులు పలికేరు | కనకశిపు ఖండించేవేళను ||
చ|| నరసింహా నరసింహా ననుగావు ననుగావు | హరి హరి నాకు నభయమీవే |
కరిరక్ష కరిరక్ష గతమైన దనుజులు | సురనాథ సురనాథ చూడు మమ్ము గృపను ||
చ|| దేవదేవ వాసుదేవ దిక్కు నీవే మాకు మాకు | శ్రీవత్స శ్రీవత్స సేవకులము |
భూవనితనాథ నాథ పొడమె నీప్రతాపము | పావన పావన మమ్ము బాలించవే ||
చ|| జయజయ గోవింద శరణుచొచ్చేము నీకు | భయహర భయహర పాపమడగె |
దయతో శ్రీవేంకటేశ తగిలి కాచితిమమ్ము | దయజూడు దయజూడు దాసులము నేము ||

172) సాళంగం/ఖరహరప్రియ

ప॥ ఉన్న మంత్రా లిందుసరా వొగి విచారించుకొంటే । విన్న కన్న వారికెల్ల విష్ణుమంత్రము ॥

చ॥ పరగ బుచ్చకాయల బరసిపోదు మంత్రము । గరిమ ముట్టంటులేనిఘనమంత్రము ।
వరుస నెవరువిన్నా వాడిచెడనిమంత్రము । అరయనిదొక్కటేపో హరినామమంత్రము ॥

చ॥ యేజాతినోరికైనా నెంగిలిలేనిమంత్రము । వోజదప్పితే జెడకవుండేమంత్రము ।
తేజాన నొకరి కిస్తే దీరిపోనిమంత్రము । సాజమైన దిదెపో సత్యమంత్రము ॥

చ॥ యిహము బరము దానే యియ్యజాలినమంత్రము । సహజమైన వేదాలసారమంత్రము ।
బహునారదాదులెల్ల పాటపాడినమంత్రము । విహితమయినశ్రీవేంకటేశుమంత్రము ॥

173) దేసాక్షి

ప॥ మాపులే మరణములు రేపులే మరణములు । చాపలాలు మాని విష్ణు శరణము మనసా ॥

చ॥ చాలునంటే ఇంచుకంతె చాలును జన్మమునకు । చాలకున్న లోకమెల్ల జాలదు ।
వీలినయీయాసా వెట్టివానిచేతిరాయి । చాలునింక హరినిట్టె శరణను జీవుడా ॥

చ॥ పాఱకున్న పసిబాలై బడలదుమనసు । పాఱితే జవ్వనమున బట్టరాదు ।
మీఱిన నీరుకొద్దిదామెర యింతె యెంచి చూడ । జాఱవిడిచి దేవుని శరణను జీవుడా ॥

చ॥ సేయకున్న గర్మము శ్రీపతిసేవనే వుండు ।సేయబోతే గాలమెల్లా సేనాసేన ।
వోయయ్య యిది యెల్లా వుమినాకి చవుచూచుటలు । చాయల శ్రీవేంకటేశు శరణను జీవుడా ॥

174) ధన్యాసి

ప॥ దైవమా నీవే మమ్ము దయదదలచుటగాక । చేవల నీసేతలెల్ల చెల్లును లోకానను ॥

చ॥ తీపునంజేవేళ నట్టె తేటబులు సింపౌను ।పైపై బుణ్యమయితే బాప మింపౌను ।
వోపి జంతువుల కివి వొకట్కొకటి లంకె । చేపట్టి పాపము లెట్టు సేయకుండవచ్చును ॥

చ॥ కడుజలువైతేను గక్కన వేడింపౌను । చెడనివిరతివేళ సిరు లింపౌను ।
వొడలుమోచినవారి కొకటొకటి లంకె । తొడరుభోగాలు మాని తోయ నెట్టువచ్చును ॥

చ॥ యివియు నీమాయయే యిన్నియు నీయాజ్ఞలే । జవళి బ్రాణులకెల్ల సమ్మతైనవి ।
యివల శ్రీవేంకటేశ యిటు నీకే శరణంటి । తవిలి నీవేగతి దాగ నెట్టువచ్చును ॥

175) శంకరాభరణం

ప॥ వట్టిలంపటాల బడి వడ బొరలకంటే । వొట్టినవిరతి నూరకుండుటే సుఖము ॥

చ॥ పాపముమానినయట్టి బదుకొక్కటె సుఖము । కోపమువిడిచినట్టి గుణమొక్కటి సుఖము ।
చేపట్టి గురుబుద్ధి సేసేటిదే సుఖము తీ- । దీపులబడనియట్టి దినమే సుఖము ॥

చ॥ మహి జంచలములేనిమనసొక్కటి సుఖము । సహజాచారముతోడి జన్మమొక్కటి సుఖము ।
యిహపరసాధనపుయెన్ని కొక్కటి సుఖము । బహుళపుటాసకంటె పరిపాటి సుఖము ॥

చ॥ పరుల బీడించతేనిపసి డొక్కటి సుఖము । గరిమ నిజముతోడగలమాటలే సుఖము ।
ధరలో శ్రీవేంకటేశుదాసానుదాసుడయి । సరవితో నడచేటిశాంతమే సుఖము ॥

176) దేసాళం

ప॥ వారిదేపో జన్మము వడి నిన్ను దెచ్చిరి । భారతరామాయణాలై పరగె నీకథలు ॥

చ॥ భువిమీద రావణుడు పుట్టగాగా రాముడవై । తవిలి యిందరికి బ్రత్యక్షమైతివి ।
వివరింప నంతవాడు వెలసితేగా నీవు । అవతార మందితే నిన్నందరును జూతురు ॥

చ॥ రమణ గంసాదియసురలు లూటిసేయగాగా । తమి గృష్ణావతార మిందరికైతివి ।
గములై యంతటివారు గలిగితేగా నీవు నేడు । అమర జనించి మాటలాడుదు నిందరితో ॥

చ॥ యెంత వుపకారియో హిరణ్యకశిపుడు । చెంత నరసింహుడ నీసేవ యిచ్చెను ।
యింతట శ్రీవేంకటేశ యిన్నిరూపులును నీవే । పంతాన నీశరణని బ్రదికితి మిదివో ॥

177) సామంతం

ప॥ ఊరకైతే నిన్ను గాన మొకకారణాన గాని । వూరిజీవులము నీవు పురుషోత్తముడవు ॥

చ|| అసురలు భువి బుట్టుటది వుపకారమే। అసురలు బాధింతు రమరులను।
పొసగ వారికిగాను పూనుకవచ్చి నీవు। వసుధ జనించితేను వడి నిన్ను గందుము॥
చ|| అడరి ధర్మము చెడి యధర్మమైనా మేలు। వెడగుమునులు విన్న వింతురు నీకు।
తడవి ధర్మము నిల్ప ధరణి బుట్టుదు నీవు। బడి నిన్ను సేవించి బ్రదుకుదు మపుడే॥
చ|| నీకంటే మాకు జూడ నీదాసులే మేలు। పైకొని వారున్న చోట బాయకుందువు।
చేకొని శ్రీవేంకటేశ చెప్పగానే వారిచేత। నీకథలు విని విని నే మీడేరితిమి॥

178) సాళంగనాట

ప|| పేరు నారాయణుడవు బెంబాడిచేతలు నీవి। నోరు మూసుకొన్న బోదు నున్నవినీసుద్దులు॥
చ|| వేసులు మాకు జెప్ప విన భారతముగాగ। మోస నీపాలముచ్చిమి మొదలుగాను।
రాసికెక్క సుకుడు రవ్వగా బొగడజొచ్చె। ఆసల బరకాంతల నంటిననీసుద్దులు॥
చ|| రంతున వాల్మీకి చెప్పె రామాయణముగాను। సంతగా దాటకాదుల జంపినదెల్లా।
అంతకముందె నారదుడవి దండెమీటి చెప్పె। యింతటా వేటాడి జీవహింసలు సేసినది॥
చ|| వేడుక నజుడు చెప్పె వేదముగా నీవు దొల్లి। వోడక మీనై కొన్నాళ్ళుండితివంటా।
తోడనే సప్తర్షులు తొల్లియును జెప్పిరదె। యీడనే శ్రీవేంకటాద్రి నిరవైతి వనుచు॥

179) గుండక్రియ

ప|| దేహమిది యొకటే దేవుడ నీవొకడవే। యీహల రెంట దెప్పర మిదివో మాబదుకు॥
చ|| రాతి రొక్కలోకము రవ్వపడె గలలోన। ఘాతల బగలొక్కలోకము వేగితే।
యీతల రెప్పలే మర గిందుకు నందుకు జూడ। యేతుల రెంట దెప్పర మిదివో మాబదుకు।
చ|| సతికాగి లొకటే జవ్వనపుగాక రేచు। సుతకాగి లోకవేరేసుఖమై తోచు।
మతిలోనిమర గింతే మగువలే యిద్దరును। ఇతవై రెంట దెప్పర మిదివో మాబదుకు॥
చ|| దైవమా నిన్నాతుమలో దలచి యానందింతు। పూవుల నిన్ను బూజింతు పొంచి వెలిని।
శ్రీవేంకటేశ నీసేవలోని మరగింతే। యీవల రెంట దెప్పర మిదివో మాబదుకు॥

180) కేదారగౌళ

ప|| మీరు సాక్షి మీరు సాక్షి మే మేమీ ననలేము। చేరి చూడరమ్మ వీని చెల్లుబడి యమ్మా॥
చ|| పిన్నవాడు నిద్రవోగ పెనచి కూకటతోడ। పన్ని లేగతోక గూడ బంధించి కట్టె।
వున్నతి దొలగ వాని వొళ్ళెల్లా దోగిపోయ। కన్నెలార యీకృష్ణు గంటిరటరమ్మా॥
చ|| లేగల నన్నిటి నేము లేవక తొల్లె విడిచె। మూగి ఆవులుబేయలు మొగిగలయ।
ఆగి పట్ట బోతేను అప్పుడే తాగడె వెట్టి। రాగతనాన నున్నాడు రాచబలువమ్మా॥
చ|| వారము సేసేమననుచు వడి నింటివారమెట్లా। కూరలు పాశాలు దొంతిగూడబెట్టితే।
ఆరగించ వేలుపుల అలికి పూసి కుడిపీ। కూరిమి శ్రీవేంకటాద్రి గోవిందుడమ్మా॥

181) భూపాళం

ప|| ఇదివో మాయింట నేడు యింత సేసె గృష్ణుడు। అదివో మాయింటాను అంత సేసె గృష్ణుడు॥
చ|| గంట వాగకుండా నిండ గసవు దురిగి మా-। యింటివారు నిద్దిరించ నిలుచొచ్చెను।
అంటివచ్చి వొకదూడ ఆపూరి మేసితేను। గంట గణగణ వాగే గక్కన మేల్కొంటిమి॥
చ|| వొక్కరోలు దాపు పెట్టి వుట్టియెక్కి అందుమీద। చక్కెరెల్లా మెసగి మాచంటివానిని।
వుక్కబట్టి వుట్టిమీద నునిచి రోలు దీసె। చొక్కి తా నెందున్నాడో చొప్పు ఇదే కంటిమి॥
చ|| ఆవుల వెళ్ళవిడిచె నవి నేదోలు తేబోతే। నీవల దూడల దెచ్చి యింటిలో గట్టె।
దావతి నింతా వెదకి తలుపు దెరచితేను। శ్రీవేంకటేశు మాయ జిక్కి లోన నున్నవి॥

182) దేసాక్షి/వరాళి

ప|| నిజముదెలియనిమానేరమే కాక। భజననీవు చేపట్టినందు గడమా॥
చ|| అంచల బరుసము లోహపుగాళికలనెల్ల। యెంచినా పసిడి గావించుగాక।
నించిననిన్నాతుమ జింతించువారిపాతకాలు। మించనిచ్చేనా మేలే మెరయింతుగాక॥

చ|| నలువంకరవికిరణాలు మేలుగీడని। తలగీనా యిన్నిటిలో దానేకాక।
యిల నీదాసుడు జాతి నెవ్వడైనా నీకృప। జెలగి పాపము జేసి చేకొనుగాక॥
చ|| పూనినదిక్కుల గాలి పొందుగ నీడాడని। మానీనా లోకమెల్లా మలయుగాక।
మానక శ్రీవేంకటేశ మహిలో నీదాసులుండే-। దేనెలవైనా నీకిరవేకదా॥

183) భైరవి
ప|| నీవు జగన్నాథుడవు నే నొకజీవుడ నింతే। నీవలె ననుభవించ నే నెంతవాడను॥
చ|| వైకుంఠపదమే వడి గోర నెంతవాడ। యీకడ నీదాసుడనౌటిది చాలదా।
చేకొని నీసాకారచింత యేడ నేనేడ। పైకొని నీడాగు మోచి బ్రదికితి జాలదా॥
చ|| సొంపుల నీయానందసుఖ మేడ నే నేడ। పంపు శ్రీవైష్ణవసల్లాపన చాలదా।
నింపుల విజ్ఞాన మేడ నే దెలియ నెంతవాడ। యింపుగా నీకథ విను టిదియే చాలదా॥
చ|| కైవల్యమందు నీతో కాణాచి యాడ నాకు। శ్రీవేంకటాద్రిమీది సేవ చాలదా।
యీవల శ్రీవేంకటేశ నీ విచ్చినవిజ్ఞానమున। భావించి నిన్ను బొగడే భాగ్యమే చాలదా॥

184) మలహరి/ద్విజావంతి
ప|| అనంతాపరాధి నేను అటుగాను శరణంటిని। యెనలేనినీగుణాలు యేమిచూచేనయ్యా॥
చ|| దగ్గరి కొలుతు నాతరతమ్య మెంచుకోను। సిగ్గువడ నిట్టే నిన్ను జేరి పాడుదు।
వొగ్గి విన్నపాలు సేతు వుబ్బున జిత్తమెరగ। యెగ్గు లెంచితే నావల్ల నెన్ని లేవయ్యా॥
చ|| పాదాలంటి మొక్కుదును పరిశుద్ధి దలచను। సాదించి కొలువవత్తు సత్వ చూడను।
యేదెసనైనా నుతింతు యెంగిలినోరని మాన। పాదుగా విచారించితే బలు మూఢుడనయ్యా॥
చ|| మంచముపై దలపోతు మందెమేళమనియన। కంచముకూడర్పింతు గాదననేర।
యెంచగ శ్రీవేంకటేశ యిన్నిటా నీబంట నైతి। పంచల జూచితే నీపాలివాడనయ్యా॥

185) ముఖారి
ప|| ఇదియే బుద్ధి నాకు నింతకంటే మఱి లేదు। కదిసి నీబంటనంటే కాతువు నన్నును॥
చ|| నేరిచి నడచేనంటే నే గాను స్వతంత్రుడను। నేరమి చేసేనంటే నిండును దూరు।
యీరెంటికి గాక నేను యిట్టె నీకు శరణంటే। గారవించి వహించుక కాతువు నన్నును॥
చ|| వొక్కచో నర్థ మార్జించుకుండితే జన్మాలు పెక్కు। యెక్కేనంటే మోక్షము యేడో యెఱుగ।
యెక్కడిసుద్దులునేల యిచ్చట నీనామము। గక్కన బేర్కొంటే దయ గాతువుగా నన్నును॥
చ|| తపసినయ్యేనంటే జితము కైవశము గాదు। చపలసంసారి నైతే శాంతి యుండదు।
ఉపమలేల శ్రీవేంకటోత్తమ నీసేవ చేసి। కపటము మానితేను కాతువు నన్నును॥

186) శంకరాభరణం
ప|| ఆహా యేమిచెపేది హరి నీమాయ। మోహములే చిగిరించి మొదల జవ్వనము॥
చ|| యెంచగ భూమి యొక్కటే యేలినరాజు లెందరో। పొంచి వారివెంటవెంట బోవదాయను।
అంచలసూర్యచంద్రులనే గడెకుడుకల। ముంచి కొలచి పోసీని మునుకొని కాలము॥
చ|| దేవలోక మొక్కటే దేవేంద్రు లెందరో। కైవశమై యేలగ నొక్కరిదీ గాదు।
ఆవటించి పంచభూతాలనేటిశాఖలు వెళ్ళి। సావధాన బెరిగి సంసారవృక్షము॥
చ|| యిచ్చట నీ వొక్కడవే యిటు నీదాసు లెందరో। తచ్చి యెంత సేవించినా దనివిలేదు।
నిచ్చలు శ్రీవేంకటేశ నిధానము నీభక్తి। యెచ్చినాడ వింతటా నీడేరీ జన్మము॥

187) వరాళి
ప|| ఇతరుల దూరనేల యెవ్వరూ నేమిసేతురు। మతి వారూ దమవంటిమనుజులేకాక॥
చ|| చేరి మేలుసేయ గీడుసేయ నెవ్వరు గర్తలు। ధారుణిలో నరులకు దైవమేకాక।
సారె దనవెంట జనుదెంచేవా రెవ్వరు। బోరున జేసినపాపపుణ్యాలేకాక॥
చ|| తొడగి పొగడించాను దూషించా ముఖ్యులెవ్వరు। గుడిగొన్న తనలోనిగుణాలేకాక।
కడుగీర్తి నపకీర్తి గట్టెడివా రెవ్వరు। నడచేటితనవర్తనములేకాక॥

చ|| ఘనబంధమోక్షాలకు కారణ మిక నెవ్వరు। ననిచిన జ్ఞానాజ్ఞానములే కాక।
తనకు శ్రీవేంకటేశు దలపించేవా రెవ్వరు। కొనమొద లెఱిగినగురుడేకాక॥

188) దేసాళం/తోడి

ప|| అక్కటా నే నిర్మలుడనయ్యే దిక నెన్నడో। చక్క నన్ను దిద్దుకోవే సర్వేశ్వరా॥
చ|| నేనే మంచివాడనైతే నిండుకోదా జ్ఞానము। కానీలే యింకా నేమేమిగడమోకాక।
ఆనుక సుకృతినైతే నలవడదా విరక్తి। కానరానితప్పు లెన్న గలవోకాక॥
చ|| నామనసే చక్కనైతే నాకు బ్రత్యక్షము గావా। చేముంచి నేరమేమి సేసితినోకాక।
ఆముక మోక్షాధికారి నైతే నెదురుగా రాదా। కామితార్థాలు భోగించ గలుగబోలుగాక॥
చ|| ఔరే నామేను పవిత్ర మైతే సేవ గొనవా। యేలాగున్నదో నీచిత్త మెఱగగాక।
యీలీల శ్రీవేంకటేశ యెదుటనే వున్నాడవు। యేలుకొని చేపట్టి యీడేర్చేవుగాక॥

189) శ్రీ

ప|| చొచ్చితి నీకు శరణు సుద్దు లికనేటికి। కచ్చుపెట్టెవ్వరివల్లా గలిగే దేమీ॥
చ|| పుట్టుక మునుపెఱుగ పుట్టుగు మీదెఱగను। యిట్టె యప్పటి యెఱుగ యేడ కెక్కేని।
పట్టె మదనుభూతము పరసిపోయను బుద్ధి। వట్టిపెద్దతనాలను వచ్చేదేమి॥
చ|| రానివి రప్పించగ నేరను వచ్చే వాపనేర। తానకపునాస్వతంత్ర మెందాక వచ్చును।
ఆనుకున్నది ముదిమి అట్టె జారె శాంతము। నేనెంత విఙ్ఞవీగినా నిండేదేమి॥
చ|| యిప్పుడు నే నెవ్వడనో యెక్కడ నీవున్నాడవో। కప్పిననావుపాయాలే కార్య మిచ్చీని।
నెప్పున శ్రీవేంకటేశ నీయెదుట బడ్డపని। తప్పక యీడేర్తుగాక తలపోసేదేమి॥

190) కన్నడగౌళ

ప|| చేసిననావిన్నపము చిత్తాన బెట్టుకొమ్మీ। వేసరించి యిప్పుడే నే వేడుకొంటిజుమ్మీ॥
చ|| ముందె నాపుణ్యఫలములు నీకిచ్చితినంటి। కందుక గోరనని సంకల్పించితిని।
యిందు మఱచి తప్పినా యిన్ని నీకె సెలవు। నిందవేసి నన్ను నిక నేరము లెంచకుమీ॥
చ|| నిన్నే కాని యితరుల గొలువనొల్ల నంటి। వున్నతి బరద్రవ్యా లొల్లనంటి।
అన్నిటా నేనే మఱి యప్పటిమాటే యందు। సన్నల నన్నందుకు నొచ్చమని దూరకుమీ॥
చ|| నానావుపాయాల నాడే శరణంటి। పూని నీసాకారమునే బొడగంటిని।
నేను మత్తుడనై వున్నా నీవే తలచి తెలుపుకో। కోనేటిశ్రీవేంకటేశ కొసరించుకోకుమీ॥

191) శుద్ధవసంతం/రాగమాలిక

ప|| దీనరక్షకు డఖిలవినుతుడు దేవదేవుడు రాముడు।
జానకీపతి గొలువుడీ ఘనసమరవిజయుడు రాముడు॥
చ|| హరునితారకబ్రహ్మమంత్రమై యమరినయర్థము రాముడు।
సురల గాచి యసురల వడచినసూర్యకులజుడు రాముడు।
సరయువందును ముక్తిచూరలు జనుల కొసగెను రాముడు।
హరియై యీతడు హరియెంచుల కాదిపురుషుడు రాముడు॥
చ|| మునులరుషులకు నభయమొసగిన మూలమూరితి రాముడు।
మనసులోపల బరమయోగులు మరుగుతేజము రాముడు।
పనిచి మీదటిబ్రహ్మపట్టము బంటు కొసగెను రాముడు।
మనుజవేషముతోడ నగజకు మంత్రమాయను రాముడు॥
చ|| బలిమి మించినదైవికముతో భక్తసులభుడు రాముడు।
నిలిచి తనసరిలేనివేలుపు నిగమవంద్యుడు రాముడు।
మెలుపు శ్రీవేంకటగిరీంద్రముమీదిదేవుడు రాముడు।
వెలసె వావిలిపాటిలోపలివీరవిజయుడు రాముడు॥

192) బౌళి/రాగమాలిక

***

ప॥ తెలిసినమాటలు నీసముఖంబున దీకొని నిన్నడుగకపోదు।
సులభుడ వన్నిట ప్రాణనాథుడవు చొప్పుగ నాగతి యియ్యగదే॥
చ॥ నీవే బలవంతుడవో నీకంటే గర్మము బలువో।
కైవసముగ నే నెంచిచూచితే కర్మముకంటె బలుపుడవు।
భూవలయంబుల ప్రారబ్ధంబులు భోగించవలెనని యంటినా।
వావిరి నిట్లైతే నీదేవత్వమునకు వెలితిగదే॥
చ॥ ఐనాగాని లోకములోపల నది నీయాజ్ఞని తలచితిమా।
నేను నీశరణు చొచ్చినమీదట నీవే పరిహరించగవలదా।
కానిపించె నాకిక నొకబుద్ధి కర్మముపై నెప మటువేసి।
పూనుచు గాలక్షేపంబునకై భువిని వినోదము గాబోలు॥
చ॥ యెందాకా జీవులతోడుత నీ వేలాటంబులు జరపెదవు।
అందరికిని నీవే తల్లిదండ్రివి అయి రక్షింపుచున్నాడవు।
కందువ దెలిసెను శ్రీవేంకటేశ్వర కర్త వెట్టు చేసిన మేలు।
చందమాయ నిది దగవౌ నీకును సంతోషించితిమిటు నేము॥

193) వరాళి
ప॥ ఏమని పొగడవచ్చు నిటువంటిది నీమాయ। కామించి బ్రహ్మాదులకు గప్పీ నీమాయ॥
చ॥ బచ్చెనరూపులు పెక్కు పడెచ్చుల వేసినయట్లు। నిచ్చల నినుచున్నది నీమాయ।
తచ్చి వారివారిరతి తమతమకే తెలియ। పచ్చిగా భోగింపించీ దంపతుల నీమాయ॥
చ॥ మఱి తొలునాటిభోగాలు మరునాటికి వింతగా। నెఱవుగా దమకించీ నీమాయ।
విఱుచరానిదుఃఖము వెస నిద్రవోయితేనే। మఱపించీ నవ్వించీ మహిలో నీమాయ।
చ॥ పట్టరాని జవ్వనము పరసిపోతే ముదిమి। నెట్టుకొని వుబ్బడచీ నీమాయ।
గట్టిగా శ్రీవేంకటేశ ఘనుడవైన నీదాసుల। పట్టకుండా జేయుచు బలిసెనీమాయ॥

194) నాట
ప॥ ఎంత కఠినమో హృదయమిది। చెంత ఆతజేసిరి గాబోలు॥
చ॥ అమర బురాణములందు నరకముల-। క్రమములు చదివియు గలంగవు।
యమకింకర ఘోరాకృతులటు విని। భ్రమసి యించుకా భయపడ నేను॥
చ॥ మనుజులదారుణ మహితకర్మముల-। అనుభవములు గని యలయును।
వొనర మహోగ్ర యహోరాత్రంబులు। చనుచుండగా జడియను నేను॥
చ॥ కలుషరౌద్రదుఃఖముల కించుకా। కలగను చీరికి గైకొనను।
యెలమిని శ్రీవేంకటేశుడ నాపాల। గలిగి కాచితివి గానిల నేను॥

195) రామక్రియ/రాగమాలిక
ప॥ పాటెల్లా నొక్కచో నుండు భాగ్య మొక్కచో నుండు। యీటువెట్టి పెద్దతనా లెంచ బనిలేదు॥
చ॥ సరవి గలకాలము జదువుచుండు నొకడు। గరిమి నీకృప నిన్ను గను నొకడు।
ధర బ్రయాసముతోడ దపముసేయు నొకడు। శరణుచొచ్చి నీకు జనవరౌ నొకడు॥
చ॥ వొక్కడు మోపుమోచు నొక్కడు గొలువుసేయు। వొకడు పొగడీ త్యాగ మూరకే యందు।
వొక్క డాచారము సేయు నొక్కడు మోక్షము గను। యెక్కడా నీకల్పన కేమిసేయవచ్చును॥
చ॥ భావించ నటుగాన ఫలమెల్లా నీమూలము। యేవలనైనా నీవు యిచ్చితే గద్దు।
జీవులు నిన్నె ఱుగక చీకటి దవ్వగనేల। శ్రీవేంకటేశ్వర నిన్ను సేవించేదే నేరుపు॥

196) రామక్రియ/రాగమాలిక
ప॥ అందుకల్లా లోనుగాక అట్టే యెచ్చరికతోడ। పొందుగా హరి దలచేపురుషుడే ఘనుడు॥
చ॥ చలములు పుట్టించ సారె మచ్చరము రేచ। కలుగు నానావిధకారణములు।
తలపులు భ్రమయించ తగువేడ్క లొనరించ। పలుమా రెదుట నిల్చు బహురూపాలు॥

***

*****

చ॥ తగవులు దిద్దించ తగ నలమటబెట్ట। తగులు ననేకబంధములెల్లాను।
పగసాధింపించ నప్పటి నుపాయాలు నేర్ప। నిగిడివచ్చు ననేకనెపములెల్లాను॥
చ॥ తేరకే మేనలయించ దేశమెల్లా నావటించ। వూరకే తోచు ననేకవుద్యోగాలు।
కోరి శ్రీవేంకటేశ్వరు గొలిచి నిశ్చింతుడైతే। ఆరయ మతిలో నిండు నానా దాలు॥

197) మాళవిగౌళ/ఖరహరప్రియ
ప॥ నేరగల దొక్కటె నిశ్చలబ్రహ్మవిద్య। వారివారియంతర్యామే వచ్చి పెరరేచీని॥
చ॥ వొక్కరు నేర్పగవద్దు వొగి సంసారధర్మము। దిక్కై పుట్టించినప్రకృతియు నేర్పీని।
గుక్కడ జంతులు చన్ను గుడుప నేరుపవద్దు। చక్కగా ననాదివాసనలే నేర్పీని॥
చ॥ అంచ నెవ్వరు నిద్రవొమ్మని బుద్ధిచెప్పవద్దు। మించి వారితమోగుణమే కప్పీని।
కొంచక భుజియించుమని కోరి యచ్చరించవద్దు। పెంచినతనయాకలే పిలిచి తెచ్చీని॥
చ॥ అట్టె పనివాటల అలవాటు చూపవద్దు। యెట్లైనా తనజాతే సేయిపించీని।
వొట్టుక శ్రీవేంకటేశు డున్నాడు కోనేటిదండ। పట్టికొలిచినవారే భాగ్యవంతు లిలను॥

198) భైరవి
ప॥ ననుజూచి హరి నీవు నవ్వకుండేవా। పనిమాలెంత బయలుపాకీ నామనసు।
చ॥ మనసుకు గోచరమా మాటలకు గోచరమా। కనుగొన వసమా నీఘనరూపము।
నిను వెదుకుచున్నాడ నీవెక్కడ నేనెక్కడ। జనుడ నింతె యెంత సాహసము నాది॥
చ॥ వున్నచో టెఱుగుదునా వోయీ అంటే బలికేవా। యెన్ని తెలియదరమా యిట్టి నీమాయ।
అన్నిటా నీకొలువుసేయ గడగుచున్నవాడ। యెన్నటిపొందు నీవు నాకెంత దిట్టతనమో॥
చ॥ వాకిలి గానవచ్చునా వంచించి చొరవచ్చునా। రాకపోక కబ్బునా పరమపదము।
శ్రీకాంతుడ ప్రత్యక్షమై శ్రీవేంకటాద్రి యిదె। కైకొంటి నీకృప నెంత గట్టువాయతనమో॥

199) శంకరాభరణం
ప॥ అది నే నెఱుగనా అంతలో భ్రమతుగాక। మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే॥
చ॥ యెంత లోకానుభవము అంతయు వ్రిథా నష్టి। కొంతైనా బ్రహ్మచింత కోటిలాభము।
వింతైనజనులతోడివినోదము నిష్ఫలము। చెంత సజ్జనసంగతి చేరినయాదాయము॥
చ॥ నానాదేశవార్తలు నడుమ జింతామూలము। పూనినపురాణగోష్టి పుణ్యమూలము।
ఆనినకృషివాణిజ్యాలన్నియు దీరనివెట్టి। మాననియాచార మాత్మకు బడ్డపాటు॥
చ॥ పలుచుట్టరికములు బట్టబయలుతగుళ్ళు। చెలగునాచార్యసేవ జీవన్ముక్తి।
బలిమి శ్రీవేంకటేశ పరగ రెండువిధాలు। నిలుకడయినవాడవు నీవే యిన్నిటికి॥

200) దేవగాంధారి
ప॥ ఒక్కడే మోక్షకర్త వొక్కటే శరణాగతి। దిక్కని హరి గొల్చి బదికిరి తొంటివారు॥
చ॥ నానా దేవత లున్నారు నానాలోకము లున్నవి। నానావ్రతా లున్నవి నడచేటివి।
జ్ఞానికి గామ్యకర్మాలు జరపి పొందేదేమి। ఆనుకొన్న వేదోక్తాలైనా నాయగాక॥
చ॥ వొక్కడు దప్పికి ద్రాపు వొక్కడు కడవ నించు। వొక్క డీదులాడు మడుగొక్కటియందే।
చక్కజ్ఞానియైనవాడు సారార్థము వేదమందు। తక్కక చేకొనుగాక తలకెత్తుకొనునా॥
చ॥ యిది భగవద్గీతార్థ మిది యర్జుననితోను। యెదుటనే వుపదేశమిచ్చె గృష్ణుడు।
వెదకి వినరో శ్రీవేంకటేశుదాసులాల। బ్రదుకుద్రోవ మనకు పాటించి చేకొనరో॥

201) లలిత
ప॥ ఎన్నటికి జీవుడిక నీడేరేది। పన్ను కొనేటి చింతలే బలిసీగాని॥
చ॥ కలరు వివేకులు కలదిటు ధర్మము। కలడు దైవము నేడు గావలెనంటే।
వలపనిసందేహాన వట్టిజాలిబొరలేటి। తలపోత లేమిటికో తడబడీ గాని॥
చ॥ వున్నవి వేదశాస్త్రాలు వున్నది విశ్వాసము। వున్నవా డాచార్యుడు వుపదేశించ।
తన్నుదానే మోసపోయి తత్వము నిశ్చయించక। మిన్నక చంచలమే లో మెరసీ గాని॥

*****

చ|| యివిగో పుణ్యనిధులు యిదిగో సంకీర్తన। వివరింప వీడిగో శ్రీవేంకటేశుడు।
భవములచే భ్రమసి బహుసంగతులచేత। యివల నామన సిప్పుడెఱిగీ గాని॥
202) గుజ్జరి/రాగమాలిక
ప|| అన్నియు నడగవే నేనే మఱచితి నవి హరి నీకే తెలిసినవి।
మన్నించి నాకీజన్మ మొసగితివి మర్మగాడు మన్మథు డొకడు॥
చ|| పలుజన్మముల నే ద్రాగినచనుబాలు గొలచితే నెన్నౌనో।
తలిదండ్రులు మరియెందరో తామెక్కడ నున్నారో।
తలకింపగ నాహారంబునకును తెగినకొలుచులవి యెన్నెన్నో।
యిలపై నే బ్రదికినకాలము యెంతని వ్రాసెనో చిత్రగుప్తుడు॥
చ|| చినుగుగ జినుగగ గట్టుకోకలకు జెల్లినపత్తి దానదియంతో।
కనకమెంతో నాకాభరణములై కాయంబులతో నొరిసినది।
పెనగి రమించిన కామినీమణుల పేరులెన్నియో తొల్లిటివి।
ఘనముగ నను నిటు భోగించ జేసినకర్మమే యెఱుగు నివియెల్లా॥
చ|| గరిమల నే గడియించినయిండ్లు గాణాచిచోట్లు యేడేడో।
పొరలినయిడుమలు యెందుకెక్కెనో పొదలితి భువిపై నిన్నాళ్ళు।
అరయగ నందరి కంతర్యామివి అఖిలకారణంబును నీవే।
నిరతపు శ్రీవేంకటేశ్వర దయగలనీచిత్త మెటువలె దలచీనీ॥
203) మలహరి/రాగమాలిక
ప|| దైవమా నీపేరరేపణ లివి తప్పక వున్నవి జీవులకు।
భావించి కాదనిదొబ్బి దీకొనగ బ్రహ్మాదులకైనను వసమా॥
చ|| యెక్కడ సిద్ధించు బ్రహ్మచర్యము యెదుటనే కొండల జూచినవేళను।
చక్కగా మనోవ్యభిచారంబున జలియించుగాక।
దిక్కనే విరతి ధనధాన్యంబులు చేతికి బోవయిన జూచి।
వొక్కటియై తా నండే మగ్నమునొందించుగాక॥
చ|| కలుగునే తనివి బహుపదార్థములు గక్కన నంగళ్ళను జూచి।
కొలదిమీఱ గడుతీపులతో కోరుచు నోరూరుగాక।
వలనుగ సమాధి యెటువలె దొరకును వాజవారణంబుల జూచి।
యెలమితోడ ముంగిళ్ళనెల్ల జరియింపించు గాక॥
చ|| యేరీతి నెలకొను నీమీదితలపు యిహలోకసౌఖ్యము చూచి।
భారపులంపటములు పై దగిలించి పనులకు బురికొలుపు గాక।
ధారుణి నేనివి గెలుచుట యెన్నడు తగ శ్రీవేంకటనాయక నీవే।
గారవించి రక్షింపుము నీకిది కడు నుపకారంబౌగాక॥
204) ఆహిరి
ప|| ఎంత మహిమో నీది యెవ్వరి కలవిగాదు। చింతించితే దాసులకు జేపట్టుగుంచమవు॥
చ|| వూరకే నిన్నెవరికి యుక్తుల సాధింపరాదు। సారెకు దర్కవాదాల సాధింపరాదు।
ఆరసి వెదకి ఉపాయముల సాధింపరాదు। భారములేనియట్టి భక్తిసాధ్యుడవు॥
చ|| మిక్కుటపుసామర్థ్యాన మెరసి తెలియరాదు। దిక్కరించి నేర్పుల దెలియరాదు।
వెక్కసాన భూముల వెదకి తెలియరాదు। మొక్కి నీకు శరణంటే ముందర నిలుతువు॥
చ|| చెలరేగి తపముల చేసినా నెఱుగరాదు। యిల నెన్ని చదివినా నెఱగరాదు।
నెలవై శ్రీవేంకటేశ నీదాసానుదాసుల। గొలిచితే జాలు గక్కున గృపవేతువు॥
205) కన్నడగౌళ
ప|| నీవు నన్ను రక్షించితే నింద నీపై బడదు। భావించి నన్నేళ్ళైనా బ్రదికించుకొనవే॥

చ|| సంతతము నన్నెంచితే సర్వాపరాధి నేను | యెంత నీ వేమిచేసినా నంత కర్తుత |
అంతటిలోక జననియైనలక్ష్మి జూచి కాని | అంతరాత్మ నిన్ను జూచియైనా మన్నించవే ||
చ|| కల వెన్నైనా దప్పులు కనుగొన నావల్ల | చెలగి యందుకు బ్రాయశ్చిత్తము లేదు |
అలి నాభుజము చక్రలాంఛనము చూచి కాని | అల నానోరిమంత్రమైనా జూచి యేలుమీ ||
చ|| మతి నిన్నె ఱిగేనంటే మదోన్మత్తుడ నేను | గతి యేది నాకు శ్రీవేంకటగిరినాయక |
సతతము నీబిరుదు సారెకు జూచి కాని | ప్రతిలేనిదయయైనా భావించి చేకొనవే ||

206) సాళంగనాట/అఠాణ
ప|| ఏమని తలచవచ్చు నిటువంటి నీచిత్తము | దీమసాన నీభావము తెలియ దెవ్వరికి ||
చ|| రవిచంద్రగ్రహతారకములకు దెరువు | వివరించ నున్నదా నీవే యాధారముగాక |
పవనునికి భువికి పదునాలులోకముల- | కవల వేరొకచోట నాధార మున్నదా ||
చ|| తిలకింప గులాచలదిగ్గజశేషాదులకు | నిలువ జోటున్నదా నివే యాధారముగాక |
నలుదిక్కులకు గగనమునకు మేఘాలకు | కలది నీయాధారమేకాక వేర వున్నదా ||
చ|| అనంతబ్రహ్మాండముల కట్టే నీరూపములకు | వెనుకముందున్నదా నీవే యాధారముగాక |
వినుతి కెక్కినశ్రీవేంకటేశ నీకు నీవే | మనికైనయాధారము మఱి యెంచ నున్నదా ||

207) పాడి/కేదారగౌళ
ప|| విష్ణుడే యింతానని భావించుటే బుద్ధి | వైష్ణవుడై యాచార్యసేవసేయుటే బుద్ధి ||
చ|| కొండవంటితనలోనికోపము రేగ వచ్చితే | దండనే యెచ్చరి వూరకుండుటే బుద్ధి |
మెండుగా బరకాంతల మీదితమి పుట్టితేను | అండుకాచందుకు భ్రమయకుండుటే బుద్ధి ||
చ|| అట్టె యెవ్వరయినా గృహారామాదులపై నాస | పుట్టించితే వానివెంట బోనిదే బుద్ధి |
చుట్టపుసమ్మంధాన సోకితే పరబాధలు | చుట్టుకోక లోనుగాక జునుగుటే బుద్ధి ||
చ|| తప్పదింతా దైవికమే తనవద్దనున్నవారి | దప్పులుపట్టనిదే తగిన బుద్ధి |
యెప్పుడూ శ్రీవేంకటేశు డెదలోన నున్నవాడు | చొప్పెత్తి యాతనిమూర్తి చూచుటే బుద్ధి ||

208) కన్నడగౌళ
ప|| సకలమైనవారికి సహజ మిది | అకటా యెట్టు గల్పించి ఆడించేవు దేవుడా ||
చ|| తనియ కొరులచక్కదనమే చూచుగాని | తనభావము తనకు దలపు గాదు |
చొనిపి యౌవ్వనపుసుద్దులే చెప్పుగాని | పొనిగి తనవయసు పోవుట దెలియదు ||
చ|| దారుపాషాణబుద్ధులు దైవముపై బెట్టుగాని | యారీతినే తనదేహ మెంచుకొనడు |
వూరిలోని మాటలెల్లా వుగ్గడించబోవుగాని | కారణపుతనజన్మకథలు దడవడు ||
చ|| వేడుకతో విషేపాలు వెదుకగోరుగాని| ఆడనే ఆత్మనిక్షేప మది వొల్లడు |
వీడక శ్రీవేంకటేశ వెలయ నీదాసులకు | తోడదోడ దెలుపుచు తోడయి రక్షింతువు ||

209) ముఖారి
ప|| వెలుపల వెదికితే వెస నాత్మ గనునా | పలుమారు నిదే యభ్యాసము గావలెను ||
చ|| యిన్ని చింతలు మఱచి యింద్రియాల గుదియించి | పన్నివుండినహృదయపద్మమందును |
యెన్న నంగుష్ఠమాత్రపుటీశ్వరుపాదాలకింద | తన్ను నణుమాత్రముగ దలచగవలెను ||
చ|| పలుదేహపుగాళ్ళ బరువులు వారక | బలుదేహపుటింటిలోపల చొచ్చి |
చలివేడి బొరలక సర్వేశుపాదాలకింద | తలకొన్నదన్ను దానె తలచగవలెను |
చ|| కైకొన్నభక్తితో నిక్కపుశరణాగతితో | చేకొని విన్నపములు చేసుకొంటాను |
యేకాంతాన శ్రీవేంకటేశుపాదాలకింద | దాకొని తన్ను దానే తలచగవలెను ||

210) శ్రీ
ప|| ఇంతేకాని తెలిసితే నెవ్వరూ గర్తలు గారు | బంతినే వీని కెప్పుడు బ్రకృతి గారణము |
చ|| యివిగో గుణాలు మూడే యింద్రియాల గూడుకొని | భువి బ్రాణులనెల్లాను పూచి పనులుగొనేవి |
కవిసి కర్మములై ఘనలోకాల దిప్పేవి | ఆవల బుట్టుగులకు నప్పటి దెచ్చేవి ||

చ॥ పంచభూతా లివియే పరగ జీవులకెల్లా । దించరాక యెప్పుడును దేహాలయ్యేవి ।
అంచెల గంచములో బదార్థములై వుండినవి । తెంచరానిపాశములై తీపులబెట్టేవి ॥
చ॥ మనసొక్కటే జంతులమర్మములు రేచేది । తనుభోగములలోన దనివిచ్చేది ।
అనయము శ్రీవేంకటాధిప నీమహి మిది । నిను గొల్చినదాసుల నెరవేర్చేది ॥

211) దేసాళం
ప॥ భావించలే రెవ్వరును బయలువాకేరుగాని । నీవే గుఱుతు మాకు నీరజనాభ ॥
చ॥ కైవల్య మెట్టుండునో నిక్కపుజ్ఞాన మెట్టుండునో । దైవిక మెట్టుండునో తలచరాదు ।
జీవన మెట్లుండునో చిత్తమేరీతినుండునో । ఆవిధ మెవ్వరి కిట్టిట్టనగరాదు ॥
చ॥ వేదము లెట్టుండునో విరతి యెట్టుండునో । ఆది నంత మెట్టుండునో అరయరాదు ।
భేద మనే దెట్లుండునో అభేద మది యెట్టుండునో । సోదించి యెవ్వరికిని చూడగరాదు ॥
చ॥ ఫల మెట్లానుండునో భక్తి యెట్లానుండునో । తెలివి యెట్టుండునో సాధించగరాదు ।
యిలపై శ్రీవేంకటేశ యిటు నీశరణుచొచ్చి । నిలుకడై వున్నారము నీకృప యికను ॥

212) గౌళ
ప॥ ఒడబరచుకొంటిని వుపేంద్ర నిన్ను నిపుడె । చిడిముడి నీసేవకే నెలవుచేసుకొమ్మీ ॥
చ॥ కన్నుల నే జూచేదెల్లా కమలాక్ష నీపాదాలే । విన్న వినుకులెల్లా విష్ణుడ నీకథలే ।
తిన్న నినామాటలెల్లా త్రివిక్రమ నీమంత్రాలే । అన్నిటా నాభావము సమర్పణము నీకును ।
చ॥ అట్టె నే నడచేవెల్లా హరి నీప్రదక్షిణాలే । గుట్టున నాసేతలెల్లా గోవింద నీకైంకర్యాలే ।
ముట్టి నేభుజించినవి ముకుంద నీప్రసాదాలే । నెట్టన నాభోగమెల్లా నీవసము చేసితి ॥
చ॥ యిల నే బండబడేవి యీశ్వర నీకు మొక్కులే । తలచే నాతలపెల్లా దామోదర నీధ్యానమె ।
నలువంక శ్రీవేంకటనాయక నీయనుజ్ఞను । నెలవై నాభవములెల్లా నీసొమ్ము చేసితి ॥

213) కన్నడగౌళ
ప॥ నిన్ను నమ్మి విశ్వాసము నీపై నిలుపుకొని । వున్న వాడ నిక వేరే ఉపాయ మేమిటికి ॥
చ॥ గతియై రక్షింతువో కాక రక్షింవోయని । మతిలోని సంశయము మఱి విడిచి ।
యితరులచే ముందర నిక నెట్టౌదునోయని । వెతతోడ దలచేటివెఱపెల్లా విడిచి ॥
చ॥ తిరమైననీమహిమ తెలిసేవాడననే- । గరువము తోడివుద్యోగము విడిచి ।
వెరవున నీరూపు వెదకి కానలేననే- । గరిమ నలపు నాస్తికత్వమును విడిచి ।
చ॥ ధ్రువమైననాచేతను తోడుదెచ్చుకొనేననే । ఆవల నన్యులమీదియాస విడిచి ।
వివరిం చలమేల్మంగవిభుడ శ్రీవేంకటేశ । తవిలితి నాపుణ్యమంతయు నీకు విడిచి ॥

214) లలిత
ప॥ భ్రమయకవుండేదే పరమార్థము । నెమకితే నన్నిటాను నీవే వుండుదువు ॥
చ॥ వసుధలో బురుషులవనితలరూపులు । వెస మాయయంత్రపువెరబొమ్మలు ।
ముసరి యొండొంటికి మోహించేమోహములు । అసురసురయ్యేయింద్రియావేశములు ॥
చ॥ తగినతమలో చక్కదనాలు వయసులు । పగటురక్తమాంసాలపరిపూర్ణులు ।
జిగి నిందుకుగా బుట్టేచిత్తవికారములు । నిగుడుచు బయలువన్నినయట్టిపురుషులు ॥
చ॥ లలి మీరి యన్యోన్యవిలాసములు భోగములు । పలవని మొయిలులేనివానజల్లు ।
యెలమి శ్రీవేంకటేశ యివెల్లా నీదాసులకు । దెలిపి బ్రహ్మానందము తిరముగా నిత్తువు ॥

215) పాడి
ప॥ దైవముతోడిదే తనతగులు । జీవుడిది యెఱిగితే చిక్కనీదు తగులు ॥
చ॥ కన్నుల జూచినంతనే కలుగును దగులు । మిన్నక మాటలాడితే మిగులా దగులు ।
పన్నుగా నవ్వితేను పాదుకొను దగులు । యెన్నైనా నూరకుండితే నేమీ లేదు దగులు ॥
చ॥ వీనులొగ్గి వినబోతే విశ్వమెల్లా దగులు । ఆనకసహవాసాన నంటుకొను దగులు ।
పూని లోకులపొందుల పొదిగొను తగులు । మోనాన నూరకుండితే మొగియదు తగులు ॥

చ॥ కరుణించి యేమిచ్చినా గట్టియవును దగులు। దొరతనాన మించితే తొడరును తగులు।
ధరణి శ్రీవేంకటేశు దలచి యేకాంతాన-। నిరవై వూరకుండితే నెనయదు తగులు॥

216) సామంతం

ప॥ ఇందరూ జీవులే యెంచి చూచితే-। నందులో భావము లవియే వేరు॥
చ॥ అంతట జూచిన యాహారనిద్రలు। జంతురాసులకు సహజములు।
సంతోషంబును సాత్వికగుణమును। శాంతచిత్తులకు సహజములు॥
చ॥ మనసునగలకామక్రోధంబులు। జననశీలులకు సహజములు।
వినయంబును ఘనవిజ్ఞానము స-। జ్జనుల కెప్పుడును సహజములు॥
చ॥ విడువనియాసలు వేవేలుచింతలు। జడులకు నెందును సహజములు।
బడి శ్రీవేంకటపతికొలువుదపము। జడియవిదాసులసహజములు॥

217) శంకరాభరణం

ప॥ కలది యీమూర్తివల్ల గతి గనవలెను। యిల నిందు నమ్మకుంటే యెందు మరి లేదు॥
చ॥ కంటిమా బ్రహ్మమును వేంకటపతి గనినట్టు। కంటిమా అవతారాలు కతలెకాక।
కంటిమా హృదయములో గలిగినదైవమును। కంటిమా వైకుంఠము కడవారైనాను॥
చ॥ తెలిసీనా జ్ఞానము యీదేవునిమహిమవలె। తెలిసీనా వేదాలు సందేహమేకాక।
తెలిసీనా మాయ యిది యెంత చదివినా। తెలిసీనా ముందరితెరువు వెదకితే॥
చ॥ చిక్కీనా మనసు యీశ్రీవేంకటేశ్వరునివలె। చిక్కీనా ధ్యానము వట్టిచింతలేకాక।
చిక్కీనా అనాదినుండి చిగిరించీకాలము। చిక్కీనా పెద్దలు చెప్పేజితమైనశాంతి॥

218) నాట

ప॥ అందరిలోన నెక్కుడు హనుమంతుడు। కందువ మతంగగిరికాడిహనుమంతుడు॥
చ॥ కనకకుండలాలతో కౌపీనముతోడ। జనియించినాడు యీహనుమంతుడు।
ఘనప్రతాపముతోడ కఠినహస్తాలతోడ।పెనుతోక యెత్తినాడు పెద్దహనుమంతుడు॥
చ॥ తివిరి జలధిదాటి దీపించి లంకయెల్లా। అవలయివల సేసె హనుమంతుడు।
వివరించి సీతకు విశ్వరూపము చూపగా। ధృవమండలము మోచె దొడ్డహనుమంతుడు॥
చ॥ తిరమైనమహిమతో దివ్యతేజముతోడ। అరసి దాసుల గాచీ హనుమంతుడు।
పరగ శ్రీవేంకటేశుబంటై సేవింపుచు। వరములిచ్చీ బొడవాటిహనుమంతుడు॥

219) సాళంగనాట/మోహన

ప॥ ఈతడు తారకబ్రహ్మ మితడు మాదేవుడు। కౌతుకాన జెప్పే వినగదరే వోజనులు॥
చ॥ రాముడు యిందీవరశ్యాముడు నానాసార్వ-। భౌముడు షోడశకళాసోముడు।
దోమటిరాక్షసులను తుత్తమురుసేసినాడు। కామితఫలములిచ్చి కాచినాడు సురల॥
చ॥ పూర్ణుడు నీలమేఘవర్ణుడు దానమున వి-। స్తీర్ణుడు వాహనసుపర్ణుడు।
అర్ణవము దాటి రావణాదుల గెలిచినాడు। నిర్ణయించి చెప్పరాదు నే డీతనిమహిమ॥
చ॥ వరుడు సీతకు పరాత్పరుడు కోదండదీక్షా-। గురుడు దివ్యామోఘశరు డితడు।
నిరతి శ్రీవేంకటాద్రినెలవై యుండేటివాడు। సరి భరతలక్ష్మణశత్రుఘ్నసహితుడు॥

220) శ్రీ/రాగమాలిక

ప॥ ఇదియే కావలెనని తా గైకొని యిచ్చగించువాడె ఘనుడు।
వదలకురో హరిదాసులమత మిది వర్ణించెద నోవివేకులాలా॥
చ॥ దేవుడుగలడని మదిలో దెయుటే జన్మఫలంబు।
తావుగ నాతని నెప్పుడు దలచుటే తనభాగ్యము।
శ్రీవైష్ణవధర్మము దప్పక చెలగుటయే వైభవము।
దేవతాంతరంబులన్నియు మానినదియే సుకృతంబు।
చ॥ కామక్రోధము లుజ్జగించుటయే కల్యాణానుభవము।

చేముంచి పాపము సేయకమానుటే చెప్పగ లాభము।
నేమముతోడుత విరక్తుడగుటే నిర్మలానందము।
వేమరు నాచార్యసేవసేయుటే విచారింపగ దాచినధనము॥
చ॥ ప్రకృతివికారములకు జొరకుండుటే పరమైనసాత్వికము।
సకలబంధముల బెడబాసినదే సామ్రాజ్యపదము।
ప్రకటింపగ నలమేలుమంగకును పతియగుశ్రీవేంకటవిభుని।
అకలంకుడై కొలిచియుండుటే యనంతమహిమాశయంబు॥

221) కేదారగౌళ
ప॥ ఇదియే ఉపాయ మిక నాకు నిందులకంటె మఱి లేదు।
మది నితనిదాసులదాసుడనై మహిమలతో గడుమెఱసేగాక॥
చ॥ కడచితినా నాజన్మములు గక్కను మానిసినైనంతనే।
విడిచితినా పాపముసేయక వేవేలుచదివినయంతనే।
అడచితినా సంసారవారధి అఖిలదేవతల గొలిచినయంతనే।
బడిబడి హరినామము నుతించి నే బావనమయ్యేగాక॥
చ॥ గెలిచితినా యీమాయను నే గెలిచి తపంబులు సేసినంతనే।
తలగితినా నరకములు చొరక ధరయెల్లా నేలినంతనే।
తెలిసితినా తత్వరహస్యము తిరముగ కులజుడనయినంతనే।
యిలలో శ్రీపతి శరణుచొచ్చి నేనిన్నిట బుణ్యుడ నయ్యేగాక॥
చ॥ వదలితినా నాదుర్గుణములు వరుసతో జుట్టాలు గలిగినంతనే।
వెదకితినా ముక్తిమార్గమును విద్య లెఱిగినేర్చినంతనే।
యిదివో శ్రీవేంకటేశుడు నాకును యేలికయై మన్నించగను।
పదిలముగా నాతనిసేవచేసి పరమానందుడ నయ్యేగాక॥

222) సామంతం
ప॥ ఎట్టు దోయవచ్చు వీని నెంతటివారికైనాను। పట్టి నీకు శరణంటే బ్రదికింతువుగాక॥
చ॥ మాలతనమువంటిది మతిదగులుగామము। అలరి ముట్టువంటిది అంటుగ్రోధము।
కేలి నొదిగించునెంగిలివంటిది లోభము। వాలాయించి నెందుండైనా వచ్చును లోకులకు॥
చ॥ చుట్టిమద్యమువంటిది చొక్కించుమోహము। వట్టిమాంసమువంటిది వయోమదము।
పుట్టినభ్రమవంటిది పొదిగినమచ్చరము। వుట్టిపడి నోరూరించు నూరకే ప్రాణులను॥
చ॥ గోడమఱుగువంటిది గుట్టుతోడిసంసారము। వీడనికట్టువంటిది వేడుకయాస।
యీడనే శ్రీవేంకటేశ యేలితిని నీదాసుల। జాడదప్పనియ్యవు యీచందము జీవులది॥

223) వరాళి
ప॥ మహి నుద్యోగిగావలె మనుజుడైనవాడు। సహజివలె నుండేమీ సాధింపలేడు॥
చ॥ వెదకి తలచుకొంటే విష్ణుడు గానవచ్చు। చెదరి మఱచితే సృష్టి చీకటౌ।
పొదలి నడచితేను భూమెల్లా మెట్టి రావచ్చు। విదిరించితే గాలము నిమిషమై తోచు॥
చ॥ వేడుకతో జదివితే వేదశాస్త్రసంపన్నుడౌ। జాడతో నూరకుండితే జడుడౌను।
వోడక తపసియైతే వున్నతోన్నతుడౌ। కూడక సోమరియైతే గుణహీను డౌను॥
చ॥ మురహరు గొలిచితే మోక్షము సాధించవచ్చు। వెరవెఱగకుండితే వీరిడియౌను।
శరణంటే శ్రీవేంకటేశ్వరుడు రక్షించును। పరగ సంశయించితే పాషండుడౌను॥

224) కేదారగౌళ
ప॥ తనలో నుండినహరి దా గొలువ డీదేహి। యెనలేక శరణంటే నితడే రక్షించును॥
చ॥ కోరి ముదిమిమానుపుకొనేయాస మందులంటా। వూరకే చేదులుదిన నొడబడును।
ఆరూఢి మంత్రసిద్ధుడయ్యేననేయాసలను। ఘోరపుబాట్లకు గక్కన నొడబడును॥

చ|| యిట్టె యక్షిణి బంపు సేయించుకొనేయాసలను | వొట్టి జీవహింసలకు నొడబడును |
దిట్టతనమున దా నదృశ్యము సాధించేయాస | జట్టిగ భూతాల బూజించగ నొడబడును ||
చ|| చాపలపుసిరులకై శక్తి గొలిచేయాసను | వోపి నిందలకునెల్లా నొడబడును |
యేపున శ్రీవేంకటేశు డేలి చేపట్టినదాకా | ఆపరానియాస నెందుకైనా నొడబడును ||

225) ధన్యాసి
ప|| దేవ నే నీయాధీనము దిక్కు దెస నాకు నీవే | సేవసేయకుండినా రక్షించ నీకు భారము ||
చ|| ఆడివచ్చినబిడ్డని నపరాధి జేసి తల్లి | వోడక యన్నము పెట్టకుండవచ్చునా ||
వేడుకకాడు చిల్కకు వింతమాటలెల్లా నేర్పి | ఆడినట్టె యాడితేను అదలించవచ్చునా ||
చ|| చిక్కినావు తొడకుమేది వచ్చేనంటే గొల్లడు | దుక్కక కావక పోదోలవచ్చునా |
యెక్కెగుఱ్ఱము గోళిగెనెనసి పైకొంటే రౌతు | తక్కక దాని జీకటితప్పు గొనవచ్చునా ||
చ|| పతి బెండ్లాడినయాలు పక్కననుండి నిద్రించితే | కొతికి కాలానుభాగి గొనవచ్చునా |
తతి నేపనికి రాక తామసుడై వుండినా | గతియై శ్రీవేంకటేశ కావకుండవచ్చునా ||

226) రామక్రియ
ప|| ఇటువంటివెల్లా నీకే యిట్టే సెలవు నేసితి | తటుకున నీవనేవిధానము చేకొంటిని |
చ|| కామించితి నాత్మ నిన్ను గలసి భోగించుటకు | వేమరు గ్రోధించితి నీవిరోధులపై |
నేమమున లోభించితి నీమంత్రమన్యుల కియ్య | ఆముకొని మోహించితి హరి నీరూపునకు ||
చ|| యెఱుకతో మదించితి యిట్టె నీదాస్యమున | మఱి నిన్నొల్లనిచదువు మచ్చరించితి |
తఱి జలపట్టితి నీతప్పనిభక్తియందు | వెఱవక నిన్నొల్లనివిధుల నిందించితి ||
చ|| కలకర్మములెల్లా నీకైంకర్యములందు వెట్టితి | బలుమమకారము నీపై జేర్చితి |
యెలమి శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి | నిలిచినకాలమెల్లా నీసేవే చేసితి ||

227) మాళవి
ప|| కలశాపురముకాడ గాచుకున్నాడు | వలసినవరాలిచ్చీ వాయునందనుడు ||
చ|| మాయబిలముచొచ్చి మగుడి యంబుధిలోని- | చాయాగ్రహము జంపి చయ్యన దాటి |
ఆయెడ లంకిణి గొట్టి యంతలో జానకిగని | వాయువేగానవచ్చినవాయునందనుడు ||
చ|| కడలిదరినుండినకపులతో గూడుకొని | పడదీరగా మధువనము చొచ్చి |
బడి రామునికి సీతాపరిణామమెల్లా జెప్పి | వడిగలవాడితడు వాయునందనుడు ||
చ|| రావణాదిరాక్షసుల రామునిచే సాధింపించి | ఆవిభుని సీత గూర్చి అయోధ్య నుంచె |
శ్రీవేంకటేశు గొలిచి శిష్టరక్షణమునకై | వావిరి నిలుచున్నాడు వాయునందనడు ||

228) బౌళిరామక్రియ
ప|| వసుధ జూడ బిన్నవానివలె నున్నవాడు | వెస నన్ని విద్యలాను వెలసె విట్ఠలుడు ||
చ|| పరగ నేడునూటడెబ్బదియేడుగురిచేత | నిరవై పాడించుకొన్నా డీవిట్ఠలుడు |
సరస నైదులక్షలిండ్ల జవ్వనపు గొల్లెతల | మరిగించుకొన్నవాడు మఱి యావిట్ఠలుడు ||
చ|| బత్తితోడ తనమీదపాటలు పాడితేను | యిత్తలమోమై తిరిగె నీవిట్ఠలుడు |
హత్తి తన్నొల్లకపోగా నందరి మేడ దేవళ్ళ | యెత్తి పాదాలందు జూపె నితడే విట్ఠలుడు ||
చ|| గట్టిగా బుండరీకుడు కడువేడుక బెట్టిన | యిట్టికపీటపై నున్నా డీవిట్ఠలుడు |
అట్టి తానే శ్రీవేంకటాద్రి బాండురంగమున | యెట్టు గొల్చినా వరము లిచ్చీ విట్ఠలుడు ||

229) మాళవి/దేశి
ప|| ఇతడు రామునిబంటు యితనికెవ్వ రెదురు | చతురత మెరసె నిచ్చట హనుమంతుడు ||
చ|| ఆకాశమత్తయు నిండి యవ్వలికి దోక చాచి | పైకొని పాతాళాన బాదాలు మోపి |
కైకొని దశదిక్కులు కరముల గబళించి | సాకారము చూపినా డిచ్చట హనుమంతుడు ||
చ|| కొంచక సురలు రోమకూపముల విహరించ | ముంచి ధృవమండలము మొగమై యుండ |
యెంచగ లోకములెల్లా యెడనెడ సందులుగా | చంచుల మెరసినా డిచ్చట హనుమంతుడు ||

చ|| గరిమ రవిచంద్రులు కర్ణకుండలములుగా| ధరణి మేరువు కటితటము గాగా|
ఇరవుగ శ్రీవేంకటేశునిసేవకుడై| బెరసె నిచ్చట నిదె పెద్దహనుమంతుడు||

230) సాళంగనాట/నాట

ప|| శరణు శరణు విభీషణవరదా| శరధిబంధన రామ సర్వగుణస్తోమ||
చ|| మారీచసుబాహుమదమర్దన తాటకాహర| క్రూరేంద్రజిత్తులగుండుగండా|
దారుణకుంభకర్ణదనుజ శిరచ్ఛేదక| వీరప్రతాపరామ విజయాభిరామ||
చ|| వాలినిగ్రహ సుగ్రీవరాజ్యస్థాపక| లాలితవానరబల లంకాపహార|
పాలితసవనాహల్యాపాపవిమోచక| పౌలస్త్యహరణ రామ బహుదివ్యనామ||
చ|| శంకరచాపభంజక జానకీమనోహర| పంకజాక్ష సాకేతపట్టణాధీశ|
అంకితబిరుద శ్రీవేంకటాద్రినివాస| ఓంకారరూప రామ వురుసత్యకామ||

231) రామక్రియ/కాపీ

ప|| శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే| యేవిధాన దలచినా యిన్నిటికి దగును||
చ|| కరిరాజుగాచినచక్రముపట్టినహస్తము| కరితుండమని చెప్పగా నమరును|
వరములిచ్చేయట్టివరదహస్తము కల్ప-| తరుశాఖ యని పోల్చదగు నీకును||
చ|| జలధిబుట్టినపాంచజన్యహస్తము నీకు| జలధితరగయని చాటవచ్చును|
బలుఅకాళింగునితోకబట్టినకటిహస్తము| పొలుపై ఫణీంద్రుడని పొగడగదగును||
చ|| నలినహస్తంబులనడుమనున్న నీయుర-| మలుమేలుమంగ కిర వనదగును|
బలు శ్రీవేంకటగిరిపై నెలకొన్న నిన్ను-| నలరి శ్రీవేంకటేశు డనదగును||

232) దేసాళం

ప|| పంట వండుకొనేవారిబాగ్యము లిటమీద-| నంటిముట్టి వెదకితే నాతుమ లోననున్నది||
చ|| వేదములలో మొలచె వేదాంతాల గొనసాగె| గాదిలి శ్రీహరిభక్తికల్పలత|
పోదియెక్కె వైరాగ్యబోధలచే బలుమారు| పాదుకొని వేరువారె పంచసంస్కారాలను||
చ|| అల్లుకొనె మునులతో నంటెను బురాణాల| చెల్లుబడి శాస్త్రాల జిగిరించెను|
చల్లగా బూవులు వూచె సత్కర్మవిదులను| మెల్లనే నీడలు నిండె మించి సుజ్ఞానమున||
చ|| పరమయోగముల బూపలు బిందెలు వుట్టె| పరగె సురలనేపందిటియందు|
యిరవై శ్రీవేంకటేశు డిందుకు ఫలమైనాడు| గురుసేవలను దొరకును వివేకులకు||

233) శంకరాభరణం

ప|| మతంగపర్వతమాడ మాల్యవంతమునీడ| అతిశయిల్లినపెద్దహనుమంతు డీతడు||
చ|| యీతడా రామునుబంటు యీతడా వాయుసుతుడు| ఆతతబలాఢ్యు డందు రాత డితడా|
సీతనువెదకివచ్చిచెప్పినయాత డితడా| ఘాతలలంకలోని రాక్షసవైరి యితడా||
చ|| అంజనాసుతు డీతడా అక్షమర్దను డీతడా| సంజీవినికొండ దెచ్చె సారె నితడా|
భంజించె గాలనేమిని పంతమున నితడా| రంజితప్రతాపకపిరాజసఖు డితడా||
చ|| చిరంజీవి యితడా జితేంద్రియు డితడా| సురల కుపకారపుచుట్ట మీతడా|
నిరతి శ్రీవెంకటాద్రిని విజనగరములో-| నరిది వరములిచ్చి నందరికి నితడా||

234) కాంభోజి

ప|| ఏమని విన్న వింతు నిదివో నాభాగ్యము| కామించి మీశరణంటి గమలారమణా||
చ|| కలది యందరికైతే గర్మఫలము| కెలన నాకైతే నీకృపాఫలము|
అల సురలకు మథితామృతము| నెలకొన్న నాకైతే నీనామామృతము||
చ|| సకలాత్మలబ్రదుకు సంసారమూలము| ప్రకటించ నాకైతే నీపాదమూలము|
వెకలిలోకులరతి వీధివీధిని నా-| త్రికరణరతి నీదివ్యభావవీధిని||
చ|| రంగుగ బాంధవ మందరకు బంధుజనులందు| సంగతి నాకు నీభక్తజనులయందు|
అంగవించి శ్రీవేంకటాధిప నన్నేలితివి| చెంగట నాధ్యానము నీశ్రీమూర్తియందు||

235) పాడి
ప॥ ఇహపరసాధన మీతలపు। సహజజ్ఞానికి సత మీతలపు॥
చ॥ సిరులు ముంగిటను జిగి దడబడగా। హరిని మఱపనిది యది దలపు।
సరి గాంత లెదుట సందడిగొనగా। తిరమయి భ్రమయనిదే తలపు॥
చ॥ వొడలి వయోమద ముప్పతిల్లినను। అడచి మెలంగుట యది దలపు।
కడగుచు సుఖదుఃఖములు ముంచినను। జడియని నామస్మరణమే తలపు॥
చ॥ మతి సంసారపుమాయ గప్పినను। అతికాంక్ష జొరని దది తలపు।
గతియై శ్రీవేంకటపతి గాచిన। సతతము నితనిశరణమే తలపు॥
236) శంకరాభరణం
ప॥ శరణన్న విభీషణు గరుణ గాచినవాడు। పరికింప దారకబ్రహ్మమా యీరాముడు॥
చ॥ ఆలికై విల్లువిఱిచి వాలికై యమ్ము వేసిన-। వాలుమగటిమిగలవాడా వీడు।
ఆలను జలధిగట్టి కేలను మోక్షమిచ్చి। యేలెను జటాయువును యీతడా రాముడు॥
చ॥ మింటికట్లు దెగనేసి యంటి పగసాధించి। దంటరాకుమారుడు తా నీశూరుడా।
బంటుగా వాయుజునేలి నంటు సుగ్రీవునితో జేసి। కంటకరావణవైరి ఘనుడా యీరాముడు॥
చ॥ రాకాసుల మర్దించి కాకాసురు నటు గాచి। మైకొన్న జానకీరమణు డితడా।
యీకడ శ్రీవేంకటాద్రి నిరవై తాను నున్నాడు। దీకొన్న ప్రతాపపుదేవుడా యీరాముడు॥
237) సాళంగనాట
ప॥ మిన్ను నేలా నొక్కటైనమేటితేరు। కన్నులపండువయినశ్రీకాంతునితేరు॥
చ॥ జలధులమీదను చక్కగా నేగెను తేరు। బలిమి గులాద్రులపై బారెను తేరు।
పెలుచులంకముంగిట పేరెలువారెను తేరు। చెలగె దిగ్విజయపుశ్రీహరితేరు॥
చ॥ రమణ గుండిననగరము చుట్టుకొన్న తేరు। తిమురుచు రుకిమిణి దెచ్చినతేరు।
సమరములో జరాసంధుని దోలినతేరు। అమరులవెనుబలమగుశౌరితేరు॥
చ॥ వొట్టి సృగాలవాసుదేవుని భంగించినతేరు। బెట్టుపౌండ్రకునిపై దాడివెట్టినతేరు।
అట్టె శ్రీవేంకటేశు డలమేలుమంగ గూడి। పట్టమేలుచు నెక్కిన పరమాత్ముతేరు॥
238) సాళంగనాట
ప॥ సింగారాల మించీ నరసింహదేవుడు। చెంగట నున్నాడు నరసింహదేవుడు॥
చ॥ సురలు జయ వెట్ట నసురలెల్ల మొరవెట్ట। సిరితో మెలగీ నరసింహదేవుడు।
ధరణి వంపెట్ట బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట। శిరసెత్తె నలి నరసింహదేవుడు॥
చ॥ కాంచనదైత్యుడు దొరకాలువనెత్తురు వార। చించెను గోళ్ళ నరసింహదేవుడు।
పంచల బంతాలు మీరి భవనాళియేరు వార। చెంచతల గోరీ నరసింహదేవుడు॥
చ॥ బలిమిపైపై నెక్క ప్రహ్లాదు డట్టె మొక్క। చిలికీ గరుణ నరసింహదేవుడు।
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీద। చెలువమే చూపీ నరసింహదేవుడు॥
239) నాట
ప॥ దానవారితోడిపగ ధరించరాదు మీకు। కానుకలిచ్చి శరణని కప్పము లియ్యరో॥
చ॥ భ్రమసి వార్ధిబడ్డాను పాతాళము దూరినాను। సమయింపక మానడు శత్రులార।
రమణ భూమిచొచ్చిన బ్రహ్మచే వరముగొన్న। తమి జంపక మానడు దైతేయుల॥
చ॥ రాసిమిన్నులో దాగిన రాచమూకలలోనున్న। కోసివేసి దల లరికుమతులాల।
ఆస ద్రికూటమెక్కినా ఆచక్రవాళమంటినా। తోసి సాధించకపోడు దుర్మతులాల॥
చ॥ సతుల మాటుననున్నా సరి నెందెందు వోయినా। రతి మెట్టక మానడు రాకాసులాల।
యితడు శ్రీవేంకటేశు డెదురులేదితనికి। గతియని మొక్కరో వోకపటులాల॥
240) సాళంగం
ప॥ భోగించ బుట్టినసొమ్ము పొంచి పరానకేలోపు। శ్రీగురుడ నీవే దయసేతువుగాని॥

చ॥ యీరెండుచేతులే యన్ని పాపాలకు నోపు। వూరకే పుణ్యము సేయనోపవుగాని।
మారుకొ నీరెండుగాళ్ళే మాపుదాకా జట్టనోపు। యేరీతి దేవ నీగుడి కేగ నలసుగాని॥
చ॥ కన్ను లివి రెండే మిన్నుగలంతా జూడనోపు। ఉన్నతి నాసాగ్ర దృష్టి కోపవుగాని।
అన్నిటా రెండుపెదవు లధరామృతాన కోపు। సన్నల మోక్షమొ్త్రవ జపించవుగాని॥
చ॥ యీవీనులురెండే విశ్వమంతా నాలించనోపు। వోవల శాస్త్రాలకైతే నోపవుగాని।
శ్రీవేంకటేశ నీవే చిత్తాన జ్ఞానమిచ్చితే। భావించి జీవుడన్నిటా బ్రదుకనోపుగాని॥
241) ముఖారి
ప॥ పరము నిహము పంటపండినయ్యు। యిరవుగా దానే యెట్టయెదుట నున్నాడు॥
చ॥ ముంచినమహిమలెల్లా మూర్తివంతమైనట్టు। కాంచినవరములు సాకారమైనట్టు।
అంచె శృంగారరసాన కంగములు వచ్చినట్టు। యెంచగ శ్రీవేంకటేశు డెదుర నున్నాడు॥
చ॥ చెలగి ఆకాశానకు చైతన్యము వచ్చినట్టు। అల దయాసింధువు ప్రత్యక్షమైనట్టు।
మొలచి సుజ్ఞానము మోసులెత్తివుండినట్టు। శ్రీవేంకటేశు డెదుట నున్నాడు॥
చ॥ పరగ నానందము ప్రతిబింబించినయట్టు। సురలభాగ్యము పొడచూపినట్టు।
వురుటై యలమేల్మంగ నురమున నించుకొని। యిరవై శ్రీవేంకటేశు డెదుట నున్నాడు॥
242) భైరవి
ప॥ పరమాత్ముడు సర్వపరిపూర్ణుడు। సురలకు నరులకు చోటయియున్నాడు॥
చ॥ కన్నుల గంటానే కడు మాటలాడుతానే। తన్ను గానివానివలె దాగియున్నాడు।
అన్నియు వింటానే అట్టే వాసనగొంటానే। వన్నెలనూనెకుంచమువలె నున్నాడు॥
చ॥ తనువులుమోచియు తలపులు దెలిసియు। యెనసియునెనయక యిట్లున్నాడు।
చెనకి మాయకు మాయై జీవునికి జీవమై। మొనసి పూసలదారమువలె నున్నాడు॥
చ॥ వేవేలు విధములై విశ్వమెల్లా నొకటై। పూవులువాసనవలె బొంచియున్నాడు।
భావించనిరాకారమై పట్టితే సాకారమై। శ్రీవేంకటాద్రిమీద శ్రీపతై యున్నాడు॥
243) సామంతం
ప॥ ఇట్లానే యోగలక్ష్య మెఱుగుకొంటే ఫలించు। యెట్లయినా గురువాక్య మేమరకుడీ॥
చ॥ కాంత దలచుకొంటేనే కామోద్రేకము పుట్టు। యింతలో గూడెనా యేడకేడ సూత్రము।
చింతకాయతొక్కు చూచితేనే నోరూరు। యెంతకెంతదవ్వు యేడకేడ సూత్రము॥
చ॥ వీనుల మమ్చిమాటలు వింటేనే సంతోష మబ్బు। యేనిజము గనె నేడకేడ సూత్రము।
ఆనించితే నాలుకనే ఆరురుచులు దెలిసీ। యీనెపమున నేడకేడ సూత్రము॥
చ॥ ముక్కుకొన బ్రాణ ముండి ముందువెనుకకు వచ్చి। యెక్కడ మోచున్న దేడకేడ సూత్రము।
చిక్కి శ్రీవేంకటేశుడు జీవుల కంతర్యామి। యిక్కు వెఱిగితే నీడ కిదే సూత్రము॥
244) దేసాక్షి/రాగమాలిక
ప॥ ఎంచి చూడరో ఘనులార యిందీరాక్షుడు రక్షకుడు।
సంమ్చితముగ నితనిశరణంటే సర్వఫలప్రద మిందరికి॥
చ॥ హరి గొలుపనికొలువులు మఱి యడవిగాసినవెన్నెలలు।
గరిమల నచ్యుతువిననికథలు భువి గజస్నానములు।
పరమాత్మునికిగానితపంబులు పాతాళములనిధానములు।
మరుగురునికిగానిపూవులపూజలు మగడులేనిసింగారములు।
చ॥ వైకుంఠునినుతియించనివినుతులు వనవిధి గురిసినవానలు।
ఆకమలోదరు గోరనికోరొకె లందనిమానిఫలంబులు।
శ్రీకాంతునిపైజేయనిభక్తులు చెంబుమీదికనకపుబూత।
దాకొని విష్ణునితెలియనితెలుపులు తగ నేటినడిమిపైరులు॥
చ॥ వావిరి గేశవునొల్లనిబదుకులు వరత గలపుచింతపండు।

************************************************************************************************************
గోవిందుని కటు మొక్కనిమొక్కులు గోడలేనిపెనుచిత్రములు।
భావించి మాధవునిపైలేనితలపులు పలు మేఘములవికారములు।
శ్రీవేంకటపతికరుణ గలిగితే జీవుల కివియే వినోదములు॥
245) గుజ్జరి/రాగమాలిక
ప॥ త్రికరణశుద్ధిగ జేసినపనులకు దేవుడు మెచ్చును లోకము మెచ్చును।
వొకటి కోటిగుణితంబగుమార్గములుండగ బ్రయాసపడనేలా॥
చ॥ తనమనసే పరిపూర్ణమైన గోదావరి గంగా కావేరి।
కనకబిందుయమునాగయాది ముఖ్యక్షేత్రంబుల సంతతమున్।
దినకరసోమగ్రహణకాలముల తీర్థాచరణలు సేసినఫలములు।
తనుదానే సిద్ధించును వూరకే దవ్వులు దిరుగగ మఱి యేలా॥
చ॥ హరి యనురెండక్షరములు నుడివిన నఖిలవేదములు మంత్రములు।
గరిమ ధర్మశాస్త్రపురాణాదులు క్రమమున జదివినపుణ్యములు।
పరమతపోయోగంబులు మొదలగుబహుసాధనములసారంబు।
పరిపక్వంబై ఫలియించగా బట్టబయలు వెదకనేలా।
చ॥ మొదల శ్రీవేంకటపతికిని జేయెత్తి మొక్కినమాత్రములోపలనే।
పదిలపుషోడశదానయాగములు పంచమహాయజ్ఞంబులును।
వదలక సాంగంబులుగా జేసినవాడే కాడా పలుమారు।
మదిమదినుండే కాయక్లేశము మాటికి మాటికి దనకేలా॥
246) ముఖారి
ప॥ ఆతడే యజమానుడు ఆదినారాయణుడు। ఆతనిబంట్లము మాకు నన్నిటా నిశ్చింతము॥
చ॥ యేలికెగలబంటుకు యెక్కడిది విచారము। పాలించేమగడుగలపడతి కేడ విచారము।
కోలుముందై తండ్రికలకొడుకు కేది తొడును। యీలీల హరిదాసుని కెక్కడి కోరికెలు॥
చ॥ బలుదుర్గమువానికి భయ మేమిటా లేదు। కలిమిగలవానికి కడమ లేదు।
యిల క్షేత్రవంతునికి నెందూ దరిద్రము లేదు। అల శ్రీపతిబంట్లకు నలమట లేదు॥
చ॥ పట్టినముద్రంగరపుప్రధాని కెదురు లేదు। కుట్టిచాతనివారికి గొంకు లేదు।
నెట్టన శ్రీవేంకటాద్రినిలయము సేవకులము। గుట్టుతోడ బ్రదికేము గుఱి మాకు నతడే॥
247) గుండక్రియ
ప॥ మనసులో మర్మమై మరల బారుచునుండు। పొనుగుపడ్డమదము పోవగనీదు॥
చ॥ వింటేనే విషమెక్కు దిష్టముగ విషలత। కంటేనే వలపెక్కు గాంతలను।
అంటిముట్టి కాగిట నలముకొంటేగనక। మంటగలసిన భ్రమ మానలేదు॥
చ॥ మెట్టితేనే కఱచును మెలుపుతోడుత బాము। పట్టితే విడువనీదు పచ్చనిపైడి।
దట్టమై మేన సొమ్ములు తగులుకొంటేగనక। తొట్టి వెల్లిబోయినాస తొలగనీదు॥
చ॥ ఆహారము పెట్టితేను అట్టె విడుచు భూతము। ఆహారానకు బోదెక్కు నట్టే ప్రాయము।
యీహల శ్రీవేంకటేశు డిట్టే కరుణించితేను। సాహాయమై వచ్చు దానే సత్వగుణజ్ఞానము॥
248) సాళంగనాట
ప॥ దిక్కులు సాధించబూని దేవదుందుభులు మ్రోయ। యెక్కువతో శ్రీవేంకటేశు డెక్కె దేరు॥
చ॥ పన్నిద్దరుసూరియులబండికండ్లతేరు। సన్నుతి శేషాదిదేవాసనపు దేరు।
కన్నులపండుగైనగరుడధ్వజపుదేరు। యెన్నగ శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు॥
చ॥ మించునానామేఘముల కట్లతేరు। చుంచులనక్షత్రాలకుచ్చులతేరు।
అంచెదేవతలే బొమ్మలై వుండినట్టితేరు। యెంచగ శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు॥
చ॥ అట్టె కిందేడు లోకములంతరువులైనతేరు। నట్టనడుమను బ్రహ్మాండపుతేరు।
దిట్టయలమేల్మంగతో దిరమైవుండేటితేరు। యిట్టె శ్రీవేంకటేశు డెక్కె నిదె తేరు॥
************************************************************************************************************

249) శుద్ధవసంతం
ప॥ మాయ కిదె సహజము మాయను గెలువరాదు। మాయానాథు గొలిచితే మన్నించు నాతడే॥
చ॥ చేతికి లోతైనట్టుండు సృష్టిలోని వేడుకలు। పోతరించి పట్టబోతేబోవు నట్టదే।
ఆతుమలో వేసరి అలసి వూరకుండితే। వైతాళపునీడవలె వచ్చు వెంటవెంటను॥
చ॥ తీపువలెనే వుండు దిష్టపుబడార్థాలు। మేపుగొంటే మీసాలమీదితేనౌను।
యేపున నాస విడిచి యేరుపడి వుంటేను। మూపున గట్టినచద్దె మోపించును॥
చ॥ తలపులోనే వుండు తనలోని యంతరాత్మ। తెలుపుకోబోతే పెక్కుదేవతలౌను।
చలపట్టి యీతనినే శరణని కొలిచితే। యెలమి శ్రీవేంకటేశు డీతడై రక్షించును॥

250) మంగళకౌశిక
ప॥ దేవు డొక్కడే గురితెలిసినవారికి। యీవలావల చూచినా నిక లేదు తెఱగు॥
చ॥ కోపము మానితేనే కోటిజపాలు సేయుట। పాపము సేయకుంటేనే బలుతపము।
లోపల తా నూరకుంటే లోకమెల్లా జరించుట। మాపుదాకా వెదకినా మఱి లేదు తెఱగు॥
చ॥ పరకాండ నంటకుంటే బలుపుణ్యాలు సేయుట। సొరిది నాస మానుటే సోమపానము।
సరి మోనాన నుండుటే సన్యాసము చేకొనుట। యిరవైతే నంతకంటే నిక లేదు తెఱగు॥
చ॥ పలుసుఖదుఃఖముల బాసివుండునే మోక్షము। అల చంచలము మానుటది యోగము।
యిలపై శ్రీవేంకటేశు డిచ్చినసుజ్ఞాన మిది। యెలమి బుద్ధి బోల నిక లేదు తెఱగు॥

251) సౌరాష్ట్రం
ప॥ తలచుకో వోమనస తగినద్రిష్టము లివి। వెలలేక తెచ్చేటివివేకము లోధనము॥
చ॥ గాలిబోయేమాటలు లోకములోనిసుద్దులెల్లా। గాలిబో వెన్నడును శ్రీకాంతునుతులు।
జాలిబడేనేతలు సంసారభోగములెల్లా। జాలిలేనివి విష్ణుసంతతపుపూజలు॥
చ॥ మాయయౌ గొన్నాళ్ళకు మానుషకృత్యములెల్లా। మాయముగానివి దైవికమహిమలెల్లా।
కాయకములే తమకల్పితము లన్నియును। కాయకము గాక నిల్చు గమలాక్షుమన్నన॥
చ॥ వుడువోవు రాగారాగా నున్నతకర్మఫలాలు। వుడివోదు దేవునిపై నొనరుభక్తి।
జడియు నితరులిచ్చేసకలవరములును। జడియదు శ్రీవేంకటేశ్వరుడిచ్చేవరము॥

252) సాళంగనాట
ప॥ అహోబలేశ్వరునకు నాదిమూర్తికి। విహారమే పంతము వీరసింహమునకు॥
చ॥ చుక్కలు మొలపూసలు సూర్యచంద్రులు కన్నులు। దిక్కులు చేతు లెడలు దివ్యాయుధాలు।
మిక్కుటపువేదములు మించుగొసవెంట్రుకలు। రక్కసుల జెండేవిదారణసింహమునకు॥
చ॥ శైలములే పాదములు జానువులే లోకములు। కాలచక్రమే నోరు గ్రహాలు పండ్లు।
చాలుకొన్నమేఘములు సకలదివ్యాంబరాలు। పాలించేప్రతాపపుసింహమునకు॥
చ॥ అంతరిక్షమే నడుము అట్టె భూమియే పిరుదు। వంత గృపారసము వార్తులెల్లాను।
యింతటా శ్రీవేంకటాద్రి యిరవు మహాగుహ। రంతు లురుములు ఘోరరౌద్రసింహమునకు॥

253) ధన్యాసి
ప॥ వేసవి యెండలుండునా వేరె వాన కాలానకు। పాసిన కాకలు రతి పచరించవచ్చునా॥
చ॥ పేరబెట్టితే వలపు పెరుగువంటిదెపో। కేరి కాచబోతే విరిగిపోవుగాని।
గారవించే రమణుని కతలకులోగానీ। దూరబొయ్యేవుగనక తుత్తుమురౌ మనసు॥
చ॥ చవిగొంటే తమకము చక్కెరవంటిదె పో। కవవాసితే అట్టె కారమౌగాని।
నవకపునాయకుని నవ్వులెల్లా జేకొనవే। తివిరేరుగనకపై తీగె సాగు చలము॥
చ॥ పనిగొంటే జవ్వము బంగారువంటిదెపో। దినములు దొబ్బితే వన్నె దీసుగాని।
యెనసెను శ్రీవేంకటేశుడు నిన్నింతలోనే పెనగేవు గనక ముప్పిరి గొను బీరము॥

254) ఆహిరి
ప॥ రమణి భాగ్యమునేడు రచ్చలకెక్కె। తమకపు వలపు నీతలకెల మెక్కదో॥

చ॥ చెలితలపులో చింత చెక్కిటి చేతికి వచ్చె। యెలమి నీచిత్తమింకా నేలరాదో।
నిలువున కాకలెల్లా నిట్టూరుపుల బుట్టె। తలిరుబోడిపై నీకు దయయేలపుట్టదో॥
చ॥ దట్టపు గోరికెలెల్లా తనుపులకలదీరె। యిట్టెవిన్న పాలు గతలేల తేరవో।
చిట్టకపు విరహము చెమటలగాన వచ్చె। గట్టిగా నీమోహమేల కానరాదో॥
చ॥ నిక్కుగుచము లింతివి నీ కాగిటనే మించె। యెక్కువ నీ సిగ్గు లికనేల మించవో।
ప్రక్కన శ్రీవేంకటేశ పడతిగూడితి విట్టె। తక్కించి మన్నించ నీకు దరియెట్టాయనో॥

255) ఆహిరి

ప॥ ఏమిభాగ్యమునవో యిటు విచ్చేసితిగాక। వోమి నీ యవసరము వొకరికి నబ్బునా॥
చ॥ కడువిరహినై నిన్ను గన్నుల చూచే మంటేను। వడదేరి కొలువు చావడినుందువు।
తడవి అక్కడికైన దగ్గరేనంటే నిన్ను। యెడసి నావంటివారు ఎందరైనా వత్తురు॥
చ॥ పక్కన నే నీకు విన్నపము సేసుకొనేనంటే। యెక్కడలేని పరాకు యెప్పుడు నీకు।
చెక్కువట్టి తీసి నిన్ను చేతనెచ్చరించేనంటే। వెక్కసాన నట్టివారు వేవేలు గలరు॥
చ॥ పారితెంచి నే నిన్ను బలిమి గూడేనంటే। నేరుతు రందుకు దగునెపము లెల్లా।
కోరి శ్రీవేంకటేశుడ కూడితివి నన్ను నిట్టె। యీరీతి నలమేలమంగను యిందరు చుట్టాలే॥

256) ఆహిరి

ప॥ ఇన్నియును దగగలిగె నీయింతి కిదె యిపుడు। కన్నియల కిందరికి కలిగె మోహములూ॥
చ॥ నిగనిగనిమెఱుగు వెన్నెల మోమునకు గలిగె। చిగురు మోవికి గలిగె జిఱునగవులు।
పగటు గను గొనల బలపలని కెంపులు గలిగె। పొగరు చెమటలు గలిగె పొలతి చెక్కులను॥
చ॥ ఒయ్యారమగు నలపు లువిద మేనికి గలిగె। గయ్యాళి నడపులకు గలిగె మురిపెములు।
తొయ్యలికి గలిగె సంతోషంబు బరవశము। పయ్యెదకు గలిగె బయిపైని నునుబూత॥
చ॥ వెలది కిప్పుడు గలిగె వేంకటేశ్వరుకరుణ। తలపులకు గలిగె చింతా వియోగంబు।
పులకలకు గలిగె దలపులలోని జొంపములు। అలుకలకు గలిగె బాయని విలాసములు॥

257) ఆహిరి

ప॥ ఎటువంటి వలపులో యిద్దరికిని। చిటుకంటే మెచ్చేవు శ్రీనరసింహా॥
చ॥ గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా। పరగ నీ మోము తప్పక చూడగా।
సరుగున నీవు వచ్చి సంగడినే కూచుండి। సిరులతో బొగడేవు శ్రీనరసింహా॥
చ॥ యెదురు మేడపై నెక్కి యెలుగెత్తి పాడిపాడి। వుదుటున దామరపూవుల వేయగా।
పొదిగి నీవంతలోనే బుజముపై జేయివేసి। చెదరక చెక్కంటేవు శ్రీనరసింహా॥
చ॥ పఱుపుపై నీకె పరాకున జెలితోడ। అఱిముఱి నిన్ను జూపేకాంత మాడగా।
మెఱయ శ్రీవేంకటాద్రిమీద వచ్చి కూడితివి। చెఱగువట్టి చొక్కుతా శ్రీనరసింహా॥

258) ఆహిరి

ప॥ పాయరాని పదివేలు పనులు నీకు యీ-। కాయము నీవిప్పుడైన కౌగలించుమీ॥
చ॥ చిత్తజ తాపముచేత దిక్కువడ్డ దానం గాన। వొత్తినీతో విన్నవించ నోపంగాని।
యెత్తిన నీ విరహాన యేమౌదునో నన్ను। చిత్తగించ యెప్పుడైన జేరంగ రమ్మీ॥
చ॥ తరి నిన్నుంబాసి మాట తడబడే దానంగాన। నెరి నిన్నుం దూరనాడ నేరంగాని।
యెరగొని తలచీర యెరంగకున్నప్పుడైన। కరగి మఱవక నాకడ చూడుమీ॥
చ॥ దవ్వుల నిందాక నీకు తమకించే దానంగాన। జవ్వన మంటక మనం జాలంగాని।
రవ్వైన వేంకట రమణ నావద్ద నిట్టే। పవ్వళించి నేడైనా బాయకుండుమీ॥

259) సోమ/కాపీ

ప॥ బిగిసి యాపె నీకు బెట్టని కోట। యెగసక్కేలకు నీకు యేమి సేసుకొంటివి॥
చ॥ కోపగించుకోబోగా కొలిచి మొక్కవలసె। తీపుల దిట్టినందుకు దీవించవలసె।
చూపుల జంకించగాను నూడు పెనగ వలసె। యేపున నెంతకు నెంత యేమి సేసుకొంటివి॥

చ|| చేపట్టి తియ్యగబోగా చెక్కులు నొక్కవలసె। చేవమీర నవ్వగాను సిగ్గుపడవలసె।
కావరించి పైకొనగా కైవశము గావలదె। యే (యీ) విధాన నుండి వుండి యేమిసేసుకొంటివి॥
చ|| కాకలసేయగబోగా గక్కన గూడవలసె। పోకముడి యంటగాను భోగించవలసె।
వేకపు శ్రీవేంకటేశ వెలది గలిసి తిట్టె। యేకట నీయంత నీవు యేమి సేసు కొంటివి॥

260) మాళవిగౌళ/మాయామాళవ గౌళ
ప|| ఏమాయ నిందుకు నీ వెగ్గులేల పట్టేవు। కామిని నీచెక్కు నొక్కి కైకొనవయ్య॥
చ|| పడతి నోరెత్తితేను పగడాలే రాసులయ్యా। యెడపు నిన్ను దిట్టితే నేమాయనయ్యా।
కడలేని రత్నాలు గానుక వచ్చిన నీవు। తడవి బండారాన దాచుకోవటయ్యా॥
చ|| మగువ చూపులవంక మాణిక్యాలే రాలీని। తగ గోపించి చూచితే తప్పటవయ్యా।
సొగిసి మణులు దాచి సొమ్ములు నీకిచ్చితేను। జిగి మేన ధరియించి చెలగవటయ్యా॥
చ|| ముంచి చెలి నవ్వితేను ముత్తేలే రాలీని। యించుక గేలిసేసితే నేమాయనయ్యా।
పెంచెపు శ్రీవేంకటేశ పెండ్లి ముత్యాల సేస। వంచి కూడి చెలి మాన వచ్చునటయ్య॥

261) మాళవిగౌళ/మాయామాళవ గౌళ
ప|| నారాయణ నీ నామ మహిమలకు। గోరబోవుటకు గొడ్డలి దగునా॥
చ|| హరి యని నొడిగిన నణగెటి పాపము। సిరులనేను నుతిసేయగ గలనా।
పరగిన పిచ్చుకపై బ్రహ్మాస్త్రము। దొరకొని వూరకె వెల యిడినట్లు॥
చ|| అచ్యుతయనగా నందెటి సంపద। యిచ్చల నెంచిన నిలగలవా।
కొచ్చికొచ్చి యొక కొండంత కనకము। వెచ్చపు బోకకు వెల యిడినట్లు॥
చ|| యెదుటనె శ్రీవేంకటేశ్వర యనగా। బొదొగెటి తపముల పుణ్యము గలదా।
కదిసి సముద్రము గడచి వోడలో। జిదిసి యినుము దెచ్చిన యట్లు॥

262) మంగళకైశిక
ప|| ఇందాకా మాపని యిక నీపని। కందువాయ వలపులు కపట మేమున్నది॥
చ|| చేతులనె మొక్కి మొక్కి సెలవులనే నవ్వునవ్వి। ఆతలనే నిలచున్న దదివో చెలి।
కాతరాన యికమీద గలిగిన పనులు నీ-। చేతి నింతె యిక నీతో చెప్పనేమి వున్నది॥
చ|| కన్నులనె నిన్ను జూచి కానుక నీకంది యిచ్చి। అన్నిటా గుట్టున నున్న దదివో చెలి।
సన్నలూను మీలోని సరసాలు నిటమీద। పన్నుకో నీవెనేర్తువు పలుక నేమున్నది॥
చ|| మచ్చిక నీకు జేసి మనసు నీపై బెట్టి। యిచ్చట గాగలించె నిదివో చెలి।
అచ్చపు శ్రీవేంకటేశ ఇట్టె నీవు గూడితివి। యిచ్చకము లిటమీద నిన్నె నెఱుగుదువు॥

263) మలహరి పెద తిరుమలాచార్య కృతి
ప|| ఆయలేరే యేమిచెప్పే రాతని సుద్దులు నాకు। తాయి మక్కళాలేకాక దయగద్దా తనకు॥
చ|| కన్నుల జూడనే పట్టె కాకలు సేయనే పట్టె। యిన్నిటా తా నన్ను గూడే డెప్పుడోకాని।
సన్నలు సేయనే పట్టె చవులు చూపనే పట్టె। వెన్నెల బాయిటికి రావేళలేదు తనకు॥
చ|| నవ్వులు నవ్వనే పట్టె నాలి సేయనే పట్టె। యివ్వలనన్ను గూడేది యెన్నడే రామ।
పువ్వులవేయనే పట్టె బుజ్జగించనే పట్టె। పవ్వళించ బొద్దులేదు పనులేలే తనకు॥
చ|| మాటలాడనే పట్టె మనసు చూడనే పట్టె। యీటున గాలుదొక్కేది యెన్నడే తాను।
పాటించి శ్రీవేంకటాద్రిపతి నన్ను నురముపై। తేటలుగా నెక్కించుక దించనెడ లేదు॥

264) మలహరి పెద తిరుమలాచార్య కృతి
ప|| సంకెలేక తలచిన జాణలకు। సంకీర్తనమె పో సర్వశాంతి॥
చ|| భవహరమగు శ్రీపతి నామమె। జవకట్టి తలచితే జన్మశాంతి।
తవిలి హరిపూజ తాజేయుటె। కువలయమున నిదిగో గృహశాంతి॥
చ|| అంది ధృవవరదుడ యనినదె। కందువైన సర్వగ్రహశాంతి।
యిందు రవినయనుని నెరుగుటె। చందమైనదిదివో నక్షత్రశాంతి॥

చ|| భావించి యనంతుని బలుకుటె। కావించిన దిదివో కాలశాంతి।
శ్రీవేంకటనాథుని చేరుటె। దేవ మానవులకును దేహశాంతి॥

265) మలహరి

ప|| ఇన్నిటికి మూలం బీశ్వరు డాతని। మన్నన కొలదినె మలయుట గాక॥

చ|| మాయా మయమై మనియెడి జగమిది। చాయల నిందు నిజముగలదా।
కాయము సుఖదుఃఖములకు బొత్తిది। రేయి బగలు నొక రీతే కలదా॥

చ|| దైవా ధీనము తగు సంసారము। వారిని జీవుల వశమవునా।
ధావతి మనసిది తన కర్మమూలము। వేవేలైనా విడువగ వశమా॥

చ|| పంచేంద్రియముల బరగేటి బ్రదుకిది। చంచలంబు నిశ్చలమవునా।
యెంచగ శ్రీ వేంకటేశ్వరు కృపతో। సంచయ మయితే సతమవుగాక॥

266) పాడి/హుసేని

ప|| అందుకు నిందుకు బతి ఆయ గదా। నందక ధరుడు నేడు నవ్వువచ్చీ నాకు॥

చ|| పిన్న దాననై బొమ్మపెండ్లి నే జేయగాను। నన్ను జూచి నీవు నాడే నవ్వితివి గదరా।
చెన్నుగ నాకిట్టె సన్నసేసి నీవు గూడగాను। నన్ను నిన్ను జూచి నేడు నవ్వు వచ్చీ నాకు॥

చ|| పడుచులు నేను చెట్టాపట్టాలు పట్టుకాడగా। నడుమనే నన్ను జూచి నవ్వితివి గదరా।
చిడుముడి నీవు నన్ను జెట్టపట్టుకోగా నేడు। నడుకొత్తి నిన్ను జూచి నవ్వు వచ్చే నాకు॥

చ|| పొలసి గుజ్జన గూళ్ళు బువ్వాలాడే నన్ను జూచి। నలువంక నాడు నీవు నవ్వితివి గదరా।
యెలమి శ్రీవేంకటేశ యిటు నా మోవి బువ్వము। నలి నీ వంటి కూడగా నవ్వు వచ్చే నాకు॥

267) పాడి/సారంగ

ప|| జాజు జాజేకాక దిరిశపు బువ్వైనా। నీ జాడెంతయిన నీవు మానేవా॥

చ|| సంపెంగ పూవులలోన సారెకుజూచిన తన। కంపేకాక తనకాశమానీవా।
యింపులు గొందరికి యీరసాలుగొందరికి। జంపుల నీగుణముల జాడమానేవా॥

చ|| పొగడ పూవులలోన పొందుగ జూచిన తావి। తగుగాక తామదము మానీనా।
నిగిడిన నీచేత నీబోంట్లకే కాక। నుగిడి నీగుణములు మంచివయ్యీనా॥

చ|| కామించి కలువలు కన్నుల నద్దుకొనిన। కామునమ్ములునేడు గాక మానీనా।
దీమనపు వెంకటేశ తెమలనికూటముల। ఆమని మాకోరికల ఆసమానీనా॥

268) పాడి/ఖరహరప్రియ

ప|| నమ్మిన దిదివో నాపితురార్జిత-। మిమ్మహిజాడరో యిది మీదిగాదు॥

చ|| నలినదళాక్షుని నామాంకితమే। నిలువున బాతిన నిధానము।
కలకాలమిదే గాదెలకొలుచులు। నలుగడ నిదియే నాలుకరుచులు॥

చ|| శ్రీపతిరూపమె చింతించు తలపె। పైపై మాయింట భాగ్యములు।
పూపల మిత్రులు బుత్రాదులిది। వైపగు మాకిదె వ్యవసాయములు॥

చ|| శ్రీవేంకటపతి సేవిదియొకటే। భావించు నాయుష్యభౌష్యములు।
కైవల్యపదవిదె కాయజసుఖమిదె। సావధానముల సంసారమిదే॥

269) పాడి/సామ

ప|| దేవరచిత్తం దివ్యనిధి। దేవ నిర్మిత విధి యవధానం॥

చ|| అతివలు నాట్యంబాడేదరు నీ వు-। న్నతిమెఱయుచు నున్నారిదివో।
ప్రతినలతో రంభయు, మేనకయును। ధృతి కరుణాంబుధి ధీయవధానం॥

చ|| గానవిద్య తమకంబున వినుమని। కానుకలివె సురకాంతలవి।
కానుపించురో గంధర్వసతులును। ధీనత పంపును ధీయవధానం॥

చ|| పర్యంకంబున బవళించెదవో। సిరుల విభవములజెలంగెదవో।
తిరువేంకటగిరి దేవయన్నిట। తిరమందితివిటు ధీయవధానం॥

****************************************************************************************************

270) బౌళి
ప॥ కల్ల జుమ్మీ రమణుడ కలగీ నిందుకేమతి। తొల్లిటి నీగుణమెట్టు తోచెనోకాని॥
చ॥ ఆడ జుమ్మీ నిన్ను నేడు అంతచులకనిమాట। వాడికె నీకెట్టు నిందవచ్చెనోగాని।
తోడ వేగువెట్ట సుమ్మీ దొరవు నీమీదనేను। యేడ నిన్నెవ్వతె సందేహించెనో కాని॥
చ॥ నవ్వజుమ్మీ నేనిన్ను నాతులయాసభలోన। అవ్వలనీమీదనెట్టు అంటెనోకాని।
యెవ్వరితో చెప్పజుమ్మీ యిట్టునట్టు అని నిన్ను। దవ్వులనీ కాక యెట్టుతగిలెనో కాని॥
చ॥ చూడజుమ్మీ నిన్ను నేను చురుకున గుండెనాట। ఆడనే నీవెట్టు గుఱియైతివో కాని।
వేడుక శ్రీవేంకటేశ వెలయ నన్ను గూడితి। వాడుకో లిదే సుమ్మీ ఆనతిత్తుగాని॥
271) బౌళి
ప॥ ఎందును బోరాదీ సంసారము। కందువ నీమాయ గడవగ వశమా॥
చ॥ కలిమే చిత్తవికారహేతువది। అలరలేమి దైన్యహేతువు।
పలులంపటములు బంధహేతువులు। తలగిన నడవదు తను పోషణము॥
చ॥ మదవికారమిదె మహితయౌవనము। తుదవార్ధకమే దురంతము।
యిదె యదార్థార్జన యాతాయాతన। అదియుమనితే నాకలిఘనము॥
చ॥ ఎన్నిగడియించే వెన్నిటముంచే-। విన్నిట శ్రీవేంకటేశ్వరుడా।
అన్నిట నంతర్యామివి నీవే। కన్నుదనియ నను గవగవే॥
272) బౌళి/రాగమాలిక
ప॥ ఎప్పటిజీవుడె యెప్పటి జగమే యెంతగాలమును నీరీతే।
కప్పుక వచ్చితి వనాదినుండియు కర్మము యింకా వేసరవా॥
చ॥ మఱచితివా తొలిజన్మంబుల మరణకాలముల దుఃఖపుబాట్లు।
మఱచితివా యమకింకరులయి మర్దించిన బహుతాడనలు।
మఱచితివా నరకకూపముల మాటికి మాటికి పరచిన బాధలు।
మఱియును సుఖమని భవమే కోరెదు మనసా ముందరగానవుగా॥
చ॥ తలచవుగా జననకాలమున దనివిదియేయిటుపుట్టిన రోతలు।
తలచవుగా బాల్యంబున తల్లిదండ్రుల శిక్షలు వ్యాధులును।
తలచవుగా సంసారమునకును దైన్యంబున యాచించెటి యలమట।
తలచ్చునదియే వలెనని వోమెదు తనువాయింకా రోయవుగా॥
చ॥ కంటివిగా మలమూత్రాదులు కడుగగదీరని దినదినగండము।
కంటివిగా కనురెప్పలనే కాలముగడచెటి కడత్రోవ।
కంటివిగా శ్రీవేంకటపతి కరుణచేత నీవివేకభావము।
అంటి యిటువలెనె సర్వకాలమును అంతరాత్మ నినుదలచవుగా॥
273) నాదనమక్రియ
ప॥ కల్లగాదు యిది నీవు గన్నపనే। చెల్లునీకే యిన్ను యును చిత్తగించరాదా॥
చ॥ మొక్కిన నామొక్కులోనే మోహమెల్లా గానరాదా। చొక్కపు నామనసేమి సోదించేవు।
యిక్కడనే భ్రమయించ యిదిగొంత వలెనా। తక్కరితనము నేర దయ జూడు మికను॥
చ॥ యిచ్చిన కానుకలోనే యితవెల్లా దెలియదా। తచ్చి మాగుణములేమి తలపోసేవు।
రచ్చబెట్టి నీవింత నీవు రవ్వసేయవలెనా। మచ్చరమెఱగ నన్ను మన్నించుమికను॥
చ॥ కూడిన నాకూటమిలో గుణమెల్ల గానరాదా। తోడనే మమ్మెంత నీవు తొరలించేవు।
వేడుక మించితివి శ్రీవేంకటేశ నన్నునిట్టె। జాడ నలమేల్మంగను చనవులిమ్మికను॥
274) గుజ్జరి/వరాళి
ప॥ హేయమేమిలేదు జగమంతా రుచికరమే। మాయావికారమిది మలసెట్టురోసునో॥
చ॥ కాయధారణములింపు కాంతల భోగములింపు। ఆయతమై వారి వారి యాహారాలింపు।

****************************************************************************************************

సోయగపు గన్నులను చూచేటి వేడుకలింపు। చాయ మనసొడబడి సమ్మతించితేను ॥
చ॥ పలుకులెల్లానింపు భావములెల్లా నింపు। చెలరేగి తమ తమ చేతలింపు।
జలమల సంగతుల సహజములవి యింపు। వొలిసి తమ మనసు తొడబడితేను ॥
చ॥ తగిన జన్మములింపు తమచక్కదనాలింపు। జగతివారికి వారి జాతులింపు।
నిగిడి శ్రీవేంకటేశ నీమహిమలేయని। ఒగరులేక మనసొడబడివుంటేను ॥

275) సావేరి
ప॥ నేనెంత కోపినైన నీకేల చలము। పూనినట్టి నాకు నీవు బుద్ధి చెప్పరాదా ॥
చ॥ బీరము లాడేవారికి బిరుదులే యెక్కుగాక। వోరుపుగల వారికి వొరతున్నదా।
నేరుపు గలవాడవు నేనేమనిన నీవు। ఆరితేరి చుట్టమవై అండనే వుండరాదా ॥
చ॥ తెరువ గలవారికి దిమ్ములట్టె రేగుగాక। మొగమోడే వారికి మోసమున్నదా।
తగవరివట నీవు తత్తరించి నే మీరితే। నగుతా నన్ను బోధించి నమ్మించరాదా ॥
చ॥ వాసులు వట్టేవారికి వట్టి జోలి మించుగాక।సేసవెట్టిన వారికి సిగ్గులున్నవా।
ఆసతో శ్రీవేంకటేశ ఆయములు నే నంటితే। యీసులేక కూడితివి యిక మెచ్చరాదా ॥

276) సావేరి
ప॥ వద్దు వద్దు మీలోన వట్టివాదులు। సుద్దుల మాటలకే సూడువట్టేరా ॥
చ॥ పంతములాడితేనేమి బలిమి చేసితేనేమి। వింతలేని మనసుల వెలదులకు।
దొంతర వలపులెల్ల తోడుతనే వెంటరాగ। యింతమాత్రపు వలపులివి చెల్లవా ॥
చ॥ గబ్బితనమైన నేమి గర్వము చూపిననేమి। వుబ్బేటి జవ్వనముల వువిదలకు।
నిబ్బరపు టాసలెల్ల నిండుకొని వుండగాను। అబ్బురపు దమకములవి మానీనా ॥
చ॥ కన్నుల నొక్కిన నేమి కౌగిలించుకొన్న నేమి। నిన్ను గూడి వుండినట్టి నెలతలకు।
మన్నించు శ్రీ వేంకటేశ మరి నీ యానవుండగా। సన్నపు మోవితీపుల చవులెక్కవా ॥

277) సౌరాష్ట్రి
ప॥ మంచిదాయ దానికేమి మాటలు పోట్లయ్యీనా।పెంచి యెంతసేసినా నీపెద్దరిక మింతేకా ॥
చ॥ మెల్లనే మాటలాడితే మించి ఇందరికి తోడాను। తెల్లమిగా నాడేవు తిట్టితినంటా।
బల్లిదుడ వౌదువయ్య పని యిందే కానవచ్చె। కల్లలాడేవా నీవు కలుగగబోలును ॥
చ॥ పూవుల చెండిచితేను పూచి ఇందరితోడాను। వేవేలుగా చెప్పేవు వేసితినంటా।
దేవరవుగావా నీవు తెలిసె నిన్నియు మాకు। నీవల్ల నేరమున్నదా నిజముగా బోలును॥
చ॥ పాదాలు సేవసేసితే పైపై నిందరితోడాను। గోదాన జెప్పేవు బెట్టి గుద్దితినంటా।
యీదెస శ్రీవేంకటేశ యెనసితి విక మీర। సాదవుగావా ఇవే చవులు గాబోను ॥

278) సౌరాష్ట్రి
ప॥ ఎట్టు గడియించె నమ్మ యీవలపు। పుట్టించి నటువంటి పూటకాపుమరుండు ॥
చ॥ తడబాటు నాలికకు తలకు మానంబునకు। నొడబాటు మఱపులకు నుదుటు దలపులకు।
కడువేడుకలు కోరికలకు భయ మాసలకు। బెడిదంపు గోపంబు బిత్తరి చూపులకు ॥
చ॥ అతి ముదము చింతలకును అలపు గర్వంబునకు। మితిలేని తాపంబు మెత్తని తనువునకు।
రతి గమ్మ చెమటలకు రచన విరహంబునకు। ధృతి లేమి మనసునకు గతి గమనమునకు ॥
చ॥ కురులు నెన్నుదుటికిని గుఱుతు లధరంబునకు। మురిపెంపు జిఱునగవు ముద్దు మోమునకు।
దిరమైన వేడుకలు తిరువేంకటేశునకు। బరిణాపు మాటలివి పడతు లిందరికి ॥

279) లలిత/ఆనందభైరవి
ప॥ హరి నీమయమే అంతాను। అరసి నీకు శరణని యెదను ॥
చ॥ యెదుట నెవ్వరిక నేమాటాడిన। అది నీ ఘన నామాంకితమే।
అదివొ సకలశబ్దాఖ్యుడవని నిన్ను। పొదలి చదువులు పొగడిగాన ॥
చ॥ యెవ్వరి బొగడని యెక్కడనుండిన। నివ్వటిల్ల నది నీరూపే।

నెవ్వదీర నిదెనిను విశ్వరూపు-।డెవ్వల ననిశత్రులెంచీ గాన॥
చ॥ భావన యిది నీబ్రహ్మాత్మకమే।శ్రీ వేంకటేశ నాచింత యిదే।
ఆవల నిను సర్వాంతర్యామని।దేవ శాస్త్రములు తెలిపీ గాన॥

280) లలిత/హిందోళ
ప॥ సోబాన బాడేము మేము సుదతులము।యీబుద్ధులు మీకు చెల్లు నిద్దరికి నయ్యా॥
చ॥ చూపులనే వుంకువలు సుదతికి బెట్టితివి।పూపనవ్వులు మించే కప్పురవిడేలు।
యేపుమీరి నవ్వులనే యెదురుతెర వేసితి-।వీ పొద్దే పెండ్లాయను మీకిద్దరికి నయ్యా॥
చ॥ తరితీపుమాటలనే తలబాలు వోసితి।గరిమ సరసములే కంకణాలు।
గౌరబై నపలపుల కొంగులు ముళ్ళువేసితి-।విరవాయ వేడుకలు ఇద్దరికి నయ్యా॥
చ॥ పొంచిన కెమ్మోవినే బువ్వపు విందు వెట్టితి।మంచముపై కాగిలే మంచివవికె।
అంచల శ్రీవేంకటేశ అలమేలుమంగ నీవు।యెంచి కూడితిరి దగు నిద్దరికినయ్యా॥

281) లలిత/ఖరహరప్రియ
ప॥ ఆయనాయ చాలు జాలు అంతసేయకు।నాయముల బెట్టి నిన్ను నవ్వించజాలనా॥
చ॥ సిగ్గున నూరక చెక్కు చేతితో నుంటిగాక।దగ్గరి మాటలాడ నిన్ను దడవా నాకు।
వెగ్గళించి నీమాట వేలుచుకొనుచుంటిగాక।యెగ్గులెంచి వొలవేయ నెంతకైనా నేరనా॥
చ॥ సారె సారె గన్నుల నీ సరిత చూచితిగాక।తారుకాణలకు దియ్య దడవా నాకు।
గారవపు నీమోహము కన్నదాకా నుంటిగాక।బీరమాడి నీతో నింత పెనగ నోపనా॥
చ॥ నిలుచుండి నేచేతకు నివ్వెరగందితి గాక।తలపెల్ల దెలియగ దడవా నాకు।
బలిమి శ్రీవేంకటేశ పాయకిట్టె కూడితివి।అలమేలు మంగను నేనంత నేరనా॥

282) లలిత/మోహన
ప॥ ఇతరుల నడుగము యితడే మా దాత।యితని యీవి వొరులియ్యగ గలరా॥
చ॥ దేవదేవుడాదిమ పురుషుడు హరి।శ్రీవత్సాంకుడు చిన్మయుడు।
యీవల నావల యిలువేలుపతడు।భావజగురుడు మా పాలిటివాడు॥
చ॥ జగదేక గురుడు శాశ్వతుడచ్యుతు-।డగజకు వరదుడు అనంతుడు।
తగి మము నేలికైనదైవము యేలిక।నిగమమూర్తి మా నిజబంధువుడు॥
చ॥ కలిదోష హరుడు కైవల్యవిభుడు।అలరిన శ్రీవేంకటాధిపుడు।
చలిమి బలిమి మా జననియు జనకుడు।అలమి యితడు మాయంతర్యామి॥

283) భైరవి
ప॥ ఏటికి నెగ్గులు పట్టే విందుకు నీవు।కూటము గలగు చోట గుట్టు మేలుగదా॥
చ॥ తెగనాడరాదు గాక తెలిసిన పనులకు।వగరాదా నిన్ను జూచి నాకు గొంతైనా।
జగడించవద్దుగాక చనవు గలుగుచోట।సగముచూపులు చూచి సాదించరాదా॥
చ॥ వదరగ రాదు గాక పాయరాని చోటికి।వొదిగి నివ్వెరగుతో నుండగరాదా।
అదలించవద్దుగాక ఆనలెల్ల బెట్టుకోగ।వదలక అంతేశాల వద్దనగరాదా॥
చ॥ గుఱిసేయరాదుగాక కూడిన కూటములకు।వెఱగునట్టి బలిమిసేయగరాదా।
యెఱిగి శ్రీవేంకటేశ యెనసితి నిటు నన్ను।తఱి దూరగవద్దు గాక తలపించరాదా॥

284) భైరవి
ప॥ మామాట వినవె కొంత మన్నించి నీవు।నీమనసు కోరికల నేరుపులలోనా॥
చ॥ మొక్కకువె నిన్నతడు మొగము చూచినదాక।గుక్కుచు నింతుల పెద్దకొలువులోన।
పెక్కుమాట లాడకువె పేర బిలిచినదాకా।అక్కరైన సరసపుటాసలలోన॥
చ॥ కేరినవ్వకువె తానె కేలు పయిచాచినదాక।సారమైన వలపుల సందడిలోన।
అరసి చూడకువె నిన్నాయము లంటినదాక।బీరపు తమకముల పెనగులలోన॥
చ॥ కొసరకువె యాతడు గొబ్బున గూడినదాక।ముసగసల యాకతముల మీలోన।

***************************************************************************************************

యెసగి శ్రీవేంకటేశు డిదివో నిన్ను గలిసె । అసురుసురుగాకు నెయ్యములలోన ॥

285) హిందోళవసంతం

ప॥ ఏమనేవే యీతగవులిందరూ నెఱగరా । కోమలపు మగవాడు కొలదు లెఱుగునా ॥

చ॥ వరుసలంతా సరే వలపే యెక్కుడు గాని । గరిమెల నీవేల కాతాళించేవే ।
పురుషుడు నాతడే భోగించేవారి భాగ్యము । మరిగించి కలిసితే మఱి చలివాయదా ॥

చ॥ సవతులంతా సరే చనవే యెక్కుడు గాని । వివరించుకొనకేలే వేగిరింపులు ।
కవగూడి వాడొకడే కలిసే వారి నేరుపు । చివురు బలిసితేనే చేగలై నిలువునా ॥

చ॥ కళలూనంతా సరే కరగే దెక్కుడు గాని । పలుమారు నీవేల పంతమాడేవే ।
అలమె శ్రీవేంకటేశుడంటిన మాహొడబాటు । తొలుత మీనవ్వులెల్లా దొంతులకు నెక్కవా ॥

286) హిందోళవసంతం

ప॥ లలితాంగి యౌవనము లావణ్యముల ప్రోవు । అలరి యిటువలె జేసెనమ్మా ॥

చ॥ జవ్వాది మిగుల నుష్ణము మీద సంపంగి । పువ్వు గట్టినది గాన పొదలె దాపంబు ।
నివ్వటిలు గొజ్జంగి నీట నొయ్యన కడిగి । దువ్వటపు బయ్యెదను దుడువరమ్మా ॥

చ॥ మృగమదము గడు వేడి మెలుత తలపట్టునకు । అగలు గూడగ వేద నగ్గలంబాయ ।
బిగువైన కస్తూరి బేంట్లొయ్యనగోర । నగలించి తట్టుపును గంటరమ్మా ॥

చ॥ విరహతాపంబునకు వేరెండు గతిలేదు । పొరసి వేగించినా బోదు ।
తిరువేంకటా చలాధిపుని మన్నన గాని । అరిదిమోహము దీరదమ్మా ॥

287) హిందోళవసంతం

ప॥ అమ్మవారు నయ్యవారు నండనె కూచున్న వారు । యిమ్ముల నిద్దరూ జాణలే మందమే ॥

చ॥ కొల్లున నవ్వీనతడు గుట్టున నున్నది యాకె । తెల్లవారుదాకా మాటదిద్దనె పట్టె ।
పల్లద మాతని వంక పంతము లీ చెలివంక । యిల్లిదె యిద్దరూసరె యేమందమే ॥

చ॥ తొక్కు బాదము లతడు తొరలి పెనగు నీకె । చెక్కుల నొక్కి బుద్ధులు చెప్పనె పట్టె ।
మొక్కల మాతనిపాలు మురిపెమీ సతిపాలు । యెక్కెజల మిద్దరికి నేమందమే ॥

చ॥ చేతులు చాచు నతడు సిగ్గున నుండు నీకె । యీతల విడే లిద్దరి కియ్యనె పట్టె ।
ఆతడు శ్రీవేంకటేశు డలమేలు మంగయింతి । యేతుల నిద్దరూ గూడి రేమందమే ॥

288) ఆనందభైరవి

ప॥ యేడకేడ నాగుణ మెఱుగని వాడవా । యీడువెట్టుకొనే నంటే నెంతదాన నేను ॥

చ॥ వలపెఱిగి నీవేవచ్చి నన్నేలుట గాక । పిలిపించగల నాపెను దొరవు ।
తలప దెలిసి మాట తగ నీ వాడుట గాక । పలికించ నోపుదునా పంతగాడవా ॥

చ॥ వొడబాటు దలచక వొగి నన్నేలుదుగాక । వొడి వట్టవచ్చునా వున్నతుడవు ।
బడలిక జూచి నీవే పైకొని కూడుదుగాక । అడుగదగవా కౌగి లప్పుడే నిన్నును ॥

చ॥ సేయసేయగా జూచి సేసలు వెట్టేవుగాక । వాని చెప్పుకో వసమా దేవుడవూ ।
శ్రీ వేంకటేశ నీవే చేకొని పెండ్లాడితివి । భావించ నాకు దరమా పంతగాడవు ॥

289) ఆనందభైరవి

ప॥ యెడమాట లాడించే నెందాకాను । వుడివోని మచ్చికతో నున్నదాన ననవే ॥

చ॥ తానేగతి యనేదాన దయ గోరుకున్న దాన । వీనుల దనకతలే వింటా నున్నదాన ।
మానరాని పొందుదన మానాపతి దానను । నానావిధముల విన్నపమిదే యనవే ॥

చ॥ మొక్కు తానే వున్నదాన మోహించి యున్నదాన । చెక్కు చేత దన రూపు చింతించేదాన ।
యిక్కువనే వున్నదాన యెదురు చూచేదానను । మిక్కిలి యాసతోడ నమ్మి యున్నదాన ననవే ॥

చ॥ తగుల మిగులదాన తమకించి యున్నదాన । మగటిమితో దన మన్నన దాన ।
బిగినింతలో దావచ్చి శ్రీ వేంకటేశుడు గూడె । జగములో దనకునే జనవరి ననవే ॥

290) ఆనందభైరవి

****************************************************************************************************

ప॥ ఎట్టు వలపించితివి యేమీ నెఱుగని నన్ను । పట్టరాదు ప్రాయమిది పైపై నున్నదిరా॥
చ॥ వినుకలి విరహమే వేడుక తోచెగాని । కనుగొంటే దమకము కడుబెట్టురా ।
మనసున దలచుటే మంచిదయి వుండీగాని । తనువు గాగలించితే తతిగొనీ మఱపు॥
చ॥ తెమ్మలై తోంటికూటమి దిష్టమై వుండీగాని । కమ్మిమీదటి కోరిక గాసిబెట్టీరా ।
చిమ్ముమ నీకెదురు చూచినదే యింపాయగాని । కమ్మర నంటితే గోరు కడువాడిరా॥
చ॥ మంచి దూతికలయెడ మాటలే చవాయగాని । కంచము పొత్తిచ్చితేనే కళదాకేరా ।
అంచల శ్రీవేంకటేశ అలమేలు మంగనేను । యెంచి కూడితివి యిన్ని నియ్యకోలే యికను॥

291) శ్రీ

ప॥ ఏమిగల దిందు నెంత గాలంబైన । పామరపు భోగ మాపదవంటి దరయ॥
చ॥ కొండవంటిది యాస గోడ వంటిది తగులు । బెండువంటిది లోని పెద్దతనము ।
పుండు వంటిది మేను పోలించినను మేడి । పండు వంటిది సరస భావమింతయును॥
చ॥ కంచువంటిది మనసి కలిమి గల దింతయును । మంచువంటిది రతి భ్రమత వంటిది ।
మించువంటిది రూపు మేలింతయును ముట్టు । పెంచువంటిది దీని ప్రియమేమి భ్రాతి॥
చ॥ ఆక వంటిదిజన్మ మడవి వంటిది చింత । పాకువంటిది కర్మ బంధమెల్ల ।
యేకటను దిరువేంకటేశు దలచిన కోర్కి । కాక సౌఖ్యములున్న గని వంటి దరయ॥

292) శ్రీ

ప॥ ఉదయాద్రి తెలుపాయె నుండు రాజు కొలు వీడె । అద నెఱిగి రాడాయె నమ్మ నా విభుడు॥
చ॥ చన్నులపై ముత్యాల సరులెల్ల జల్లనాయె । కన్నులకు గప్పొదవె గొంత నా కిపుడు ।
కనె కలువల జాతి కనుమోడ్చెనది మీద । వెన్నెల వేసంగి మొగ్గ వికసించె గదవె॥
చ॥ పువ్వుల లోపలి కురులు బుగులు కొనగా నెఱసె । దవ్వుల దుమ్మెదగములు తరమి డాయగను ।
రవ్వసేయ శుక పికము రాయడి కోర్వగ రాదు । అవ్వలనెవ్వతె పసల కలరున్న వాడో॥
చ॥ పన్నీట జలక మార్చి పచ్చకప్రము మెత్తి । చెన్ను గంగొప్పున విరులు చెరువందురిమి ।
ఎన్నంగల తిరువేంకటేశుం డిదె ననుంగూడి । కన్నుల మనసునుం దనియం గరుణించెం గదవే॥

293) శ్రీ

ప॥ రచనల నిన్నిట రసికుడవు । యిచట విన్నపంబిదె సేసెదను॥
చ॥ పలుకుల చిలుకల పాట కోవిలల । పిలుచులుగా చెలి పెంచెనదే ।
అలుగకుమీ నీవందుకు రమణుడ । కల సహజమె యిది కసరులు గావు॥
చ॥ చనుజక్కవలను సతి నెరుల యలుల । ఘనముగ మూకలు గట్టించె ।
మొనలు చూపె మోపు గట్టెనని । ననిచి వేసరకు నాథుడవు॥
చ॥ నడపుల హంసల నయన చాతకముల । పడతి శ్రీవేంకటపతి పొదిగె ।
నిడువుల గూడుచు నిన్ను సోకించెనని । జడియకుమీ నీ చనవులె మెరసి॥

294) శ్రీ/రాగమాలిక

ప॥ వెఱపు దెలుపు నీ వేగిరమే నీ- । వెఱిగియు నెఱుగక యేమంటివో॥
చ॥ గోరపు రుధిరము గురియు గోళ్ళ నీ- । తోరమైన యా తొడ మీద ।
గోరంటగోళ్ళ కోమలి నిలువగ । ఈ రసమందక నేమంటివో॥
చ॥ నెత్తురు బెదవుల నీమొక మలరగ । బిత్తరి వీడెపు బెదవులతో
మత్తకరి గమన మాటలాడగా । ఎత్తిన మదమున నేమంటివో॥
చ॥ ఆనన రౌద్రము నట్ట హాసమున । హూనిన నిను గని బొమ ముడితో ।
లే నగవుల నదలింపెడి సిరితో । హీనాధికముల నేమంటివో॥
చ॥ పెదపెద యూర్పుల పేగుల జందెపు- । టుదరముతో నీవుండుచును ।
చెదరిన పయ్యెద చెరగు జారుసతి । యెదురెదురను నేమంటివో॥
చ॥ చింపి నెరుల నీ శిరసు ముడుచు కొని । కంపముడిగి వేంకటపతివై ।

లంపట మందుచు లక్ష్మీసతితో। ఇంపులు నెరపుచు నేమంటివో॥
295) కన్నడగౌళ
ప॥ అప్పటప్పటి వేళల నన్నియు వివేకించి। తప్పకుండా దైవమునే తలంచవోయి జీవుండా॥
చ॥ తక్కిన యాహారము తరువాతనే నిద్ర। వచ్చు సురతాంతమున వైరాగ్యము।
గచ్చుల కర్మాంతమున గానవచ్చు నలుపెల్ల। మెచ్చుల సత్యము కొనమించివుండు ధర్మము॥
చ॥ పసిడి వెచ్చించు నాడే పట్టును లోభమెల్ల। ముసలితనాన వచ్చు విసుగెల్లను।
వెస సంసారపువేళనె యాసలు పుట్టు। పొసంగి యిట్టె జ్ఞానమును పొంతనుండు సుఖము॥
చ॥ కోపముదీరిన మీదకూడ వచ్చుశాంతము। చేపట్టి భక్తిగలిగి చేరు మోక్షము।
యేప్రొద్దు శ్రీవేంకటేశు నెడయక శరణంటె। కాపాడి యతండె యిచ్చు ఘనబ్రహ్మానందము॥
296) కన్నడగౌళ
ప॥ మఱపైన నొకకొంత మాటు గాదా। తెఱవ నూరక యేల తెలిపేరు సతులూ॥
చ॥ తరుణికిని విరహ సంతాపంబు దావాగ్ని। ధరియించ చెమటైన దండ గాదా।
మరుని కార్ముక బాణమహిమ గడు నెఱుగించె-। దుర దురస చేతులనె తుడిచేరు సతులు॥
చ॥ పొలితి కిపుడొకయింత పొద్దువోకలుసేయ। తలపోతయైన దరిదాపు గాదా।
వెలలేని సోయగపు విభుని చల్లనిరూపు। పెలచ మాటలనే మరపించేరు సతులు॥
చ॥ అలివేణి మేని విరహాగ్ని లొయ్యన పూడ। నలరు నిట్టూర్పులైన యాస గాదా।
వలపెరిగి వేంకటేశ్వరుడు గరుణించెనిదె। కలువపూవుల బంతి గట్టేరు సతులు॥
297) కర్ణాటక దేవగాంధారి
ప॥ అతి రాజసపు దొరవైన నిన్నును। సతమైన నేనిట్టె సాధించవచ్చునా॥
చ॥ వెడగు నీ సుద్దులెల్ల వీనుల వినుటగాక। నొడిగి నిన్నవి నే మానుపవచ్చునా।
కడగిన చేతలెల్ల కన్నుల జూచుటగాక। అడచి నీతో నౌ గాదనవచ్చునా॥
చ॥ పచ్చినీ గుణములకు పరిణామించుటగాక। కెచ్చురేగి బొమ్మల జంకించవచ్చునా।
తచ్చిన నీయెమ్మెలకు దలవంచు కొంటగాక। వొచ్చమని నిన్ను మెచ్చకుండ వచ్చునా॥
చ॥ దక్కిన నీకౌగిటను తనివి నొందుటగాక। చక్కని నిన్ను నే గొసరవచ్చునా।
అక్కున శ్రీవేంకటేశ అలమేలు మంగనేను। యెక్కువ నీరతులివి యెంచవచ్చునా॥
298) కర్ణాటక దేవగాంధారి/శుభపంతు వరాళి
ప॥ మాయామోహము మానదిది। శ్రీయచ్యుత నీ చిత్తమే కలది॥
చ॥ యెంత వెలుగునకు నంతే చీకటి। యెంత సంపదకు నంతాపద।
అంతటా నౌషధ మపథ్యమును సరి। వింతే మిగిలెను వేసటే కలది॥
చ॥ చేసిన కూలికి జీతమునకు సరి। పూసిన కర్మభోగము సరి।
వాసుల జన్మము వడి మరణము సరి। ఆసల మిగిలిన దలపే కలది॥
చ॥ మొలచిన దేహము ముదియుటకును సరి। తలచిన దైవము తనలోను।
యిలలో శ్రీవేంకటేశ నీ కరుణ। గలిగిన మాకెల్ల ఘనతే కలది॥
299) కర్ణాటక దేవగాంధారి
ప॥ ఇందుకు ధృవాదు లిటు సాక్షి। చెంది నమ్మవో జీవుడ నీవు॥
చ॥ కొండలవంటివి ఘోరపాపములు। ఖండించును హరి ఘన నామజపము।
నిందించును మతి నిత్యానందము। పండించునపుడె పరమ పదంబు॥
చ॥ జలధులవంటివి జనన బంధములు। తొలగించును హరితూరిన భక్తిది।
వెలిగించును ఘనవిజ్ఞానంబులు। చెలగించును బహు సిరి సంపదలు॥
చ॥ తోవరాని బహు దుఃఖము లణచును। శ్రీవేంకటపతి జేరిన శరణము।
పావనంబుగా బచరించు గుణము। కైవసమగు లోకము లెల్లాను॥
300) హిందోళ

ప॥ వనితకు బతికిదె వసంతము। దిన దినము నమరె తిరుమల మీద॥
చ॥ పుప్పొడి వసంతము పొసగె రమణునికి। కప్పుర వసంతము కాంతకును।
కొప్పెరల నెదురుగ గుంకుమ పన్నీరు నించి। కుప్పెల జల్లు లాడేరు కోనేటికాడ॥
చ॥ జవ్వాది వసంతము చతురుడు గైకొనె। పువ్వుల వసంతము పొలతికిదె।
రవ్వగా బండ్లపై రాసులు వోసుక। నవ్వుతా వేటలాడేరు నడిమిచిందాడ॥
చ॥ గందపు వసంతము గడు శ్రీవేంకటపతి। అందె కస్తూరి వసంత మలమేల్మంగ।
చిందుచు దట్టు పుణుగు చిమ్ముచు గూడాడేరు। సందడి సమరతుల సంపెంగ కాడ॥

301) హిందోళ

ప॥ కరుణించవె నిజగతి బోధించవె। హరినిన్ను గొలువక యలసీ బ్రాణి॥
చ॥ కలలో నింతులు గలసి నట్లనే। వెలిగాంతల తోడి వేడుకలు।
లలి నిందుకుగా లంపటములబడి। పలుమారు నూరక బడలీ బ్రాణి॥
చ॥ నిన్నటి యాహార నిజరుచి వలెనే। అన్నువ నిప్పటి యాహారము।
యెన్న నిందుకే యిడుమల బొరలుచు। కన్న గతుల గడు గలగీ బ్రాణి॥
చ॥ పరుసము సోకిన బంగారమువలె। పరమ భాగవత పట్టములు।
అరయగ శ్రీవేంకటాధిప నీకృప। యిరవుగ గని తుదకెక్కీ బ్రాణి॥

302) రీతిగౌళ

ప॥ విచ్చి చెప్పరాదు వింతలు యీ భావాలు। రచ్చల కెక్కెను అంత రవ్వసేయ నేటికి॥
చ॥ వలపులలోనివే వడిగొన్న యాసలెల్ల।సెలవులలోనివే సిగ్గులెల్లాను।
పిలుపులలోనివే ప్రియములు గలవెల్లా। కులికి కులికి యేలే కొసరేవు పతిని॥
చ॥ చనువులలోనివే సరసములెల్లాను। ననుపులలోనివే నయములెల్లా।
మనసులలోనివే మచ్చికలు గలవెల్లా। వొనర నింకా నేలే వొరసేవు పతిని॥
చ॥ నమ్మికలోనివే నానాటి వొడబాట్లు। వుమ్మడి వయసులోనే వొద్దికలెల్లా।
నెమ్మది గూడె నతడు నిన్ను నిట్టె బుజ్జగించి। చిమ్మకువే గోళ్ళను శ్రీవేంకటపతిని॥

303) నాట

ప॥ విఱిగి పారెడియట్టివీరిడియోరిపులాల। తఱి శరణు చొరరో దండాలువెట్టరో॥
చ॥ వీడె వచ్చె గృష్ణుడిదె వేయరోకైదువులు। కాగినపోట్లు రాగీ కదియకురో।
పోడిమితో భీతివాయ పూరి నోళ్ళ గరవరో। ఆడువార మనుకోరో ఆతడు దడవడు॥
చ॥ గోవిందుడు దాడివచ్చె గునుకుచు బారరో। కావు మని మెడల బాగలువేయరో।
వేవేగ బిడ్డల బేర్లు విభునికి బెట్టరో। వో వో యెంగిలికి జేతు లొగ్గరో రక్షించీని॥
చ॥ మొత్తీ శ్రీవేంకటేశుడు మూలలకు దాగరో। వొత్తిలి పంతములిచ్చి మీరోడగదరో।
హత్తి మీతలలు విరియగబోసుకొనరో। బొత్తుగా మిమ్ము గెలిచె బొగడరో మెచ్చీని॥

304) కాంభోజి

ప॥ ఐనట్టయ్యీగాక హరికల్పితము లివి। మానేటి వేటివో మానని వేవో॥
చ॥ వొక్కరు తలచినట్టు వొకరితలపు రాదు। పక్కన నందరికి బహుభావాలు।
అక్కట మొదలొకటి అనలుగొనలు వేరు। యెక్కడని తగిలేది యేమిసేసేది॥
చ॥ పొరుగువానిచేత ఆపొరుగువాడు మెచ్చడు। నరులకర్మములు నానావిధాలు।
గరిమ నన్ను మొక్కటే కడుపుతనివి వేరు। కరుణించౌనన నేవి కావన నేవి॥
చ॥ కడగి దరిద్రునిమాట కలవాని కింపుగాదు। బెడగు జీవుల పొందు పెక్కురీతులు।
కడుశ్రీవేంకటేశు డొక్కడు జగత్తులు వేరు। వొడిగట్టుకొనే దేది వొల్లననే దేది॥

305) నాట

ప॥ నిండె నిన్నిచోటులను నీమహిమలే। అండనే మొక్కేము నీకు నాదినారసింహా॥
చ॥ కూరిమి యిందిరమీద కోపము అసురమీద। తారుకాణనవ్వు దేవతలమీదను।

ఆరీతి నీకొలు విట్టే అహోబిలముమీద । నాదుకొనె నీనేరుపు నారసింహా ॥
చ॥ కరుణ ప్రహ్లాదుమీద గన్నులు దిక్కుల మీద । సరిచేతులు పేగులజంధ్యాలమీద ।
గరిమ నీనటనలు ఘనప్రతాపముమీద । తిరమాయ నీకోరిక దివ్యనారసింహా ॥
చ॥ శాంతము లోకముమీద శౌర్యము శత్రులమీద । కాంతులెల్లా తనదివ్యకాయముమీద ।
చింతదీర వినోదము శ్రీవేంకటాద్రిమీద । సంతతమై నీకు జెల్లె జయనారసింహా ॥

306) సాళంగనాట
ప॥ అన్నిటా నీపెంపు వింత హనుమంత నీ- । వున్న చోటు నిశ్చింత మోహనుమంతా ॥
చ॥ రాముని సేనలు గాచి రావణుగర్వ మణచి । ఆముకొన్న బలవంత హనుమంతా ।
గోమున జలధి దాటి కొండతో సంజీవి దెచ్చి । ధీమంతుడవైతి వింత దివ్యహనుమంత ॥
చ॥ చుక్కలు మొలపూసలై సూర్యమండలము మోచె । అక్కజపునీరూపంత హనుమంత ।
చొక్కమై మీ రుండగాను సుగ్రీవాదులకెల్లా । అక్కర లే దించుకంతా హనుమంతా ॥
చ॥ జంగచాచి చేయెత్తి సరి బిడికిలించుక । అంగము నిక్కించి తెంత హనుమంత ।
బాగగు శ్రీవేంకటాద్రిరామునిదేవి కిచ్చితి- । వంగులియ్యక మొక్కంత హనుమంతా ॥

307) రామక్రియ
ప॥ మగటిమిగలహనుమంతరాయ । దిగువపట్టణములోనిదేవ హనుమంత ॥
చ॥ చక్కగా దోక చాచి జంగవెట్టి చేచాచి । అక్కజపుప్రతాపపుహనుమంతుడా ।
రక్కసుల దునుమాడి రామునిదేవులకు । దిక్కై వుంగరమిచ్చినదేవ హనుమంత ॥
చ॥ కీలు గంటు వేసుకొని కెరలి పిడికిలించి । ఆలకించేవు దిక్కులు హనుమంతుడా ।
నేలకు మింటికి మేను నిండ బెరిగి యక్షుని । తీలుపడగొట్టినట్టిదేవ హనుమంతుడా ॥
చ॥ తమితోడ దాసులను తప్పక కాచేనని । అమర నభయమిచ్చినహనుమంతుడా ।
జమళి శ్రీవేంకటేశుసరసవూడిగానకు । తిమురుచు నుండేయట్టిదేవ హనుమంతా ॥

308) శ్రీ
ప॥ ఏమి చెప్పే దిది యీశ్వరమాయలు । దీముప్రతిమకును త్రిజగము కలిగె ॥
చ॥ కులగోత్రంబుల మాంసపుముద్దకు । కులగోత్రంబులగుఱి గలిగె ।
తొలుతతొమ్మిదగుతోలుదిత్తికిని । పిలువగ బేరును బెంపును గలిగె ॥
చ॥ నెత్తురునెమ్ములనీరుబుగ్గకును । హత్తినకర్మము లటు గలిగె ।
కొత్తవెంట్రుకలగుబురులగంతికి । పొత్తులసంసారభోగము గలిగె ॥
చ॥ నానాముఖములనరములపిడుచకు । పూనినసిగ్గులు భువి గలిగె ।
ఆనుక శ్రీవేంకటాధిపు డేలగ । దీనికి బ్రాణము తిరముగ గలిగె ॥

309) కేదారగౌళ
ప॥ కమలారమణ నీకల్పితపుమానిసిని । తమితోడ నాదిక్కు దయ జూడవే ॥
చ॥ ఆరీతి బ్రాహ్మణుడ ననుటేకాని దేహము । కోరి యాచారమునకు గొలుపదు ।
పేరు వైష్ణవుడననేపెద్దరికమే కాని । సారమైనమనసులో జ్ఞానము లేదు ॥
చ॥ చదివితిననియెడి చలపాద మింతే కాని । ఆదన నందులోని అర్థమెఱుగ ।
పదరి సంసారమనే బహురూపమే కాని । చతురదనాన నందు సమర్థుడ గాను ॥
చ॥ దేవ మీభక్తుడననేతేజ మొకటె కాని । చేవమీర నిను బూజించ నేరను ।
శ్రీవేంకటేశ నీచేతిలోనివాడ నేను । భావించి మఱి యేపాపము నెఱుగను ॥

310) కాంభోజి
ప॥ ఇన్నాళ్ళు నందునందు నేమి గంటిని । అన్నిటా శరణు చొచ్చి హరి నిను గంటిని ॥
చ॥ అంగనలపస జిక్కి అలయికలే కంటి । బంగారువెంట దగిలి భ్రమ గంటిని ।
ముంగిటిక్షేత్రాలంటి ముంచి వెట్టిసేయ గంటి । అంగపునన్నే చూచి అంతరాత్మ గంటి ॥
చ॥ చుట్టాల జేరి చూచి ముద్దులవాపుల గంటి । మట్టులేనివయసుతో మదము గంటి ।

వట్టికామములు సేసి వరుస మాయలు గంటి। పట్టి నారాయణయని భక్తి నిను గంటిని॥
చ॥ వింతచదువులవల్ల వేవేలుమతాలు గంటి। సంతకర్మముల వల్ల సాము గంటిని।
యింతట శ్రీవేంకటేశ యిటు నాజీవభావము। చింతించి అందులోన నీశ్రీపాదాలు గంటి॥

311) సామంతం
ప॥ సొరిది మమ్మిట్టే దయజూతువుగాకా। నెరసి మరి యెక్కడా నేమి విన్నవించే మికను॥
చ॥ తలచితి నీరూపము తగిలితి నీపాదాలు। కలసితి నీదాసులగమిలోనను।
చలివాసె భవములు నడిదీరె గర్మములు। యెలమి నీమహిమలు యేమిచెప్పే మికను॥
చ॥ నీముద్రలు ధరించితి నీగుణాలు వొగడితి। చేముట్టి పూజించితి శ్రీయంగాలు।
తామసములెల్లా నూడె తతివచ్చె సాత్వికము। గోమున మరేమి నిన్ను కొసరే మికను॥
చ॥ తిరుమణి ధరించితి తీర్థప్రసాదాలు గొంటి। విరివైననీకథలు వీనుల వింటి।
పరగ శ్రీవేంకటేశ పరము నిహము గంటి। అరసి యితర మేమి ఆశపడే మికను॥

312) వరాళి
ప॥ శ్రీపతి నీవు సిద్ధించుటే సిద్ధులన్నియు। పైపై నీశరణమే పరమపదంబు॥
చ॥ పరమాత్మునిపై నాత్మప్రవేశింపజేయుటే। పరికింప బరకాయప్రవేశము।
గరిమ నాహృదయాకాశమున దలచుటే। గిరవై యబ్బినయట్టి ఖేచరత్వము॥
చ॥ మంచిపరమహంసనామము ప్రాణులచే వింట। వంచులవినేటిదూరశ్రవణము।
కాంచి నీరూపము ఆరుకమలాల ధ్యానించుట। యెంచగ దూరగమన మింటిలో నౌట॥
చ॥ సావధానమె లోచూపు సర్వథా నిన్ను జూచుట। తావులనే అనిమిషత్వము చేరుట।
శ్రీవేంకటేశ్వర నీసేవకుడై నిలుచుటే। వేవేలుతత్వజ్ఞానవిధుల నిలుచుట॥

313) దేసాళం/కేదారగౌళ
ప॥ అంతరంగములో నున్న హరియే గతిగాక। చింతించి మొక్కితే దానే చేకొని రక్షించును॥
చ॥ పుట్టించినకర్మమే పోషించకుండునట। బెట్టుగా మనసే మఱపించునట।
పట్టినమేనే ఆసల బతిమాలింపించునట। చుట్టములెవ్వరు యెంచిచూచిన బ్రాణికిని॥
చ॥ పక్కన విత్తినభూమి పంట పండకుండునట। యెక్కడా మాయే భ్రమయింపించునట।
అక్కడతో జేసినపుణ్యమే కట్టివేసునట। దిక్కు దెస యవ్వరు యీదేహి గరుణించను॥
చ॥ ఆసలబెట్టేపాయమే అటమటమౌనట। సేసేసంసారమే జ్ఞాని జేయునట।
వేసరక యింతకూ శ్రీవేంకటేశు డేలికట। మోసపుచ్చేవారెవ్వరు ముదమే జీవునికి॥

314) దేసాళం/ఖరహరప్రియ
ప॥ ధరణి నెంద రెన్నితపములు చేసినాను। హరికృపగలవాడే అన్నిటా బూజ్యుడు॥
చ॥ మితిలేనివిత్తు లెన్ని మేదినిపై జల్లినాను। తతితో విత్తినవే తగ బండును।
యితరకాంతలు మఱి యెందరు గలిగినాను। పతి మన్నించినదే పట్టపుదేవులు॥
చ॥ పాలుపడి నరులెన్ని పాట్లు బడికొలిచినా-। నేలికె చేపట్టినవాడే యెక్కుడుబంటు।
మూల నెంతధనమున్నా ముంచి దానధర్ములు। తాలిమితో నిచ్చినదే దాపురమై నిల్చును॥
చ॥ యెన్నికెకు గొడుకులు యెందరు గలిగినాను। యిన్నిటా ధర్మపరుడే యీడేరును।
వున్నతి జదువులెన్ని వుండినా శ్రీవేంకటేశు। సన్నుతించినమంత్రమే సతమై ఫలించును॥

315) దేవగాంధారి
ప॥ అన్నిటికి మూలమని హరి నెంచరు। పన్నినమాయలో వారు బయలు వాకేరు॥
చ॥ ప్రకృతిబోనులోపల జిక్కి జీవులు। అకట చక్కనివార మనుకొనేరు।
సకలపుణ్యపాపాలసంధిజన్మములవారు। వెకలిసంసారాలకే వేడుకపడేరు॥
చ॥ కామునియేట్ల దిగగారేటిదేహులు। దోమటితమబదుకే దొడ్డదనేరు।
పామిడికోరికలకు బంట్లైనవారలు। గామిడితనాల దామే కర్తల మనేరు॥
చ॥ యితరలోకాలనెడియేతపుమెట్లప్రాణులు। కతల మోక్షమార్గము గంటిమనేరు।

తతి నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వర। మతకాననున్న వారు మారుమలనేరు॥

316) దేసాక్షి/సామ

ప॥ ఎంత సోదించి చూచినా యెన్నెన్ని చదివినా। వింతలైన నీమూర్తి వెస దెలిసేనా॥

చ॥ లోకములో సముద్రములోతు చెప్పగరాదట। ఆకాశ మింతింతని యనరాదట।
మేకొని భూరేణువులు మితి వెట్టగరాదట। శ్రీకాంతుడ నీమహిమ చెప్పిచూపవశమా॥

చ॥ అల గాలి దెచ్చి ముడియగా గట్టగరాదట। వెలయ గాలము గంటువేయరాదట।
కలయ నలుదిక్కులకడ గానగరాదట। జలజాక్ష నీరూపు తలపోయగలనా॥

చ॥ కేవలమైననీమాయ గెలువనేరాదట। భావించి మనసు జక్కబట్టరాదట।
దేవ యలమేల్మంగపతివి నీశరణే గతి। శ్రీవేంకటేశ నిన్ను జేరి కొల్వవశమా॥

317) శంకరాభరణం

ప॥ నీచిత్తము నాభాగ్యము నే నెంతటివాడను। యేచి నీవు రక్షించేదే యెక్కుడుపుణ్య మింతే॥

చ॥ పాటించి నీభావము పట్టవశమా తలచి। మేటినామనసు నీకు మీదెత్తుటింతే।
నూటికైన నీనామము నుడుగగవశమా। మాటలు నీసెలవుగా నుట్టుపెట్టు టింతే॥

చ॥ వేవేలైన నీకథలు వినగ నాతరమా। సోవగా వీనులు తావు చూపుట యింతే।
దేవ నీసాకారము ద్రిష్టించనావశమా। పావనముగా నందులో బనిగొను టింతే॥

చ॥ గట్టిగా నిన్ను బూజించ గమ్మటి నావసమా। నెట్టన నామేను నీకు నేమించు టింతే।
పట్టపలమేల్మంగపతివి శ్రీవేంకటేశ। జట్టిగొనుకొరకు నీశరణను టింతే॥

318) గౌళ

ప॥ నమ్మవలెగాని యెన్నడు సందేహము లేక। యమ్ముల దేవుడు వరమిచ్చు టేమరుదు॥

చ॥ మగనిపై బత్తిసేసి మంచిలోకా లెక్కేరట। తగు దండకోల వట్టి తత్వగతి గనేరట।
పగటున నొకవేరు వట్టి పాము బట్టేరట। తగిలి హరిదాసులు ధన్యులౌటేమరుదు॥

చ॥ యేలికకు ధనమిచ్చి హితభోగా లందేరట। కేల గత్తిపూని పగ గెల్చేరట।
గాలి లోలో బూరించి ఘనసిద్ధు లయ్యేరట। యేలీల హరిదాసులు యీడేరు టేమరుదు॥

చ॥ దిక్కుల యజ్ఞాలు చేసి దివిజు లయ్యేరట। మొక్కి విప్రుల నర్చించి ముంచి సిరు లందేరట।
పక్కన నలమేల్మంగపతి శ్రీవేంకటేశ్వరు। జక్కన గొల్చినదాసులు జ్ఞానులౌటేమరుదు॥

319) ముఖారి

ప॥ నీకేల యీగుణము నీ వేమి గట్టుకొంటివి। యీకడ లాలించితే మేమిటు నిన్ను గొలుతుము॥

చ॥ మాటలకు లోగానిబ్రహ్మమనంటా దాచి దాచి। మాటాడకుండేవుసుమ్మీ మాతో నీవు।
నీటున మనసులో నిలుపరానివాడనంటా। పాటించి మాకు బొడచూపకుంటే గతియేది॥

చ॥ శ్రుతులకు బట్టరానిచోద్యపుబ్రహ్మనంటా। మతకాన జిక్కక మానేవుసుమ్మీ।
పతివి నీ గంభీరము బయటబడీ నంటా। అతిగోప్యాన విన్నది యెట్టెఱిగేము॥

చ॥ మాయపన్ను కొనినవుమ్మడిబ్రహ్మమనంటా। యేమెడనైనా భ్రమయించేవుసుమ్మీ।
పాయపుటలమేల్మంగపతివి శ్రీవేంకటేశ। యీయెడ నీశరణంటి మిన్నిటా మమ్మేలుమీ॥

320) దేసాక్షి/కల్యాణి

ప॥ కోటానుకోట్లాయ కోరికెలు జన్మములు। కూటున గూడి రాట్న పుగుండ్రలై నారయ్యా॥

చ॥ మిన్నుపైనున్న జీవులు మన్నుపై బ్రవేశించి। అన్నద్వారమున దేహము మోచి।
మున్నిటిదానఫలా లిమ్ముల భుజించి యప్పటి। తిన్న నికర్మములు గాదెల బోసేరయ్యా॥

చ॥ యిరవు మఱచి మఱి యెరవులకాపిరేల। సురలు నరులమంటా జొక్కి చొక్కి।
సొరిది లోకములెల్లా జొచ్చి కాలగతులను। పొరి నాయుష్యము గొల్చిపోయుచున్నారయ్యా॥

చ॥ దండగాగ దిరుమలకొండ యెక్కి సుజ్ఞానులు। పండిమనసుతోడ బత్తిసేసి।
అండనే శ్రీవేంకటేశు నలమేల్మంగను గొల్చి। నిండునిధానములై నిల్చినారయ్యా॥

321) భుపాళం

ప॥ మొదలనేయెచ్చరికతో మోసపోక యేపొద్దూ। వెదకి హరికథలనే వినుచుండవలయు ॥
చ॥ వెలదులసుద్దులు వీనులను వింటేను। పెలుచుజూపుల జూడ బ్రేమ పుట్టించు।
మలసి యామాపులు మనసున దగిలించు। తలపు మాటలాడ దమిరేచును ॥
చ॥ మగువలతోడుత మాటలాడదొరకొంటే। నగినగి సంసారాలనంటు గల్పించు।
తగిలిననవ్వులు తనువులు సోకింపించు। మిగులా దనుసోకులే మించి వలపించును ॥
చ॥ సతులతో మోహము సంపదలు పోరించి। అతిసంపదలు దేహి నజ్ఞాని జేయు।
తతి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశుడే। గతియని కొలిచితే ఘనునిగా చేయును ॥

322)ముఖారి

ప॥ ఇందువల్ల నేమిగద్దు యినుపగుగ్గిళ్ళింతే। యిందిరారమణుసేవే యిరవైనపదవి ॥
చ॥ సతులతో నవ్వులు చందమామగుటుకలు। మతితలపోత లెండమావులనీళ్ళు।
రతులలో మాటలు రావిమానిపువ్వులు। తతి విరహపుకాక తాటిమానినీడ ॥
చ॥ లలనలజవ్వనాలు లక్క పూసక పురులు। నెలకొని సేసేబత్తి నీటిపై వ్రాత।
చెలువపువినయాలు చేమకూరశైత్యాలు। కొలదిలేని ననుపు గోడమీది సున్నము ॥
చ॥ పడతులవేడుకలు పచ్చివడగండగుళ్ళు। కడుమోవితీపు చింతకాయ కజ్జము।
బడి నలుమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరు-। డడరించినమాయలు అద్దములోన నీడలు ॥

323)బౌళి

ప॥ సత్యము సేయగవచ్చును సర్వేశ్వర యీమాటకు। నిత్యము నీవే యెఱుగుదు నేనేమి నెఱుగజుమీ ॥
చ॥ సులభుడవౌదువు వొకమరి చూడగ దుర్లభుడవౌదువు। తలపింతువు మఱపింతువు తగ బ్రాణములోనుండి।
పలికింతువు అక్షరముల పరగ నవే వ్రాయింతువు। వెలయగ నీవే వెలిగా వేరొకటి నే జేయజుమీ ॥
చ॥ వొనరగ బూజలు గొందువు వొక్కొకపరి మనుదు వటు। కను మూయింతువు నిదురల గడు మేల్కొలుపుదువు।
ఘనముగ నజ్ఞాని జేదువు కరుణతో జ్ఞానిజేతువు। నను బుట్టించితి నీవే నా కాపని గాదుసుమీ ॥
చ॥ నాలో నుందువు వొకపరి నగి శ్రీవేంకటగిరి నుందువు। పాలింతువు లాలింతువు భవమీడేరింతువు।
పోలింప సంసారి జేతువు భువి నీదాసుని జేతువు। కాలము గర్మము నీవే కపటము నే నేరజుమీ ॥

324)రామక్రియ

ప॥ వారి వారి భాగ్యములు వ్రాసి వున్నవి నొసళ్ళ। ధీరతతోనేది మేలో తెలిసికోరో ॥
చ॥ అట్టె కొందరు మతములన్నియు నేకమని। పట్టవర్ధనము నెత్తిబెట్టి చూపిరి।
జట్టి గొందరు జీవులు జంగమే లింగముగాని-। పుట్టుగెల్లా భస్మమని పూనుక చూపిరి ॥
చ॥ కొందరు నేమియును లేదు కొట్టగొన లయమని। అంది వట్టిలలాటశూన్యము చూపిరి।
కందువ గొందరు లక్ష్మీకాంతు డంతరాత్మయని। ముందే నామము శ్రీచూర్ణము బెట్టి చూపిరి ॥
చ॥ చెలగి దిష్టమిపుడు శ్రీవేంకటేశుడు। అలమేలుమంగపతి యై యున్నవాడు।
యిలవీర నీదాసుల కిట్టిబాగ్యరేఖలు। వలసినవారికెల్లా వ్రాసినాడితడు ॥

325)లలిత

ప॥ విచార మెన్నడు లేదు వీరిడిజీవులకును। పచారించేరు బ్రదుకు బ్రహ్మనాటనుండియు ॥
చ॥ పొద్దువొడచుటయును పొరి గూగుటయె కాని। అద్దుకొని మిగులుగ నందేమి లేదు।
వొద్దిక బుట్టుటయును వుడుగ జాచుటెకాని। కొద్దితోడ గాలమేమి గురియై నిలువదు ॥
చ॥ అన్నము భుజించేదియు నాకలి గొనేదెకాని। యెన్నికకు జెప్పిచూప నేదియు లేదు।
ఇన్నిట దిరిగాడేది ఇంటికి వచ్చేదే కాని। పన్ని తననిలుకడ భావించ లేదు ॥
చ॥ జవ్వనము మోచేదియు సరి ముదుసేదే కాని। తవ్వి కట్టుకొనే దేది దాచే దేది।
నవ్వుతా నలమేల్మంగనాయక శ్రీవేంకటేశ। రవ్వల నీ వేలికవు రక్షించు మికను ॥

326)శంకరాభరణం

ప॥ ఇంతకంటే నేమిసేసే మిదే మా మానసపూజ। సంతతము నీవు తొల్లే సర్వసంపన్నుడవు ॥
చ॥ అంతర్యామివైన మీకు నావాహన మదివో। అంతటా విష్ణుడ మీకు నాసనము వేసినది।

పంతపుకోనేరే మీకు బలుమారు నర్ఘ్యము। చెంతనే గంగాజలముచల్లేమీకు బాద్యము॥
చ॥ జలధు లన్నియును నాచమనియ్యము మీకు। అల యా వరుణజల మిదియే స్నానము।
పలనుగా మీమహిమలే వస్త్రాభరణములు। అల వేదములే మీకు యజ్ఞోపవీతములు॥
చ॥ ఇరవుగ గుబ్బ తొల్లిచ్చినదే మీకు గంధము। ధర మాలాకారునిపూదండలే మీకు పువ్వులు।
ఉరుగతి మౌనులహోమమే మీకు ధూపము తిరమైన మీకు రవితేజమే దీపము॥
చ॥ నానామృతములే మీకు నైవేద్యతాంబూలములు। పూనినభక్తి షోడశోపచారములు।
ఆనుక శ్రీవేంకటేశ అలమేల్మంగపతివి। తానకపుజపములే తగ మీకు నుతులు॥

327)లలిత

ప॥ భోగము నేను నీకు భోగివి నీవు। శ్రీగురుడ నిన్నిటాను చిత్తగించు నన్నును॥
చ॥ చక్కనిజన్మపుసంసారవృక్షమునకు। పక్కువఫలము నీవు భావించగా।
మక్కువ గర్మమనేటిమత్తగజమును। యెక్కిన మావటీడవు యెంచగ నీవు॥
చ॥ నెట్టన దేహమనేటి నిర్మలజన్మమునకు। పట్టమేలుచుండినభూపతివి నీవే।
దిట్టయైనచిత్తమనే తేజిగుఱ్ఱమునకు। వొట్టుక రేవంతుడవు వుపమింప నీవు॥
చ॥ సంతతమైనభక్తిచంద్రోదయమునకు। రంతుల జెలగు సముద్రమవు నీవు।
చెంతల శ్రీవేంకటేశ జీవుడనేమేడలోన। అంతర్యామివి నీవు అంకెలజూచినను॥

328)సాళంగనాట

ప॥ కౌసల్యానందనరామ కమలాప్తకులాలలయ। భాసురవరద జయపరిపూర్ణరామ॥
చ॥ మునుప దశరథరాముడవై తమ్ములు నీవు। జనించి తాటక జంపి జన్నము గాచి।
వెనుకొని హరువిల్లు విరిచి సీత బెండ్లాడి। అనుమతి పరశురామునిచే గైకొంటివి॥
చ॥ సుప్పనాతి శిక్షించి పోరిది ఋషుల గాచి। అప్పుడే ఖరదూషణాదుల గొట్టి।
చొప్పుతో మాయామృగము సోదించి హరియించి। కప్పి హనుమంతు బంటుగా సేసుకొంటివి॥
చ॥ సొలసి వాలి నడచి సుగ్రీవు గూడుక। జలధి బంధించి లంక సాధించి।
వెలయ రావణు గెల్చి విభీషణుని మన్నించి। చెలగితి వయోధ్యలో శ్రీవేంకటేశుడా॥

329)గౌళ

ప॥ గట్టిగా దెలుసుకొంటే కన్నదే కంటి గురుతు। దట్టమై సుజ్ఞానము తనలోనే వున్నది॥
చ॥ బయలే పంటలు పండె బయలే పాడి విదికె। బయలు ప్రపంచమై భ్రమయించెను।
బయటనే ప్రకృతియు బయటనే జీవులు। బయటనే బ్రహ్మము పరిపూర్ణమాయె॥
చ॥ ఆకసము మూలాయ నాకసము రూపులాయ-। నాకసము సంసారమై యలపడెను।
ఆకసాన దివియును నాకసాన లోకములు। ఆకసాన శ్రీహరి యవతారమందెను॥
చ॥ అంతరంగమే భోగము అంతరంగమే యోగము। అంతరంగమే అన్నిటి కావాసమయ్యె।
అంతరంగాన శ్రీవేంకటాధిపు డున్నవాడు। అంతరంగాన మోక్షము అతడే యొసగెను॥

330)గౌళ

ప॥ ఆతురబందుగుడవు హరినారాయణ కృష్ణ। మాతల పెఱిగి నీవే మన్నించితి విపుడు॥
చ॥ గురుకుమారుల దెచ్చికొని రక్షించినయట్లు। ధరలో గజరాజు నుద్ధరించినట్లు।
గరిమ జెరలుమాన్పి కాంతల బెండ్లాడినట్లు। సిరులతో మము దెచ్చి సేవలు గైకొటివి॥
చ॥ నేరుపుననే రుకుమిణిదేవి దెచ్చినయట్లు। ధీరత మునిపుత్రుల దెచ్చినయట్లు।
భారమైనయహల్యశాపము మానిపినయట్లు। గారవించి మము నేడు కరుణ జూచితివి॥
చ॥ లంక సాధించి సీతను లలి జేకొనినయట్లు। తెంకికి ననిరుద్ధుని దెచ్చినయట్లు।
అంకెల శ్రీవేంకటేశ అట్టె నీదాసులమని। పొంకముగ మాపాలిట బొసగి యేలితివి॥

331)శంకరాభరణము

ప॥ వేదములు నుతించగ వేడుకలు దైవారగ। ఆదరించీ దాసుల మోహననారసింహుడు॥
చ॥ నెఱులజడలతోడ నిక్కు గర్ణములతోడ। కుఱుచకొమ్ములతోడ కోఱలతోడ।

వుఱక సిరి దొడపై నుంచుక సింహాసనాన। మెఱసీ బ్రతాపములు మేటినారసింహుడు॥
చ॥ విడుపమీసాలతోడ నిట్టూరుపులతోడ। మిడిగుడ్లతో దెల్లనిమేనితోడ।
వొడలసొమ్ములు వెట్టి వొడ్డోలగమై వుండి। కడు మంచివరాలిచ్చీ ఘననారసింహుడు॥
చ॥ చిలుకుగోళ్ళతోడ నెలవినవ్వులతోడ। బలు జిహ్వతోడ యోగపట్టెముతోడ।
అలరి శ్రీవేంక్టాద్రి నహోబలగిరిని। అల ప్రహ్లాదుని గాచె నాదినారసింహుడు॥

332)శ్రీ
ప॥ సకలలోకనాథుడు జనార్దనుడితడు। శుకయోగివంద్యుని సుజ్ఞాన మెంత॥
చ॥ మరునితండ్రికిని మఱి చక్కదనమెంత। సిరిమగనిభాగ్యము చెప్ప నెంత।
పురుషోత్తముఘనత పొగడగ నిక నెంత। గరిమ జలధిశాయి గంభీరమెంత॥
చ॥ వేవేలముఖాలవానివిగ్రహము చెప్ప నెంత। భూవల్లభుని వోరుపు పోలించ నెంత।
వావిరి బ్రహ్మతండ్రికి వర్ణింపరాజసమెంత। యేవల్ల జక్రాయుధుని కెదురెంచ నెంత॥
చ॥ అమితవరదునికి ఔదార్యగుణ మెంత। వినుతాసురవైరివిక్రమ మెంత।
మమతల నలమేలుమంగపతిసొబ గెంత। అమర శ్రీవేంకటేశుఆధిక్య మెంత॥

333)పాడి
ప॥ చంచలపడగవద్దు సారె సారె గోరవద్దు। పొంచుకొన్నదైవమే బుద్ధులు నేర్పీనీ॥
చ॥ లోకరక్షకుడు నాలోననే వున్నాడిదే। నాకు నభయములిచ్చి నన్ను గాచును।
శ్రీకాంతు డీతడే నాచిత్తములో మలసీని। దాకొని శుభములెల్లా దానే వొసగును॥
చ॥ పరమపురుషుడు నాప్రాణనాథుడైనాడు। పరగ నాపాలివాడై బ్రదికించును।
ధరణీశు డీతడే నాదాపుదండై కడగీని। నిరతి నేపొద్దును మన్నించును మమ్మెపుడు॥
చ॥ శ్రీవేంకటేశుడు నాజిహ్వ దగిలి వున్నాడు। పావనును జేసి నాకు ఫల మిచ్చును।
గోవిందు డీస్వామి నన్ను గొలిపించుకొన్న వాడు। యీవలనావల నాకు నిహపరా లిచ్చును॥

334)సామంతం/ధర్మవతి
ప॥ మంగాంబుధి హనుమంత నీ శరణు। మంగవించితిమి హనుమంతా॥
చ॥ బాలార్కబింబము ఫలమనిపట్టిన। ఆలరిచేతలహనుమంతా।
తూలనిబ్రహ్మాదులచే వరములు। వోలిజేకొనిన వో హనుమంతా॥
చ॥ జలధిదాట నీ సత్వము కపులకు। నలరి దెలిపితివి హనుమంతా।
యిలయు నాకసము నేకముగా నటు। బలిమి బెరిగితివి భళీ హనుమంతా॥
చ॥ పాతాళములోపలి మైరావణు-। నాతల జంపిన హనుమంతా।
చేతులు మోడ్చుక శ్రీవేంకటపతి-। నీతల గొలిచే హిత హనుమంతా॥

335)రామక్రియ
ప॥ నెట్టన శ్రీపతిమగనికి శరణు। దిట్టయై సర్వేశ్వరుడైన దేవునికి శరణు॥
చ॥ చెలగి జగత్తులకు జీవులకు బ్రాణమై। నెలవై వుండేయాతనికి శరణు।
తెలివై మఱపై దేహాలలో సూత్రమై। వలనై రక్షించేయట్టివానికి శరణు॥
చ॥ చక్కగా వేదములకు సకలశాస్త్రములకు। నెక్కొని గుఱుతైనవానికి శరణు।
దిక్కుదెసయి స్వతంత్రుడయి తేరినఆదిమూలమై। అక్కజ్ అపుమహిమలయాతనికి శరణు॥
చ॥ యిరవుగ గరుణించి యిహపరాలొసగేటి। నిరతిశ్రీవేంకటేశునికి శరణు।
గురువై తల్లిదండ్రియై గుణము సుజ్ఞానము-। లెరవులేక యిచ్చేటియాతనికి శరణు॥

336)దేసాళం/కల్యాణి
ప॥ ఎక్కడ చూచిన వీరే యింటింటముంగిటను। పెక్కుచేతలు సేసేరు పిలువరే బాలుల॥
చ॥ పిన్నవాడు కృష్ణుడు పెద్దవాడు రాముడు। వన్నె నిద్ద రమడలవలె నున్నారు।
వెన్నలు దొంగిలుదురు వీడువాడు నొక్కటే। పన్నుగడై వచ్చినారు పట్టరే యీ బాలుల॥
చ॥ నల్లనివాడు కృష్ణుడు తెల్లనివాడు రాముడు। అల్లదివో జోడుకోడెలై వున్నారు।

వెల్లసిరై తిరిగేరు వేరు లేదిద్దరికిని।పెల్లుగ యశోద వద్ద బెట్టరే యీబాలుల॥
చ॥ రోల జిక్కె నొకడు రోకలి వట్టె నొకడు। పోలిక సరి బేసికి బొంచి వున్నారు।
మేలిమి శ్రీవేంకటద్రి మించిరి తానే తావై। ఆలించి నెవ్వరి నేమి ననకురే బాలుల॥
337)మాళవి
ప॥ పురుషులకు పురుషుడవు పురుషోత్తమా। పురుడు లేదిక నీకు బురుషోత్తమా॥
చ॥ పొలసులాడకు నీవు పురుషోత్తమా। బులిసి లోగగనేల పురుషోత్తమా।
పొలమురాజవు నీవు పురుషోత్తమా నీ। పొలకు వదే కంబమున పురుషోత్తమా॥
చ॥ పొడవులకు బొడవైన పురుషోత్తమా బిరుదు। పుడిసిళ్ళ జల్లితివి పురుషోత్తమా।
పుడికి సతిగైకొంటి పురుషోత్తమా। పొడమె జీకటితప్పు పురుషోత్తమా॥
చ॥ బూటకపుబుద్ధిగలపురుషోత్తమా। పోటి గుఱ్ఱపుబసల పురుషోత్తమా।
మేటి శ్రీవేంకటముమీద నొసగే విదివో। పూటపూటపరాలు పురుషోత్తమా॥
338)లలిత
ప॥ అంతరాత్మ హరిగల డంతే చాలు। యెంత కెంత చింతించ నేలా వెరవ॥
చ॥ వెనక జన్మపుగతి వివరించి నేనెరగ। అనుగుమీదటిజన్మ మది యెఱగ।
ననిచి యీజన్మము నానాట దెలిసేము। యెనసి యీభవములకేలా వెఱవ॥
చ॥ నిన్నటిదినముకత నిమిషమై తోచీను। కన్నుల రేపటిచేత కానగరాదు।
పన్ని నేటిదినము మున్ను నోచినట్లే। యెన్నగ నెందుకునైనా నేలా వెఱవ॥
చ॥ పరము నిహము నే బైకొన నాయిచ్చ గాదు। హరి శ్రీవేంకటపతి యఖిలకర్త।
శరణంటి నాతనికి స్వతంత్ర మతనిది। యిరవైతి నింకా నాకేలా వెఱవ॥
339)వరాళి
ప॥ ఏటిజాణతనమే యేమే నీవు। కోటియైనా యాటది కక్కూరితికి జొచ్చునా॥
చ॥ వరుసకువచ్చి యీవనిత గాచుకుండగా। యెరవులసన్న బతినేల పిల్చేవే।
తెరమఱుంగున నొక్కెతకు మీదెత్తినమోవి। యిరవుగ నీకది యెంగిలిగాదా॥
చ॥ పొందైనయాపె యింటిలో బోనము వెట్టకుండగా। విందు నీవేల చెప్పేవే విభునికిని।
అందాకె మనసుపెట్టినటు వంటికాగిలి। కిందటనే వాడి మిగిలినదిగాకా॥
చ॥ సేసపెట్టినమగువ చెఱగువట్టుకుండగా। ఆసతో నేవెట్టు గూడి యలరితివే।
యీసరినే శ్రీవేంకటేశుడిట్టె నన్ను గూడె। వోసరించితే బువ్వము పూరబొత్తుగాదా॥
340)ముఖారి
ప॥ ఇంతిజవ్వనవనాన నిన్నియు నెలకొనెను। వంతులవాసులతోడ వలరాచపౌజులు॥
చ॥ కుతిలాలు మాని సరి గూచున్నవి చూడవే। సతియురముమీదట చక్రవాకాలు।
గతిగూడ గుంపుగట్టి కాపురముసేసీ నవే। మితిమీరి శిరసుపై మేటితుమ్మిదలు॥
చ॥ కలికినాలతోడ గడుమించీగదవే। జలజాక్షీ మోముననే చకోరములు।
పలుకలోపనే పాడుకొనె నిపు డిట్టె। చెలరేగి మోవిమీద చిలుక మొత్తములు॥
చ॥ తగుశ్రీవేంకటేశ్వరుండ నిల్చి జూడవే। మగువనడపులనేమంచిహంసలు।
మిగుల రతివేళను మెరసీ దా మిన్నిటాను। పగటుగుత్తికలోన పావురములు॥
341)భైరవి
ప॥ ఎవ్వరినేర్పులు జెప్ప విందు నేది। రవ్వసేయక జీవుల రక్షించవయ్యా॥
చ॥ తలపోసి తలపోసి ధ్యానముసేతురు నిన్ను। యెలమి నింతని నిశ్చయింపలేరు।
పలుమారు నీగుణాలు పైకొని నుతింతురు। కొలదివెట్టుచు మీగుఱుతు లెంచలేరు॥
చ॥ పొదిగి పొదిగి నిన్ను బూజలెల్లా జేతురు। యెదుట నీశ్రీమూర్తి యెఱుగలేరు।
వెదకి వెదకి సారె విందురు నీకతలెల్లా। పదిలపు నీభక్తి పట్టగలేరు॥
చ॥ నిక్కి నిక్కి చేతులెత్తి నీకు మొక్కుదురుగాని। మక్కువ నీమహిమ నమ్మగలేరు।

యిక్కడ శ్రీవేంకటేశ యిటు నీకరుణచేత। తక్కక నిన్ను సేవించి తెలియలేరు॥
342)సామంతం/ఖరహరప్రియ
ప॥ ఎంత వలచితివయ్యా యింతికి। చెంతనుండే లేతనవ్వే సేసపాలుగావా॥
చ॥ చెలి నీపై జిగురాకు చిదిమివేసితేను। వలరాజడిదమిని వంచించితివి।
వెలయగ విరహపువేళ వాడెక్కుగాక। మెఱపున గదిసితే మెత్తనేకాదా॥
చ॥ బిసరుహాక్షి పుప్పొడి ప్రేమ నీపై జల్లితేను। వసంతునిచొక్కనుచు వసివాడేవు।
వెస దెరమరగైతే వేగమే నామెక్కుగాక। రసికత నొద్దనుంటే రజమేకాదా॥
చ॥ అలమేలుమంగ సురటట్టే నీపై విసరితే। మలయానిలు వేడంటా మాటువెట్టేవు।
తలచి శ్రీవేంకటేశ దవ్వైతే వేడెక్కుగాక। చలపట్టి కూడితివి చల్ల నేకాదా॥
343)నాట
ప॥ దాసోహ మనుబుద్ధి దలచరు దానవులు। యీసులకే పెనగేరు యిప్పుడూ గొందరు॥
చ॥ హరిచక్రముదూషించేయట్టివారే యసురలు। అరయ దామేదైవమన్న వారు నసురలే।
ధర నరకాసురుడు తానె దైవమని చెడె। యిరవై యిది మానరు యిప్పుడూగొందరు॥
చ॥ పురుషోత్తమునిపూజపొంతబోరు అసురలు। సరవి విష్ణుని జపించనివారు నసురలే।
హిరణ్యకశివుడును యీతని నొల్లక చెడె। ఇరవై యీతని నొల్ల రిప్పుడూ గొందరు॥
344)బౌళి
ప॥ వెఱ్ఱివాడ వెఱ్ఱివాడ వినియు గనియు మరి। వెఱ్ఱి దెలిసి రోకలి వేరె చుట్టే గాక॥
చ॥ పుట్టించినవాడవట పూచి నన్ను బెంచలేవా। కట్టగడ నమ్మని నాకడమేకాక।
వొట్టి నాలో నుందువట వొగి బాపము నాకేది। గట్టిగా బుణ్యము వేరే కట్టుకొనేగాక॥
చ॥ యేడనైనా నీవేయట యెదుట నుండగలేవా। వేడెవెట్టి యేడనైనా వెదకేగాక।
ఆడినదెల్లా నీవట అందులో దప్పులున్నవా। వీడుపడ్డతలపుతో వెరచేగాక॥
చ॥ భావించితే మెత్తువట పరము నీవియ్యలేవా। నీవాడననినానేరమే కాక।
శ్రీ వేంకటేశుడ నేను చేరి నీకు శరణంటి। దేవుడవై కాపగా నే దిద్దుకొనేగాక॥
345)శ్రీ
ప॥ ఎంత లేదు నీబత్తి యెరగరా యిందరును। దొంతిబెట్టేవు ప్రియాలు దొరకుదాకాను॥
చ॥ పొరుగాపె పైవలపు పూసేవు నామీద। వరుసల వద్ది కాపె వచ్చుదాకాను।
సరుస నావంక నీవు చక్క జూచే వప్పటిని। అరసి యవ్వలిపొందు అదనౌదాకాను॥
చ॥ కడవారిపొందు నాతో గసి పుచ్చుకొనే విట్టే। అడరి వారితోమాటలందుదాకాను।
నడుమ నవ్వులెల్లాను నవ్వేవు యీవేళను। వుడివోనియట్టికాగి లొనరుదాకాను॥
చ॥ పోరచివనితమారు పొదిగేవు నన్ను నిట్టే। చేరి యాపె నిన్ను గూడి చెలగుదాకా।
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడితి। కోరిక లన్ని యును జేకూరుదాకాను॥
346)శుద్ధవసంతం
ప॥ ఇవిగో మీమహిమలు యేమని పొగడవచ్చు। జవళి నెంచిచూచితే సరిబేసివంటివి॥
చ॥ అంగనలచూపులు ఆరతులవంటివి। కుంగక నీవు కొలువై కూచున్నవేళ।
చెంగట లేతనవ్వులు సేసపాలవంటివి। కొంగులువట్టుచు నీవు కొసరేటివేళ॥
చ॥ కాంతలపలుకులెల్లా కప్పురాలవంటివి। అంతలో నీవు సరసాలాడేటివేళ।
బంతిమోపులయీపులు పాలకూళ్ళవంటివి। మంతనాన నుండి నీవు మన్నించువేళ॥
చ॥ వెలదులకాగిళ్ళు విడిదిండ్లవంటివి। చలముల నీరతులు సలిపేవేళ।
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడితివి। తలపులవంటి వన్నీ తమకపువేళ॥
347)లలిత
ప॥ ఎట్టిదో మీమాయావిలాసము యెఱిగిన నెఱిగనీదు।
అట్టె మాగురుననుమతినే ప్రత్యక్షమవైతివిగాని॥

చ॥ కరుణాకరా మిమ్ముము గని తెలియగలేను।
ధర మీమహిమలు వినివిని తగ నరుదందును।
నరహరి నీవు నాతోనుండగ నమ్మక పురాణకథలందు।
అరయగ మీచరితలు చెప్పగ నాసతోడ మిము దలంతును॥
చ॥ జగదీశా మీనామంబులు జపించవలయుదును।
వెగటుగ నీచిత్రసృష్టి చూచి మిము వెదుకుదు నింతటను।
నగధర మీపై భక్తి సేయగ మనంబున నొడబడను।
పగటున మీరిచ్చువరములకొరకే పలుమారు మీకు మొక్కుకొందును॥
చ॥ శ్రీవేంకటేశా నీమూరితి చింతించి చేపట్టగలేను।
దేవుడ వనియెడువిశ్వాసమునకే తిరముగ గొలిచెదను।
శ్రీవనితాధిప వేదాలు మిమ్ములను జెప్పగా నే తర్కింపుదును।
వేవేలుపురుషులు సేవింపగ నీవే కర్తవని నిశ్చయింతును॥
348)లలిత
ప॥ అతని నడగవో చిత్రగుప్త నాయందలియాగాము లన్నియును।
అతడే మీ కుత్తరము చెప్పెడివి యన్నిటికిని మము దడవకుమీ॥
చ॥ కరచరణాదులు నాకు కల్పించినయతడే।
గరిమల నావుభయకర్మసంఘములకు దా గర్తా।
సరుగ బ్రాణము లొసగిన చైతన్యమతడే।
పరగగ నాయపరాధంబులు పరిహరించ గర్తా॥
చ॥ రమణతో నను బుట్టించి రక్షించేయతడే।
అమరగ నన్ను వహించుక నావ నావళుకంతయు దీర్చగ దా గర్తా।
ప్రమదమున నాయంతరాత్మయై పాదుకొన్న యతడే।
మమతల మీలోకము చొరకుండా మాటలాడుకొన దానే కర్తా॥
చ॥ యెప్పుడు బాయక దాసునిగా నేలుకొన్న యతడే।
తప్పక యిహముబరమునిచ్చి వొరులు దడవకుండ జేయగ గర్తా।
చెప్పగ నాపాలిదేవరా శ్రీవేంకటేశు డతడే।
అప్పణిచ్చి మిమ్ము నమ్మితి సేయుచు నటు మము గావగ దానే కర్త॥
349)లలిత/సావేరి
ప॥ అవధారు పరాకుసేయకు మపరాధముగా నెంచకు। వివరింపగ నీవే గతి విష్ణుడ మన్నించగదే॥
చ॥ నాకునాకే నీసన్నిధానము గల్పించుకొని। చేకొని విన్నపములెల్లా జేయుచున్నాడను।
కాకు సేసి నన్ను వీడెంత గట్టువాయయనక। శ్రీకాంతా నీవింతట నుందవు చిత్తగించి విననే॥
చ॥ చూచిచూచి నీమూరితి నాసొమ్ముగ జేసుకొని। చేచేత నాలో ధ్యానముసేయుచునున్నాడను।
కాచుకొని వీనికి నాకూ గారణమేమనక। యేచోటా నీరూపమే హరి యెదలో నుండగదే॥
చ॥ కోరికోరి నేనూరక నీకొలువుగడించుకొని। చేరి నీవూడిగములు చేయుచున్న వాడను।
యీరీతులు శ్రీవేంకటేశ్వర యివి యేటిసలిగెలనక। నారాయణ సర్వేశ్వరుడవు నన్ను నేలగదవే॥
350)లలిత/ధర్మవతి
ప॥ ఎట్టు సేయగలవాడనో యిక నీచేతిది నావునికి। నెట్టన నీదాసుడనైతిని నీచిత్తం బికను॥
చ॥ సారెకు గొలువుసేతు చనవులు నీ విత్తువోయనుచు।
నేరకున్నా బాడుదును నీవు మెత్తువనుచు।
వోరిచి వుపవాసములుండుదు నొగి దయదలతువోయనుచు।
చేరి వాకిలిగాచుకుండుదు చిత్తమురావలెననుచు॥
చ॥ కమ్మటి నిచ్చకములు నెరపుదు కైవసముగావలెననుచు।

వుమ్మడి నీగుణాలు వొగడుదు వూరక మొగమోడుదువనుచు।
నెమ్మది మొక్కులు నే మొక్కుదు నేరములెంచక కాతువని।
నమ్మి నిన్ను నే బూజింతు నను నీ వీడేరింతువని॥
చ॥ ఆసతో నిను భావించు అన్నిట నన్నేలుదువనుచు।
వేసరక నీమంత్రము నుడుగుదు వేగమే వరమొసుగుదువనుచు।
రాసికి నెక్కగ శ్రీవేంకటేశా రక్షించితి విప్పుడు నన్ను।
వాసితోడ నే నిన్ను దగులుదును వదలక నాపాల గలవనుచు॥

351)గౌళ

ప॥ ఇటులైతే బుణ్యము నీకు యిది వుపకారంబౌను। తటుకన నీకీరితి వొగడుదురు తలకొని యిందరును॥
చ॥ సురాసురగంధర్వయక్షులు మిమ్ము దెలియగలేరు। పరాశరాదులు మీరూపు భావించగలేరు।
నరు లెరుగుదురా మిమ్ము నారాయణ నీవే సులభుడవై। కరీంద్రు గాచినయటువలె గాతువుగాక॥
చ॥ సనాతనబహువేదశాస్త్రంబులు మిము నుతింపలేవు। అనంతయజ్ఞంబులు మిమ్ము నటు సాధించగలేవు।
తనూధరు లెంతటివారు దామోదర నీవే అహల్యను। వినోదముగ గాచినయటువలె వెస గాతువుగాక॥
చ॥ రమాపతి నీశామహిరాసులు మీతల పెఱుంగరు। సమేతులైనశేషాదులు మీజాడ మీరలేరు।
తమోమయు లిందరును ధరణీధర శ్రీవేంకటేశ। నమోనమో యని మొక్కగా నను గాతువుగాక॥

352)సామంతం/బలహంస

ప॥ సరిగాడు వీడనవలదు జగమున రాజు వలచినది దేవులు। యిరవుగ నందరు లోకములోపల యిది నానుడిమాట
॥
చ॥ జగదేకబంధుడవట సకలజీవులకును గుఱుతుగ। మొగముచూపవయ్యా మీకు మ్రొక్కెద నిదె నేను।
తగులైన చుట్టరికము దాచగ నికనేలా। తెగరానిమమకారము తెలుపగవలెగాని॥
చ॥ యిరవైనప్రాణమవట యీచరాచరములకు అభయము। సతత మియ్యవయ్యా మాకును సన్నుతింతు నిన్ను।
మతి బాయనికూటంబులు మానుప మరి యాలా। జతనంబున జాలాభ్రియములు జరగవలెగాని॥
చ॥ నెలవైనయేలికవట నీదాసులకెల్లా, వేళలు। దెలియజెప్పవయా మిమ్మును తిరముగ గొలిచెదను।
బలువయిన శ్రీవేంకటేశ పరాకు లికనేలా। చెలరేగి నీసులభత్వమే చెల్లించవలెగాని॥

353)సామంతం/దేవగాంధారి

ప॥ ఏదిగతి నేనొక్కడనే యెందరి కోపుదును। నీదయతో మన్నించగదవే నీరజనాభ॥
చ॥ మోహాంధకారము యెక్కడచూచిన ముంచుకవున్నది। దేహాభిమానము అందుకు దోడు దీకొనివచ్చీని।
సాహసభూతము ఘనహింసలకే చాపించీ జేయి। దాహపుటాసలు వెనకముందరల తరవులువెట్టీని॥
చ॥ కోపాగ్నికణములు సారెకు జుట్టుక గుబ్బతిలదొడగె। పైపై వయోవికారంబులు చలపట్టుక తిరిగీని।
చాపలగర్వము యెవ్వరినైనా సధింపించీని। తీపులధనములు మీదిమీదనే తీదీపులు రేచీని॥
చ॥ భావజవిలాస మప్పటప్పటికి బలుములు చూపీని। వేవేలుసంపద లెందుచూచినా వేడుకసేసీని।
శ్రీవేంకటేశ యలమేల్మంగను చేకొనుదేవుడా। యీవేళను నన్నేలితివి నాకు నిన్నియు తగ వసమయ్యీని॥

354)తోడి

ప॥ ఎదురు మాటలాడితి నీకు యీతప్పులు లోగొను నీవు। వదరగదగదు నీకు పంతములిచ్చితి గావగదే॥
చ॥ మునుపే నేవిన్నవించితిని విన నవధరించితివి నీవు। వెనకవేసుకో శరణు చొచ్చితిని విడువకు నన్ననుచు।
ననుజూచి దేహి యంటే నాస్తి యనరాదు నీకు। ఘనయాచకుడను నేను కడుదాతవు నీవు॥
చ। వెదకి నిను వేడుకొంటిని విచ్చేసితివి మాయింటికి। వదలదగదు నీభక్తి యొసగు నీవాడను పాయకుమనుచు।
పదిలంబుగ మొక్కినచేతులు బలిమి గోయరాదు। యిదివో బంటను నేను యేలినవాడవు నీవు॥
చ॥ మరిగి నీముద్రలు మోచితిని మన్నించితి విటు నను నీవు। కరుణతోడ నాయపరాధంబులు కడపు కావుమనుచు।
యిరవై నీపేరు వెట్టితే నియ్యకొనక పోరాదు। నరమాత్రుడ నే శ్రీవేంకటేశ నాయకుడవు నీవు॥

355)సామంతం/శంకరాభరణం

ప॥ ఆనతియ్యగదవే అందుకే కాచుకొన్నాడను।

పూనుక నీ వెంతనేర్పరివైనా భువి మనసుపేదను నేను॥
చ॥ కొలిచేమనేబంట్లు నీకు గోటానగోట్లు గలరు నిన్ను।
దెలిసేమనేజ్ఞానులు తెందేప లున్నారు।
తలచి వరములడిగేవారలు తలావెంట్రుకలందరు వారె।
యిల సందడిలో నాకొలువు యెటువలె నెక్కీనో॥
చ॥ పనులకు బొల్పడినవారు బ్రహ్మాదిదేవతలట।
వినుతులు సేయదొడంగినవె వేదరాసులట।
మునుకొని ధ్యానించువారు మునులెందరైనా గలరట।
వినయపునామనవిసనవులకు వేళ లెపుడు గలిగీనో॥
చ॥ వున్నతితోడుత నిన్ను మోచుటకు వున్నారు గరుడడు శేషుడు నీకు।
అన్నిటాను నీకాగిటిలోపల నలరీ నలమేల్మంగ।
యెన్నగ శ్రీవేంకటేశా నన్నును యేలితి వింతటిలోనె।
పన్నిననామొక్కులు నీకెబాగుల జేరీనో॥
356)సామంతం/కాంభోజి
ప॥ ఇప్పుడే నే నొడబడ మరవగదగదుజెప్పితి యెల్లనాడు।
నెప్పున నేనెంతకల్లరినైనా నీదాసుడనని యందురుగా॥
చ॥ మఱతునో తలతునో నిన్ను మాటల నేతప్పు గలుగునో।
యెఱుగక నీదాసులజూచి యేమని పలుకుదునో।
నెఱసిననాకర్మ ఫలంబులు నీకు సమర్పణ సేసితిని।
మఱి నామీదట నేరము లెంచక మాధవ నన్నిట రక్షించవే॥
చ॥ అలతునో సొలతునో నే నీయందు భక్తి సేతునో సేయనో।
యెలమిని నీకు నివేదించక యేమేమి భుజియింతునో।
తలచేటినామనసే నీకును ధనముగా గప్పము వెట్టితిని।
పలుమరు నున్నను తగవుకుదియ్యక పరమాత్మా నను గావగదే॥
చ॥ నేరనో నేర్తునో నీకైంకర్యము నేమము లేమేమి మానితినో।
నీరూపము నే సేవించి యెక్కడ నే ననుమానించితినో।
మేరతోడ మావారు చెప్పగా మిమ్మింతట నేనమ్మితిని।
వారి జూచైన శ్రీవేంకటేశా వరదుడవై మము మన్నించగదవే॥
357)ముఖారి
ప॥ సర్వేశ్వరా నీతో సరి యెవ్వరు।పూర్వపువారు చెప్పగా బూచి కొలిచేగాని॥
చ॥ చేరి వేదములు నిన్ను జెప్పగా వినుటేకాని।నీరూపము దర్శించేవార లెవ్వరు।
ధారుణిలో నీ యవతారాలే చూచుట।ధీరత నీమహిమలు తెలిసే వారెవ్వరు॥
చ॥ భూమివారి జూచి నిన్ను బూజలు సేయుటగాని।కామించి నీతో మాటాడేఘను లెవ్వరు।
దీమసాన నీదాసుల ద్రిష్ట మెరుగుటగాని।యీమేర నీదైవిక మెరిగే వారెవ్వరు॥
చ॥ వరములు నీవియ్యగా వచ్చి సేవించుటగాని।కెరలి నీమూర్తి వెదకే వారెవ్వరు।
హరి శ్రీవేంకటేశా నీకరుణవారౌటగాని।అరసి నిన్ను సుద్దులడిగే వారెవ్వరు॥
358)ముఖారి
ప॥ ఇట్టినా వెట్టితనము లేమని చెప్పుకొందును।నెట్టన నిందుకు నగి నీవే దయజూడవే॥
చ॥ పాటించి నాలో నుండి పలికింతువు నీవు।మాటలాడనేరుతునంటూ మరి నే నహంకరింతును।
నీటున లోకములెల్లా నీవే యేలుచుండగాను।గాటాన దొరనంటా గర్వింతు నేను॥
చ॥ నెమ్మది బ్రజలనెల్లా నీవే పుట్టించగాను।తమ్మి నేనే బిడ్డల గంటినంటా సంతసింతును।
సమ్మతి గదించుకొంటి నీవే సర్వసంపదలు నొసగగాను।యిమ్ముల గడించుకొంటి నివి నేనంటా నెంతు॥

చ|| మన్నించి యిహపరాలు మరి నీవే యియ్యగాను | యెన్నుకొందు నాతపోమహిమ యిది యనుచును |
వున్నతి శ్రీవేంకటేశ నన్ను నేమి చూచేవు | అన్నిటా నాయాచార్యువిన్నపమే వినవే ||

359)ముఖారి

ప|| ఎవ్వరికి యెవ్వ రయ్యేరు యిందరికి నీవే దిక్కు | అవ్వలనివ్వల నీ వనాథనాథుడవు ||
చ|| కాయకము లందరును గార్యవశపరులే | పాయనినీ వకారణబంధుడవు |
దాయగాం డ్లెవ్వరినైనా దప్పించుకొనేవారే | బాయటమన్నా నీ వాపన్నశరణ్యుడవు ||
చ|| అట్టె లోకమువారు అర్ధకామపరులే | జట్టిగొని నీవైతే సర్వదాతవు |
పొట్టబోరుగుచుట్టాలు భోజనసహాయులే | నెట్టన నీవైతే మాకు నిర్వాహకుడవు ||
చ|| అంతటా వారికివారు ఆత్మపోషకులే | రంతుల నీవైతే నానారక్షకుడవు |
సంతతము శ్రీవేంకటేశా మమ్ము నేలితివి | పంతమున నీవు భక్తపరిపాలకుడవు ||

360)ముఖారి

ప|| దేవ నీవు గల్పించినతెరవు లివి | నీవారైనవారినేరుపు లివి ||
చ|| పరమశాంతునకు బాపము రాదు | విరతిగలవానికి వెరపు లేదు |
గురుసేవారతునకు గోపము రాదు | ధర సత్యనిరతునకు దప్పు లేదు ||
చ|| పుట్టుబ్రహ్మచారికి బుద్ధి చెడదు | అట్టె ఆసలేనివారికి అలపు లేదు |
తొట్టినసుజ్ఞానికి దుఃఖము లేదు | గట్టియైనమౌనికి కలహమే లేదు ||
చ|| సమచిత్తునకును చంచలము గాదు | విమలాచారునకు వెలితి లేదు |
నెమకి శ్రీవేంకటేశ నీదాసులై కొల్చి | భ్రమయనివానికి భారము లేదు ||

361)ఆహిరి

ప|| పూచినయీదేహమూ పువ్వుగాని పిందెగాని | చేచేత నెవ్వరికి జెప్పనోప బ్రియము ||
చ|| పుట్టించినదైవము పూరి మేపునా మమ్ము | బట్టినపూర్వకర్మమూ పాసిపొయ్యీనా |
మెట్టినసంసారము మెదిగినపాటే చాలు | తొట్టి కన్న వారినెల్ల దూరనోప మిందుకు ||
చ|| నొసల వ్రాసినవ్రాలు నుసిగితే మానినా | కొసరి జగము నాకే కొత్తలయ్యీనా |
వుసురుతోడిసుఖము వుండినపాటేచాలు | కొసరి జన్మము లింకా గోరనోప నేను ||
చ|| యేలినవాడు శ్రీహరి యేమిసేసినా మేలె | వేళతో నాతడే శ్రీవేంకటేశుడు |
పాలించె నాతడు మమ్ము పదివేలులాగులను | యీలాగులనే సుఖ ఇంచేము నేము ||

362) బౌళి

ప|| తొల్లి యెట్లుండెనో తాను నెట్టుండునో తాను | యిల్లిదె నట్టానడమ నింతేసి మెరసీ ||
చ|| పుట్టినప్పుడే దేహి బుద్ధు లేమీ నెఱుగడు | యిట్టె లోకుల జూచి యింత నేరిచె |
ముట్టుకొన్న యింద్రియాల ముదిసి ముదిసి రాగా | తట్టువడి తనమేను తానే మరచె ||
చ|| మనజుడైనప్పుడే తా మాటలేమి నెరగడు | జనులాడుకొనగానె సంగడి నేర్చె |
దినదినభోగాలదృష్టాంతములెల్ల | అనుభవమై తన కడియాలమాయ ||
చ| తచ్చి గలప్పుడే దైవము నెఱగడు | నిచ్చ నాచార్యునివల్ల నే డెఱిగి |
అచ్చపుశ్రీవేంకటేశు డంతర్యామై యుండి | యిచ్చ గరుణించగాను యెక్కుడాయ దాను ||

363)సాళంగనాట/అఠాణ

ప|| ఏమని పొగడుదు నిట్టి నీగుణము | యీమహిమకు బ్రతి యితరులు గలరా ||
చ|| నిండెను జగముల నీప్రతాపములు | చెండిన బాణునిచేతులతో |
కొండలంతలై కుప్పలువడియెను | వండదరగు రావణతలలు ||
చ|| పూడెనుజలధులు పొరి గోపించిన | తోడ బ్రహ్మాండము తూటాయ |
చూడ బాతాళము చొచ్చె బలీంద్రుడు | కూడిన కౌరవకులములు నడగె ||
చ|| యెత్తితివి జగము లీరేడు నొకపరి | యిత్తల నభయం బిచ్చితివి |
హత్తిన శ్రీవేంకటాధిప నీకృప | నిత్తెమాయ నీనిజదాసులకు ||

364)నాట/అఠాణ
ప॥ కదిరినృసింహుడు కంభమున వెడలె।విదితముగా సేవించరో మునులు॥
చ॥ ఫాలలోచనము భయద్రోగముఖము।జ్వాలమయ కేసరములను।
కాలరౌద్రసంఘటితదంతములు।హేలాగతి ధరియించుక నిలిచె॥
చ॥ ముడివడు బొమ్మలు ముంచిన వూర్పులు।గడగడనదరెటి కటములను।
నిడుదనాలికెయు నిక్కుగర్ణములు।నడియాలపురూపై తా వెలసె॥
చ॥ సకలాయుధములు సహస్రభుజములు।వికటనఖంబులు వెస బూని।
వెకలియగుచు శ్రీవేంకటేశ్వరుడె।ప్రకటపుదుష్టుల భంజించె నిదివొ॥

365)శ్రీ
ప॥ వారివారికర్మములే వారి జుట్టుకొనగాను।యీరీతి నీవె వారియెఱుక మాన్పితివి॥
చ॥ హిరణ్యకశిపుపాటు యెఱుగడా రావణుడు।ధరలో వారికి బగ్గె తానూ బొలిసె।
విరసపు కంసుగతి వినడా ధుర్యోధనుడు।సరుగ దానూ బగ్గె సమసినాడు॥
చ॥ తెగి మురాసురుజాడ తెలియడా నరకుడు।మొగిసి పోటుకు బోయి మొక్కపోయను।
సొగిసి సోమకుదెస చూడరా దానవులెల్లా।మగిడి మగిడి పోరి మడిసిరిగాక॥
చ॥ బలివోయినతెరువు బాణుడు విచారించడా।బలిమి దొడరి భంగపడెగాక।
యెలమి శ్రీవేంకటేశా యెవ్వరి నేమనవచ్చు।యెలమి నిప్పటివారూ నెఱగరేకాక॥

366)శ్రీ
ప॥ హరి నీదాసులభాగ్య మిది యెంతని చెప్పేము।విరివైననీసుద్దులు వింటిమయ్యా॥
చ॥ నెమ్మదిని నీవనేటినిధానము గన్న వారు।కిమ్ముల సంపన్నులై సుఖింతురయ్యా।
కమ్మటి నీభక్తియనేకామధేను వున్న వారు।వుమ్మడి నచ్చికము లేకుందురయ్యా॥
చ॥ చేరి నీపై చింతయనేచింతామణిగలవారు।కోరినట్టల్లా బదుకుదురయ్యా।
సారపునీకృపాపారిజాతమబ్బినవారు।బోరన సంతోసాల బొదలుదురయ్యా॥
చ॥ హత్తి నీనామమనేఅమృతముగలవారు।నిత్తెమైనపదవుల నిలుతురయ్యా।
యిత్తల శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి।సత్తుగా నీవారు నాకు జనవిత్తురయ్యా॥

367)శ్రీ
ప॥ దైవమా నీ వొక్కడివే దక్కినధనముగాక।యీవలానావలా మఱి యెంచ నే మున్నది॥
చ॥ పుట్టినవారికెల్లా పొత్తులది జగము।మెట్టికూచుండేయరగు మేదినియల్లా।
బట్టబయటిభోగాలు బంతికూటిబోజనాలు।పట్టి తమవని యేరుపరచ నే మున్నది॥
చ॥ పంచుకొన్న భాగాలు పంచమహాభూతాలు।పంచేంద్రియములే పరివారాలు।
యెంచి నడచేకాలమే యిందరికి నుంబళి।తెంచి యెచ్చుకుందు లిందు దెలుప నే మున్నది॥
చ॥ మనోవికారాలు మానుషపుటెఱుకలు।వినోదమాత్రాలు వేడుకలెల్లా।
యెనలేనిశ్రీవేంకటేశ నీమహిమ లివి।వెసగా ముందర విన్నవించ నే మున్నది॥

368)శ్రీ
ప॥ ఇట్టివాడవు సులభమెట్లా నైతివోకాక।అట్టినీదయ దలచి అరుదయ్యా నాకు॥
చ॥ యేమేమి చదువ్వలె నెందరి నడుగవలె।ఆముక నిన్ను దెలిసేయందుకొరకు।
భూమిలోన నెంతేసి పుణ్యములు సేయవలె।కామించి నీపై భక్తిగలిగేటికొరకు॥
చ॥ యెన్ని జన్మా లెత్తవలె నెందెందు వెదకవలె।కన్నుల నీసాకారము గనేకొరకు।
వున్నతి నెంతగాలము వొగ్గి కాచుకుండవలె।విన్న వించి నీసేవ వేడుకొనేకొరకు॥
చ॥ యేదేది యెఱగవలె యెట్లభ్యసించవలె।నీదాసుడనిపించుకొనేటివరకు।
సాదరాన శ్రీవేంకటేశ్వర నన్ను మన్నించితి-।వేదెస బొగడవలె యింతసేసేకొరకు॥

369) శ్రీ
ప॥ చెపితే బాసునందురు చేసినదోసములెల్లా।వొప్పుగొని మన్నించ నుచితమౌ నీకు॥

చ|| క్షమియించుకొనవే సర్వాపరాధములు । క్రమ మెఱుగ కేమేమి గావించితినో ।
రమణతో సర్వలోకరక్షకుడవట నీవు । తమితోడ నన్ను గావ దగవౌను నీకు ॥
చ|| పరిహరించగదవే బహునరకబాధలు । గరిమల నెటువలె గాచుకున్నవో ।
అరుదుగా సురలమొ రాలించితివట తొల్లి । ధర నన్ను వహించుకో దగవౌను నీకు ॥
చ|| వెనుకొని యడ్డము రావే శ్రీవేంకటేశ్వర । అనుభవించేకర్మము లవేమున్నవో ।
పనిపడి భక్తపరిపాలకుడవట నీకు । తనుభోగాలు భోగించ దగవౌను నీవు ॥

370) నాదరామక్రియ/కల్యాణి

ప|| ఇదివో నీప్రతాపము యెక్కడ చూచినా దానే । యెదిటిబ్రహ్మాండము యిమ్ము చాల దిందుకు ॥
చ|| పనిగొంటే భువిలో నేబదియే అక్షరములు । కొనాడితే నీగుణాలు కోటానగోటి ।
యెనసి పదునాలుగే యెడమైన లోకములు । అనిశము నీవియైతే ననంతమహిమలు ॥
చ|| మించి నిండుకొంటే నెనిమిదే దిక్కులు । అంచల నీకతలైతే ననేకములు ।
యెంచి చూచితే గలవి పంచభూతాలే । ముంచిననీమాయ తుదమొదలే లేదు ॥
చ|| వుపమించి తెలిపితే నొక్కటే జగము । అపురూపు నీసృష్టి అతిఘనము ।
అపరిమితపుజీవు లణుమాత్రలై నాను । యెపుడు శ్రీవేంకటేశ యెక్కుడు నీదాసులు ॥

371) వరాళి

ప|| ఐనదయ్యా గానిదెల్లా నటు గాకుండితేమానీ । మానుపరా దివి హరిమాయామహిమలు ॥
చ|| పుట్టేటి వెన్ని లేవు పోయేటివెన్ని లేవు । వెట్టిదెహాలు మోచినవెడజీవులు ।
గట్టిగా దెలుసుకొంటే కలలోనివంటి దింతే । పట్టి ఇందుకుగా నేల బడలేమో నేము ॥
చ|| కడచిన వెన్ని లేవు కాచుకున్న వెన్ని లేవు । సుడిగొన్న తనలోనిసుఖదుఃఖాలు ।
యెడపుల నివి రెండు యెండనీడవంటి వింతే । కడనుండి నేమేలకరగేమో నేము ॥
చ|| కోరినవి యెన్ని లేవు కోరగల వెన్ని లేవు । తీరనిసంపదలతో తెందేపలు ।
ధారుణి శ్రీ వేంకటేశుదాసులమై యిన్ని యును । చేరికైకొంటిమి యేమిసేసేమో నేము ॥

372) లలిత

ప|| జ్ఞానినై నా నీకు బో దజ్ఞానినైనా నీకుబోదు । నేను చేసిననేరమి నీకే నెలవయ్యా ॥
చ|| గరిమ మాపుట్టుగు నీగర్భవాసములోనే । అరయ మామోక్షము నీయరచేతిదే ।
వెరవు లెంచుకోబోతే వేరె మాకు గతి లేదు । నిరతి మాబదుకులు నీకే సెలవయ్యా ॥
చ|| నిండినమాకోరికలు నీపెర రేపులే । వుండ జోటు నీకు నావుల్లములోనే ।
చండివెట్టి మాకై తే స్వతంత్ర మించుకా లేదు । నిండినమాచేతలెల్లా నీకే నెలవయ్యా ॥
చ|| యిదె మాసంసారములు యిట్టె నీకల్పితములు । తుదమొదలును నీవే తోడునీడవు ।
యెదుట శ్రీవేంకటేశ యేలినవాడవు నీవే । నిదురమాదినములు నీకే సెలవయ్యా ॥

373) భైరవి

ప|| ఆతడే విష్ణుం డఖిలము నడపెడి । యీతల నెవ్వరి కేటికి జింతా ॥
చ|| పుట్టించ బెంచగ పొడ వెక్కించ దేహుల । గట్టిగా మాటలాడించ గదలించ ।
పట్టి వాన గురియించ పైరుల మొల । తిట్టపెట్ట నొకానొక దేవుడు గలడు ॥
చ|| అన్న పానము లొసగ నాపదలు గడపగ । పన్ని మాయలు భువి బచరించ ।
విన్న పాలు సురలవి విని యందరి రక్షింప । వున్నతోన్నతుడై నొకనొకాకర్త గలడు ॥
చ|| కాల మక్షయము సేయ కర్మము ఫలింపజేయ । తాళుకొని మురపించ దలపించ ।
పాలుపడి శ్రీవేంకటపతియై వేదాలుచెప్పే- । యేలిక యొకానొకయీశ్వరుడు గలడు ॥

374) నాదరామక్రియ

ప|| అతడు లోకోన్నతు డాదిమపురుషుడు అన్నిటాను పరిపూర్ణుడు ।
చతురు డితడే రక్షించగలవాడు శరుణనిబ్రదకవో వోమనసా ॥
చ|| మరుతండ్రిజూచినమంచికన్నులు మరొకరి జూచిననింపౌనా ।

సిరివరునామమునొడిగిననోరను చిక్కినపేరులు యితవౌనా।
పరమాత్ముదలచినమనసులోపలను పరుల దలచితే నొడబడునా।
కరుణానిధిపుణ్యకథలువినినచెవుల కడలసుద్దులు వినసమ్మతించునా॥
చ॥ నరహరిబూజించినయట్టికరములు నరులసేవసేయ నరుహములా।
మురహరు శరణనిమొక్కినశిరసున మూఢులకు మొక్క నుచితములా।
హరిమందిరమునకరిగెడుపదములు అధములిండ్లకేగగ నలవడునా।
పురుషోత్తము లాంఛనము మోచినమేను భువిహీన వృత్తికి బొసగీనా॥
చ॥ గోవిందుడే దిక్కై వుండఘనులకు కొలిపీనా దేవాంతరంబులు।
భువల్లభుదెస బుట్టినజ్ఞానము పొంది వేరొకట నిలిచీనా।
శ్రీవేంకటపతిపై బడినభక్తి చెలులపై నునుపగ దగవవునా।
దేవకీనందను డితనిదాసుల దెలియగ జడులకు చరమయ్యీనా॥

375) నాదరామక్రియ
ప॥ ఎంతకత నడిపితి వేమి జోలి బెట్టితివి। చింతించ లోకములు నీచేతివే కావా॥
చ॥ కౌరవుల బాండవుల కలహము పెట్టనేల। నేరిచి సారథ్యము నెఱుపనేలా।
కోరి భూభార మణచేకొరకైతే నీచే చక్ర-। మూరకే వేసితే దుష్టు లొక్కమాటే తెగరా॥
చ॥ చేకొని వానరులుగా జేయనేల దేవతల। మూకతో లంకాపురి చుట్టుకోనేల।
కాకాసురు వేసినకసవే రావణుమీద-। నాకడ జంపువెట్టితే నప్పుడే సమయడా॥
చ॥ గక్కన శ్రీవేంకటేశ కంబములో పెళ్ళనేల। చొక్కముగా బ్రహ్లాదుడు చూపగనేల।
చిక్కక హిరణ్యకశిపునాత్మలో నుండక। తక్కించి నీవెడసితే తానే పొలియడా॥

376) భైరవి
ప॥ హరి హరి జగమెఱుంగ నీ వాతుమలోనే వున్నవాడవు।
సురల గాచుటయు నసురల నడచుట చొప్పడియున్నది నీగురుతు॥
చ॥ వేదార్థము దప్పందెలసినవిద్వాంసువంటిది।
పాదుగ జదువక తర్కించబోవుపాండిత్యమువంటిది।
మేదిని నడవుల దెరువు దప్పి మరి మెలగేటి తెరువరివంటిది।
ఆదిమూర్తి నీశరణుచొచ్చి నినునారాధించనివానిబదుకు॥
చ॥ వట్టిజోలితో నూరక దేవరలేనిపూజవంటిది।
వొట్టుక ఫలములులేనిపంటలకు వొడిగట్టేయటువంటిది।
నెట్టన గర్ణధారుండులేనిజలధినడిమియోడవంటిది।
బట్టబయటనే పరమేశ్వర నీపైభక్తిలేనివానిబదుకు॥
చ॥ పొందుగ ధర్మముబోధించెడిసత్పురుషులులేనిసభవంటిది।
చెంది శ్రీవేంకటేశ్వర నీమహిమలు చెప్పనికథవంటిది।
సందడి నన్నియు జేసి దక్షిణలుచాలనియజ్ఞమువంటిది।
యిందిరారమణ నీవెక్కుడనుచు నిన్నిట దెలియనివానిబదుకు॥

377) భైరవి
ప॥ అరుదు నీచెరితము హరి నే నిదియే తలచుకొని। శరణంటి గావుమిదియ విన్నపము సరిలేరు నీకు॥
చ॥ పరగ నీయకారబంధుత్వ మహల్యయందు గంటిమి-। రయందు నార్తరక్షత్వము మెరయగ గంటిమి।
అరసి ద్రౌపదియందు నాపదుద్ధారకత్వము గంటిమి। శరణంటె గాచుట ధర విభీషణునందు గంటిమి॥
చ॥ మును భక్తవత్సలత్వము నీకు శబరియందు గంటిమి। అనాథనాథుడవు నీవగుట సుగ్రీవునందు గంటిమి।
పెనగి నిరుహేతకప్రేమ పరీక్షితునందు గంటిమి। నిను గింకరాధీనుడని ప్రహ్లాదునియందు గంటిమి॥
చ॥ గోవర్ధనమందు సర్వజీవదయాపరత్వము గంటిమి। భావించి సాందీపునందు ప్రతిజ్ఞాపాలకత్వము గంటిమి।
దేవ శ్రీవేంకటేశ్వర నీవు ద్రిష్టవరదుడవగుట। తావైననీకోనేటిదండ నొసగేయందే కంటిమి॥

378) భైరవి
ప॥ ఎంతపుణ్యమో యిటు మాకు గలిగె। చెంతనే నీకృప సిద్ధించబోలు ॥
చ॥ శ్రీపతి మీకథ చెవులను వింటిమి। పాపము అణగెను భయముడిగె।
తీపుగ దులసితీర్థము గొంటిమి। శాపము దీరెను సఫలంబాయ ॥
చ॥ గోవింద మిము గనుగొంటి మిప్పుడే। పావనమైతిమి బ్రతికితిమి।
తావుల మీపాదములకు మొక్కితి। వేవేలు గలిగెను వేడుకలాయ ॥
చ॥ గోవింద మిము గనుగొంటి మిప్పుడే। ధావతి దీరెను తనిసితిమి।
వావిరి ముమ్మారు వలగొని వచ్చితి। నీవారమైతిమి నిలిచితి మిపుడు ॥

379) మలహరి
ప॥ అన్నిటాను నీవే వుందువుగాన। యిన్ని నీవు పుట్టించిన వివి నీసొమ్ములే ॥
చ॥ నిలిచినరూపులెల్లా నీగుళ్ళుగా దలతు। మెలగేటిదై తన్యము మిమ్ముగా దలతు।
యిలలోనిధ్వనులు నీపలుకులుగా దలతు। కలపంచభూతా లుపకరణాలుగా దలతు ॥
చ॥ నారుకొన్న పంటలు నీనైవేద్యాలుగా దలతు। నీరెల్లా నీతీర్థమని నెమ్మి దలతు।
ధారుణి భోగాలు పూజాద్రవ్యాలుగా దలతు। నేరిచినపనులెల్లా నీలీలలుగా దలతు ॥
చ॥ కాలత్రయము నీగతులుగానే తలతు। చాలి సురల నీయనుచరులగానే తలతు।
నాలోని శ్రీవేంకటేశ నాతండ్రివని తలతు। తాలిమి నీదేవులని తల్లియని తలతును ॥ ॥

380) మలహరి
ప॥ అందుకేపో నీపై నాసపుట్టి కొలిచేది। మందలించితి నిక మరి నీచిత్తము ॥
చ॥ యిందరు జెప్పగా వింటి యెవ్వరికైనా విష్ణుడే। కందువ మోక్ష మియ్య గర్త యనగా।
ముందే వింటి నారదుడు ముంచి నిన్ను బాడగా। పొందుగ లోకములోన బూజ్యుడాయనను చు ॥
చ॥ అప్పటి వింటి లోకము లన్నిటికి హరియే। కప్పి రక్షకత్వానకు గర్త యనగా।
యిప్పుడే వింటి ధృవుడు యిటు నిన్ను నుతించే। వుప్పతిల్లి పట్ట మేలుచున్నాడనుచు ॥
చ॥ యిదె వింటి శ్రీవేంకటేశ బ్రహ్మకు దండ్రివై। కదిసి పుట్టించ బెంచ గర్త వనుచు।
వదలక వింటి నీకు వాల్మీకి కావ్యము చెప్పి। చెదర కావ్యులలో బ్రసిద్ధుడాయనందుకు ॥

381) భూపాళం
ప॥ అపరాధిని నేనైనాను। కృపగలవారికి గపటము లేదు ॥
చ॥ సనాతనా అచ్యుత సర్వేశ్వరా। అనాదికారణ అనంతా।
జనార్దనా అచల సకలలోకేశ్వరా। నిను మరచియున్నాడ నను దెలువవయా ॥
చ॥ పురాణపురుషా పురుషోత్తమా। చరాచరాత్మక జగదీశా।
పరాత్పరా హరి బ్రహ్మాండనాయకా। యిరవు నీవేయట యెఱిగించగవే ॥
చ॥ దేవోత్తమా శశిదినకరనయనా। పావనచరితా పరమాత్మా।
శ్రీవేంకటేశా జీవాంతరంగా। సేవకుడను బుద్ధిచెప్పగవలయు ॥

382) భూపాళం
ప॥ చెప్పవే నన్ను మన్నించి శ్రీపతి నాకు। యెప్పుడును జింతించే నిదేపనై నేను ॥
చ॥ పొలసి నీరూప మెట్టు పొడచూపేవో। యెలమి నాభాగ్య మిక నెట్టున్నదో।
అలరి నాకేబుద్ధి ఆనతిచ్చేవో। కలిగిననీమాయ యేగతి గడచేనో ॥
చ॥ వరుస నాకెట్లా గైవసమయ్యేనో। యింపై నాజన్మఫల మెట్టున్నదో।
పరగ నామతి నెట్టు పాయకుండేవో। కరుణానిధివి నిన్నే కరణి మెప్పించేనో ॥
చ॥ పనిపడి యెట్లా నీభక్తి యిచ్చేవో నా-। మనసుచంచల మెట్టు మట్టుపడీనో।
యెనలేని నాతలపు యెఱిగి శ్రీవేంకటేశ। నను నేలితివి యెట్లా నాకోరిక చెల్లీనో ॥

383) ధన్యాసి
ప॥ నీవే మాకు దిక్కు నిన్నే తలతుము। కావు మానేర మెంచక కరుణానిధీ ॥

చ॥ నెట్టన సూర్యులోననెలకొన్న తేజమా। గట్టిగా జంద్రునిలోనికాంతిపుంజమా।
పుట్టిరక్షించేయజ్ఞపురుషునిప్రకాశమా। వొట్టుక దేవతలలోనుండినశక్తీ॥
చ॥ సిరులమించినయట్టిజీవులలో ప్రాణమా। గరిమ వేదములలోగలయర్థమా।
పరమపదమునందు బాదుకొన్నబ్రహ్మమా। చరాచరములలో సర్వాధారమా॥
చ॥ జగములో వెలసేటిసంసారసుఖమా। నిగిడినమంత్రములనిజమహిమా।
మిగుల శ్రీవేంకటాద్రిమీదనున్నదైవమా। ముగురువేల్పులలోనిమూలకందమా॥

384) ధన్యాసి
ప॥ నీ వెంత నే నెంత నేడు నాయగ్గలి కెంత। దేవ నీదాసుల జూచితేనే నిన్ను గనుట॥
చ॥ వొక్కొక్క రోమకూపాన నొగి బ్రహ్మాండకోట్లు। ఉక్కుమీరి ధరించుక ఉన్నవాడవట।
నిక్కిననీరూప మెంతో నిన్ను గనుగొను టెట్టు। అక్కజపువేదముల కగోచరుడవు॥
చ॥ యెన్నో శిరసులట యెన్నో పాదములట। యెన్నలేనిచేతులట యిట్టినీమూర్తి।
కన్నుల జూచుట యెట్టు కడగురు తందు కేది। అన్నిటా మునీంద్రులకు నచింత్యుడవు॥
చ॥ కోటిసూర్యు లొక్కమాటే కూడ నుదయించినట్టు। గాటపునీతిరుమేనికాంతులట।
మేటివి శ్రీవేంకటేశ మిమ్ము ద్రిష్టించుట యెట్లు। పోటిదేవతలకెల్లా బొడవైనవాడవు॥

385) ధన్యాసి
ప॥ నారాయణ నీపంపో నాభాగ్యమో అది। పేరుకొని పిలువనిపేరటమై వున్నది॥
చ॥ వుడిగినా గామాదు లొక్కొక్కవ్యాజాన వచ్చీ। నుడిసి నడుమచొచ్చుచుట్టాలవలె।
తడవకున్నా గర్మాలు తమ్ము దామె సేయించీ। బడిబడి దిరుగుచు బంట్లవలె॥
చ॥ చూడకున్నా దుర్గుణాలు సొంట్లు సోదించవచ్చీ। వాడవాడల దలవరులవలె।
యేడ నున్నా లంపటాలు యెదుటనే పొలసీవి। తోడువాయనీక తోడునీడలవలె॥
చ॥ తలచకున్నా భోగాలు తనువుతో బెసగీని। చెలరేగి గరడిలో జెట్లవలె।
బలిమి శ్రీవేంకటేశ భావములో నీమూరితి। నిలుపవే యెందుకైనా నిగిడీ నామనసు॥

386) దేవగాంధారి
ప॥ పసుల గాచుట యెట్టు బండిబోయిడవౌటెట్టు। వెస నిన్ను దలచితే వెరగయ్యీ నాకు॥
చ॥ వరుస నంతరియామిత్వము నవతారములు। పరగ మూడు మూర్తులప్రభావము।
పరమపదము పరాత్పరము బ్రహ్మమునై। తిరమైనయాదిదేవుడవు నీవు॥
చ॥ అనిశము జీవులకు నణవుకు మహత్తుకు। పెనుకొన్న మాయకు విరాట్టువు।
పొనుగనిమహిమలపొడవుకు బొడవైన। దినకరకోటితేజమవు నీవు॥
చ॥ సర్వశాస్త్రములలో సనకాదులలో। పర్వినగరుడానంత ప్రముఖులలో।
సర్వదా మెలగుచు జనవరదుడవై। వుర్వి శ్రీవేంకటాద్రినున్న దేవుడవు॥

387) దేవగాంధారి
ప॥ ఏపొద్దూ నీచేతలెల్లా యెదుటనే కానవచ్చీ। నీవు గానరాగా దాగేవిద్య నీదిగాక॥
చ॥ పుట్టినమెకానకు బూరి మేయ నేరిపిరా। అట్టె పిల్లల బెట్ట నటు నేర్పిరా।
చుట్టి నీళ్ళున్నచోటు సోదించ నేరిపిరా। మట్టులేని దింతా నీమాయ యింతేకాక॥
చ॥ తీవెలకు జుట్టి చుట్టి దిక్కుల బాక నేరిపిరా। తావుల దతికాలాన బూవ నేరిపిరా।
వేవేలుపకొమ్మలు పెన బెట్ట నేరిపిరా। యేవల జూచినా నీమహిమ లింతేగాక॥
చ॥ కోరి పక్షులు కొరులు గూండ్లు పెట్ట నేరిపిరా। సారె జాతియ్యాహారాలచవి నేర్పిరా।
యీరీతి శ్రీవేంకటేశ యిన్నియు లోకములోన। చేరి నీవు సృష్టి యింతేకాక॥

388) దేవగాంధారి
ప॥ తెలియరాదు నీమాయ తెరమరగు పెక్కు-। వలల జిక్కకనిన్నే కొలువగవలయు॥
చ॥ చూడగ నీజగత్తుకు సూత్రధారివి నీవు। జోడై నీసూత్రాన నాడుచును సర్వంబుననున్నది।
యేడ జూచినా నీ వుందు వెవ్వరికి గానరావు। వోడక స్వతంత్ర మొకరిపై వేతువు॥

చ|| మఱపించా దలపించా మర్మజ్ఞుడవు నీవు। గుఱియై నీసంకల్పముకొలదే ఈజీవులెల్లా।
మఱి నీ వీశ్వరుడవు మాటలకు జిక్కవు। కఱకరి నితరుల గర్తలగా జేతువు॥
చ|| అందరిమొర లాలించి అట్టె రక్షింతువు నీవు। కందువ శ్రీవేంకటేశ కానవచ్చె నీమహిమ।
చెంది వరము లిత్తువు చేతికి సులభుడవు। సందిడి నెవ్వరినైన సరిగా మన్నింతువు॥

389) ధన్యాసి
ప|| నీవే దయదలచక నెమ్మి రక్షించుటగాక। యీవల గొలిచేనంటే యీడైనవాడనా॥
చ|| పరగ నేమైనా విన్నపము చేసుకొనేనంటే। హరి నీకు నెదురుమాటాడేవాడనా।
గరిమ సువస్తువులు కానుక ఇచ్చేనంటే। సరుస నీకన్నా నేను సంపన్నుడనా॥
చ|| మెలగి నీగుణాలకు మెచ్చి సంతోషించేనంటే। జలజాక్ష నే నీతో సరివాడనా।
బలువైన నీపరమపదము గోరేనంటే। వలనైన నీతోడివంతువాడనా॥
చ|| తాలిమితో నాలో నిన్ను ధ్యానముసేసేనంటే। పాలనుడ నే నీతో సరివాడనా।
యేలితివి శ్రీవేంకటేశ నన్ను గృపతోడ। యీలీల నీమహిమలు యెరిగేటివాడనా॥

390) గుండక్రియ
ప|| హరి గోవిందా హరి గోవిందా। ఆనంద మానంద మాతుమకును।
గురూపదేశాన వెదకగా వెదకగా। గరము నీయర్థము కంటి మోయయ్యా॥
చ|| సరి నన్యధర్మములు మానుమంటివి। శరణు నీకు జొరుమంటివి।
యితరము లణచేనంటివి। పరగ మోక్షం బిచ్చేనంటివి।
హరి నీవచనము అమోఘము। నరులము నే మిది నమ్మితిమి।
పరమపద మిప్పుడే కలిగెను। ధర నొక్కమనసుతో నున్నా రమయ్యా॥
చ|| యెందు నీవే గతి యనుమంటివి। యేచ యొక్కమాటే చాలునంటివి।
యిందరి కభయ మిత్తునంటివి। యిది నీ కెపుడు వ్రతమంటివి।
కందువ నీబిరుదు సత్యము। కానిమ్మని నేము చేపట్టితిమి।
అంది నీవే మాకు దిక్కైతివి। అన్నిటా సంతోసాన నున్నా రమయ్యా॥
చ|| ఆసమానినవా డెక్కుడంటివి। ఆతనివెంట దిరిగేనంటివి।
భాసురపాదరేణువు నే నంటివి। పావన మయ్యేనని యంటివి।
మోపలేనిది నీసంకల్పము। మొక్కే మిందులకు శ్రీవేంకటేశా।
ఆసపడ నితరుల నాకు నీవే యాస। యని నీదాసులమై యున్నా రమయ్యా॥

391) శుద్ధవసంతం
ప|| అందు కేసుమ్మీ నే జేసేఆచారాలు దైవమా। నిందవాయ నామనసు నీపై నిలుపవే॥
చ|| బట్టబయట దోలితేను బందె మేయు బసురము। పట్టి మేపితేను తనపనులు సేయు।
ఇట్టె వదిలితేను యెందైనా బారు మనసు। కట్టుక నేమస్తుడై తేకైవసమై యుండును॥
చ|| బడి దప్పితే బంట్లు పరదేసు లౌదురు। యెడయక కూడుకొంటే హితు లౌదురు।
విడిచితే నిటులానే కడకు బారు మనసు। వొడలిలో నణచితే వొద్దికై వుండును॥
చ|| చే వదలితే పెంచినచిలుకైనా మేడ లెక్కు। రావించి గూట బెట్టితే రామాయనును।
భావించకుండితే యిట్టె పారు నెందైన మనసు। శ్రీవేంకటేశు గొల్చితే చేత జిక్కి వుండును॥

392) గుండక్రియ
ప|| ఇదివో నాసంపదా ఆస్తియు బాస్తి నీవు ఇతరంబులు నాకు బనిలేదు।
పదిలంబుగ నాబ్రతుకెల్లా నీవే పాలించగదే నారాయణా॥
చ|| ఉపమల నే నార్జించిన ఉన్నతదనంబు నీవు।
తపము సేయగా గలిగెడుతత్ఫలంబు నీవు।
జపములవలన గలిగెడునాతేజఃప్రభావమును నీవు।
కపురుల దానధర్మపరోపకారంబుల బొందెడుమేలు నీవు॥

చ॥ పరము నాకు నీవు పరాత్పరమును నీవు।
గరిమల నిలలోపలియనంతభోగంబులు నీవు।
గరుడోరగాసురసిద్ధసాధ్యగంధర్వపదములు నీవు।
సురమునిపూజావేదపాఠసుకృతంబులు నీవు॥
చ॥ నాలుగాశ్రమంబులు నానావిద్యలు నీవు।
తాలిమి నాపంచవింశతితత్వంబులు నీవు।
ఈలీల శ్రీవేంకటేశ్వరా యిన్నియు నీవు నా కని యెరిగితి।
యేలితివి నాప్రాణంబులు నీవు యిల సర్వోపాయంబులు నీవు॥

393) నాట
ప॥ విష్ణు డొక్కడే విశ్వాత్ముడు।వైష్ణవమే సర్వంబును॥
చ॥ పరమేష్ఠి సేయు బ్రహ్మాండసృష్టియు।హరునిలోనిసంహారశక్తి।
పరగగ నింద్రునిపరిపాలనమును।అరసిజూడ శ్రీహరిమహిమ॥
చ॥ యిలబంచభూతములలో గుణములు।అల నవగ్రహ విహారములు।
తలకొను కాలత్రయధర్మంబును।అలరగ నారాయణునిమహిమలే॥
చ॥ అంతట గలమాయావిలాసములు।పొంత బరమపదభోగములు।
మంతుకునెక్కిన మరిసమస్తమును।యింతయు శ్రీవేంకటేశుమహిమలే॥

394) గుజ్జరి/సావేరి
ప॥ ఒకటి కొకటి లంకై వూర్కైనా బెనగొను।అకటా యెవ్వరు దాటేరయ్య నీమాయలు॥
చ॥ తనయెదుటిదెల్లాను దలపులో బారును।మనసులోపలివెల్లా మర్మము లంటు।
ఘనమర్మములు రేగి కాయమెల్లా గరగించు।తనువుసౌఖ్య మవ్వలితనువున నంటును॥
చ॥ అవ్వలిదేహభోగము లట్టేసర్వములౌను।మువ్వంక గర్మాలు లోకములై చెందును।
చివ్వన నాలోకములు చేరి కాలము గడపు।తెవ్వనికాలము నిద్రా దెలివినై ముంచును॥
చ॥ వెస నాతెలివి యొకవేళ నెన్నె ఱిగించు।వసమై ఆయెఱుకకు వచ్చి మెత్తువు।
యెసగి నీవు మెచ్చితే యిహపరము లిత్తువు।మిసిమి శ్రీవేంకటేశ మెరయు నీయీవి॥

395) సాళంగనాట
ప॥ శరణు శరణు వేదశాస్త్రనిపుణ నీకు।అరుదైన రామకార్యధురంధరా॥
చ॥ హనుమంతరాయ అంజనాతనయా।ఘనవాయుసుత దివ్యకామరూప॥
అనుపమలంకాదహన వార్ధిలంఘన।జనసురనుత కలశాపురనివాస॥
చ॥ రవితనయసచివ రావణవనాపహార।పవనవేగబలాఢ్య భక్తసులభ।
భువనపూర్ణదేహ బుద్ధివిశారద।జవసత్వవేగ కలశాపురనివాస॥
చ॥ సీతాశోకనాశన సంజీవనశైలాకర్షణ।ఆతతప్రతాపశౌర్య అసురాంతక।
కౌతుక శ్రీవేంకటేశుకరుణాసమేత।శాతకుంభవర్ణ కలశాపురనివాస॥

396) భైరవి
ప॥ చిత్తగించి రక్షించు శ్రీహరి నీవు।యిత్తల మానేరములు యెన్ని లేవయ్యా॥
చ॥ అంగము యేడు జానలు ఆస కొండలపొడవు।యెంగిలిమేను ఆచార మెంతైనా గద్దు।
జంగి లింతే సంసారము సాధించేది లోకమెల్లా।అంగడిబడి జీవుని కలపు లేదయ్యా॥
చ॥ మఱి నల్లెడునాలికె మాటలు గంపెడేసి।యెఱుక గొంచె మజ్ఞాన మెంచరాదు।
గుఱిలేనిది బదుకు కొలది లేని భోగము।వెఱవని జీవునికి వేసట లేదయ్యా॥
చ॥ పట్టరానిది మనసు బయలువందిలి చేత।చుట్టుకొన్నది కర్మము వట్టిది గుట్టు।
యిట్టె అలిమేలుమంగ నేలే శ్రీవేంకటేశుడ।నెట్టన నీబంటు జీవునికి మితిలేదయ్యా॥

397) ప్రతాపనాట/అఠాణ
ప॥ ఏమని నుతించవచ్చు నితని రూపము।భీమవిక్రము డీతడు పెద్దహనుమంతుడు॥

చ|| వొక్క అంగచాచినాడు వొగి దూర్పు బడమర | భుజాలుబ్బించె దక్షిణోత్తరాలు నిండ |
మిక్కిలి బ్రహ్మలోకము మీరను శిరసెత్తెను | పిక్కటిల్లుమహిమతో బెద్దహనుమంతుడు ||
చ|| వేడుక వాల మాకాశవీధిలో బెంచినాడు | యేడుజలధులు చేసె నిదే మోకాళ్ళబంటి |
వోడక పిడికిలించి వుగ్రదైత్యులతలలు | బేడలుగా జేసినాడు పెద్దహనుమంతుడు ||
చ|| జళిపించి వలకేలు సకలము నెత్తె | కులగిరులు తనతొడలసందినే యడచె |
బలువుడు శ్రీవేంకటపతిబంటు మతంగాద్రి | బిలమువాత నున్నాడు పెద్దహనుమంతుడు ||

398) దేసాళం/శుభపంతువరాళి

ప|| పనిగొననేరిచితే పాపమే పుణ్యమౌను | నినుగొలిచేయట్టిసేవకులకు ||
చ|| మనసు చంచలమైనా మరి నిన్ను దలచితే | జనులకు నిహపరసాధనమౌను |
తనువు హేయమైనా తగ నిను గొలిచితే | పనిపడి యంతలోనే పవిత్రమౌను ||
చ|| కర్మము బంధకమైనా కమ్మి నీసొమ్ముచేసితే | నర్మిలి మోక్షమియ్య నాధారమౌను |
మర్మము కోరికయైనా మహి నీభక్తికెక్కితే | ధర్మములకు బరమధర్మము దా నౌను ||
చ|| జగమెల్లా మాయమైనా సరి నీకే శరణంటే | పగటున నదే తపఃఫలమౌను |
అగపడి శ్రీవేంకటాధిప నన్నేలితివి | మిగులా నిహమైనా మించి పరమౌను ||

399) లలిత

ప|| మనసు నమ్మనేర్చితే మనజుడే దేవుడౌను | తనలోనే వున్నవాడు తావుకొని దైవము ||
చ|| మగనిపై బత్తిచేసి మగువ యొక్కరితె | తెగి పరలోకము సాధించీనట |
వొగి వీరవైష్ణవుడై వున్నవాడు హరి గొల్చి | అగపడి ఘనమోక్ష మందనోపడా ||
చ|| యేలికకై పగవారి నెదిరించి బంటొకడు | మేలైన పదవులంది మెరసీనట |
వేళతో సుజ్ఞాని శ్రీవిష్ణుకైంకర్యాలు చేసి | కాలమందే యందరిలో ఘనుడు గానోపడా ||
చ|| పరమపురుషార్థపుపని చేసి యొకరుడు | అరిసి నధికపుణ్యు డయ్యీను |
నిరతి శ్రీవేంకటేశ నిన్ను బూజించి దాసుడు | పరము నిహము జెంది బ్రదుకగ నోపడా ||

400) దేసాక్షి/ఆహిరి

ప|| సోదించి చూడబోతే చూచి మఱపు | వో దేవదేవ మించె నోహో నీమాయ ||
చ|| వొక్కటే పదార్థము వూరివారెల్లా జూచితే | గుక్కిళ్ళు మింగించి యాసకొలుపుచుండు |
మక్కళిం చందరిలోనిమనసులు వేరు వేరో | వొక్కటో యేమనవచ్చు నోహో నీమాయ ||
చ|| ధరలో బిడ్డ వొక్కటి తల్లిదండ్రులిద్దరు | తొరలింపువేడుకలై తోచుచుండు |
పెరిగేటిపుట్టుగులు భేదమో అభేదమో | వొరుల కేమనవచ్చు నోహో నీమాయ ||
చ|| కోరేమోక్ష మొక్కటే కొలచే దిద్దరినట | చేరె నిన్న లమేల్మంగ శ్రీవేంకటేశ |
మీరిద్దరు నేకమో మీభావాలు వింతలో | వూరికే యేమనవచ్చు నోహో నీమాయ ||

401) మలహరి

ప|| ఎఱిగినవారికి హింస లన్నియు మాని | మఱి సత్యమాడితేను మాధవుడే దిక్కు ||
చ|| కలుగు గారణములు కామక్రోధములు రేగ | వెలసినమాయావికార మది |
కలగగవలనదు కర్త లెవ్వరు గారు | తెలిసి వోరుచుకొంటే దేవుడే దిక్కు ||
చ|| పదార్థా లెదుట నిలుచు బంచేంద్రియాలు రేగ | వెదచల్లేటి మాయావికార మది |
పదరి పైకొనవద్దు పట్టితే బసలేదు | చెదరక వోరిచితే శ్రీపతే దిక్కు ||
చ|| సిరులు తానే వచ్చు చిత్తాన నాసలు రేగ | విరసపు మయావికార మది |
పరగ నలమేలమంగపతి శ్రీవేంకటేశ్వరు | శరణంటే నితనిచరణాలే దిక్కు ||

402) ధన్యాసి

ప|| ఒకటి సుజ్ఞానము ఒకటి అజ్ఞానము | ప్రకటించి వొకటి చేపట్టరో వివేకులు ||
చ|| తను దలచుకొంటేను తక్కినదేహభోగాలు | పనికిరావు అవి ప్రకృతిగాన |
ఘనమైన లోకభోగములతో లోలుడైతే | తను గానరాదు జీవత్వముగాన ||

****************************************************************************************************

***************************************************************************************************

చ॥ దైవము నెఱిగితేను తనకామ్యకర్మములు। భావించి మఱవవలె బంధాలుగాన।
కావించేటి కామ్యకర్మాల గట్టువడితే। దైవము లోను గాడు స్వతంత్రుడుగాన॥
చ॥ సరి మోక్షముగోరితే స్వర్గము తెరువు గాదు। అరయ స్వర్గము తెరువల మోక్షానకు।
పరగ నలమేల్మంగపతి శ్రీవేంకటేశుని। శరణాగతియె సర్వసాధనముగాన॥

403) లలిత
ప॥ హరి హరి నీమహిమ లనంతములు। నిరతి జీవులకెల్ల నేరువులై వున్నవి॥
చ॥ యెందరు భోగించినదో యీబ్రహ్మాండము దొల్లి। అందరికి దమతమదై వుండును।
కందువ నెవ్వ రెవ్వరి కాణాచి యైనదో భూమి। సందడించీ బంటలను సకలసస్యములు॥
చ॥ చుట్టుక యెందరికిని సొమ్మయినదో కాలము। అట్టె అందరిఆయుష్యమై యున్నది।
గట్టిగా నెవ్వరెవ్వరి కంచముకూడో యీమాయ। దట్టపుసంసారముల ధర్మములై యున్నవి॥
చ॥ ముంచి యెందరికైనాను మోపులై వుండీ కర్మము। పంచు కందరి దమ పనిపాటలై।
పంచుక శ్రీవేంకటేశ వారివారిబ్రదుకులు। నించి నీవే యైతివి నిధినిధానమువై॥

404) భూపాళం
ప॥ పావనము గావో జిహ్వ బ్రదుకవో జీవుడా। వేవేల కితని నింక వేమారును బాడి॥
చ॥ హరినామములే పాడి ఆతనిపట్టపురాణి। ఇరవై మించినయట్టియిందిర బాడి।
సరి నిరువంకలాను శంఖుచక్రముల బాడి। వరదకటిహస్తాలు వరుసతో బాడి॥
చ॥ ఆదిపురుషుని బాడి అట్టె భూమిసతి బాడి। పాదముల బాడి నాభిపద్మము బాడి।
మోదపుబ్రహ్మాండాలుమోచేవుదరము బాడి। ఆదరాన గంబుకంఠ మంకెతో బాడి॥
చ॥ శ్రీవేంకటేశు బాడి శిరసు తులసి బాడి। శ్రీవత్సముతోడురము జెలగి పాడి।
చూపుల మకరకుండలాలకర్ణములు పాడి। ఆవటించి యితని సర్వాంగములు బాడి॥

405) దేసాక్షి/మాయామాళవగౌళ
ప॥ నీవు వెట్టినచిక్కు నీవే తెలుపవలె। నావశమా తెలియ నారాయణా॥
చ॥ నీటిలోన నొకబుగ్గ నిముషములోన బుట్టి। కోటిసేసినట్లుండు గొంతవడి।
పాటించి యందే యడగె బ్రకృతియో బ్రహ్మమో। యేటిదో వీనియర్థ మెరిగించవయ్య॥
చ॥ ఆకశాన నొకగాలి అట్టె మ్రోయుచు బొడమి। లోకము సేయ విసరు లోలోనె।
మైకొని యందే యడగె మాయయో సత్యమో। యీకడ నీయర్థము మా కెఱిగించవయ్య॥
చ॥ భూమిలోన మొలకలు పుట్టుచు శ్రీవేంకటేశ। వాములై వెలయు సేసేవారికి।
ఆముక యందే యడగె అసత్తో ఇది సత్తో। యేమో యీయర్థము మాకెరిగించవయ్య॥

406) నాట
ప॥ ఎత్తుకొన్న బహురూప మిక మరి మానరాదు। చిత్తగించి మన్నించు శ్రీనరసింహా॥
చ॥ పట్టి ప్రహ్లాదునికై కంబములోన నుండితివి। గట్టిగా కనకదైత్యు ఖండించితివి।
యిట్టినీచేతలు విని యిందరు గొల్చేరు నిన్ను। కట్టుకొంటి వింతపని ఘననారసింహా॥
చ॥ దేవతల మొరాలించి దీకొంటి వింతపనికి। చేత నభయము లిచ్చి చేయెత్తితివి।
దేవుడ వని యెఱిగి త్రిజగాలు మ్రొక్కె నీకు। నీవల్లనే వచ్చె నిది నిత్యనారసింహా॥
చ॥ భూకాంతవిన్నపము పొంచి విని గురైతివి। శ్రీకాంత తొడమీద జేకొంటివి।
మీకును శ్రీవేంకటాద్రిమీదనె శరణంటిమి। దాకొనె మీమహిమలు దండినారసింహా॥

407) లలిత
ప॥ ఆతనిమూలమే జగమంతా నిది। ఆతుమతో హరి కీలుఅయివుండుగాని॥
చ॥ మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము। వచ్చినట్టె వచ్చితేను వలపే చవి।
మెచ్చు కుంది లేకున్న నెక్కడైనా సుఖమే। యిచ్చకుడై హరి తన కియ్యవలెగాని॥
చ॥ నెట్టుకొని నడచితే నిజమే మూలధనము। పట్టినదే వ్రతమైతే భవమే మేలు।
జట్టిగా నొనగూడితే సంసారమే ఫలము। యిట్టె హరి దనకు నియ్యవలెగాని॥

***************************************************************************************************

చ|| చెప్పినట్టు సేసితేను చేరి దేహమే చుట్టము। తప్పులు లేనిదైతే ధర్మమే సొమ్ము।
చొప్పునహరిదాసులు సోదించి చూచిన దిది। యెప్పుడు శ్రీవేంకటేశు డియ్యవలెగాని॥

408) సాళంగనాట

ప|| దిక్కు నీవే జీవులకు దేవనరసింహమా। తెక్కులగద్దియమీది దేవనరసింహమా॥
చ|| సురలెల్లా గొలువగ సూర్యచంద్రులకన్నులు। తిరమైనమహిమలదేవనరసింహమా।
నిరతి బ్రహ్లాదుడు నీయెదుట నిలిచితే। తెరదీసితి మాయకు దేవనరసింహమా॥
చ|| భుజము లుప్పొంగగాను పూచినశంఖుజక్రాల। త్రిజగములు నేలేటిదేవనరసింహమా।
గజభజింపుచు వచ్చి కాచుక నుతించేటి। ద్విజమునిసంఘములదేవనరసింహమా॥
చ|| ముప్పిరిదాసులకెల్లా ముందు ముందే యొసగేటి। తప్పరానివరములదేవనరసింహమా।
చిప్పిల నహోబలాన శ్రీవేంకటాద్రిమీద। తెప్పలదేలేటిదేవనరసింహమా॥

409) బౌళి

ప|| కన్నులపండుగలాయ కమ్మి సేవించేవారికి। సన్నల దాసులము సంతసించేము॥
చ|| పడతు లిద్దరు నీపాదముల వొత్తగాను। కొడుకు బ్రహ్మదేవుడు కొలువగాను।
కడుపులో లోకములు కడు జయవెట్టగాను। గుడిగొన నీబ్రదుకు గోవిందరాజా॥
చ|| మెత్తగా శేషుడు నీకు మించుబరపై వుండగా। జొత్తుమధుకైటభులు సుక్కి వోడగా।
హత్తి దేవతలు నిన్ను నందరు బూజింపగాను। కొత్తలాయ నీబ్రదుకు గోవిందరాజా॥
చ|| పరగి నీముందరను పంచబేరము లుండగా। గరిమ జక్రము నీకు గాపైవుండగా।
తిరమై శ్రీవేంకటాద్రితిరుపతిలోపలను। గొరబాయ నీబ్రదుకు గోవిందరాజా॥

410) శ్రీ

ప|| కేశవ నారాయణ కృష్ణ గోవింద ముకుంద। మూశినముత్తెమువలె మొక్కేము నీకు॥
చ|| నెమ్మి జక్రాయుధుడవు నీవు గల వటుగాన। పమ్మి మాకు నెన్నడును భయమేలేదు।
యిమ్ముల లక్ష్మిపతివి యేలిక వైతివిగన। నమ్మితి మాకు సర్వసంపదలు గలవు॥
చ|| పుట్టించినవాడవు భూధవుడ వటుగన। దట్టముగ నెంచగ బదస్థుడ నేను।
తొట్టి కరిరాజవరదుడ నీవే దిక్కుగన। గట్టిగా నాకోరిక లిక్కడ ఫలియించెను॥
చ|| గరువపు గొల్లలకు గోవిందరాయవుగన। నిరంతరమును బొడి నిండెను మాకు।
చిరంతనదేవుడవు శ్రీవేంకటేశ్వర నీవు। పరము నిహము మాకు బలువుగా గలిగె॥

411) గౌళ

ప|| హరియు సిరియు నేగే రదివో తేరు। పరం జ్యోతిస్స్వరూపపు పైడికుండతేరు॥
చ|| గరుడధ్వజపుదేరు కనకమయపు దేరు। సురలు బొమ్మలైనారు చుట్లదేరు।
మెరుగులమేఘములమించుగొణిగెలతేరు। సిరుల ధ్రువలోకపుశిఖరపుదేరు॥
చ|| బలుకులపర్వతాలె బండికండ్లైనతేరు। పలుదిక్కులంచులవున్నతపుదేరు।
కొలదిలేనిచుక్కలకుచ్చులముత్తేలతేరు। మెలపునాకాశగంగమేలుకట్లతేరు॥
చ|| మునులనే వుత్తమాశ్వములగా గట్టినతేరు। ఘనమహిమలసింగారపుదేరు।
యెనసి శ్రీవేంకటేశు డెపుడూ నలమేల్మంగ। దినదినభోగముల దిరమైనతేరు॥

412) బౌళి

ప|| పరమపురుష నిరుపమాన శరణు శరణురే యేమేమేయే ఇందిరా నిజమందిరా॥
చ|| కమలనాథ కమలనయన కమలచరణురే అమితసురమునినాథయూథపరాయణా వరదాయకా॥
చ|| చతురమూరితి చతురబాహుశంఖచక్రధరా। అతిశయ శ్రీవేంకటాధిప అంజనాకృతిరంజనా॥

413) దేవగాంధారి

ప|| సదానందము సర్వేశ్వర నీ-। పదారవిందముపై భక్తి॥
చ|| నయనానందము నరులకు సురలకు। జయమగు హరి నీసాకారము।
నయమగుశ్రవణానందము వినినను। క్రియగలిగిననీకీర్తనము॥

చ॥ చెలగి యందరికి జిహ్వానందము। పలుమరు గొనునీప్రసాదము।
నలుగడ దేహానందము బుధులకు। బలునీపాదప్రణామములు॥
చ॥ ధర బరమానందము నీదాస్యము। గరిమల శ్రీవేంకటవిభుడా।
నరహరి నిత్యానందము నిను దగ-। నరవిరి జేయుసమారాధనము॥
414) సామంతం/కాంభోజి
ప॥ అరసి వేరొకచో ముక్తుడుగగవలదు। సారపులౌకికవిమోచనమే ముక్తి॥
చ॥ మొగి బుణ్యపాపవిముక్తియే ముక్తి। వెగటుబ్రపంచమువిముక్తే ముక్తి।
తగులుసంసారబంధవిముక్తే ముక్తి। జగములో గలుగుయాశాముక్తే ముక్తి॥
చ॥ కామక్రోధాదిసంగవిముక్తే ముక్తి। వేమారు రుచులపై విముక్తే ముక్తి।
నాముల దేహాభిమానపుముక్తే ముక్తి। పామెడికోరికలసంపదముక్తే ముక్తి॥
చ॥ ముందువెనుకల కర్మమోచనమే ముక్తి। అంది సుఖదుఃఖభయముక్తే ముక్తి।
కందువ శ్రీవేంకటేశుగని యందె శరణని। విందుల నితరసేవావిముక్తే ముక్తి॥
415) సాళంగనాట
ప॥ ఈతడే యీతడే నుండి యెంత యెంచిచూచి। చేతనే వరాలిచ్చీ శేషాచలేశుడు॥
చ॥ విశ్వరూపపుబ్రహ్మము విరాట్టయినబ్రహ్మము। ఐశ్వర్యస్వరాట్టాసామ్రాట్టయినబ్రహ్మము।
శాశ్వతబ్రహ్మాండాలు శరీరమైనబ్రహ్మము। యీశ్వరుడై మహారాట్టై యిందరిలో బ్రహ్మము॥
చ॥ సూర్యునిలో తేజము సోమునిలో తేజము। శౌర్యపుటనలునిభాస్వత్తేజము।
కార్యపుటవతారాల గనుగొనేతేజము। వీర్యపుటెజ్ఞభాగాలవిష్ణునామతేజము॥
చ॥ పరపురుషమూర్తి ప్రకృతియైనమూర్తి। గరిమతో మహదహంకారమూరితి।
ధర బంచతన్మాత్రలు తత్త్వము లైనమూరితి। గరుడానంత సేవేశకర్తయైనమూరితి॥
చ॥ భాగవతపుదైవము భారతములో దైవము। సాగినపురాణవేదశాస్త్రదైవము।
పోగులైన బ్రహ్మలను బొడ్డున గన్నదైవము। శ్రీగలిగి భూపతైన శ్రీవేంకటదైవము॥
416) నాదనామక్రియ
ప॥ నే నేమెరిగి సేసేనో నీకు దిరువారాధన। అని మున్నిటిబ్రహ్మారుద్రాదులు సేయగలేరు॥
చ॥ అనుగునీరూప మింతింతనెరిగి సేసేనో। వునికై నీ వొక్కచోనే వుండే దెరిగి సేసేనో।
తనిసి నీకు నొక్కమంత్రమనెరిగి సేసేనో। కనరానినీమహిమే కడయెరిగి సేసేనో॥
చ॥ మరిగి నీకు నొక్కనామమనెరిగి సేసేనో। అరిసి యించుకేకాలమనెరిగి సేసేనో।
నిరతి నీ కేమి లేవని యెరిగి సేసేనో। బెరసి నన్ను గొంత మెప్పించ నెరిగి సేసేనో॥
చ॥ తెలిసి నీకు నొక్కమూర్తియనెఱిగి సేసేనో। అలమిననీమాయ గొంతనెఱిగి సేసేనో।
అలమేల్మంగకు బతియగుశ్రీవేంకటేశుడ। వొలిసి నీ కృపమింప నొక్కటెరిగి సేసేనో॥
417) బౌళి
ప॥ జగన్మోహనాకార చతురుడవు పురుషోత్తముడవు। వెగటునాసోదంబు ఇది నీవెలితో నావెలితో॥
చ॥ యెన్నిమారులు సేవించిన గన్నులూ దనియవు। విన్ననీకథామృతమున వీనులు దనియవు।
సన్నిధిని మిమ్ము నుతియించి సరుస జిహ్వయు దనియదు। విన్న కన్నది గాదు ఇది నావెలితో నీ వెలితో॥
చ॥ కడగి నీప్రసాదమే కొని కాయమూ దనియదు। బడి బ్రదక్షిణములుసేసి పాదములు నివి దనియవు।
నుడివి సాష్టాంగములు చేసి నుదురునూ దనియదు। వెడగుదన మిది గలిగె నిది నావెలితో నీ వెలితో॥
చ॥ చెలగి నిను నే బూజించి చేతులూ దనియవు। చెలువు సింగారంబు దలచి చిత్తమూ దనియదు।
అలరి శ్రీవేంకటగిరీశ్వర ఆత్మ నను మోహింపజేసితి। వెలయ నిన్నియు దేరె మును నావెలితో నీ వెలితో॥
418) దేవగాంధారి
ప॥ అందుకే నే జింతించెదను అచ్యుత నీకరుణాగతుడ। సందడి నాభవ మిందువల్లనే సఫలంబాయనయ్యా॥
చ॥ వొకనీనామము వొగి దలంచిన। అకలంకం బగునాపాపంబులు అన్నియు బారణేసెనె।
అకటా తక్కిన అనంతనామములు। వొకట నుపవాసములున్నవోయయ్యా॥
****************************************************************************************************

చ॥ హరి నీపాదము లవి రెండే। పరమును నిహమును నాకొసగెను పయిపై గృపతోడ।
ధర నీయనమ్తకరములు తా మేమి-। సిరు లిత్త మనుచు చెలగీనయ్యా॥
చ॥ ఇల నీదాస్యం బిది యొకటే। సిలుగులభవములజిలుగు మాన్పె నదె చిత్తముతహ దీర।
యెలమిని శ్రీవేంకటేశ్వర నీ విదె। తలపున బాయక దక్కితివయ్యా॥

419) మాళవి/నాట
ప॥ దేవ నమో దేవా। పావనగుణగణభావా॥
చ॥ జగదాకారచతుర్భుజ। గగననీలమేఘశ్యామ।
నిగమపాదయుగ నీరజనాభ। అగణితలావణ్యాననా॥
చ॥ ఘనవేదాంతై గణన వుదార। కనకశంఖచక్రకరాంకా।
దినమణిశశాంకదివ్యలోచన। అనుపమరవిబింబాధర॥
చ॥ భావజకంజభవజనక। శ్రీవనితాహృదయేశ।
శ్రీవేంకటగిరిశిఖరవిహార। పావనగుణగణభావా॥

420) శ్రీ
ప॥ అల్పశక్తివాడ నేను ఆదిశక్తివి నీవు। పోల్ప నెంతపనికి బూనితివయ్యా॥
చ॥ నీపదధ్యానములోనే నిండెను నామనసెల్ల। యేపున నీసాకార మేమిటి భావింతునయ్య।
చూపు నీ సింగారమందే చొక్కి తగులాయ నిదె। ఆపి నే నీయంగకాంతుల జూతునయ్య॥
చ॥ నాలుక నీకడలేనినామములే నుడిగీని। మేలిమి నీగుణము లేమిట బొగుడుదునయ్య।
గాలివంటివీనులు నీకథల దనిసెనయ్య। యీలీల నీయనంతమహిమ యెందు విందునయ్య॥
చ॥ నీకు శరణని యిట్టె నే ధన్యుడనైతి। యీకడ నీసేవ సేసి యేమి గట్టుకొందునయ్య।
శ్రీకాంతుడవైనశ్రీవేంకటేశ నీకు। వూకొన నాజన్మఫల మొకమొక్కు చాలునయ్య॥

421) సాళంగనాట / భైరవి
ప॥ జీవుని కేకాలము శ్రీహరి చేరువబంధువు డీతడు।
భావములోపలిరేపకుడై భక్తి చేకొనును యీతడు॥
చ॥ పరమున నిహమున వెంటవెంటనే పాయనిబంధువు డీతడు।
ధర దనుదలచిన మారుకుమారై తా రక్షించును యీతడు॥
విరివిగ నింద్రియవిషయభోగముల విందులు వెట్టును యీతడు।
వురుగతి జిత్రపురూపుల దేహపుటుడుగర లిచ్చును యీతడు॥
చ॥ వడి కలకాలము యిరువదియొక్కటవావులబంధువు డీతడు।
బడిబడి జైతన్యంబై యిన్నిట బనులకు నొదగును యీతడు।
జడిగొని యేకాంతలోకాంతమై మతిసంగతి నాప్తు డీతడు।
పొడలుచు వైదికలౌకికర్మల నొకపొత్తున గుడుచును యీతడు॥
చ॥ ఘననిధినిక్షేపములిచ్చేటివుపకారిబంధువు డీతడు।
అనయము వెరవకుమని యేకాలము నభయం బొసగును యీతడు।
ననిచినశ్రీవేంకటేశ్వరుడై యిటు నాపాల గలుగు నీతడు।
పనివడి అరులను సూడువట్టి కడు బగసాధించును యీతడు॥

422) సామంతం/కాపీ
ప॥ ఇందుకా కోరి పుట్టె యిట్టిబదుకు। పొందుల శ్రీహరితోడి పొత్తుల మాబదుకు॥
చ॥ బడబాగ్ని ఆకటిబారిబడ్డబ్రదుకు। పడతులకూటముల బడ్డబదుకు।
వొడలి తోలునెమ్ముల వొడిగట్టెబదుకు। బడి బుణ్యపాపాలపైతరవు బదుకు॥
చ॥ నాలుక గడచితేను నరకపుబదుకు। మూలమలమూత్రాల మూటగట్టెబదుకు।
కాలము నడిపి వూర్పుగాలిబుచ్చేబదుకు। పాలుమాలేయింద్రియాల పంగెమాయ బదుకు॥
చ॥ ఇంపుసుఖదుఃఖాల యెండనీడబదుకు। మంపుగామక్రోధాలమాటు బదుకు।

జంపుల శ్రీవేంకటేశుశరణు చొరగ నేడు। సొంపు లిన్నిటా మాకు సుఖమాయ బదుకు ॥

423) లలిత

ప॥ ఇదివో వున్నార మింతట నంతట। వెదకి కదియకుమీ విష్ణుమాయ ॥

చ॥ హరిదాసులము హరికింకరులము। కరివరదునిడింగరులము।
యిరవెఱిగితిననక యెఱుగననక। సరి మాగుర్తిది సర్వేశుమాయ ॥

చ॥ హితులము శరణాగతులము కేశవ-। వ్రతులము వైష్ణవమతులము।
గతి నిను బాసితి కడు వికమామీద। తతి దయమరవకు దైవముమాయ ॥

చ॥ శ్రీవైష్ణవులము శ్రీవేంకటపతి। భావింప నితనిపరికరము।
యీవలనావల నిహపరములకును। తోవదొలగుమీ తొలిదొలి మాయ ॥

424) రామక్రియ

ప॥ ఇంతకంటే దగుబంధు లింక నున్నారా। యెంతసేసినా నీకు నెదురాడేనా ॥

చ॥ కోపగించి చంకబిడ్డ గోరి తల్లి దించితేను। పైపై నే పడుగాక పాసిపొయ్యీనా।
వోపక నానేరముల కొగి నీవు వేసరితే। నీపాదాలే గతిగాక నే మానేనా ॥

చ॥ చదివించే అయ్యగారు జంకించి చూచితేను। వొదిగి చదువుగాక వోపవనీనా।
యెదుటిగుణములకు నెంత నీవు దొబ్బినాను। యిదె నీకే మొక్కుదుగా కింక మానేనా ॥

చ॥ చెక్కు మీటి పాలు పెంచినదాది వోయగాను। గక్కన మింగుటగాక కాదనీనా।
యిక్కడ శ్రీవేంకటేశ యిటుల రక్షించగ। నిక్కి నే మెరతుగాక నే మానేనా ॥

425) శంకరాభరణం

ప॥ అదియే విష్ణుపదము ఆతుమకు నెలవు। అదే జననకారణ మాకాశపదము ॥

చ॥ మంచిమాటలైనా గానిమాటలైన నొకచోట। ముంచిముంచి యాకాశముననే యణగును।
యెంచరానినిట్టూర్పు లెన్ని వొడమినాను। అంచల నణగిపోవు నాకాశమునను ॥

చ॥ చూపు లెంతదవ్వైనా సూర్యచంద్రుల దాకి। ఆపొంతనే యణగు నాకాశమునను।
రూపుల మైనీడలును రుచుల గాలత్రయము। పైపైనే యణగును బహిరాకాశమున ॥

చ॥ యిల జీకటి వెలుగు యెంచ నహోరాత్రాల। గలసి మెలగు నాకాశతత్వమున।
చలువై శ్రీవేంకటేశు సాకారనిరాకారా-। లలరి వెలుగుచుండు నంతరాకాశమున ॥

426) కాంభోజి

ప॥ చూచి మోహించకుందురా సురలైన నరులైన। తాచి నీవు ముందర బ్రత్యక్షమైనను ॥

చ॥ భాగీరథి పుట్టినపాదపద్మములు। భోగపుమరునిజన్మభూమి నీతొడలు।
యోగపునవబ్రహ్మలుండిననీనాభి। సాగరకన్యకలక్ష్మి సతమైనవురము ॥

చ॥ అందరి రక్షించేటిఅభయహస్తము। కంద నసురలజంపేగదహస్తము।
సందడిలోకములయాజ్ఞాచక్రహస్తము। చెంది ధ్రువు నుతియించజేయుశంఖహస్తము ॥

చ॥ సకలవేదములుండేచక్కనినీమోము। వొకపై తులసిదేవివుండేటిశిరసు।
ప్రకటపుమహిమల బాయనినీరూపము। వెకలిశ్రీవేంకటవిభుడ నీభావము ॥

427) లలిత

ప॥ వాదులేల చదువులు వారు చెప్పినవేకాదా। వాదులేల మీమాట వారికంటే నెక్కుడా ॥

చ॥ నాలుగువేదాలబ్రహ్మ నలి నెవ్వనిసుతుడు। వాలినపురాణాలవ్యాసు డెవ్వనివాడు।
లీల రామాయణపువాల్మీకివసిష్ఠులు। ఆలకిం చెవ్వని గొల్చి రాతడే పో దేవుడు ॥

చ॥ భారత మెవ్వనికథ భాగవతముచెప్పిన-। ధీరుడైనశుకుడు యేదేవునికింకరుడు।
సారపుశాస్త్రాలు చూచిసన్యసించి నుడుగేటి। నారాయణనామపునాథుడే పో దేవుడు ॥

చ॥ విష్ణువాజ్ఞయని చెప్పేవిధిసంకల్ప మేడది। విష్ణుమాయని చెప్పేవిశ్వమంతా నెవ్వనిది।
విష్ణుమయం సర్వ మనేవేదవాక్య మెవ్వనిది। విష్ణువు శ్రీవేంకటవిభుడే ఆదేవుడు ॥

428) నాట

************************************************************************************************

*******************************************************************************************

ప|| ఇతని కితడేకాక యితరులు సరియా। మితి లోకా లితనిమేనిలోనేకావా॥
చ|| కమలనాభునిభయంకరకోపముతోడ। రమణ వేరొకరివరంబులు సరియా।
తమితోడ దలదుంచి తగినవరము లిచ్చె। అమరగ నరకాసురాదులకు నితడు॥
చ|| కరివరదుని పేరుగలసినతిట్లతో। పరదేవతలమంత్రపఠనలు సరియా।
నిరతి శిశుపాలునినిందకు శిక్షించి। పరలోకమిచ్చినట్టి భావము వినరా॥
చ|| చలిమి శ్రీవేంకటేశు శరణాగతితోడ। బలిమి మించినబ్రహ్మపట్టము సరియా।
వొలిసిన ధ్రువునకు వున్నతలోక మిచ్చె। అలబ్రహ్మలోకమున కదె మీ దెఱుగరా॥
429) పాడి
ప|| గొరవై మొద లుండగ గొనలకు నీరేల। దొరదైవ మితడే తుదగలఫలము॥
చ|| క్రతువులు హరియే కర్మము హరియే। పితరులకు హరియే పెనుదృప్తి।
సతతమంత్రములసారము హరియే। యితనిసేవే పో యిన్నిటిఫలము॥
చ|| అనలము హరియే ఆహుతి హరియే। జననీజనకులసరివి హరే।
పనివడి వేదము బ్రణవము హరియే। యెనసితనిపూజ యిన్నిటిఫలము॥
చ|| యేలికె హరియే యిరవును హరియే। వాలాయము సర్వము హరియే।
కాలము శ్రీవేంకటగిరిహరియే। నేల నీతనిశరణే సఫలంబు॥
430) లలిత
ప|| దొంతివిషయములాల దొరలాల। చెంత మీదటిబుద్ధి చెప్పరో మాకు॥
చ|| దురితంబు లొకకొన్ని దుర్గుణము లొకకొన్ని। మరుగుటలు గొన్ని మర్మములు గొన్ని।
ధర నెరుక లొకకొన్ని తగ నెరగములు గొన్ని। యిరవు మనపంట లివి యెందు వోయుదమో॥
చ|| ఆవ లొకకొన్ని మిత్యాచారములు గొన్ని। వాసు లొకకొన్ని గర్వములు గొన్ని।
రేసు లొకకొన్ని మీరినరుచులు నొకకొన్ని। యీసున గడియించితిమి యిముడ జోటేదో॥
చ|| వైరాగ్యములు గొన్ని వరభక్తు లొకకొన్ని। నేరుపులు గొన్ని యిన్ని యును గలిగి।
యీరీతి శ్రీవేంకటేశుగతి చేరితిమి। మేర మిము మీరితిమి మాకు గతియేదో॥
431) శుద్ధవసంతం
ప|| ఏవుపాయములు మాకిక బనికిరావు। నీవే హరి కావవే నిరుహేతుకమున॥
చ|| యివల నింద్రియజయం బేడ నే నేడ। భువి నింద్రియములతో బుట్టె నీతనువు।
ఆవల నిశ్చలబుద్ధి అది యేడ నే నేడ। భవము చంచలమనసు పంగెమే యేడ॥
చ|| యెలమి గర్మవిముక్తి యేడ నే నేడ। తెలియంగ గర్మాధీన మీబ్రదుకు।
కుళికమగుసాత్వికపుగుణ మేడ నే నేడ। కలియుగంబిది యిందు గలవాడ నేను॥
చ|| తనివోనిఘోరతప మేడ నే నేడా। అనిశంబు నీకు శరణాగతుడను।
యెనలేని శ్రీవేంకటేశ్వరుడ నీబిరుదు। కనుగొనగ శరణాగతపారిజాతం॥
432) సామంతం/హిందోళ
ప|| సమబుద్ధే యిందరికి సర్వవేదసారము। సము డిందరికి హరి సాధనమోయయ్యా॥
చ|| చీమకు దనజన్మము చేరి సుఖమై తోచు। దోమకు దనజన్మము దొడ్డసుఖము।
ఆమనియీగకు సుఖ మాజన్మమై తోచు। యేమిటా నెక్కువసుఖ మెవ్వరి కేదయ్యా॥
చ|| జంతురాసులకునెల్లా జననము లొక్కటే। అంతటాను మరణము లవియొక్కటే।
చెంత నాహారనిద్రలు స్త్రీసుఖా లొక్కటే। ఇంతటా నిందుకంటే నెవ్వ రేమి గట్టిరయ్యా॥
చ|| ఇందులోన నెవ్వరైనానేమి శ్రీవేంకటపతి-। నందముగా దలచిన దది సుఖము।
యెందు జూచినా నీత డిందరిలో నంతరాత్మ। చందముగా నెవ్వరికి స్వతంత్ర మేదయ్యా॥
433) బౌళి
ప|| కరుణానిధివిగాన కాచితేనేమోకాని। సరికి బేసికి నిన్ను అరయ జోటున్నదా॥
చ|| కాయములోపలినున్న గని మని కొలువక। ఆయపుగర్మమె బ్రహ్మ మని వుంటిని।

*******************************************************************************************

చీయనినాచేతకు నేసిగ్గుపడుండుటగాక। ఆయమేమైనా నిన్ను నడుగ జోటున్నదా॥
చ॥ సకలచైతన్యుడవై సరి నాలో నుండగాను। వికటపువిషయాలవెంట బారితి।
వొకరు రక్షించగా నేనొకరిపాలైననాకు। తుకతుకలేకాక దూరగ చోటున్నదా॥
చ॥ పట్టి శ్రీవేంకటగిరి బ్రత్యక్షమై యుండగాను। ఇట్టు నట్టు వైకుంఠ మేల కోరేను।
దిట్టనై నానేరమి నే తెలిసి నవ్వుట యింతే। ఇట్టె చిత్తము గాక యెంచగ జోటున్నదా॥

434) శంకరాభరణం

ప॥ ఇన్నిటా నొరయక యెఱుకేది। వెన్నునికృపగా వెలసేది॥
చ॥ కోపము మతిలో గుంచినపుడు వో। పాపము లన్నియు బాసేది।
జీవులయాసలు దీరినపుడు వో। తాపత్రయములు దలగేది॥
చ॥ ఘనకర్మంబులు గడచినపుడు వో। వెనుకొనుభవములు విడిచేది।
మునుకొని యింద్రియములు వీడినబో। పనివడి విరక్తి బలిసేది॥
చ॥ ఆకటిరుచు లివి యణగినపుడు వో। చేకొను సుఖమును జెందేది।
యీాకడ శ్రీవేంకటేశ్వరుశరణము। పైకొనిననుబో బదికేది॥

435) సాళంగనాట/ఖరహరప్రియ

ప॥ సకలోపాసకులకు నందును సగుణంబే ప్రమాణము।
సకలమునీంద్రులు పూజించే యీసాకారమే ప్రమాణము॥
చ॥ సగుణంబని నిను గొందరు సరి నిర్గుణమని కొందరు।
వగల నెక్కుగతి జదివినకొలదుల వారికివారే వాదింతురు।
అగణితస్వతంత్రుడవుగాన అల వాల్మీకి ఇట్టిట్టనకే।
అగు నిర్గుణాయ గుణాత్మనే యని ఆనతి ఇచ్చుటే ప్రమాణము॥
చ॥ సోహం అని కొందరు దాసోహం అని కొందరు।
సాహసవృత్తుల రెండుదెరంగుల సకలవివేకులు భజింతురు।
దేహధారియై దాసోహం బని తేరి శుకుడు మీలో గలసె।
సోహపుభావన సర్వజగత్తుల జూపిన దేహప్రమాణము॥
చ॥ ఆరుశాస్త్రముల నారుమతంబుల నారుగర్మములనైనాను।
యీరీతుల మిము శరణము కొలువక యెవ్వరి కుపాయము లేదు।
నారదాదులగుభక్తు లిందరును నానాగతు లరసి చూచి।
సారపుశ్రీవేంకటపతి మీకే శరణనుటే ప్రమాణము॥

436) మాళవి

ప॥ హరి నెఱుగనిజన్మ మది యేలా ఆ-। సరుస నాతడులేని చదువేలా॥
చ॥ దయదొలగనియట్టితపమేలా। భయములేనియట్టిభక్తేలా।
ప్రియము మానినయట్టిపెనగేలా మంచి-। క్రియావిరుద్ధపుకీర్తనలేలా॥
చ॥ ఫలములేనియట్టిపనులేలా కడు-। గలిమిలేనియట్టిగర్వమేలా।
బలిమిలేనియట్టిపంతమేలా శౌరి-। దలచలేనియట్టితనువది యేలా॥
చ॥ తన కమరనిదొరతనమేలా। చనవులేనియట్టిసలిగె యేలా।
యెనలేని శ్రీవేంకటేశ్వరుని శరణని। మనగలిగినమీద మరిచింతలేలా॥

437) గుండక్రియ

ప॥ అవియు నాకు బ్రథమాచార్యులు। తవిలి యీనెపము మిము దలపించుగాన॥
చ॥ ధనవాంఛ మతిలోన దగిలినప్పటివేళ। దనుజారి మీమీద దలపు గలుగు।
పొనిగి భయదుఃఖముల బొరలినప్పటివేళ। పనిపూని మీమీదిభక్తి గలుగు॥
చ॥ చెలగి పాపములు మించినవేళ హరి మీ-। సలుపునామోచ్చారణంబు గలుగు।
బలిమి భవరోగముల బడలినప్పటివేళ। పలుమారు మీసంప్రార్థనలు గలుగు॥

చ|| అన్నిటా దొలగి మిము నెరిగి కొలిచినవేళ | మన్ననలపరిణామంబు గలుగు |
వున్నతపుశ్రీవేంకటోత్తముడ మిము నెదుట | గన్న యీవేళ సౌఖ్యంబులే కలుగు ||

438) లలిత
ప|| ఈతని మరచివుంటి మిన్నాళ్ళును | యీతల నే డెచ్చరించె నీతడే పో విష్ణుడు ||
చ|| తల్లియై పోషించు తండ్రియై రక్షించు | వుల్లపుబంధుడై వొడ లరయు |
మెల్లనె దాతై ఇచ్చు మెలుతయై యాదరించు | యెల్లవిధబంధుడు యీతడే పో విష్ణుడు ||
చ|| యేలికయై మన్నించు విష్ణుడై బుద్ధిచెప్పు | చాలుమానిసియై యంచల దిరుగు |
బాలుడై ముద్దుచూపు ప్రాణమై లోన నుండు | యీలాగులబంధు డీతడే పో విష్ణుడు ||
చ|| దేవుడై పూజగొను ద్రిష్టిగోచరమై | శ్రీవేంకటాద్రిమీద సిరు లొసగు |
తావై యెడమిచ్చు తలపై ఫలమిచ్చు | యీవలనావల బంధుడీతడే పో విష్ణుడు ||

439) లలిత
ప|| వీధిలోన నదేకదే విష్ణు పదము | ఆదెసనే పాయకుండు నాదిమూలము ||
చ|| చూచేటిచూపులకు సూటియైనమొదలేదో | యేచి వినుకలిమర్మ మెందు దాకీనో |
వాచవిచవులు చూచేవంటశాలచోటేదో | ఆచాయనే వుండు నాదిమూలము ||
చ|| పూపతలపోతలకు పుట్టినయి ల్లది యేదో | పైపై నూర్పులు నిలుపగ జోటేదో |
మాపులు నిద్రించువేళ మర్చేటిచోటేదో | ఆపొరుగుననే వుండు నాదిమూలము ||
చ|| నేరిచినవిద్యలెల్లా నించి దాచేచోటేదో | కోరనియానందముకొన యేదో |
అరయ శ్రీవేంకటేశు డాడనే పాయక వుండు | ఆరితేర నాత డీత డాదిమూలము ||

440) బౌళి
ప|| దేహి నిత్యుడు దేహము లనిత్యాలు | యీహల నామనసా యిది మరవకుమీ ||
చ|| గుది బాతచీర మాని కొత్తచీర గట్టినట్టు | ముదిమేను మాని దేహి మొగి గొత్త మేను మోచు |
అదన జంపగలేవు ఆయుధము లీతని | గదిసి యగ్ని యు నీరు గాలియు జంపగ లేవు ||
చ|| యీతడు నరకపడ డీత డగ్ని గాలడు | యీతడు నీట మునుగ డీతడు గాలి బోడు |
చేతనుడై సర్వగతుండౌ చెలియించ డేమిటను | యీతల ననాది యీత డిరవు గదలడు ||
చ|| చేరి కానరానివాడు చింతించరానివాడు | భారపువికారాల బాసినవా డీయాత్మ |
అరయ శ్రీవేంకటేశునాధీన మీతడని | సారము దెలియుటే సత్యం జ్ఞానము ||

441) భవుళి/ఆనందభైరవి
ప|| హరిసే వొకటే యనంతము | గురుబోధలకును కొలదే లేదు ||
చ|| తలచినకొలదే తన్లో భావము | నిలిపినకొలదే నేమము |
పలికినకొలదే పరమగుసత్యము | యిల నెవ్వరికిని యెక్కుడు లేదు ||
చ|| జరిపినకొలదే సకలాచారము | నెరపినకొలదే నిజకీర్తి |
తిరము సేయుకొలదే ధర్మంబును | యిరవుగ నందుకు నెక్కుడు లేదు ||
చ|| సేసినకొలదే చేకొనుకర్మము | రోసినకొలదే రుచివిరతి |
ఆసల శ్రీవేంకటాధిపుశరణను | దాసుడే యెక్కుడు తప్పే లేదు ||

442) లలిత
ప|| ఇది యరుదను నొక డిది యరుదని చెప్పు | యిది యరుదని విను నెవ్వడూ నెఱుగడు ||
చ|| పుట్టినవానికినెల్లా భువి మరణము నిత్య- | మట్టె చచ్చినవారి కవ్వలజననము |
పుట్టినవాడై తేను పొడగానరాదు మేను | కొట్టగొన గానరాడు కొన్నాళ్ళేగాని ||
చ|| జీవుడు నిత్యు డేమిటా జెరుపగరానివాడు | యీవివేకము దెలిసి యేజాతివారైనా |
దైవికమే నమ్మి తమధర్మముల బాయరాదు | సావధాన మిదియే సంసారయోగము |
చ|| చిత్తమా నీలోపలను శ్రీవేంకటేశ్వరుడు | పొత్తున గూడున్న వాడు పొదిగి పాయకు నీవు |
యెత్తి నాదేహగుణము ఇది జీవగుణ మిది | ఇత్తలాదైవగుణము యిది మఱవకుమీ ||

******************************************************************************************

443) ముఖారి
ప॥ నాకు నీవు గలవు హరి నాలోపలనుండి।పైకొని యిన్ని యు బదుకనీవయ్యా॥
చ॥ పసిగొని ఋణానుబంధముకొలదే।పసులును బడతులు బహుసుతులు।
వసముగావు తమవంతులు దీరిన।పసగా నవియే బదుకనీవయ్యా॥
చ॥ పెనగొని భటులకు బెట్టినకొలదియు।పనులును గీర్తులు పంతములు।
అనువులు దప్పును అవి గతమైతే।పనివడి యివియే బదుకనీవయ్యా॥
చ॥ కడుసందలను కాలముకొలదే।బడిబడి జవులై ఫలియించు।
యెడవక శ్రీవేంకటేశు డిచ్చె నివే।పడసితి మివియును బదుకనీవయ్యా॥

444) లలిత
ప॥ నీ వొక్కడవే నాకు చాలు నీరజాక్ష నారాయణ।నీవే నాకు గతియని తెలిసితి నొక్కొని యితరము వృథా వృథా॥
చ॥ మీనామోచ్చారణమే మెరసిన దుఃఖ్ని వారణము।మీనామోచ్చారణమే మెలగుశుభకరము।
నానావేదశాస్త్రములు నవపురాణేతిహాసములు।మీనామములోనే వున్నవి మిగిలిన విన్ని యూ వృథా వృథా॥
చ॥ నీపాదమూలము నింగియు భువియు రసాతలము।నీపాదమూలము నిఖిలజీవపరిణామములు।
దీపించినచరా చరంబులు దివ్యులు మునులును సర్వమును।నీపాదమూలమే మరి నెరి నితరంబులు వృథా వృథా॥
చ॥ దేవ మీతిరుమేను దిక్కును బ్రహ్మాండాధారము।దేవ మీతిరుమే నుత్పత్తిస్థితిలయములకును ఆకరము।
శ్రీవేంకటపతి నాభావము చిత్తము నీకే సమర్పణ।దేవ మీశరణము చొచ్చితి దికులన్ని యును వృథా వృథా॥

445) కాంభోజి
ప॥ నన్నెరగలేనయ్యా నాయంతర్యామై।వున్న తపుహరి నాలో నున్నాడట॥
చ॥ యిల నేడూ జానలమే నిందులోనివాడ నింతే।తలపు బ్రహ్మాండాలు దాటిపొయ్యీని।
కలువరేకులంతేసికన్ను లవాడ నింతే।సొలసి చూపాకాశమే చూరగొనీని॥
చ॥ వెడ వెంట్రుక దూరేటివీనులవాడ నింతే।కడలేనిశబ్దము లొక్కట వినేను।
నడుమ నే నెల్లెడంత నాలికెవాడ నింతె।వుడివోనిసుద్దు లెల్లా నుగ్గడించేను॥
చ॥ లచ్చన బదారంగుళాలప్రాణ మింతే।కుచ్చి కాలపుదినాలు గొలచీని।
కొచ్చినశ్రీవేంకటేశుకొలువుడుబంట నింతే।పచ్చియింద్రియాల కెల్లా బంపు సేసేను॥

446) సామంతం/మాయామాళవగౌళ
ప॥ నిక్కమైననాలోనినెలవు గాన లేను।దిక్కు నీవే హరి నా తెలివేటి తెలివి॥
చ॥ నీటిలో మునిగి వచ్చి నిర్మలుడ ననుకొందు।గాటమై యావేగి లేచి కా నందును।
తేటలఆదేహమే దిష్టము అనేనే।పాటిలేనిభావపునాబదు కేటిబదుకు॥
చ॥ యెన్న నొక బంటు నేలి యేలికె నే ననుకొందు।పన్ని నే నొకరి గొల్చి బంట నందును।
మున్నిటినామనసె మొదలినాపుట్టుగే।యిన్ని వికారాలనాయెరు కేటియెరుక॥
చ॥ కాంచనము చేతనుండే కలవాడ ననుకొందు।పెంచి యొకవేళ నే బేద నందును।
కంచుమాయ బొరలగా గాచితి శ్రీవేంకటేశ।కొంచినయిన్నాళ్ళు నాగుణ మేటిగుణము॥

447) మాళవి
ప॥ అరుదరుదు నీమహి మతిమానుషము చూడ।పురుషోత్తమనుదివ్యపురజగన్నాథా॥
చ॥ పసులగాచే దేడ బ్రహ్మ నుతియించు టేడ।సిసువౌటేడ నాలుగుచేతు లేడ।
కొసరి వేలనే యేడ కొండగొడగెత్తు టేడ।వసమా నిన్ను బొగడ వరజగన్నాథా॥
చ॥ జనవేష మేడ పారిజాతము దెచ్చిన దేడ।తనివెన్న ముచ్చిమేడ దైవికమేడ।
పని బండిబోయిడేడ బాణుని నరకు టేడ।విన గత నీమహిమ విష్ణు జగన్నాథా॥
చ॥ కమ్మి రోల గట్టు టేడ గరుడవాహన మేడ।దొమ్మి భద్రసుభద్రులతోబుట్టు వేడ।
చిమ్ముల నిలగిరిని శ్రీవేంకటాద్రిమీద-।నుమ్మడి నిరవుకొంటి వోజగన్నాథ॥

448) శ్రీ

ప॥ నీమహిమో నాలోన నిండిన వలపు జాడో। యేమి సేతు నన్నె ప్పుడు నెడయకుమయ్యా ॥
చ॥ యెనసి నీతో నేను యెంత వడి మాటాడినా। తనియదు నా మనసు తమి యెట్టిదో।
వినయముతో రెప్పలు వేయక చూచినాను। నినుపులై మమతలు నిచ్చ కొత్తలు ॥
చ॥ చలపట్టి నీ తోను సారె సారె బెనగిన। నలయదు నా మేను ఆశ యెట్టిదో।
కొలువులో నీ వద్ద గూచుండి యెంత నవ్విన। తలపులో కోరికలు తరగని ధాన్యాలు ॥
చ॥ కరగి యందాకా నిన్ను గాగిలించుకుండినాను। విడువవు చేతులు వేడుకెట్టిదో।
అడరి శ్రీ వేంకటేశ యలమేల్ మంగను నేను। తొడరి యేలితివి రతులు తరితీపులు ॥

449) గుండక్రియ

ప॥ నేనేమి జేయగలేను నీవు పరిపూర్ణుడవు। హీనుడ నే నధికుడ విన్నిటా నీవు ॥
చ॥ దండమువెట్టుట నాది తప్పు లోగొనుట నీది। నిండి నీవెపుడు దయానిధివి గాన।
అండబేరుకొంట నాది అందుకు నూకొంట నీది। దండియైన దేవదేవోత్తముడవు గాన ॥
చ॥ శరణుజొచ్చుట నాది సరుగ గాచుట నీది। పరమపురుష శ్రీపతివి నీవు।
విరులు చల్లుట నాది వేవేలిచ్చుట నీది। పొరి నీవు భక్తసులభుడ వటుగాన ॥
చ॥ దాసుడననుట నాది తప్పక యేలుట నీది। ఆసదీర్చేవరదుడ వటుగాన।
నీసేవ యొక్కటి నాది నిచ్చలు గైకొంట నీది। యీసులేనిశ్రీవేంకటేశుడవుగాన ॥

450) బౌళి

ప॥ ఎట్లైనా గావకపోదు యే నెంత సేసినాను। యిట్టే నీకు శరణంటి నిదియే తెరగు ॥
చ॥ చేకొని మొక్కగాను చేతులు గోయగరాదు। ఆకడ దప్పుకుదగినాజ్ఞ మానరాదు।
కైకొని యపరాధాలే కావించితి నెన్నైనా। యీకడ నీశరణంటి నికనో తెరగు ॥
చ॥ చిక్కి దైన్యపడగాను చెలగి ఖండించరాదు। చక్కగా నాద్రోహాలు సైరించరాదు।
అక్కడ జూచిన శరణాగతబిరుదు నీకు। యిక్కడ నీశరణంటి నికనో తెరగు ॥
చ॥ సేవసేయచుండగాను జీతము మానుపరాదు। యీవిధి నాస దోపితే నిందుకోరాదు।
దేవుడ నిన్ను గొలిచి తెగి కర్మా లుడిగితి। యీవల శ్రీవేంకటేశ ఇకనో తెరగు ॥

451) గుండక్రియ

ప॥ కలుగుట గలిగిననాడే నే ఘనపాపములకు దొలంగినా।
యెలమి నే నిపుడే యెరిగితిని యిన్నాళ్ళీమతి లేదు ॥
చ॥ జనియించిననే నిట మునుపుసకలయోనిగతజన్మములు।
కనుగొని యనె నే సారెకు బలుమరు ఘనవర్ణాశ్రమధర్మములు।
అనుభవించిననే సకలార్థంబులు అయిహికవిషయము లన్నియును।
మనసున వాకున శ్రీహరి నొకని నే మఱచియు దలచుట లేదు ॥
చ॥ తిరిగిననే నే నాసలకొరకును దిక్కులన్నియును నేను।
యిరవుగ తొల్లియు నెఱిగిననే యీసంసారపుసుఖము లివి।
పొరలిననే నే గామినీజనులపొందులసుఖములభోగములు।
యెరపులదొకటే శ్రీహరిదాస్యం బిది గతియని యెరుగుటలేదు ॥
చ॥ గడియించిననే నే బూర్వకాలమున ఘనమగుసంపద లిన్నియును।
నొడిగిననే నే శబ్దజాలములు నోర గొలదులివి యిన్నియును।
తడబడి నే నిటు సకలలోపాయపుధర్మము లిన్నియు జూచితిని।
యెడపక శ్రీవేంకటేశ్వరు శరణ బిటువలె జేరుటలేదు ॥

452) గుండక్రియ

ప॥ ధరలో నెద్భావం తద్భవ తనెగాన। హరిమయమే జగమంతాను ॥
చ॥ మహి నెదిటివారందు మలినము దలచితే। తహతహ మనసే తా మలినము।
మహి నెదిటందు భావనము భావించిన। బహువిధముల దానూ భావనమే ॥

చ|| యెక్కడ నెదిటిపాపా లెంచి నిందించేటి | నిక్కపునాలుక తానే నిందితము |
వొక్కటై యెదుటిపుణ్యా లుగ్గడించి ఘన మంటే | దక్కినపుణ్యపుజిహ్వ తానూఘనమే ||
చ|| సారె శ్రీవేంకటపతి సగుణము దలచిన | సారపుజీవుడు దాను సుగుణమే |
నేరుపుల నాతనినిర్గుణము దలచిన | తారతమ్యములులేనితానూ నిర్గుణమే ||

453) భూపాళం
ప|| ఎందాక నిద్ర నీ కిదె తెల్లవారె గదె | యిందిరారమణ నీ విటు మేలుకొనవే ||
చ|| కమలనాభుడ నీకు గంగాదినదులెల్ల | నమర మొకమజ్జనం బాయితముసేసె |
తమితోడ గనకాద్రి తానే సింహాసనము | విమలమై యొప్పె నదే విచ్చేయవే ||
చ|| హరి నీకు నజుడు పంచాంగంబు వినిపించ | నిరతమగువాకిటను నిలిచినాడు |
సురలు నీయవసరము చూచుకొని కొలువునకు | సరవి నాఇత్తపడి సందడించేరు ||
చ|| కామధేనువు వచ్చె కనుగొనుటకై నీకు | శ్రీమహాదేవి నీచేలాగు కదివో |
యీమహిమ శ్రీవేంకటేశ నీకే చెల్లె | కామించి యన్నియును గైకొంటి విపుడు ||

454) సాళంగనాట/కాంభోజి
ప|| రామా రామభద్ర రవివంశ రాఘవ | యేమి యరుదిది నీ కింతటివానికిని ||
చ|| నాడు రావణుతలలు నఱికినలావరిని | నేడు నాపాపములు ఖండించరాదా |
వాడిప్రతాపముతోడ వారిధిగట్టినవాటి- | వాడ విట్టె నామనోవార్ధి గట్టరాదా ||
చ|| తనిసి కుంభకర్ణాదిదైత్యుల గెలిచితివి | కినిసి నాయింద్రియాల గెలువరాదా |
యెనసి హరునివిల్లు యెక్కువెట్టి వంచితివి | ఘనము నాదుర్గుణము కడు వంచరాదా ||
చ|| సరుస విభీషణుడు శరణంటే గాచితివి | గరిమ నే శరణంటి గావరాదా |
తొరలి శ్రీవేంకటేశ దొడ్డు గొంచె మెంచనేల | యిరవై లోకహితాన కేదైనా నేమి ||

455) లలిత
ప|| అని యానతిచ్చె గృష్ణు డర్జునితో | విని యాతని భజించు వివేకమా ||
చ|| భూమిలోను చొచ్చి సర్వభూతప్రాణులనెల్ల | దీమసాననే మోచేటిదేవుడ నేను |
గామించి సస్యములు గలిగించి చంద్రుడనై | తేమల బండించేటిదేవుడ నేను ||
చ|| దీపనాగ్ని నై జీవదేహముల యన్నములు | తీపుల నరగించేటిదేవుడ నేను |
యేపున నిందరిలోనిహృదయములోన నుందు | దీపింతు దలపుమరపై దేవుడ నేను ||
చ|| వేదములన్నిటిచేతా వేదాంతవేత్తలచేతా | ఆది నే నెరగదగినయాదేవుడను |
శ్రీదేవితో గూడి శ్రీవేంకటాద్రిమీద | పాదైనదేవుడను భావించ నేను ||

456) గుండక్రియ
ప|| తలపులో కొట్టగొన దైవమే వున్నాడు | తలచినరూపులెల్లా తా నయ్యీనయ్యా ||
చ|| కలలో ప్రపంచము కంటి నే నొకటి | వెలినున్న ప్రపంచవిధివలెనే |
కలనున్నవాడ నేనే వెలి నున్నవాడ నేనే | తెలియ మాబతుకు రెంట దెప్పరములయ్యా ||
చ|| దేహమీడ నుండగానే దిక్కులకేగీ మనసు | దేహముతో దిక్కులెల్లా దిరిగినట్టే |
దేహములోవాడ నేనే దేహముపైవాడ నేనే | వోహో మాజన్మములో నొకటి రెండయ్యా ||
చ|| కన్నులెదుట శ్రీవేంకటపతి గొలిచెద | కన్నుమూసి యాతనినే కమ్మర భావించెదను |
కన్నులలోపల నేనే కన్నుల వెలిని నేనే | వున్నతి నీరెండును వొక్కటాయనయ్యా ||

457) శ్రీ
ప|| చాలు నిదే నావిరతి సకలసామ్రాజ్యము | నాలోనిపని యెంతైనా నాకు గలదు ||
చ|| వడబడి పరుడిండ్లవాకిలి గాచే నేను | వడి నాలో హరియున్న వాకిలి గాచేను |
బడి నొకరి గొలిచి బహురాజ్యమేలేనేను | యెడ నామనోరాజ్యమింతా నేలేను ||
చ|| చేరి యొరులకు బనిసేసి యలసేనేను | సారె నాయోగాభ్యాసాన నలసేను |
అరసి నే నడుగగ నన్యులిచ్చేయీపులు | తారి పూర్వకర్మాదిదైవమే యిచ్చీని ||

చ॥ అందు సంతోషమే ఫల మిందు సంతోషమే ఫల-।మందును మాయాకల్పిత మిందును మాయే।
అందు నిందు శ్రీవేంకటాధీశుడే కర్త।అంద్లైతే బరతంత్రు డిందు నే స్వతంత్రుడ॥

458) సామంతం

ప॥ నీసొమ్ము చెడకుండ నీవు చూచుకొనవయ్య।దాసుడ నే నింతే దైవమవు నీవు॥
చ॥ లోకము లేలుదువట లోకములోపలినేను।పైకొని నీ వేలినట్టిబంటనేసుమ్మీ।
ఆకడ నావు గొంటే నావు వెంట దూడయును।జోకల గొన్నట్టివారిసొమ్మే కాదా॥
చ॥ చేరి నన్ను నీవే పుట్టించితివట నే జేసే-।మేరతో బుణ్యపాపాలు మీవేసుమ్మీ।
ఆరుగ వితిృనవాడు ఆరుగలోపలికంది।ఆరితేరి పండితేను ఆతనిదేకాదా॥
చ॥ శ్రీవేంకటేశ నీవు జీవాంతరాత్మవట।కావించి నాపాల గలవేసుమ్మీ।
కైవసమై చందురుడు కలువలజాతికెల్ల।భావింప సర్వవిధబంధువేకాడా॥

459) బౌళిరామక్రియ/కేదారగౌళ

ప॥ అన్నిటికి హరి యంతర్యామి మూలము।విన్నకన్నగతులెల్ల వృథా మూలము॥
చ॥ లాలితవైరాగ్యమూలము మోక్షము।ఆలరిసంసారమూల మతిబంధము।
మేలిమిశాంతమూలమే సుఖము।వీలి క్రోధమూలమే వెడదుఃఖము॥
చ॥ కై కొనుభవములే కర్మమూలము।శ్రీకాంతునిపై భక్తి చిన్మూలము।
పైకొన్న ధ్యానమెల్ల భావమూలము।దీకొని లంపటములు దేహమూలము॥
చ॥ అరుదై సుజ్ఞాన మాచార్యుమూలము।ధరణి జగత్తెల్లా ధనమూలము।
పరము శ్రీవేంకటపతిమూలము।హరి నా కితనిశరణాగత మూలము॥

460) దేవగాంధారి

ప॥ వానికి ముదుల యిచ్చి వద్దని మానుపవే।శ్రీనారాయణ వీనిచేత నే వేసరితి॥
చ॥ నీకల్పితములే యీనిఖిలేంద్రియములు।యీకడ నీయింద్రియాల నెట్టు గెలువగవచ్చు।
నీకడ నిన్నే కొలిచి నీయప్పణ దెచ్చి వాని।బైకొని చోపుటగాక బలిమా రాచాజ్ఞతో॥
చ॥ నీపంపునగప్పిననిజమైనమాయ యిది।మాపాటివారెల్లా మహి నెట్టు దాటవచ్చు।
మీపాదాలే కొల్చి మీయనుజ్ఞ గొని దాని।పైపై దోయుటగాక బలిమా రాచాజ్ఞతో॥
చ॥ శ్రీవేంకటేశ నీచిక్కులే యీపుట్టుగలు।నీవు సేసేచేతలకు నే నెట్టు దొలగవచ్చు।
నీవొద్ద శరణంటే నీయానతినే వాని।భావించి తోసితిగాక బలిమా రాచాజ్ఞతో॥

461) గుండక్రియ

ప॥ నీవే సేసినచేత నీవే చేకొనకుంటింతే।యీవల నీసొమ్ము నీకే ఇయ్య సిగ్గయ్యీనయ్యా॥
చ॥ ఆలు బిడ్డల గని యటు దనమగనికి।సీలాన సమర్పణ సేయవలెనటనయ్యా।
తాలిమి బుణ్యాలు సేసి దైవమా నే నీకు।యేలీల బుణ్యాలు సేసి దైవమా నే నీకు॥
చ॥ అంకెల గన్నకొడు కటు దమతండ్రికిని।తెంకి నే నీవాడ నని తెలుపగవలెనటనయ్యా।
లంకె నాలోపలనున్న లక్ష్మీశ నే నీకు।పొంకపు నీ బంట నన్న బునరుక్తయ్యీ నయ్యా॥
చ॥ తననీడ యుద్ధములో దానే యటు చూచి।సనివడి వూరకే భ్రమయవలెనటయ్యా।
అనుగుశ్రీవేంకటేశ ఆతుమలోనున్న నిన్ను।గని మని శరణంటి గడ బూజించనేలనయ్యా॥

462) బౌళి

ప॥ అనలము సూర్యుడు నన్నిటందు వెలసినా।ఘనపవిత్రమైనట్టు ఘనుడే పోజ్ఞాని॥
చ॥ కాంచనము అంటువడిన గలదా అందు నింద్యము।పెంచు ముట్టంటువడిన బెక్కువదూష్యముగాక।
అంచల సుజ్ఞాని బాపమంటునా తా జేసినాను।పంచల నజ్ఞాని నైతే బైకొనీగాక॥
చ॥ యెఱుకగల నాలిక నింతైనా జిడ్డంటునా।యెఱుకలేనిచేత నింతా జిడ్డంటుగాక।
కఱతలయోగిని కర్మములివంటునా।చుఱచుఱ జడునైతే జుట్టుకొనుగాక॥
చ॥ తామెరపాకుల నీరు తగ నందు నంటునా।ఆమేర నెంద్దైనాను నంటుగాక।
యీమేర శ్రీవేంకటేశునిదాసుడు భూమి।గామించి తా నుండినాను గడు మాయలంటునా॥

463) సామంతం/తోడి
ప॥ రాచాజ్ఞ మరలించ రాజే కర్తగాన। యేచి నీకు శరణంటి నిది మానుపవే॥
చ॥ కడు సహకరించినను తొల్లి ఘనుడు నారదమౌని।
బెడిదపుటింతి జేసి నీమాయ ఆతని బిడ్డల గనిపెంచెను।
అదరి నే ననగా నెంతటివాడను అది నే గడపగలనా।
తడవి నే శరణంటి దనుజారి ఆమాయ దగ్గరకుండగజేయవే॥
చ॥ మహి మిమ్ము మోచేనని మున్ను మదించినగరుడనిని।
సహజపునీహస్తము మోయకుండగ శక్తి హరించె నీమాయ।
బహుముఖముల, నే నెంతటివాడను పాయగ నీమాయ।
అహిశయనుడ నే శరణంటిని అది నన్ను దగ్గరకుండజేయవే॥
చ॥ సారపుశ్రీవేంకటేశ స్వతంత్రుడవు నీవు।
గారవపుమాయ నీదే కమ్మి నే నీవాడనే।
మారుదైవములు లేరు మరి నన్ను గావ నిన్ను।
బేరుకొని శరణంటి బెడబాపు మాయ॥
464) మాళవిగౌళ
ప॥ ఎందుకు విచ్చేయనేల ఇన్నియు నాలోనివే। అంది యివే చేకొనవే ఆరడి నీకేల॥
చ॥ కాముకుడవై గోపికల బొంద బ్రియమైతే। కాముకత్వము నాయందు గలదెంతైనా।
గోమున కంసాదులపై క్రోధమే ప్రియమైతే। నాముల క్రోధ మిదివో నాలో నున్నది॥
చ॥ లోకులచీర లీకుండేలోభమే ప్రియమైతే। యీకడ లోభము నాలో హెచ్చినదిదే।
మాకులు ముద్దులు దొబ్బేమదమే ప్రియమైతే। చేకొను మదము నాలో సేనాసేన॥
చ॥ మఱి శిశుపాలునిపై మచ్చరమే ప్రియమైతే। మెఱయుమత్సర మిదే మించి నాలో।
తఱి శ్రీవేంకటపతి దాసులపై మోహము। నెఱి నీకు బ్రియమైతే నేనేకానా॥
465) ధన్యాసి
ప॥ అటుగాన మోసపోక హరి నీకే అన్నియును। ఘటియించుటే యెక్కుడు గమలారమణ॥
చ॥ నిన్ను జూడనికన్నులు నీచువలకన్నులు। చిన్ని నీకథవిననిచెవులు రాట్నపుజెవులు।
వున్నతి నీకడకు రాకున్నకాళ్ళు మరగాళ్ళు। సన్నుతిసేయనిజిహ్వ సరి నుపజిహ్వ॥
చ॥ చేరి నిన్ను బూజించనిచేయి దంతెనపుజేయి। తారి నీకు మొక్కనట్టితలయే పెడతల।
సారె నీముద్రలేనిభుజములు బుద్బుజములు। తేరి నీదాస్యములేనిదేహము సందేహము॥
చ॥ వనమాలలున్నగ్రీవము కంబుగ్రీవము। ఘనమిది దెలియుటే కైవల్యము।
యెనయు శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి। అనుమానమెల్ల బాసె నన్నిటా నాకును॥
466) సామంతం
ప॥ అందుకు గాదు నే గెల్చు టామీదిపని కింతే। ఇందు నందు నీవే కర్త విందిరారమణ॥
చ॥ ఇంచుకంత వేల గొండ యెత్తినదేవుడవు। ముంచి నాసంసారభారము మోవలేదా।
అంచల దేవతలకు నమృతమిచ్చిననీవు। కంచాన నన్నముపెట్టి కాచుట నన్నెంత॥
చ॥ వడి ద్రౌపది కక్షయవలువలిచ్చిననీవు। బెడగునాకు గట్టనిచ్చి పెంచుటెంత।
జడిసి యింద్రాదులకు సంపదిచ్చినట్టినీవు। కడు నీకు నైహికభోగము లిచ్చుటెంత॥
చ॥ పొసగ లోకములెల్ల బూర్ణుడవైననివు। వుసురై నాలోనే నీవుండుటెంత।
వసుధ శ్రీవేంకటేశ వరములిచ్చేనీకు। దెస నాకోరికెలెల్లా దీర్చుటెంత॥
467) పాడి
ప॥ అట్టయితే నాయంతర్యామివేలైతివయ్యా। మట్టుమీఱి ముక్తియాస మాననటవయ్యా॥
చ॥ పొలతులు లేరా భుమి భోగించ నే లేనా। కలకాల మింద్రియాలకాణాచి లేదా।
తొలి యీసంసారము లేదో నాకాంక్షలు లేవో। యెలమి నిన్ను గొలుచు టిందుకటవయ్యా॥

చ|| ధరలో బసిడి లేదా తగిలి నాయాస లేదా। సిరులయజ్ఞానపుచీకటి లేదా।
అరయ జవులు లేవా అందుకో నాలికె లేదా। యిర్వై నిన్ను గొలుచు టిందుకటవయ్యా ॥
చ|| అట్టే సర్వాపరాధి నపరాధా లెంచనేల। గట్టిరాళ్ళలో మలిగండ్లేరనేల।
నెట్టన శ్రీవేంకటేశ నిన్ను జూచి కావకుంటే। ఇట్టే నిన్ను గొలుచు టిందుకటవయ్యా ॥

468) బౌళి
ప|| మరిగితి నేమి సేతు మగిడి నే నెందు వోదు। సరుస దైవమ నీకే శరణుచొచ్చేను ॥
చ|| తల్లి గోపించి మొత్తిన దనయుడు తల్లికొంగే। యెల్లగా బట్టి పెనగి యేడిచినట్టు।
వెల్లవిరై హరి నీవు విషయాల జిక్కించితే। ఇల్లిదే నిన్ను దలచి ఇటు దూరే నేను ॥
చ|| కన్నతండ్రి బాలుని జంకబెట్టి దించితేను। కొన్నేసి విలుచు ముద్దుగునిసినట్టు।
వున్నతి నాలోనుండి వూరకే మాయనాపై। బన్నితే నిన్నే సొలసి పగటులాడేను ॥
చ|| దైవము దాతవు నీవే తల్లివి దండ్రివి నీవే। భావించి చేపట్టితే నీ బంట నే నింతే।
శ్రీవేంకటేశ నీవు చేకొని రక్షించగాను। జీవుడనయిననేను చెలగి మొక్కేను ॥

469) లలిత
ప|| ఎట్టు వలసిన జేయు మిన్నియు నీచిత్తమె। నెట్టనె నొకడనా నీవే యింతాను ॥
చ|| వేవేలు నీకు విన్నవించేదేమి తొల్లే। సావధానముగ సర్వసాక్షివి నీవు।
ఆవల నా కిటుసేయమ్మైని చెప్పేదేమి నేను। దైవికమైనట్టిస్వతంత్రుడవు నీవు ॥
చ|| తగిలి నిన్ను ధ్యానించేదేమి తొల్లె। జగతి నీవు పూర్ణచైతన్యుడవు।
జిగి నీనామము నోర జిక్కించి నుడిగేదేమి। మగుడి శబ్దాక్షరమంత్రరూపుడవు ॥
చ|| చేవమీర సిరుల బూజించేదేమి నిన్ను। శ్రీవేంకటేశ నీవు శ్రీపతివి।
దేవదేవ నిన్ను నీవే తేకువెల్లా నెంచుకొని। కావుము నీ వొక్కడవే కరుణానిధివి ॥

470) లలిత/ద్విజావంతి
ప|| కలిగె నిదె నాకు కైవల్యము। తొలుత నెవ్వరికి దొరకనిది ॥
చ|| జయ పురుషోత్తమ జయ పీతాంబర। జయ జయ కరుణాజలనిధి।
దయ యెఱుంగ నే ధర్మము నెఱగ నా-। క్రియ యిది నీదివ్యకీర్తనమే ॥
చ|| శరణము గోవింద శరణము కేశవ। శరణు శరణు శ్రీ జనార్దన।
పరమ మెఱంగను భక్తి యెఱంగను। నిరతము నాగతి నీధ్యానమే ॥
చ|| నమో నారాయణ నమో లక్ష్మీపతి। నమో పుండరీకనయనా।
అమిత శ్రీవేంకటాధిప యిదె నా। క్రమమెల్లను నీకయింకర్యమే ॥

471) బౌళి
ప|| ఈతనిమూలమేదో యిలగలధనములు। యీతడు మాకు గలడు యెంత లేదు ధనము ॥
చ|| విరతి మాధనము విజ్ఞానమే ధనము। మరిగినతత్త్వమే మాధనము।
పరము మాధనము, భక్తే మాధనము మా-। కరిరాజవరదుడే కైవల్యధనము ॥
చ|| శాంతమే మాధనము సంకీర్తనే ధనము। యెంతైనా నిశ్చింతయే ఇహధనము।
అంతరాత్మే మాధనము హరిధ్యానమే ధనము। ఇంతట లక్ష్మీకాంతు డింటిమూలధనము ॥
చ|| ఆనందమే ధనము ఆచార్యుడే ధనము। నానాట బరిపూర్ణమే ధనము।
ధ్యానమే మాధనము దయే మాధనము। పావన శ్రీవేంకటాద్రిపతియే మాధనము ॥

472) భవుళి/వరాళి
ప|| నీమాయ కల్లగాదు నిజము దెలియరాదు। కామించి హరి నీ వొక్కడవే నిజము ॥
చ|| వచ్చేటి దొకమాయ సరి బుట్టేదొకమాయ। మచ్చుమేపులసిరులు మాయలో మాయ।
వచ్చేటి దొకమాయ వచ్చిపొయ్యే దొకమాయ। కచ్చుపెట్టి హరి నీ వొక్కడివే నిజము ॥
చ|| పొద్దువొడచేది మాయ పొద్దుగుంకే దొకమాయ। నిదురయు మేల్కనేది నిండుమాయ।
వొద్దనే సుఖము మాయ వొగి దుఃఖ మొకమాయ। గద్దరి శ్రీహరి నీ వొక్కడవే నిజము ॥

చ॥ కూడేటి దొకమాయ కూడి పాసే దొకమాయ । యేడ నేర్చితి శ్రీవేంకటేశుడ నీవు ।
వేడుక నీశరణంటి విడిపించు మీమాయ । వోడక వెదకితి నీ వొక్కడవే నిజము ॥

473) సాళంగనాట

ప॥ ఇహమెట్టో పరమెట్టో ఇక నాకు । సహజమై హరియే శరణము నాకు ॥
చ॥ చిత్తమిది యొకటే చింత వేవేలసంఖ్య । పొత్తుల హరిదలచ బొద్దులేదు ।
జొత్తుల కన్నులు రెండు చూపులైతే ననంతాలు । తత్తరించి హరిరూపు దగ్గరి చూడలేదు ॥
చ॥ చేతు లివియు రెండే చేష్టలు లక్షోపలక్ష । యీతల హరిబూజించ నిచ్చ లేదు ।
జాతి నాలిక వొకటే చవులు కోటానుగోటి । రీతి హరినామ ముచ్చరించ వేళ లేదు ॥
చ॥ వీను లివి రెండే వినికి కొలదిలేదు । పూని హరిభక్తి విన బుద్ధి లేదు ।
యీనటన శ్రీవేంకటేశు డిటు చూచినను । తానే యేలె నిక దడబాటు లేదు ॥

474) రామక్రియ

ప॥ వినవమ్మ జానకి నీవిభు డింతసేసినాడు । యెనసి యీరఘురాము డిక నేమి సేసునో ॥
చ॥ వానరులదండు గూడి వారిధి కొండల గట్టి । ఆని లంక చుట్టిరా నదే విడిసె ।
కోనల ద్రికూటమెక్కె గొడగు లన్నియు జెక్కె । యేనెపాన రాఘురాము డిక నేమిసేసునో ॥
చ॥ కోరి ఇంద్రజిత్తు జంపె కుంభకర్ణు నిర్జించె । ఘొరదానవులనెల్ల కూలగుమ్మెను ।
మారణహోమము సేసె మతకమింతా జెరిచె । యీరసాన రఘురామ డిక నేమిసేసునో ॥
చ॥ లావున రావణు జంపె లంక విభీషణు కిచ్చె । చేవల నోసీత నిన్ను జేకొనెను ।
భావించి శ్రీవేంకటాద్రి బట్టము దా గట్టుకొనె । యీవలనావల నాత డిక నేమిసేసునో ॥

475) శ్రీ

ప॥ ఇంతటా హరినేకాని యెందునను గాన నన్ను । కొంత నాకు దెలుపరో గురువులాల ॥
చ॥ తనువూ హరియే తలపూ హరియే । వినికి మనికియును విష్ణుడే ।
కనుగొనుచూపులు కమలనాభుడే । యెనసి జీవునిశక్తి యేడనేడ నున్నదో ॥
చ॥ లోకమెల్ల మాధవుడే లోనెల్ల గేశవుడే । వాకును కర్మము శ్రీవైకుంఠుడే ।
చేకొని చైతన్యమెల్ల శ్రీనారాయణుడే । యీకడ నేననువాడ నేడ నుండువాడనో ॥
చ॥ వెనకను కృష్ణుడే వెస ముందచ్యుతుడే । కొనమొదలు నడుమ గోవిందుడే ।
యెనయగ శ్రీవేంకటేశుమయ మింతాను । అనుగునాస్వతంత్ర మది యేడనున్నదో ॥

476) బౌళి

ప॥ ఎఱుగుటకంటే నెఱగమే మేలు । మఱి తెలివికంటే మఱపే శుభము ॥
చ॥ లంపటా లెఱుగము లవలవ లెఱగము । పంపులబాల్యమే పరిణామము ।
యింపులు నెఱుగము యెగ్గులు నెఱగము । జంపులనిదురే సకలసౌఖ్యము ॥
చ॥ ఆస లివెఱుగము అలమట లెఱుగము । మూసినగర్భమే ముని సుఖము ।
వాసులునెఱగము వంతులు నెఱగము । వేసట పుట్టనివిధమే సుఖము ॥
చ॥ పాపము లెఱగము బంధము లెఱగము । శ్రీపతిదాస్యమే శేఖరము ।
యేపున శ్రీవేంకటేశ్వరుశరణమే । తీపులుమఱపేటిదివ్యానందము ॥

477) శంకరాభరణం

ప॥ హరియు నొక్కడే గురి ఆత్మలో నొక్కటే గురి । విరివి నెంత చదివినా వేరు గాబొయ్యీనా ॥
చ॥ అందరిచూపులు నొక్కటైనందుకు గురి । యెందూ గొండ కొండేకాక యితరముగా జూచెనా ।
అందరిరుచులు నొక్క టైనందుకు గురి । చెంది తీపు తీపే కాక చేదుగా జేకొనేరా ॥
చ॥ వొప్పుగా నందరివూర్పు లొక్కటైనందుకు గురి । కప్పుర మదేకాక కస్తూరిగా మూకొనేరా ।
యెప్పుడూ నిందరివివి కేకమైనందుకు గురి । తిప్పి తిట్టు తిట్టేకాక దీవెనగా వినేరా ॥
చ॥ యీరీతి నిందరిచిత్త మేకమైనందుకు గురి । మేరతో సూర్యోదయము మించి రేతి రయ్యీనా ।
తేరి శ్రీవేంకటపతి దేవుడైనందుకు గురి । కోరినవారివరాలే కొంగుపైడిగాదా ॥

478) బౌళి
ప॥ నిరుహేతుకాన నన్ను నీవు రక్షించే వింతే। నిరతి నాకొరకే పో నిను సేవించేది ॥
చ॥ ముందు సిరులిత్తువని మోక్షము నీ విత్తువని। బందుకట్టుదుదుఃఖముల బాపుదువని।
యిందలియాసలనేపో యేచిన నాభయభక్తి। యెందును నావల్ల నీకు నించుకంతా లేదు ॥
చ॥ జననాలు చూచి చూచి సరి మరణాలు చూచి। వెనకటికథలు వినివిని।
నినుపై యీయాసనేపో నిన్ను సారె బొగడేది। వొనర నీయాసేపో వుపకారగురువు ॥
చ॥ లోకులు గొలువగాను లోన నీవుండగాను। దీకొని గురుడు బోధించగాను।
కైకొని శ్రీవేంకటేశ కరుణించగా నీవు। దాకొని యీయాసకే నీదాసినై కొలిచితి ॥
479) సాళంగం/ఖరహరప్రియ
ప॥ నానాభక్తు లివి నరులమార్గములు। యేనెపానైనా నాతడియ్యకొను భక్తి ॥
చ॥ హరికిగా వాదించు టది ఉన్మాదభక్తి। పరుల గొలువకుంటే పతివ్రతాభక్తి।
అరసి యాత్మ గనుటదియే విజ్ఞానభక్తి। అరమరచి చొక్కుటే ఆనందభక్తి ॥
చ॥ అతిసాహసాలపూజ అది రాక్షసభక్తి। అతనిదాసులసేవే అదియే తురీయభక్తి।
క్షితి నొకపని గోరి చేసుటే తామసభక్తి। ఆతడే గతని వుండుటది వైరాగ్యభక్తి ॥
చ॥ అట్టె స్వతంత్రుడౌటే అది రాజసభక్తి। నెట్టన శరణనుటే నిర్మలభక్తి।
గట్టిగా శ్రీవేంకటేశుకైంకర్యమే సేసి। తట్టుముట్టులేనిదే తగ నిజభక్తి ॥
480) సాళంగనాట/దేశి
ప॥ కంటిరా వింటిరా కమలనాభునిశక్తి। వొంటి నితనిశరణ మొకటే వుపాయము ॥
చ॥ యీతనినాభి బొడమె యెక్కువైనబ్రహ్మయు। యీతడే రక్షించినాడు యింద్రాదుల।
యీత డాకుమీద దేలె నేకార్ణవమునాడు। యీతడే పో హరి మనకిందరికి దైవము ॥
చ॥ యీతడే యసురబాధ లిన్నియు బరిహరించె। నీతనిమూడడుగులే యీలోకాలు।
యీతడే మూలమంటే నేతెంచి కరి గాచె। నీతనికంటే వేల్పులిక మరి కలరా ॥
చ॥ యీతడే వైకుంఠనాథు డితడే రమానాథు-। డితడే వేదోక్తదైవ మిన్నిటా దానె।
యీతడే అంతర్యామి యీ చరాచరములకు। నీతడే శ్రీవేంకటేశు డిహపరధనము ॥
481) శంకరాభరణం
ప॥ పట్టలేనిభ్రమ గాక। నెట్టన దా గరుణించనివాడా ॥
చ॥ హితప్రవర్తకు డీశ్వరుడు । తతి నంతరాత్మ తాగాన।
రతి నాతని దూరగనేలా। గతియని తలచిన కావనివాడా ॥
చ॥ తెగనిబంధువుడు దేవుడు। బగివాయ డిహము బరమునను।
అగపడి సందేహములేలా। తగ నమ్మిన దయదలచనివాడా ॥
చ॥ హృదయము శ్రీవేంకటేశ్వరుడు। మొదలనే ఆనందమూర్తిగన।
కదిసి వెలిని వెదకగనేలా। యెదుర గనిన వరమియ్యనివాడా ॥
482) గుండక్రియ
ప॥ తానే తెలియుగాక తలచగ నెట్టువచ్చు। నానాగతుల తననాటకపుమాయ ॥
చ॥ అట్టె యేబదియైనయక్షరాలలోనట। తిట్టులట నొకకొన్ని దీవెనలట।
మట్టుతో వేదములట మంత్రములట కొన్ని। యిట్టివి చిక్కులు భూమి నికనెన్ని గలవో ॥
చ॥ కదిసిన యఋవదిగడియలలోనట। పొదలు నడకలట భోగములటా।
నిదురట వొకకొంత నేరుపులు కొన్నియట। యెదుట చూడగ జూడ నిక నెన్ని గలవో ॥
చ॥ రేవగలు కన్నులివి రెంటిలోనేయట। దైవము జీవులలోనే తానకమట।
శ్రీవేంకటాద్రిమీద జెలగి యీ(గెనా) తడే యట। యేవంక నీచేతలు యిక నెన్ని గలవో ॥
483) దేసాళం/కాంభోజి
ప॥ ఇంతట బో కానవచ్చు నెక్కువ తక్కువలెల్ల। దొంతి ఇంద్రియాలకెల్ల దొలగి వుంటేను ॥

చ॥ మాటలాడవచ్చుగాని మనసులు పట్టరాదు । చాటునకెక్కినయట్టిసతుల గంటే ॥
కోటి చదువగవచ్చు కోపము నిలుపరాదు । జూటరై వొకడు దన్ను సోకనాడితేను ॥
చ॥ అందరి దూషించవచ్చు నాసలు మానగరాదు । కందువైనమించులబంగారు గంటే ।
అందాల మొక్కగవచ్చు హరిభక్తి సేయరాదు । పొందులసంసారపుభోగము గంటేను ॥
చ॥ మొదల బుట్టగవచ్చు మోక్షము బొందగరాదు । పొదిగి పుణ్యరాసులభోగము గంటే ।
యెదుట శ్రీవేంకటేశ ఇదివో నీశరణంటే । కదిసితి నిట్టే పో నీకరుణ గంటేను ॥

484) మలహరి

ప॥ మగడు విడిచినా మామ విడువనియట్టు । నెగడిన నేమిసేయు నేనే రోయగాని ॥
చ॥ నరకము నను రోసి నరలోకాన విడిచె । నిరయముతోన రోసి నేనే విడువగాని ।
పరగి యోనులు రోసి బట్టబాయిట వేసె । సొరిది యోనుల రోసి చొరక నే మానగాని ॥
చ॥ పాపము రోసి నన్ను ప్రపంచాన విడిచె । పాపము సేయక రోసి పట్టకుండగాని నేను ।
యేపున దేహము రోసి యింద్రలోకాన విడిచె । కైపుసేసి రోయక నే గాయము మోచితిగాని ॥
చ॥ మాయలెల్ల నన్ను రోసి మనసులోన విడిచె । మాయల నేవిడువక మగుడ దగిలేగాని ।
నాయాల నేమి విడిచినాను శ్రీవేంకటేశ । పాయక నన్నేలితి నీభాగ్యము విడువగాని ॥

485) ధన్యాసి

ప॥ ఒక్కమనసున నేనుండేగాక । యెక్కడిపనులు దానే యెఱుగడా ॥
చ॥ బలుదేహ మిచ్చువాడు ప్రాణము వోసినవాడు । తలపొసగినవాడు దైవమేకాడా ।
వెలుపలిలంపటాలు వేవేలు గడించి తాను । మలసి ఇంతలో నన్ను మఱచీనా ॥
చ॥ జగము లేలేటివాడు సంసారి జేసినవాడు । తగులై యుండినవాడు తానేకాడా ।
బెగడకుండ దినాలు పెరుగజేసేటివాడు । తగినట్టు నడపించ దా నేరడా ॥
చ॥ మొదలై యుండేటివాడు ముందర దుదయ్యేవాడు । యెదలోవాడు శ్రీవేంకటేశుడేకాడ ।
చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాడు । పొదిగి నాదాపుదండై భోగించడా ॥

486) సాళంగనాట/భైరవి

ప॥ దేవతలు గెలువరో తెగి దైత్యులు పారరో । భావించ నింతటిలో భూభారమెల్ల నణగె ॥
చ॥ నేడు గృష్ణుడు జనించె శ్రీజయంతి । నేడే రేపల్లెలోన నెలవైనాడు ।
వేడుక యశోదకు బిడ్డడైనా డిదె నేడే । పోడిమి జాతకర్మ మొప్పుగ నాయ నేడు ॥
చ॥ ఇప్పుడిదె గోవుల నిచ్చెను పుత్రోత్సవము । ఇప్పుడు తొట్టెల నిడి రింతులెల్లాను ।
చెప్పరాని లలీల సేయగలదెల్లా జేసి । కప్పెను విష్ణుమాయలు గక్కన నేడిపుడు ॥
చ॥ ఇదివో వసుదేవునిఇంటిచెరలెల్ల బాసె । ఇదివో దేవకితప మిట్టే ఫలించె ।
చెదరక తా నిలిచె శ్రీవేంకటాద్రిపై నిదె । యెద నలమేలుమంగ యెక్కివున్న దిదివో ॥

487) బౌళి

ప॥ హితవే సేసుగా కాతడేల మానును । మితి నాతని దూరక మెచ్చవలెగాక ॥
చ॥ ఆగమభోగములకు హరి నాలో నున్నవాడు । చేగదీర నాకు మేలే చింతించుగాక ।
సాగినప్రపంచములో సంసారి జేసినవాడు । యేగతి రక్షించ దానే ఇన్నిటి కౌగాక ॥
చ॥ భూమిమీద దేహమిచ్చి పుట్టించినట్టివాడు । ప్రేమతో నన్నపానాలు పెట్టుగాక ।
ఆమని పంచేంద్రియాల నటు పెడరేచేవాడు । నేమపుబుత్రదారలై నిండుకుండుగాక ॥
చ॥ ఇహపరములకు దా నిరవైనట్టివాడు । సహజాన నన్ని యును జరపుగాక ।
వహి శ్రీవేంకటాద్రిపై వరములిచ్చేటివాడు । మహిమతో మమ్మునేలి మన్నించుగాక ॥

488) కన్నడగౌళ

ప॥ ఎవ్వరి నేమనగల నెంతబలువుడ నేను । నవ్వుచు నీవే యిక నన్ను మన్నించవయ్యా ॥
చ॥ కామక్రోధములకు కాణాచికాపను । ఆమనియింద్రియముల కడిబంటను ।
దీమసపుటాసలకు తీరని లగ్గస్థుడను । యీ మరుగువాడ నిన్ను నెట్టు గొలిచేనయ్యా ॥

చ|| పాయనిసంసారానకు బడివనివాడను। కాయపుభోగాల వూడిగపువాడను।
పాయపుమదములకు పంగెమైనవాడను। యీయెడ నీవాడ నని యెట్టు గొలిచేనయ్యా॥
చ|| సరి గర్మములకెల్ల చనవరిబొడుకను। పొరలేజన్మములయప్పులవాడను।
అరయ శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి। యిరవై ఇట్టుండకున్న నెట్టు గొలిచేనయ్యా॥

489) దేసాక్షి/తోడి
ప|| ఎఱుగువా రెరుగుదు రీయర్థము। యెఱుగనివారి కిది యెఱుగనియ్యదు॥
చ|| మొదల గలుగువాడే ముందరను గలవాడు। అదన నాతడే పరమాత్ముడు।
యెదుట గలిగినదె ఇన్నిటా గలిగినది। పదవడి యిదియే ప్రపంచము॥
చ|| చెడనిదానికి మరి చేటెన్నడును లేదు। జడిగొన్న దిదియే సుజ్ఞానమార్గము।
వుడివోగల దెన్నడు వుడివో గలిగినదీ। కడగడనే తిరుగు కర్మమార్గము॥
చ|| యెంచి తొల్లినడచేవే ఇపుడును నడచేవి। మంచి శ్రీవేంకటేశ్వరుమహిమ లివి।
అంచ నిపుడు గానని వల్లనాడు గాననివే। మంచువంటివిషయపుమాయావాదములు॥

490) లలిత
ప|| కేశవ దాసినైతి గెలిచితి నన్నిటాను। యీ శరీరపునేరా లికనేలా వెదక॥
చ|| నిచ్చలు గోరికలియ్య నీనామమే చాలు। తెచ్చి పునీతుజేయ నీతీర్థమే చాలు।
పచ్చిపాపా లణచ నీప్రసాదమే చాలు। యెచ్చుకొందువుపాయాలు ఇకనేల వెదక॥
చ|| ఘనుని జేయగను నీకైంకర్యమే చాలు। మొనసి రక్షించను నీముద్రలే చాలు।
మనిపి కావగ దిరుమణిలాంఛనమే చాలు। యెనసెను దిక్కుదెస ఇకనేల వెదక॥
చ|| నెలవైనసుఖమియ్య నీధ్యానమే చాలు। అలదాపుదండకు నీయర్చనే చాలు।
యిలపై శ్రీవేంకటేశ యిన్నిటా మాకు గలవు। యెలమి నితరములు యికనేల వెదక॥

491) దేసాళం/కేదారగౌళ
ప|| కైవల్యముకంటే కైంకర్య మెక్కుడు। శ్రీవిభుడ నీవు మాకు జిక్కే మర్మ మిదివో॥
చ| చేపట్టి నీశిరసు పూజించేఅహమికకంటే। నీపాదాలుపూజించేనేమ మెక్కుడు।
మాపుదాకా నినుగొల్చి మందెమేళమౌకంటే। దాపగునీదాసుల శేషత్వ మెక్కుడు॥
చ|| హరి నీప్రసాదజీవినై గర్వించుటకంటే। నరయ నీదాసులలెంకౌటెక్కుడు।
వెరపున నీచెవిలో విన్నపాలు సేయుకంటే। ధర నీవూడిగకాండ్ల దలపించు టెక్కుడు॥
చ|| జట్టి మిమ్ము ధ్యానించి సాయుజ్య మందుటకంటే। అట్టె నీనామఫలమందు టెక్కుడు।
ఇట్టె శ్రీవేంకటేశ యేలితి విందువంకనే। తిట్టపు మాగురునుపదేశ మెక్కుడు॥

492) శ్రీ
ప|| నావల్ల నీ కేమున్నది నారాయణ నీవు నన్ను। కావించి రక్షించేవుపకార మింతేకాక॥
చ|| సొమ్ము దినబుట్టినట్టిసోమరిబంటేలికకు। ఇమ్ముల సందుకు బ్రతి యేమిసేసీని।
చిమ్ముచు నాతడు నేమించినపనివాటలలో। వుమ్మడి జేసేటివట్టివూడిగాలేకాక॥
చ|| ఆసపడి వచినట్టిఅతిథి బలురాజుకు। రాసిసేసి యేమిచ్చిన రతికెక్కీని।
బేసబెల్లితనమున ప్రియాన నిచ్చకమాడి। మూసి దైన్యపుజేతులమొక్కు లింతేకాక॥
చ|| శరణాగతుడ నీకెచ్చట శ్రీవేంకటేశుడ। దొరనై యేమిట సరిదూగగలను।
ధరలోన నీవు దయదలచి నన్నేలుకోగా। పరగు నీమఱుగున బదుకుదుగాక॥

493) పాడి
ప|| ఇట్టి బ్రాహ్మణ్య మెక్కుడు యిన్నిటిలోన। దట్టమై తదియ్యులకె తగును బ్రాహ్మణ్యము॥
చ|| హరిగొలిచేవారి కమరు బ్రాహ్మణ్యము। పరమవైష్ణవమే పో బ్రాహ్మణ్యము।
హరిణోర్ధ్వపుండ్రదేహులౌటే బ్రాహ్మణ్యము। తిరుమంత్రవిధులదే తేకువ బ్రాహ్మణ్యము॥
చ|| సతమై చక్రాంకితులచరితే బ్రాహ్మణ్యము। పతిశరణాగతియే బ్రాహ్మణ్యము।
వెతలేని వీరలసాత్వికమే బ్రాహ్మణ్యము। తతి ద్వయాధికారులే తప్పరు బ్రాహ్మణ్యము॥

చ॥ అంచ బరమభాగవతాధీనము బ్రాహ్మణ్యము। పంచసంస్కారాదులదే బ్రాహ్మణ్యము।
యెంచగ శ్రీవేంకటేశు డితడే బ్రహ్మణ్యుడు। ముంచి యీతనివారౌటే మొదలిబ్రాహ్మణ్యము॥
494) మాళవిగౌళ/కురంజి
ప॥ వీధులవీధులనెల్లా విష్ణుడు సంచరించీని। పోది మాని కన్నగత్తై పొండు మేరసురలు॥
చ॥ తేరుమీద నెక్కి నేడు దేవోత్తముడు వాడె। సారమైన శంఖచక్ర శార్ఙ్గాయుధము లవే।
కారుకమ్మీ నాకాసాన గరుడధ్వజం బదే। పారరో దానవులాల పంతములు విడిచి॥
చ॥ దండవెట్టె నల్లవాడే దైవాలరాయడు। దండి నెట్టెపుజుట్లతపారపుచుంగు లవే।
కొండవంటిరథ మదె కొనపైడికుండలవే। గుండుగూలి విరుగరో గొబ్బున దైతేయులు॥
చ॥ విజయశంఖము వట్టె వీడె శ్రీవేంకటేశుడు। భజన నలమేల్మంగ పలుమారు మెచ్చీనదె।
త్రిజగాన నాతని జేరినదాసు లిదె వీరె। గజబెజ లిక నుడుగరో రాక్షసులు॥
495) మాళవిగౌళ/ఖమాసు
ప॥ నీచిత్త మిందరినేరుపునేరమి। తోచి కాచి యిటు తుద కీడేర్చె॥
చ॥ దేవతలపాలు తీరనిపుణ్యము। ఆవల బాపం బసురలది।
భావింప మనుజులపాలివి రెండును। శ్రీవల్లభ నీసేసినమాయ॥
చ॥ వేదశాస్త్రములు విజ్ఞానమూలము। ఆది నసత్యము లజ్ఞానమూలము।
సాధింప రెండును జగత్తుమూలము। భేదించి యివి నీపేరరేపణలు॥
చ॥ కావింప గర్మము కాయముచేతిది। భావముచేతిది పరమము।
తావుల రెండును దప్పనిప్రకృతివి। శ్రీవేంకటేశ్వర చేతలు నీవి॥
496) శంకరాభరణం
ప॥ ఎంత కెంత యిది యేమని పొగడుట। యింత సేయ నీకు నెదురా వీరు॥
చ॥ పిడుగులబోలెడిపెనునీనఖముల-।కెడయక హిరణ్యు డెట్లుండెనో।
వుడికెటిచక్రాయుధమువేడికిని। జడియక మకరెటు సహించెనో॥
చ॥ శరపరంపరల శిరములు నఱకగ। యెరగొని రావణుడేమనెనో।
పరియలువారగ బ్రహ్మాండభాండము। ఉరుశంఖరవం బోర్చుట యెట్లో॥
చ॥ గాటపునిష్ఠురగదాహతికి మధు-।కైటభులతలలకత లెట్లో।
యీటున శ్రీవేంకటేశ నీకృపను। పాటించి దాసులు బ్రదుకుట యెట్లో॥
497) దేవగాంధారి
ప॥ అడ్డము చెప్పగరాదు అవుగాదనగరాదు। వొడ్డిన దనుభవించే దోపిక జీవులది॥
చ॥ యీరికలెత్తి జన్మము లిన్ని జంతువులయందు। కోరికలు గొనసాగె గోటానగోటి।
నారుకొనె సంపదలు నానారూపములై। తీరదేమిటా నీచిక్కు దేవుడు వెట్టినది॥
చ॥ అల్లుకొని గర్మములు అక్కడికి నిక్కడికి। వెల్లవిరాయని మాయ వెనకా ముందు।
కెల్లురేగె దేహమందే కిమ్ములమట్టరికాలు। పొల్లువో దెన్నడు భూమి పుట్టగా బుట్టినది॥
చ॥ పండెను సంసారము ఫలమైననాటికి। నిండెను నాలికకు నెమ్మది జవులు।
అండనే శ్రీవేంకటేశు డంతర్యామై వుండి। పండ వండనట్లుగ వన్నెకెక్కించినది॥
498) దేవగాంధారి
ప॥ నీయంత నీవే యెరిగి నిచ్చ నన్ను గాతుగాక । మాయలలో బొరలేదిమ్మరివాడ నేను॥
చ॥ నీసరివాడనా నిన్ను దూరేవాడనా । దాసుడనై కొలిచిన తనుధారిని।
వేసరించ నోపుదునా వెరపించగలనా। మాసినపాపాలలోనిమైల సోకినాడను॥
చ॥ విన్నవించేవాడనా నీడుజోడువాడనా। అన్నిటా శరణుచొచ్చినట్టిజీవిని।
యెన్నిటి కుత్తరమిచ్చే యేపని సేసి మెప్పించే। మున్నిటికర్మములకు ముంగిట నున్నాడను॥
చ॥ యెదురాడేవాడనా యెలయించేవాడనా। సదరాన నీకు మొక్కేజంతువ నేను।
ఇదివో శ్రీవేంకటేశ యెరుక నీ వొసగగా। పొదిగి నీమహిమలు పొగడుచున్నాడను॥

499) సాళంగనాట/రీతిగౌళ
ప|| ఇచ్చినవాడు హరి పుచ్చుకొన్నవాడ నేను| చెచ్చెర దగవు లింక జెప్పగదరో ||
చ|| నిలిచినది జగము నిండినది భోగము| కలిగె జీవుల కొక్క కాణాచి |
వలయశాసనాలు వడి నాల్గువేదములు| చలపట్టి జాణలు చదువుకోరో ||
చ|| పారినవి మనసులు పట్టినది జననము| పోరు దీరె గర్మములపొలమేర |
కోరికలె సాక్షులు గుట్టలు త్రిగుణములు| వూరు బేరు దెలుసుక వొడబడరో ||
చ|| దక్కినది ధర్మము తప్పనిది భాగ్యము| లెక్కించ నుదుటివ్రాలె లిఖితములు |
యిక్కువ శ్రీవేంకటేశు డిన్నిటికి మూలము| చిక్కులు వాపె నితని సేవించరో ||

500) లలిత
ప|| చిరకాలధర్మములు చివుకు దవ్వగబోతే| హరిమఱగు చొచ్చితి మాతడే రక్షించెను ||
చ|| భువి దొల్లి లేరా పుణ్యముసేసినవారు| జవళిశాస్త్రములెల్లా జదివినవారు లేరా |
దివి కెక్కి దేవతలై తేరినవారు లేరా| యివల నే మివి సేసి యెవ్వరి బోలేము ||
చ|| తగ దొల్లి వినమా తపముసేసినవారి| జిగి నన్ని యజ్ఞములు సేసినవారి వినమా |
మిగులా సిద్ధివడసి మించినవారి వినమా| యెగువ నే మింతకంటే యెక్కుడు సేసేమా ||
చ|| పెక్కుమతములు చూచి బెండుపడ్డవారు లేరా| పక్కన నన్ని విద్యలా బరగినవారు లేరా |
వొక్కడే శ్రీవేంకటేశు డుల్లములో నుండగాను| యెక్కుడితని గొలువ కెవ్వరి బోలేము ||

501) సాళంగనాట/అఠాణ
ప|| నరుడా యీతడు ఆదినారాయణుడుగాక| ధరణి గీరితికెక్కె దశరథసుతుడు ||
చ|| యీతడా తాటకి జంపె నీమారీచసుబాహుల| నీతడా మదమణచె నిందరు జూడ |
యేతులకు హరివిల్లు యీతడా విరిచి యట్టె| సీత బెండ్లియాడెను యీచిన్నరాముడా ||
చ|| చుప్పనాతిముక్కు గోసి సోదించి దైత్యుల జంపి| అప్పు డిట్టె వాలి నేసినాత డీతడా |
గుప్పించి కోతుల నేలి కొండల జలధి గట్టి| కప్పి లంక సాధించె నీకౌసల్యనందనుడా ||
చ|| రావణాదులను జంపి రక్షించి విభీషణుని| భావించ యోధ్య నీతడు పట్టమేలెను |
శ్రీవేంకటేశు డితడే సృష్టి రక్షించె నితడే| యీవల మాపాలనున్న యీరామచంద్రుడా ||

502) పాడి
ప|| అదివో చూడరో అందరు మొక్కరో| గుదిగొనె బ్రహ్మము కోనేటిదరిని ||
చ|| రవిమండలమున రంజిల్లుతేజము| దివి జంద్రునితేజము |
భువి ననలంబున బొడమినతేజము| వివిధంబులైనవిశ్వతేజము ||
చ|| క్షీరాంబుధిలో జెలగుసాకారము| సారె వైకుంఠపుసాకారము |
యీరీతి యోగీంద్రులెంచుసాకారము| సారెకు జగములసాకారము ||
చ|| పొలసినయాగంబులలో ఫలమును| పలుతపములలో ఫలమును |
తలచినతలపుల దానఫలంబును| బలిమి శ్రీవేంకటపతియే ఫలము ||

503) రామక్రియ
ప|| ఆతనిబో పొగడేము ఆతని శరణంటిమి| ఆతడే సర్వజీవుల అంతర్యామి ||
చ|| పెక్కుబ్రహ్మాండకోట్లు పెక్కు బ్రహ్మకోట్లు| పెక్కురుద్రకోట్లును పెక్కుయింద్రులు |
వొక్కొక రోమకూపాల నొగి నించుకుండునటి| వొక్కడే విష్ణుడు వీడే వున్నతోన్నతుడు ||
చ|| అనంతసూర్యచంద్రులు అనంతవాయువులును| అనంతనక్షత్రము లనంతమేరువులు |
కొనలుసాగీ నన్నిటికూటువ గూడుకొన్నట్టి| అనంతు డొక్కడే మించీ నాదిమూరితి ||
చ|| అసంఖ్యమహిమలను అసంఖ్యమాయలు| అసంఖ్యశక్తులు వరా లసంఖ్యాలు |
పొసగ నిన్నిటి దానే పుట్టించి రక్షించినట్టి| అసంఖ్యాత్ముడు శ్రీవేంకటాద్రీశుడు ||

504) దేసాళం/కేదారగౌళ
ప|| నీవే రక్షింతువుగాక నిన్ను నమ్మితిమి నేము| దైవమవి నీ వుండగ తగ మాదె బ్రదుకు ||

చ॥ కోరి వొకరాతివీరు గొల్చి బతికి నొకడు।పైరు వొక్క చెట్టువెట్టి బతికేననీ నొకడు।
కూరిమి బాము చేపట్టుకొని బతికీ నొకడు।శ్రీరమణునిదాసులచేతిదేపో భాగ్యము॥
చ॥ ఇసుమంతమన్ను వట్టి యేచి బతికీ నొకడు।పసురము నింట గట్టి బతికేననీ నొకడు।
పసగా వేలె డినుము పట్టి బతికీ నొకడు।వసుధేశ నీవు గలవారి కేమిగడమ॥
చ॥ ఆకు నలము గసవు నంటి బతికీ నొకడు।లోకులు పెక్కు పాయాల లోలులై బతికే రదే।
యీకడ శ్రీవేంకటేశ ఇవెల్లా నీమహిమలే।చేకొని నీమరగుచొచ్చినవారే ఘనులు॥
505) సామంతం
ప॥ బయలుమొరంగగుపరమమాయ ఇది।నయమున లోనై నడతురుగాక॥
చ॥ కలడు హరి యొకడు కాన జగములకు।కలిగిననతడు లేక మానడు।
తెలిసి ఇందరికి దేరినయర్థమే।మలసి యప్పటి మరతురు గాని॥
చ॥ పుట్టినదెల్లా భోగముకొరకే।పుట్టినభోగము పో దెపుడు।
పట్టి యీమాటలే పలుకుదు రిందరు।మట్టులేక ఇది మరతురుగాని॥
చ॥ కర్మము శ్రీవేంకటపతికార్యము।కర్మము దేహికి గాణాచి।
ధర్మ మీదేవునిదాస్యం బందురు।మర్మము లోకులు మరతురుగాని॥
506) శ్రీ
ప॥ ఎఱిగితి నమ్మితి నితడు దయానిధి।మఱుగులు మొరగులు మరి యిక లేవు॥
చ॥ వేదోద్ధరణుడు విశ్వరక్షకుడు ।ఆదిమూర్తి శ్రీఅచ్యుతుడు।
సోదించి కొలిచితి సుముఖుడై మమ్మేలె।యేదెస మాపాల నితడే కలడు॥
చ॥ పరమపురుషు డాపన్నివారకుడు।హరి శాంతుడు నారాయణుడు।
శరణంటి మితడు చేకొని కాచెను।తరవాతిపనుల దప్ప డితడు॥
చ॥ హృదయాంతరంగుడు యీశ్వరేశ్వరుడు।యిదివో శ్రీవేంకటేశ్వరుడు।
వెదకితి మీతడు విడువడు మమ్మిక।తుదకును మొదలికి దొరకినవాడు॥
507) మాళవిగౌళ/ఖరహరప్రియ
ప॥ ఇట్టె మమ్ము రక్షించుట యేమిదొడ్డ నీకు నేడు।బట్టబాయిటనే నీవు పదిరూపు లైతివి॥
చ॥ చదువుల చిక్కుదిద్ది చక్కగ జేసితివి।మొదలు గుంగినకొండ మోచి యెత్తివి।
పొదిగి చేపట్టి తెచ్చి భూమి వుద్ధరించితివి।అదనున బ్రహ్లాదు నట్టె మన్నించితివి॥
చ॥ అడుగులు మూటనే యఖిలము గొలిచితి।బడిబడినే రాచపగ నీగితి ।
బెడిదపులంక విభీషణు నేలించితివి।అడరి పాండవులదిక్కై నిలిచితివి॥
చ॥ త్రిపురకాంతులగుట్టు దీర బోధించితివి।వుపమ గలికిరూపై యున్నాడవు।
ఇపుడు శ్రీవేంకటేశ యేలితివి లోకాలెల్ల।యెపుడు మానుతులకు నిరవైతివి॥
508) శంకరాభరణం
ప॥ ఇతనిప్రసాదమే యిన్నియును।గతి యితనిదేకన కాదనరాదు॥
చ॥ కాయములో నొకఘనసంసారము।ప్రాయంబులతో బ్రబలీని।
ఆయ మందుకును హరి దానేయై।దాయక పాయక తగిలున్నాడు॥
చ॥ వొనరినకలలో నొకసంసారము।మనసుతోడనే మలసీని।
ననిచి యందుకును నారాయణుడై।కొనమొదలై తా గురియైనాడు॥
చ॥ వుడిబడి కోర్కుల నొకసంసారము।బడిబడియాసల బరగీని।
విడువక యిది శ్రీవేంకటేశ్వరుడే।తొడిబడ గల్పించి ధ్రువమయినాడు॥
509) ముఖారి
ప॥ ఊరకే కలుగునా వున్నతపుమోక్షము।శ్రీరమణుకృపచేత జేరు మోక్షము॥
చ॥ కలుషము బెడబాసి కర్మగండము గడచి।మలసినప్పుడుగా మరి మోక్షము।
చలన మింతకలేక సంసారవారిధి దాటి।నిలిచినప్పుడుగా నిజమోక్షము॥

చ॥ పంచేంద్రియాల మీరి భక్తి హరిమీద బెట్టి। మంచివాడై నప్పుడుగా మరి మోక్షము।
అంచల యాసలు మాని ఆచార్యుసేవ చేసి। మించినప్పుడుగా ఆమీదిమోక్షము॥
చ॥ శాంతమే కూడుగా నుండి సమచిత్తమున బొంది। మంతుకెక్కినప్పుడుగా మరి మోక్షము।
అంతట శ్రీవేంకటేశు డాదరించి మన్నించితే। నంతరంగమున నున్న దనాదిమోక్షము॥

510) వరాళి
ప॥ వెదకనేటికి నేయి వెన్న చేత బట్టుకొని। మొదల గలిగితేనే ముందారా గలుగుట॥
చ॥ తనపూర్వభావము తలచి మరవకుంటే। పనివడి తనపుణ్యఫల మబ్బుట।
మనవార్తి నానాటిమాయ చూపెట్టకుండితే। జనించితనకు విజ్ఞానసిద్ధి యగుట॥
చ॥ పుట్టినయప్పటితనభోగము దలచుకొంటే। కొట్టగొన తనకోర్కి కొనసాగుట।
నట్టనడిమిజగమునటన దెలుసుకొంటే। గుట్టుతోడిగురుబోధగురుతు చేచిక్కుట॥
చ॥ జీవకళ నంటినట్టిచిక్కు విదిలించుకొంటే। దేవుడు తనచే జిక్కి తిరమౌట।
శ్రీవేంకటేశు డీతని జేరి శరణంటేను। ఆవలనీవల దాను అన్నిటా గెలుచుట॥

511) పాడి
ప॥ హరి నారాయణ కృష్ణ అదివో మావిన్నపము। తరవాతిమాట నీవే తలచుకోవయ్యా॥
చ॥ సడిబడ్డనాతలపు చక్కగాక వుండినాను। వొడయడవు నీకృప వొగి జక్కనే।
గుడిగోన్న యే రెంత కొంకరవంకరలైనా। పుడమికి లోగొనకపోవునటవయ్యా॥
చ॥ కాయకపునాభక్తి కడు గొంచమైనాను। ఆయపునీవరములు అతిఘనమే।
యేమెడ గుడి గొంచమయిన గుడిలోదేవుని-। కాయడ మహిమ ఘనమందురు గదవయ్యా॥
చ॥ శ్రీవేంకటేశ నన్ను జింతింపక నేనుండినా। జీవాంతరాత్ముడవై చేకొంటి నీవే।
ఆవటించి కీలుబొమ్మ అచేతనమై యుండినా। ఆవేళ సూత్రధారు డాడించు గదవయ్యా॥

512) నాట
ప॥ ఇదె వీడె కంటిమమ్మ యేతులవాడు। కదలేసూర్యచంద్రులకన్నులవాడు।
చ॥ సెలవినవ్వులవాడు చేకత్తిగోళ్ళవాడు। పలుపేగులజంధ్యాలవాడు।
యెలమి జెలిదొడపై నిడుకొన్నట్టివాడు। చెలగిన ఘననారసింహుడతే వీడు॥
చ॥ కొండగద్దెమీదివాడు గొప్పకిరీటమువాడు। దిండుపైడిచీరకాసె తెక్కులవాడు।
రెండురూపులొకటైనరీతులమాయలవాడు। అండ బ్రహ్లాదవరదు డాతడటే వీడు॥
చ॥ భవనాసిపొంతవాడు భావించ దెల్లనివాడు। ఇవల శ్రీవేంకటాద్రినిరవైనాడు।
జవళి పంతాలవాడు శంఖచక్రములవాడు। తివిరిన అహోబలదేవుడటే వీడు॥

513) బౌళి
ప॥ పరమపురుషు డీబాలుడట। హరవిరుంచులు మొక్కే రదివో వాకిటను॥
చ॥ దేవు డితడు సర్వదేవతల కొడయడు। వేవేలువేదములచే వేద్యు డీతడు।
దేవకీదేవికి వసుదేవునికి గొడుకాయ। యీవిధము నోచిరి వీ రెంతభాగ్యవంతులో॥
చ॥ అంతటా దా నున్నవాడు అరయ స్వతంత్రుడు। అంతము నాదియులేని ఆదిమూరితి।
వంతుకు యశోదకు నవ్వల నందగోపునికి। దొంతరకొడుకైనాడు తొల్లి వీ రేపుణ్యులో॥
చ॥ ఇందిరావల్లభుడు ఇహపరనాయకుడు। కందువ శ్రీవేంకటాద్రి గాపున్నవాడు।
మందగొల్లెతలకెల్ల మరది దానైనాడు। ఇందరు నిందరే వీరి కెన్నటి సంబంధమో॥

514) లలిత
ప॥ ఎన్నడు గలుగు మరి యీభాగ్యము। సన్నిధాయ నితనికి శరణనరే॥
చ॥ అదె చంద్రు డుదయించె నచ్యుతుడు జనియించె। అదన గంసునిజన్మ మస్తమించెను।
పొదలిరి దివిజులు పొలసిరి రాక్షసులు। సదర మీశిశువునకు శరణనరే॥
చ॥ పాండవులకులము హెచ్చె బాలకృష్ణు డిదె వచ్చె। దండిదుర్యోధనుమూక జల్లన విచ్చె।
దండిగోకులము నిండె ద్రౌపదితపము పండె। దండప్రతాపున కిట్టె శరణనరే॥

చ|| రేపల్లె పుణ్యము సేసె శ్రీవేంకటేశుడు డాసె | గోపికలమనసుల కొఱత వాసె |
కోపులధర్మము దక్కె గోవర్ధనగిరి నిక్కె | చాపలమేటి కితని శరణనరే ||
515) ముఖారి
ప|| అతడే గతియని యనుటే నన్నిటా మాన్యుడు | ఇతరాలు మానగానే యీతనికే శలవు ||
చ|| శ్రీరమణునినిత్యసేవకులకు దొల్లె | వేరులేనికర్మముల పెట్టిమాన్యము |
ఆరీతి నితనిభక్తులైనచనవరులకు | ఆరితేరి పుణ్యపాపా లడ్డపాటు లేదు ||
చ|| తక్కక యితనిముద్ర ధరించినదాసులకు | చొక్కుల భవబంధాలసుంక మాన్యము |
లెక్కించ నితనికైనలెంకలకు బొడుకల- | కొక్కట విధినిషేధా లూహింప లేవు ||
చ|| సరుస శ్రీవేంకటేశుశరణాగతులకును | పరగ మాయలదొడ్డిబందె మాన్యము |
పరమమైనయితనిపళ్ళెముకూటివారికి | ధరలో నేమిటివంకా దప్పులే లేవు ||
516) సామంతం
ప|| నీచేతిలోనివారము నీవారము | యేచి నీకే చేత మొక్కే మిదియే మావ్రతము ||
చ|| ఇన్నిటా బూర్ణుడవు నీ వెరుగనియర్థమేది | విన్నపము నే జేసేవిధమేది |
మన్నించిననీమన్న నే మహిమలో మాబ్రదుకెల్ల | వున్నతి మీదాసిననే దొక్కటే మావ్రతము ||
చ|| ఘనదేవుడవు నీకు గడమలు మరియేవి | గొనకొని నే నిన్ను గొసరేదేమి ||
పొనుగక యేలితివి పుట్టినమాపుట్టుగెల్ల | ననిచి నిన్ను నమ్మిననమ్మికే మావ్రతము ||
చ|| శ్రీవేంకటేశుడ నీవు చిత్తగించినది యేది | భావించి నే బొందిన భాగ్య మేది |
యేవల మాపరవారా లింతయు నీ కెక్కినది | ఆవటించి నే నీశరణన్న దే మాత్రము ||
517) దేశాక్షి/ఝుంఝూటి
ప|| కనియుండి భ్రమసితి గట్టా నేను | యెనలేక గురియై నిట్టే నేను ||
చ|| తోలునెముకలు గట్టి దొరనంటూ మురిసెను | ఆలుబిడ్డలమరగు ఆహా నేను |
గాలి యూవటించుకొని కాలములు గడపేను | వోలి బుణ్యపాపమందు వోహో నేను ||
చ|| వంటివంక బదుకంతా మదయించి మురిసెను | ఇంటిముంగిటనే వుండి యిహీ నేను |
వొంటివాడనైవుండి వూరగలవెల్లా గోరే | వొంటినయాసలతోడ నూహూ నేను ||
చ|| నూలికోక గట్టువడి నున్ననై నే మురిసేను | యీలాగు నాబదుకెల్ల యేహీ నేను |
పాలించి శ్రీవేంకటాద్రిపతి నాకు గలుగగ | ఆలరినై గెలిచితి హైహై నేను ||
518) మాళవిగౌళ
ప|| నీవు సర్వగుణసంపన్నుడవు నే నొకదుర్గుణుడను |
మానవు నన్నొకయెదురుచేసుకొని మనసుచూడనేలా అయ్యా ||
చ|| యేలినవాడవు నీవు ఇటు నే గొలిచినవాడ |
పోలింపగ నీవే దేవుడవు భువి నే నొకజీవుడను |
పాలించేవాడవు నీవు బ్రదికేవాడను నేను |
తాలిమి నన్నొకసరిచేసుక నను దప్పులెంచనేలా అయ్యా ||
చ|| అంతర్యామివి నీవు అంగమాత్రమే నేను |
చింతింపగ నీవే స్వతంతుడవు జిగి నే బరతంత్రుడను |
ఇంత నీవే దయగలవాడవు యెప్పుడు నే నిర్దయుడను |
చెంతల నన్నొకమొనసేసుక నాచేత లెంచనేలా నయ్యా ||
చ|| శ్రీవేంకటేశ్వరుడవు నీవు సేవకుడను ఇటు నేను |
ఆవలనీవల దాతవు నీవు యాచకుడను నేను |
నీవే కావగ గర్తవు నేనే శరణాగతుడను |
కైవశమగు నను ప్రతివెట్టుక నాకథలు యెంచనేలా అయ్యా ||
519) నాట

ప॥ వెడలె వెడలె నదె వీధులవీధుల। తొడికి దైత్యులను దుంచగను॥
చ॥ కోటిసూర్య లొకకూటువ గూడుక। చాటున మెరసేటిచక్రము।
గాటపువేవేలు కాలరుద్రు లటు। నీటున దొలకేటినిబిడచక్రము॥
చ॥ ప్రళయకాలముల బడబాగ్ను లొలుకు-। చలమరిప్రతాపచక్రము।
కలకలరవముల కాలభైరవులు। కలసి మెలంగేటిగండచక్రము॥
చ॥ యమసహస్రములసంత మేకమై। సమరముగెలిచేటిచక్రము।
అమరుచు శ్రీవేంకటాధిపుకరమున। దెమలకయుండేటిదివ్యచక్రము॥

520) బౌళి
ప॥ మొక్కెద మిదివో మూడు మూర్తులను। వొక్క రూపమై వొనరె జక్రము॥
చ॥ చెండినరావణుశిరో మాలికల। దండలపూజల తఱచుగను।
మెండుగ గంసుని మెదడు గందముగ। నిండ నలదుకొని నిండె జక్రము॥
చ॥ చించి హిరణ్యకసిపుపెనురక్తపు। అంచనర్ఘ్యపాద్యమ్ములను।
పంచజనఘనకపాలపుటెముకను। పంచవాద్యముల బరగుచక్రము॥
చ॥ బలుమధుకైటభప్రాణవాయువుల। అలరిననైవేద్యంబులను।
యెలమిని శ్రీవేంకటేశుహస్తముల। వెలసి నిలిచె నిదే విజయచక్రము॥

521) సాళంగం
ప॥ చేకొంటి నిహమే చేరినపరమని। కైకొని నీ విందు కలవేకాన॥
చ॥ జగమున గలిగినసకలభోగములు। తగిననీప్రసాదములే యివి।
అగపడునేబదియక్షరపంక్తులు। నిగమగోచరపునీమంత్రములే॥
చ॥ పొదిగొని సంసారపుత్రదార లిల। వదలనిదాసవర్గములే।
చెదరక యేపొద్దు జేయునాపనులు। కదిసిన నియ్యాజ్ఞాకైంకర్యములే॥
చ॥ నలుగడ మించిననాజన్మాదులు। పలుమరు లిటు నీపంపు లివి।
యెలమిని శ్రీవేంకటేశ్వర నీవిక। వలసినప్పు డీ వరములు నాకు॥

522) లలిత/భైరవి
ప॥ కానవచ్చీ గానరాదు కమలాక్ష నీమాయ। తానే వెంటవెంట దగిలీ నిదివో॥
చ॥ తొల్లి నీవు గలవు తోడనే నేడు గలను। యెల్లగా నీప్రపంచము యింతా గలదు।
కొల్లి యెద్దు లెప్పటివే గోనెలే కొత్తలైనట్టు। చల్లనినేనొకడనే జన్మములే వేరు॥
చ॥ వేదములు నాటివే వినుకులు నాటివే। ఆదినుండి చదివే నదియే నేను।
వేదతో వెన్నవట్టి నేయి వెదక బోయినయట్టు। దాదాత నాతెలివి యితరుల నడిగేను॥
చ॥ వైకుంతమూ నున్నది వరములు నున్నవి। యీకడ శ్రీవేంకటేశ యేలితి నన్ను।
కైకొని పువ్వు ముదిరి గక్కన బిందె యైనట్టు। నీకు శరణనగను నేనీడేరితిని॥

523) దేసాళం/బిలహరి
ప॥ కడనుండి చూచేనీకు గనికరమైతేగన-। బడి నన్ను గావు నీతో బలిమేలే॥
చ॥ వొడలుమోచినయది యొకయపరాధము। అడరి సంసారినౌటె యపరాధము।
బడి నివి పఱచినపాట్ల బడకపోదు। యెడనీకు మొరబెట్ట నిక జోటేదయ్యా॥
చ॥ అన్నపానములు గొన్న దది యొక్కనేరమి। వున్నతి సంపద బొందు టొకనేరమి।
యిన్నియు ననుభవించి యిక నొల్లనంటే బోదు। విన్నపాలు సేసి నీతో విసుగ జోటేది॥
చ॥ మదిలో నీవుండగాను మఱచిన దొకకల్ల। అదన గర్మాధికారినౌటొకకల్ల।
యెదుట శ్రీవేంకటేశ యిట్టె నన్ను గాచితివి। తుద కెక్కితిమి యింక దొలగగవలెనా॥

524) రీతిగౌళ
ప॥ నీటి నడుమడిచితే నేడు రెండౌనా। యేటికింక గొంకేవు యింతి జేకోవయ్యా॥
చ॥ వాసుల జందురులోనె వడిగందు గుద్దుగాక। కాసే వెన్నెలలోన గందు గలదా।

ఆసల మోమున గోపమటు నీపై జల్లెగాక। యీ సతికి మతిగోప మింతయిన నున్నదా॥
చ॥ కొలనిలో కలువల కొట్టగొన వాడివాక। అలరు బరిమళము లవియూ వాడె।
సొలసి చూచిన యింతి చూపులె వాడిగాక। నలువంక గన్నులలో నవ్వులవాడా॥
చ॥ అంది నారికేళపు గాయకు బైనె గట్టిగాక। కందువలోనూ నట్టె గట్టియయ్యానా।
పొందిన శ్రీవేంకటేశ పొలతిపై గుట్టుగాక। గొందినె కూడిన యింతి గుణము కఠినమా॥

525) రీతిగౌళ
ప॥ చాలునమ్మ యికనేమి సంగతి గాదు। యేలిన వాడిదె వచ్చి యింటనున్న మీదను॥
చ॥ పంతపు నీ మాటలకు పని లేదు ఆతనితో। చింత దీర కడు వలచిన మీద।
కొంత గొంత కన్నులనే కోపగించ బనిలేదు। ఇంతేసి చనవు నీవిచ్చి నందు మీదను॥
చ॥ కన్నుల దప్పక చూచి కాతాళించ బనిలేదు। అన్నిటా నాతనికి లోనైన మీద।
సన్నల జంకించాతని సాధించ బనిలేదు। యిన్నేసి నోములు నోమి ఇయ్య కొన్న మీదను॥
చ॥ వుడుకు నిట్టూరుపుల నుస్సురన బనిలేదు। బడి బడి నాతనితో బై కొన్న మీద।
యెడయక శ్రీవేంకటేశుడితడే కూడె। జడియగ బనిలేదు సతమైన మీదను॥

526) దేశి
ప॥ హరి నీవే సర్వాత్మకుడవు। యిరవగు భావన యియ్యగదే॥
చ॥ చూడక మానవు చూచేటి కన్నులు। యెడనేమైనా యితరములు।
నీడల నింతా నీరూపము లని। యీడువడని తెలివియ్య గదే॥
చ॥ పారక మానదు పాపపు మనసిది। యీ రసములతో నెందైనా।
నీరజాక్ష యిది నీ మయమే యని। యీ రీతుల తలపియ్యగదే॥
చ॥ కలుగక మానవు కాయపు సుఖములు। యిల లోపల గల వెన్నైనా।
అలరిన శ్రీవేంకటాధిప నీకే। యిలనర్పితమను యిహ మియ్య గదే॥

527) దేశి
ప॥ ఆఱడి బెట్టక మాతో నాననీవయ్యా। మీఱరాదు ఇచ్చకపు మీవారమే నేము॥
చ॥ చుట్టరికము సేసుక సుద్దులెల్ల జెప్పేవు। నెట్టన నీ రచనలు నిజమా యిది।
చెటాపట్టాలు పట్టుక సిగ్గులు విడిపించేవు। నట్టనడుమని వెల్ల నమ్మవచ్చునా॥
చ॥ సారెసారె నియ్యరాని చనవులెల్లా నిచ్చేవు। కోరి యివెల్లా నియ్యకో లవునా।
పేరడిగా ననుపులే పెనచేవు నాతోను। సారెకు నిటువలెనే సతములయ్యేవా॥
చ॥ పరపుపై బవళించి బాసలెల్లా జేసేవు। అరసే నింకొక్కమాటు అవునా యిది।
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె। మురిపెముతోడుతను మొక్కుదునా యిందుకు॥

528) మధ్యమావతి
ప॥ అతని మన్ననే చూచే వప్పుడె నీవు। యితవై మీ యిద్దరిలో యెంత సమ్మతములో॥
చ॥ చెలువుని మోము చూచి సెలవుల బారనవ్వి। చెలితో మాటలాడేవు చెల్లబో నీవు।
అలవోక బవళించి యాకు మడి చిచ్చేవు। అలవెఱగవు పతినౌనే నీవు॥
చ॥ కాటుక దీరుచుకొంటా ఘనునితో బలికేవు। నేటివలెనుండునటె నేరవు నీవు।
నీటున నొయ్యారి బాగై నిలుచుండి మొక్కేవు। వోటలేదు దొరచిత్తా లోకరీతి నుండునా॥
చ॥ తొడమీద దొడవేసి దొరతనమే చూపేవు। నడుమ శ్రీవేంకటేశునంటున నీవు।
జడికొని దోమతెరచాటున గూడి మాకు। నడియాలాలు చూపేవు అంతలో నీవు॥

529) మధ్యమావతి
ప॥ ఆ మాట మీ రెరగ రాతడె కాని। తామసించినాడ నుండె తనకేలె వెఱపు।
చ॥ విచ్చేయమనవె విభుని నిక్కడికె। యిచ్చటనె విన్నవించే నేమి గల్లాను।
ముచ్చట దీరదు తన మొగము చూచినదాకా। తచ్చివేసి నేనుండగ తనకేలె వెఱపు॥
చ॥ తప్పక చూడు మనవె తానిట్టె నా దిక్కు। యిప్పుడె మంచిది సేసే నేమి గల్లాను।

దప్పివోదు నేడు నాకు తనతో మాటలాడుదాకా। తప్పులెల్ల వొప్పులయ్యా తనకేలె వెఱపు॥
చ॥ తలచుకొమ్మనవలె తనపొందు నాపొందు। యెలమి గాగట దీర్చేనేమి గల్లాను।
అలమె శ్రీ వేంకటేశు డందుకే మెచ్చినదాకా। తలవంచుకున్నాడు తనకేలె వెఱపు॥

530) ముఖారి

ప॥ ఊరకున్న వారి తోడ వూరోప దన్న మాట। నేరుచుకొంటి నేను నీవేమి సేసేవే॥
చ॥ చుట్టములయిన వారు సొలసి సొలసి యంత। తిట్టినా యెగ్గులౌనా తేజమే ఘాక।
వొట్టి నీవు కోపగించి వూరకే యే మనినాను। నట్ట నడుమను నాకు నవ్వు వచ్చీని॥
చ॥ చేతికి లోనైనవారు చెనకి యంత మీరినా। ఘాతలను హీన మౌనా ఘనతే కాక।
పోతరించి నీవు నన్ను పూచి యేమి సేసినాను। జాతి నా మనసన్నిటా సమ్మతించీనే॥
చ॥ కాగిట గూడిన వారు కడు దమకించి నాను। మూగివేసట పుట్టునా మదమే కాక।
యేగివచ్చి శ్రీ వేంకటేశుడ కూడితి నన్ను। వీగని నీ రతులెల్ల విందు లయ్యీనే॥

531) దేశాళం/హుసేని

ప॥ నాకు నాకే సిగ్గయ్యీని నన్ను జూచుకొంటేను। చేకొని నీవే మన్నించ జెయ్యీగ్గెగాని।
చ॥ సేయరానిపాపములు సేసివచ్చి యేనోర। నాయెడ నిన్ను వరములడిగేను।
కాయముతో నింద్రియకింకరుడనై యేమని। చేయార నీబంటునని చెప్పుకొనేను॥
చ॥ వేగిలేచి సంసారవిధులకే వొడిగట్టి। యేగతిగొసరి నేపై నేట వేసేము।
ఆగడపు బంగారుకాతుమనేన( య?)మ్ముకొని। భోగపుమోక్షము నెట్టు వొందించు మనేము॥
చ॥ కలుపుట్టుగుబదుకు కాతలకు వెచ్చపెట్టి। వలసి నేడెట్టు నీవార మయ్యేము।
నెలవై శ్రీవేంకటేశ నీవె కరుణించితివి। బలిమిసేసి నీకెట్టు భారము వేసేము॥

532) శంకరాభరణం

ప॥ అచ్చుతుశరణమే అన్నిటికిని గురి। హెచ్చుకుందు మరి యెంచగనేది॥
చ॥ యోనిజనకమగు యొడలిది। యే నెలవైనా నేటి కులము।
తానును మలమూత్రపు జెలమ। నానాచారము నడచీనా॥
చ॥ పాపపుణ్యముల బదుకిది। యేపొద్దు మోక్షం బెటువలె దొరకు।
దీపనబాధల దినములివి। చూపట్టి వెదకగ సుఖ మిందేది॥
చ॥ మరిగినతెరువల మనసుయిది। సరవినెన్న విజ్ఞానంబేది।
యిరువుగ శ్రీవేంకటేశ్వరుండే। వెరవని కంటే వెలితిక నేది॥

533) వసంతవరాళి

ప॥ ఏమందు మిందుకు నెఱిగినదే తొల్లి। శ్రీమాధవుడ నేవు సేసినదే తొల్లి॥
చ॥ వొక మాన జేదూ వొక మాన దీపూ। కకిపికలై రెండూ గలవే తొల్లి।
వొకనికజ్ఞానము వొకనికి జ్ఞానము। సకలాన గలుగుట సహజమే తొల్లి॥
చ॥ పగలు వెలుఁగు పైపై రాత్రి చీకటి। నిగిడి లోకములని నిజమే తొల్లి।
మొగి సురలకు మేలు ముంచి దైత్యులకు గీడు। తగిలి నొసలివ్రాత తప్పదిది తొల్లి॥
చ॥ వెన్నెలలు చంద్రునందు వెడ యెండ సూర్యునందు। కన్నుల లోకమువారు గన్నదే తొల్లి।
యెన్నగ శ్రీవేంకటేశ యేలినవాడవు నీవు। వున్నవారు నీకింద నున్నవారు తొల్లి॥

534) లలిత

ప॥ ఆతడితడా వెన్న లంతట దొంగిలివాడు। యేతులకు మద్దులు రెండిలదోసినాడు॥
చ॥ యితడా దేవకిగన్న యింద్రనీలమాణికము। పూతకిచన్ను దాగి పొదలినాడు।
యీతడా వసుదేవునియింటిలో నిధానము। చేతనే కంసుని బుట్టచెండుసేసినాడు॥
చ॥ మేటియైనగుంతిదేవిమేనల్లుడీతడా। కోటికి బడెగెగాను కొండ యెత్తెను।
పాటించి పెంచేయసొదపాలి భాగ్య మీతడా। వాటమై గొల్లెతలను వలపించినాడు॥
చ॥ ముగురువేలుపులకు మూలభూతి యీతడా। జిగి నావుల బేయల జేరి కాచెను।

మిగుల శ్రీవేంకటాద్రిమీదిదైవ మితడా। తగి రామకృష్ణావతార మందె నిప్పుడు ॥

535) శుద్ధవసంతం

ప॥ పనిగొనువారలభాగ్యమిది। వెనకముందరికి వివేక మొకటే॥

చ॥ బలు పుణ్యములకు బాపములకు గురి। కలియుగ మొకటే కలది।
చెలగి సేయుటకు సేయించుటకును। తలపూ నొకటే తనలోగలది॥

చ॥ మోదపు భోగము మోక్షమునకు గురి । యీదేహ మొకటే యెత్తినది।
గోదిలి కడుగుంగుటకు నెక్కుటకు। యీదెస విజ్ఞానమిదియే కలది॥

చ॥ ఆర్మిలిదుఃఖము నతిసుఖములకు గురి। కర్మం బొకటే కలది।
కూర్మి శ్రీవేంకటగురుదైవము గను-। ధర్మమున కతనిదాస్యమే కలది॥

536) మంగళకౌశిక

ప॥ ఇందరు నీకొక్కసరి యెక్కువ తక్కువ లేదు। చెంది నీసుద్దులు యేమిచిత్రమో కాని॥

చ॥ నీనామ ముచ్చరించి నెరవేరె నొక్క మౌని। నీ నామము వినక నెరవేరె నొకడు।
పూని నిన్ను నుతియించి భోగియాయ నొకడు। మోనమున నిన్ను దిట్టి మోక్షమందె నొకడు॥

చ॥ మతిలో నిన్ను దలచి మహిమందె నొకయోగి। తతి నిన్ను దలచకే తగిలె నిన్నొకడు।
అతిభక్తి బని సేసి అధికుడాయ నొకడు। సతతము బనిగొని సఖుడాయ నొకడు॥

చ॥ కాగిటి సుఖములిచ్చి కలసిరి గొందరు। ఆగి నిన్ను వెంటదిప్పి ఆవులు మేలందెను।
దాగక శ్రీవేంకటేశ దగ్గరయిన దవ్వయిన। మాగి నిన్ను దలపోసేమనసే గుఱుతు॥

537) ముఖారి

ప॥ గరిమతో వెరపేల కమలాక్షు దాసులకు। పరమపద మొక్కటే ఫలమింతే కాక॥

చ॥ పాపమెంత పుణ్యమెంత ప్రపన్నాధికారులకు। దాప నవి నిమిషమాత్రములేకాక।
లోపలేడ వెలియాడ లోకులకింతేకాక। మోపినదంతా యేకముఖమేకాక॥

చ॥ రాతిరేది పగలేది రమించు సాత్వికులకు। యీతల నింతా వెలుగింతేకాక।
ఘాతల గర్మాకర్మగతులు యీసంది వింతే। పోతరించి యెక్కనెక్క బొడవేకాక॥

చ॥ చింతలేల సిలుగేల శ్రీవేంకటేశ్వరుని। వంతుల నమ్మినయట్టి వైష్ణవులకు।
జంతువుల పురుడులు జడులకింతేకాక। వింతవింతసుద్దులేల విభవమేకాక॥

538) గుండక్రియ

ప॥ అనాది జీవుడన్నియు గన్నవే। వినోదమిందలి విరతే వలయు॥

చ॥ వెలిదోచిన యీ విశ్వంబెల్లా। కలసిన మనోగతములివి।
పలు విషయేంద్రియభావములెల్లా। వెలయదా ననుభవించినవే॥

చ॥ సహజపు వర్ణాశ్రమము లివెల్లా। యిహమున దా ధరియించినవే।
బహువేదశాస్త్రపఠన లివెల్లా। వహి కెక్కగ దా వచియించినవే॥

చ॥ దినదినసంసారతిమిరంబెల్లా। ఘనముగ దను మున్ను గప్పినవే(దే?)।
అనయము శ్రీవెంకటధిపు డాత్మకు। ననిచి తొల్లి కల నాయకుడే॥

539) సామంతం

ప॥ ఇతర మేదియు లేదు యెఱగ మింతేకాని। రతికెక్కే పనులెల్లా రామచంద్రుడే పో॥

చ॥ ధనమై చేరేవాడు దైవమై కాచేవాడు। మనసులో దలచేటిమాధవుడే।
మునుకొన్నగ్రామములై ముందరనుండేవాడు। కొననాలుకమీదటి గోవిందుడే పో॥

చ॥ తల్లియై పెంచేవాడు తండ్రియై పుట్టించేవాడు। వెల్లవిరిదాగొలిచే విష్ణుమూరితి।
ఇల్లాలై సుఖమిచ్చి యెంచ బుత్రులైనవాడు। చెల్లుబడి దా మొక్కేటిచేతిపై శ్రీహరియే॥

చ॥ దేహమై వుండేటివాడు దినభోగమైనవాడు। యీహల శ్రీవేంకటేశు డితడొక్కడే।
మోహాచారమైనవాడు మోక్షమై నిలిచేవాడు। సాహసించి నమ్మగలసర్వేశు డితడే॥

540) భవుళి

ప॥ విడిచితి మనరాదు అవి మరి విడువమనగరాదు। అడరిన శ్రీహరి అనుమతికొలదే॥
చ॥ పెంచిన బెరుగుని పెను ఇంద్రియములు। కొంచము సేసినగుందును।
పంచిన దిందును పాపము బుణ్యము। యెంచగ నీశ్వరు డిచ్చినకొలదే॥
చ॥ తెలిసిన దేటగు తిరమగుమనసిది। కలచిన లోలో గలుగును।
తొలచిన దిందునె దుఃఖము సుఖమును। ఇల నంతర్యామిచ్చినకొలదే॥
చ॥ చేసిన జెలగును చేతల కర్మము। పాసిన బాయును బంధముతో।
ఆసల శ్రీవేంకటాధీశు డిందుకు। ఈసరి గర్తతడిచ్చినకొలదే॥

541) ముఖారి
ప॥ కప్పురము దిన్ననోట గార మేలే। యిప్పుడే కంటిమి వేసాలిక నేలే॥
చ॥ కాంతుడు వద్దికి వచ్చి కన్నులెదుట నున్నాడు। చింతలెల్ల దీరినాను సిగ్గులేలే।
మంతనాన మాటలాడగా మరగులే పెట్టేవు। వంతవరుసలు వచ్చె వాసులేలే॥
చ॥ మక్కువ చల్లి యీతడు మనసెల్ల నిచ్చినాడు। మొక్కలము దీరినాను మోనమేలే ।
లక్కవలె గరగీ నీలాగులెల్లా జూచి చూచి। చక్కనాయ బనులెల్లా జాగులేలే॥
చ॥ శ్రీవేంకటేశ్వరుడు చేరి నిన్ను గూడినాను। వావులు గలసె తలవంచ నేలే।
వేవేలు వచ్చె నీకు విభుడాతడైనాడు। కైవశమైన మీద కతలేలే॥

542) వేళావళి/గౌరీ మనోహరి
ప॥ ఎందాకా నీ చలమేమి గట్టు కొంటిని। యిందు వంకనే దొరవిన్నిటా నీవైతివి॥
చ॥ పలుకరాదా కొంత పరాకు మానరాదా। పిలిచి పిలిచి పెదవులెల్లా బెండుపడెను।
నెలవుల నవ్వరాదా చేతలదగ్గరరాదా। నిలువు నివ్వెరగాయ నీకు గానే ప్రేమను॥
చ॥ చక్కగా జూడగ రాదా చలము మానగరాదా। మొక్కి మొక్కి చేతులెల్లా మొనలాయను।
మక్కువతో వినరాదా మన్ననలియ్యగరాదా। యిక్కువలు విన్నవించి యెలుగెల్లా రాసెను॥
చ॥ యింటికిట్టె రారాదా యిటునన్ను గూడరాదా। వెంట వెంట దిరిగాడి వేసటాయను।
అంటి ముట్టి శ్రీవేంకటాధీశ యేలితివి। నంటున నీ తోడి రతి నాభాగ్యమాయను॥

543) వేళావళి/గౌరీ మనోహరి
ప॥ నిజమరివి నీవని నేనుండుదును। గజరులు చెలి యదే కదిసీ నిన్నును॥
చ॥ పగటుల నడుపుల బకపక నగుచును। మగువ నీ యెదుటను మలసీని।
తగులు గలుగుబోలు తరుణుల నొల్లనని। పొగరుల నాతో బొంకుదువు॥
చ॥ పుక్కిటి విడెముతో బొరి కన్నులార్చుచు। చక్కని మగువ నిన్ను జరసీని।
వొక్కటి నీతో గాబోలు వొగినీ వాడనేయంటా। చక్కగ నెడలేని బాసలు సేతువు॥
చ॥ నిలువు జెమటగార నీతో సరసమాడీని। కలికి నీకు నసలు గాబోలును।
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడుతివి। యిలగొంతవడి భ్రమయించనేల నీవు॥

544) నట్టనారాయణి/సామ
ప॥ ఏల సాకిరి గోరేవు యింతలో నన్ను। అలరి సతులకు నీ కమరుగాక॥
చ॥ నిగ్గులమాటా లాడ నీతోనే నేరుతునా। సిగ్గువడి యుండేటి చెలి నేను।
కగ్గి నీవలెనే నేను కల్లలాడ నేరుతునా। మొగ్గులేని యటువంటి ముద్దురాల నేను॥
చ॥ నీవు నేరని చేతలు నే నేరుపగలనా। వావితో లోనుండే రాణివాసమనేరు।
వోపరిలో నీ సుద్దులు వూకొన నే గలనా। కోవిలకూత కుత్తిక కోమలిని నేను॥
చ॥ జంకించి కౌగిట గూడే చలమరి దాననా। వంకలాడ నేరిచిన వనిత నేను।
అంకెల శ్రీవేంకటేశ అలమేలు మంగనేను। పొంకమై కలసితివి పొందనేర్తు నేను॥

545) నారాయణి
ప॥ ఏణి నయనల చూపులెంతసొబగై యుండు। ప్రాణ సంకటములగు పనులు నిట్లుండు॥
చ॥ ఎడలేని సంతాప మేరీతి దానుండు। అడియాస కోరికెలు నటువలెనె యుండు।

కడలేని దుఃఖ సంగతి యెట్లుదానుండు। అడరు సంసారంబు నట్లనేవుండు॥
చ॥ చింతాపరంపరల చిత్తమది యెట్లుండు। వంత దొలగని మోహవశము నట్లుండు।
మంతనపు బనులపై మనసు మరి యెట్లుండు। కంతుశర మార్గముల గతియెట్లుండు॥
చ॥ దేవుడొక్కడె యనెడి తెలివి దన కెట్లుండు। శ్రీవేంకటేశుడు కృపచేతలట్లుండు।
భావగోచరమైన పరిణ తది యెట్లుండు। కైవల్య సంగతులు నట్లుండు॥
546) నారాయణి
ప॥ తుడుచుకొంటే బోదు తొడరి నీవెంతైనా। వడియించి మొక్కులనె వలపు నీమీద॥
చ॥ నిక్కి చూచి చెలి నీపైనిండా నవ్వులు నవ్వి। చిక్కని వెన్నెల తేట చిందీనదె।
చెక్కులను కొనగోళ్ళ జెనకి కాంతులమించ। లక్కరసములు చల్లీ లావుగా నీమీద॥
చ॥ వొరసి వొరసి నీతో వూరగల మాట లాడి। సిరుల గమ్మదేనెలు చిందీనదె।
సరిగా సేవలు సేసి చన్నుల మెఱుగులను। సరుగ బంగారుపొడి చల్లీ నీమీద॥
చ॥ బలిమి గాగిట బట్టి భావములనే కరగి। చెలగి వయోమదము చిందీనదె।
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిన్నిటా గూడి। చలముల గూరిములు చల్లీ నీమీద॥
547) నారాయణి
ప॥ ఎంతైనా నెఱగవు యెమ్మెలు చూపేవు నీవు। అంతటా నీకె యాకె అప్పణియ్యవలెనా॥
చ॥ తప్పక చూచీ నీతో తలవంపే చాలదా। వుప్పటించి నిన్ను వేరె వొరయగవలెనా।
పిప్పిగట్ట బెదవుల చేర తిట్టవలెనా। కప్పురపు గంది నిన్ను గసరగ వలెనా॥
చ॥ వూరకుంటే జాలదా వువిద నీతో నిప్పుడు। గోరపెట్టి సారె సారె గోపగించవలెనా।
నీరాక దెలిసియు నిద్దరించె జాలదా। బీరమాడి నిన్ను రతి బెండు సేయవలెనా॥
చ॥ చేతమొక్కె జాలదా చేకొని నిన్నిక వేరే। రాతిరి బగలు గడురాపు సేయవలెనా।
నీతితో శ్రీవేంకటేశ నిన్ను గూడె జాలదా। యీతరుణి నేడే నీయింటికి రావలెనా॥
548) నారాయణి
ప॥ ఎరవుల వారెవ్వరు యిందులో నీకు। విరివికాడవు నీవు విచ్చేయవయ్య॥
చ॥ తగవెల్ల నీయందె తగిలించినదిగాన। మగువలతో జెలి మాటాడదు।
వగయెఱగ కిందాకా బడుండితిమి। అగడు నీవల్లదీరు నాడకు రావయ్యా॥
చ॥ పాయమెల్లా నీకే పాలు పెట్టినది గాన। వేయైన తన గుట్టు వెళ్ళవేయదు।
చాయ దెలియ కిందాకా సరితలు చూచితిమి। నీ యందే చిక్కులు వాసీ నిక్కిచూడవయ్యా॥
చ॥ వొరసి కౌగిలినీకే వొప్పగించినదిగాన। సొరిది నెవ్వరి బుద్ధి చొరనియ్యదు।
యిరవై శ్రీవేంకటేశ యీపెనిట్టె కూడితివి। వెరవు నీ వల్ల నుంది విడె మియ్యవయ్యా॥
549) మాళవి/కాంభోజి
ప॥ తెలుపగ రానిది దేవుని మాయలు। ఫలమెఱగరు యీ పట్టిన వెట్టి॥
చ॥ పుట్టిరి దివిజులు పురుషోత్తమునం-। దట్టే యణగిరి యతనందు।
యిట్టె యీతని యిందరితో సరి। వెట్టి కొలుచుటే పెను వెట్టి॥
చ॥ హరివరమునసే యందరు బదికిరి। పరుల వరములు గని బడలిరి యసురలు।
యిరవెఱి గీతని నిందరి లోపల। సరిగా మొక్కుట సహజపు వెట్టి॥
చ॥ జీవాంతరాత్ముడు శ్రీవేంకటేశుడు। యేవల శ్రీలక్ష్మి యీతని దేవులు।
వేవేలు సిరులు వీరే యొసగిరని। భావించి వారికి బట్టదు వెట్టి॥
550) కేదారగౌళ
ప॥ ఎటువంటి రాజికమే చెలియ నేడు। కట కటా యెంచైన కంటిరా మీరు॥
చ॥ గోరంట సీమ పెనుకూటంబు మూకచే। భారంబు దుగముల పట్టుపడెను।
సారె సారెకు మధ్య దేశంబు బయలాయె। చేరి మయరాపురము చూరలటు బోయెను॥
చ॥ కదసి యట్టిట్టాయె కాశ్మీరమండలము। నెరిచిక్కు బడెను కుంతలా రాజ్యము।

వరుస చీకాకాయె నెరి కుంభ కోణము। రుతువు గాయల గోల కొండ లోనాయెను॥
చ॥ వింత పూర్వుల పూర్వులిడ దండు విడచిన। కొండ తామర కొలన కొలుపాయె-।
నంత శ్రీ వేంకటేశు డలమేలు మంగ జేరి। సంతతము కళ్యాణ సామ్రాజ్యమేలెను॥
551) కేదారగౌళ
ప॥ అందుమీద మేలుదాన వాతనికి నీవు దొల్లె। కందువె చూతువుగాక గరిసించ నేటికే॥
చ॥ చిక్కని వెన్నెలతేట చెలియ నీమొగమోట। అక్కజపు పతి నింకే మనగలవే।
నిక్కియాతడన్ని జేసె నీపై వలపు వేసె। మక్కువవాడ సుద్దులు మమ్మే మడిగేవే॥
చ॥ పచ్చితేనె పలుకులు పడతి నీ పలుకులు। యిచ్చట నాతని నింకా నే మనేవే।
రచ్చలకు నాడె యెక్కె రాతిరి నీకు మొక్కె। ముచ్చట కిందేమి మామోములు చూచేవే॥
చ॥ చెప్పరాని విందులు సేసెటి నీ పొందులు। యిప్పుడు శ్రీ వేంకటేశు నేమి సేసేవే।
తప్పకితడె కలసె తమకములు వలసె। వొప్పుగా మమ్ము మెచ్చితి వొరయ నేమిటికే॥
552) కాంభోజి
ప॥ ఏమిసేతు నమ్మలాల యిదివో నాకాపిరము। కామించి వలపు పతి కౌగిలే కోరీనీ।
చ॥ కాయమే కాకల బొందీ గాసీ రమణుని బాసి। పాయమే చిగురించీ బైపైనే।
చేయి చెక్కిటి మీద జింతలు రేచీగానీ। యేయెడ గను చూపులు యెదురే చూచీని॥
చ॥ పని పూని పయ్యదే పైపై జారీగానీ। ఘనమైన చన్నులైతే గట్టులయ్యీని।
గొన కొన్న విరహము కోపము పుట్టించీగానీ। ననుపుల సెలవులు నవ్వింపించీని॥
చ॥ గారవపు నాకౌగిలి కారాలు పుట్టించీగానీ। వూరేటిమోవి తేనెలు వుట్టిపడీనీ।
యీరీతి శ్రీవేంకటేశు డింతలో నన్ను గలసె। తేరేటి మోము కళలు తెలివిసేసీని॥
553) కాంభోజి
ప॥ నీ విన్నిటా ఘనుడవు నేనెఱుగనా। యీ వల నావల సుద్దులెల్ల నాకు జెప్పేవు॥
చ॥ మంతనాన నేను నీ మనసెల్ల నను గొంటి। వింతలై నీ మాటలెల్ల వేలుచు కొంటి।
వంతులు వెట్టుక నీ వలపెల్ల దెలిసితి। యెంత కెంత నీ గుణము యేల మాకు జెప్పేవు॥
చ॥ కడల నీవిద్యలు ఇక్కడనే విచారించితి। బడి నుండి నీలాగు భావించితి।
వుడుగక నీతో నవ్వి వోరుపు విచారించితి। యెడలేక నీ నేరుపు లేల నాకు జెప్పేవు॥
చ॥ నిన్ను గాగిటనే కూడినెయ్యమెల్లా జేకొంటి। చన్నుల నొత్తి నీమోవి చవిగొంటిని।
యిన్నిటా శ్రీ వేంకటేశ ఇచ్చకములు మెచ్చితి। యెన్నటి కిది గురుతు యేల నాకు జెప్పేవు॥
554) కాంభోజి
ప॥ రావే అతడు నిన్ను రంతు సేసి పిలిచీని। తావులనే లోగుటే తగునేరుపు॥
చ॥ బలిమి బెనగరాదు పాయపు వారికెల్ల। వలనైన చనవు చూపవలెగాని।
కలిగిన వేడుకలు కైవ్రాల కుండాను। నెలవున గూడుటే నెరవైన నేరుపు॥
చ॥ వాదులడువగరాదు వలచిన వారికెల్ల। సేదదీరి చెప్పినట్లు చేసుటే కాని।
పోదిగొన్న కోరికలు పొది విచ్చకుండాను। సాదు వలె లోనౌటె చక్కని నేరుపు॥
చ॥ సిగ్గులు వడగరాదు సేసపాల వారికెల్ల। నిగ్గుల గాగిట గూడి నిక్కుటే కాని।
అగ్గమై శ్రీ వేంకటేశుడరసి నిన్ను గలసె। కగ్గులేక సుఖించుటే కడునేరుపు॥
555) యదుకులకాంభోజి
ప॥ తను నేమి సేసితినే తానేల తమకించీనే। యెనయగా నూరకున్న దిదే నా నేరమా॥
చ॥ తగుల నాడిన దాన దలవంచు కుండనైతి। నగితి నింతేపో నా నేరమీ।
మొగము చూచిన దాన మోనము గైకొననైతి। అగపడి లోనైన దదే నా నేరమీ॥
చ॥ యింటికి వచ్చిన దాన నేమైనా గొసరనైతి। నంటున నే నుంటి నది నా నేరమీ।
అంటిన దాన నేనట్టె చెనకనైతి। వొంటి మొగ మోటల నేనున్నదే నా నేరమీ॥
చ॥ నెమ్మది గూడిన దాన నిజబా సడుగనైతి। నమ్మితి నేనిదియె కా నా నేరమీ।

**************************************************************************

వుమ్మడి శ్రీవేంకటేశు డొగి నిట్టె నన్ను గూడె। సొమ్మల మైమఱచి నే జొక్కినదే నేరమి॥

556) బలహంస

ప॥ మిక్కిలి జాణవు నీవు మే మేమి బాతి। పక్కన నీవన్నిటాను బదికితే జాలదా॥

చ॥ కూరిములు చల్లుతానె కొసరే గుణము మాది। నేరుపు మాకున్నదా నేరమేకాకా।
మేరతోడి మమ్మేల మేకులు సేసేవు రతి। ధీరుడవు నీవు మ తెరువు రా వలెనా॥

చ॥ నించే సరసములోనె నిండు విరసము మాది। మంచితనమున్నదా మాటలేకాకా।
యెంచనేల మమ్ము నీవు యిల జాణలలోనెల్ల। అంచె నూడి పడ్డ వాడవంత మాతోవలెనా॥

చ॥ చనవున గూడుతానె జంకించేగుణము మాది। తనివి మాకున్నదా తమియే కాక।
అనుగు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను।పెనగి కూడితి వింక బెట్టి నవ్వవలెనా॥

557) ఆందోళిక

ప॥ ఇందుగాక నెవ్వరు యెగ్గులెంచరు। నందు కొని ఆపెనేల సాదించేవు నీవు॥

చ॥ వాడికగల చోటను వలచి వొకరొకరు। ఆడరాని మాటలైనా నాడుచుందురు॥
వూడిగము సేసేవారు వూసి వాసులెంచరు। జోడై తమ మేనులు సోకింతురు॥

చ॥ సరస మాడే వేళ సమ్మతించి తమలోన। సరుగ మందె మేళౌన జంకింతురు।
వరుస విడెమిచ్చేవారు వింతసేయరు। అరిది దమచేతుల నంటింతురు॥

చ॥ రతి గలసె యప్పుడు రాజసము విడువరు। తతి గూడ దమలోన దమకింతురు।
యితడై శ్రీవేంకటేశ ఇంతి నీవూ గూడితిరి। చతురులైన వారు సతమే చింతింతురు॥

558) శంకరాభరణం

ప॥ దిష్టి తాకీ ననీ మాయయ్యకు తెరవెయ్యరే। దిష్టించి యెవరినైనా తేరిచూడ నీకురే॥

చ। చప్పుడు సేయక యవసరామని చెప్పరె। అప్పుడు మజ్జనమాడేనని చెప్పరే।
కప్పురంపు సురటులా విసరే ననరే। అప్పుడు సతులు తాను ఆరగించే ననరే॥

చ॥ దంతపు చవికెతో యేకాంత మాడే ననరే। అంతరంగమున నృత్తమాడే ననరే।
దొంతి వేడుక పూలతోటలో నున్నాడనరే। చెంతల కేళాకూళి చెంత నున్నాడనరే॥

చ॥ పట్టంపు రాణియు తాను పవ్వళించుచున్నా డనరే। రట్టుగా నెవ్వరినైన రాకుమనరే।
అట్ట యలమేల్మంగాధిపతి వేంకటేశ్వరు। నిట్టె ఒకరినొకరిని సేవించుమనరే॥

559) గౌళ

ప॥ మూసిన ముత్యము వలె ముంగిట నున్నదాన నేను।
యేసుద్దు లెఱుగ దైవమెఱిగితే జాలును॥

చ॥ బెట్టి మాటలాడగాను ప్రియమౌనో కాదో యంటా।
గుట్టున యూరకున్నదాను గోపమా యిది।
అట్టి నావలపు నీతో నాడుకొందునా నేను।
ఇట్టి పనులెల్ల దైవమెఱిగితే జాలును॥

చ॥ వీడెము నీచేతికియ్య వేళవునో కాదో యంటా।
గోడ మాటున నున్నదాన గోపమా యిది।
యేడనైనా నిల్లాండ్లు యెదురు కట్ల నుందురా।
యేడకేడ యిది దైవమెఱిగితే జాలును॥

చ॥ యేది నిన్ను గూడి ఇంకా నెంత గర్వమందు వంటా।
గూచుంటే బాదాలవద్ద గోపమా యిది।
గాచి యలమేల్మంగను కైకొంటె శ్రీవేంకటేశ।
యీ చాయ నీవే దైవమదెఱిగితే జాలును॥

560) శంకరాభరణం

ప॥ పెనగే వూరకే ప్రియపడి నాతో। ననుపు నటించక నయమౌనా॥

**************************************************************************

చ|| చిత్తము లోపలి సిలుగులు వాయక | బత్తులు సేయగ బనిగలదా |
వొత్తినగోళ్ళు వొళ్ళనే వుండగ | హత్తిన కౌగిలి అనువౌనా ||
చ|| నగవులలోపలి నలుసులు దియ్యక | పగటులు సేయగ పనిగలదా |
తగిలిన దండలు తతిమెడ నుండగ | వెగటుగ బెనగగ వేడుకలౌనా ||
చ|| వలపుల లోపలి వాసులు దోయక | బలుములు చూపగ బనిగలదా |
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి | కలసిన రతులకు గడమలు నౌనా ||

561) శంకరాభరణం
ప|| ఇంగిత మెఱుగ లేవా యింత జాణవు | పుంగిటిగా నాపెనేల వొరిసేవు నీవు ||
చ|| నగవె నసుపు నయమె ప్రియము | తెగువే తెలివి దిన దినమూ |
మగువను జూడరాడా మాటాడ సిగ్గువడీని | అగడుసేసి యేల అడిగేవు నీవు ||
చ|| పిలుపే నిలుపు పెనగుటే తగులు | చలిమే బలిమి సారె సారెకూ |
కలదు యీ చెలియందే గక్కున గుట్టుతోనుంటే | సొలసి యాపెతో నేల సోదించేవు నీవు ||
చ|| మరులే మచ్చికలూ మనమే మోసము | కరగులే యితవులు కలకాలమూ |
మరలి నిన్నలమేల్మంగ శ్రీవేంకటేశుడ | యిరవై సొలసె నీవింకా నేల సొలసేవు ||

562) శంకరాభరణం
ప|| కుటిలా లేటికి కోమలి యెడ నే- | డిటువలె జేయగ నింపౌనా ||
చ|| పుప్పొడి చల్లిన బొక్కెటి దేహము | కప్పుర మేటికి గలపేరే |
ఒప్పగ వేనీళ్ళొల్లని దేహము | నిప్పులు చల్లగ నిలిచీనా ||
చ|| వెన్నెల బాయట వేగెటిమేనికి | పన్నీరేటికి బామేలే |
సున్నపు రాతికి జొబ్బిలి నుదకము | నున్నతి జల్లగ నోర్చీనా ||
చ|| తిరువేంకటపతి తెప్పలదేలగ | తరుణికి నేటికి దాపములా |
దొరకని దైవముతో మాటలాడగ | పరికెలు వెట్టగ బాడౌనా ||

563) శంకరాభరణం
ప|| ఊరకుండనీరా మమ్ము నుడికించకా | గారవించే నీ నవ్వు గాలమువో నాకు ||
చ|| చిఱుతనవ్వు నవ్వగా చెక్కునొక్కి యెత్తి నన్ను | కఱచేవు మరికొంత కారింపే కాదా |
తఱి నీ మనసునకు దలచినట్లుండు | గుఱిగా నదివో నాకు గుండెలోని అమ్ము ||
చ|| మంచముపై నుండగాను మచ్చిక నావొద్ద బండి | ముంచి చేయివేసే వది మోపేకాదా |
యెంచి నీకు జూడనది యిచ్చకమైనట్లుండు | తెంచరాని పొద్దు వొద్దు దిగులువో నాకు ||
చ|| భ్రమసి నేనుండగాను పట్టి నన్ను గాగలించి | తమకించే విది గొంత తగులే కాదా |
అమర శ్రీవేంకటేశ ఆదరించి కూడితివి | చెమటలు నీకు గాని సేసలువో నాకు ||

564) శంకరాభరణం
ప|| అలివేణిని బెండ్లాడవయా | చెలుల విన్నపము చేకొనవయ్యా ||
చ|| సొలపుల దొలి తొలి చూపులు | కొలదిమీర నుంకువలాయ |
చెలగి చేతులను సేసిన సన్నలు | తలపగ నలుగడ దలబాలాయ ||
చ|| ననుపున సెలవుల నవ్విన నవ్వులు | గొనకొనగ బాలకూళ్ళాయ |
అనువుగ ప్రియమున నాడిన మాటలు | మనసిజ తంత్రపు మంత్రములాయ ||
చ|| వేడుక కౌగిట వినయపు సేతలు | కూడిన కూటపు గురులాయ |
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి | తోడలమేల్మంగ దోమట్లాయ ||

565) శంకరాభరణం
ప|| దనుజులు గనిరి తత్వమిది | వనజాక్షుని కృప వసించనేలా ||
చ|| వారి పరమాత్ము డనాది పురుషుడు | సురలకు నరులకు సులభుడు |
హరి కోపముతో నన్యుల వరములు | సరిగా వెంచగ జగములలోన ||

చ|| వేదాంత విదుడు విష్ణుడు కృష్ణుడు | శ్రీదేవికి బతి శేఖరుడు |
పోది బరస్తుతి పుణ్యముకంటె | పాదుగ హరి దిట్టే పాపము మేలు ||
చ|| నారాయణు డున్న తు డచ్యుతు డు- | పకారుడు శ్రీవేంకటేశవిభుడు |
చేరి యీతడే శిక్షించ రక్షించ | వూరదయివములు వొగి నితని సరా ||

566) శంకరాభరణం
ప|| నీడల చూపులు నీకేలే యీ- | వాడక వాడెడి వడ నీకేలె ||
చ|| నిలువుల నటనలు నీకేలే యీ | నిలుగుల నడపులు నీకేలే |
నెలవుల కరగులు నీకేలే యీ | కులికెటి నునుసిగ్గులు నీకేలే ||
చ|| నెఱుల చెదురులివి నీకేలే యీ | నెఱవగు చదురులు నీకేలే |
నెఱతనపు సరులు నీకేలే యిదె | చెఱగున మూసెదు చెలి నీకేలే ||
చ|| నిక్కపు బోకులు నీకేలే యిదె | నిక్కలగంటివి నీకేలే |
నిక్కితి వొరపుల నీకేలే యిదె | దక్కె వేంకటోత్తముడు నీకేలే ||

567) శుద్ధవసంతం
ప|| కాలములారును గలిగి నీకు నిదె | బాలకి యందే పైపై నీకు ||
చ|| పతి కొప్పు విరులు జల జల రాలిన | లతల వసంతకాలము నీకు |
కతగా దన మైకాకలు చూపిన | అతి వేసవికాల మప్పుడేనీకు ||
చ|| కాగిటి చెమటల కడునిను దడిపిన | కాగల తొలకరి కాలమది |
వీగని చూపుల వెన్నెల చల్లిన | రాగిన మతికి శరత్కాలంబు ||
చ|| లంచపు బులకల లలన నీరతుల | కంచపు హేమంత కాలమది |
యెంచగ శ్రీ వేంకటేశ వలపుసతి | పంచ శిశిరకాల వైభవ మాయ ||

568) పూర్వగౌళ / గౌళిపంతు
ప|| ఇద్దరూ నెదిరించిరి ఇన్నిటికి మూలము | పొద్దు వొద్దుకు మనము బుద్ధి చెప్పనేటికే ||
చ|| సెలవి నవ్విన నవ్వు సిగ్గులకు మూలము | కలికి తనము కాకల మూలము |
పలుకులు లోలోనె పై కొనుటకు మూలము | వెలసె నన్ని పనులు వేగిరించనేటికే ||
చ|| కొనగోరి చెనకులు కోరికలకు మూలము | పెనగులాటలు కడు బ్రియమూలము |
తనివోని కొసరులు తమకముల మూలము | యెనసె దనంతదానె యెచ్చరించ నేటికే ||
చ|| మొగమొగాలు చూచుట మొక్కులకు మూలము | తగవులు కూటమికి దానెమూలము |
నిగిడి శ్రీ వేంకటాద్రి నిలయుడు సతినేలె | పగటున నిక వేరే బాసడుగ నేటికే ||

569) నీలాంబరి
ప|| ఉన్న వేమి గుఱిగావు వొద్దనుండి నీవునాతో | అన్న మాటలే గుఱుతు అప్పటికప్పటికి ||
చ|| చూపులకు గుఱుతు నీసోయగమైన మేను | తీపులకు గురి నీ తేనెమోవి |
కోపములకు గుఱి నీగోరి మదన రేకలే | చేపట్లకు గుఱి నీ చెట్టాపట్టాలే ||
చ|| చిత్తమునకు గుఱుతు నేసేటి నీచేతలే | హత్తి నాయాసకు గురి అంటుగాగిలి |
మొత్తపు నవ్వుకు గురి ముంచిన నీసుద్దులే | గుత్తపు వలపులకు గురి నీమోహములు ||
చ|| పంతముల కెల్లా గురి పరచిన పానుపే | సంతసములకు గురి సరసములే |
ఇంతలో శ్రీ వేంకటేశ ఇట్టె నన్ను గూడితివి | మంతనాల కెల్లా గురి మతి పరవశమే ||

570) దేశాక్షి/కాంభోజి
ప|| యేడనున్నదో యీతరుణి | చూడక చూచిన చూపులలోన ||
చ|| మేతల మరిగిన మీల పిల్లలకు | నింతల నేరిపె యీతరుణి |
కాంతాళించిన కన్నులనీళ్ళ | చెంతల నిండిన చెరువులతోడ ||
చ|| ముత్తెపు నవ్వుల మురిపెంబువ్వుల | యెత్తులేకట్టె యీతరుణి |
లత్తిక మోవికి లంచముగాపై | మెత్తిన దంతపు మెరగులలోన ||

**************************************************************************************************

చ॥ పసని చీకట్ల పలుమరుంద్రవ్వి । యిసుక పాతరవలె యీతరుణి ।
కసిగాట్ల వేంకటపతి కౌంగిట । రసముకొలుక నేరము లెన్ను చును ॥

571) దేసాక్షి/హుసేని

ప॥ వట్టి సిగ్గులిక నేల వనితల యెదుటకు । వెట్టదీరనేరము తెరవేతుమా యిద్దరికి ॥
చ॥ పలుకు దేనెల విందు పచ్చిమోవి బాగాలు । కలిగె నేడునీకు గాంతలవల్లను ।
పులక పువ్వులసేస బుసకొట్టు సురట్లు । నెలత చేకొనె నిదె నీవల్లను ॥
చ॥ సిరులనవ్వుల గందాలు చెమటలపన్నీరు । దొరకె నేడు నీకు తొయ్యలివల్ల ।
సరసపు బొంతనాలు సళుపుగోరి సొమ్ములు । నిరతి నాపెగూడె నీవల్లను ॥
చ॥ గబ్బి బొమజంకెనలు కళల మేనుంకువలు । అబ్బెను నేడు నీకు నంగనలవల్ల ।
గొబ్బున శ్రీ వెంకటేశుకూడితివి జవ్వనికి । నిబ్బరపు తమినిండె నీవల్లను ॥

572) దేవగాంధారి

ప॥ నమ్మితి జుమ్మీ వో మనసా నాకే హితవై మెలంగుమీ ।
ముమ్మాటికి నేజెప్పితి జుమ్మీ మురహరు నామమే జపించుమీ ॥
చ॥ తలచకుమీ యితర ధర్మములు తత్త్వజ్ఞానము మఱవకుమీ ।
కలగకుమీ యేపనికైనను కడు శాంతంబున నుండుమీ ।
వలవకుమీ వనితల కెప్పుడు వైరాగ్యంబున నుండుమీ ।
కొలువకుమీ యితర దైవముల గోవిందునినే భజించుమీ ॥
చ॥ కోరకుమీ దేహ భోగములు గొనకొని తపమే చేకొనుమీ ।
మీరకుమీ గురువుల యానతి మెఱయ బురాణములే వినుమీ ।
చేరకుమీ దుర్జన సంగతి జితేంద్రియుడవై నిలువుమీ ।
దూరకుమీ కర్మఫలంబును ధ్రువవరదునినే నుతించుమీ ॥
చ॥ వెఱవకుమీ పుట్టుగులకు మరి వివేకించి ధీరుడవగుమీ ।
మఱవకుమీ యలమేలమంగకు మగడగు శ్రీవేంకటపతిని ।
కెఱలకుమీ మాయారతులను కేవల సాత్వికుడవు గమ్మీ ।
తొఱవకుమీ నేరములకు సింధు రక్షకునినె సేవించుమీ ॥

573) సామంతం

ప॥ నానాభరణములనరసింహా । పూనినప్రతాపములనరసింహా ॥
చ॥ నగవులనెమ్మోమునరసింహా । పొగరుమించుటూర్పులనరసింహా ।
నగముమీదిఘననరసింహా । తగుకాంతులయందపునరసింహా ॥
చ॥ నళినేత్రశ్రీనరసింహా । పొలుపొందునఖంబులనరసింహా ॥
నలుదెసల మెఱయునరసింహా । వెలయుమూడుగన్నులనరసింహా ॥
చ॥ నమితసురాసురనరసింహా । కమనీయగుణాకరనరసింహా ।
నమోస్తుతే శుభనరసింహా । కమలాంక శ్రీవేంకటనరసింహా ॥

574) దేవగాంధారి

ప॥ చిత్తగించి మాపై దయసేతువుగాక । బత్తిగలవాడమిత పచ్చిసేయనేల ॥
చ॥ మక్కువ నీ పాదాలు మరిగిన దాన నేను । యెక్కువ తక్కువ మాట లికనేలా ।
చెక్కులు నీవు నొక్కగా సేద దీరినట్టిదాన । పక్కన నంతేసి వేరే పరాకులేలా ॥
చ॥ చేరి నీకు నే పొద్దు చెప్పినట్టు సేసేదాన । కూరిమినీలో వట్టి గుట్లేలా ।
మేరతో నీ సన్నలతో మెలగేటి యట్టిదాన । గారవించితివి నన్ను కడమ మరేలా ॥
చ॥ కందువ నీ కౌగిటికి గలిగిన యట్టిదాన । చందాలు సేసుక వట్టి జాగులేలా ।
యిందుకే శ్రీ వేంకటేశ యిట్టె నన్ను గూడితివి । చెందెను నీ దయ నాపై చింత లికనేలా ॥

575) దేవగాంధారి

**************************************************************************************************

ప॥ కలదు తిరుమంత్రము కలదిహము బరము। కలిమి గలుగు మాకు గడమే లేదు॥
చ॥ కమలాక్షు నీవు మాకు గలిగియుండగ భూమి। నమరలేని దొకటి నవ్వలలేదు।
నెమకి నాలుకమీద నీనామము మెలగగ। తమితో బరుల వేడ దా జోటులేదు॥
చ॥ శౌరి నీ చక్రము నాభుజము మీదనుండగాను। బూరవపు బగ లేదు యెదురూ లేదు।
చేరువ నీ సేవ నాచేతులపై నుండగాను। తీరని కర్మపు వెట్టిదినమూ లేదు॥
చ॥ అచ్యుత నీపై భక్తియాతుమలో నుండగాను। రచ్చల బుట్టిన యపరాధమూ లేదు।
నిచ్చలు శ్రీవేంకటేశ నీశరణాగతుండగా। విచ్చిన విడే కాని విచారమే లేదు॥

576) ఆహిరినాట/ఖరహరప్రియ

ప॥ అరుదరుదీగతి యహోబలేశ్వర। పొరిబొరి దాసులు పొగడుట యెట్లు॥
చ॥ యెదుట జింతించితివి హిరణ్యకశిపుని। అదెప్రహ్లాదుడు బంటగుటెట్లు।
కదిసిన రుద్రుని గర్వమడచితివి। గుదిగొని దివిజులు కొలుచుట యెట్టు॥
చ॥ ఘనసింహాకృతి గైకొని వుంటివి। యెనయగ గరి గాచినదెట్లు।
పవివడి కంబము పగుల వెడలితివి। మనుజులు పూజించి మరుగుట యెట్లు॥
చ॥ సరవితో వీర రసమున ముంచితివి। అరయగ శృంగారి వౌటెట్టు।
సిరివుర మెక్కెను శ్రీవెంకటాద్రిని । యిరవుగ నీ తొడ యెక్కుట యెట్టు॥

577) ఆహిరినాట/కాపీ

ప॥ నీవేల లేదనేవు నీ సతితోను। కావరించి పడుగాక కాదనకుమికను॥
చ॥ మచ్చికలు చల్లుచు నీతో మాటలాడి నీకు నేడు। ఇచ్చకము నెరపదా ఇందాకను॥
అచ్చమైన ఆపెనే పో అన్న సుద్దులెల్లా నేను। ముచ్చటగా మరియేల మూసి దాచే విపుడు॥
చ॥ వీడెమిచ్చి నీతోను వేసాలు వేసుకొంటా। యీడ నిట్టే వుండదా యిందాకను।
యేడనైనా గాని యాపె నిన్నిటా నే దిట్టితిబో। ఆడనీ వాదు లేటికి అణచేవు యిపుడు॥
చ॥ సరి నిన్ను గాగలించి సరసములాడు కొంటా। యిరవుకొని వుండదా ఇందాకను।
అరిది శ్రీవేంకటేశ ఆపెనే పో కొసరితి। గరిమ మమ్మేల వొక్కటిసేసే విపుడు॥

578) సామంతం / సామ

ప॥ పొడైన యెరుకతో బంధమోక్షములొక్క। గాడి గట్టుట తెలివి గానకే కాదా॥
చ॥ భావించి నిను బరబ్రహ్మమని వేదములు। వేవేలు విధుల మొరవెట్టగాను।
కేవలపు నిన్ను దక్కిన దైవములగూర్చి।సేవింపుటిది తప్పుసేయుటే కాదా॥
చ॥ సరిలేని నిను నుపనిషద్వాక్యములె పరా-। త్పరుడవని నలుగడల బలుకగాను।
వరుసతో బెక్కుదైవములు సంగడినిన్ను। తొరల గొలుచుట మహాద్రోహమే కాదా॥
చ॥ ఎందుజూచిన పురాణేతి హాసములు నీ-। చందమే యధికమని చాటగాను।
కందర్పజనక వేంకటగిరి స్వామి నీ-। కందువెఱగనిది యజ్ఞానమే కాదా॥

579) సామంతం /ఝుంఝూటి

ప॥ పొదలిన వీడెపుం బుక్కిళ్ళో తమ। చొదుకుల చెమటల చెక్కిళ్ళో॥
చ॥ ఆముకొని యధరామృత వేళల। మోముల మోముల మొక్కిళ్ళో।
కామినుల మకరికా పత్రమ్ముల। చిమక దొంతరల చెక్కిళ్ళో॥
చ॥ కయ్యపు గౌగిట కలికి రచనలను। నెయ్యపు బులకల నిక్కిళ్ళో।
ముయ్యని మోహపు ముచ్చట మురిపెపు। తొయ్యలి పాదపు దొక్కిళ్ళో॥
చ॥ మొలక లేనగవు మోముల గోళ్ళ। నులిమెటి వదనపు నుక్కిళ్ళో।
అలమేల్ మంగకు నా వేంకటపతి। తలపు లొసంగిన దక్కిళ్ళో॥

580) సామంతం / ఆహిరి

ప॥ ఎరవు గడు సత మాయె నిదియె కదవె। అరవీడుటే సొబగు లాయె దురుమునకు॥
చ॥ నిక్కముగ ననలమున నీరు జనియించె నను-। టిక్కడ నే పొడగంటి మిదియు గదవె।

************************************************************************************************

పొక్కుచును విరహాగ్ని బొరలగా జెలి మేన। జక్కబైపై బొడమె జవ్వాది చెమట॥
చ॥ కలుగు ననలంబు కడ గాలి యనగా నదియు। నెలమి నిచ్చట కలిగె నిదియె కదవె।
చెలగేటి చెలిమేన జిత్త జాగ్నికి దోడు। నిలువనియ్యక కలిగె నిట్టూర్పు గాలి॥
చ॥ నీడలు నెండలును నెయ్యమలరగ గూడు-। టిడ నే పొడగంటి మిదియె గదవె।
వేడు కలరంగ దిరు వేంకటేశ్వరు గూడి। వాడు దేరగ గలిగె వనిత పరవశము॥

581) సామంతం / హిందోళ

ప॥ వెన్న బట్టుకొని వెడనేలే నేతికి। కన్ను చూపులనతని గంతగమ్మనేరవా॥
చ॥ చేరి చేయిచేత బట్టి సిగ్గున బాసడిగేవు। పోరచి నీ విభుడెందు వోయీనేయింక।
సారెకు నీపయ్యెదలో చన్నులు దాచినట్లు। తారసిల్లి రమణుని దాచనేరవా॥
చ॥ వొంటి జిక్కించుక నీవు వొట్టుపెట్టుకొమ్మనేవు। దంటయై వేరొకతెను తగిలీనట్టే।
గంటువేసి పోకముడి గట్టిగా గట్టినయట్టు। వొంటిగాకుండా నాతని వొడిగట్టనేరవా॥
చ॥ మొక్కలాన గాగిలించి మోవిముద్రలు వేట్టేవు। వెక్కసా శ్రీవేంకటగోవిందుడు నీకు।
వొక్కమాటే కంఠహార మురమున గట్టినట్టు। చక్కని నీ మేని తోడ జంటసేయనేరవా॥

582) సామంతం / కాపీ

ప॥ ఇన్నిటా జాణవైతే నేమాయను। పన్ని చెఱకున బండు పండి నట్టె ఆయను॥
చ॥ అందరును మనవారె అంగనలు నీకు నేడు। యెందరు చుట్టాలయిన నేమాయను।
అందుకుగా నిజాలేల అమర జెప్పగ నేల। ఇందులోనే వుప్పొలికి ఇనుమడి ఆయను॥
చ॥ పనికి వచ్చిన వారె పాయపు వారెల్ల నీకు। యెనతురు గాక అందు కేమాయను।
వెనక ముందెంచనేల వెఱపులు మరియేల। ఘనముగ బాలు నీరు గలసి నట్టాయను॥
చ॥ తగినట్టి మేన వారే దండనున్న వారెల్ల। యెగ సక్కె లిందుకేల యేమాయను।
నగుతా శ్రీవెంకటేశ నన్ను గూడితి విప్పుడు। చిగురు తంగేటి జున్ను చేరినట్టె ఆయను॥

583) ఛాయానాట

ప॥ తానెరుగడటనే యీ తారుకారుణలెల్లాడు। రానీవే కాదనేనా రమణుని నీడకు॥
చ॥ తలపు సమ్మతించితే తనువు సమ్మతించును। వలపు గలిగితేనే వాడికె గలుగును।
చలము విడువకున్న సాదించవచ్చు బనులు। పలుకులు మంచివైతే పంతమును మంచిదే॥
చ॥ తగులు తప్పకుండితే తమకము తప్పదు। తెగువలు పుట్టితేను తెరకువా బుట్టును।
నగవులు నిండితేను నయము దోడన నిండు। తగవులు నిలిపితే తాలిములు నిలుచు॥
చ॥ చెనకులు మొనపితే సిగ్గులును మొనపును। ననుపులు మిగిలితే నమ్మికలు మిగులును।
యెనసి శ్రీవేంకటేశుడీడకే తావిచ్చేసీ। చనవు సతమైతేనే సరసమూ సతము॥

584) నాట

ప॥ అందుకే పోనీ నగద్రైతిమి। యిందరిని మొఱగేవు యేడ చొచ్చేదే॥
చ॥ పంతమే కావలె నొండె పతితో నిప్పటి వేళ। పంతమే కావలె గాక సటలేటిదే।
వంతులకు బెనగేవు వాదూలకు వచ్చేవు। యింతలో రెండూనైతే యేడ చొచ్చేదే॥
చ॥ నగవే రావలె నొండె నడుమ నీతని తోడి। తెగువ గావలెగాక తిట్టులేటిదే।
మొగమును జూచేవు మోనాన తలవంచేవు। యెగదిగ పోతలైతే నేడ చొచ్చేదే॥
చ॥ సిగ్గులే కావలె నొండె శ్రీవేంకటేశు నిట్టే। దగ్గరి కూడుటే కాక తచ్చ నేటిదే।
అగ్గమై కూడితివి అన్ని మాట లాడితివి। యెగ్గులు నెమ్మెలునైతే నేడ చొచ్చేదే॥

585) ఆహిరి

ప॥ నీయంతవారు గారు నిండుసామర్థ్యము లేదు। యీయహంకారపుముక్తి యీడేరీనా తమకు॥
చ॥ నీసేవలే సేసి నీకృప రక్షించగాను। ఆసల బొందేముక్తి అదిచాలక।
నీసరివారలై నీవే తామనుకొని। యీసుల బొందేముక్తి యీడేరీనా తమకు॥
చ॥ పొంచిన రాక్షసులెల్ల పూర్వదేవతలమంతా। యెంచుక పెట్టినమద మీగర్వము।

*******************************************************************************************

అచల గర్మమే సేసేరాయాదేవతల గూర్చి। ఇంచుకంతలోనే ముక్తి యీడేరీనా తమకు॥
చ॥ హరిలాంఛనపుభక్తి కందుకు నొదబడరు। సరి రోగికి బథ్యము చవిగానట్టు।
గరిమ శ్రీవేంకటేశు జ్ఞానమననివారికి। యెరవులనే ముక్తి యీడేరీనా తమకు॥

586) రామక్రియ
ప॥ ముందే తొలగవలె మోహపోక సంగమెల్ల। కందువ బోయిన నీళ్ళు కట్టగట్ట వచ్చునా॥
చ॥ అనలము బోడగంటే నండనున్న మిడుతలు। పనిలేకున్నా నందు బడ కుండీనా।
పొనిగి చెలుల గంటే పురుషుల చూపులెల్లా। ననిశము నందు మీద నంట బారకుండునా॥
చ॥ గాలపు బెట్టిల గంటే కమ్మి నీటిలో మీలు-। జాలి నా పసల జిక్కి చావకుండీనా।
అలరి బంగారు గంటే నందరి మనసులూను। పోలిమి నాపస జిక్కి పుంగుడుగా కుండ్నా॥
చ॥ చేరి ముత్యపు జిప్పల చినుకులు నిలిచితే। మేర తేట ముత్యములై మించకుండీనా।
ధారుణి శ్రీ వేంకటేశ దాసుల సంగతి నుంటే। పోరచి నే జీవులైన బుణ్యులు గాకుందురా॥

587) రామక్రియ / ఖరహరప్రియ
ప॥ ఇంతట నిట్టె విచ్చేసి యింతి గూడితే గనక। వంతుకు నిన్ను జాణదేవర వనవచ్చును॥
చ॥ తనలోనె తలపోసి తప్పక చూచేవేళ। వనితను దేవగన్య యనవచ్చును।
పనివి నిన్ను దలచి పాటలు పాడేవేళ। అనుగు గంధర్వకాంత యనవచ్చును॥
చ॥ చలపట్టి విరహాన జలకేళి సేయువేళ। అలివేణి నాగకన్య యనవచ్చును।
చలువకు చంద్రకాంత శిలపై బొరలువేళ। అలరిన చంద్రకన్య యనవచ్చును॥
చ॥ శ్రీ వేంకటేశ నీవు చెలియ గూడినవేళ। ఆవటించి నిజలక్ష్మి యనవచ్చును।
వోపల నీ సొమ్ములలో వురమున మోచువేళ। దేవియలమేలుమంగ దిష్టమనవచ్చును॥

588) రామక్రియ / బహుదారి
ప॥ అన్నిటికి మూలం బతడు। వెన్నుని కంటెను వేల్పులు లేరు॥
చ॥ పంచ భూతముల ప్రపంచ మూలము। ముంచిన బ్రహ్మకు మూలము।
పొంచిన జీవుల పుట్టుగు మూలము। యెంచగ దైవము యితడే కాడా॥
చ॥ వెనుకొని పొగడేటి వేదాల మూలము। మునుల తపములకు మూలము।
గన యజ్ఞాదుల కర్మపు మూలము। యెనలేని దైవమితడే కాడా॥
చ॥ అగపడి సురలకు నమృత మూలము। ముగురు మూర్తులకు మూలము।
నగు శ్రీ వేంకట నాథుడె మూలము। యెగువ లోకపతి యితడే కాడా॥

589) బౌళి రామక్రియ/కాంభోజి
ప॥ అన్నిటా ఘనుడు దాను అందుకేటిదే। వున్నట్టె చెప్పగదరే వూరకుండనేలా॥
చ॥ చెలుల దా నంపినాడు చెంత నే రాకుండగాను। అలిగి వుందాన దొల్లె అందుకేటిదే।
కలగి ముంగోపమున కాని వొట్టువెట్టుకొంటి। పిలిపించరాదు నాకు పిన్నదాననేను॥
చ॥ ముంచి లేక లంపినాడు మొక్కితి నే నన్నాడు। యెంచితే నెంతయిన గద్దు యేమందునే।
పంచుక యిందరిలోన బంతమెల్ల నాడుకొంటి। అంచల నాకు రారాదు ఆటదాననేమి॥
చ॥ సంగడి గూచున్నాడు చనవెల్ల నిచ్చినాడు। యెంగిలి మోవడిగీని యేమందునే।
సంగతై శ్రీవేంకటేశ్వరుడిట్టె నన్ను గూడె। చెంగట మెచ్చగరాదు సిగ్గుతోడి నేను॥

590) సారంగ
ప॥ ఒక్కడే దైవం బున్నతు డితడు। తక్కిన తలపులు తప్పు దెరువులు॥
చ॥ పురుషుల కెల్లా బురుషోత్తముడు। సురేంద్రాదులకు సురేంద్రుడు।
హరునికి నజునికి నవ్వలి మూరితి। హరి యితడే పరమాత్ముడు॥
చ॥ వేదాంతంబుల వేద్యు డీతడు। ఆదికి నాదియు నన నితడే।
మేదిని నరులకు మేది నీశ్వరుడు। యేదెస జూచిన నీశ్వరు డితడే॥
చ॥ యెక్కువలకెల్ల నెక్కువ యీతడు। మక్కువ మరునికి మరుడితడు।

*******************************************************************************************

యిక్కడ శ్రీవేంకటేశుడై మిగుల। పక్కన నిదివో ప్రత్యక్షమితడు॥

591) మోహన

ప॥ విన్నపము సేయుమనె వేడుకతో నీకు మమ్ము। చెన్ను మీరి నట్టాయింతి చెలులము సుమ్మీ॥

చ॥ చిత్తమురా నీకు నాకె సేవలు సేయనేరుచు। మొత్తముగా బాదాలకు మొక్కనేరుచు।
పొత్తుకు దీసి నిన్ను పొగడగ నేరుచు। ఇత్తలనేమి సేసేవు ఇంటికి రారాదా॥

చ। ఇచ్చకము సేసి నిన్ను నియ్యకొలుప నేరుచు। నచ్చుదీర నీతోను నవ్వనేరుచు।
పచ్చిసేతలకు నిన్ను పనిగొని నేరుచు। ఇచ్చితిని చనవులు యింటికి ర్రాదా॥

చ॥ అలమేలు మంగ యీకె అంకె గూడగ నేరుచు। పొలతి శ్రీవేంకటేశ భోగించ నేర్చు।
అలరితి రింతలోనె ఆకె నీవు నిద్దరును। యెలమితో నిట్లానే యింటికి రారాదా॥

592) ద్విజావంతి

ప॥ లాలి శ్రీకృష్ణయ్య నీలమేఘవర్ణ నవనీలమేఘవర్ణ। బాలగోపాల పవ్వళించరా॥

చ॥ శృంగారించిన మంచి బంగారుయ్యాలలోన బంగారుయ్యలలోన। శంఖుచక్రధర స్వామి నిదురపోవరా॥

చ॥ సద్దుశాయకురా ముద్దునాకివ్వరా, బాల ముద్దునాకివ్వరా। గద్దరి వగలుమాని నిదురపోవరా॥

చ॥ లలితాంగి రుక్మిణి లలనయే కావలెనా, నీకు లలనయే కావలెనా। పలుకుల కోయిల సత్యభామయె కావలెనా॥

చ॥ నన బోణి ఒక బీబి నాంచారు కావలెనా, బీబి నాంచారు కావలెనా। దినము సమ్మతము పేరిందేవి కావలెనా॥

చ॥ అలుకలు పోనేల అలమేలు మంగతో, శ్రీ అలమేలు మంగతో। కులుకుచు శయనించు వేంకటేశ్వరుడా॥

చ॥ ఎవ్వరు కావలెనయ్యా యిందరిలో నీకు, మరి యిందరిలోన। నవ మోహనాంగ నా చిన్ని కృష్ణయ్య॥

చ॥ శృంగారాకార సుభద్రయే కావలెనా, సుభద్రయే కావలెనా। యిందీవరాక్ష కాళిందియే కావలెనా॥

చ॥ పగడాల పతకాళు కంఠాన ధరియించి, నీ కంఠాన ధరియించి। ఒంగేవు తొంగేవుర నిదురపోరా॥

చ॥ అందెలు మువ్వలు సందడిగా మ్రోయగను, అతి సందడిగా మ్రోయగను। అందముగా నీవు పవ్వళింపరా॥

593) తోడి

ప॥ మెచ్చితిమి నిన్నును మేలు వాడవౌదువు। నిచ్చలు నా కన్నిటాను నీవే గురిగాక॥

చ॥ చేసుకొన్న మగడవు చేకొనక మానేవా। వాసితోడ రక్షించేదె వైపు గాక।
ఆస గొలిపినవాడ వట్టె రాక మానేవా। బాస దప్పకుండేదే పంతముగాక॥

చ॥ ప్రియమైనవిభుడవు బెరయక మానేవా॥ క్రియతో మన్నించుటే కీరితిగాక।
నియతమైనవాడవు నెట్టుకొనక మానేవా। జయముగా నేలుటే సంగతి గాక॥

చ॥ శ్రీవేంకటేశుడవు చేరి కూడక మానేవా। కైవసమై వుండినదే ఘనత గాక।
యీవల నన్నేలితివి ఇచ్చగించక మానేవా। యేవల్లా జన విచ్చుటే యెక్కుడుగాక॥

594) తోడి

ప॥ మరిగిన నీకేకాక మాకేలరా। తెరమఱంగితే నీవు తీసివేయనేలరా॥

చ॥ ఆడకురా నాముందర ఆకెగుణములు సారె। గోడ గడుగ నసలే కుప్పవడీని।
వోడక నీకితవైతే వుట్టి గట్టు కుందు గాని। సూడు బంటుతో బలాలు చూపి చెప్పనేలరా॥

చ॥ ఎంచకురా ఆకెపొందు యెక్కుడుగా నాయెదుట। యెంచబోతే మంచము కిందింతా నుయ్యే।
కంచముపొత్తు గలిగితే కలవెల్లా నితవుగా। నించుక జలిలేకున్నా నెండగాయనేలరా॥

చ॥ కప్పకురా ఆకెచీర గట్టుకొంటి వదెనీవు। వుప్పాలికి యినుమడౌ నొద్దికైతేను।
యిప్పుడె శ్రీవేంకటేశ యిటునన్ను గూడితివి। దప్పికి నీరేకాక తగనీ నెయ్యేలరా॥

595) సామవరాళి

ప॥ ఏమని విన్న వించేము యిట్టె కనుగొనవయ్యా। మోమున జేతులలోన మొక్కులున్నవి॥

చ॥ నెలత మనసులోన నిండువలపులున్నవి। సెలవి నవ్వులలోన సిగులున్నవి।
తలిరుమోవి మీద తరి తీపులున్నవి। కలువ కన్నులలోన కాంక్షలున్నవి॥

చ॥ అంగన మాటలలోన నడియాస లున్నవి। రంగగు చన్నులపై కరగులున్నవి।
అంగపు సేవలలోన బ్రియములెల్లా నున్నవి। సింగారపు గొప్పమీద సేసలున్నవి॥

చ|| కప్పి యలమేలుమంగ కౌగిట నీ మేనున్నది। చిప్పిల జెక్కులమీద చిహ్నాలున్నవి।
యిప్పుడె శ్రీవేంకటేశ యిద్దరును గూడితిరి। నెప్పున నీకె వేల నీ వుంగర మున్నది॥

596) భూపాళం

ప|| ఏమని విన్నవించేనే యిక దనతో నేను।సేమాన వచ్చెగా నన్ను జిత్తగింపు మనవే॥
చ|| మక్కువ దనపై నా మతి తలపోతలకు। చెక్కుపై నిడుకొన్న నాచెయ్యే సాక్షి।
అక్కరతో విరహపు టసు రుసుములకును। ముక్కున బెట్టిన నా ముత్తెమే సాక్షి॥
చ|| తన్ను బాసి నిద్రలేక తగవేగించి నందుకు। కన్నుల నుండిన యట్టి కాటులే సాక్షి।
వున్నతపు గోరికల నుమ్మగిలినందుకు। పన్నీటి చెమటల పయ్యదే సాక్షి॥
చ|| నిబ్బరపు బరపుపై నే బొరలాడినందుకు। గుబ్బల గంధపు బేంట్లగురుతు లే సాక్షి।
పబ్బి యలమేల్మంగపతి శ్రీవేంకటేశుడు। అబ్బురాన నన్నుగూడే యానందమే సాక్షి॥

597) భూపాళం

ప|| ముదమలర కాలముల మీరిటు మోసపోక। హృదయమలర భజింపరో మీ-।
రిటు ధనుర్మాసముల విధులన్॥
చ|| వేగ నాలుగు ఘడియ లనగా। వేద వేద్యులు లేచి సరగున।
ఆగమోక్త విధులను తమ దేహాను గుణములుగా। వేగమున సంధ్యాదులొగి గా-।
వించి విమలాంబోధి శయనుని। బాగుగా బూజించరో యెడ-।
పక ధనుర్మాసముల విధులనె ఘనులు॥
చ|| పరగు చీనాంబరములను నతి-। పరిమళమ్ముల బుష్పముల కడు।
వెరవుగా వేంకటపతికి నైవేద్య సంగతుల। అరుదుగా ధూపముల బహు దీ-।
పాదులను తాంబూల విధులను। పరగ బూజింపుడు సమస్త।
ప్రభు ధనుర్మాసముల విధులన్ ఘనులు॥

598) ధన్యాసి

ప|| నీవు మన్నించగా నే నింతయితి గాక। కావరించి నీతో నవ్వగలనా నేను॥
చ|| ఘనుడ విడె మియ్యగా కాదన రాదు గాని। చెనకి నీ సొమ్ములంట చెల్లునా నాకు।
చనవిచ్చి మాటాడగా జాలు ననరాదు గాని। తనర నీతో నేక తాలదాననా॥
చ|| వరుస నీవు రాగా వద్దనగా రాదు గాని। తర మెరిగి రప్పించ దగునా నాకు।
వొరసి చేయి వేయగా నోప ననరాదు గాని। సరి నింత దీమసపు సతినా నేను॥
చ|| నీవు కౌగిట గూడగా నేమనరాదుగాని। యీవేళ మందెమేళా వెమ్మెలా నాకు।
శ్రీవేంకటేశ నీవు సేసినట్టే సేతుగాని। చేవదేర మెచ్చి సంతసించిచ కుండగలనా॥

599) ధన్యాసి

ప|| నేనైతే నేమీ నెరగ నీకు నీవే బెదరేవు। తానే బయట బడేని తగని నీ చేతలు॥
చ|| కొండవంటి దొర నిన్ను గోరి వెంగె మాడుదునా। దుండగము నీకు నీకే తోచీ గాకా।
అండకువచ్చి నీ గుట్టు అరయగ వచ్చితినా। వుండుండి నీకు నీవే వులికేవు గాక॥
చ|| నడుమను నిన్ను జూచి నవ్వులు నవ్వితినా। వడి నీకు నీవే తలవంచేవు గాక।
వెడనీమేని చేతలు వెదకి చూచితినా। తడవి కప్పుక నీవే దాచేవు గాక॥
చ|| నీవు గాగిలించుకోగా నేరము బెంచితినా। భావించ నీవే సిగ్గుపడేవు గాక।
యీవేళ శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడితివి। కోవిదుడవై రతిగొంకేవు గాకా॥

600) ధన్యాసి

ప|| ఊరకే నీశరణని వుండుటే నాపనిగాక। యీరీతి నావుపాయము లేడ కెక్కీనయ్యా॥
చ|| ముందే అంతర్యామివై మొగి నాలో నుండగాను। చెంది నిన్ను లేనివానిజేసుక నామనసులో।
గొంది నీయాకారముగా కొంత నే భావించుకొంటా। ఇందు గల్పిత ధ్యానము లెట్టు చేసేనయ్యా॥
చ|| కన్నులు జూచినందెల్ల కమ్మి నీవై యుండగాను। అన్నిటా బ్రత్యక్షమందు అభావన చేసుకొని।

******************************************************************************

విన్ననై తెలియలేక వేరే యెందో వెదకుచు । పన్నినప్రయాసాల బడనేటికయ్యా ॥
చ॥ శ్రీవేంకటాద్రిమీద శ్రీపతివై కొలువుండి । ఆవటించి తలపులో నచ్చొత్తి నట్టుండగాను ।
దేవు డెట్టివాడంటా తెగనిచదువులందు । పోవలుగా నింకనేమి సోదించేనయ్యా ॥

601) ఆహిరి
ప॥ పారకుమీ వో మనసా పంతము విడువకుమీ మనసా ।
పారిన నీవే బడగయ్యేదవు చేరువ నాడే చెప్పెవె మనసా ॥
చ॥ చింతించకుమీ శివునివిరిచే చిక్కువడకుమీ వో మనసా ।
కంతు వారకము వయసు బ్రాయములు కావటికుండలు వో మనసా ।
యెంత మేలూ గీడేకాలము ఎప్పుడు నుండదు వో మనసా ।
సంతరించుకో వానిని మనసున సంతోషముగా వో మనసా ॥
చ॥ ఎన్నికలే తలపోయకుమీ యేమరకుండుమి వో మనసా ।
కన్న విన్న వారిలో నెప్పుడూ కాకపడుకుమీ వో మనసా ।
పున్నమ మాసలు పుడమిలొ బదుకులు పోయివచ్చేవి వో మనసా ।
మిన్నో నేలని మన్న దినములో మీదు చూడకుమి వో మనసా ।
చ॥ కన్నుల సంగాతము సేయకుమీ కళవళించకుమి వో మనసా ।
వన్నెలమాటలు చెవుల బెట్టక వాసి విడువకము వో మనసా ।
మున్నిటి సురలు బ్రహ్మాదులకైనను ముక్తిసాధనము వో మనసా ।
వెన్నుని వేంకటగిరిపతి దలచుము వేసారకుమీ వో మనసా ।

602) సామంతం / శహన
ప॥ గోవిందు దాసులమై కొనకెక్కుదుముగాక । వేవేలువిధుల నమ్మి వెతబడగలమా ॥
చ॥ మనసులోపలిమర్మము దెలియలేము । ఘనుడైనహరి నెట్టు గానగలము ।
తనువుతో భోగాలు తగులు వీడగలేము । వెనకకర్మపాతాలు వీడించుకోగలమా ॥
చ॥ వడిబెట్టే యింద్రియాల వద్దని మానుపలేము । తొడరి సంసారము తోయగలమా ।
బడిబడి నానాటిబతుకు చెప్పుకోలేము । పొడలేటియితరుల బోధించగలమా ॥
చ॥ కొంకక ఆడినమాట గురుతువెట్టగలేము । లంకె వేదవాక్యము దలచగలమా ।
యింకా శ్రీవేంకటేశు డితడే మాదేవుడు । సంకెలేకుందుముగాక జాలిబడగలమా ॥

603) బౌళి / రేవతి
ప॥ పుట్టుగులు నొక్కటే పుణ్యపాపములే వేరు । యెట్టుసేసినా జేసీ నేమి సేయగవచ్చును ॥
చ॥ పగలే రేయి యీబడి గొన్ని జీవులకు । వొగి నారేయి పగలౌ నొకరికిని ।
తగుదైవ మొకడే తమమతములే వేరు । పగటుల విష్ణుమాయ భ్రమయించీ నిదివో ॥
చ॥ నిలువెల్లా జేదే వెరి గొన్నివృక్షములు । కలదెల్ల దీపె కమ్మర గొన్ని ।
తలపున నొకటే తత్వములే వేరువేరు । చెలరేగి విష్ణుమాయ చిక్కువెట్టి నిదివో ॥
చ॥ ఇహమే పరము యెరిగితే గొందరికి । మహి బరమే ఇహము మరొకరికి ।
వహితో శ్రీవేంకటేశు వలెనని కొలిచితే । సహజపువిష్ణుమాయ జారిపోవు నపుడే ॥

604) కన్నడగౌళ
ప॥ దైవమా నీవే యిందు దయ దలచుటగాక । తోవనున్న జీవు లెట్లు తోసేరు నీమాయ ॥
చ॥ పలుచవులందునెల్ల ప్రాణమే మిక్కిలి చవి । బలిమి తీపులలోన బ్రాణమే తీపు ।
యిలపై బూజ్యులలోన నింతులే కడుబూజ్యులు । తలచి జీవులు యెట్టు దాటేరు నీమాయ ॥
చ॥ తగుచుట్టరికాలలో ధనమే చుట్టరికము । జగతి గట్టనికట్టు సంసారము ।
వగలైనగుణాలలో వైరమే నిజగుణము । జిగి బ్రాణు లెట్లు గెలిచేరు నీమాయ ॥
చ॥ తమలో నెవ్వరికైనా తమజాతి తమనేర్పు । తమకు నెక్కుడై తోచు తక్కువెవరు ।
నెమకి శ్రీవేంకటేశ నీదాసులకే కాని । భ్రమసినజీవులెల్లా బాయరు నీమాయ ॥

******************************************************************************

605) లలిత
ప॥ తెలిసినవారి కింతా దేవుడై యుండు। కలడన్న చోట హరి గల డటుగాన॥
చ॥ అందు నిందు బోయి శ్రీహరిని వెదకనేల। బొందితోడిరూపులెల్లా బొరి నతడే।
కొందరిలో నుండి ఇచ్చు గోరినట్టియాపులెల్ల। కొందరిలో మాటలాడు గొందరిలో నగును॥
చ॥ లోన వెలి జూచి పరలోకము వెదకనేల। యేనెలవైన వైకుంఠ మెదుట నదె।
పూని వొకచోట నెండ పొడచూపు నక్కడనే। నానినవెన్నెల గాసు నానారీతులౌను॥
చ॥ చొక్కి చొక్కి యానందసుఖము వెదకనేల। మక్కువ దా శాంతుడైతే మతిలో నదె।
యెక్కువతో శ్రీవేంకటేశ్వరుదాసుడ నైతి। వొక్కడే మాకన్నిటికి నొడయడై నిలిచి॥
606) భవుళి / హుసేని
ప॥ ఇంక మాబోంట్ల కేది విధో। కింకరులమనియెడిగెలుపేకాక॥
చ॥ యెవ్వరు గడచిరి యింతకతొలుతను। నిప్పటిల్లు హరి నీమాయ।
నవ్వుచు నీశరణాగతి నమ్మిన। మువ్వంక శుకాదిమునులేకాక॥
చ॥ కన్న వారెవరు ఘనవైకుంఠము। వున్న తమగునీవురుమహిమ।
మున్ను నిపుడు నీ ముద్రలు మోచిన। అన్నిటా ఘనసనకాదులుగాక॥
చ॥ తెలియువారెవ్వరు దివ్యజ్ఞానము। చలనముగా జెప్పుశాస్త్రములు।
యిలలో శ్రీవేంకటేశ నీ వారై। చెలగిరి శేషాదిజీవులుగాక॥
607) సాళంగనాట / అఠాణ
ప॥ ఎందరు కలిగిన నితనిలోనే। ముందు వెనుకలను ముఖ్యంబితడే॥
చ॥ భవవిదూరు డాపద్బంధుడు హరి। వివరించి కొలువ వేల్పితడు।
కవతో లక్ష్మీకాంతు డితడు। రవిశశినేత్రుడు రక్షకుడు॥
చ॥ కలిదోషహరుడు కారుణ్యనిలయుడు। వలెనువారికి వరదుడు।
వలపులోనగలతత్వం బితడు। సులభు డిత డరసిచూచినను॥
చ॥ శ్రీవేంకటేశుడు చిత్తజగురుడు। యేవలజూచిన నితడే।
గోవిందు డితని గొలిచితిమిదివో। తోవయు గంటిమి తుదకెక్కితిమి॥
608) శుద్ధవసంతం
ప॥ కనుగొననిది హరికల్పితము। తనకు నిందులో తగినంత॥
చ। నానాభేదములు నరులగుణంబులు। నానారుచు లివి నవపదార్థంబులు।
ఔననేదేది యటు గాదనేదేది। వానివానివిధి వలసినయట్టు॥
చ॥ నడచు బ్రపంచము నడపేవిధములు। నడచు మాయ లెన్నగరావు।
విడిచేటి వేటివి విడువని వేటివి। పడగబడగ నవి పరచినయట్లు॥
చ॥ తెగనికర్మములు దేహధర్మములు। తెగనియాస లివి దినదినము।
తగు శ్రీవేంకటదైవము దాసులు। నగుదు రన్నిటిని నటనలు చూచి॥
609) వరాళి
ప॥ అరిగాపులము నేము అంతర్యామివి నీవు। యిరవై నీచెప్పినయట్టు యేమిసేతుమయ్యా॥
చ॥ గాలి ముడిగట్టినట్టు కాయము మోచితిమి। కాలము గొలిచితిమి కనురెప్పల।
జాలి రొప్పితిమి వట్టిసటలనే యేపొద్దు। యేల మెచ్చ వింకాను యేమిసేతుమయ్యా॥
చ॥ చుక్కలు లెక్కించినట్టు చూడగ మాజన్మములు। వుక్కున గర్మములకు వొడిగట్టితిమి।
తెక్కులను వెంట వెంట తిరిగేము బంట్లమై। యెక్కువాయ వెట్టి మాకు నేమిసేతుమయ్యా॥
చ॥ వాలు వొంగినటువలె బాయము మోచితిమి। నాలుక కెక్కినవెల్లా నమలితిమి।
యీలీల శ్రీవేంకటేశ ఇంత సేసితిమి। యేలినవాడవు ఇంకా నేమిసేతుమయ్యా॥
610) శంకరాభరణం
ప॥ మిగిలిన దేమిక మీదట దేహికి। అగపడు వొక పడెడన్నంబు॥
****************************************************************************************************

చ॥ రతి బగటివెలుగు రాత్రిచీకటికి। సతము గాదు అది సరికి సరి।
అతిభోగములకు నార్జించుటకును। చతురపుసంపద సరికి సరి॥
చ॥ అలయపథ్యమున కౌషధము గొనుట। చలువకు వేడికి సరికి సరి।
నిలచినపుణ్యము నిండుబాపములు। జలువు వెలపులకు సరికి సరి॥
చ॥ మహి మరణములకు మరి పుట్టుగులకు। సహజ మందరికి సరికి సరి।
యిహమున శ్రీవేంకటేశ్వరు డాత్మకు। సహకారి యతడు సరికి సరి॥

611) ముఖారి
ప॥ కలలోన నిట్లనే కాపురము నిట్లనే। నిలుపు గల్లందమో నిజమందమో॥
చ॥ వొక్క నాటిప్రపంచము వొక్కనాటివలె రాదు। వొక్కనిముషమువలె నొకటి గాదు।
పక్కన మాయమై పోవు బడిబడినే వచ్చు। నెక్కొని కల్లందమో నిజమందమో॥
చ॥ పొద్దు వొడచేది గొంత పొద్దు గూకేది గొంత। చద్ది గొంత వేడి గొంత చవులు గొంత।
వొద్దనే కాలము నుండు వుండుండి దవ్వయిపోయి। నిద్దపుగల్లందమో నిజమందమో॥
చ॥ పాపపుణ్యా లంటెనంటా బాయవు సుఖదుఖాలు। పైపై ననుభవించ బరసిపోవు।
యేపొద్దు శ్రీవేంకటేశు డెదలోనేవున్నాడు। యేపున గల్లందమో యిది నిజమందమో॥

612) నారాయణి
ప॥ ఏటివిచారము యెక్కడి యాచారము। మాటున జీవు డింతేసి మాయల బొరలును॥
చ॥ పరగ నూరేండ్లబ్రతుకునకే కా-। ధర నన్నియును గూర్చి దాచుకొనేది।
పొరసి నానాసుఖభోగాలు చింతించుగాని। పరమున కేపాటిప్రయాస పడడు॥
చ॥ కడుపు నించుకొరకు గామసుఖమునకే కా-। చెడనువుద్యోగాలు సేయగోరును।
మిడిసి లోకములలెల్ల మెప్పించ నడచుగాని। చిడుముడి హరి మెప్పించే ననలేడు॥
చ॥ సారె సారె జచ్చి చచ్చి జననము వొందేదెల్లా। వూరగలకర్మము లొగి జేయుట।
మేరలేక నరులను మెచ్చుగ గొలుచుగాని। కూరిమి శ్రీవేంకటేశు గొలువగలేడు॥

613) గుండక్రియ
ప॥ అంతయు నతనిమహామహిమే ఆత-। డెంత సేసినా నెట్టయిన నవును॥
చ॥ రావలెనన్నవి రాక మానవు। పోవలె నన్నవి పోకుండవు।
ఆవలనీవల నలమటలేటికి। దైవమొక్కడే తగిలినగుఱుతు॥
చ॥ కాయపుగుణములు కలిగిననే భువి-। నీయెడ జీవుడు యిటు గలడే।
ఆఉయమిందు గాదవునన నెవ్వరు। కాయజగురు డొక్కడే ప్రేరకుడు॥
చ॥ అంతరంగమే యాత్మజ్ఞానము। వింతగు వెలుపల వెడమాయ।
చింతించి రక్షించ శ్రీవేంకటేశుడు। మంతుకెక్కె నిక మతకములేల॥

614) శ్రీ
ప॥ ఓహో నిలిచిన దొకటిదియే। శ్రీహరిసాకార చింతనము॥
చ॥ పంచమ వేదపు పద్మాక్షు నామము। అంచె బాపహర మౌషధము।
పంచల బీతాంబరుశరణాగతి। ముంచినయజ్ఞానమునకు దీపము॥
చ॥ విందులకుడుపులు విష్ణుకీర్తనము। చందలువైకుంఠ సంబళము।
పొందుగ నచ్యుతుబూజించుపూజలు। కిందట గొనకెక్కెడినిచ్చెనలు॥
చ॥ కట్టినముడుపగు ఘనకృష్ణభక్తి। ముట్టిన పాపవిమోచనము।
యిట్టె శ్రీవేంకటేశ్వరకృప యిది। పట్టినవారికి బలుపగుకొమ్మ॥

615) శంకరాభరణం
ప॥ వేదము దీర్చదు వేరే శాస్త్రములు। యేదియు దీర్చదు యిది నీమాయ॥
చ॥ నీవల్ల బ్రదికిరి నిండుదేవతలు। నీవల్ల నసురలు నెఱిజెడిరి।
ఆవల నిందరి కాత్మవు నీవే। చేవదేరె నీచిక్కులే భువిని॥

చ॥ నెమ్మి బాండవులు నీవారంటివి । కమ్మర విడిచితి కౌరవుల ।
యిమ్ముల నీవావి యిద్దరికొకటే । తెమ్మలాయ నీతీరనిచిక్కు ॥
చ॥ జగమున నీదే స్వతంత్రమెల్లా । నెగడినజీవులు నీవారు ।
తగు శ్రీవేంకటదయివమ యన్నియు । తెగి నీదాసులు తెలిసినచిక్కు ॥

616) సాళంగనాట
ప॥ చేకొని కొలువరో శ్రీనరసింహము । శ్రీకరమగు నిదె శ్రీనరసింహము ॥
చ॥ వెడలేటివూర్పులు వేడిమి చల్లీ । చిడిముడికోపపు శ్రీనరసింహము ।
గడగడవడ కేటిగండస్థలములు । జెడలు గదలిచీ శ్రీనరసింహము ॥
చ॥ వంకరగోళ్ళవైపులు వెదకీ । చింతచూపులను శ్రీనరసింహము ।
హుంకారముల నుదధులు గలచీ- । నంకెల శ్రీపతియగు నరసింహము ॥
చ॥ వదనము దిప్పుచు వడి నసురమేను । చిద్రుపలు చేసెను శ్రీనరసింహము ।
అదివో శ్రీవేంకటాద్రి యెక్కి యిటు । చెదరక నిలిచెను శ్రీనరసింహము ॥

617) వరాళి
ప॥ అతనిలోనే యణగె నన్నియును । కతలెన్నైనా గలవు కమలాక్షు గనరో ॥
చ॥ యిసుక లెక్కవెట్టితే నెంతైనా గలదు । ఆసముదించనిపుణ్యా లటువంటివే ।
పసగానిపెక్కు దేవతల గొలుచుకంటే । సుసరాన హరివారై సుఖయించరో ॥
చ॥ గోడ గడుగగ బోతే గొనదాకా రొంపే । ఆడుకోలుతర్కవాదా లటువంటివే ।
వాడిక నారుమతాలవాడై తిరుగుకంటే । యీడనే శ్రీపతివారై యీడేరరో ॥
చ॥ మనసున బాలు దాగితే మట్టులేదు మేర లేదు । అనుగుసంసారభోగా లటువంటివే ।
దినదినతపముల దీదీపులవుకంటే । తనిసి శ్రీవేంకటేశుదాసులై బ్రదుకరో ॥

618) సౌరాష్ట్రం
ప॥ మరల విచారించితే మంచముకిందే నుయ్యి । శిరుల హరివారైరి శివాదులు ॥
చ॥ ఆడేటిమాటలకెల్ల నాది నంతము లేదు । వీడనికర్మములకు విధి లేదు ।
రాటుపడ్డమనసుకు దైవము విష్ణుడేయని । పాడి కొలిచిరి తొల్లి బ్రహ్మాదులు ॥
చ॥ పుట్టిపడేజన్మముల కూరట యెందూ లేదు । కట్టిడి ఇంద్రియాలకు గతి లేదు ।
తట్టువడ్డజీవునికి దైవము శ్రీహరియని । యిట్టె మొరయిడిరి యింద్రాదులు ॥
చ॥ కప్పినయీమాయలకు కడవ రెందూ లేదు । తిప్పనిహరిభక్తికి దిరుగు లేదు ।
వొప్పుగా శ్రీవేంకటేశు డొక్కడే దైవమని । చొప్పువట్టి కొలిచిరి శుకాదులు ॥

619) సామవరాళి
ప॥ ఏవల్ల నౌగాములిక నేవి అన్నియు నీలోనే । శ్రీవల్లభుడ నిన్ను జేరితిమి నేము ॥
చ॥ సగుణనిర్గుణములును సావయవనిరవయన- । మగుదర్క వాదకలహములు ఘనము ।
జగములో చదువులును సంశయంబేకాని । తెగనీదు నీమాయ తెలియవసమా ॥
చ॥ వేదమార్గము గొంత వేదబాహ్యము గొంత । పోదిమతములవారిపోరు ఘనము ।
పాదైనమునిరుషులు బహుముఖములేకాని । సోదించి వొకమాట చూపంగలేరు ॥
చ॥ వెస గర్మ మొకవంక విజ్ఞాన మొకవంక । పసగావు రెంటిబలవంతములును ।
వసుధ శ్రీవేంకటేశ్వర నీవు గావు మిక । ముసుగు వెట్టినవాదు ముగియదెంతైనా ॥

620) బౌళి
ప॥ సర్వాత్మకుడవు సర్వేశ్వరుడ నా- । పూర్వాపరాలు నీకే భువి సమర్పయామి ॥
చ॥ వేగిలేచి నే జేసే పెడచేత నీ చేతే । ఆగడపుమాటాడిన నది నీ మాటే ।
ఆగము భోగములు నా యన్నపానాదులు మరి । శ్రీగురుడ నాలోని చింతయు నీ చింతే ॥
చ॥ కోపము శాంతములును గుణావగుణము నా- । చూపును నీ సాకారరూపమే ।
పాపపుణ్యములు నా ప్రాణవాయువులును । శ్రీపతి నా సంసారసేవయు నీసేవే ॥

చ|| ఉదయాస్తమపుదినా లున్నాడ నీ దినములే। యెనుము నేను నీ వాడ నింతా నీవె।
అదివో శ్రీవేంకటేశ అంతరియామిని నీవే। నిదుర మేల్కొనుటయు నీ మహిమే॥

621) లలిత
ప|| శ్రీపతి యొక్కడే శరణము మాకును। తేప యితడె మఱి తెరగేది॥
చ|| ఆసలు మిగులా నాతుమ నున్నవి। యీసులేనిసుఖ మెక్కడిది।
చేసినపాపము చేతుల నున్నది। మోసపోనిగతి ముందర నేది॥
చ|| కోపము గొందుల గుణముల నున్నది। యేపున నిజసుఖ మిక నేది।
దీపనాగ్నితో దిరిగెటిదేహము। పైపై విరతికి బట్టేది।
చ|| పంచేంద్రియములపాలిటిబదు కిది। యించుక నిలుకడ కెడ యేది।
యెంచగ శ్రీవేంకటేశ్వరు డొకడే। పంచినవిధులను పాలించుగాక॥

622) శంకరాభరణం
ప|| తన చిత్తముకొలది తమకించ నికనేల। మనసువచ్చినప్పుడే మన్నించీగాక॥
చ|| కొండలందు నదులందు గోరి యాకసాన భువి। నిండియున్నాడు తొలుతే నీలవర్ణుడూ।
అండనే నాయందు లోకులందు నుండుటరుదా। గండికాడై తనమాయ గాననీడుగాక॥
చ|| గాలియై పంచమహా వాద్యగతులై శబ్దములై। ఆలకించి పలికీని యాదిమూరితి।
నాలుకకొననే వుండి నానాభాషలాడీని। కాళముతో నెదిరికి గాననీడుగాక॥
చ|| వేదమమ్ము శాస్త్రమందు వేవేలువాదములందు। పాదుకొని బోధించీ బరమాత్ముడు।
యీదెసనే శ్రీవేంకటేశుడై పొడచూపె। గాదిలితనదాసుల గరుణించీగాక॥

623) లలిత
ప|| నీ వెటు దలచిన నిఖిలము నట్టొ। యేవల స్వతంత్రమింతా నీది॥
చ|| యేటిపురాకృత మెక్కడికర్మము। దాటక హరి నీదయ గలితే।
నీటున నన్నియు నీకల్పితములు। పాటించి నీవే పాపగలేవా॥
చ|| యెక్కడిజన్మము లెక్కడిమరణము-। లొక్కడవె నీవువొద్దంటే।
యెక్కువ నిందరి నేలెటివాడవు। యిక్కడ గొలిచితి మితరము లేలా॥
చ|| యేది పాపము యేది పుణ్యము। పోదిగ నీవే పొమ్మంటే।
చేదో డిందుకు శ్రీవేంకటేశ్వర। ఆదెస నిను శరణంటిమి గొంత॥

624) దేసాక్షి/శహన
ప|| ఇందరు నెఱిగిన దీ బదుకు। పొందినదాకా భోగించవలయు।
చ|| పొట్టబొరుగు లివె పుణ్యపాపములు। నట్టనడుమనే నాబదుకు।
వెట్టిమోపువో వెడ సంసారము। ముట్టినదాక మోపగవలెను॥
చ|| తోడునీడ యిది తొలగనిజన్మము। యేడకు బోరాదు యీబదుకు।
వీడనికట్లు వెడవెడ యాసలు। వూడినదాక నుండగవలెను॥
చ|| చేతిలో ధనము శ్రీవేంకటపతి। యీతనితోడిదె యీబదుకు।
ఆతుమలోనే యలవైకుంతము। ధాతు మాతుగని తలచగవలెను॥

625) లలిత
ప|| నీవే యంతర్యామివి నీవున్న దేవైకుంతము।
ఆవల బరమపదమన నింకా గలదా॥
చ| యిందరు జంతువులు నీవిచ్చినరూపులు మోచి।
బొందితో నీకే నెలవై పుట్టినారు।
కందువ నీప్రపంచపు కైంకర్యములు సేసి।
అందరి జీవన్ముక్తు లదివో చాలదా॥
చ|| యేలిక పంచినపనే యింద్రియభోగములెల్ల।

తోలితోలి రాచాజ్ఞ తోయకున్నారు।
కాలము నిన్ను బాయరు గర్భగోళమందున్నారు
యీలోకమే సాలోక్యమిది యింత చాలదా॥
చ॥ జ్ఞానము నజ్ఞాన మేది స్వామికార్యములోన।
మానక నీపనులలో మత్తులైనారు।
శ్రీనాథుడవు నీవే శ్రీవేంకటేశ్వర।
నీనాటకములోనే నిత్యులైరి చాలదా॥

626) ధన్యాసి
ప॥ పరిణామమే మాకు బతివి నీవు గలుగ। శరణాగతే మాకు సకలరక్షయ్యా॥
చ॥ నుదుట వ్రాసినవ్రాత నూటికి నీతిరుమణి। యెదురేది మాకు నేడు యేడులోకాల।
పెదవిమీదటితేనె పేరుకొనేనీజపము। అదన మాకు నదివో అక్కరలేదయ్యా॥
చ॥ చేతికివచ్చినసొమ్ము చేరె నీ శంఖచక్రాలు। ఘాతల మాకిక నేది గడమలేదు।
నీతితో వెనుబలము నీదాసులసేవ। రాతిరిబగలు నిదె రాజులమోయయ్యా॥
చ॥ తొల్లిటిపుణ్యఫలముతోడనే నీసంకీర్తన। తల్లి దండ్రి నీవు నీతరుణియును।
యెల్లగా శ్రీవేంకటేశ యిన్నియు గలిగె మాకు। చల్లగా బ్రతికిమి జయమందవయ్యా॥

627) పాడి
ప॥ ఇందులోన నే నెవ్వరితో బోలుదు। అంది నీవాడ నేననుకొంటిజుమ్మీ॥
చ॥ అంబుజనాథ నీశరణనువారలు। అల నారదసనకాదులు।
కెలన మరియు నీ కింకరవర్తులు। తెలిసినబ్రహ్మాదిదేవతలు॥
చ॥ నోరార హరి నిను నుతించువారలు। చేరువనుండేటి శేషాదులు।
ధారుణిలో నీదాసానుదాసులు। మారుతిముఖ్యులు మహామహులు॥
చ॥ బడి నీచే ముక్తివడసినవారలు। సుడిగొనుమునిజనశుకాదులు।
కడగిన శ్రీవేంకటపతి నీవే। తడవి నన్ను దయదలచుమీ॥

628) శుద్ధవసంతం
ప॥ అక్షయంబగుమోక్ష మందుటే తగుగాక। భక్షించుపండ్లకు బ్రాణ మీదగునా॥
చ॥ కొండంతపసిడి కలగూరకె వెలయిడిన। నిండినవివేకులకు నేరమిదిగాదా।
దండమిది హరి నిన్ను దలచినదలంపులెల్ల। నిండిన పాపము వాపుమనుట కిది దగునా॥
చ॥ గుఱుతుగలరత్నంబు గుగ్గిళ్ళు గొనగ వెల-। పఱచుటే తన బుద్ధి పాడౌట గాదా।
అఱిమఱి హరి నిన్ను నర్చించుఫలమెల్ల। కఱకుదనదేహభోగములకనదగునా॥
చ॥ కామధేనువు దెచ్చి కాసుకె వెలకొసగ। కామించి నధికులకు కడుగొరతగాదా।
శ్రీమంతుడైనట్టి శ్రీవేంకటేశ నిను।సేమమున గొలిచి తుచ్ఛెము లడుగదగునా॥

629) దేసాళం / కేదారగౌళ
ప॥ ఎవ్వరము నేమిసేసే మేమిగడమలు నీకు। రవ్వగా శరణంటే రక్షించుటింతే॥
చ॥ అందరు జేసినకర్మము లవి నీకు జీవనమై। అంది జీవించేనంటే నదియూ గాదు।
కొందరు సురలుతోడై కూడిరాగా నసురలా। యిందరి గెలిచేనంటే నిదియూ గాదు॥
చ॥ వొకచోట గలవు వేరొకచోట లేవంటే-। నకటా యెంచిచూచిన నదియూ గాదు।
మొకమిచ్చి నొకగుణమున దిరిగేవంటే। సకలగుణుడ వాజాడయు గాదు॥
చ॥ కపట మిదనరాదు కడునవుననరాదు। వుపమించరాదు వొల్లకుండగరాదు।
యెపుడును శ్రీ వేంకటేశ నీ చిత్తమింతే। విపరీతములు లేవు వెలితీ లేదు॥

630) శంకరాభరణం
ప॥ కలిగినమీదా గడమేలా। పలులంపటముల బడుటేగాక॥
చ॥ దురిత మణగె నిటు తుదకెక్కె సుఖము। హరి యొక్కడె గతియన్న పుడే।

పోరి నిక జేసేటిపుణ్యములెల్లా। వరుసతోడ నెవ్వరికో కాని॥
చ॥ సార మెరిగె తనజన్మము గెలిచెను। శ్రీరమణుని దలచినయపుడే।
సైరణతో నిక జదివేటిచదువు। మేరమీద నేమిటికో కాని॥
చ॥ శ్రీవేంకటపతి చిత్తాన నిలిచెను। కావించి గురుని గన్నపుడే।
భావించి యితరప్రార్థన లన్నియు। యీవలావలను యెందుకో కాని॥

631) వసంతవరాళి
ప॥ వట్టిస్వతంత్ర మిందు లేదు వావాద మిందు లేదు। గుట్టు దెలియక లోలో గునిపేరు వీరివో॥
చ॥ నేరిచి బ్రదుకువారు నేరక వీగేటి వారు। యేరీతి జూచినాను యెవ్వరు లేరు।
తీరుగా దమలో నుండేదేవుడు పెరరేచగా। మేరతోనే జీవులెల్లా మెరసేరు వీరివో॥
చ॥ కొందరు గొప్పజీవులు కొందరు చిన్నజీవులు। యెందు జూచినా భూమి నెవ్వరు లేరు।
బొందులే వేరు వేరుగా బుట్టించె దెపుడే। అందాలు సేయగ లోకు లమరేరు వీరివో॥
చ॥ అసుర కాణాచివారు అమర కాణాచివారు। యెసగ విచారించుకో నెవ్వరు లేరు।
వెస శ్రీవేంకటేశుడు వినోదించినయట్టు। వసుధమీదట గానవచ్చేరు వీరివో॥

632) కన్నడగౌళ
ప॥ సరవులు దెలియగ జనుగాకా। పరమార్థములో భంగము గలదా॥
చ॥ హరి స్వతంత్రుడట హరిసంకల్పము। విరసంబౌనా విశ్వమున।
సరవి బ్రపంచపుసకలమతంబులు। వరుస నెంచ గొదువలు మఱికలవా॥
చ॥ యితడు పూర్ణుడట యితనివిహారము। వెదకగవలెనా వేమరును।
కతకరచనయాకన్ను లెదిటివే। మతి దోచీ నిక మఱుగులు గలవా॥
చ॥ అంతరాత్మయట ఆతని వేరే। చింతించవలెనా సిలుగులను।
చెంతనే యిదివో శ్రీవేంకటేశుడు। యెంతదెలిపినా యితరము గలదా॥

633) దేసాళం / నటభైరవి
ప॥ అచ్చుతకృపాలబ్ధ మతియుగాక। మచ్చిక నాతడు సేసేమతకముగాక॥
చ॥ నానాపాట్ల బడె నాడు కరి మకరిచే। హీనదెస ప్రహ్లాదుడు హిరణ్యుచే బాటువడె।
పానిపట్టి హరి యది పరిహరించని వాడా। ఆనుక హరిదాసుల కంతటనే భంగమా।
చ॥ తగిలి భీష్ముడు శరతల్పమందు నుండడా। అగడై విభీషణుడు అన్నచే దన్నువడడా।
పగపాడే చూచుచుండ భాగవతులను హరి। తగినపుణ్యుల నిందు తప్పు లెంచవచ్చునా॥
చ॥ మంతనాన నారదుడు మాయలకు లోనుగాడా। చెంతల నర్జునునకు చేతులు దెగిపడవా।
ఇంతలో శ్రీవేంకటేశు డిట్టె వీని మన్నించడా। ఇంతటిమహానుభావు లిందుకు జడుతురా॥

634) దేసాక్షి / ఆభోగి
ప॥ పుట్టుగు నీయధీనమే భోగము నీయధీనమే। అట్టె యీభావనకు నరుదయ్యా నాకు॥
చ॥ కాననట్టుండ వచ్చు నీకల్పితసుఖదుఃఖాలు। మేను మోచి మీయాజ్ఞ మీరవచ్చునా।
నానాజీవులు వడేనాలిఘోరములు చూచి। దీనికెంత వగతువో దేవ నీచిత్తానను॥
చ॥ తొట్టినపాపపుణ్యాలు తొల్లె నీపంపులే। పుట్టినమీమాయలెల్లా బోదొబ్బేమా।
వొట్టుకొన్న జీవులు వొరయచుండగ జూచి। యెట్టు నీహొంచేవో యీవేదన కిపుడు॥
చ॥ చెచ్చెర యీజన్మములు శ్రీవేంకటేశ్వర నీవే। యిచ్చినవి నీతోడ నెదురాడేమా।
విచ్చలు మావంటివారినేరుపునేరాలు చూచి। వచ్చి నే శరణనగా సహించుకోవలసె॥

635) దేవగాంధారి
ప॥ అంతటిదైవమ వటుగాగా। చెంత నిన్ను గూర్చినదే ఘనము॥
చ॥ వెరవున బంచమవేదసారములు। సిరుల నినునుతించిననుతులు।
సరవితోడి బహుశాస్త్రసంతతులు। నిరతి జెప్పెడివి నీకథలు॥
చ॥ కొంగుపైడియగుగురుమంత్రంబులు। సంగడి వైష్ణవసంభాషలు।

నింగికి భూమికి నిజపురాణములు। సంగతిగల నీసంకీర్తనలు ॥
చ॥ పూనినవిధుల మహోపనిషత్తులు। నానాగతి నీనామములు।
వీనులకును శ్రీవేంకటేశ మీ-। జ్ఞానార్థములు మిముజదువుచదువులు ॥

636) భైరవి

ప॥ ఏపాటిగలవాడ నిదివో నేను। నాపాటు చూచి హరి నన్ను గావగదవే ॥
చ॥ నిలువు నూరు వండీని నిచ్చలు నీదేహ మైతే। వొలిసీ దుఃఖములకు నోరువ లేదు।
కులము గోటిసేసును గుంపుల జన్మాదులైతే। అలరి వొరులబోయి అడిగేదే యెపుడు ॥
చ॥ పట్టితే పసిడి రాలీ బచ్చనసంసారము। గుట్టుదెలియ బ్రాణము కూటిచేతిది।
పుట్టిపడీ మానుషము వొకనాటి కొకనాడు। పట్టికాంతలయెదుట భంగపడే మిదివో ॥
చ॥ చేరి చెట్టడిచితెను చేటడు చుట్టరికాలు। యీరీతి నిన్నాళ్ళుదాకా నెందుండిరో।
అరిచితే మూరె డెక్కినదే నామకీర్తనము। కూరిమి శ్రీవేంకటేశ కొననాలికెకును ॥

637) వరాళి

ప॥ దైవమా నీచేతిదే మాధర్మపుణ్యము। పూవువంటికడులేతబుద్ధి వారము ॥
చ॥ యేమిటివారము నేము యిదివో మాకర్మ మెంత। భూమి నీవు పుట్టించగ బుట్టితిమి।
నేమముతో నడిచేటినేరుపేది మావల్ల। దీముతో మోచిన తోలుదేహులము ॥
చ॥ యెక్కడ మాకింత గతి యెరిగే దెన్నడు నేము। చిక్కినట్టినీచేతిలో జీవులము।
తక్కక నీమాయలెల్ల దాటగలమా మేము। మొక్కలపుటజ్ఞానపుముగ్ధలము ॥
చ॥ యేది తుద మొదలు మాకిక నిందులో నీవే। ఆదిమూర్తి నీకు శరణాగతులము।
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె। నీదయ గలుగగాను నీ వారము ॥

638) బౌళి

ప॥ శరణు నే జొచ్చినది సరి నీవు మన్నించేది। యిరవైనగురుతుగా కిందు గూడపెట్టేవా ॥
చ॥ యెంగిలినోరు వెట్టుక యేమాటలాడినాను। సంగతిగా నవి నేడు సత్యమయ్యీనా।
అంగనలమోహము నాయంతరంగాన బెట్టుక। ముంగిటిఆచారాలు ముఖ్యమయ్యీనా ॥
చ॥ ఆసలు మెడగట్టుక అన్నియు జదివినాను। దోసములెల్లా మాని దొరనయ్యేనా।
రోసాలు మదిబెట్టుక రోతమేను గడిగితే। వేసాలయ్యే తోచుగాక వేరేపుణ్య మున్నదా ॥
చ॥ ఘనసంసారము మోచి కర్మ మెంతసేసినాను। తను దా జన్మించినట్టితప్పు దీరీనా।
యెనలేక శ్రీవేంకటేశ నన్ను నేలితివి। తనిసితి నిక నేను తమకించేనా ॥

639) సాళంగనాట

ప॥ ఇంకనేల నాకు వెర పింతమాట గలిగియు। సంకెలెల్ల బాసె నాస్వతంత్రము లొక్కటే ॥
చ॥ నే నెంతపాపబుద్ధినై నేర మెంతచేసినాను। కానీలే నన్నే లేవాడు కావగలడు।
ఆనతిచ్చె దొల్లె యాతడదె చరమార్థమందు। మేనిదోసమెల్ల బాపి మే లొసగేననుచు ॥
చ॥ మట్టు లే కతని నెంతమరచి నే వుండినాను। పుట్టించినదేవుడే ప్రోవగలడు।
గుట్టుచూపె తొల్లె తనగుణము పాండవులందు। గట్టిగా దనవారైతే కాచుకుందు ననుచు ॥
చ॥ తప్ప నే నడచినాను తగిలి శ్రీవేంకటేశు-। డొప్పులు సేసి రక్షించ నొద్దగలడు।
చెప్పనేల గోపికలు సేసినదోసాలు దొల్లి। కప్పుక పుణ్యాలు సేసె ఘనుడ దాననుచు ॥

640) భూపాళం

ప॥ నిత్యానందులము నిర్మలుల మిదే నేము। సత్యముగ మమ్మాతడు సరి బుట్టించగను ॥
చ॥ యెక్కడవోయి వెదకే మిటమీద దైవమును। వొక్కట నంతర్యామై వున్నాడదె।
ఇక్కడ నాతనిగుణా లెన్నేసి చదివేమిక। పక్కన తనదాసులశక్తికి సులభుడు ॥
చ॥ యేమేమి వేడుకొనేము యిటమీదట నాతని। నామములు నాలికపై నటించీనదే।
నేమమున నింకా నింతా నెట్టు నిచ్చలు భుజించేమో। కామించి సంసారపుకింకర్య మాతనిదే ॥
చ॥ ధ్యాన మేమని సేసేము తలచినందెల్లాను। పూని శ్రీవేంకటేశుడే వుండగాను।

నానాట నిక నేమి నమ్మితి మనేదేమి।పేని మమ్ము దనకుక్షి బెట్టి పెంచగాను॥

641) మాళవిగౌళ

ప॥ ఏమని చెప్పగవచ్చు నీసంతోషపుబుద్ధి। నామము శ్రీకృష్ణుడట నారాయణునికి॥

చ॥ జనని దేవకిదేవి జనకుడు వసుదేవు-।డనఘుడైనయట్టి ఆదిమూర్తికి।
ఘనలోకరక్షణ కంసుమామగండమును। తనకు గారణమట దైవశిఖామణికి॥

చ॥ పుట్టినది మధుర పెంపుడుజోటు రేపల్లె। వొట్టినెమాయలపురుషోత్తమునికి।
పట్టినపాండవపక్షపాతము కౌరవవైర-। మిట్టి వ్రాతఫలమట యీశ్వరేశ్వరునికి॥

చ॥ గోవుల గాచేదియు గొల్లెతల బొందేదియు। ఆవేళ గుణము యీయచ్యుతునికి।
శ్రావణబహుళాష్టమి చంద్రోదయము రోహిణి। కావింప జన్మమిదివో శ్రీవేంకటపతికి॥

642) గుజ్జరి

ప॥ వేనుబల మైనను గానగ వేరీ విష్ణు డొకడే కాక।
అనుమానములన్ని యు నుడిగితివి అలసితి నిక నేను॥

చ॥ పట్టినచలము మానదు ప్రకృతి స్వతంత్రమున।
పెట్టెడ మాయలనే కమ్మర పెట్టదు వివేకము।
పుట్టితి నిన్నాళ్ళాయను పొదలితి బుద్దెరిగి।
దిట్టవై అదికాదని తోసేటిదీమనమూ లేదు॥

చ॥ తగిలెడిఅనుబంధము మానదు తలపును నొకవంక।
తెగనియ్యదు కర్మములేమిటని తెగించు బుణ్యము।
నగుచునేముదిమికి లోనైతి నానాటికి నేను।
మగటిమి నే దాని నణచను మరిగెడిదేకాని॥

చ॥ చేసిన అలవాటు మానడు జీవుడు తనగుణము।
వేసరదు అనుభవించుటకు వేసరు ముక్తికిని।
దాసునిగా శ్రీవేంకటేశుడు దయజూచెను నను నీవేళ।
మోసములన్ని యును చేరెను మునుపు వెనక యేదో॥

643) సామంతం / సామ

ప॥ హరియే యెరుగును అందరిబ్రదుకులు। యిరవై యీతని యెఱుగటే మేలు॥

చ॥ వెనకటి బ్రహ్మలు వేవేలసంఖ్యలు। యెనసి బ్రహ్మాండము లేలిరట।
పెనగొని వారలుపేరులు మరచిరి। మనుజకిరీటము మరెవ డెరుగు॥

చ॥ అని దొల్లి మును లనంతకోట్లు। చేసిరి తపములు సేసలుగా।
యేసిరు లందరి యెరగ రెవ్వరును। వేసపునరులకు విధి యేదో॥

చ॥ కల వనేకములు కర్మమార్గములు। పలుదేవత లిటు పాటించిరి।
బలిమి శ్రీవేంకటపతికి మొరలిడి। వెలసిరి తుద నిదే నెర విందరికి॥

644) పాడి

ప॥ వారివారిసహజపువరుస లివి। కారణము తొల్లే హరికల్పితమిది॥

చ॥ వేరే విరుద్ధము లేదు వివేకించిచూచితేను। కూరుడై వుండిన మహాసుజ్ఞానికి।
యేరీతి జూచినాను యేకసమ్మతి లేదు। సారము దెలియరానిసంసారికి॥

చ॥ సకలభావములును చక్కనయ్యేతోచివుండు। ప్రకటించి నేరిచినప్రౌఢలకును।
అకటా జగడములే అన్నిటా వెంటనేవచ్చు। వికలులైన మూఢవిచారులకు॥

చ॥ సేయగలకర్మమెట్లా సేసి తొల్లె ఫలించెను। రాయిదండగల హరిదాసులకును।
రాయడి బుణ్యపాపాలు రారాపులై యుండు। యేయెడ శ్రీవేంకటేశు నెరగనివారికి॥

645) పాడి

ప॥ శిష్టరక్షణమును దుష్టవిగ్రహమును। సృష్టించె నొక్కవేళనే శ్రీజయంతినాడు॥

చ|| హరి కృష్ణావతార మందినయంతలోనే | పరమమునులకెల్ల భయముడిగెను |
తెరచి దైత్యులగుండె దిగులుచొచ్చె నత్తరి | సిరులమించినయట్టి శ్రీజయంతినాడు ||
చ|| గోవిందుడు వసుదేవకొడుకైనయప్పుడే | గోవులు రంకెలుసేసి గొల్లపల్లెను |
నోవితోడ గంసునికి నూరునిండె జూడగానె | చేవలుమీరినయట్టి శ్రీజయంతినాడు ||
చ|| నారాయణుడు భువి నరుడు దా గాగానే | మేర బాండవు లెచ్చిరి మేనవావిని |
కౌరవులపని దీరె కమ్మి శ్రీవేంకటేశుడు | చేరువనే మెరయగ శ్రీజయంతినాడు ||
646) లలిత
ప|| ఇందరు నెఱుగుదు రీయర్థమే భువి | కందువ దగులుట కర్మముకొలది ||
చ|| అదికి ననాది హరిదాస్యం బిది | వేదాంతంబులు వెలసినిది |
సోదించి కనిరి శుకనారదాదులు | పాదుగ నిక దమభాగ్యముకొలది ||
చ|| అతిరహస్య మిది అచ్యుతుపై భక్తి | ప్రతిలేనిపరమపావనము |
చతురులై తెలిసిరి సనకాదిమునులు | తతి దొరకుట సుకృతఫలముకొలది ||
చ|| పరము శ్రీవేంకటపతిసంకీర్తన | సారిది గురు డొసగుసూక్ష్మ మిది |
చిరపుణ్యులు మును చేకొన్న నిజ మిది | మరిగి మనుట తమమనసులకొలది ||
647) బౌళి
ప|| కమ్మరపు జీవునికిని ఇది కారణ మేమియు లేదట |
ఇమ్ముల రాజా నెరగని వెట్టెట యెవ్వరికెక్కును నారాయణా ||
చ|| యిలలో జీవునివిషయభోగమున నెందును బొరయనివాడవట |
చలమా యేల పుట్టించితి వీసంసారవారిధిని |
కలకాలము నీగర్భగోళమున గాపురముండగ నిటు చేసి |
ఫల మేమిగట్టుకొంటివి భావము దెలుపవే నారాయణా ||
చ|| నడపెడి యీజగము లన్నియును నటనలు నీవటు తొలుతనే |
యెడయక యిందే వినోదించెదవు యెడ్డతనంబా నీ కేమి |
జడియక నీవే సేసినచేతలు సర్వమును నిలుపగవలదా |
కడుగగనేటికి నెంగిలిబూరెట కడవేయనేల నారాయణా ||
చ|| పరగినయీకర్మమార్గములు బంధహేతువని చెప్పితివి |
యిరవుగను వేదమార్గములు నేలా కాచుక తిరిగెదవు |
గరిమల శ్రీవేంకటేశ్వర యిచ్ఛాకల్పితములు యిన్నియు నీకు |
సరి నెరిగించితి వికనీచిత్తము సర్వేశ్వర వో నారాయణా ||
648) హిందోళవసంతం
ప|| ఎన్నికై శ్రీవేంకటేశు డితడు గలుగగానె | అన్నిటా నందరిబోనిఅజ్ఞానాలు బాసెను ||
చ|| సకలశాస్త్రములందు సందేహమేకాని | వొకరు దైవమహిమ కొడబడరు |
అకటా బాసచేసినయందుకైనా నమ్మరు | వికలచిత్తులెల్లాను విష్ణుదాస్యమునకు ||
చ|| గక్కన గర్మము చేసి కడునలయుటేకాని | వొక్క మాటు హరి బాడ నొడబడరు |
తక్కక పెద్దలుగాగ తలవణకుటేకాని | పుక్కటి కాండ్లు హరి బూజించనేరరు ||
చ|| చిత్తములో వివేకించి చింత బొరలుటేకాని | వొత్తి హరిపై భార మొప్పగించరు |
హత్తినశ్రీవేంకటేశు డటె దయదలచగా | మత్తిలి ప్రసన్నులెల్లా మరేమిటా దప్పరు ||
649) దేసాళం / సావేరి
ప|| వానివానిసహజము వద్దననేల | యీనేటిప్రపంచ మది యేమిసేయగలదు ||
చ|| హరి పుట్టించినయట్టిఆయాప్రకృతులను | విరసాల చెప్పేమంటే వేరొకటౌనా |
పరమజ్ఞాన మొక్కటే పాటించితే జాలు | యెరవుల పుణ్యపాపా లేమిసేయగలవు ||
చ|| బలుపుగ విష్ణుమాయ బ్రబలేసంసారమును | చలమున దిద్దబోతే జక్కనౌనా |

తెలివితో హరిభక్తి తెగక వుండితేజాలు। యిలపై బంచేంద్రియము లేమిసేయగలవు॥
చ॥ శ్రీవేంకటేశు డాత్మ జేకొని వుండినది। భావించకున్న నాతడు బడివాసీనా।
సావధాన నితని శరణనుకొంటేజాలు। యేవిధులు భవములు నేమి సేయగలవు॥

650) రామక్రియ / హిందోళం
ప॥ నారాయణుడే సర్వనాయకుడు। వేరేదురాశలు వెదక జోటేదయ్యా॥
చ॥ ఆకస మొకపాదము అట్టె భూమొక పాదము। పైకొని యొకపాదము పాతాళము।
యేకమైవా డేడనున్నా యిందులోవారే జీవులు। ఆకడ బరులగొల్చేమనజోటేదయ్యా॥
చ॥ కడుపులో జగములు కాయ మిన్నిటాధారము। యెగలచోటనెల్లా యీతనిమాయే।
కడుబోరా దీతడే కారణ మందరికి। తడవి మరుపాయాల దగులజోటేదయ్యా॥
చ॥ చేతన్య మీతనిది సృష్టి యీతనిఘటన। ఆతుమ శ్రీవేంకటేశు డంతర్యామి।
రాతిరిబగలు దానే రక్షకుడు మనలకు। పోతరించి ఇకమెచ్చి పొగడజోటేదయ్యా॥

651) ఆహిరి
ప॥ ఇంక నాదైన్యము చూచి యెట్టు రక్షించేవో కాని। సంకెదీర బులిసితి సర్వేశ్వరా॥
చ॥ తపముసేసి నీమాయ దాటేననుచు బెనగి। అపుడే యలసితిని అదివో నేను।
కృప జూచి నీవింక గెలొపించే దెట్టోకాని। వుపమల సరివోరి వోడితి నే వానికి॥
చ॥ పంచేంద్రియములను పారదోలేనని చూచి। పంచగ సత్వలేక వసమైతిని।
అందె నాపాటు చూచి నీవడ్డమౌటెప్పుడోకాని। దించని వీరములాడి దిగితి నే వానికి॥
చ॥ మోహాంధకారముపై మొనచూపేనని పోయి। సాహసములేక నే జడిసితిని।
వూహల శ్రీవేంకటేశ వున్నతి నన్నేలితివి। బాహుబలమున తుదిపదమయితి వానికి॥

652) సామంతం
ప॥ దాసవర్గములకెల్లా దరిదాపు మీరె కాన। వాసికి నెక్కించరాదా వసుధలో మమ్ము ను॥
చ॥ సేనాధిపతి నీవు చేరి విన్న వించరాదా। శ్రీనాథునికి నేము సేసేవిన్నపము।
ఆనుక భాష్యకారులు అట్టె మీరు చేయరాదా। మానక విన్నపము మామనవిచనవులు॥
చ॥ వేయినోళ్ళభోగి నీవు విన్నపము సేయరాదా। వేయేసిమావిన్నపాలు విష్ణునికిని।
ఆయితమై గరుడడ అట్టె మీరు జేయరాదా। యేయెడ విన్నపము మాకేమివలసినాను॥
చ॥ దేవులమ్మ యిందిర మాదిక్కై విన్న వించరాదా। శ్రీవేంకటపతికి చిత్తమందను।
ఆవేళ శేషాచలము అట్టె మీరు జేయరాదా। యీవేళ మావిన్నపము లీడేరె నికను॥

653) లలిత
ప॥ ఒక్కడే యీజీవడు వొడలు మోపనివాడు। యెక్కడి కెక్కడిమాయ యేమిగట్టుకొనెనో॥
చ॥ పొంచి గర్భమున మాసు పొదిగి వుండినపుడు। యెంచుకొని ముచ్చటాడ నెవ్వరున్నారు।
అంచల బరగు కొనేయట్టి సంసారమిదియు। అంచుమోచి తానెంచు అణగుండెనో॥
చ॥ నిచ్చ నిచ్చ రాతిరులు నిద్దురవోయేవేళ। ఇచ్చలు దా జేసేపను లేమున్నవి।
కచ్చుపెట్టి తనమేన గాచుకొన్న కర్మములు। యెచ్చుకుందుల నాచోట నెందు వోయనో॥
చ॥ బుద్దెరుగ బాలుడై పొత్తులలోనున్న పుడు। కొద్దిలేక తా నెవ్వరి గురుతెరుగు।
అద్దుక శ్రీవేంకటేశు డంతర్యామై వుండి। తిద్దుక రాగానే కాక తెలివెందున్నదో॥

654) కన్నడగౌళ
ప॥ ఈయపరాధములు సహించవయ్యా। పాయక మమ్ము రక్షించేపని నీదే కాదా॥
చ॥ ఆకడ నీకడ మాలో నంతర్యామివి నీవు। నీకు జేసేవిన్నపాలు నీ వెరుగవా।
పైకొని వోరువలేక పదరితి మింతేకాక। రాకపోక నీవు మమ్ము రక్షించకుండేవా॥
చ॥ అట్టు కెక్కి దాసుల మఱవక రక్షించేనీవు। గుట్టుతో మమ్ము సహించకుండేవా।
పట్టలేక వేగిరించి పైపై దూరితిమిగాక। ఇట్టె మా కీసిరులు నీ విచ్చినవే యెపుడు॥
చ॥ యిదె శ్రీవేంకటేశ మమ్మేలినవాడవు నీవు। వదలకుండ నీవు నావాడవే కావా।

అదన మన్నించగానే ఆస జేచాచితిగాక। చెదరక నాకే నాకు జేతిలోనివాడవు॥
655) నారాయణి
ప॥ ఇందాకా వచ్చె జేతలు యికనో బుద్ధి। యెందుకు నీవే కర్తవు యికనో బుద్ధి॥
చ॥ పుట్టితి నీయాజ్ఞను భుజించితి గర్మమెల్లా। ఇట్టే జీవుడ నాకు నికనో బుద్ధి।
కట్టుకొంటి సంసారము కలిగె బంచేంద్రియాలు। యెట్టనెదిటిపనులు కికనో బుద్ధి॥
చ॥ వున్నాడ నీ మాయలోనే వొట్టుకొంటి ఆసలెల్లా। యెన్నికె యీప్రాణికి నికనో బుద్ధి।
పన్నుకొంటి సంపదలు పంచభూతాల లోనైతి। యిన్నిటా నీపంపుననే యికనో బుద్ధి॥
చ॥ భూమిపై నన్నేలితివి భోగములకు గురైతి। యేమనేవు యీదేహి కికనో బుద్ధి।
శ్రీమంతుడ విన్నిటాను శ్రీవేంకటేశ్వర నీవు। యీమహిమలెల్లా నీవే యికనో బుద్ధి॥
656) పాడి
ప॥ ఈతడు బలుపుడౌట కివియే సాక్షి। యీతడు బ్రహ్మమౌట కీతడే సాక్షి॥
చ॥ అమరుల మొఱాలించి అసురబాధలు మాన్చె। అమరుల కెక్కుడౌట కదియే సాక్షి।
అమృతము పంచిపెట్టి యాదిలక్ష్మి గైకొని। అమృతమథనమే అన్నిటికి సాక్షి॥
చ॥ యిందరుండేబ్రహ్మాండాలు యిదె కుక్షి నించుకొనె। యిందరి కెక్కుడగుట కిదియే సాక్షి।
కందువ వరములిచ్చు కడ నెన్నడు జెడవు। కందువ పురాణాలలో కథలే సాక్షి॥
చ॥ ఆదిబ్రహ్మ బుట్టించె మఱ్ఱాకుమీద దుద దేలె। ఆదినంత్య మీతడౌట కదివో సాక్షి।
పొందుగా శ్రీవేంకటాద్రిపై మహిమ వెదచల్లె। పాదుకొన్న యీతనిశ్రీపాదములే సాక్షి॥
657) లలిత
ప॥ మతంగపర్వతము మాల్యవంతము నడుమ। సతమై శ్రీవేంకటేశ్వరుడున్నవాడు॥
చ॥ కొలిచినవారికెల్లా కోరినవరములిచ్చి। తలచినవారినెల్లా ధన్యులజేసి।
పొలుపుమిగుల మంచిపువ్వులతోటలనీడ। విలసిల్లీనదివో శ్రీవేంకటేశ్వరుడు॥
చ॥ శరణన్నవారికి చనవిచ్చి రక్షించి। గరిమ బూజించువారి గరుణ జూచి।
పరిపూర్ణమగు తుంగభద్రాతటమునందు। విరివిగొన్నాడు శ్రీవేంకటేశ్వరుడు॥
చ॥ తను నమ్మినవారికి తగినసంపదలిచ్చి। కని నుతించేవారికి గామధేనువై।
కనకమయములైనఘనమైనమేడలలో। వినుతికెక్కెను శ్రీవేంకటేశ్వరుడు॥
658) ధన్నాస్యసి
ప॥ అంతరాత్మ నీయాధీన మంతయు। చింతలు సిలుగులు జీవులకెల్లా॥
చ॥ చిత్తంబనియెడిసింహాసన మది। వుత్తమపురుష నీవుండెడిది।
హత్తి యింద్రియము లందు బ్రధానులు। ప్రత్తెక్షరాజ్యముప్రకృతియు గలిగె॥
చ॥ కన్నులు జెవులును ఘ్రాణము నాలికె। వన్నె మేను నీవాహములు।
పన్నినకోర్కులు భండారంబులు। సన్నుతి సంసారసంపద గలిగె॥
చ॥ పుట్టినపుట్టుగు భోగపుకుటారు। పట్టము కర్మానుబంధంబు।
గట్టిగ శ్రీవేంకటపతివేలిక-। విట్టినీమహిమ లిన్నిట గలిగె॥
659) ముఖారి
ప॥ మొదలెతెలియవలె మోసపోక మానవలె। పదిలపు యోగికైనా బ్రహ్మకైనాను॥
చ॥ అలుగులపై బడితే నాయాలు దాకకుండునా। కలికిసతులచూపులు కాడకుండునా।
యిల దోడుదొక్కితేను యెండించకుండునా। చెలులయిండ్లకు బోతే చిక్కించకుందురా॥
చ॥ చిచ్చు గాగిలించుకొంటే చిమిడించకుండునా। గచ్చుబర స్త్రీలపొందు కాచకుండునా।
తచ్చి విషముమింగితే తలకెక్కకుండునా। పచ్చిసతులవలపు భ్రమయించకుండునా॥
చ॥ తెగి సముద్రము జొచ్చితే లోబడకుండునా। మొగి నింతులమాటలు ముంచకుండునా।
తగు శ్రీవేంకటేశ్వరుదాసుడై గెలిచితేనే। సగతున నివి యెల్లా బంపుసేయకుండునా॥
660) నాట

ప॥ వీధి వీధి వాడే వాడే వీడే వీడే చెలగీని। ఆదిదేవుడు శ్రీవేంకటాద్రిమీదటను॥
చ॥ గరుడధ్వజంబదె ఘనవిష్ణురథమదె। సరి శంఖచక్రములు శార్ఙ్గమునదె।
హరి యందుమీదటను ఆయిత్తమై యున్నాడదె। అరులనెల్ల గెలిచి అమరుల గావను॥
చ॥ సారథి యల్ల వాడె చాలి రణభేరి యదె। అరయ నిరుమేలా బ్రహ్మాదులు వారే।
పేరుకొన్న వేదములబిరుదుపద్యములవె। శ్రీరమణుడు మెరసె చిక్కులు వాపగను।
చ॥ ఆటలు బాటలు నవె అచ్చరలేమలు వారె। చాటున నలమేల్మంగసంగడి నదె।
యీటులేని శ్రీవేంకటేశు డేగీ నల్లనాడె। కోటానుగోటిదాసులకోరిక లీడేర్చను॥

661) భైరవి

ప॥ జీవుడ నేనొకడను సృష్టికి గర్తవు నీవు। యీవల ధర్మపుణ్యము లివివో నీచేతివి॥
చ॥ పుట్టినయట్టిదోషాలు పురుషోతమా నీవు। పట్టి తెంచివేయక పాయనేరవు।
గట్టిగా సంసారములో గలిగినలంపటాలు। ముట్టి నీవల్ల నేకాని మోయరావు॥
చ॥ పంచభూతవికారాలు పరమాత్ముడా నీవే। కొంచక నీయాజ్ఞగాని కొద్ది నుండవు।
అంచెల జగములోనిఆయాసహజములు। వంచుక నీవల్లగాని వైపుగావు॥
చ॥ చిత్తములో విజ్ఞానము శ్రీవేంకటేశ నీవె। హత్తించి చూపినగాని యంకెకురాదు।
సత్తుగా నిన్నిటికిని నీశరణుజొచ్చితి మిదె। నిత్తెము గావ బ్రోవ నీయెచ్చే యికను॥

662) బౌళి

ప॥ కనియు గానరు నీమహిమ కౌరవకంసజరాసంధులు।
మనుజులు దనుజుల జంపిరనగ వినిమరి నీశరణము చొరవలదా॥
చ॥ పుక్కిటనే లోకములు చూపితి వూతకిచ న్నటు దాగితివి।
పక్కననే బండి చన్ని విరిచితివి బాలులు సేసేటిపను లివియా।
అక్కరతో తృణావర్తు నణచితివి ఆబోతులకీ టణచితివి।
చిక్కించి యనలము చేత మింగితి శిశువులు సేసేటిపను లివియా॥
చ॥ తొడిబడ మద్దులు భువిపై గూలగదొబ్బి యఘాసురు జంపితివి।
బడినే గోవర్ధనగిరి యెత్తితివి పడుచులు సేసేటిపను లివియా।
అడరి బ్రహ్మమాయకు బ్రతిమాయలు అట్టే గడించి నిలిచితివి।
పిడికిట చాణూరు నేనుగ గొట్టితి పిన్నలు సేసేటిపను లివియా॥
చ॥ కాళింగునిమద మణచి దవ్వుగా కడగడలకు బోజోసితివి।
గోలవై యజ్ఞఫలము లిచ్చితివి గోవాళు సేసేటిపను లివియా।
యీలీల శ్రీవేంకటాద్రిమీదనే యిందరికిని పొడచూపితివి।
బేలదనంబుల నెంచిచూడ పసిబిడ్డలు సేసేటిపను లివియా।

663) దేవగాంధారి

ప॥ ఎదుటనే వున్నవి యిన్నియును। యిదికైవసమగు టెన్నడోకాని॥
చ॥ ఆకస మొకటే అలభూ మొకటే। లోకములు పెక్కు లోలోనే।
శ్రీకాంతు డదివో చిత్తములోననె। యేకచిత్త మగు టెన్నడోకాని॥
చ॥ యిరవగుకాలం బెప్పటిసహజమె। అరుదగుదినములు అనంతము।
పరమాత్ముడు లోపల వెలుపల నిదె। యెరవుమాని చేరు టెన్నడోకాని॥
చ॥ భావించగ నొకబ్రహ్మాండంబే। జీవరాసులే సేనలివే।
శ్రీ వేంకటేశుడు సృష్టించినవాడు। యీవిధి గని మను టెన్నడోకాని॥

664) ముఖారి

ప॥ సులభపుమార్గమును చుట్టిరానే వుండగాను। బలుప్రయాసపు కర్మబద్ధులైన జీవులు।
చ॥ శ్రీపతిభక్తియనేటిచింతామణి వుండగాను। యేపున మోసపొయ్యేరు యేలో జీవులు।
చేపట్టి నామాంకితపుసిద్ధరసము గలిగి। కోపుల నుడిగి పనిగొనరేలో జీవులు॥

చ॥ అక్కడనే శరణాగతనేవోడ వుండగాను। యెక్కి భవార్ధి దాటరేలో జీవులు।
తక్కక దాస్యమనేటి ధనము దమకుండగా। లెక్కించి కూడపెట్టుకోలేరు యేలో జీవులు॥
చ॥ అటె శ్రీవేంకటేశు డంతరాత్మై వుండగాను। పట్టి కొలువరేలో పైపై జీవులు।
పట్టపుహరిదాసులు ప్రత్యక్షమై వుండగాను। యిట్టె వారికృప చేరుటెన్నడో యీజీవులు॥
665) శంకరాభరణం
ప॥ ఆడరో పాడరో ఆనందించరో। వేడుక మొక్కరో విజ్ఞానులు॥
చ॥ హరి రక్షకుడై యందరి కుండగ। పరగగ బదికేరు బ్రహ్మాదులు।
గరిమ నతడే చక్రము చేపట్టగ। సురిగి పారి రదె చూడుడు సురలు॥
చ॥ పదిలపువిష్ణుడె ప్రాణమై యుండగ। యిదివో మెలగేరు యీజీవులు।
మొదలును యితడే మూలమై యుండగ। పొదలె నీతనిపంపున లోకములు॥
చ॥ శ్రీవేంకటాద్రిని శ్రీపతి యుండగ। తావుల నిలిచెను ధర్మములు।
యీవల నితడే యిచ్చేటివరముల। పావనులై రిదే ప్రపన్నులు॥
666) మాళవి
ప॥ అందరికి సులభుడై అంతరాత్మ యున్నవాడు। యిందునే శేషగిరిని యిరవై విష్ణుడు॥
చ॥ యోగీశ్వరులమతినుండేటిదేవుడు క్షీర-। సాగరశాయియైనసర్వేశ్వరుడు।
భాగవతాధీనుడైన పరమపురుషుడు। ఆగమోక్తవిభులందు నలరిననిత్యుడు॥
చ॥ వైకుంఠమందున్న వనజనాభుడు పర-। మాకారమందునున్న ఆదిమూరితి।
ఆకడసూర్యకోట్లందున్న పరంజ్యోతి। దాకొన బ్రహ్మాండాలుధరించినబ్రహ్మము॥
చ॥ నిండువిశ్వరూపమై నిలిచినమాధవుడు। దండివేదాంతములు వెదకే ధనము।
పండినకర్మఫలము పాలికివచ్చినరాసి। అండనే శ్రీవేంకటేశుడైనలోకబంధుడు॥
667) వరాళి
ప॥ హరి హరి నాబదుకు ఆశ్చర్యమాయ నాకు। శరణమంటి నిన్నిటికి సెలవుగా నీకును॥
చ॥ వున్నతి జలధిగలవుప్పెల్లా దింటిగాని। యెన్నిక సుజ్ఞానమింతా నెఱిగనతి।
దిన్నగా భూమి వేరుగ దేహములెత్తితిగాని। పన్నిన నాభోగకాంక్ష బాయగలేనైతి॥
చ॥ నాలిక బేలితి గాని నానాభాషలెల్లా। తాలిమి హరినామము దడవనైతి।
నాలిసంసారము బ్రహ్మనాటనుండి జేసేగాని। మేలిమి మోక్షముత్రోవ యెఱుగగనైతిని॥
చ॥ వూరకె దినదినాలయుగాలు దొచ్చితిగాని। నేరిచి వివేకము నిలుపనైతి।
మేరతో శ్రీవేంకటేశ మీరె దయజూడగాను। నారదప్ప కిట్టె మీదాసుడనైతిని॥
668) సామంతవరాళి
ప॥ దైవమా నీవెలితేది తమవెలితేకాని। జీవులుపట్టినకొల్ల చేతిలోనే వున్నది॥
చ॥ నిండినవి జగముల నీనామము లనంతము-। లండ దలచేవారిభాగ్యమేకాని।
పండియున్న దిదె దేవభక్తి యెందు చూచినాను। దండితోడ బనిగొనె తమనేర్పేకాని॥
చ॥ మనసులలో నున్నది మరి నీపైజ్ఞానము। వొనర దెలిసేవారివోపికేకాని।
ఘనమైనమున్నిటినీకథలెల్లా నున్నవి। విననేరిచినవారివివేకమే కాని॥
చ॥ శ్రీవేంకటేశ మీముద్ర చెల్లుబడై వున్నది। వేవేగ ధరించేవారివేడుకే కాని।
తావుకొని చేరువ నీదాస్య మిట్టె వున్నది। భావించి నమ్మేటివారిపని యింతేకాని॥
669) దేసాళం/కేదారగౌళ
ప॥ కాదన్నవారికి వారికర్మములే సాక్షి। యేదెస చూచిన మాకు నీతడే సాక్షి॥
చ॥ వేదాలు సత్యమౌటకు విష్ణుడు మత్స్యరూపమై। ఆదట దెచ్చి నిలిపె నదె సాక్షి।
ఆది గర్మములు సత్యమౌటకు బ్రహ్మయగాన। పోదితో నీతడు యజ్ఞభోక్తౌటే సాక్షి॥
చ॥ అదె బ్రహ్మము సాకారమౌటకు పురుషసూక్త-। మెదుట విశ్వరూపము యిది సాక్షి।
మొదలనుండి ప్రపంచమును తథ్యమగుటకు। పొదిగొన్న యాగములే భువిలో సాక్షి॥

చ|| బెరసి జీవేశ్వరులభేదము గలుగుటకు | పొరి బ్రహ్మాదులహరిపూజలే సాక్షి |
యిరవై దాస్యాన మోక్షమిచ్చు నీతడనుటకు | వరమిచ్చే శ్రీవేంకటేశ్వరుడే సాక్షి ||

670) బౌళి

ప|| మమ్ము జూడ నేమున్నది మావంక నీకేలాభము | కమ్మక దయదలచి కరుణించుగాక ||
చ|| శ్రీకాంతుడ నీపాదసేవకులయినవారు | పాకశాసనాదులును బ్రహ్మాదులు |
పైకొని నరుడ నేను బంటగాగ నెంతవాడ | కైకొని నీపుణ్యానకు గాచుటింతేకాక ||
చ|| నారాయణుడ నిన్ను నమ్మినట్టిదాసులు | నారదాదిసనకసనందాదులు |
వీరిలో నేనెంతవాడ వికటపుజీవుడను | యీరీతి నీమూక గూడి నేలుటింతే కాక ||
చ|| శ్రీవేంకటేశ నీపై చేరి భక్తి సేసేవారు | కావించి యనంతముఖ్య గరుడాదులు |
దేవ నేనొక్క నీచుడ దీనరక్షకుడవు నీ- | వీవిధ మెంచుక మమ్ము నీడేరింతుగాక ||

671) దేసాక్షి / రేవతి

ప|| దాటలేను యీ మాయ దైవమా నేను | నీటున జేసెవాడవు నీవె నీవెకా ||
చ|| యీమురికిదేహమేకా యెంతగాలమైన నేను | వోముకుంటా భువిమీద నుండగోరేది |
దోమటినింద్రియాలేకా తోడునీడయ నన్ను | వేమరు భోగించజేసి వెనుబలమైనవి ||
చ|| పొంచిన నాకర్మమే పుట్టించి పుట్టించి | పంచల సంసారముపాలు సేసేది |
అంచెల నీచిత్తమేకా ఆసలాసలను దిప్పి | చంచుల నాకేపొద్దు చనవరియయ్యేది ||
చ|| చుట్టుకొన్న సంపదేకా సూటియైననాటికి | జట్టిగొని లోలోనే చవిసేసేది |
అట్టె శ్రీవేంకటేశ అంతరంగాన నీవెకా | పట్టుగొమ్మవై యుండగ బదికేది నేను ||

672) శంకరాభరణం

ప|| ఇతరము లేదిక నెంచి చూచితే | బ్రతివచ్చు నితడు ప్రత్యక్షమై ||
చ|| సకలలోకములు చర్చించి వెదకిన | వొకడేపో పురుషోత్తముడు |
ప్రకటము బహురూపములయినాతడు | అకుటిలమహిమలయనంతుడే ||
చ|| పర్వినజీవుల భావించిచూచిన | సర్వాంతరాత్ముడు సర్వేశుడే |
వుర్విని వెలుపల నుండినయాతడు | నిర్వహించిన నీనీరజాక్షుడే ||
చ|| చన్నకాలమున నున్నకాలమున | నున్నవాడు యీవుపేంద్రుడే |
కన్నులెదుట నిక గలకాలంబును | అన్నిటా శ్రీవేంకటాధీశుడే ||

673) ముఖారి

ప|| హేయము తనవాసన లేలమానును | చీయన్న మాన దిదే చెప్పరానిమాయ ||
చ|| జంగిలిమనుజునకు వరుస బాపమే చవి | అంగవించవలదంటే నగ్గలమౌను |
ముంగిట నిల్లాలుండగ ముట్టగోరు బరస్త్రీల | యెంగిలి కీరెండు సరే యిదివో మాయ ||
చ|| పరగినజీవునికి పంచేంద్రియాలే సుఖము | ధర నెంతగాలమైన తనివిలేదు |
సిరులు దనకుండినా జేయిచాచు బరులకు | యిరువు లెరగరాదు యిదివో మాయ ||
చ|| శ్రీవేంకటేశ్వరుడు చేరి యాత్మలో నుండగ | భావించు నితనికృప ఫలించునాడు |
పూవువంటి సంసారము పొదుగుకవుండగాను | ఆవటించు బుణ్యఫలా లదివో మాయ ||

674) రామక్రియ

ప|| ఆతడు సేసేచేత లన్యులు సేయగలరా | జాతుల మనుజులెల్లా సతమయ్యేరా ||
చ|| దిక్కులేనివారికెల్లా దేవు డొక్కడే దిక్కు | చిక్కినవారికెల్లా శ్రీపతే గతి |
తక్కిన అనాథులకు దైవమే రక్షకుడు | యెక్కడా నాతడుండగా నేటి కిక చింత ||
చ|| బలిమిలేనివారికి పరమాత్ముడే బలిమి | కలిమిచాలనివారికలిమి హరి |
యిల నేరనివారికి నిందిరానాథుడే నేర్పు | వెల నీతనికే విన్నవించు టింతేకాక ||
చ|| పొందులేనివారికెల్లా బురుషోత్తముడే పొందు | విందును వేడుకయు శ్రీవేంకటేశుడే |
యెంద రెందరుండినాను యీతడు గలడు మాకు | సందడి నాతడే అన్ని చక్కబెట్టీ బనులు ||

675) సామంతం/నాట
ప॥ ధృవవిభీషణాదులు సాక్షి। వివరపుజీవులు వెదకేదిది॥
చ॥ దేవేంద్రసంపద దిక్కులకెక్కుడు। కావిరినది యొక కాలముది।
తావున శ్రీహరిదాసులసంపద। తేవల నెన్నడు దీరనిది॥
చ॥ బలువుగ నడచేటి బ్రహ్మపట్టమును। తోలుబ్రహ్మాండముతోడిది।
జలజాక్షునినిజశరణాగతి యిది। కలికాలమునకు గాణాచి॥
చ॥ వైకుంతమున కివ్వలిలోకంబులు। రాకల పోకల రచనలవి।
యీకడ శ్రీవేంకటేశ్వరుసన్నిధి।పైకొని దొరకిన బ్రదికేదిది॥

676) వరాళి
ప॥ బయలీదించీ నదివో ప్రాణులను హరిమాయ। క్రియదెలుసుకొనేటి కీలింతేకాని॥
చ॥ పెక్కుపురుషులలోన బెరశౌకసతియుంటే। యిక్కువై యందే నాటు నిందరిచూపు।
దక్కి యందరికాగిళ్ళ తరుణి యుండుట లేదు। గక్కన వట్టియాసల గరగుటేకాని॥
చ॥ చింతకాయక జ్ఞాయము చేరి యిసుమంతవుంటే। అంతటనే నోరూరు నందరికిని।
పొంతనే నాలుకలకు పులుపై యుండుటే లేదు। కొంత భావించి మింగేటి గుటుకలేకాని।
చ॥ శ్రీవేంకటేశుతేరు దీసేటిమనుజులెల్లాను।సేవగా నేమే చేసితిమందురు।
ఆవల నాతడే తమఅంతరాత్మయైయుండి। కావించుట యెరగరు గర్వములే కాని॥

677) పూర్వగౌళ / కాపీ
ప॥ ఏమని చెప్పేనోకాక యిలగలశాస్త్రాలు। కామించి వాదించేవారికడమేదో॥
చ॥ అంచెల జగములకు హరియే ఆధారము। యెంచగ నాధారము యితనికేదో।
పొంచిన వేదార్థములపురుషార్థ మీతడు। నించినయర్థము యీతనికి నేదో॥
చ॥ పొందినప్రాణులకెల్లా పుట్టుగైనాడితడు। యెందును తనకు బుట్టుగిక నేదో।
చందపుగర్మములకు సాధన మీదేవుడు। మమదలించ సాధనము మరి తనకేదో॥
చ॥ కలయన్నిమాయలకు గారణ మీమూర్తి। తలపగ కారణము తనకేదో।
యెలమి శ్రీవేంకటేశు డితడే సర్వసాక్షి। మలసి యీతనికిక మరిసాక్షి యేదో॥

678) సామంతం / హిందోళ
ప॥ ఎక్కడ గడచే రీనరులు। తక్కుల బెట్టేరు తరుణులు భువిని॥
చ॥ కన్నులచూపులు గాలపుచిలుకులు।వెన్నెలనవ్వులే వెలితెరలు।
మిన్నక పురుషామృగముల వేటలు। పన్నక యాడేరు పడతులు భువిని॥
చ॥ ముంచినమాటలే మోహనఘంటలు। మంచియధరములే మచ్చులవి।
మించిన పురుషామృగముల వేటలు। అంచెల నాడేరు అతివలు భువిని॥
చ॥ కట్టువగట్లు కందువకుచములు। పట్టు శ్రీవేంకటపతిమాయ।
మెట్టుగ పురుషామృగముల వేటలు। నెట్టన నాడేరు నెలతలు భువిని॥

679) ధన్నాసి
ప॥ ఎందుకు బనిగొందము యేమి సేత మివియెల్లా। చెందిన మాకిక బుద్ధి చెప్పవే నారాయణా॥
చ॥ హరినామమొకటనే అణగె బాపములు। వొరసి యన్నినామము లూరకున్నవి।
సిరు లిచ్చె గలవెల్లా శ్రీపతినామ మొకటే।పెరనామములెల్లాపెట్టెలలో నున్నవి॥
చ॥ గోవిందనామ మొకటే కూడపోసె బుణ్యములు।వేవేలు నామములకు వెలలున్నవా।
శ్రీవిష్ణునామ మొకటే చేతికిచ్చెవైకుంతము। తావై యున్న నామములు తమకించీ నీవికి॥
చ॥ ఇత్తల కేశవునామ మియ్యగలవెల్లా నిచ్చె। పొత్తులనామములెల్లా బొంచుకున్నవి।
చిత్తమున నిన్ను జూపె శ్రీవేంకటేశనామమే। హత్తిననామములెల్లా నందులోనే నున్నవి॥

680) భూపాళం
ప॥ వేకువ దిరుపళచ్చి విష్ణునికి జేయరో। ఆకటికొదగినట్టిఆరగింపులు॥

*****************************************************************************************************

అచ్॥ అతిబ్రహ్మాండాలు గుక్షి నటు ధరించినయట్టి। అతనికి జేయరో ఆరగింపులు।
ప్రతిలేని క్షీరాబ్ధి బవళించి లేచినట్టి। చతురునికి జేయరో చవి నారగింపులు॥
చ॥ యేడుదినములుదాకా నెత్తెను గోవర్ధనము। ఆడివచ్చేబాలునికి నారగింపులు।
మేడెపుగోపికలతో మిక్కిలి బెనగినట్టి। వేడుకకానికి దేరో విందు లారగింపులు।
చ॥ పట్టపుదేవుళ్ళు దాను బంతి సాగి వున్న వాడు। అట్టె సేయరో పులుగ మారగింపులు।
నెట్టన శ్రీవేంకటాద్రినిలయు డారగించీని। మట్టులేక వడ్డించరో మంచియారగింపులు॥
681) దేసాక్షి / భైరవి
ప॥ ఏపొద్దు చూచిన దేవు డిటానే యారగించు। రూపులతో బదివేలు రుచులైనట్లుండెను॥
చ॥ మేరుమందరాలవలె మెరయు నిడ్డెనలు। సూరయ చంద్రులవంటి చుట్టుబళ్ళేలు।
ఆరనిరాజాన్నాలు అందుపై వడ్డించగాను। బోరన చుక్కలు రాసివోసినట్లుండెను॥
చ॥ పలుజలధులవంటి పైడివెండిగిన్నెలు। వెలిగొండలంతలేసి వెన్న ముద్దలు।
బలసినచిలుపాలు పంచదార గుప్పగాను। అలరువెన్నెలరస మందిచ్చినట్లుండెను॥
చ॥ పండినపంటలవంటిపచ్చళ్ళు గూరలును। వండి యలమేలుమంగ వడ్డించగా।
అండనే శ్రీవేంకటేశు డారగించీ మిగులగ। దండిగా దాసులకెల్ల దాచినట్లుండెను॥
682) సాళంగనాట
ప॥ మొక్కరో మొక్కరో వాడె ముందర నిలుచున్నాడు। యెక్కువ రామునిబంటు యేకాంగవీరుడు॥
చ॥ పెట్టిన జంగతోడి పెద్ద హనుమంతుడు। పట్టెను యెడమచేతి బలుముష్టి।
మెట్టినాడు పాదముల మించు రాకాశితలలు। కొట్టేనను నెత్తె గొప్ప వలకేలు॥
చ॥ వంచెను శిరసుమీద వాలుగా దనతోక। పెంచెను మిన్నులుమోవ పెనుదేహము।
నించినాడు రౌద్రము నిడుపాటిదవడల। కాంచనపు పుట్టుకాళ కడు బిగించెను॥
చ॥ పెరచి తొడలుదాక పెద్దపదకము వేసె। తనువుపై వేలాడేదండలతోడ।
అనయము శ్రీవేంకటాద్రి దేవునిబంటు। వెనుబలమై యున్నాడు విట్ఠలములోనను॥
683) గుండక్రియ
ప॥ ఘను డాతడా యితడు కలశాపురముకాడ। హనుమంతు డితడా అంజనాతనయుడు॥
చ॥ పెడచేత లోచేత నెరసి కొందరి గొట్టె। అడరి దానవుల హనుమంతుడు।
వెడిదంపుబెనుదోక బిరబిర దిప్పి మొత్తె। అడగ మాల్యవంతు హనుమంతుడు॥
చ॥ దాకాల మోకాల దాటించె గొందరి। ఆకాశవీధినుండి హనుమంతుడు।
పైకొని భుజముల బడదాకె గొందరి। ఆకడ జలధిలోను హనుమంతుడు॥
చ॥ అరుపుల నూరుపుల నందరి బారగ దోలె। ఔరా సంజీవికొండహనుమంతుడు।
మేరతో శ్రీవేంకటాద్రిమీదిదేవునిబంటు। ఆరితేరినబిరుదు హనుమంతుడు॥
684) బౌళి
ప॥ హరి దగ్గరనే వున్నా డందాకా బారనీదు। కురుచలోనే మగుడు గోవిందుమాయ॥
చ॥ చెనకిపంచేంద్రియపుచెరువు లైదింటికి। మనసనెడి దొకటి మహాప్రవాహము।
దినము బారుచునుండు దిగువకు వెళ్ళలేదు। తనలోనే తానిగురు దైవమాయ॥
చ॥ తూలనిపంచభూతాలతోట లైదింటికి। కాలమనియెడి దొక్కకాలువ బారుచునుండు।
నేలా దడియదు నీరూ దివియదు। తోలుదిత్తికే కొలది దొరకొన్న మాయ॥
చ॥ ముట్టి పంచప్రాణములమొలక లైదింటికి। పుట్టుగులనియేటియేరు పొదలి పారుచునుండు।
చెట్టు చెట్టుకే కొలది శ్రీవేంకటేశ్వరుడు। నట్టనడుమ నున్నాడు నాసనీదు మాయ॥
685) గుండక్రియ
ప॥ కడనుండి రావు కానివి నైనవి। వుడుగనిదయ నీదొకటే కలది॥
చ॥ హరి నీచక్రంబంటినయపుడే। సొరిది నసురలే సురలైరి।
నిరతపుచీకటినిండినమింటను। వెరవున రవిచే వెలుగైనట్లు॥

*****************************************************************************************************

చ|| తతి నీనామముదలచినవారి | అతిపాపమె పుణ్యంబాయ |
గతియై పరుసముగదిసినలోహమె | ప్రతిలేక ధరణి బసిడియైనట్లు ||
చ|| కొంకక నిను నిటు గొలిచినమనుజులె | అంకెల శుకాదులైనారు |
యింకను శ్రీవేంకటేశ నీజగము | సంకల్పమే మోక్షంబై నిలిచె ||

686) లలిత
ప|| ఇవ్వల వెదకితేనే యేమి లేదు | అవ్వలికి దాటి మీరు అందుకోరో శుభము ||
చ|| కను రెప్పలతుదల గట్టువలె గాలము | ఘనమై చేతులతుద గర్మమున్నది |
మనసుకొట్టగొననే మరి దైవమున్నాడు | చెనకి యిక నెన్నడు సేయరో పుణ్యములు ||
చ|| కనకము దాటితేనే ఘనసుఖమున్నది | వెనక చీకటికొన వెలుగున్నది |
వనితలఅవ్వలనే వరవిజ్ఞాన మున్నది | పనిగొని యితవైతే బ్రదుకరో జీవులు ||
చ|| కాయముకొట్టగొననే ఘనవైకుంఠమున్నది | బాయట శ్రీ వేంకటపతి వున్నాడు |
మాయలకొనలనెల్లా మనము నున్నారము | పాయక తెలుసుకొని పట్టరో యీతెరువు ||

687) బౌళి
ప|| ఎట్టువలసినా జేయు మేమీ నననేరమయ్య | వొట్టిననామనసు నీ కొప్పనసుమ్మయ్యా ||
చ|| అదిగో శ్రీహరి నీవంపినయింద్రియాలకు | చెదరక నేము పంపుసేతుమయ్యా |
వెదకి యాసలకెల్లా వెట్టియు జేతుమయ్య | మదిమది నేనీమాయకు లోనయ్యా ||
చ|| దేవ నీవిచ్చినయట్టిదేహపుటూరిలోన | చేవమీర గాపురము సేసేమయ్య |
ఆవల నీకర్మముల కప్పనము నత్తుమయ్య | ఆవటించి కామాదుల కాన మీరమయ్యా ||
చ|| నిన్ను దలచుటకంటే నీవుచెప్పినపనులే | యెన్నిక జేసినదే యెక్కుడయ్యా |
అన్నిటా శ్రీవేంకటేశ ఆత్మలో నున్నాడవు | విన్నపములేల యిది విడువమయ్యా ||

688) గుజ్జరి
ప|| ఇతని మఱచితిమి యెదుటనే యుండగ యిన్నాళ్ళును నే మెరగక |
ప్రతిలే దితనికి జీవకోట్లకు ప్రాణబంధు డితడు ||
చ|| ముందు నేను ఘనగర్భనరకమున మునిగియున్ననాడు |
బొందితోడనే సుఖదుఃఖంబుల బొరయు తోడునీడితడు |
అంది స్వర్గనరకాదులు చొచ్చిన అక్కడ దావెనువెంటనే |
చందపునాయాతుమలో బాయనిసర్వాత్మకు డితడే ||
చ|| ఆనిపట్టి నే బాపపుణ్యములు అనుభవించవలెనన్నప్పుడు |
మానుపనొల్లడు తా బెరరేచును మతి కనుకూలం బితడు |
నానావిధులను బొరలి యలపుతో నలి నే నిద్రించేటప్పుడు |
తానును ఆపరిమాణంబులకు తగులైవుండును యీతడు ||
చ|| తలచిన దగ్గరు దడవకయుండిన దవ్వయివుండు నితడు |
కలసి మెలసి ఇహపరము లొసంగగ గాచుకవుండును యీతడు |
మెలగుచు సాకారముతో నున్నాడు మేటిశ్రీవేంకటపతి యితడు |
వలసిన వావులచూపులు దాల్చినవా డొకడేపో యీతడు ||

689) దేసాళం / కాపీ
ప|| ఇంతగా మన్నించి వేడుకొంటి నిలలోన | వింతగా నెవ్వరినిక వేడబోయ్యేనయ్యా ||
చ|| కలవారిలోన నీవు గలవాడవని నేను | కలసి లేనివారిలో కర్మములేనివాడను |
బలుపులలో నీదాస్యబలవంతుడ నేను | యెలమి మాకిక జూడ నేమిగడమయ్యా ||
చ|| నెమ్మదిలోనివారిలో నీకుక్షిలోపలివాడ | నమ్మనివెలివారిలో నాస్తికులవెలివాడ |
నమ్మి పదస్థులలోన పరమపదమువాడ | ఇమ్మని నిన్నడిగేది ఇక నేటిదయ్యా ||
చ|| ధర్మపువారిలో నీదయాధర్మపువాడ | మర్మపువారిలో నీమాయలమర్మమువాడ |

అర్మిలి శ్రీవేంకటేశ అంతర్యామివి నీవు। నిర్మించినవాడ నేను నెలకొంటినయ్యా॥

690) గుండక్రియ

ప॥ అందాక వైష్ణవ మటకట కే। నిందకు బాసిన నిర్మలుడగును॥

చ॥ పాపపురాసులు పరిహరమైతే। దీపించుహరిభక్తి వొడమును।
చేపట్టి పుణ్యము చేరువలయితే। శ్రీపతిదాసుల సేవే దొరకు॥

చ॥ కొట్టగొనకు మతి గోరి పారితే। జట్టిగ హరికథ చవిగలుగు।
పట్టినజన్మము పావనమైతే। మట్టులేనితిరుమంత్రము దొరకు॥

చ॥ గురుకటాక్ష మొకకొంత సోకితే। శరణాగతి నిశ్చలమవును।
యిరవుగ శ్రీవేంకటేశ్వరు గొలిచితే। పరమపదమునకు బాత్రుండవును॥

691) ఆహిరి

ప॥ సేయరానిచేతలెల్లా జేసితి నేను నీ-। కాయగంటివాడ నేను గతిచూపవయ్యా॥

చ॥ శరణాగతుల గూడి జ్ఞానము దొంగిలినాడ। అరిది నీకర్మపుటాజ్ఞలు మీరినవాడ।
సరి బ్రపంచకులముజాడ వాసినవాడ। ధరణి నీతప్పులకు దండ యేదయ్యా॥

చ॥ బహుసంసారములెల్ల బంచల దోసినవాడ। సహజనింద్రియముల జారినవాడ।
మహి నాపుట్టుగులకే మరి బొమ్మబెట్టినాడ। విహిత మిందుకు నేది విధి చెప్పవయ్యా॥

చ॥ గురుమంత్రమునకు గొండెము చెప్పినవాడ। పరకాంతలగూడేలోకభయము మానినవాడ।
సిరులమించినయట్టిశ్రీవేంకటేశ నిన్ను। మరిగి శరణంటిని మన్నించవయ్యా॥

692) గుండక్రియ

ప॥ ఇదిగా దదిగా దిన్ని యు నింతే। పదిబది హరి నీపదమే నిజము॥

చ॥ సురలకు నసురలు చూపట్టు రాజులు। అరసి కనగ గతమగువారె।
సిరుల వీరి గొలిచెద మంటే మఱి। కెరలి పరుల రక్షింపగగలరా॥

చ॥ పదునాలుగవది బ్రహ్మలోకమును। కదిసి నీరునుకలపొలము।
చెదరక యిక దముజేరినవారల। వుదుటున నిముడుక వుండగగలదా॥

చ॥ అచ్చుతుడవు నీయచ్యుతపద మది। యిచ్చట శ్రీవేంకటేశుడవు।
చొచ్చిరి నీశరణు శుకసనకాదులు। మచ్చిక నిదిగని మరిగితిమయ్యా॥

693) వరాళి

ప॥ పెట్టినదైన మెరుగు బీర కాయలోనిచిక్కు। దిట్ట కూళ ప్రాణులమై తిరుగుతగాకా॥

చ॥ కాయము మోచి పుట్టి కర్మమున కొడిగట్టి। రోయబోతే మేనిలోనిరోత వోయీనా।
పాయపువల దగిలి పాపపుణ్యముల జిక్కి। తీయబోతే వచ్చునా తెగరానిబంధము॥

చ॥ జగములో గతువడి సంసారదుఃఖమంది। నగబోతే గొంతైనా నవ్వు వచ్చీనా।
చిగురుటాస దగిలి చింతాజలధి బడి। యెగదిగ జూడబోతే యెందుకు నెక్కినది॥

చ॥ పరమాత్ముమతి గని భజనములెల్ల గడచి। ధరణి మాయలతోడితగు లున్నదా।
సిరుల మించినయట్టి శ్రీవేంకటేశ్వరుని। మరిగి కొల్చిన మాకు మరి చింతలేలా॥

694) లలిత

ప॥ ఏల వెట్టిసేయించే విందున నీకేమివచ్చె। కాలము కర్మముచేత గప్పేవు లోకులను॥

చ॥ బద్దులమాటలాడి భ్రమయించి రేపల్లెలో। ముద్దులు చూపి వెన్నలు ముచ్చిలినట్టు।
కొద్దిమాలినకర్మము కొంత మాకు గడియించి। వద్ద నిన్ను గానివానివలె దాగవలెనా॥

చ॥ మఱి పాండవులకు నెమ్మది వావులటు చెప్పి। మెఱగి యిందరిలోన మొక్కినయట్టు।
కుఱుకుఱదై వాల గొందరను గడియించి। యెఱిగి నెఱుగనట్టె యేమిసేసేవయ్యా॥

చ॥ వర మడుగగబోయి వడి ఘంటాకర్ణునికి। యిరవుగ మోక్షవరమిచ్చినయట్టు।
తిరమై శ్రీవేంకటాద్రి దిరువారాధన గొని। వరుస నీదాసులకు వరమిచ్చేవయ్యా॥

695) ధన్యాసి

ప॥ తగు మునులు ఋషులు తపములు సేయగ। గగనము మోచియు గర్మము దెగదా॥
చ॥ ధరణీధర మందరధర నగధర। చిరకౌస్తుభధర శ్రీధరా।
కరి గాచితి కాకము గాచితి నీ-। కరుణకు బాత్రము గలదిదియా॥
చ॥ భవహర మురహర భక్తపాపహర। భువనభారహర పురహరా।
కవిసినవురుతమగద్దను మెచ్చితి-। వివల నీదయకు నివియా గురుతు॥
చ॥ శ్రీవేంకటపతి శేషగరుడపతి। భూవనితాపతి భూతపతి।
గోవుల నేలితి కోతుల నేలితి। పావనపుగృపకు బాత్రము లివియా॥

696) శంకరాభరణం
ప॥ ఎవ్వరు గాననివాడు యశోద గనె నట్టె। పవ్వళించేబ్రహ్మతండ్రి బాలుడయ్యె నట్టె॥
చ॥ ఘనయోగీంద్రులమతి గట్టువడినట్టివాడు। పనిలేక రోల గట్టుపడివాడట్టె।
తనియ సురలకు పాదము చూపినట్టివాడు। మొనసి బండిమీద మోపినాడట్టె॥
చ॥ అమృతము చేత దచ్చి అందరికిచ్చినవాడు। తమితో వెన్న దొంగిలె దానె యట్టె।
గుమ్మరై దేవదానవకోటికి జిక్కనివాడు। భ్రమసి గోపికలపాల జిక్కినా డట్టె॥
చ॥ యిందు గల డందులేడనెంచి చూపరానివాడు। అందమై రేపల్లె వాడ నాడీనట్టె।
అంది కృష్ణావతారమయినట్టిదేవుడే। యిందున శ్రీవేంకటాద్రి యెక్కి నిలిచె నట్టె॥

697) రామక్రియ
ప॥ పెరిగి పెద్దగాను మరి పిన్న వాడగాను। యిరవుగ నే బుదెరిగెడి దెపుడు॥
చ॥ కంకిగ బహునరకంబులు చొచ్చితి। నింకా భయ మది యెరగను।
జంకెనలనే పలుచదువులు చదివితి। మంకుదనం బిది మానదు॥
చ॥ తియ్యక కడు బెనుదేహాలు మోచితి। నయ్యో యింకా నలయను॥
నెయ్యపు హేయము నిచ్చలు గడిగెద। చియ్యని రోయను సిగ్గూ బడను॥
చ॥ ధర్మము సేసితి దానము లొసగితి। కర్మము లింకా గడపను।
అర్మిలి శ్రీవేంకటాధిప నీకృప। నిర్మల మైతిని నే నిపుడు॥

698) బౌళి
ప॥ కన్న దేటిదో విన్న దేటిదో కాగలదిక నేదో।
నన్ను గానను నిన్నుం గానను నడుమ బట్టబయలు॥
చ॥ నీమాయమహిమో నే నేరనికడమో।
భూమిలోన నీవున్నాడవు నాపుట్టుగులు గలవు।
యేమి గాగలనో యింకా మీదట నిటకతొల్లి యేమైతినో।
సోమార్కుల వుదయాస్తమయంబులు చూచుచున్నాడను నేను॥
చ॥ జ్ఞానము నీవో అజ్ఞానంబే బలువో।
నీనామంబులు అనంతకోట్లు నిలుకడగాను।
కానగల యీ ప్రపంచమెల్లా కలయో యిది నిజమో।
కానరాని యీ ముక్కున నూర్పులు కాలము గొలచేటికుంచములు॥
చ॥ నీకు నీవే నను దయ దలచితివో నేనాచార్యుని నమ్మితివో।
కైకొని నాయంతర్యామివి నిను గంటి నిపుడే నేను।
శ్రీకాంతుడు వో శ్రీవేంకటేశ్వర శ్రీవైకుంఠమే యీజగము।
యేకడ చూచిన నీదాసులు నాయెదుటనే వున్నారు॥

699) దేసాక్షి / కానడ
ప॥ కానరు నాలుగుకరములవానిని। శ్రీనాథుండని చేరగవలదా॥
చ॥ ఘనచక్రముతో గరుడనినెక్కుక। కినిసి మెరయు నలకృష్ణునివి।
ఘనులై ఇప్పటికాలపుమనుజులు। మునుపు విష్ణుడను మొక్కగవలదా॥

చ॥ కులదేవతలకు భయములు మాన్పుచు। అలవిశ్వరూపమైనపుడు।
చలము మాని యచ్చటికౌరవులును। తెలిసి దేవుడని కొలువగవలదా॥
చ॥ చెప్పినయితడే శ్రీవేంకటమున। యెప్పుడు వరములు ఇయ్యగను।
తప్పక యీతని దాసులవలెనే। యిప్పటివారలె యెరగగవలదా॥

700) బౌళి
ప॥ నిండుమనసే నీపూజ। అండ గోరకుండు టదియు నీపూజ॥
చ॥ యిందు హరి గల డందు లేడనేటి। నిందకు బాయుటే నీపూజ।
కొందరు చుట్టాలు కొందరు పగనే-। అందదుకు మాను టదియే నీపూజ॥
చ॥ తిట్టులు గొన్నని దీవెనె గొంతని। నెటుకోనిదే నీపూజ।
పెట్టినబంగారు పెంకును నినుమును। అట్టే సరి కాదనుటదియు నీపూజ॥
చ॥ సర్వము నీవని స్వతంత్రముడిగి। నిర్వహించుటే నీపూజ।
పర్వి శ్రీవేంకటపతి నీదాసు ల-। పూర్వమనియెడిబుద్ధి నీపూజ॥

701) రామక్రియ
ప॥ పలుదెరువులు నీకు బాటించజెల్లును। వొలిసి మీదాసు లవుటొకటే మాతెరువు॥
చ॥ హరి నీకు జీవరాసులందరును సరియే। సురల కెక్కుడు నీవు చూడ మాకైతే।
యిరవులు గలవు నీ కెక్కడ చూచినను। అరిదినీ శ్రీపాదాలందె మాయిరవు॥
చ॥ నందగోపాదులకెల్ల నందనుడవు నీవు। యిందరికి దండ్రివి మా కిటు నీవైతే।
అందిన శబరివిందు అఖిలభాగ్యము నీకు। చిందిన నీప్రసాదమే సిరి లిచ్చె మాకును॥
చ॥ అచ్చుగ మునులు బుషులందరును నీబంట్లే। తచ్చినయేలికలు నీదాసులు మాకు।
యిచ్చల శ్రీవేంకటేశ యిహపరమెల్లా నీవు। చొచ్చితిమి నీమరుగు సూదివెంట దారమై॥

702) లలిత
ప॥ ఇంతగాలమాయ నన్ను యేమీనన్నవారు లేరు। చింత సంసారపుమాయ జిక్కించనేకాని॥
చ॥ యెందరు బ్రహ్మలో నన్ను యిటు పుట్టించినవారు। యెందరు యములో హరియించినవారు।
యెందుకు నందుకేకాని యిల నే జేసినపాప-। మంది వహించుక కాచినట్టివారు లేరు॥
చ॥ తల్లిదండ్రు లెందరో తనువు ఎంచినవారు। కొల్లగా సతులెందరో కూడినవారు।
చిల్లరపనికేకాని చేరబిలిచి వైకుంఠ-। ముల్లసాన నిచ్చేవారు వొకరూ లేరు॥
చ॥ కాలమును వీటిబోయె కర్మమును దెగదాయె। మూలనుండి యెవ్వరికి మొరవెట్టేను।
ఆలించి శ్రీవేంకటేశ అంతరాత్మవై నన్ను-। నేలితివి యింతపని కెవ్వరును లేరు॥

703) సాళంగనాట
ప॥ పంచేంద్రియములనేపట్టణస్వాములాల। తెంచి బేర మాడుకొని దించరో బరువు॥
చ॥ తగినసంసారసముద్రములోన దిరిగాడి। బిగువుదేహపుటోడబేహారివాడ।
జగతి బుణ్యపాపపుసరకులు దెచ్చినాడ। దిగితి బూతురేవున దీరుచరో సుంకము॥
చ॥ అడరి గుణత్రయములనేటితెడ్డులచేత। నడుమ నిన్నాళ్ళదాకా నడిపినాడ।
కడుజంచలములనేగాలిచాప లెత్తినాడ। వెడమాయపుసరకు వెలకియ్యరో॥
చ॥ ఆతుమయనేటికంభ మంతరాత్మ డెక్కియుండి। నీతితో మమ్ముగాచుక నిలుచున్నాడు।
ఆతడే శ్రీవేంకటేశు డటు మాకు మీకు గర్త। ఘాతమాని ఇకమాకు కడుగుణ మియ్యరో॥

704) పాడి
ప॥ ఏడే జేనలు యీదేహంబును। యేడా నికమరి యెరుగము నేము॥
చ॥ నిండును జలధులు నిముషమాత్రమున। నిండియు నిండదు నెఱి మనసు।
పండును భువిగల పంటలన్నియును। పండదు నాలో బాపపుమనసు॥
చ॥ పట్టవచ్చు నల పారేటిపాపమును। పట్టరాదు నాపాయము।
అట్టె ఆరును అనలము నీటను। యెట్టైన నారదు యీకోపంబు॥

*****************************************************************************************

చ|| కానవచ్చు నదె ఘనపాతాళము। కానరాదు నాకాలము।
శ్రీనగవిహార శ్రీవేంకటేశ్వర। సోనల బుట్టిన సుద్దు లివిగో॥

705) వరాళి

ప|| కలిమిలేములెల్లా కాలముస్వభావము। తలపులో జ్ఞానము దక్కెడి దొకటే॥

చ|| పుట్టుగులు జీవునికి పూచినస్వభావము। వొట్టి యిదె సారెసారె వోమనేలా।
పట్టి నానాటిబ్రదుకు ప్రపంచముస్వభావము। కొట్టగొన హరి ముక్తి గోరెటి దొకటే॥

చ|| మక్కువసంసారముమాయలస్వభావము। చిక్కి కన్న వారికెల్లా మొక్కుకోనేలా।
తక్కక రక్షించేడి దైవముస్వభావము। నిక్కపువైరాగ్యము నిలుచుట వొకటే॥

చ|| కప్పినభోగములెల్లా కర్మస్వభావము। తప్పక ప్రియముచెప్పేదైన్యమేలా।
యెప్పుడు శ్రీవేంకటేశ యెదలో నాకుగలవు। చప్పుడు సేయక నీకు శరణనే దొకటే॥

706) శుద్ధవసంతం

ప|| ఆతడదె మీరదె అప్పగించితిమి మేము। మీతల పుదాన నేను మీకేలే చింత॥

చ|| నన్ను నేల అడిగేరే నాటి నేటి సుద్దులు। అన్నియును నడుగరే ఆతనిని।
పన్నిన వారిద్దరికి పైపై మీరే కారా। వెన్న చేత బట్టుకొని నేడ నేలే నెయ్యి॥

చ|| యేలకొడ బర చేరే యింతలోనే నన్నును। చాలు నొడ బరచరే చాలు నాతని।
పోలిమితో నింతేసి బుద్ధి మీరెరగనిదా। తాలము చేత బట్టుకొని దాటనేలే వాకిలి॥

చ|| ఆనలేల పెట్టేరే ఆతనితో గూడుమని-।పేని యాన లతనికే పెట్టరాదా।
ఆనుక శ్రీవేంకటేశు డాతడే నన్ను గూడె। తేనెలు వంటి చెలులు తీపులు మీకేలే॥

707) సామంతం/కానడ

ప|| ఆ రూపమునకే హరి నేను మొక్కెదను। చేరి విభీషణుని శరణాగతుడని చేకొని సరిగాచితివి॥

చ|| ఫాలలోచనుడు బ్రహ్మయు నింద్రుడు। సోలి నగ్నియును సూర్యచంద్రులును।
నీలోనుండగ నెరి గనె కిరీటి। మూల భూతివగు మూర్తివి గాన॥

చ|| అనంత శిరసుల ననంతపదముల। ననంతనయనము లనంతకరముల।
ఘన నీరూపము కనుగొనె కిరీటి। అనంతమూరితి వన్నిట గాన॥

చ|| జగములిన్నియును సకల మునీంద్రులు। నగు శ్రీవేంకటనాథుడ నిన్నే।
పొగడగ కిరీటి పొడగనె నీరూపు। అగణిత మహిముడ వన్నిట గాన॥

708) సాళంగనాట

ప|| తాముస్వతంత్రులు గారు దాసోహము నన లేరు। పామరపుదేహులకు పట్టరాదు గర్వము॥

చ|| పరగుబ్రహ్మాదులు బ్రహ్మమే తా మనలేరు హరికే। మొరవెట్టేరు ఆపదైతేను।
ధరలో మనుజులింతే తామె దయివమనేరు। పొరి దాము చచ్చిపుట్టే పొద్దెరగరు॥

చ|| పండినవ్యాసాదులు ప్రపంచము కల్లనరు। కొండలుగా బురాణాల గొనియాడేరు।
అండనే తిరిపెములై అందరినడిగి తా-। ముందుండి లేదనుకొనే రొప్పదన్నా మానరు॥

చ|| సనకాదియోగులు శౌరిభక్తి సేసేరు దు-। ర్జనులు భక్తి వొల్లరు జ్ఞానులమంటా।
నినుపయి శ్రీవెంకటేశ నిను జేరి మొక్కుతానే। అనిశము నిరాకారమనేరు యీద్రోహులు॥

709) దేవగాంధారి

ప|| ఆహా నమో నమో ఆదిపురుష నీకు। ఈహల నెంతవాడను ఎట్టుగాచితివి॥

చ|| లోకాలోకములు లోన నించుకొన్న నీవు। ఈకడ నా యాత్మలోన నెట్టణగితివి।
ఆకడ వేదములకు నగోచరమైన నీవు। వాక్కుచే నీ నామముల వడి నెట్టణగితివి॥

చ|| అన్నిటా బ్రహ్మాదుల యజ్ఞ భోక్తవైన నీవు। అన్న పానాదు లివి యెట్టారగించితివి।
సన్నుతి పూర్ణుడవై జనియించిన నీవు। వున్నతి నా పుట్టుగలో వొకచో నెట్టుంటివి॥

చ|| దేవతలచే పూజ తివిరి గొనిన నీవు। ఈవల నాచే పూజ ఎట్టుగొంటివి।
శ్రీవేంకటాద్రి మీద సిరితో గూడిన నీవు। ఈ వీధి మా యింట ఇపుడెట్టు నిలిచితివి॥

*****************************************************************************************

710) లలిత
ప|| ఆడుతా పాడుతా అట్టె ముద్దుగునుసుతా | వోడక నీదండ చేరి వున్నా రమయ్యా ||
చ|| ఆస తల్లిదండ్రిమోము అట్టె చూచి శిశువులు | యే సుఖదుఃఖములు తామెరగనట్టు |
వాసుల శ్రీపతి మిమ్ము పడి నాత్మ దలచుక | యీసుల పుణ్య పాపము లెరగమయ్యా ||
చ|| యేలినవారు వెట్టగా నేపున దొత్తులు బంట్లు | ఆలకించి పరులబోయడుగనట్టు |
తాలిమి శ్రీపతి మీరు తగ మమ్ము రక్షించగా | యేలని యేమియు గోర నెరగమయ్యా ||
చ|| చేత జిక్కి నిధానము చేరి యింటగలవాడు | యేతుల గలిమిలేములు లెరుగనట్టు |
ఆతుమలో శ్రీవేంకటాధిప నీవుండగాను | యీతల నేవెలుతులు నెరగమయ్యా ||

711) మంగళకౌశి/కురంజి
ప|| ఆడరో పాడరో అప్సరోగణము | వీడెము లిందరో విభవము నేడు ||
చ|| కమలారమణుని కళ్యాణమునకు | తమినదె గరుడధ్వజ మెసగె |
తెమలుచు మ్రోసెను దివ్యదుందుభులు | గమనించరో దివిగల దేవతలు ||
చ|| వెలయగ లక్ష్మివిభుని పెండ్లికిని | బలసి అంకురార్పణ మదివో |
కలగొన నిచ్చేరు గంధాక్షతలవే | చెలగి కైకొనరో శ్రీవైష్ణవులు ||
చ|| బడి శ్రీవేంకటపతికి శ్రీసతికి | అడరిన తలబాలందె నిదె |
నడచి పరుషలు నానా ముఖముల | ముడుపులు చదువరో ముయిగా నరులు ||

712) లలిత/హిందోళ
ప|| ఆదివిష్ణు వీతడే యటరమ్మ | ఆదిగొని భూభార మణచీనోయమ్మా ||
చ|| చందురునుదయవేళా సవరేతిరికాడ | కందువ దేవకి బిడ్డగనెనమ్మా |
పొందుగ బ్రహ్మాదులు పురుటింటివాకిటను | చెంది బాలుని నుతులు సేసేరోయమ్మా ||
చ|| వసుదేవుని యెదుట వైకుంఠనాథుడు | సిసువై యవతరించీ చెలగీ నమ్మా |
ముసిముసినవ్వులతో మునులకు ఋషులకు | యిసుమంతవాడభయమిచ్చీనమ్మా ||
చ|| కన్న తల్లిదండ్రులకు కర్మపాశము లూడిచి | అన్నిటా రాకాసిమూక లణచీనమ్మా |
వున్నతి శ్రీవేంకటాద్రినుండి లక్ష్మీదేవితోడ | పన్ని నిచ్చకల్యాణాల బరగీనమ్మా ||

713) లలిత
ప|| అతడే పరబ్రహ్మం అతడే లోకనాయకుడు | అతనికంటే మరి అధికులు లేరయ్యా ||
చ|| కమలవాసిని లక్ష్మికి కలదా యెవ్వరికైనా? | కమలనాభునికి ఒక్కనికే కాక |
కమలజుడైన బ్రహ్మ కలడా యెవ్వని నాభి- | నమర వంద్యుడు మాహరికే కాక ||
చ|| అందరునుండెడి భూమి అన్యులకు కలదా | అందపు గోవిందునికే ఆలాయగాక |
చెందిన శ్రీభాగీరథి శ్రీపాదాల గలదా | మంథరధరుడైన మాధవునికే(కి) గాక ||
చ|| నిచ్చలు అభయమిచ్చే నేరుపు యెందుగలదా | అచ్చుగా నారాయణునియందే గాక |
రచ్చల శరణాగతరక్షణమెందు గలదా | తచ్చిన శ్రీవేంకటాద్రి దైవానికేగాక ||

714) మలహరి / బిలహరి
ప|| విశ్వమెల్ల నీ విరాడ్రూపము | శాశ్వతహరి నీశరణులము ||
చ|| కన్నుల సూర్యుడు కమలాప్తుడు నీ- | పన్నినమోమున బ్రాహ్మణులు |
వున్నతివైశ్యులు వూరుపులందును | యెన్నగ శూద్రులు యిదె పాదములు ||
చ|| యింద్రాదిదేవత లీశానబ్రహ్మము- | నీంద్రు లంగముల నెసగిరదే |
సాంద్రలోకములు జఠరంబున నవె | రుద్రతేజ మదె రోమముల ||
చ|| కాలము గర్మము గైవల్యంబును | ఆలోను వెలియు నదినీవు |
శ్రీలలనాధిప శ్రీవేంకటేశ్వర | కోలుముందు నిను గొలిచితిమయ్య ||

715) శంకరాభరణం
ప|| ఆతడె సకలము అని భావింపుచు | నీతితో నడవక నిలుకడ యేది ||

చ|| యెందును జూచిన యీశ్వరుడుండగ। విందుల మనసుకు వెలితేది।
సందడించేహరిచైతన్య మిదివో। కందువలిక వెదకగ నేది॥
చ|| అంతరాత్ముడై హరి పొడచూపగ। పంతపుకర్మపుభయ మేది।
సంతత మాతడే స్వతంత్రుడిదివో। కొంత గొంత మరి కోరేది లేదు॥
చ|| శ్రీవెంకటపతి జీవుని నేలగ। యీవల సందేహ మిక నేది।
భావం బీతడు ప్రపంచ మీతడు। వేవేలుగ మరి వెదకెడిదేది॥

716) అఠాణ
ప|| అతడెవ్వాడు చూపరే అమ్మలాల। ఏతుల నాడేటి కృష్ణుడీతడే కాడుగదా॥
చ|| కందువ దేవకి బిడ్డగనె నట నడురేయి। అందియశోదకు గొడ్డుకైనాడుట।
నందాడించి పూతకిచంటి పాలుదాగెనట। మందల ఆవులగాచి మలసెనట॥
చ|| మంచిబండి దన్నెనట ముద్దులు విరిచెనట। ఇంచుకంతవేల గొండయెత్తి నాడుట।
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట। మించుల బిల్ల గోలివట్టి మెరసెనట॥
చ|| కాళింగుని మెట్టెనట కంసుబొరిగొనెనట। పాలించి సురల జేపట్టెనట।
యీలీల వేంకటాద్రి నిరవైనదేవుడట। యేలెనట పదారు వేలింతుల నిందరిని॥

717) ఆహిరి
ప|| అందరికి నెక్కుడైన హనుమంతుడు। అందుకొనె సూర్యఫలమని హనుమంతుడు॥
చ|| బల్లిదుడై లంకజొచ్చి బలురాకాసుల గొట్టి। అల్లకల్లోలము చేసె హనుమంతుడు।
వొల్లనె రాముల ముద్దుటుంగరము సీత కిచ్చె। అల్లదె నిలుచున్నాడు హనుమంతుడు॥
చ|| దాకొని యాకెముందర తనగుఱు తెఱిగించి। ఆకారమటు చూపె హనుమంతుడు।
చేకొని శిరోమణి చేతబట్టి జలనిధి। ఆకసాన దాటివచ్చె హనుమంతుడు॥
చ|| కొంకకిట్టె సంజీవి కొండ దెచ్చి రిపులకు। నంకకాడై నిలిచెను హనుమంతుడు।
తెంకినే శ్రీవేంకటాద్రి దేవుని మెప్పించినాడు। అంకె కలశాపురపు హనుమంతుడు॥

718) భైరవి
ప|| అతడు భక్తసులభు డచ్యుతుదు। రాతిగుండెవాడు గాడు రంతు మాను దికను॥
చ|| జీవుడా వేసరకు చిత్తమా జడియకు। దైవము గరుణించ దడవుగాదు।
తోవచూపె మనకుతొల్లే ఆచార్యుడు। కావలసినట్లయ్యీ గలగకు డికను॥
చ|| కాలమా వేగిరించకు కర్మమా నన్ను మీరకు। పాలించ దైవానకు నే భార మికను।
ఆలించి తిరుమంత్రమే ఆతని నన్ను గూరిచె-। వేలగాని అందాకా వేసరకు డికను॥
చ|| వెరవకు దేహమా వేసరకు ధ్యానమా। యెరిగి శ్రీవెంకటేశు డెడసిపోడు।
తరి నిహపరము లితనిదాసు లిచ్చిరి। గురియైతి నిన్నిటికి గొంకకుడీ ఇకను॥

719) లలిత
ప|| అందాకా నమ్మలేక అనుమానపడు దేహి। అంది నీసొమ్ముగనక అదియు దీరుతువు॥
చ|| నీదాసుడననేటినిజబుద్ధి గలిగితే। ఆదెస నప్పుడే పుణ్యుడాయ నతడు।
వేదతో వొక్కొక్క వేళ వెలుతులు గలిగితే। నిదయవెట్టి వెనక నీవె తీరుతువు॥
చ|| తొలుత నీశరణము దొరకుటొకుటేకాని। చెలగి యాజీవునికి జేటు లేదు।
కలగి నడుమంత్రాన గతిదప్పనడచిన। నెలకొని వంకలొత్తనీవే నేరుతువు॥
చ|| నీ వల్ల గొరత లేదు నీపేరు నొడిగితే। శ్రీవేంకటేశ యిట్టె చేరి కాతువు।
భావించలేకుండగాను భారము నీదంటే జాలు। నీవారి రక్షించ నీవె దిక్కైదువు॥

720) దేసాళం/శహన
ప|| అక్కటా రావణు బ్రహ్మ హత్య నీకు నేడది। పుక్కిట పురాణ లింగ పూజ నీకు నేడది॥
చ|| గురు హత్య బ్రహ్మ హత్యను గూడి ద్రోణాచార్యు వంక। హరి నీ కృప నర్జునుకవి లేవాయ।
యెరవుగా గల్లలాడి యేచిన ధర్మ రాజునకు। పరగ నీ యనుమతి బాపము లేదాయను॥

చ॥ అదివో రుద్రుని బ్రహ్మ హత్య బాయ గాసి ఇచ్చి। పొదలిన నీవతని బూజింతువా।
అదన పార్వతీదేవి కాతండే నీ మంత్రమిచ్చె। వదరు మాటల మాయా వచనాలేమిటికి॥
చ॥ తగిలిన నీ నామమే తారక బ్రహ్మమై। జగము వారి పాపాలు సన్తతమూ బాప గాను।
మిగుల శ్రీవేంకటేశ నేడ మీకు పాతకాలు। నగుబాటు లింతే కాక నానా దేశముల॥

721) లలిత
ప॥ ఏటినేను యేటిబుద్ధి యెక్కడిమాయ। వీటిబోయే వెర్రి గాను వివేకి గాను॥
చ॥ అరసి కర్మము సేసే అవినన్ను బొదిగితే। దూరుదు గర్మము గొంది దూరుచు నేను।
నేరక లంపటములు నేనే కొన్ని గట్టుకొని। పేరడి బరుల నందు బెట్టరంటాను॥
చ॥ యెక్కుడు నాదోషములు యెన్నైనా వుండగాను। వొక్కరిపాపము లెంతు వూరకే నేను।
తిక్కవట్టి నాకునాకే దేవతల కెల్లా మొక్కి। వొక్కరివాడ గాకుందు వుస్సురనుకొంటాను॥
చ॥ విరతి బొందుదు గొంత వేరే సంసారము జేతు। యెరవుల దాతనే యెప్పుడు నేను।
అరిది శ్రీవేంకటేశు డంతలో నన్ను నేలగా। దొరనైతి నధముడ దొల్లె నేను॥

722) వరాళి
ప॥ ఏటికి సత్యాలు సేసేవెందాకా నీవు।గాటముగనింకా దారుకాణించవలెనా॥
చ॥ చెలియిచ్చిన పువ్వుల చెండునీచేతనున్నది। మలసి నీచేతకది మచ్చముగాదా।
కొలది మీరగ తొల్లె గొల్లెతల మగడవు। యెలమి నీ యెడ్డతనా లెంచి చూపవలెనా॥
చ॥ రమణి చేముద్దుటుంగరము నీవేలనున్నది। కొమరై నీపొందు కది గురుతుకాదా।
తమితోడ నీవుతొల్లి ధర్మరాజు మఱిదివి। గములై నీ నిజాలకు కడగురుతున్నదా॥
చ॥ అంగనకంటసరి నేడట్టె మెడనున్నది। సంగతిగా నీకదే లాంఛనము గాదా।
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశ్వర। అంగపు నీరీతులకు నౌగాములున్నవా॥

723) శంకరాభరణం
ప॥ మునులతపము నదె మూలభూతి యదె। వనజాక్షుడే గతి వలసినను॥
చ॥ నరహరినామము నాలుకనుండగ। వర మొకరి నడుగబనియేల।
చిరపుణ్యము నదె జీవరక్ష యదె। సరుగ గాచు నొకసారె నుడిగినా॥
చ॥ మనసులోననే మాధవు డుండగ। వెనుకొని యొకచో వెదకగనేటికి।
కొనకుగొన యదే కోరెడి దదియే। తను దారక్షించు దలచినను॥
చ॥ శ్రీవేంకటపతి చేరువ నుండగ। భావకర్మముల భ్రమయగనేటికి।
దేవుడు నతడే తెరవూ నదియే। కావలెనంటే గావకపోడు॥

724) దేసాళం/ఆభోగి
ప॥ చదివి బతుకరో సర్వజనులు మీరు। కదిసి నారాయణాష్టాక్షర మిదియే॥
చ॥ సాధించి మున్ను శుకుడు చదివినట్టిచదువు। వేదవ్యాసులు చదివినాచదువు।
ఆదికాలపు వైష్ణవులందరి నోటి చదువు। గాదిలి నారాయణాష్టాక్షర మిదియే॥
చ॥ సతతము మునులెల్ల చదివినట్టిచదువు। వెత దీర బ్రహ్మ చదివినాచదువు।
జతనమై ప్రహ్లాదుడు చదివినట్టి చదువు। గతిగా నారాయణాష్టాక్షర మిదియే॥
చ॥ చలపట్టి దేవతులు చదివినట్టిచదువు। వెలయా విజ్ఞులు చదివేటి చదువు।
పలుమార్లు శ్రీవేంకటపతి నామమై। భువి కలుగు నారాయణాష్టాక్షర మిదియే॥

725) సామంతం / శ్రీ
ప॥ ఏది చూచిన నీవే యిన్ని యును మఱి నీవే। వేదవిరహితులకు వెఱతు మటుగాన॥
చ॥ ఇరవుకొని రూపంబులిన్నిటాను గలనిన్ను। బరికించవలెగాని భజియింపరాదు।
హరించెడి సత్సమాగంబు విడిచిన నీ-। స్మరణ విజ్ఞానవాసన గాదుగాన॥
చ॥ యిహదేవతాప్రభలనెల్ల వెలుగుట నీకు ఈ సహజమనవలెగాని సరి గొలువరాదు
ఆహిమాంశుకిరణంబు లన్ని చోట్ల బరగు। గ్రహియింపరా దవగ్రాహములుగాన॥

చ॥ యింతయును తిరువేంకటేశ నీవునికి దగ। జింతింపవలెగాని సేవింపరాదు
అంతయు ననరుహమును నరుహంబనగరాదు। అంతవానికి బరుల కలవడదుగాన॥

726) సామంతం / హుసేని

ప॥ ఈతగవే నాకు నీకు నెంచి చూచితే। కాతరపుజీవులకు గలదా వివేకము॥
చ॥ భారము నీదిగనక పలుమారు బాపములే। చేరి మొక్కలాన నే జేసితిని।
పేరడి దల్లిదండ్రులు బిడ్డ లేమిసేసినాను। వోరుచుక ముద్దుసేసుకుందురు లోకమున॥
చ॥ కాన నీవుగలవని కడదాకా నేరములే। వేవేలు సేసితిని వెఱవక భావించుక।
యింటిదొర పసురము దెంచుకొని। యేవిధి బైరుమేసినా నెగ్గుసేయ డతడు॥
చ॥ పుట్టించేవాడవు నీవు పొదలేవారము నేము। యెట్టుండినా నీకు బోదు యెన్నట్టికిని।
వొట్టుక శ్రీవేంకటేశ వోడగట్టినదూలము। అటునిట్టు బొరలినా నండవాయ దెపుడు॥

727) నాట

ప॥ ఈతడే రఘురాముడీతడేకాంగవీరుడు। యీతడు చేసిన చేత లెన్ని మైనా కలవు॥
చ॥ ఖరదూషణాదులను ఖండతుండములసేసె। అరుదుగా వాలి నొక్కయమ్ముఁన నేసె।
సరవి కొండలచేత సముద్రము బంధించె। ఇరవై విభీషణునికిచ్చె లంకారాజ్యము॥
చ॥ కూడపెట్టి వానరుల, కుంభకర్ణాదిదైత్యుల। తోడనే రావణుజంపె దురము గెల్చె।
వేడుకతో సీతాదేవి కూడెను పుష్పకమెక్కె। యీడు జోడై సింహాసన మేలె నయోధ్యలోన॥
చ॥ పుడమియంతయు గాచె పొందుగా తనంతలేసి-। కొడుకుల గాంచెను కుశలవుల।
యెడయక శ్రీవేంకటేశుడై వరములిచ్చె। అడరి తారకబ్రహ్మమై ఇదె వెలసె॥

728) కన్నడగౌళ

ప॥ ఇంత సేసెబో దైవ మింతలోననే అయ్యొ। సంతపాకలంజ దెచ్చి సన్యాసి జేసె॥
చ॥ పరిగెలేరేటివాని బట్టపురాజుగా। బిరతభోగములిచ్చి నిలిపినట్లు।
ధరలోన నతిపాతకుని నన్ను నిట్లు। అరయ నిత్తడి దెచ్చి యపరంజి జేసె॥
చ॥ కుక్కలవండుకతినే కులహీనుని దెచ్చి। వెక్కసపుబాపని గావించినయట్లు।
దిక్కులెఱగగ గష్టదేహిని నన్ను దెచ్చి। గక్కన దెలుకపిండి కస్తూరి సేసె॥
చ॥ చెడుగైనదోమ దెచ్చి సింహపుగొదమగా। బెడిదంపు బ్రేమతోడ బెంచినయట్లు।
కడునధముని వేంకటపతి నను నిటు। చిడిపిరాయి దెచ్చి చింతామణి సేసె॥

729) సామంతం / సారాంగ

ప॥ ఇంతట గావగదే ఇందిరానాయక నన్ను। పంతాన గాకాసురని బాలించినట్లు॥
చ॥ దించని పంచభూతాల దేహము మోచితిగాన। నించిన యజ్ఞానమున నిన్ను నెరగ।
పంచేంద్రియములచే బట్టువడ్డ వాడ గాన। యెంచరాని పాపములే యిన్నియు జేసితిని॥
చ॥ మిన్నువంటి జఠరాగ్ని మింగి వున్నవాడగాన। కన్నవెల్లా వేడివేడి కిష్టపడితి।
పన్నిన సంసారపుబ్రమ బడ్డవాడగాన। అన్నిటా దేవతలకు సరిగాపనైతి॥
చ॥ ఆతుమలో నీ వుండే భాగ్యము గలవాడగాన। చైతన్యమున నీకు శరణంటిని।
నీతితో శ్రీవేంకటేశ నీ పాలివాడగాన। బాతితో సర్వము నీ కొప్పనము సేసితిని॥

730) రామక్రియ

ప॥ ఇదె శిరసు మాణిక్యమిచ్చి పంపె నీకు నాకె। అదనెరిగి తెచితిని అవతరించవయ్యా॥
చ॥ రామ నిను బాసినీ రామ నేజూడగ నా-। రామమున నిను పాడె రామ రామయనుచు।
ఆమెలుత సీత అని అపుడు నే దెలిసి। నీ ముద్ర ఉంగరము నేనిచ్చితిని॥
చ॥ కమలాప్త కులుడ నీ కమలాక్షి నీ। పాద కమలములు తలపోసి కమలారి దూరె।
నెమకి ఆ లేమను నీ దేవి అని తెలిసి। అమరంగ నీ సేమమటు విన్నవించితిని॥
చ॥ దశరథాత్మజ నీవు దశ శిరుని జంపి। ఆ దశనున్న చెలి కావ దశ దిశలు పొగడ।
రసికుడ శ్రీ వేంకట రఘు వీరుడా నీవు। శశిముఖి చేకొంటివి చక్కనాయె పనులు॥

731) దేసాక్షి / బిలహరి
ప॥ ఇతనికంటే నుపాయ మిక లేదు। మతిలోననున్న వాడు మర్మ మిదే సుండీ॥
చ॥ ఇన్ని లోకసుఖములు ఇంద్రియప్రీతులే। తన్ను గనినతల్లిదండ్రి తనుపోషకులే।
కన్ను లెదిటిధనాలు కారణార్థములే। వున్నతి నిష్టార్థసిద్ధి కొక్కడే దేవుడు॥
చ॥ కలదేవత లిందరు కర్మ ఫలదాతలే। లలి విద్యలెల్ల ఖ్యాతిలాభపూజలకొరకే।
పలుమంత్రములెల్లను బ్రహ్మలోక మీసందివె। వొలిసి ఇష్టార్థసిద్ధి కొక్కడే దేవుడు॥
చ॥ అనుదినరాజసేవ లల్పార్థహేతులే। కొనగల్పవృక్షమైన గోరినవిచ్చేటిదే।
ఘన శ్రీవేంకటేశుడు కల్పించె జీవుని గావ। వొనర నిష్టార్థసిద్ధి కొక్కడే దేవుడు॥

732) ఘుజ్జరి
ప॥ ఇంతేపో వారివారిహీనాధికములెల్ల। పంతాన తా మేపాటిభాగ్యము నాపాటే॥
చ॥ అందరిలో దేవుడుండు అందధికులు గొందరు। కొందరు హీనులై కుందుదు రింతే।
చెంది వీచేగాలొకటే చేనిపంటా నొకటే। పొంది గట్టికొలుచుండి పొల్లు కదబడును॥
చ॥ పుట్టుగందరి కొకటే భూమిలో యేలికలును। వెట్టిబంట్లు గొందరై వీగుదు రింతే।
చుట్టి వరి గురుమతో జొన్న గింజ సరిదూగు। తెట్టలై మేలొకటికి తీలొకటికాయ॥
చ॥ కోరి శ్రీవేంకటపతికుక్షిలోనే లోకములు। అరయ గిందెడు మీదెడై వున్న వింతే।
యీరీతి నితనిదాసు లెక్కిరి పొడవులకు। తారి కిందికి దిగిరి దానవులై కొందరు॥

733) దేసాళం / కాంభోజి
ప॥ ఇన్ని దేహముల బుట్టి యేమిగంటిమి। వున్నతపు హరిదాస్యమొక్కటేకాక॥
చ॥ హీనజంతువైననాడు యేనుగై పుట్టిననాడు। ఆనంద మొక్కటే అంగాలే వేరు।
యీనేటియజ్ఞానము యీజీవుల కొక్కలాగే। జ్ఞానమే యెక్కుడుగాక సరిలేని దొకటే॥
చ॥ నరలోక భోగానకు నరకానుభవానకు। సరేగాని మిగులదు చనె దొల్లె।
గరిమ నేర్పడ నందు ఘనమేమి కొంచెమేమి। హరిదాసుడై బ్రదుకుటదియే లాభము॥
చ॥ బాలుడైనయప్పుడూను పండి ముదిసినప్పుడు। కాలమొక్కటే బుద్ధి కడు లేదు।
ఆలకించి శ్రీవేంకటాధిపతి సేవించి। యేలికంటా మొక్కుచుండే దిదియే భాగ్యము॥

734) భుజంగిణి
ప॥ ఇదియే సులభము ఇందరికి। కదియగ వశమా కరుణనె గాక॥
చ॥ నగధరుండు పన్నగశయనుడు భూ-। గగనాంతరిక్ష గాత్రుండు।
అగణితుడితని నరసి తెలియగా। తగునా కనెడిది దాస్యమె గాక॥
చ॥ కమలజ జనకుడు కాముని జనకుడు। కమలాసతిపతి ఘనగుణుడూ।
విమలుండీ హరి వెదకి కావగను। అమరున శరణాగతి గాక॥
చ॥ దేవుడు త్రిగుణాతీతుడనంతుడు।కైవల్యమొసగు ఘనుడితడు।
శ్రీవేంకటపతి జీవాంత రాత్ముడు । భావించ వశమా భక్తినె గాక॥

735) సాళంగనాట
ప॥ ఈపెకు నితడు దగు నితనికీపె దగు। చూపులకు పండుగాయ శోభనము నేడు॥
చ॥ పిలువరె పెండ్లి కూతుబెండ్లిపీటమీదకి। చెలగి తానెదురు చూచీ దేవుడు।
బలుపుగా నిద్దరికి బాసికములు గట్టరె। కలిమెల్ల మెరసి సింగారించరే॥
చ॥ ఆతలదెచ్చి పెట్టరె ఆ పెండ్లి కూతురును। యీతడే జంట శోభన మిద్దరికిని।
కాతరాన బువ్వానకు గక్కన బెట్టరె మీరు। రేతిట నుండియు వేగిరించేరు వీరు॥
చ॥ పానుపు పరచరె బలునాగవల్లి నేడు। పూని తెరవేయరె పోలతులాల।
ఆనుక శ్రీవేంకటేశుడలమేలుమంగయును। లోననె భూకాంతయును లోలులైరి తాము॥

736) రామక్రియ
ప॥ ఇచ్చలో గోరేవల్లా ఇచ్చేధనము। అచ్చుతనామమెపో అధికపుధనము॥

***************************************************************************
చ॥ నారదాదులువొగడేనాలుకపయిధనము। సారపువేదములలో చాటేధనము।
కూరిమిమునులు దాచుకొన్నట్టిధనము। నారాయణనామ మిదే నమ్మినట్టిధనము॥
చ॥ పరమపదవికి సంబళమైనధనము। యిరవై భక్తులకెల్లా నింటిధనము।
పరగ నంతరంగాన పాతినట్టిధనము। హరినామ మిదియపో అరచేతిధనము॥
చ॥ పొంచి శివుడు కాశిలో బోధించేధనము। ముంచినఆచార్యుల మూలధనము।
పంచి శ్రీవేంకటపతి పాలించేధనము। నించి విష్ణునామ మదే నిత్యమైనధనము॥
737) సాళంగం / కాపీ
ప॥ ఇదివో సుద్దులు యీరేపల్లెను। కదిసి యిందరివీ గైకొనవయ్యా॥
చ॥ పలచనిరెప్పల పగటులు నెరపుచు। సొలసి నిన్నొకతె చూచెనటా।
తళుకులగోళ్ళ దండె మీటి యదె। పలికి నిన్నొకతె పాడెనటా॥
చ॥ చనవులు నెరపుచు సన్న సేయుచును। ననుపున నొక్కతె నవ్వెనటా।
చెనకి యొకతె యదె చిగురుగేదగుల। వెనకనుండి నిను వేసెనటా॥
చ॥ అదన నీవు నన్నలమిపట్టగా। కొదలి యొకతె గని గొణగెనటా।
యెదురనె శ్రీవేంకటేశ యొకతె నీ। చెదరినయలకలు చెరిగెనటా॥
738) బౌళి
ప॥ ఇందుకంటే మరి యికలేదు హితోపదేశము వోమనసా।
అంది సర్వసంపన్నుడు దేవుడు అతనికంటే నేరుతుమా॥
చ॥ కల దొకటే ధర్మము కల్పాంతమునకు నిలిచినది।
తలకక మీశరణుచొచ్చి మీదాసుడ ననెడి దొకమాట।
వలవనిజోలే యింతాను వడి నిదిగాక యేమిసేసినను।
శులభ మిందునే తొల్లిటివారలు చూరలు గొని రదేమోక్షంబు॥
చ॥ మొదలొకటే యిన్నిటికి ముందర వెనకా వచ్చేది
వొదుగుచు గోవిందునిదాసులకు నొక్కమాటే మొక్కినజాలు।
తుదకెక్కనివే యితరములు దొరకొని మరేమిసేసినను।
బదికి రిందునే పరమవైష్ణవులు పలుచదువులలో వినరాదా॥
చ॥ తగులొకటే విడువరానిది తతి నెన్నటికిని జెడనిది।
వొగి శ్రీవేంకటపతినామజపము వొకమాటే అబ్బిన జాలు।
నగుబాటే యింతాను నానాటి కేమేమిసేసినను।
తగునీబుద్ధుల నడచిరి మున్నిటిదైవజ్ఞులు పూర్వాచార్యులును॥
739) లలిత
ప॥ నీమహి మది యెంత నీవు చేసేచేత లెంత। దీమసపు నీమాయలు తెలియరాదయ్యా॥
చ॥ నీపాదతీర్థము నెత్తి మోచె నొకడు। పూపకొడుకై యొకడు బొడ్డునబుట్టె।
యేపున నింతటివారి కెక్కుడైనదైవమవు। మోపుచు ధర్మరాజుకు మొక్కుబెట్టయ్యా॥
చ॥ నీలీల జగమెల్లా నిండియున్న దొకవంక-। నోలి నీలో లోకా లున్న వొకవంక।
యేలీలజూచినాను యింతటిదైవమవు। బాలుడై రేపల్లెలో బారాడితి వెట్టయ్యా॥
చ॥ శ్రీసతికి మగడవు భూసతికి మగడవు। యీసరుస శ్రీవేంకటేశుడవు।
రాసికెక్కి నీవింతటి రాజసపుదైవమవు। దాసులము మాకెట్ల దక్కితివయ్యా॥
740) ముఖారి
ప॥ ఇందుమీద సతిభావ మెట్లౌనో యేమౌనో। విందుగా జెలువునికి విన్నవించరే॥
చ॥ కోవిలకూతకుగానే గుండె జల్లురని చెలి। పూవక పూచిన యట్టు పులకించె।
మావినుండి యంతలోనే మదన భూతముసోకె। పోవులైన పుప్పొడినే పోయరే బడిమి॥
చ॥ కోమలి చందురుడనే కొరవిదయ్యము జూచి। దీమన మింతయు మాని దిగులందెను।
***************************************************************************

తేమలైన వెన్నెలలల దిమ్ముగ వట్టి నిలువున। మైమఱచె గప్పురాన మంత్రించరే॥
చ॥ ఇంతలో శ్రీవేంకటేశుడిందుకు విచ్చేయగాను। చింతదీర మేనెల్ల జెమరించెను।
వింతలైన రతులలో విరహపు సోకు వాసె। కంతు చిగురాకు రక్షగట్టరే యంగనకు॥

741) పాడి / నాట
ప॥ నరసింహ రామకృష్ణ నమో శ్రీవేంకటేశ। సరుగ నా శత్రుల సంహరించవే॥
చ॥ బావతిట్లకు శిశుపాలుని జంపిన। యేవ కోపకాడవు నేడెందు వోతివి।
నీవాడనని నన్ను నిందించే శత్రువును। చావగొట్టి వాని నిట్టే సంహరించవే॥
చ॥ దాసుని భంగించేటి తరి కస్యపు జంపిన। యీసుకోపగాడ విపు డెందువోతివి।
మేసుల నీలాంఛనాలు మించి నన్ను దూషించే। శాసించి శత్రువును సంహరింపవే॥
చ॥ కల్లలాడి గూబయిల్లుగైకొన్న గద్ద జంపిన। యెల్లగాగ కోపకాడ వెందువోతివి।
యిల్లిదె శ్రీవేంకటేశ యీ నీ మీది పాటలు। జల్లన దూషించు శత్రువు సంహరింపవే॥

742) రీతిగౌళ
ప॥ నాలం వా తవ నయవచనం। చేలం త్యజ తే చేటీ భవామి॥
చ॥ చల చల మమ సంసద్ఘటనే కిం। కులిశ హృదయ బహుగుణ విభవ।
పులకిత తనుసంభృత వేదనయా। మలినం వహామి మదం త్యజామి॥
చ॥ భజ భజ తే ప్రియభామాం సతతం। సుజనస్త్వం నిజ సుఖనిలయ।
భుజ రేఖా రతి భోగిభవసి కిం। విజయీభవ మద్విధిం వదామి॥
చ॥ నయ నయ మామనునయనవిధం తే। ప్రియ కాంతాయాం ప్రేమభవం।
భయహర వేంకటపతే త్వం। మత్ప్రియో భవసి శోభితా భవామి॥

743) లలిత/హిందోళ
ప॥ నమో నారాయణ నావిన్నపమిదివో। సమానుడగాను నీకు సర్వేశ రక్షించవే॥
చ॥ మనసు నీయాధీనము మాటలు నీవాడేటివే। తనువు నీపుట్టించినధన మిది।
మును నీపంపున నిన్ని మోచుకున్నవాడనింతే। వెనక నన్ను నేరాలు వేయక రక్షించవే॥
చ॥ భోగములెల్లా నీవి బుద్ధులు నీవిచ్చినవి। యీగతి నాబతుకు నీవిరవైనది।
చేగదీర నీవునన్ను జేసినమానిసి నింతే। సోగల నాయజ్ఞానము చూడక రక్షించవే।
చ॥ వెలినీవె లోనీవే వేడుకలెల్లా నీవే। కలకాలమును నీకరుణే నాకు।
యిల శ్రీవేంకటేశ నీవేలుకొన్నబంట నింతే। నెలవు దప్పించక నీవే రక్షించవే॥

744) ఝుంఝూటి
ప॥ రారా చిన్నన్న రారోరి చిన్నవాడ। రారా ముద్దు లాడ రారోరి బాలకృష్ణ॥
చ॥ కింది చూపుల గిలిగిలించి ఆల-। మంద గొల్లెతల మరిగించి।
సందడి వలపించి జవరాండ్ల ఊర। విందవైనయట్టి వేడుక కాడా॥
చ॥ కొదలు మాటలనె గొణకుచు భూమి-। సుదతుల సిగ్గులు చూరాడి।
చిదుకు చేతలనె చెనకుచు ముద్దు-। పెదవిచవులు చూపిన జాణకాడా॥
చ॥ కలికి తనమునెనె కరగించి కాచె। చెలుల కగిటనె చెలగి।
లలనామణి యైన లక్కిమమ్మ। గలసుక శ్రీవేంకట నాథుడైన వాడ॥

745) బౌళి / సింధుభైరవి
ప॥ రంగ రంగ రంగపతి రంగనాథ నీ। సింగారాలె తఱవాయ శ్రీ రంగ నాథా॥
చ॥ పట్ట పగలే మాతో పలుచగ నవ్వేవు। ఒట్టులేల పెట్టుకొనే వో రంగనాథ।
వట్టిమాకు లిగిరించు వడి నీ మాటలు వింటే। రట్టడి వీమేర మీఱకు రంగనాథ॥
చ॥ చేతులు చాచేవు నీవు చేరి నాచన్నులమీద। రాతిరి మాయింటికి రా రంగనాథ।
యీతల నీ నవ్వులకే యిక్కువలు గరగెతి। బూతుల దిట్టకుమీ పోపో రంగనాథ॥
చ॥ కావేటి రంగమున కాంతపై పాదాలు చాచి। రావు పోవు ఎక్కడికోయి రంగనాథ।

శ్రీవేంకటాద్రి మీద చేరి నన్ను కూడితివి। యేవల చూచిన నీవే యిటు రంగనాథ॥

746) శంకరాభరణం

ప॥ రంగ రంగ రంగపతి రంగనాథా నీ। సింగారాలె తఱవాయ శ్రీరంగ నాథా॥
చ॥ యేపొద్దు బవ్వళించి యింతులబోగము నీకు। రాపు గొలు వెప్పుడోయి రంగనాథ।
పాప సెజ్జ మీదనుండి వచ్చినవిరహము నీకు। పో పో వయ్యాళి యెప్పుడో రంగనాథా॥
చ॥ తతి నేడుగోటలలో తగు సన్నలే నీఖు। రతి జలకే లెప్పుడు రంగనాథ।
కుటిలపు నగరిలో కుంటెనమాటలే నీకు। హితవై వీది వసంత మెన్నడో రంగనాథ॥
చ॥ కావేటి రంగమున కాంతపై పాదాలు చాచి। రావు పోవెక్కడికిని రంగనాథ।
శ్రీవేంకటాద్రి మీద చేకొని నిల్చితివి ।యేవేళ చూచిన నీవే యిటు రంగనాథా॥

747) సాళంగనాట

ప॥ తిరువీధు లేగీని దేవతలు జయవెట్ట। హరి వాడె పెండ్లికొడుకై ప్రతాపమున॥
చ॥ కనకపుగొండవంటి ఘనమైన రథముపై। దనుజమర్దనుడెక్కె దరుణులతో।
వినువీధి బడగలు వేవేలు కుచ్చులతోడ। బెనగొనగ గదలె భేరులు మ్రోయగను॥
చ॥ వరుస జంద్రసూర్యుల వంటి బండికండ్లతోడ। గరుడధ్వజ డొరసీ గడు దిక్కులు।
పరగువేదరాసులే పగ్గాలు వట్టితియ్యగ। సరుగ దుష్టుల గొట్టి జయము చేకొనెను॥
చ॥ ఆటలు బాటలు వింటా నలమేల్మంగయు దాను। యీటున శ్రీవేంకటేశు డెదురులేక।
వాటపుసింగారముతో వాకిటవచ్చి నిలిచీ। కోటానుగోటివరాలు కొమ్మని ఇచ్చుచును॥

748) రామక్రియ

ప॥ తెలిసినవాడా గాను తెలియనివాడా గాను। యిల నొకమాట నీ కెత్తిచ్చితిగాని॥
చ॥ పుట్టించేవాడవు నీవే బుద్ధిచ్చేవాడవు నీవే। యెట్టున్నా నపరాధా లేవి మాకు।
అట్టూ నన్న వారముగా మనగా నీచిత్తమెట్టో। కిట్టి వొక మాట నుడిగితి నింతేకాని।
చ॥ మనసులోపల నీవే మరి వెలుపల నీవే। యెనసి అపరాధాలు యేవి మాకు।
నిను నౌగాదనలేము నీసరివారము గాము। అనవలసినమాట అంటి మింతేకాని।
చ॥ అంతరాత్మవును నీవే అన్నిటా గావగ నీవే। యెంతైనా నపరాధా లేవి మాకు।
వింత లేక శ్రీవేంకటవిభుడ నీబంట నింతే। వంతుకు నే నొకమాట వాకుచ్చితిగాని॥

749) కాంభోజి

ప॥ ఉండ బాసీనడవిలో నొకతె నేను। ఎండలు నీడలు గాసీ నేమి సేతురా॥
చ॥ చిన్ని నానడుము చూచి సింహము దగ్గరెనంటా। ఉన్నతపు గుచముల కొరసె గరి।
మున్నిటి పొందులు వైరమునుజేసె మృగపతి। యిన్నిటికి నగ్గమైతి నేమిసేతురా॥
చ॥ నిండు నానడపుచూచి నెమలి దగ్గరవచ్చె। బండు సేసి నారుసూచి పాయదు పాము।
రెండు జూచి పగయు గూరిమి దోచెనింతలోనే। యిండె పట్టె నిన్నిటికి నేమి సేతురా॥
చ॥ కోరి నా పలుకువిని కోవిల దగ్గరవచ్చె। చేరీ నా మోవికిదె చిలుకనేడు।
గారవాన నిన్నియు వేంకటగిరి విభుడా। యేరా యిట్టె చేకొంటి వేమిసేతురా॥

750) శంకరాభరణం

ప॥ ఊన్నచోనే మూడు లోకాలూహించి చూచితే నీవే। కన్నచోటనే వెదకి కానడింతే కాక॥
చ॥ యెక్కడ వొయ్యేడి జీవుడేది వైకుంఠము। యిక్కడ హరి యున్నాడు హృదయమందే।
ముక్కున నూరుపు మోచి ముంచి పుణ్యపాపాల-। కక్కసాన జిక్కి తమ్మ గాన డింతే కాక॥
చ॥ యేమి విచారించీ దేహి యెందు దేవుని వెదకీ। కామించి యాత డిన్నిటా గలిగుండగా।
దోమటి సంసారపుదొంతికర్మముల జిక్కి। కాముకుడై కిందుమీదు గాన డింతే కాక॥
చ॥ యేవిధులు తా జేసీ యెవ్వరి నాడగబోయీ। శ్రీవేంకటేశ్వరుసేవ చేతనుడగా।
భావ మాతడుగాను బ్రతికె నిదెవో నేడు। కావరాన నిన్నాళ్ళు కాన డింతే కాక॥

751) కన్నడగౌళ

********************************************************************************************

ప॥ హరి రసమవిహారి స తు । సరసోయం మమ శ్రమసంహారీ॥
చ॥ దయా నిభృత తనుధారి సం- । శయాతిశయ సంచారీ ।
కయా ప్యజితవికారీ । క్రియావిముఖ కృపాణధారీ ॥
చ॥ సదా మిథ్యాజ్ఞానీ స తు । మదాలిమతాభిమానీ ।
తదాశ్రితసంధానీ స తు । తదా తదా చింతాశయనాని ॥
చ॥ పరామృతసంపాదీ । స్థిరానందాస్వేదీ ।
వరాలాపవివాదీ శ్రీ- । తిరువేంకటగిరి దివ్యవినోదీ ॥

752) నాట

ప॥ సగము మానిసి రూపు సగము మెగము రూపు । అగణిత ప్రతాపుడు అహోబలేశుడు ॥
చ॥ గద్దెమీద గూచున్నాడు కంబములో బుట్టినాడు । కొద్దిమీర గడునవ్వుకొంటా నున్నాడు ।
వొద్దనె శ్రీసతిచన్నులొరయుచు నున్నవాడు । అద్దివో చూడరమ్మ అహోబలేశుడు ॥
చ॥ పెనుమీసాలవాడు పెదపెదగోళ్ళవాడు । ఘనునిగా ప్రహ్లాదుని గాచుకున్నాడు ।
మనసిచ్చిన సురలతో మాటలాడుచున్నవాడు । అనుపమతేజుడమ్మ అహోబలేశుడు ॥
చ॥ వేవేలు చేతులవాడు వెన్నెలచాయలవాడు । భావించి కొల్చినవారి పాలిటివాడు ।
శ్రీవేంకటగిరిమీద జేరి భవనాశిదండ- । నావల నీవల మించె నహోబలేశుడు ॥

753) సాళంగనాట

ప॥ సతులాల చూడరే శ్రావణబహుళాష్టమి । గతలాయ నడురేయి గలిగె శ్రీకృషుడు ॥
చ॥ పుట్టేయపుడే చతుర్భుజాలు శంఖుచక్రాలు । యెట్టు ధరియించెనే యీ కృష్ణుడు ।
అట్టె కిరీటము నాభరణాలు ధరించి । యెట్టా నెదుట నున్నాడు యీ కృష్ణుడు ॥
చ॥ వచ్చి బ్రహ్మయు రుద్రుడు వాకిట నుతించగాను । యిచ్చగించి వినుచున్నా డీకృష్ణుడు ।
ముచ్చటాడీ దేవకితో ముంచి వసుదేవునితో । హెచ్చినమహిమలతో యీ కృష్ణుడు ॥
చ॥ కొద దీర మరి నందగోపునకు యశోదకు । ఇదిగో తా బిడ్డాడాయె నీకృష్ణుడు ।
అదన శ్రీ వేంకటేశుడై యలమేల్మంగ గూడి । యెదుటనే నిలుచున్నా డీకృష్ణుడు ॥

754) సాళంగనాట

ప॥ సారెకు నానవెట్టకు సంగతిగాదు । మారుమాట నే నేర మర్మమింతేగాని ॥
చ॥ చిత్తమెట్టున్నదో నీకు సిగ్గువడుందాన నేను । అత్తి నీవూ నాపె గూడినది చూచితి ।
యిత్తల మగవాడవు యేమైనా నమరు నీకు । రుత్తనవ్వే వచ్చీ నాకు రోసమేమీ లేదు ॥
చ॥ తగవెట్టున్నదో నీకు దయవుట్టీ నాకైతే । తెగువతో మీయిద్దరిదిక్కును జూచి ।
అగపడ్డదొరవు నీ వన్నియు జెల్లు నీకు । మొగమోటే మించె నాకు మోసమేమీ లేదు ॥
చ॥ వెఱగాటాయనో నీకు వేడుకపుట్టెను నాకు । నెఱి మీభావన మెఱిగి నే గూడితి ।
వెఱపేమీ లేదు శ్రీవేంకటేశుడవు నీవు । తఱి నామతి గరగె తక్కువేమీ లేదు ॥

755) దేసాళం / సావేరి

ప॥ తనసొమ్మీడేరించక తా మానీనా । పెనగుచు నేమూరకే బిగిసేముగాక ॥
చ॥ భూమితో బ్రపంచమెల్ల బుట్టించిన దేవుడు । ఆమీదిపారుపత్యాన కందుకోపడా ।
నామమాత్రజీవులము నడుమంతరాల వచ్చి । నేము గర్తలమనుచు నిక్కేముగాక ॥
చ॥ యెనలేక యెదిరికి ఇనుమడిచేవారికి । తనతగర మడువ దడవయ్యీనా ।
గునిసి సంసారపుకొండనే మోచేనంటా । తినికేమిదియు వట్టి దీమసముగాక ॥
చ॥ చిత్తములో నున్నట్టి శ్రీవేంకటేశ్వరుడు । మత్తిల్లి నను గావక మానబొయ్యీనా ।
కొత్తగా నీతని నేడు కొలిచేమనుచు నేము । తత్తరపుస్వతంత్రాన దగిలేముగాక ॥

756) సామంతం / కురంజి

ప॥ తత్తా తిగుడి ధింధిం తకధింధిం । తిత్తి తిత్తితి తితి తితి తితి ॥
చ॥ దానవవదన వితానదాన సం- । ధాన రుధిర నిజపాన మిదం ।

********************************************************************************************

************************************************************************

నానా భూత గణానాం గానం। దీన జనానాం తిత్తితి తితి॥
చ॥ విమత దనుజమత విభవపరిభవిత। సమధికం తవ శౌర్య మిదం।
ప్రమదా భవ్యం ప్రమదాభరణం। తిమిర నిరసనం తిత్తితి తితి॥
చ॥ తిరువేంకటగిరి దేవనిధానం। పరమామృతరస భాగ్యమిదం।
కరుణావరణం కమలా ఘటనం। తిరొ తిరొ తిత్తితి తితి తితి॥

757) నాట \ కదన కుతూహలం
ప॥ తిరొ తిరొ జవరాల తిత్తి తిత్తి యీా। తరలమైన నీతారహార మదురే॥
చ॥ ధిమి ధిమ్కి తోంగ తోంగ దిద్ధిమిక్కి ఆరే। మమారే పాత్రరావు మజ్జా మజ్జా।
కమలనాథుని తమకపుటింతి నీకు। నమరెదీరుపు ఇదె అవధరించగదో॥
చ॥ ఝుకజక్క జంఝుం ఝుణణకిణాని। ప్రకటపు మురువొప్పె ఖళఖళా।
సకలపతికి సరసపుగొమ్మా నీ। మొకసిరి మెరసె చిమ్ముల మురిపెములా॥
చ॥ మాయిమాయి యలమేలుమంగ నాంచారి మతి। బాయని వేంకటపతి పట్టపురాణి।
మ్రోయ జిరుగజ్జెలా నీమ్రోత లానేని। సోయగమైన నీసొలపుం జూపమరే॥

758) శ్రీ
ప॥ అతిశోభతేయం రాధా। నతతవిలాసవశా రాధా॥
చ॥ దర్పకబలబోధా రాధా। తర్పణగంధవిధా రాధా॥
దర్పయుతక్రోధా రాధా। దర్పకరసవేధా రాధా॥
చ॥ తారితావరోధా రాధా। తారుణ్యోద్బోధా రాధా।
దారితానురోధా రాధా। దారితాపరాధా రాధా॥
చ॥ తరుణీమరుగాథా రాధా। ధరసమకుచబాధా రాధా।
తరుణసదనుబోధా రాధా। ధరణిదుస్సాధా రాధా॥
చ॥ తనుభవగురుగాథా రాధా। స్తనకృతగిరిరోధా రాధా।
తనువరవచనసుధా రాధా। ధ్వనిజితపికమేధా రాధా॥
చ॥ తరుణసఖీసవిధా రాధా। దరశశిరుచిసౌధా రాధా।
తరళితతటిద్విధా రాధా। దరహసనవరోధా రాధా॥
చ॥ ధనగర్వనిషేధా రాధా। స్తవతత్పర విబుధా రాధా।
ధృవధునీకృతసుధా రాధా। దవమదనవ్యాధా రాధా॥
చ॥ తరుణత్వ పురోధా రాధా। తరుణస్మరయోధా రాధా।
తరుపశుమణిగుణధారక బహుల వి-। తరణపరా బహుధా రాధా॥
చ॥ దైవికసుఖోపధా రాధా। ద్రావికనిజాభిధా రాధా।
శ్రీవేంకటగిరిదేవకృపాము-। దావైభవ నాథా రాధా॥

759) శ్రీ
ప॥ తగిలన మునులే యాతని గందురంటా। మగువ యెవ్వరితోడ మాటాడదిపుడు॥
చ॥ అతుల నిరాహారులాతనికి బ్రియులంటా। అతివ నిన్నటినుండి యారగించదు।
తతి నడపులనుండే తపసులే యతనికి। హితులంటా వనములో నెడయ దీ తరుణి॥
చ॥ తలకొన్న యతనిపై తలపే పరమంటా। చెలియ చెక్కిటనున్న చెయి దియ్యదు।
వలనైన యాతడు దేవతల కొడయడంటా। కలికి రేయిబగలు కనుముయ్యదిపుడు॥
చ॥ అడరిజలములోన నతడుండునంటా। వడియుజెమట దుడువదు మేనను।
కడు మంచియతడు వేంకటగిరి విభుడంటా। పడతి యాతనినె గుబ్బలనొత్తినిపుడు॥

760) శంకరాభరణం
ప॥ తగుదువమ్మ నీ వందపుమరుతండ్రికి। మొగి దచ్చినమృతము మోవి నుంది గాన॥
చ॥ కోమలి నీ జవ్వనము కొలదివెట్టగరాదు। ప్రేమమున మీద మీద పెరిగీ గాన।

************************************************************************

ఆమని నీ సింగారమంత ఇంత అనరాదు।వేమారు నీ చూపు వెల్లివిరిసీ గాన॥
చ॥ తొయ్యలి నీ వొరపులు తులదూచి చెప్పరాదు।నెయ్యపు నీ తురుమిదె నిక్కీ గాన।
చయ్యన నీ సొబగులిచ్చుట నియమించరాదు।అయ్యెడ నీ పిఱుదున కలవిలేదు గాన॥
చ॥ వనిత నీ భావమిక వర్ణించి పలుకరాదు।కొన నీ పాదములు చిగురులు గాన।
తనరు నీ భాగ్యము తలచ నలవిగాదు।ఘనుడు శ్రీవేంకటేశు కలసితివి గాన॥

761) లలిత
ప॥ తన మేలెచూచు గాక తరుణుల యెడలను।యెనలేని మగవాని నేమనగ వచ్చును॥
చ॥ మంతనాన నాకె నీవు మాటలాడే చోటికి।వింతది రా సిగ్గుగాదా విచారించితే।
చెంత నీవె దెరగక చెలి నిందుకు బిల్చేవు।యెంతైనా మగవాని కెక్కుడిది తగవు॥
చ॥ గారవాన నాకె నీవు కాగిలించకుండ గాను।మారుసతితో తొంగిచూడ గోరము గాదా।
ఆరీతి వాకిట నుంటే ఆపె దెమ్మనేవు వీడె-।మారజవు మగవాడు ఆడికెకు లోగునా॥
చ॥ శ్రీవేంకటేశుడ ఆకె చెయి పట్టి పెండ్లాడగా।సేవ సేయ నొకతెకు సెగ్గెము గాదా।
యీ వల నన్నేలితివి యీపె నాపె గూడితివి।కావరపు మగవాని కతలిట్టే కాదా॥

762) సాళంగనాట
ప॥ తానెంత బ్రదుకెంత దైవమా నీమాయయెంత।మానవుల లంపటాలు మరి చెప్పగలదా॥
చ॥ చెలగి నేల బారేటి చీమసయితమును।కలసి వూరకే పారుగమ్మర నెందో మరలు।
తలమోచి కాపురము ధాన్యములు గూడబెట్టు।యిల సంసారము దనకిక నెంతగలదో॥
చ॥ యేడో బాయిట బారే యీగ సయితమును।వాడుదేర నడవుల వాలి వాలి।
కూడపెట్టు దేనెలు గొందుల బిల్లలబెట్టు।యేడకేడ సంసారమికనెంత గలదో॥
చ॥ హెచ్చి గిజిగాండ్లు సయితమెంతో గూడువెట్టు।తెచ్చి మిణుగురు బురువు దీపము పెట్టు।
తచ్చి శ్రీవేంకటేశ నీదాసులు చూచినగుచు।రిచ్చలదాని సంసార మికనెంతగలదో॥

763) దేసాళం / కాపీ
ప॥ జోజో యని మీరు జోల పాడరో।సాజపుజయంతి నేడే సఫలమిందరికి॥
చ॥ అదె చంద్రోదయమాయ హరి యవతారమందె।మొదల జాతకర్మములు సేయరో।
అదన పుత్రోత్సవమట పుణ్యాహము చేసి।కదిసి యిట్టె నామకరణము జేయరో॥
చ॥ కాయము దేవకి కిచ్చి గక్కన వాసుదేవుని-।కీయరో గంధాక్షత లిటు విడేలు।
కాయకపుగాడిదెకు కవణము వెట్టి మరి।వీయపుచుట్టాలెల్ల వీడువెట్టరో॥
చ॥ షోడశోపచారముల జొక్కించి శ్రీవేంకటేశు-।బాడరో ధర్మము నిల్పె భార మణచె।
వోడించె గౌరవదానవుల గంసాదుల జంపె।ఆడనే పాండవుల గాచెనని యర్ఘ్యమియ్యరో॥

764) సాళంగం / ఆహిరి
ప॥ చరమార్థమందు నీవు చాటితివిగాన।ఇరవిది నమ్మితి నాకెదురెందు లేదు॥
చ॥ పతికి జనవరైనప్రాణధారిలెంకలకు।తతి నేమిసేసినాను తప్పులేదు।
సతతము హరి నీశరణాగతుడ నాకు గాన।అతిపాపము సేసిన అది నాకు లేదు॥
చ॥ పారుచు నగరి డాగు పసుర మెవ్వరిచేని-।పైరు మేసినా నందు బందె లేదు।
సారె నీముద్రలు మోచి సంసారవిషయాల।యేరీతి బొరలినా యెగ్గె లేదు॥
చ॥ ధర్మాన గొనితెచ్చినదాసులకు వూర వెట్టి-।అర్మిలి జేయగ బని అంతలేదు।
నిర్మల శ్రీవేంకటేశ నీకరుణగలనాకు।కర్మలోపమైనాను కడమే లేదు॥

765) పాడి
ప॥ నీమాయ లింతేకాక నీరజనాభుడ యివి।నామది నిజమనెట్టు నమ్మేదయ్యా॥
చ॥ బాలుడనై నే జన్ను బాలు దాగేనాడు।వోలి ననుష్ఠానము లెందుండెనయ్యా।
చాలి యానేనె బ్రహ్మచారినయినమీద।వాలి యవె యెందుండి వచ్చెనయ్యా॥
చ॥ నేను దినదినమును నిద్దురవోయేవేళ।పూని నిత్యకర్మము లెందుండెనయ్యా।

జ్ఞానముతో మేలుకొని సంసారినైనవేళ। ఆనుకొని యెందుండి అంటుకొనెనయ్యా॥
చ॥ యేడ కర్మ మేడ ధర్మ మింతలో సన్యాసైతే। వేడుకకివియెల్లా నీవిలాసాలు।
జాడ నీమనసువస్తే సరుగ గరుణింతువు। వోడక శ్రీవేంకటేశ వున్న సుద్దులేటికి॥

766) రామక్రియ / నాదనామక్రియ
ప॥ హరి హరియని వెరగందుటగాక। సిరివర మాకు బుద్ధి చెప్పగదవయ్యా॥
చ॥ పాపపుకొంపలోవారు పంచమహాపాతకులు। కాపులకు పదుగురు కర్త లందురు।
తాపికాండ్లారుగురు ధర్మాసనమువారు। చాపలమే పనులెట్టు జరిగీనయ్యా॥
చ॥ పలుకంతలచేను బండవెవసాయము। బలిమి దొక్కి గుంటిపసురము।
తెలవరులు ముగురు తగువాదు లేబైయారు। వొలసి అనాజ్ఞ కిందు జోటేదయా॥
చ॥ బూతాల పొంగటికే పొడమినపంటలెల్లా। కోతవేత చూచుకొని కోరు కొటారు।
యీతల శ్రీవేంకటేశ యిన్ని విచారించి నీ-। చేతే నిలిపితి విక జెప్పేదేటిదయ్యా॥

767) భైరవి
ప॥ శ్రీహరి నిత్యశేషగిరీశ। మోహనాకార ముకుంద నమో శ్రీహరి॥
చ॥ దేవకీసుత దేవ వామన। గోవిందా గోపగోపీనాథా శ్రీహరి।
గోవర్ధనధర గోకులపాలక। దేవేశాధిక తే నమోనమో॥
చ॥ సామజావన శార్‌జ్గపాణి। వామనా కృష్ణ వాసుదేవా శ్రీహరి।
రామనామ నారాయణ విష్ణో। దామోదర శ్రీధర నమో నమో॥
చ॥ పురుషోత్తమ పుండరీకాక్ష। గరుడధ్వజ కరుణానిధి శ్రీహరి।
చిరంతనాచ్యుత శ్రీవేంకటేశ। నరమృగ తే నమో నమో॥

768) గౌళ
ప॥ త్రిజగముల నెరుగు దేవదేవుడు। అనుజునిజనకుడైన ఆదినారాయణుడు॥
చ॥ గరుడనిమీద నెక్కి ఘనచక్రము చేబట్టి। పరమపదాననుండి పరతెంచి।
మురిపేన కరి గాచి మొసలి దుంచినవాడు। అరుదైన ప్రతాపపు ఆదినారాయణుడు॥
చ॥ కనకాంబరము గట్టి కౌస్తుభము మెడ బెట్టి। వెనువెంట శ్రీపతి సేవించుచుండగా।
పనిపూని జయముతో పాంచజన్యము పట్టీ। అనిశము గరుణించీ నాదినారాయణుడు॥
చ॥ త్రిదశులు నుతియించ దిక్కులెల్లా నుల్లసిల్ల। ముదమున దాసులెల్లా మొక్కగాను।
వదల కెల్లవారికి వరము లిచ్చీ వాడే। అదె శ్రీవేంకటవిభు డాదినారాయణుడు॥

769) రామక్రియ
ప॥ అఖిలలోకైకవంద్య హనుమంతుడా సీత-। శిఖామణి రామునికి జేకొని తెచ్చితివి॥
చ॥ అంభోధి లంఘించితివి హనుమంతుడ। కుంభినీజదూతవైతివి గురుహనుమంతుడ।
గంభీరప్రతాపమున గడగితివి। జంభారిచే వరములు చయ్యన నందితివి॥
చ॥ అంజనీదేవకుమార హనుమంతుడ। కంజాప్తఫలహస్త ఘనహనుమంతుడ।
సంజీవని దెచ్చిన శౌర్యుడవు। రంజితవానరకులరక్షకుడ వైతివి॥
చ॥ అట లంకసాధించినహనుమంతుడ। చటులసత్వసమేత జయహనుమంతుడ।
ఘటన నలమేల్మంగకాంతు శ్రీవేంకటేశుకు। దటుకన బంటవై ధరణి నిల్చితివి॥

770) నాట
ప॥ దొరతనములతోడ తొడపై శ్రీసతితోడ। కేరలీ బంతముల సుగ్రీవనారసింహము॥
చ॥ నిక్కినకర్ణములతో నిట్టచూపుగుండ్లతోడ। మిక్కుటమైన పెద్దమీసాలతో।
వెక్కసపునోరితోడ వెలయుబుగ్గలతోడ। క్రిక్కిరిసి నవ్వుల సుగ్రీవనారసింహము॥
చ॥ చల్లునూరుపులతోడ సంకుజక్రములతోడ। మొల్లమైన సహస్రకరములతోడ।
తెల్లనిమేనితోడ దిండైనపిరుదుతోడ। కెల్లురేగీ గరుణ సుగ్రీవనారసింహము॥
చ॥ విరులపాదాలతోడ వెలయుసొమ్ములతోడ। తిరమైనకోటి సూర్యతేజముతోడ।

విరులదండలతోడ వేడుక శ్రీవేంకట-।గిరిమీద వెలసె సుగ్రీవనారసింహము॥

771) బౌళి

ప॥ వీడిగో నిలుచున్నాడు నిజనగరములోన।వేడుకొన్నప్రతాపాన బెద్దహనుమంతుడు॥

చ॥ ఇదె పుట్టు గౌపీనము హేమకుండలములతో-।నుదయించినాడిత డుర్వీమీదను।
పదరి బాలార్కుని పండనుచు బట్టినాడు।వదలక దేవతలవర మందినాడు॥

చ॥ నులిచి తా వాలము మిన్నులుమోవ జాచినాడు।జలధి దాటగ జంగ చాచినాడు।
ఇల నసురలమీద వలచెయ్యెత్తినవాడు।నిలువెల్ల సాహసమై నిండుకొన్న వాడు।
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంటైనవాడు।తక్కక లోకములెల్లా దయగాచేవాడు॥

772) సాళంగనాట

ప॥ శ్రావణబహుళాష్టమి జయంతి నేడు।సేవించరో నరులార శ్రీకృష్ణుడీతడు॥

చ॥ పాలింప వసుదేవుని పాలిటి భాగ్యదేవత।దేవకి గనినట్టి దివ్యరత్నము।
చేవమీర సురలరక్షించేకల్పవృక్షము।యీవేళ జన్మించినాడు యిదె కృష్ణుడు॥

చ॥ హరవిరించాదులకు నాదిమూలకారణము।పరమమునుల తపఃఫలసారము।
గరుడోరగేంద్రులకు గలిగిన నిధానము।యిరవుగా నుదయించె నిదె కృష్ణుడు॥

చ॥ బలు యోగీశ్వరుల బ్రహ్మానందము।చెలగు భాగవతుల చింతామణి।
అలమేల్మంగకు పతి యట్టె శ్రీవేంకటాద్రి-।నిలపై జన్మించినాడు యిదె కృష్ణుడు॥

773) మాళవి/కురంజి

ప॥ శ్రావణబహుళాష్టమి నవరేత్రి కాడను।శ్రీవిభుడుదయించె చెలులార వినరే॥

చ॥ అసురలశిక్షించ నమరులరక్షించ।వసుధభారమెల్ల నివారింపను।
వసుదేవునికిని దేవకీదేవికిని।అసదృశమగు కృష్ణ డవతారమందెను॥

చ॥ గోపికల మన్నించ గొల్లలనెల్లా గావగ।దాపై మునులనెల్లా దయసేయను।
దీపించ నందునికి దేవియైనయశోదకు।యేపున సుతుడై కృష్ణు డిన్నిటా బెరిగెను॥

చ॥ పాండవుల మనుపగ పదారువేల బెండ్లాడగ।నిండి శ్రీవేంకటాద్రిపై నిలుచుండగా।
నండ నలమేల్మంగ నక్కున గాగలించగ।దండియై గృష్ణుడు తగనుతికెక్కెను॥

774) నీలాంబరి

ప॥ ఉయ్యాల ఊపులు ఓ ముద్దులయ్య।వెయ్యారు గోపికలు వేడుకనూచెదరు॥

చ॥ భోగీంద్రతల్పుడా భువనవిఖ్యాతా।గోగోప రక్షకా కువలయాధీశా।
ఆగమసన్నుతా అచ్యుతానందా।యోగనిద్ర పోవయ్య యోగీంద్రవంద్యా॥

చ॥ దెసలందువెలిగెటి దేవర్షివరులు।ప్రసరించి బంగారు భవనంబులోన।
కొసరక నిద్రించు; గోవిందాయనుచు-।పసమీర పాడెదరు పన్నగశయనా॥

చ॥ సన్నుతించెదరయ్య సద్భాగవతులు।పన్నుగ శ్రీభూమి వనితలు చేరి।
ఉన్నతిపదములను వత్తెదరు నిద్రించు।వెన్నుడా ప్రసన్న వేంకటరమణా॥

775) సాళంగనాట...పెద్ద తిరుమలాచారి కృతమ్

ప॥ సేవే భావే శ్రీ బృందమ్।శ్రీ వల్లభ చింతానందమ్॥

చ॥ పటుకు తర్కనగు భంజన దీక్షమ్।కుటిల దురిత హర గుణ దక్షమ్।
ఘటిత మహాఫల కల్పక వృక్షమ్।చటుల రామానుజ శమదమభిక్షమ్॥

చ॥ కృద్ధ మృషామత కుంతన కుంతమ్।బౌద్ధాంధకార భాస్వంతమ్।
శుద్ధ వేదమణి సుసరస్వంతమ్।సిద్ధాంతీ కృత చిన్మయ కాంతమ్॥

చ॥ చార్వాక గహన చండకుఠారమ్।సర్వాప శాస్త్ర శతధారమ్।
ఇనిర్వికార గుణ నిబడ శ్రీ వేంక-।టోర్వీధర సంయోగ గభీరమ్॥

776) వరాళి

ప॥ దైవమా నీ చేతిదే మాధర్మ పుణ్యము।పూవు వంటి కడు లేత బుద్ధి వారము॥

చ॥ యేమిటి వారము నేము యిదివో మా కర్మ మెంత। భూమి నీవు పుట్టించగ బుట్టితిమి।
నేమముతో నడచేటి నేరుపేది మావల్ల। దీముతో మోచిన తోలు దేహులము॥
చ॥ యెక్కడ మాకిక గతి యెరిగే దెన్నడు నేము। చిక్కినట్టి నీ చేతిలో జీవులము।
తక్కక నీ మాయలెల్లా దాటగలమా మేము। మొక్కలపుటజ్ఞానపు ముగ్ధలము॥
చ॥ యేది తుద మొదలు మాకిక నిందులో నీవే। ఆదిమూర్తి నీకు శరణాగతులము।
యీదెస శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె। నీదయ గలుగగాను నీ వారము॥
777) శంకరాభరణం
ప॥ ఈతడువో రాముడు ఏకాంగవీరుడు। ఏతలజూచినా తానె ఇరవుకొన్న వాడు॥
చ॥ చిరుత ప్రాయమునాడు శివునివిల్లువిరచి। మెరసి సీతను పెండ్లాడి మించినవాడు।
తరి పదునాలుగు వేల దానవుల నిమిషాన। జరసి తానొక్కడే చదిపిన వాడు॥
చ॥ ఓడకవిల్లెక్కుపెట్టి ఊరకే ఒక్కమ్మున। ఏడు తాళ్ళు ధరను కూలవేసినవాడు।
జాడాగా కొండలచేత జలనిధి గట్టించి। వేడుకతో లంకమీద విడిసిన వాడు॥
చ॥ రావణ కుంభకర్ణాది రాకాసుల పరిమార్చి। ఈవల అయోధ్యాపట్నమేలిన వాడు।
శ్రీవేంకటాద్రిమీద జేరి మాల్యవంతమున। వేవేలు చందములను వెలసినవాడు॥
778) దేవగాంధారి
ప॥ ఎంతని నుతియింతు రామరామ యిట్టి నీప్రతాపము రామరామ।
పంతాన సముద్రము రామరామ బంధించవచ్చునా రామరామ॥
చ॥ బలుసంజీవికొండ రామరామ బంటుచే తెప్పించితివి రామరామ।
కొలదిలేనివాలిని రామరామ ఒక్కకోల నేసితివట రామరామ।
వెలయ నెక్కువెట్టి రామరామ హరువిల్లు విరిచితివట రామరామ।
పెలుచు భూమిజను రామరామ పెండ్లాడితివట రామరామ॥
చ॥ శరణంటే విభీషణుని రామరామ చయ్యనగాచితివట రామరామ।
బిరుదుల రావణుని రామరామ పీచమడచితివట రామరామ।
ధరలో చక్రవాళము రామరామ దాటివచ్చితివట రామరామ।
సురలు నుతించిరట రామరామ నీ చొప్పు యిక నదియెంతో రామరామ॥
చ॥ సౌమిత్రి భరతులు రామరామ శత్రుఘ్నులు తమ్ములట రామరామ।
నీ మహత్త్వము రామరామ నిండె జగములెల్లా రామరామ।
శ్రీమంతుడ వన్నిటాను రామరామ శ్రీవేంకటగిరిమీద రామరామ।
కామితఫలదుడవు రామరామ కౌసల్యానందనుడవు రామరామ॥
779) సాళంగనాట
ప॥ సీతా సమేత రామ శ్రీరామ। రాతి నాతి జేసిన శ్రీరామ రామ॥
చ॥ ఆదిత్యకులమునందు నవతరించినరామ। కోదండభంజన రఘుకులరామ।
ఆదరించి విశ్వామిత్రు యాగముగాచిన రామ। వేదవేదంతములలో వెలసిన రామ॥
చ॥ బలిమి సుగ్రీవుని పాలినిధానమ రామ। యిల మునులకభయమిచ్చిన రామ।
జలధి నమ్ముమొనను సాధించిన రామ। అలరు రావణదర్పహరణ రామ॥
చ॥ లాలించి విభీషణుని లంకనేలించిన రామ। చాలి శరణాగత రక్షక రామ।
మేలిమి శ్రీవేంకటాద్రి మీద వెలసిన రామ। తాలిమితో వెలయు ప్రతాపపు రామ॥
780) ఆహిరి
ప॥ విరహంబు వేడాయ విరుల మొన వాడాయ। తరువాతిపనుల కిటు తడవేల ఇకను॥
చ॥ పిలువరే నాయకుని ప్రేమంపు చెలిమిమీద। నలదరే శ్రీగంధ మందాకాను।
నిలువరే కొంతవడి నిండురొద లిటు మాని। కలికిమై చెమరించె గంద మిక బనులు॥
చ॥ చెరుగరే తురుములో జెదరిజారిన నెరులు। కరగెనే చెలినుదుటి కస్తూరి బొట్టు।

మరుపరే కప్పురము మగువదప్పులు దీర। నెరపుదము నేరుపులు నిమిషంబుమీద ॥
చ॥ అంపరే యెదురుగా నతనికి కానుకలు। చెంపలను పన్నీరు చిలుకగదరే।
యింపులను శ్రీవేంకటేశు డిదె వచ్చి సతి। సొంపులను గూడె నిక సొలయ నేమిటికే ॥

781) నాగవరాళి/హుసేని
ప॥ తారుకాణ సేసుకొంటే తానే నేను। ఈ రీతినే నవ్వుగానీ ఇంటికి రమ్మనవే ॥
చ॥ చెక్కులివె చెమరించె చిత్తమెల్లా జిగిరించె। కుక్కినట్టు కోరికలు కొనసాగెను।
తొక్కినాడు నా పాపము తొలుతే సందడిలోన। యెక్కడ పరాకుసేసీ నింటికి రమ్మనవే ॥
చ॥ దప్పిదేరె పెదవుల తమకము దైవారె। కొప్పువీడి చన్నులపై కుప్పలాయను।
ముప్పిరిగా గట్టినాడు ముంజేతకంకణము। ఈప్పుడేలనించీ సిగ్గులు ఇంటికి రమ్మనవే ॥
చ॥ ఆయాలంటి నన్ను గూడె అంగమెల్లా బులకించె। చేయిచేయి సోకి యాసచిమ్మిరేగెను।
చాయలా సన్నలా సేసచల్లె శ్రీ వేంకటేశుడు। ఈ యెడ నన్ను మన్నించీ ఇంటికి రమ్మనవే ॥

782) కాంభోజి
ప॥ దయజూడవయా తతిగాని మొక్కేము। ప్రియురాండ్లము నినుబెండ్లాడితిమి ॥
చ॥ చలములు నీతో సాదించేమా। వలచిన వారము వనితలము।
బలుములు నీతో బచరించేమా। కొలిచినవారము గోలలము ॥
చ॥ పెనగుచు నీతో బిగిసేమా నీ-। ననుపుల వారము నాతులము।
పనివడి నేరమి పైవేసేమా। చనవరివారము సాదులము ॥
చ॥ యీవేళ గూడితి మెలయించేమా। దేవుళ్ళము నీ తెఱవలము।
శ్రీవేంకటేశ్వర చెలగి నగేమా। బూవపువారము భోగులము ॥

783) శ్రీ
ప॥ దైవకృతమెవ్వరికి దప్పింపరాదనుచు। భావించి జనులాడుపలుకు నిజమాయ ॥
చ॥ కందునకు బెడబాసి చందురుడింతి ముఖ। చందురుడైన నది అందును గలిగె।
కందువగు చెలినొసలి కస్తూరి తిలకమను। కందు ముఖచంద్రునకుగడు నందమాయ ॥
చ॥ జలజములు శశిచేత నులికి యీకాంతకుచ। జలజంబులైన నది సరుసనే కలిగె।
లలితమగు ప్రాణవల్లభుని సురతాంకమున। విలువనేయగరాని విదియ చందురులు ॥
చ॥ తీగె బహుజలజములకు దెమలి కామినిమేను। దీగె యయ్యిన నదియుదిరుగ మరికలిగె।
ఈ గతుల దిరువేంకటేశ్వరుని సమసురత। యోగంబు వలన ఘర్మోదకశ్రీలు ॥

784) దేవగాంధారి
ప॥ దైవము నీవే యిక దరి చేరుతువుగాక। జీవులవసము గాదు చిక్కిరి లోలోననే ॥
చ॥ పుట్టుట సహజ మిది పొదలేజీవులకెల్ల। గట్టిగా జగమునందు కలకాలము।
నట్టేటివరదవలె నానాటినీమాయ। కొట్టుక పారగజొచ్చె కూడినవిజ్ఞానము ॥
చ॥ పాపమే సహజము బద్ధసంసారులకెల్ల। కాపురపువిధులలో కలకాలము।
తేపలేనిసముద్రముతెరగున కర్మమెల్లా। మాపురేపు ముంచజొచ్చె మతిలోనిధైర్యము ॥
చ॥ లంపటమే సహజము లలి దేహధారులకు। గంపమోపు కోరికెలకలకాలము।
యింపుల శ్రీవేంకటేశ ఇదె నీదాసులని। పంపుసేసి బ్రదికించె ప్రపన్న సుగతి ॥

785) తోడి
ప॥ దృష్టితాకు మాఅయ్యకు తెరవేయరే। దృష్టించెదరెవ్వరైనా దరిచేరనీయకురే ॥
చ॥ చప్పుడు సేయుటకవసరము కాదనరే। అప్పుడు మజ్జనము ఆడుననీ తెలుపరే।
కప్పురంపు సురతుల కొలిచెదరనరే। అప్పుడు సతుల తోనూ ఆరగించినాడనరే ॥
చ॥ దంతపు చవికెలో ఏకాంతమాడేననరే। అంతరంగమున నృత్యము ఆడెదరని తెలుపరే।
దొంతి పూలతోటలోన తమిగూడి యున్నాడనరే। చెంత కేళాకూళి లోన చిత్తగించి యున్నాడనరే ॥
చ॥ పట్టంపు రాణియు తాను పవ్వళించియున్నాడనరే। రట్టుసేయనిందెవ్వరైనా రానీయకురే।

***********************************************************************************************************

పట్టపు అలమేలుమంగపతి శ్రీవేంకటేశ్వరుడు। సృష్టిలోకకర్త గాన సేవించి పొమ్మనరే॥

786) బౌలి
ప॥ నన్ను నెవ్వరు గాచేరు నాటిపగెంతురుగాక। నిన్న నేడీరోతలైతే నీతియౌనా నాకును॥
చ॥ దేవుడ నేనేయంతా తిరిగే నాస్తికుడనా। దేవతలకు మొక్కబోతే నిక నగరా।
కావించి యింద్రియములే గతెని యిన్నాల్లు నుండి। ఆఅవల జితేంద్రియుడనంటే నవి నగవా॥
చ॥ కర్మము దొల్లి సెయక కడుదూరమైన ఇక నా। కర్మము సేయగబోతే కర్మమే నగదా।
దుర్మతి సంసారినై తొయ్యెలులకు మోహించి। అర్మిలి దూషించితేను అటె వారు నగరా॥
చ॥ నేనే స్వతంత్రుడనంతా నిండుదానాలెల్ల మాని। పూని యిక జేయబోతే పొంచి యవి నగవా।
నే నిన్నిటా సిగ్గువడి నీమరగు చొచ్చితిని। అనుకొని శ్రీవేంకటాధిపుడ కావవే॥

787) వసంత వరాళి
ప॥ నారాయణుడీతడు నరులాల। మీరు శరణనరో మిమ్ము గాచీని॥
చ॥ తలచిన చోటను తానే ఉన్నాడు। వలెనను వారికి కైవసమెపుడు।
కొలచెను మూడడుగుల జగమెల్లాను। కొలిచినవారిని చేకొనకుండునా॥
చ॥ యెక్కడ పిలిచినా ఏమని పలికీ। మొక్కిన మన్నించు మునుముగను।
రక్కసుల నణచి రక్షించు జగములు। దిక్కని నమ్మిన తిరముగా నేలడా॥
చ॥ చూచిన యందెల్ల చూపును రూపము। వోచిక పొగడిన వుండు నోటను।
యేచిన శ్రీవేంకటేశుడే యితడట। చేచేత పూజింప సేవలుగొనడా॥

788) సామంతం/రీతిగౌళ
ప॥ నారాయణాచ్యుతానంత గోవింద హరి। సారముగ నీకు నే శరణంటినే॥
చ॥ చలువయును వేడియును సటలసంసారంబు। తొలకు సుఖమొకవేళ దుఃఖమొకవేళ।
ఫలములివె యీరెండు బాపములు పుణ్యములు। పులుసు దీపును గలపి భుజియించ్నట్లు॥
చ॥ పగలురాత్రులరీతి బహుజన్మమరణాలు। తగుమేను పొడచూపు తనుదానె తొలగు।
నగియించు నొకవేళ నలగించు నొకవేళ। వొగరుగారపువిడె మొబ్బించినట్లు॥
చ॥ ఇహము బరమునువలెనె యెదిటికలయు నిజము। విహరించు భ్రాంతియును విభ్రాంతియును మతిని।
సహజశ్రీవేంకటేశ్వర నన్ను గరుణించి। బహువిధంబుల నన్ను బాలింపవే॥

789) బౌళి
ప॥ నమో నమో దశరథనందన రామ। కమనియ్యయాగభాగకర్త రామ॥
చ॥ కాకుథ్సకుల రామ కౌసల్యాసుత రామ। శ్రీకరగుణోన్నత రామ।
కాకాసురవైరి రామ కౌశికవత్సల రామ। భీకరతాటకాంతకబిరుద రామ॥
చ॥ వారిధిబంధన రామ వాలిహరణ రామ। చారుహరకోదండభంజన రామ।
ధారుణీజపతి రామ దశకంఠహర రామ। సారవిభీషణాభిషేచన రామ॥
చ॥ అమరపాలిత రామ అయోధ్యాపతి రామ। సమరకోవిద రామ సర్వజ్ఞ రామ।
విమల రామ వేంకటగిరి రామ। రమణ శరణాగతరక్షక రామ॥

790) లలిత
ప॥ నిత్య సుఖానంద మిదె నీ దాస్యము। సత్యము లేని సుఖాలు చాలు జాలునయ్య॥
చ॥ కన్ను చూపుల సుఖము నీ చక్కని రూపె। యెన్నగ వీనుల సుఖమిదె నీపేరు।
పన్ని నాలుక సుఖము పాదపు నీ తులసి। వున్న సుఖముల తెరువొడ బడమయ్యా॥
చ॥ తనువు తోడి సుఖము తగు నీకైంకర్యము। మనసులో సుఖము నీ మంచి ధ్యానము।
పనివి నీ యూర్పు సుఖము పాదపద్మము వాసన। యెనయని పెర సుఖమేమి సేసేనయ్యా॥
చ॥ పుట్టుగుకెల్ల సుఖము పొల్లులేని నీ భక్తి। తొట్టి కాళ్ళ సుఖము పాతుర లాడుట।
జట్టి శ్రీవేంకటేశ మాచనవోలి చెన్నుడవై। వొట్టుకొని మమ్మేలితివోహో మేలయ్యా॥

791) శ్రీ

***********************************************************************************************************

ప॥ నేనెందువోయె తానెందువోయి। రానీలే రానీలే రానీలే॥
చ॥ మీనైన నాటి తన మిడుకెల్ల దిగవలె। కానీలే కానీలే కానీలే॥
చ॥ తలచూపేనాటి తలపెల్ల దిగవలె। తలచనీ తలచనీ తలచనీవే॥
చ॥ కిరియైననాటి తన కిటుకెల్లదిగవలె। తిరుగనీ తిరుగనీ తిరుగనీవే॥
చ॥ హరియైననాటి అదటెల్ల దిగవలె। జరగనీ జరగనీ జరగనీవే॥
చ॥ వడుగైననాటి(తన) వస విడువంగవలె। తడవకు తడవకు తడవకువే॥
చ॥ కలుషించే నాటి కడమెల్ల దిగవలె। అలుగనీ అలుగనీ అలుగనీవే॥
చ॥ సతిబాసేనాటి చలమెల్ల దిగవలె। తతిగానీ తతిగానీ తతిగానీవే॥
చ॥ ముసలైన నాటి మునుపెల్ల దిగవలె। విసుగనీ విసుగనీ విసుగనీవే॥
చ॥ మానైననాటి (తన) మదమెల్ల దిగవలె । పోనీవే పోనీవే పోనీవే॥
చ॥ కలికైన నాటి గజరెల్ల దిగవలె। చెలగనీ చెలగనీ చెలగనీవే॥
చ॥ వేడుకతో నాటి వేంకటపతి నన్ను। కూడనీ కూడనీ కూడనీవే॥

792) పాడి

ప॥ నేడు దప్పించుకొంటేను నేరుపున్నదా। వేడుక భోగించుతానే పెనగ జోటున్నదా॥
చ॥ తనువు మోచిననాడే తప్పులెల్లా జేసితిని। వెనక మంచితనాలు వెదక నేది।
ననిచి సంసారినైననాడే నిష్ఠూరానకెల్ల। మునుప నే గురియైతి మొరగ జోటున్నదా॥
చ॥ సిరులు చేకొన్న నాడే సిలుగెల్లా గట్టుకొంటి। తరగాతిపను లింక దడవనేల।
నరలోకముచొచ్చిననాడే పుణ్యపాపముల। పొరుగుకు వచ్చితిని బుద్ధు లింక నేల॥
చ॥ వూపిరిమోచిననాడే వొట్టికొంటి నాసలెల్లా। మాపుదాకా వేసరిన మాన బొయ్యీనా।
యేపున శ్రీవేంకటేశుడింతలో నన్ను గావగా। పైపై గెలిచితిగాక పంతమాడగలనా॥

793) సామంతం/సామ

ప॥ నీవుదేవుడవు నేనొకజీవుడ। ఈవిధి నిద్దరి కెంత అంతరువు॥
చ॥ పొడమిన జగములు పుట్టెడి జగములు। గుడిగొనె మీరోమకూపములు।
యెడయక నీరూప మేమని ధ్యానింతు। అడరి మీవాడ ననుటే గాక॥
చ॥ మునుపటి బ్రహ్మలు ముందరి బ్రహ్మలు। మొనసి మీ నాభిని మొలచేరు।
ఘనుడవు నిన్నే గతి నే దెలిసెద। అనువుగ మిముశరణనుటే గాక॥
చ॥ సహజానందము సంసారానందము। ఇహము పరముగా నిచ్చేవు।
అహిపతి శ్రీవేంకటాధిప నీ కృప। మహిలో సేవించి మనుటే గాక॥

794) భూపాళం

ప॥ నీయాధీనము లింతే నిఖిలప్రపంచమును। మాయాకృతము నీవు మానుమంటే మానదా॥
చ॥ నీకు నరుహంబైన నిండినయీమనసు। కాకువిషయాలపాలుగా నరుహమా।
చేకొని నీవు పెరరేచినయీచైతన్యము। పైకొని అకర్మములపాలు సేయదగునా॥
చ॥ అంచల నీవంతర్యామివైనయీదేహము। పంచేంద్రియముల కొప్పనసేతురా।
యెంచగ నీకుక్షిలోన నెత్తిన యీజన్మము। కొంచెపుభోగములకు గురిసేయవలెనా॥
చ॥ శ్రీవేంకటేశ నీకు జక్కినయీదాస్యము। యీవల సంసారమున కియ్యవలెనా।
దేవుడవు నీవేయని తెలిపితి విదే మాకు। జీవులము మమ్ము నిక చిమ్మిరేచనేటికి॥

795) దేవగాంధారి

ప॥ నిముషమెడతెగక హరి నిన్ను తలచి। మమత నీ మీదనే మరిపి బ్రతుకుటగాక॥
చ॥ నిదురచే కొన్నాళ్ళు నేరముల కొన్నాళ్ళు। ముదిమిచే కొన్నాళ్ళు మోసపోయి।
కదిసి కోరినను గతకాలంబు వచ్చునే। మది మదినె యుండి ఏమరక బతుకుట గాక॥
చ॥ కడు తనయులకు కొంత కాంతలకు నొక కొంత। వెడయాసలకు కొంత వెట్టిసేసి।
అడరి కావలెనని అందు సుఖమున్నదా। చెడక నీ సేవలే సేసి బతుకుటగాక॥

చ|| ధనము వెంట తగిలి ధాన్యంబునకు తగిలి | తనవారి తగిలి కాతరుడైనను |
కను కలిగి శ్రీవేంకటనాథ కాతువే | కొనసాగి నిన్నునే కొలిచి బతుకుటగాక ||

796) వసంత వరాళి

ప|| నిలు నిలు దగ్గరకు నీయాన నీకు | వలచితినని మావారెల్లనగరా ||

చ|| వద్దు వద్దు కొండలలో వారికి మాకింతేసి | పెద్ద పెద్ద ముత్యాల పేరులిన్నేసి |
అద్దము చూచిదె మాకు నంతకంటె సిగ్గయ్యీని | గద్దరి మాచెంచువారుగని నన్ను నగరా ||

చ|| చాలు జాలు బంగారు సరుపణులుంగరాలు | నీలపుగంటసరులు నీకే ఉండనీ |
మూలనుండే వారుగాక ముత్యాలచెరగుల | చేలగట్టు కొన్న నన్ను చెంచెతలు నగరా ||

చ|| రాకు రాకు యీడకు నీరమణుల పాదమాన | నాకు నీకు నింతేసి ననుపేటికి |
దీకొని కూడితి నన్ను తిరువేంకటేశ యీ- | కాకరిచేతలకు లోకమువారు నగరా ||

797) శంకరాభరణం

ప|| నిలువుటద్దములోన నీడనల్లదివో కంటి | చలివాసె దనకేలే సటకాడు కృష్ణుడు ||

చ|| యెఱగనట్టె విచ్చేసి యిదెనామలగు మీద | నొఱిగి వెనకవంక నున్నవాడు |
మఱి చెలులు నవ్వితే మానుమని సన్నసేసీ | మఱుగులింకా నేలే మాయాకాడు కృష్ణుడు ||

చ|| మాటలాడక నావద్ద మంచము నాకోటిమీద | యేటవెట్టుకొని మమ్ము నెలయించీని |
పాటించి లంచము లిచ్చి పంజరము చిలుకకు | తూటరి యీవిద్దెలే దొమ్మికాడు కృష్ణుడు ||

చ|| కందువ పాన్పుమీద కప్పిన నాపచ్చడము | నందు చొచ్చికొని నను సరిగూడీని |
ఇందరిలో నవ్వబోతే నింతలో నాచెక్కు నొక్కి | అందపు శ్రీవేంకటాద్రి నాగడీడు కృష్ణుడు ||

798) బౌళి

ప|| నామోము చూచిచూచి నడుమ నేలకొంకేవు | ఆముకొని మెచ్చగానే నడ్డమాడేనా ||

చ|| బత్తిగలవాడవు పడతి పాటవింటివి | చిత్తము రంజించి నీకు చెవిబట్టెనా |
యిత్తల మే చెమరించె నెంతగరగెనో మతి | పొత్తుల వాకుచ్చి యాకె బొగడగరాదా ||

చ|| సరినిడుకొంటివి చదివించితి వాపెను | తిరమైన యాయర్థము తెలిసితివా |
నిరతి బులకలెల్లా నిండెను సంతోసమెంతో | అరుదై నపుడుగర లట్టె ఇయ్యరాదా ||

చ|| శ్రీవేంకటేశుడవు చెలియాట చూచితివి | భావించి నీకు గన్నుల పండుగాయనా |
యీవల నన్నేలితివి ఇదెంత జాణతనమో | సేవసేసే మిద్దరము సేసచల్ల రాదా ||

799) ముఖారి

ప|| అహో సాధు తవాగమనం | బహుళవైభవైః ప్రతివచనైః కిమ్ ||

చ|| తతోపసర మిథ్యాశతవచనై | రితస్తవైమర్మ హితం కిమ్ |
బత మమ దేహోత్ప్రాణ స్తథాపి | గత ఏవై తత కారణమిహ కిమ్ ||

చ|| సంవృతి చేలం జహి చపల త్వం | సంవాదేమే సతతం కిమ్ |
త్వం వా మమ చిత్తం సాంత్వయసి | కిం వా కురు మమ ఖేలనమిహ కిమ్ ||

చ|| అతిబిభేమి భవచరణాదిహ | చతుర వేంకటాచలరమణ |
సతీం మా మనుసరసి కిమర్థం | రతిరాజవిభవ రచనమిదం కిమ్ ||

800) లలిత

ప|| ఎందరి వలపించెనో యంటనింట | చిందుల పాటలు వింట సిరులు చేకొంట ||

చ|| తుంగభద్ర యేటికాడ తోరమైనకొండనీడ | రంగుమీరి పైడి గోడ రాతిమేడ |
అంగడి నున్నాడు చూడ నదివో పెడతల | చుంగుల పించెపు గూడ చుట్టు బాగతోడ ||

చ|| పండరంగినుండి వచ్చి పామరుల నెల్లమెచ్చి | యెండలేని నీడలోన యెచ్చి యెచ్చి |
వెండి బైడిదడంబడ విభవాలబ్రొద్దు పుచ్చి | కొండనుచు వరములు కోరికలిచ్చి ||

చ|| చక్కని యీవిట్ఠలుండై జవ్వనాన జెలువుండై | పక్కనున్న సతితోడ బ్రబలుండై |
మక్కువ వేంకటగిరి మాయధారి దేవుండై | యెక్కడా నెదురులేక యీడ నున్నాడిదివో ||

801) రామక్రియ/కేదారగౌళ
ప|| ఆఱడి బెట్టగనేల అతనినింతేసి నీవు | మీరక బంగారుపీట మీద గూచుండవే ||
చ|| కొంగువట్టి తియ్యనేలె కొసరనేమిటికే| సంగతెరిగిన నెరజాణవిభుని|
ముంగిటనున్నాడతడు మొక్కితే నెఱుక గాదా | రంగుగతానే వచ్చె రావే లోపలికి ||
చ|| విన్నపము సేయనేలే వేడుకొననింత యేలే | సన్న తెలిసినయట్టి సరసునికి|
కన్నాడు నీగుట్టువేళగాచుటె తగులు గాదా | పన్ని నిన్ను నేలీగాని పఱువవే పానుపు ||
చ|| చనువున తిట్టనేలే చవులు చూపగనేలే | యెనసిన శ్రీవేంకటేశునెదుట |
ననిచి వున్నాడితడు నగుటే వుంకువ గాదా | తనివినొందించి ఇంకా తడవవే కాగిట ||

802) శ్రీ
ప|| ఓ పవనాత్మజ ఓ ఘనుడా బాపు బాపనగా పరగితిగా ||
చ|| ఓ హనుమంతుడ ఉదయాచల నిర్వాహక నిజ సర్వ ప్రబల |
దేహము మోచిన తెగువకు నిటువలే సాహసమిటువలె జాటితిగా ||
చ|| వో రవిగ్రహణ వో దనుజాంతక | మారులేక మతిమలసితిగా |
దారుణపు వినతాతనయాదులు | గారవింప నిటు గలిగితిగా ||
చ|| ఓ దశముఖ హర వోవేంకటపతి పాద సరోరుహ పాలకుడా |
ఈ దేహముతో నిన్ని లోకములు నీ దేహమెక్క నిలిచితిగా ||

803) రామక్రియ
ప|| అతని గూడినప్పుడే అన్నియు సాధించవమ్మా | రాతిరాయ నికనైన రమ్మనవమ్మా ||
చ|| అంపినమాట కుత్తర మానతియ్యవమ్మా | వంపుమోముతో నలుక వలదమ్మా |
పంపుడు చెలులమిదే పలుక విదేమమ్మా | చెంప జారిన తురుము చెరుగుకోవమ్మా ||
చ|| తమకించే పతితో నీతలపు లేమందుమమ్మా | కొమరు చూపుల లోన కోపమేలమ్మా |
జమళినిద్దరి కూడిగములవారమమ్మా | చెమరించె మేనెల్లా చిన్న బోకువమ్మా ||
చ|| యెదురుగా వచ్చు నాతడిట్టె మమ్మంపవమ్మా | కదిసితి వికనీకు కడుమేలమ్మా |
యెదుట శ్రీవేంకటేశు డేగివచ్చి నిన్ను గూడె | వదలడు దినమిట్టె వచ్చి నోయమ్మా ||

804) మంగళ కౌశిక
ప|| అబ్బురంపు శిశువు ఆకుమీది శిశువు | దొబ్బుడు రోల శిశువు త్ప్రువ్వి త్ప్రువ్వి త్ప్రువ్వి||
చ|| పుట్టు శంఖు చక్రముల బుట్టిన యా శిశువు | పుట్టక తోల్లే మారుపుట్టువైన శిశువు |
వొట్టుక పాలువెన్నలు నోలలాడు శిశువు | తొట్టెలలోన శిశువు త్ప్రువ్వి త్ప్రువ్వి త్ప్రువ్వి||
చ|| నిండిన బండి తన్నిన చిన్ని శిశువు | అడవారి మదమెల్ల నణచిన శిశువు |
కొండలంతేశసురుల గొట్టిన యా శిశువు | దుండగంపు శిశువు త్ప్రువ్వి త్ప్రువ్వి త్ప్రువ్వి||
చ|| వేగైన వేంకటగిరి వెలసిన శిశువు | కౌగిటి యిందిర దొలగని శిశువు |
ఆగి పాలజలధిలో నందమైన పెనుబాము | తూగుమంచము శిశువు త్ప్రువ్వి త్ప్రువ్వి త్ప్రువ్వి||

805) గుండక్రియ
ప|| నన్ను నిన్ను నెంచుకోవో నారాయణా | అన్నియు నీ చేతినే అదివో నారాయణా ||
చ|| నా మనసెరుగవా నారాయణా నేడు | నాములాయె వయసులు నారాయణా |
నామధారికపు మొక్కు నారాయణా | ఆముకొని నీ ప్రియము లందునే నారాయణా ||
చ|| నగుతా నే నంటినింతే నారాయణా యిదె | నగ రెఱిగిన పని నారాయణా |
నగవులు మాకు చాలు నారాయణా | అగడు సేయకు మికను అప్పటి నారాయణా ||
చ|| ననలు నీ వినయాలు నారాయణా, మంచి | ననుపంటి మిదివో నారాయణా |
ఘనుడ శ్రీవేంకటాద్రి గలసితి విట్లైనను | అనుమాన మెల్లా బాసెను అందు నారాయణా ||

806) గుండక్రియ
ప|| దాచుకొ నీపాదాలకుదగ నే జేసినపూజ లివి | పూచి నీకీరీతిరూపపుష్పము లివి యయ్యా ||

చ|| వొక్క సంకీర్తనె చాలు వొద్దికై మమ్ము రక్షించగ । తక్కినవి భాండారాన దాచి వుండనీ ।
వెక్కసమగునీ మము వెలసులభము ఫల మధికము । దిక్కై నన్నేలితి వికనవి తీరనినాధనమయ్యా ॥
చ|| నానాలికపైనుండి నానాసంకీర్తనలు । పూని నాచే నిన్ను బొగడించితివి ।
వేనామాలవెన్నుడా వినుతించ నెంతవాడ । కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేయయ్యా ॥
చ|| యీమాట గర్వము గాదు నీ మహిమే కొనియాడితిగాని । చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాడగాను ।
నేమాన బాడేవాడను నేరము లెంచకుమీ । శ్రీమాధవ నే నీదాసుడ శ్రీవేంకటేశుడవయ్యా ॥

807) వరాళి

ప|| యజ్ఞమూర్తి యజ్ఞకర్త యజ్ఞభోక్తవిన్నిటాను ।
యజ్ఞాది ఫలరూపము ఇటు నీవై ఉండవె ॥
చ|| పరికించ జీవులకు ప్రణమవైన నీకు । నిరతి ప్రాణ ప్రతిష్ఠ నేము సేసేమా ।
మరిగి మా పూజలంది మమ్ము గాచెడి కొరకు । హరి నీ మూర్తి ప్రాణమావహించవే ॥
చ|| జగతికి నీ పాద జలమే సంప్రోక్షణ । జిగి నీకు సంప్రోక్షణ చేయువారమా ।
పగటున నన్ను నేడు పావనము సేయుటకు । అగు పుణ్య తీర్థముల అభిషేకమందవే ॥
చ|| వేదములు తెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు । వేద మంత్రముల పూజ విధి సేసేమా ।
యీదెస నీ దాసులమయిన మమ్ము గాచుటకు । వేదమూర్తివై యిందే విచ్చేసి వుండవే ॥

808) ఆహిరి

ప|| లలిత లావణ్య విలాసముతోడ । నెలత ధన్యతగలిగె నేటితోడ ॥
చ|| కుప్పలుగా మైననలుకొన్న కస్తూరితోడ । తొప్పదోగెడి చెమతతోడ ।
అప్పుడటు శశిరేఖలైన చనుగవతోడ । దప్పిదేరెడి మోముదమ్మితోడ ॥
చ|| కులుకుగబరీభారము కుంతలంబులతోడ । తొలగదోయని ప్రేమతోడ ।
మొలకనవ్వులు దొలకుముద్దు జూపులతోడ । పులకలు పొడవైన పొలుపుతోడ ॥
చ|| తిరువేంకటాచలాధిపుని మన్ననతోడ । సరిలేని దివ్యవాసనలతోడ।
పతికించరాని అరవిరిభావముతోడ। సిరి దొలంకెడి చిన్ని సిగ్గులతోడ ॥

809) ఆహిరి

ప|| లక్ష్మీకల్యాణము లీలతో బాడే మిదే నేము । లక్ష్మీనారాయణులే లలనయు నీవును ॥
చ|| చూపులు చూపులు మీకు సూసకము బాసికము । పూపచన్నుగుబ్బ లివి బూజగుండలు ।
తీపులమోవితేనెలు తీరని మధుపర్కము । దాపుగ బెండ్లి యాడరయ్య తగు దగు మీకును ॥
చ|| మాటలు మీకిద్దరికి మదనమంత్రములు । మేటితలబాలు మీలో మించు నవ్వులు ।
గాటమైన పులకలు కప్పురపువసంతాలు । నీటున బెండ్లాడరయ్యా నెరెవేరె మీకును ॥
చ|| కాగిలి కాగిలి మీకు కందువ పెండ్లిచవికె । పాగిన కోరికలే పావ కోళ్ళు ।
ఆగిన శ్రీవేంకటేశ అలమేలుమంగా నీవు । వీగక పెండ్లాడడయ్య వేడుకాయ మీకును ॥

810) లలిత

ప|| వేఱొకచోట లేడు వీడివో హరి । వీఱిడియై చేరువనే వీడివో హరి ॥
చ|| మునుకొని వెదకితే ముక్కునూర్పుగాలికొన । వెనవెనక దిరిగీ వీడివో హరి ।
పెనగి వెదకబోతే పెడచెవులమంత్రమై । వినవచ్చీ మాటలలో వీడివో హరి॥
చ|| సోదించి వెదకితేను చూపులకొనలనే । వీధుల నెందు చూచినా వీడివో హరి ।
ఆదిగొని వెదకితే నట్టే నాలికకొన । వేదమై నిలిచినాడు వీడివో హరి ॥
చ|| తెలిసి వెదకబోతే దేహపుటంతరాత్మయై । వెలుపలా లోపలాను వీడివో హరి ।
చెలగి శ్రీవేంకటాద్రి చేకోని మమ్ము రక్షించ । వెలసె నిందరు జూడ వీడివో హరి ॥

811) పాడి

ప|| రామ దశరథరామ నిజ సత్య- । కామా నమో నమో కాకుత్థ్సరామ ॥
చ|| కరుణానిధి రామ కౌసల్యానందన రామ । పరమ పురుష సీతాపతిరామ ।

శరధి బంధన రామ సవన రక్షక రామ। గురుతర రవివంశ కోదండ రామ॥
చ॥ దనుజహరణ రామ దశరథసుత రామ। వినుతామర స్తోత్ర విజయరామ।
మనుజావతార రామ మహనీయ గుణరామ। అనిలజప్రియ రామ అయోధ్యరామ॥
చ॥ సులలితయశ రామ సుగ్రీవ వరద రామ। కలుష రావణ భయంకర రామ।
విలసిత రఘురామ వేదగోచర రామ। కలిత ప్రతాప శ్రీవేంకటగిరి రామ॥

812) సాళంగనాట
ప॥ పెరిగినాడు చూడరో పెద్ద హనుమంతుడు। పరగి నానా విద్యల బలవంతుడు॥
చ॥ రక్కసుల పాలికి రణరంగ శూరుడు। వెక్కసపు ఏకాంగ వీరుడు।
దిక్కులకు సంజీవి తెచ్చిన ధీరుడు। అక్కజమైనట్టి ఆకారుడు॥
చ॥ లలిమీరిన యట్టి లావుల భీముడు। బలు కపికుల సార్వభౌముడు।
నెలకొన్న లంకా నిర్ధూమధాముడు। తలంపున రాము నాత్మారాముడు॥
చ॥ దేవకార్యముల దిక్కువరేణ్యుడు। భావింపగల తపః ఫల పుణ్యుడు।
శ్రీవేంకటేశ్వర సేవాగ్రగణ్యుడు। సావధానుడు సర్వశరణ్యుడు॥

813) దేసాక్షి / అమీర్కల్యాణి
ప॥ వెన్న ముద్దకృష్ణుడు వేవేల చేతలవాడు। పిన్న వాడై వున్న వాడు బిరుదైన బాలుడు॥
చ॥ బాలెంతచన్ను గుడిచి బండివిరుగగదన్ని। గాలిరక్కసుని ములుగగ మోది।
రోలగట్టువడి యట్టె రూఢిగా మద్దిమాకుల। గూలదొబ్బె తొల్లి వీడె గుట్టుతోడి బాలుడు॥
చ॥ కొండ గొడుగుగ బట్టిగోకులమునెల్ల గాచి। మెండగుగొల్లెతలతో మేలమాడి।
అండనే నోరుదెరచి యశోదకు లోకములు। దండిగా జూపె నితడె దంటయైన బాలుడు॥
చ॥ పరమేష్ఠికి మారొడ్డి పసిబాలకుల దెచ్చి। ధర బదారువేలుకాంతల బెండ్లాడి।
ఇరవై శ్రీ వేంకటాద్రి నిందరికి వరాలిచ్చి। సిరితో వెలసె నిదె చెలువపుబాలుడు॥

814) పాడి
ప॥ పిల్ల గ్రోవి పట్టమంటూ బెరరేచీనీ మా। గొల్లవారి పిల్ల గ్రోవి కోరో చల్లా॥
చ॥ పాడుమంటూ దండెమీటె బలుమారునుం దా। వేడుక నెవ్వెతెపాట వినవచ్చెనో।
వాడలో జల్లలమ్మే వనిత నింతే శ్రుతి। గూడినే బాడేటిచల్ల కోరో చల్లా॥
చ॥ చేరి నన్ను నాడుమంటా జెక్కు నొక్కీని తా। గారవాన నెవ్వతాట గనివచ్చెనో।
మారుకు మారాడేటి మందవారము మేము। కోరికి నాడేటిచల్ల కోరో చల్లా॥
చ॥ కిన్నెర మీటుమంటా గెలసీని తన్ను। గిన్నెర మీట్ల నేది గిలిగించెనో।
కన్నుల కలికి వేంకటపతిపై వెట్టి। గొన్న కిన్నెరగుబ్బల కోరో చల్లా॥

815) దేసాళం / హుసేని
ప॥ పిడికిటి తలబాల పెండ్లికూతుర నేను। వొడివట్టి తియ్యకున్న వూరకే యేమాయెను॥
చ॥ కనుగొన నిచ్చితివి కడుమోహ మిచ్చితివి। మనసియ్యకుండితేను మరేమాయెను।
పెనగగ జేసితివి బెట్టు రట్టు సేసితివి। నను బొందుసేయకున్న నడుమ నేమాయెను॥
చ॥ సడి నాపై వేసితి వాసల గింద వేసితివి। యెడసి చేవేయకున్న నేమాయెను।
వడి సటలాడితివి వట్టి మేలాలాడితివి। కడు జూజాలాడకున్న కమ్మటి నేమాయెను॥
చ॥ జట్టి నొట్టు వెట్టితివి సవతుల బెట్టితివి। యిట్టె తమ్మవెట్టకున్న నేమాయెను।
గుట్టున శ్రీవేంకటేశు కూడి కోపమాపితివి। అట్టె తమి యాపకున్న అందుకు నేమాయెను॥

816) లలిత
ప॥ పరమ పురుషుడు గోపాల బాలుడైనాడు। మురహరుడు యెదుట ముద్దుగారీనిదివో॥
చ॥ వేదపురాణాలలో విహరింపేదేవుడు। ఆదిమూలమైనట్టి అల బ్రహ్మము।
శ్రీదేవి పాలిటి చెలగే నిధానము। సేదదేరి యశోదకు శిశువాయ నిదివో॥
చ॥ మొక్కేటి నారదాదుల ముందరి సాకారము। అక్కజపు జీవులలో అంతర్యామి।

గక్కన బ్రహ్మకొడుకుగా గన్న పరమము। అక్కరతో వెన్నముచ్చై ఆటలాడీ నిదివో॥
చ॥ దేవతలగాచుటకు దిక్కైన విష్ణుడు। భావములు ఒక్కరూపైన భావతత్త్వము।
శ్రీవేంకటాద్రి మీద చేరియున్న ఆ వరదుడు।కైవసమై గొల్లెతల కౌగిళ్ళ నిదివో॥

817) శ్రీ
ప॥ పాటించి నమ్మిన వారి భాగ్యముగాదా। కోటిసుద్దులేల యిదె కోరి చేకొనేది॥
చ॥ స్వామిద్రోహియైనచండిరావణాసురుడు। కామించి శరణంటేను కాచే నంటివి।
యేమని నీదయ యెంతు నెంతని నీమహిమెంతు। ఆమాటకు సరియౌ నఖిలవేదములు॥
చ॥ దావతి సీతాద్రోహము దలచి కాకాసురుడు। కావుమని శరణంటే గాచితివి।
ఆవల నీపని యెట్టు అట్టె నీమన్నన యెట్టు। యీవల నీశరణనే ఇందుసరే తపము॥
చ॥ చిక్కు లిన్నీ నికనేల చేరి యేపాటివాడైన। గక్కన నీశరణంటే గాతువు నీవు।
అక్కరతో నిన్ను శరణంటిమి శ్రీవేంకటేశ। యెక్కువ నీబిరుదుకు యీడా పుణ్యములు॥

818) సామంతం / సామ
ప॥ పలుయోనులందు పుట్టి భ్రమసితిని। అలర నే నేజాతి ననుకొందునయ్యా॥
చ॥ వెనక జన్మముల నా వేడుకైన కాపురాల। యెనయు సతులు సుతులెందరో।
మునుకొని యీ జన్మమున గొందరున్నారు। మనసున నెవ్వరి మా వారందునయ్యా॥
చ॥ ఆదికాలముననుండి ఆయా దేహాలు మోచి। ఆదెస యేమేలు నాసొమ్మని వుంటినో।
నారించి యిప్పుడు గొన్ని నావి యనుచు నున్నాడ। యేది సతమని వుందు యెఱిగించవయ్యా॥
చ॥ అన్నిటా నాబాము చూచి అంతలో శ్రీవేంకటేశ। యెన్నరాని విజ్ఞాన మిచ్చితి విట్టె।
పన్నిన నాముసుపటి పాట్లెల్లా నెంచుకొంటె। నన్ను జూచి నాలోనే నవ్వు వచ్చీనయ్యా॥

819) ముఖారి
ప॥ చీచీ నరుల దేటి జీవనము। కాచుకొని హరి నీవే కరుణింతు గాకా॥
చ॥ అడవిలో మృగజాతియైనా గావచ్చు గాక। వడి నితరుల గొలువగ వచ్చునా।
వుడివోని పక్షియై వుండనైనా వచ్చు గాక। విడువ కెవ్వరినైనా వెడవచ్చునా॥
చ॥ పసరమై వెతలేని పాటువడవచ్చు గాక। కసటు వొనరుల బొగడవచ్చునా।
వుసురు మానై పుట్టివుండనైనావచ్చు గాక। దెసల నెక్కడనైనా దిరుగవచ్చునా॥
చ॥ యెమ్మెల పుణ్యాలు సేసి యిల నేలవచ్చు గాక। కమ్మి హరిదాసుడు గావచ్చునా।
నెమ్మది శ్రీవేంకటేశ నీ చిత్తమె కాని। దొమ్ముల కర్మము లివి తోయవచ్చునా॥

820) పాడి
ప॥ వేరొక్కరూ లేరు విశ్వమింతా నీమహిమ। యేరీతి నీవే కలవు యితరము లేదు॥
చ॥ తల్లివైరక్షింతువు తండ్రివై పోషింతువు। యిల్లాలివై మోహమిత్తువు నాకు।
వొళ్ళై పెరుగుదువు వొగి బురాకృత మౌదు। యిల్లు ముంగిలై వుందువింతా నీ మహిమే॥
చ॥ గురుడవై బోధింతువు కొడుకవై యీడేర్తువు। అరుదై నిధానమవౌదు నీవే।
దొరవై నన్నేలుదువు దూతవై పని సేతువు। యిరవైన సిరులిత్తు వింతా నీ మహిమే॥
చ॥ దేవుడవై పూజ గొందు దిక్కుప్రాణ మౌదువు। కావలసిన ట్టౌదు కామించినటు।
శ్రీవేంకటేశ నీవే నాచిత్తములోపల నుండి। యీవల వైకుంఠమిత్తు వింతా నీ మహిమే॥

821) ముఖారి
ప॥ ఎక్కువ తక్కువ లేవి యిందరిలోపల నేను। చిక్కి హరి నీవు పెద్ద సేసితివి గాక॥
చ॥ తెలియ నిందరివంటి దేహమే యిది గాదా। పొలసి దొరతనము పొదిగీ గాక।
మలమూత్రములు రక్తమాంసము లొక్కటె కావా। కలిమి లేములు ముందు కాననియ్యవు గాక॥
చ॥ చేపట్టి యిందరివంటి జీవుడ నే గానా। పాపపుణ్యములు నన్ను బరచీ గాక।
యేపొద్దు లోకములోని యింద్రియము లివే కావా। తీపులు మరపి నన్ను దిమ్మరేచీ గాక॥
చ॥ కైకొని యిందరివంటి కర్మమే సేయగ గాదా। యీకడ సంపదలు నన్నే బంచీ గాక।

పైకొని శ్రీవేంకటేశ భక్తి యెుక్కటె కాదా। యేకడనైనా నన్ను యీడేర్చు గాకా ॥
822) నాట
ప॥ నానామహిమల శ్రీ నారసింహము। పూని మమ్ము రక్షించీ పొగడెద నిదిగో ॥
చ॥ కొండవంటి వేదాద్రిగుహల్లో సింహము। దండి భవనాశియేటిదరి సింహము।
అండ నారుశాస్త్రముల అడవిలో సింహము। నిండి అహోబలముపై నిక్కి చూచీ నదిగో ॥
చ॥ దిట్ట యోగీంద్రుల మతితెర మఱగు సింహము। జట్టిగొన్న శ్రీసతితో జంటసింహము।
పట్టి దైత్యుల వేటాడే బలుదీము సింహము। మెట్టి అహోబలముపై మెఱసీదా నదిగో ॥
చ॥ పలుదేవతల వెనుబలమైన సింహము। కెలసి కంబాన చెనగిన సింహము।
అలరి శ్రీవేంకటేశు డైనట్టి సింహము। కొలువై అహోబలాన గురుతాయ నిదిగో ॥
823) వరాళి
ప॥ పదియారువన్నెల బంగారు కాంతులతోడ। పొదలిన కలశాపుర హనుమంతుడు ॥
చ॥ ఎడమ చేతబట్టె నిదివో పండ్లగొల। కుడిచేత రాకాసిగుంపుల గొట్టె।
తొడిబడ నూరుపులతో తూరుపు మొగమైనాడు। పొడవైన కలశాపుర హనుమంతుడు ॥
చ॥ తొక్కె అక్షకుమారుని తుంచి యడగాళ్ళా సంది। నిక్కించెను తోక ఎత్తి నింగి మోవను।
చుక్కలు మోవపెరిగి సుతువద్ద వేదాలు। పుక్కిటబెట్టె కలశాపుర హనుమంతుడు ॥
చ॥ గట్టి దివ్యాంబరముతో కవచకుండలాలతో। పట్టపు శ్రీవేంకటేశు బంటు తానయె।
అట్టె వాయువునకు అంజనిదేవికిని। పుట్టినాడు కలశాపుర హనుమంతుడు ॥
824) దేసాళం / రేవతి
ప॥ పూజలందరు జేసేదే పుష్పయాగము। ఆజి నర్జునుడు చేసినది పుష్పయాగము ॥
చ॥ మొదల శ్రీసతి చేతి మోహన కమలమే। పొదల నీకెపుడును పుష్పయాగము।
గుదిగొన మిమ్మిద్దరి గూడిమ్మే మరువిరులు। పొదిగి పూజించిన పుష్పయాగము ॥
చ॥ మాలాకారుడిచ్చిన మధురలో పూదండా। పోలింప నీకు నదె పుష్పయాగము।
కేలితో నారదుడొసగిన పారిజాతము। భూలోకమున నీకు పుష్పయాగము ॥
చ॥ తొరలి అలమేల్మంగ తురుమున విరులే నీకు। పొరసి నీవురముపై పుష్పయాగము।
సిరులతో మునులెల్ల శ్రీవేంకటాద్రీశ నీకు। పొరిపొరి జేసేరు పుష్పయాగము ॥
825) బృందావని
ప॥ పిలువరే కృష్ణుని పేరుకొని యింతటాను। పొలసి యారగించే పొద్దాయ నిపుడు ॥
చ॥ వెన్నలారగించ బోయి వీధులలో దిరిగీనో। యెన్న రాని యమునలో యీదులాడేనో।
సన్నల సాందీపనితో చదువగ బోయినాడో। చిన్న వాడాకలి గొనె చెలులాల యిపుడు ॥
చ॥ మగువల కాగిళ్ళ మఱచి నిద్దిరించీనో। సొగిసి యావుల గాచే చోట నున్నాడో।
యెగువ నుట్లకెక్కి యింతులకు జిక్కినాడో। సగము వేడికూరలు చల్లనాయ నిపుడు ॥
చ॥ చెంది నెమలి చుంగుల సింగారించుకొనీనో। ఇందునే దేవరవలె ఇంటనున్నాడో।
అందపు శ్రీవేంకటేశు డాడివచ్చె నిదె వీడె। విందుల మాపొత్తుకు రా వేళాయ నిపుడు ॥
826) శంకరాభారణం
ప॥ పొదలె నిండు కళల పున్నమి నేడు। అదను దప్పక జాజ రాడుదువు రావయ్యా ॥
చ॥ జలజాక్షి మోమునను చంద్రోదయమాయ। నెలకొన్న నవ్వుల వెన్నెల గాసెను।
కలికి కన్నుల నల్ల కలువలు వికసించె। అలరి యీకెతో జాజ రాడుదువు రావయ్యా ॥
చ॥ యెనసి జవ్వనమున నేతెంచె వసంతకాల। మొనరి మోవి చిగురు లుప్పతిల్లెను।
గొనకొన్న తురుమున కూడె తుమ్మిదమూక। అనుమానించక జాజ రాడుదువు రావయ్యా ॥
చ॥ కుంకుమ చెమట చను కొప్పెరల నిండుకొనె। కొంకక గోళ్ళే బుఱ్ఱటకొమ్ము లాయెను।
లంకెలై శ్రీవేంకటేశ లలనతో కూడితివి। అంకెల నేపొద్దూ జాజ రాడుదువు రావయ్యా ॥
827) మాళవి / కాంభోజి

****************************************************************************************************
ప॥ పొలతి జవ్వనమున బూవక పూచె। యెలమి నిందుకు మనమేమి సేసేదే ॥
చ॥ సతిచింతాలతలలో సంపెంగపూవులు పూచె। మతివిరహపు మేన మల్లెలు పూచె।
అతనునితలపోతను అడవిజాజులు పూచె। హితవు తెలియదింకను ఏమిసేసేదే ॥
చ॥ తొయ్యలిచెమటనీట దొంతితామెరలు పూచె। కొయ్యచూపు కోపముల కుంకుమ పూచె।
కయ్యపు వలపుల జీకటి మాకులు పూచె। నియ్యెడ చెలియభావ మేమి చేసేదె ॥
చ॥ మగువరతుల లోన మంకెన పువ్వులు పూచె। మొగికొనగోళ్ళనే మొగలి పూచె।
పొగరు శ్రీవేంకటేశు పొందుల కప్రము పూచె। ఇగురు బోండ్ల మింక నేమి సేసేదే ॥
828) కల్యాణి
ప॥ పరమ పురుషుడు గోపాల బాలుడైనాడు। మురహరుడు ఎదుట ముద్దులాడీనిదివో ॥
చ॥ వేదపురాణాలలో విహరించేదేవుడు। ఆదిమూలమైనట్టి అల బ్రహ్మము।
శ్రీదేవి పాలిటి చెలగే నిధానము।సేదదీరి యశోదకు శిశువాయ నిదివో ॥
చ॥ మొక్కేటి నారదాదుల ముందరి సాకారము। అక్కజపు జీవులలో అంతర్యామి।
గక్కన బ్రహ్మకొడుకుగా గన్న పరమము। అక్కరతో వెన్నముచ్చట ఆటలాడీ నిదివో ॥
చ॥ దేవతలగాచుటకు దిక్కైన విష్ణుడు। భావములు ఒక్కరూపైన భావతత్వము।
శ్రీవేంకటాద్రి మీద చేరియున్న ఆ వరదుడు।కైవసమై గొల్లెతల కౌగిళ్ళ నిదివో ॥
829) దేశాక్షి / సారంగ
ప॥ పరతత్వం బగు బాలుడు। పరిపరివిధముల బాలుడు ॥
చ॥ చద్దులమూటలు చంకల వ్రేలెడి। ముద్దులపడుచుల మూకలతో।
పెద్దరికంబున పేయల గాచిన। బద్దులనటనల బాలుడూ ॥
చ॥ వెన్నలుదాకగ వేట్లాడుచును। సన్నపుబడుచుల సంగడిని।
కన్నెలు దూరగ కలకల నవ్విన। పన్నిన మాయల బాలుడు ॥
చ॥ బచ్చన రూపుల పాయపుబడుచులు। నిచ్చలు కొలువగ నెమ్మదిని।
నచ్చిన వేంకట నగమున నాడెడి। పచ్చిలపదకపు బాలుడు ॥
830) గౌళ
ప॥ పూవుబోణుల కొలువే పుష్పయాగము। పూవక పూచె నీకిట్టె పుష్పయాగము ॥
చ॥ కలువరేకుల వంటి ఘనమైన కన్నుల। పొలతుల చూపులే నీ పుష్పయాగము।
తలచి తలచి నిన్ను తమమేనుల బొడమే। పులక జొంపములె నీ పుష్పయాగము।
చ॥ కరకమలములను కందువగోపికలెల్లా। పొరసి నిను జూపుటే పుష్పయాగము।
సరసపు మాటలే సారెనాడి తమనవ్వు। పొరి నీపై జల్లుటే పుష్పయాగము ॥
చ॥ గాటపు కొలనిదండ కాంతలు సిగ్గున నిన్ను। బూటకానకు దిట్టుటే పుష్పయాగము।
యీటున శ్రీవేంకటేశ యిట్టె యలమేలుమంగ। పూటవూటరతులివి పుష్పయాగము ॥
831) భైరవి
ప॥ పరిపూర్ణుడవు నీవు పరాకున్నదా నిన్ను। మరిగి వుండనిదే మావల్ల దప్పు గాకా ॥
చ॥ వినవా నీ వేమియైనా విశ్వమెల్లా వీనులే। యెనసి విన్నవించని యెడ్డతన మింతే కాక।
కనవా నీ విన్నియు నీ కన్నులే యెందు చూచినా। పనితో నా భావము చూపని నేరమి గాకా ॥
చ॥ పలుకవా నీ వేమియైనా బహుశబ్దమయుడవు। అలరి పిలువని నా యవివేక మింతే కాక।
నిలువవా నా ముందర నిఖిలస్వరూపడవు। తెలిసి చూడలేని సందేహ మింతే కాక ॥
చ॥ మన్నించవా నీవేమి మఱగు చొచ్చితి నంటే। పన్ని మత్తుడనై యున్న నా కర్మము గాక।
యిన్నిట శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె। యిన్నాళ్ళెఱుగని భాగ్యమిట్టుండె గాకా ॥
832) బౌళి
ప॥ పెట్టనికోటిందరికి పెండ్లికొడుకు బొమ్మ। బెట్టె నసురులకెల్ల పెండ్లికొడుకు ॥
చ॥ పెల్లగించి భూమెత్తీ పెండ్లికొడుకు వాడె। పిల్లగోవి రాగాల పెండ్లికొడుకు।
****************************************************************************************************

పెల్లైన యావుల పెండ్లికొడుకు । పిల్లదీపు పెన్నుద్ది పెండ్లికొడుకు ॥
చ॥ పెంచెపు శిరసుపాగ పెండ్లికొడుకు గుం- । పించిన కోపగించీ పెండ్లికొడుకు ।
పెంచకప్పుడే పెరిగె పెండ్లికొడుకు వల- । పించె చక్కనిసిరి పెండ్లికొడుకు ॥
చ॥ యింటిపెరుగులదొంగ పెండ్లికొడుకు భూమి । బెంటి పోతుల గూరిచె పెండ్లికొడుకు ।
గెంటులేని వేంకటగిరిమీదను వాడె । పంట వెట్టుకున్న వాడు పెండ్లికొడుకు ॥

833) శంకరాభరణం
ప॥ ఎంత వడేయ నిదేమమ్మా । దొంతిరతులకు నెదురు చూచీని ॥
చ॥ అలికులవేణి అంబుజపాణి । కలికిమగువ రాగదవమ్మా ।
మలయజగంధి మదన విలాసిని । కలయికకు పతిగాచుకున్నాడు ॥
చ॥ సామజగమనా చక్కెరబొమ్మా । కామిని యిక రాగదవమ్మా ।
భూమాతిలకమ పసిడి సలాకా । నీమగడదివో నిలుచుకున్నాడు ॥
చ॥ వొడికపు నెలతా వొప్పుల కుప్పా । కడకల సతి రాగాదవమ్మా ।
గుడిగొని తెరలో గూడెనిన్నప్పుడు । యెడయక శ్రీవేంకటేశుడున్నాడు ॥

834) మాళవిగౌళ / శహన
ప॥ శరణు శరణు నీకు జగదేకపతి కృష్ణ । వరములొసగవయ్యా వాసుదేవ కృష్ణ ॥
చ॥ మద్దులు విరిచినట్టి మాధవ కృష్ణ । సుద్దులు చెప్పవయ్యా అచ్యుత కృష్ణ ।
వొద్దు రాగదవయ్య ఉపేంద్ర కృష్ణ । ముద్దులు గిరియవయ్య ముకుంద కృష్ణ ॥
చ॥ గొల్లెతల మరిగిన గోవింద కృష్ణ । చెల్లునయ్య నీచేతలు శ్రీధర కృష్ణ ।
అల్లన దొంగాడవయ్య హరి శ్రీకృష్ణ । మల్లుల గెలిచినట్టి మధుసూదన కృష్ణ ॥
చ॥ గోవుల గాచిన యట్టి గోపాల కృష్ణ । కైవశమై మమ్మేలు శ్రీకర కృష్ణ ।
నా విన్నపమాలించు నారాయణ కృష్ణ । సేవకుడ నీకు జుమ్మీ శ్రీవేంకట కృష్ణ ॥

835) ఆహిరి
ప॥ జీవాతుమై యుండు చిలుకా నీ- । వావలికి పరమాత్ముడై యుండు చిలుకా ॥
చ॥ ఆతుమపంజరములోన నయమున నుండి నా- । చేతనే పెరిగిన చిలుకా ।
జాతిగా కర్మపు సంకెళ్ళ బడి కాల- । జేత బేదైతివే చిలుకా ॥
చ॥ భాతిగా చదువులు పగలురేలును నా- । చేత నేరిచినట్టి చిలుకా ।
రీతిగా దేహంబురెక్కలచాటున నుండి । సీతుకోరువ లేని చిలుకా ॥
చ॥ బెదరి అయిదుగురికిని భీతి పొందుచు కడు । జెదరగ జూతువే చిలుకా ।
అదయులయ్యిన శత్రులారుగురికిగాక । అదిరి పడుదువే నీవు చిలుకా ॥
చ॥ వదలకిటు యాహారవాంఛ నటు పదివేలు- । వదరులు వదరేటి చిలుకా ।
తుదలేని మమతలు తోరమ్ము సేసి నా- । తోగూడి మెలగిన చిలుకా ॥
చ॥ నీవన నెవ్వరు నేనన నెవ్వరు । నీవే నేనైయుండు చిలుకా ।
శ్రీవేంకటాద్రిపై చిత్తములో నుండి । సేవించుకొని గట్టి చిలుకా ॥
చ॥ దైవమానుషములు తలపించి యెపుడు నా- । తలపున బాయని చిలుకా ।
యేవియును నిజముగా వివి యేటికని నాకు । నెఱిగించి నటువంటి చిలుకా ॥

836) లలిత ..పెద తిరుమలాచారి కృతి
ప॥ ఉన్నమాట లిక నేల వో దేవా । యెన్నటి కిదేమాట యింకా నింకాను ॥
చ॥ కొంత నా కర్మఫలము కొంత నీ రక్షకత్వము । యింతలో రెండు గలవా యేమో దేవా ।
అంతర్యామివి నీవు ఆడేటిబొమ్మను నేను । చెంత గాచుట నీపని సేవసేయ నాపని ॥
చ॥ నే నపరాధి నయ్యేది నీవు వహించు కొనేది । యీ నెపాలు రెండూ నేల యేమో దేవా ।
మానక యిట్లయితే నీ మహిమకు గురుతేది । ఆని చింతించే నందుల కపకీర్తి యనుచు ॥
చ॥ మెదలే నా యధమము మీ ఘనత యెంచి కావు । యిదియే నా విన్నపము యేమో దేవా ।

యెదుట శ్రీవేంకటేశ యిన్నిటా నీ బంటు బంట। పదివేలు నా నేరాలు పట్టకుమీ యికను ॥

837) సాళంగనాట

ప॥ మంతనాన నాడేరమ్మ మధురలో యీసుద్దులు। వింతలాయ వినరమ్మ వీనుల పండుగలు ॥

చ॥ గక్కన కృష్ణుడు పుట్టె కంసుని మద మడగె। మొక్కిరి దేవతలెల్ల ముదమందుచు।
చక్కగా జయంతి నేడు శ్రావణ బహుళాష్టమి। తక్కక దేవకి తల్లి తండ్రి వసుదేవుడు ॥

చ॥ యమున దాటి యట్టె యశోద యింట బెరిగి। జమళితో బలబద్ర సమేతుడై।
సమమై చంద్రోదయము సమకూడె తోడతోడ। రమణ పువ్వులవాన రాసులుగా కురిసె ॥

చ॥ పనులెల్లా నీడేరె బ్రదికె లోకములెల్లా। నినుపులై ధర్మములు నెలకొనెను।
వొనర నలమేల్మంగ నురమున నిడుకొని। ఘన శ్రీవేంకటేశుడై కందువ నిలిచెను ॥

838) గౌళ

ప॥ అఱిముఱి హనుమంతుడు అట్టి బంటు। వెఱపులేని రఘువీరునికి బంటు ॥

చ॥ యేలికను దైవముగా నెంచి కొలెచేవాడే బంటు। తాలిమిగలిగినయాతడే బంటు।
పాలుమాలక యేపొద్దు పనిసేయువాడే బంటు। వేళ గాచుకవుండేటి వెరవరే బంటు ॥

చ॥ తను మనోవంచన లెంతటా లేనివాడే బంటు। ధనముపట్టున శుద్ధాత్మకుడే బంటు।
అనిశము నెదురు మాటాడనివాడే బంటు। అనిమొన తిరుగనియతడే బంటు ॥

చ॥ చెప్పినట్లనే నడచినయాతడే బంటు। తప్పులేక హితుడైనాతడే బంటు।
మెప్పించుక విశ్వాసాన మెలగువాడే బంటు। యెప్పుడును ద్రోహిగాని హితుడే బంటు ॥

చ॥ అక్కర గలిగి కడు నాప్తుడైనవాడే బంటు। యెక్కడా విడచిపోనియిష్టుడే బంటు।
తక్కక రహస్యములు దాచినవాడే బంటు। కక్కసీడుగాక బత్తిగలవాడే బంటు ॥

చ॥ కానిపనులకు లోనుకానివాడే బంటు। ఆనాజ్ఞ మీరనియాతడే బంటు।
నానాగతి శ్రీవేంకటేశోన్నతుడైన యతనికి। తా నిన్నిటా దాసుడైన ధన్యుడే బంటు ॥

839) లలిత

ప॥ అన్నిటా జాణడు అలమేలుమంగపతి। పన్ని నీకు మేలువాడై పరగివున్నాడు ॥

చ॥ పట్టినదే పంతమా పతితోడ నీకిప్పుడు। యిట్టె నిన్ను వేడుకోగా నియ్యకోరాదా।
వొట్టి యప్పటినుండి నీవొడి వట్టుకొన్నవాడు। గట్టువాయ తనమేల కరగవే మనసు ॥

చ॥ చలములే సాదింతురా సారెసారెనాతనితో। బలిమి బిలువగాను పలుకరాదా।
కలపుకోలు సేసుక కాగిలించుకున్నవాడు। పెలుచుదనములేల పెనగవే రతిని ॥

చ॥ చేరి ఇట్టె బిగుతురా శ్రీవేంకటేశ్వరునితో। మేరతో నిన్నేలగాను మెచ్చగరాదా।
యీరీతి నిన్ను పెండ్లాడె యెడయెక వున్నవాడు। వీరిడితనములేల వెలయవే మరిగి ॥

840) ముఖారి

ప॥ అదివో కనుగొను మది యొకతె। యెదుటనె నెలకొనె నిది యొకతె ॥

చ॥ తేటల మాటల తెరలదె కట్టీ। గాటుకకన్నుల కలికొకతె।
జూటరిచూపుల జొక్కులు చల్లీ। నీటుగర్వముల నెలతొకతె ॥

చ॥ ముసిముసినవ్వుల మోపులుగట్టీ। రసికుడ నీపై రమణొకతె।
కొసరుల కుచముల గోటలు వెట్టీ। మిసమిస మెఱుగుల మెలుతొకతె ॥

చ॥ కాయజకేలికి కందువ చెప్పీ। చాయలసన్నల సతి యొకతె।
యీయెడ శ్రీవేంకటేశ కూడి నిను। వోయని మెచ్చీ నొకతొకతె ॥

841) భైరవి / పూర్వీకల్యాణి

ప॥ అప్పుడెట్టుండెనో చిత్తమయ్యో యెఱగనైతి। చెప్పుడుమాటలకే నే జేరనైతిగా ॥

చ॥ కొసరికొసరి నీపై కోపమున నుంటిగాని। ఆసమిచ్చి నీతో మాటలాడనైతిగా।
పసలేని సిగ్గుతోడి పంతాననే వుంటిగాని। ముసిముసి నవ్వు మోవి మోపనైతిగా ॥

చ॥ విరహపు కాకల నావిసుపే చూపితిగాని। సరిబిల్చితే నూకొన జాలనైతిగా।

వరుసవంతులకై నే వాదులాడితి గాని। మురిపేన మొక్కితే నే మొక్కనైతిగా॥
చ॥ వేగమే నీవు గూడితే వెస భ్రమసితిగాని। చేగలనీమేను పచ్చిసేయనైతిగా।
భోగపు శ్రీవేంకటేశ పోట్లదొరితిలోన। నీగతి చెన్నుడవైతే నెనసితిగా॥
842) సాళంగనాట
ప॥ అవధారు దేవ హరికుల రామ। వివిధమై నీబంటు వెలయుచున్నాడు॥
చ॥ అదె కలశాపుర హనుమంత రాయడు। కదనము లోన రక్కసుల గొట్టి।
యెదుట నిందరి లోన నేకాంగవీరుడై। కొదలేక ప్రతాపించి కొలువైవున్నాడు॥
చ॥ చల్లని వనాల నీడ సాగుడు కొండలలోన। వల్లెగా వేసుకొన్న వాలముతోడ।
పల్లదాన వలకేలు పంతమున నెత్తుకొని। కొల్లున మంటపములో కొలువై వున్నాడు॥
చ॥ పెక్కు పండ్ల గొలలు పిడికిట బట్టుకొని। చక్కగా పెరిగి పెద్దజంగ చాచి।
యిక్కువ శ్రీవేంకటాద్రి నిరవైన సర్వేశ। గుక్కక నీపై భక్తి గొలువై విన్నాడు॥
843) అఠాణ
ప॥ అదిగో కొలువై వున్నాడు అలమేలు మంగపతి। పదివేల విధములను పారు పట్టము చేయుచు॥
చ॥ రంగ మండపములో రత్న సింహాసనముపై। అంగనామణులతొ అమరవేంచేసి।
బంగారు పావడలు పసరించి యిరుగడల। శృంగారముగ సురలు సేవ సేయగను॥
చ॥ వెండి పైడి గుదియలను వేత్రహస్తులు పొగడ। నిండు వెన్నెల పూల దండలు అమర।
గుండిగలు కానుకలను పొనర లెక్కలు చేయ। దండిమీరగ నిపుడు దేవరాయడు చెలగి॥
చ॥ అంగ రంగ వైభవముల రంగుగా చేకొనుచు। మంగళ హారతుల మహిమ వెలసి।
శృంగార మైనట్టిమా శ్రీవేంకటాధిపుడు। అంగనలు కొలువగాను యిపుడు వేంచేసి॥
844) దేసాళం / ఖరహరప్రియ
ప॥ ఆతడే బ్రహ్మణ్యదైవము ఆది మూలమైన వాడు। ఆతని మానుటలెల్ల అవిధిపూర్వకము॥
చ॥ ఎవ్వని పేర పిలుతురు ఇల పుట్టిన జీవుల। నవ్వుచు మాస నక్షత్ర నామముల।
అవ్వల ఎవ్వని కేశవాది నామములే। రవ్వగా ఆచమనాలు రచియింతురు॥
చ॥ అచ్చ మేదేవుని నారాయణ నామమే గతి। చచ్చేటి వారికి సన్యాసము వారికి।
ఇచ్చ నెవ్వరి తలచి యిత్తురు పితాళ్ళకు। ముచ్చట నెవ్వని నామములనే సంకల్పము॥
చ॥ నారదుడు తలచేటినామ మది యెవ్వనిది। గౌరినుడిగేటినామకథ యేడది।
తారకమై బ్రహ్మరుద్రతతి కెవ్వరి నామము। యీరీతి శ్రీవేంకటాద్రి నెవ్వడిచ్చీ వరము॥
845) నాటా / రేవతి...పెద తిరుమలాచారి కృతి
ప॥ అనాది జగములు అనాది దేవుడు। వినోదములు గని విసుకదు మాయ॥
చ॥ పుట్టేటి జీవులు పోయిన జీవులు। వొట్టిన జీవులు ఉన్నారు।
చుట్టేరు దినములు సూర్యచంద్రాదులు। తెట్ట దెరువునె తేగడు కాలము॥
చ॥ కలడు బ్రహ్మయును కలరింద్రాదులు। కలవనేకములు కార్యములు।
ఫలభోగంబులు పైపైనున్నవి। కలియు గర్మము గడవగ లేదూ॥
చ॥ శ్రీవేంకటేశుడు చిత్తములో వీడె। భావము లోపల భక్తి యిదే।
భావించి బ్రతుకుట ప్రపన్నులు వీరిదె। యేవల జూచిన యిహమే పరము॥
846) ఆహిరి
ప॥ అపుడేమనె నేమనుమనెను। తపమే విరహపు తాపమనె॥
చ॥ పవనజ యేమనె పడతిమరేమనె। అవనిజ నిను నేమను మనెను।
రవికులేంద్ర భారము ప్రాణంబనె। ఇవల నెట్ల ధరియించేననె॥
చ॥ యింకా నేమనె యింతి మరేమనె। కొంకక యేమని కొసరుమనె।
బొంకుల దేహము పోదిది వేగనె। చింక వేట ఇటు చేసెననె॥
చ॥ నను నేమనె ప్రాణము మన కొకటనె। తనకు నీ వలెనె తాపమనె।

మనుకులేశ ప్రేమపు మనకూటమి। ఘనవేంకటగిరి గంటిననె॥

847) పాడి / కాపీ

ప॥ అలమేలుమంగనీ వభినవరూపము। జలజాక్షు కన్నులకు చవులిచ్చేవమ్మా॥

చ॥ గరుడాచలాధీశు ఘనవక్షముననుండి। పరమానంద సంభరితవై।
నెరతనములు జూపి నిరంతరమునాథుని। హరుషింపగ జేసితి గదమ్మా॥

చ॥ శశికిరణములకు చలువలచూపులు। విశదముగా మీద వెదజల్లుచు।
రసికత పెంపున కరగించి యెప్పుడు నీ। వశముజేసుకొంటి వల్లభునోయమ్మా॥

చ॥ రట్టడి శ్రీవేంకటరాయనికి నీవు। పట్టపురాణివై పరగుచు।
వట్టిమాకులిగిరించు వలపుమాటలవిభు। జట్టిగొని పురమునసతమైతివమ్మా॥

848) కేదారగౌళ

ప॥ ఇద్దరి గూరిచితిమి యేము చెలికత్తెలము। పొద్దు కొకకొత్తలుగా భోగించరయ్యా॥

చ॥ ప్రేమముతోసేసపాల పెండ్లికూతురురిదె వచ్చె। ఆముకొని సరసములాడవయ్యా।
ఆమనిసిగ్గులతోడ నదె తెరలో నున్నది। చేముట్టిసేవలెల్లా జేయించుకోవయ్యా॥

చ॥ మక్కువతో నీ మేన మరదలిదివో వచ్చె। చక్కగా పాదాలికెపై జాచవయ్యా।
వెక్కసాన తమకించి వేడుకతో నున్నది। గక్కనను దప్పక మొగము చూడవయ్యా॥

చ॥ అరుదై శ్రీవెంకటేశ అలమేలుమంగ వచ్చె। బెరసి రతులను నిట్టె పెనగవయ్యా।
గరిమ వేళగాచి నీకౌగిటిలోనే నున్నది। సరికిబేసికి నీవు చనవియ్యవయ్యా॥

849) లలిత

ప॥ ఇతరుల నడుగము యితడే మాదాత। యితనియీవి వొరులియ్యగగలరా॥

చ॥ దేవదేవుడాదిమపురుషుడు హరి। శ్రీవత్సాంకుడు చిన్మయుడు।
యీవల నావల యిలవేలుపతడు। భావజగురుడు మాపాలిటవాడు॥

చ॥ జగదేకగురుడు శాశ్వతుడచ్యుతు-। డగజకు వరదుడు అనంతుడు।
తగి మమునేలిన దైవము యేలిక। నిగమమూర్తి మానిజబంధువుడు॥

చ॥ కలిదోషహరుడు కైవల్యవిభుడు। అలరిన శ్రీవేంకటాధిపుడు।
చలిమి బలిమి మా జననియు జనకుడు। అలమి యితడు మాయంతర్యామి॥

850) భైరవి

ప॥ ఇట్టి సంసారికేదియు లేదాయ। తట్టువడుటే కాని దరిచేరలేదు॥

చ॥ మూలిగి భారపు మోపు మోచేటివాడు। అలసి దింపుకొను నాడాడను।
అలరు సంసారికి నదియు లేదాయ। తొలగని భారమెందును దించలేదు॥

చ॥ తడవి వేపచేదు త్రావెడివాడు। ఎడయెడ దిను తీపేమైనను।
అడరు సంసారికి నదియు లేదాయ। కడుజేదెకాని యెక్కడ తీపులేదు॥

చ॥ దొరకని హేయమే తోడేటివాడు। పరిఢవించును మేన బరిమళము।
అరిది సంసారికి నదియు లేదాయ। ఇరవు శ్రీవేంకటపతి నెఱుగలేడు॥

851) ముఖారి / శ్రీరంజని

ప॥ ఇటునిను తెలియగ ఎంతటివారము। తటుకన నాసల తగులుటగాక॥

చ॥ నానామూర్తులు నగధర నీరూపు। యే నెలవుల నిన్నెటువలె దలచుట।
పూని నీ భావము పొందుగా జెప్పగా। వీనులు చల్లగా వినుటే గాక॥

చ॥ పెక్కునామములు బిరుదు లనంతము-। లెక్కడ కొలదిగ నెన్నని పొగడుట।
యిక్కువ సేసుక యిందులో నొకటి। పక్కన నొకమరి పలుకుట గాక॥

చ॥ వేవేలు గలవు నీ విహారభూములు। యే విధమున ఎందెందని తిరుగుట।
శ్రీవేంకటేశా నీ శృంగారమెల్లను। సేవించి ముదమున చెలగుటగాక॥

852) మాళవిగౌళ / ఖమాచ్

ప॥ ఇతడే యతడు కాబో లేలిక బంటును నైరి। మితిలేని రాఘవుడు మేటి హనుమంతుడు॥
చ॥ జలధి బంధించిదాటె చలపట్టి రాఘవుడు। అలరి వూరకే దాటె హనుమంతుడు।
అలుకతో రావణుని యదటణచె నతడు। తలచి మైరావణుని దండించె నితడు॥
చ॥ కొండ వెల్లగించె తొల్లి గోవర్ధనుడతడు। కొండతో సంజీవి యెత్తె గోరి యితడు।
గుండు గరచె నహల్య కొరకు సీతాపతి। గుండు గరగగ పాడె కోరి యితడు॥
చ॥ అంజనాచలము మీద నతడు శ్రీవేంకటేశు-। డంజనీ తనయుడాయ ననిలజుడు।
కంజాప్తకులరామఘనుడు తానును దయా-। పుంజమాయ మంగాంబుధి హనుమంతుడు॥

853) గుజ్జరి / సావేరి
ప॥ ఇతరములన్నియు నడమంత్రములే యెంచిచూచినను యింతాను।
హితవగుబంధువుడు ఈశ్వరుడొక్కడే ఈతనిమరువకుమీ జీవాత్మ॥
చ॥ భవకూపంబుల బడలెడినాడు పాయని బంధువుడు ఇతడొకడే।
దివిస్వర్గంబున తేలెడినాడు తిరుగబాయకెపు డితడొకడే।
నవనరకంబుల నలగెడినాడు నటనల బాయడితడొకడే।
యివలనవల హృదయేశుడు విష్ణుడు ఈతని మరువకుమీ జీవాత్మా॥
చ॥ పశుమృగాదుల వొడలెత్తినప్పుడు పాయని బందుగు డితడొకడే।
విశదపు దుఃఖపువేళలనైనా విడువని బంధువుడితడొకడే।
శిశువైనప్పుడు వృద్ధైనప్పుడు చిత్తపుబందుగుడితడొకడే।
దశావతారపు విష్ణుడొక్కడే ఈతని తలచుమీ జీవాత్మా॥
చ॥ భావజకేలిని జొక్కినప్పుడును ప్రాణబంధువుడు ఇతడొకడే।
యీవల నావల యిహపరములలో నిన్నిటి బంధువుడితడొకడే।
దైవము తానని శరణనియెడు నను దగ్గరికాచెను ఇతడొకడే।
శ్రీవేంకటగిరి నాయకుడితడే చేరి భజించుము జీవాత్మా॥

854) నట్టనారాయణి / ఆహిరి
ప॥ ఇన్నాళ్ళు నేడనుండెనో యెవ్వరు నెఱగరు। కన్నులయెదుట నేడు గానబడెగాని॥
చ॥ యేమి గావలెనో కాని యీపె నీకు నెదురై। మోముకళలుదేరగ మొక్కె నిపుడు।
చేముట్టి యీసతిని జేరి కాగిలించితివి। మీమీచుట్టరికము మేమిదివో కంటిమి॥
చ॥ యేవూరోకాని తాను నీ యింటికే వచ్చి బత్తితో। సేవలెల్లా జేసితేను చెలగితివి।
భావమెరిగి గందము పైబూసి నవ్వితివి। దోమటివన మీయిద్దరిపొందులు నేడు గంటిమి॥
చ॥ తనపే రేటిదోకాని తగిలి శ్రీవేంకటేశ। చెనకుచు నీపై దాను సేసవెట్టెను।
యెనసితి విటు నన్ను యే నలమేలుమంగను। నినుపులమీ ఇంపులు నేడు నేము గంటిమి॥

855) సామంతం / బహుదారి
ప॥ ఇతనికంటే మరిదైవము కానము యెక్కడా వెదకిన నితడే।
అతిశయమగు మహిమలతో వెలసెను అన్నిటికాధారముతానె॥
చ॥ మదిజలధులనొకదైవము వెదకిన మత్స్యావతారంబితడు।
అదివో పాతాళామందు వెదకితే ఆదికూర్మమీ విష్ణుడు।
పొదిగొని యడవుల వెదకి చూచితే భూవరాహమనికంటిమి।
చెదఱక కొండల గుహాల వెదకితే శ్రీనరసింహంబున్నాడు॥
చ॥ తెలిసి భూనభోంతరమున వెదకిన త్రివిక్రమాకృతి నిలిచినది।
పలువీరులలో వెదకిచూచితే పరశురాముడొకడైనాడూ।
తలపున శివుడునుపార్వతి వెదకిన తారకబ్రహ్మమురాఘవుడు।
కెలకుల నావులమందల వెదకిన కృష్ణుడు రాముడునైనారు॥
చ॥ పొంచి అసురకాంతలలో వెదకిన బుద్ధావతారంబైనాడు।

మించిన కాలము కడపట వెదకిన మీదటికల్క్యావతారము।
అంచెల జీవులలోపల వెదకిన అంతర్యామై మెరసెను।
యెంచుక ఇహమున పరమున వెదకిన యీతడే శ్రీవేంకటవిభుడు॥

856) లలిత / మోహన

ప॥ విష్ణు దేవు పాదములే విద్య బుద్ధీ మాకు।వైష్ణవులమైతి మింక వదలవో కర్మమా॥

చ॥ గోవిందునిపాదములే కోరి యిహపరములు।శ్రీవిభునిపాదములే చేరువేదశాస్త్రములు।
దేవదేవుపాదములే దిక్కును దెసయు మాకు।భావములో నిలిపితి పాయరో పాపములు॥

చ॥ హరిపాదములే మాకు నన్నపానభోగములు।పరమాత్ము పాదములే పాడీ పంటా మాకు।
మురహరు పాదములే ముందర వెనకా మాకు।శరణంటి మెందైనా చనరో దుఃఖములు॥

చ॥ అనంతుని పాదములే ఆయుష్య భవిష్యములు।దనుజారి పాదములే ధనధాన్య ధర్మములు।
యెనలేని శ్రీవేంకటేశు డితనిపాదాలే।మనసున గొలిచితి మానరో భవములు॥

857) ముఖారి

ప॥ నీ మనసింకరాదు నేనేమి సేతురా।ఏమాటకేమాట ఇంతేల దూరులు॥

చ॥ అంటినా నిన్నేమైనా అందరిలో పచ్చి చేసి।కంటకములాడితినా కపటాలెత్తి।
వెంట వెంట నీ గుట్టు వెల్లవిరిసేసితినా।ఇంటిలోననున్న దాన ఇకనేల దూరులు॥

చ॥ రమ్మంటినా నిన్ను రమణి పక్కనుండగా।సొమ్ముల మోవి కెంపులు చూడబోతినా।
నెమ్మది నీయానలలో నే తప్పు వట్టితినా।ఉమ్మడినే ఉన్న దాన ఊరకేల దూరును॥

చ॥ ఈడ నన్ను గూడి చిత్తమేడనున్నదంటినా।వాడుమోము తెల్లబార వద్దంటినా।
ఈడు లేక శ్రీ వేంకటేశ కూడితివి నన్ను।వేడుకతోనున్నదాన వేయేల దూరుదు॥

858) రామక్రియ / అఠాణ

ప॥ ఈతడువో రాముడు ఏకాంగవీరుడు।ఏతలజూచినా తానై ఇరవుకొన్న వాడు॥

చ॥ చిఱుత ప్రాయమునాడు శివునివిల్లువిఱిచి।మెఱసి సీతను పెండ్లాడి మించినవాడు।
తఱి పదునాలుగు వేల దానవుల నిమిషాన।జఱసి తానొక్కడే చదిపిన వాడు॥

చ॥ ఓడకవిల్లెక్కుపెట్టి ఊరకే ఒక్కమ్మున।ఏడు తాళ్ళు ధరను కూలవేసినవాడు।
జూడాగా కొండలచేత జలనిధి గట్టించి।వేడుకతో లంకమీద విడిసిన వాడు॥

చ॥ రావణ కుంభకర్ణాది రాకాసుల పరిమార్చి।ఈవల అయోధ్యాపట్న మేలిన వాడు।
శ్రీవేంకటాద్రిమీద జేరి మాల్యవంతమున।వేవేలు చందములను వెలసినవాడు॥

859) లలిత / కానడ

ప॥ ఈతని మూలమే పో యిలగల ధనములు।ఈతడు మాకు గలడు యెంత లేదు ధనము॥

చ॥ విరతి మాధనము విజ్ఞానమే ధనము।మఱిగినతత్వమే మాధనము।
పరము మాధనము భక్తే మాధనము మా।కరిరాజవరదుడే కైవల్యధనము॥

చ॥ శాంతమే మాధనము సంకీర్తనే ధనము।యెంతైనా నిశ్చింతనే ఇహధనము।
అంతరాత్మే మాధనము హరిదాస్యమే ధనము।యింతటా లక్ష్మీకాంతు డింటిమూలధనము॥

చ॥ ఆనందమే ధనము ఆచార్యుడే ధనము।నానాట పరిపూర్ణమే ధనము।
ధ్యానమే మా ధనము దయే మాధనము।పానిన శ్రీవేంకటాద్రిపతియే మాధనము॥

860) బిలహరి

ప॥ ఈతడే హరుడు యీతడే యజుడు।ఈతనికి నీ చేతలెంత ఘనమటుగాన॥

చ॥ కడుపెక్కు బ్రహ్మాండ కటకములు సుడివడిన।కడుపులో నిడుకొన్న ఘనుడు।
వెడలి పూతకిచంటి విషము తాగిన యంత।వడి తనకు నేమాయ వట్టిబూమెలుగాక॥

చ॥ ఎల్లజలధులు మిగిలి యేకమై పర్విననపు-।డుల్లసిల్లుచు నీతడుండు।
మల్లాడి యొక రెండు మద్దులు విరచినట్టి।బల్లిదుడవని నిన్ను పరిణమింతురు గాన॥

చ॥ తిరువేంకటేశ్వరుడు దేవ దేవోత్తముడు।పరిపూర్ణుడచ్యుతుడభవుడు।

శరణాగతుల రక్షసేయు వాడనుమాట। గురుతుగా తలపోసి కొనియాడాగా వలసె॥
861) సామంతం / సునాదవినోదిని
ప॥ ఉన్నతోన్నతుడు వుడయవరు। యెన్న ననంతుడే యీ యుడయవరు॥
చ॥ సర్వలోకముల శాస్త్రరహస్యము-। లుర్వి బొడమె నీ యుడయవరు।
పూర్వపు వేదాంత పుణ్యశాస్త్రములు। నిర్వహించె నన్నిటా నుడయవరు॥
చ॥ వెక్కసపు శ్రీవిష్ణుభక్తియే। వొక్కరూపమే వుడయవరు।
చక్కనైన సుజ్ఞానమున కిరవై। వుక్కు మీఱెనిదె వుడయవరు॥
చ॥ కదిసె మోక్షసాకారము దానై। వుదుటున నిలిచె నీ వుడయవరు।
యిదిగో శ్రీవేంకటేశ్వరు నీడై। పొదలుచు నున్నాడు భువి నుడయవరు॥
862) శంకరాభరణం
ప॥ ఎంతనేరుపరి యీలేమ। దొంతివెట్టె సంతోసముల॥
చ॥ వెలది సెలవులను వెన్నెలగాసీ। చెలులు నీసుద్దులు చెప్పగను।
తలపోతలనే దండలు గుచ్చీ। నెలకొని యెదుటను నీవుండగను॥
చ॥ వనిత చెక్కులను వానలు గురిసీ। తనియని విరహపు తమకమున।
కనుచూపులనే కలువలు చల్లీ। నినుపుల వలపుల నీరాకలకు॥
చ॥ తెఱవ పెదవులను తేనెలు చిందీ। మఱి నీవాడిన మాటలను।
నెఱి శ్రీవేంకటనిలయ కూడితివి। జఱసీ నీతో జాణతనముల॥
863) శంకరాభరణం
ప॥ ఎంత నేరుచుకొన్నది యీచిన్నది। చెంతనుండే నిన్ను నిట్టె చేకొన్నది॥
చ॥ చిగురు పెదవి మీది చిన్నలూ। సగముమాటలతోడి సన్నలూ।
నగియేటి సెలవుల నయములూ। బిగిసేటి కాగిటి ప్రియములు॥
చ॥ తనివోక చెలులతో తలపోతలూ। ననుపు లేపొద్దు మానని చేతలు।
పనివడి నీమీది పాటలూ। మొనసి యెప్పుడు నీతో మొగమోటలు॥
చ॥ వద్దనుండి పైజల్లీ వలపులు। అద్దుకొనీ రతిలోని యలపులు।
వొద్దికై శ్రీవేంకటేశ వొనగూడితి వీకెను। కొద్దిమీరె బింకముల కూడిన పొంకములు॥
864) హిందోళ
ప॥ ఎంచి సేయు పనులిక లేవు। కొంచక యాతని కొలుచుటే కలది॥
చ॥ తప్పదు కర్మము తానెందున్నా। చెప్పగ దీనికి చింతేలా।
అప్పుడు తొల్లే అనుమతించె నివి। తప్పక యాతని తలచుటే కలది॥
చ॥ ఆయము నన్నమునందొక లంకె। వేయుట దీనికి వెతలేలా।
కాయములో హరి గలడంతరాత్మ। యీయెడ తను నుతియించుటే కలది॥
చ॥ వెలిని లోన శ్రీవేంకటేశుడే। తెలియని మతి సందియమేలా।
యిలలో మనముల నేలె నాతడే। సలిగె మనకతని శరణమే కలది॥
865) ఆహిరి / హిందోళ
ప॥ ఎంత మోహమో కాని ఇతడు నీమీదను। సంతతము బాయకిటు సరుస నున్నాడు॥
చ॥ పలుకవే పతితోడ పగడవాతెర దెరచి। చిలుకవే సెలవులను చిరునవ్వులు।
మొలకసిగ్గులివేల మోనంబు లింకనేల। కలయికకు వచ్చి ఇదె కాచుకొన్నాడు॥
చ॥ కనుగొనవే వొకమాటు కలువకన్నుల నితని। పెనగవే కరములను ప్రియము చల్లి।
పొనిగేటి తమకమేల పొసగి గుట్టికనేల। నినుగదియువేడుకను నిలుచున్నవాడు॥
చ॥ కొసరవే యీవేళ కూరిములు సారెకును। విసరవే సణగు లిటు వేమారును।
వెస రతుల మరిగి శ్రీవేంకటేశుడు గూడి। సుసరమున నీతోడ జొక్కుచున్నాడు॥
866) సుమనసరంజని

ప॥ ఎంత మన్నించితో యీ యింతినిదె నీవు। అంతకంతకు ప్రేమనలరీనిపుడు॥
చ॥ పడతి నాట్యశ్రాంతి పవళించి తొల్లి నీ-। తొడలపై నీవు తల దువ్వగాను।
కడలేని యిటువంటి కళలు దలచే కదా। విడువని వియోగమున వేగీనిపుడు॥
చ॥ ఒనర కుచభారమున నొరగి యీ మలగుపై-। నెనసి నీవాకు మడిచియ్యగాను।
వనిత నేడటువంటి వలపుదలచే కదా। ఘనమైన తాపమున కాగీనిపుడు॥
చ॥ సిరులు నీ మోముపై చెక్కు లొయ్యన చేర్చి। యరమోడ్చి కనురెప్పలలమి యలమి।
తిరువేంకటాచలాధిపుడ నినుగూడియే। పరవశానంద సంపద దేలెనిపుడు॥

867) బౌళి / వరాళి
ప॥ ఎన్నడొకో సుజ్ఞానము యీ యాత్మకు। కన్ను లెదిటివి చూచి కాలము నిట్టాయను।
చ॥ హేయములో సుఖము యెంగిలిలో సుఖము। కాయము నమ్మి కదా కష్టపడెను।
పాయములో చవులు పాపములో చవులు। మాయలు నమ్మి కదా మనసూనిట్టాయను॥
చ॥ కల్లలోనిబదుకు కాసువీసపుబదుకు। కల్లరి ప్రాణాలు నమ్మి కట్టుపడెను।
యెల్లి నేటి తలపు యింద్రియాల తలపు। కొల్ల సంసారముగూడి గుణమునిట్టాయను॥
చ॥ అంగడిబెట్టే సిరులు యలయింపులో సిరులు। దొంగజీవుడు యిట్లానే తొట్రుపడెను।
అంగపు శ్రీవేంకటేశుడంతలో మన్నించగాను। ముంగిలెల్లా మోక్షమాయ ముచ్చటే యిట్టాయెను॥

868) సామంతం / సామ
ప॥ ఎటువంటి మోహమో ఏట్టి తమకమో గాని। తటుకునను దేహమంతయు మరచె చెలియ॥
చ॥ పలుకుతేనెల కొసరి పసిడి కిన్నెర మీటి। పలుచనెలుగున నిన్ను పాడిపాడి।
కలికి కన్నీరు బంగారు పయ్యెద నొలుక। తలయూచి తనలోనె తలవంచు చెలియ॥
చ॥ పడతి నీవును తాను పవళించు పరపుపై। పొడము పరితాపమున పొరలి పొరలి।
జడిగొన్న జవ్వాది జారు చెమటల దోగి। ఉడుకు నూరుపుల నుసురుసురాయె చెలియ॥
చ॥ తావిచల్లెడి మోముదమ్మి కడు వికసించె। లోవెలితి నవ్వులను లోగి లోగి।
శ్రీ వేంకటేశ లక్ష్మీకాంత నినుగలసి। ఈ వైభవము లందె ఇదివో చెలియ॥

869) పాడి
ప॥ విభుని వినయములు వినవమ్మా నిను-। నభయంబడిగీ నయ్యో తాను॥
చ॥ రహస్యమున శ్రీరమణుడు పంపిన। విహరణలేఖలు వినవమ్మా।
అహిపతిశయనంబు అతితాపంబై। బహువేదనకు అగపడెనటగాను॥
చ॥ ఆదిమపతి నీయడుగుల కెరగిన। వేదాంత రచన వినవమ్మా।
నీదయగానక నిమిషమె యుగమై। ఖేదంబున నలగీనట తాను॥
చ॥ కింకరుడట నీకినుక సేతలకు(చూపులకు?)। వేంకటపతి గతి వినవమ్మా।
సంకెలేక నీ చనవున జగములు। కొంకకిపుడె చేకొనెనట తాను॥

870) కాంభోజి
ప॥ తమ్ములాల అన్నలాల తల్లులాల నే। నెమ్మనపు హరి బాసి నిలువలేనికను॥
చ॥ కొమ్మలాల మరుకోట కొమ్మలాల వో-। యమ్మలాల తొలరె నా యక్కలాల।
తమ్మిరేకు కన్నుల యాతని బాసినే। నుమ్మల సొమ్మల చేత నుండలేనికను॥
చ॥ చెలులాల కలికి తొయ్యలులాల వో-। యెల జవ్వనముల మోహినులాల।
చెలువంపు హరి దలచిన నాకు నే-। నులుకు కన్నీరు ఆపకుండలేనికను॥
చ॥ బోటులాల జవ్వనపు మేటులాల వో-। గాటపు తురుముల చీకటులాల।
వాటమైన వేంకటేశ్వరు బాసి నే-। నాటదాననై జన్మమందలేనికను॥

871) సామంతం / కాపి
ప॥ ఓయమ్మా ఇంతయేల వద్దనరే। నాయముగాదిందరిలో నగుబాటు తనకు॥
చ॥ చక్కు నొక్కి తిని సెలవి నవ్వితిని। మక్కువతో ఎంతైన మాటాడడు।

మొక్కూ మొక్కితిని మోనాన నుండితిని। యెక్కుడు దిట్టితీనంట నెగ్గువట్టీ నితడు॥
చ॥ ఇచ్చకము చేసితి ఇచ్చితి విడమును। కర్చుపెట్టి యెంతైనా కరగడు।
ముచ్చటలాడితిని మోవిచూచితి తన్ను। పచ్చిగా చేసితినంటా పగచాటీనితడు॥
చ॥ కన్నులా జొక్కితిని కాగిటానించితిని। మన్నించే రతియెంతైనా మానడు।
సన్నల మెచ్చితిని ఛాయల హెచ్చితిని। ఇన్నిటా శ్రీవేంకటేశుడెంత జాణే యితడు॥
872) శంకరాభరణం / హుసేని
ప॥ నాకుజెప్పరె వలపు నలుపో తెలుపో। నూకి పోవగరాదు నుయ్యో కొండో॥
చ॥ పొలతి మరునికి వెరవ పులియో యెలువో। వులుకుతుమ్మిదమోత వురుమో మెరుమో।
తిలకింప చందనము తేలో పామో। యెలమి కోవిలకూత యేదో పోదో॥
చ॥ పొదలిన చలిగాలి పొగయో వగయో। వదలిన కన్నీరు వాగో వంతో।
వుదరమున పన్నీరు వుడుకో మిడుకో। యెదుట తలవంచుకొనుట ఎగ్గో సిగ్గో॥
చ॥ అసమశరునిపై పరపుటదనో పదనో। పసగలవానిమోవి పంచదారో తేనో।
అసమగతి వానిరాక ఆదోపాదో। రసికు వేంకటేశు పొందు రాజ్యమో లక్ష్మో॥
873) ఆహిరి / మోహన
ప॥ కుందనంపుమై గొల్లెత తా-। నెందును పుట్టని యేతరి జాతి॥
చ॥ కప్పులు దేరేటి కస్తురిచంకల। కొప్పెర గుబ్బల గొల్లెత।
చప్పుడు మట్టెల చల్లలమ్మెడిని। అప్పని ముందట హస్తిని జాతి॥
చ॥ దుంపవెంట్రుకల దొడ్డతురుముగల। గుంపెన నడపుల గొల్లెత।
జంపుల నటనల చల్లలమ్మెడిని। చెంపల చమటల చిత్రిణి జాతి॥
చ॥ వీపున నఖముల వెడవెడ నాటిని। కోపపు చూపుల గొల్లెత।
చాపున కట్టిన చల్లలమ్మెడిని। చాపేటి ఎలుగున శంకిణి జాతి॥
చ॥ గారవమున వేంకటపతి కౌగిట। కూరిమివాయని గొల్లెత।
సారెకు నతనితో చల్లలమ్మెడిని। భారపు టలపుల పద్మిని జాతి॥
874) ముఖారి
ప॥ కలలోనే యిరువురము అలిగి వేగ। కలయనుచు తెలిసి నిను కౌగిలించితిరా॥
చ॥ అలుగుదురె సతులు బతులనగా వినగ-। నలవాటు లేక నే నలుగుచుండుదురా।
అలిగితట వురక నీవంత నాతోను మరి-। నలుగులౌనట పూవులంతలోపలనే॥
చ॥ చందురుడే సూర్యుడై జరగ మిగుల। కెందమ్ములవుర నా కెంగేలుదోయి।
గందమే తోచెనట కస్తూరియనగ నా-। చందమపుడొకలాగు చందమవునటరా॥
చ॥ విటవరుడ కోనేటివిభుడ నీ-। వెటు దొలంగిన దేహమెట్టు నిలుపుదురా।
యిటువలెనె మనలోన నెలమి మరచి। తటుకనను గలయనుచు తలకి తెలిసెనురా॥
875) మధ్యమావతి
ప॥ ఇద్దరి తమకము ఇటువలెనే। పొద్దున ఏమని బొంకుదమయ్యా॥
చ॥ లలి నాకధరము లంచమీయగా। పలుసోకులై మరగెనవే।
పిలువగరాగా బెరసి నిందవడె। పొలతికి ఏమని బొంకుదమయ్యా॥
చ॥ అడుగుకొనుచు నిన్నంటి పెనగగా। తడయక నఖములు తాకెనవే।
తోడుకొనిరాగా దూఱు మీదవడె। పొడవుగ ఏమని బొంకుదమయ్యా॥
చ॥ పెక్కులు చెవిలో ప్రియములు చెప్పగా। ముక్కున జవ్వాది మోచెనదే।
ఇక్కడ శ్రీవేంకటేశుడ సడివడె। పుక్కటి నేమని బొంకుదమయ్యా॥
876) కాంభోజి
ప॥ ఏమి సేయుదునమ్మ యిన్నియును నిటుగూడె। తామసపు ప్రేమ వేదన బాయనీదు॥
చ॥ కినిసి నే సొలసి పలికెద నంటినా యతని-। నెనయు దడబాటు నోరెత్తనీదు।

చెనకి యలపార జూచెద నంటినా యతని- | కనుగవ జలంబు సరుగన జూడనీదు ||
చ|| కిందుపడి కదిసి మ్రొక్కెద నంటినా యతని- | నంది పరవశము చేయాడ నీదు |
డెందంబు మఱచి యుండెద నంటినా యతని- | జెందిన తలపు మఱచియు మఱవనీదు ||
చ|| తిరువేంకటేశు బొందితినంటినా యతని- | దొరతనము నాగరిమ దోచనీదు |
సిరిదొలకు రతుల నలసితి నంటినా యతని- | సరసంబు వేడుకల చాలించనీదు ||

877) లలిత / నీలాంబరి
ప|| ఒకటిపైనొకటి నీవుపాయాలు | వెకలి నీవిద్యలెల్ల వెల్లవిరి గావా ||
చ|| సందడి నాచేయి ముట్టి సరసాలాడేకొరకే | పందేమాడవచ్చేవు పలుమారును |
మందలించి నాచేత మాటలాడించవలసి | అందపుగత లడిగే వది నే నెఱగనా ||
చ|| యేరా నాకుచగిరు లిటు ముట్టేయందుకుగా | హారములు చిక్కుదీసే వది మేలురా |
గోరికొన దాకించే కొరకుగా చెక్కుముట్టి | యారీతి వేడుకొనే విన్నియు తెలిసెరా ||
చ|| యాకడ నన్ను గూడే ఇందుకుగా నింతసేసి | యేకతమాడేనంటా నెనసితివి |
పైకొని శ్రీవేంకటేశ బడివాయకుండా న- | న్నాకు మడిచిమ్మనేవు అవురా నీవు ||

878) సాళంగనాట
ప|| ఒసగితివిన్నియు ఒకమాటే | వెసనిక జేసే విన్నపమేది ||
చ|| నారాయణా నీనామము దలచిన - | నీరాని వరములిచ్చితివి |
చేరి నిన్ను నిటు సేవించిననిక | గోరి పడయ నిక కోరికలేవి ||
చ|| హరి నీకొకమరి యటు శరణంటే | గరిమల నన్నిటు గాచితివి |
నిరతముగా నిక నిను నుతియింపుచు |అరగొరతనివి నిను నడిగేదేదో ||
చ|| శ్రీవేంకటేశ్వర చేయెత్తి మొక్కిన | భావమే నీవై పరగితివి |
యీవరుసల నీవింతటిదాతవు | ఆవలనిను కొనియాడెడిదేమి ||

879) మలహరి / హిందోళ
ప|| ఒక్కొక్కసతినడుమ ఒక్కొక్క రూపుగైకొని | యెక్కువైతివి కృష్ణా నిన్నెట్ల నమ్మేదిరా ||
చ|| మాటలాడే వొకతెతో మళ్ళిచూచే వొకతెను | వోటలేక నవ్వు నవ్వేవు వొకతెతోను |
కూటువై గొల్లెతలము గుంపుగూడున్నారమిదే | యేటిది నీమోహ మింక నెందని నమ్మేదిరా ||
చ|| కన్నుగీటె వొకతెకు కాగిలించే వొకతెను | వెన్నదిన్న మోవిచ్చేవు వేరొకతెకు |
వున్నతి రాసక్రీడ లున్నార మిందరము | ఇన్నిటిలో నీవలపు యెందని నమ్మేదిరా ||
చ|| తమ్మవెట్టే వొకతెకు తగమెచ్చే వొకతెను | సమ్మతించ జేశొకతె చన్ను లంటేవు |
యెమ్మెల శ్రీవేంకటేశ ఇందరి మమ్ము గూడితి- | విమ్ములనే నమ్మితిగాకెటుల నమ్మేదిరా ||

880) బౌళి
ప|| ఓహో యెంతటి వాడే వొద్దనున్న వాడే | సాహసపు గుణములచతురుడా యితడు ||
చ|| జలధిలో బవళించి జలనిధి బంధించి | జలనిధి కన్యకను సరిబెండ్లాడి |
జలనిధిలో నీది జలనిధి మథియించి | జలధి వెరించిన చలమరాయితడు ||
చ|| ధరణికి బతియై ధరణి గ్రుంగిన నెత్తి | ధరణి కూతురు దానె తగ బెండ్లాడి |
ధరణి పాదము మోపి ధరణి భారము దించి | ధరణీ ధరుడైన దైవమా ఇతడు ||
చ|| కొండ గొడుగుగ నెత్తి కొండ దూటు పడవేసి | కొండకిందగుదురై కూచుండి |
కొండపై శ్రీ వేంకటాద్రి కోనేటి రాయడై | కొండ వంటి దేవుడైన కోవిదుడా ఇతడు ||

881) పాడి
ప|| ఒక్కడే ఏకాంగ వీరుడుర్వికి దైవమౌనా | యెక్కడా హనుమంతుని కెదురా లోకము ||
చ|| ముందట నేలే పట్టమునకు బ్రహ్మయినాడు | అందరు దైత్యులచంపి హరిపేరైనాడు |
అంది రుద్రవీర్యము తానై హరుడైనాడు | యెందునా హనుమంతుని కెదురా లోకము ||
చ|| చుక్కలు మోవ పెరిగి సూర్యుడు తానైనాడు | చిక్కు పాతాళము దూరి శేషుడైనాడు |

గక్కన వాయుజుడై జగత్ప్రాణుడైనాడు। ఎక్కువ హనుమంతుని కెదురా లోకము॥
చ॥ జలధి పుటమెగసి చంద్రుడు తానైనాడు। చెలగి మేరువుపొంత సింహమైనాడు।
బలిమి శ్రీవేంకటేశు బంటై మంగాంబుధి। ఇల ఈ హనుమంతుని కెదురా లోకము॥

882) సామంతం / వసంతం
ప॥ కలశాపురము కాడ కందువ సేసుకొని। అలరుచున్న వాడు హనుమంతరాయడు॥
చ॥ సహజాన నొకజంగ చాచి సముద్రము దాటి। మహిమ మీరగ హనుమంతరాయడు।
ఇహమున రాము బంటై యిప్పుడు నున్న వాడు। అహరహమును దొడ్డ హనుమంతరాయడు॥
చ॥ నిండు నిధానపు లంక నిమిషాన నీరుసేసె। మండిత మూరితి హనుమంతరాయడు।
దండితో మగిడి వచ్చి తగ సీత శిరోమణి। అండ రఘుపతి కిచ్చె హనుమంతరాయడు॥
చ॥ వదలని ప్రతాపాన వాయుదేవు సుతుడై। మదియించి నాడు హనుమంతరాయడు।
చెదరక యేప్రొద్దు శ్రీవేంకటేశు వాకిట। అదివో కాచుకున్నాడు హనుమంతరాయడు॥

883) ఆహిరి
ప॥ కొలిచితే రక్షించే గోవిందుడితడు। యిలకు లక్ష్మికి మగడీ గోవిందుడితడు॥
చ॥ గోవర్ధనమెత్తినట్టి గోవిందుడితడు। వేవేలు గొల్లెతల గోవిందుడితడు।
కోవిదుడై ఆలగాచే గోవిందుడితడు। ఆవల కంసు జంపిన ఆగోవిందుడితడు॥
చ॥ క్రూరకాళింగ మర్దన గోవిందుడితడు। వీర చక్రాయుధపు గోవిందుడితడు।
కోరి సముద్రాలు దాటే గోవిందుడితడు। ఆరీతి బాలుర దెచ్చే యాగోవిందుడితడు॥
చ॥ కుందనపు కాశతోడి గోవిందుడితడు। విందుల రేపల్లె గోవిందుడితడు।
పొంది శ్రీవేంకటాద్రిపై పొసగ తిరుపతిలో। అందమై పవ్వళించిన ఆ గోవిందుడితడు॥

884) పాడి / ఖరహరప్రియ
ప॥ కలదొక్కటే గురి కమలాక్ష నీ కరుణ। యిల నేనెట్టుండినాను యెంచకుమీ నేరమి॥
చ॥ మనసులోనికి గురి మాధవ నీ పాదాలు। తనువుపై గురి నీ సుదర్శనము।
కనుచూపులకు గురి కమలాక్ష నీ రూపు। పను లెన్ని గలిగిన బట్టకు నా నేరమి॥
చ॥ చేతులు రెంటికి గురి సేసేటి నీ పూజలు। నీతి నా నాలిక గురి నీ నామము।
కాతరపునుదుటికి గల తిరుమణి గురి। పాతకపునావలన బట్టకుమీ నేరము॥
చ॥ యిహపరాలకు గురి యీ నీ శరణాగతి। సహజ మాత్మకు గురి సంతతభక్తి।
మహిలో శ్రీవేంకటేశ మన్నించి నన్నేలితివి। బహువిధముల నింక బట్టకుమీ నేరమి॥

885) కురంజి
ప॥ కొత్తపెండ్లి కూతురు కొంకు దేరీ దేరదు। చిత్తగించి నీవైన చేయి వట్టవయ్యా॥
చ॥ చిమ్ముచు నీమోము చూచీ సిగ్గుతో దగ్గరదు। కొమ్మ సంగడి నీవైన కూచుండవయ్యా।
కమ్మి నవ్వులను నవ్వీ కలసి మాటలాడదు। పమ్మి నీవైన నాపెతో పలుకవయ్యా॥
చ॥ ఆలవట్టము విసరే నంటి ముట్టిపెనగదు। తేలించి యాపె వెరపు తెలుపవయ్యా।
కాలు దొక్కి నిన్ను నిట్టె కాకదేర గలయదు। పోళీ నీవే కాగిట బొదుగవయ్యా॥
చ॥ తనలోనే మోహించీ దంటతనము నేరదు। ననుపులే యాకెతోడ నడపవయ్యా।
యెనసె శ్రీవేంకటేశ యింతి నిన్ను మెల్లనె। మనసిచ్చి యిటులానె మన్నించవయ్యా॥

886) బేహాగ్
ప॥ కేవల కృష్ణావతార కేశవా। దేవదేవ లోకనాథ దివ్యదేహ కేశవా॥
చ॥ కిరణార్క కోటితేజ కేశవా। హరి లక్ష్మినాయక యాదికేశవా।
గిరిరాజసుత నుత కేశవ నమో। శరధిగంభీర శాయి జయజయ కేశవా॥
చ॥ కేకిపింఛావసంత కేశవ। శ్రీకర గుణాభిరామ చెన్న కేశవ।
కేకి వాహనవరద కేశవ। పాకశాసనవంద్య భళిభళి కేశవా॥
చ॥ కింకరబ్రహ్మాదిగణ కేశవ నా-। మాంకిత శ్రీవేంకటాద్రి కేశవ।

కుంకుమాంకవక్ష వెలిగోట కేశవ సర్వ -। శంకాహరణ నమో జగదేక కేశవా॥

887) మిశ్రమోహన

ప॥ కొమ్మ సింగారము లివి కొలది వెట్టగ రావు। పమ్మిన యీసొబగులు భావించరే చెలులు॥

చ॥ చెలియ పెద్దతురుము చీకట్లు గాయగాను। యెలమి మోముకళలు యెండ గాయగా।
బలిసి రాతిరియు పగలు వెనకముందై। కలయ కొక్కట మించీ కంటిరటే చెలులు॥

చ॥ పొందుగ నీకెచన్నులు పొడవులై పెరుగగా। నందమై నెన్నడుము బయలై వుండగా।
ఇందునే కొండలు మిన్ను గిందుమీదై యొక్కచోనే। చెంది వున్న వివివో చూచితిరటే చెలులు॥

చ॥ శ్రీవేంకటేశువీపున జేతు లీకె గప్పగా। యీవల నీతనిచేతు లీకె గప్పగా।
ఆవల గొమ్మలు దీగె ననలు గొనలు నల్లి। చేవ దేరీని తిలకించితిరటే చెలులూ॥

888) బిలహరి

ప॥ కొమ్మలాలా ఎంతవాడె గోవిందరాజు। కుమ్మరించీ రాజసమే గోవిందరాజు॥

చ॥ ఉలిపచ్చి నవ్వులతో ఒత్తిగిలి పవళించి। కొలువు సేయించుకొనీ గోవిందరాజు।
జలజాక్షు లిద్దరును సరిపాదా లొత్తగాను। కొలదిమీర మెచ్చేనీ గోవిందరాజు॥

చ॥ అదె నాభికమలాన అజుని పుట్టించి తాను। కొదలేక వున్నవాడు గోవిందరాజు।
చెదరక తనవద్ద సేవ సేసే సతులకు। గుదిగుచ్చీ వలపులు గోవిందరాజు॥

చ॥ ఒప్పుగా వామకరము ఒగిచాచి వలకేల। కొప్పు కడునెత్తినాడు గోవిందరాజు।
ఇప్పుడు శ్రీవేంకటాద్రి నిరవై శంఖుచక్రాల। కుప్పె కటారములు పట్టె గోవిందరాజు॥

889) కాంభోజి / రాగమాలిక

ప॥ కొండా చూతము రారో కొండొక తిరుమలకొండా।
కొండని యడిగిన వరము లొసగు మాకొండల తిమ్మయ కొండా॥

చ॥ మేరువు మును స్తుతియింపగను వారిజసంభవుడా।
పేరు కలుగు నవరత్నంబులు బంగారము కల్పతరువూ।
మేరకు మీఱగని నెలవున నారుగ నిడెనొకో యనగా।
ధారుణి బ్రహ్మాండములకు నాధారంబగు మాకొండా॥

చ॥ గరుడాచలం బనగా శ్రీవేంకటశైలం బనగా।
గిరులకు నేలికె యగు ననంతగిరి దా నీ గిరియనగా।
సిరులాయ జనమగు యంజన శబరి యనెడి నామములూ।
పరగగ నాలుగు యుగముల వెలసిన ప్రబలంబగు మాకొండా॥

చ॥ పొదలూ సొంపగు నింపుల పూబొదలూ వాసననదులూ।
కొదలూ గల తామరకొలకులపై మెదలుతుమ్మెదలూ।
కడలి మలయానిలు వలపులపస కదళీవనములనూ।
మొదలుగా నెల్లప్పుడు నీ సంపదలు గల మాకొండా॥

చ॥ జంతువులెల్లను మునులూ సకలమైన దేవతలూ।
జంతువుల యెలగులు వేదసారంబగు హరినుతులూ।
చింతామణులట రాళ్ళెల్లను సిరులనెలవు లా గుహలూ।
సంతతసౌభాగ్యంబుల నొప్పెడు సందడిగల మా కొండా॥

చ॥ వొకచో బ్రహ్మాదులు మునులును వొకచో నింద్రాదులునూ।
వొకచో భాగవతులు యతులు శ్రుతులు వొకచో చంద్రార్కులు।
వొకచో తీర్థంబులు గిరులును వొకచో యోగీశ్వరులూ।
అకలంకత తనుగోరి తపము సేయనాస లెఱగు మాకొండా॥

చ॥ శుకములతో చదువుదురా శుకబ్రహ్మాదులు శ్రుతులూ।
తకదిమ్మని యాడించు మయూరతతిని యోగీశ్వరులూ।

సకల పురాణంబులు విందురు మఱి పికశారికలచే మునులూ।
ప్రకటితముగ నీవిద్యల నొప్పెడు భాగ్యముకల మా కొండా॥
చ॥ స్వామితీర్థములకును స్వామిపుష్కరణియునూ।
పామరులా యమరుల జేయును పాపవినాశనమూ।
తా మహిగోరిక లిచ్చు కుమారధారయూ పాండవసరసీ।
కామితఫలగాయిని ఆకాశగంగయు గల మాకొండా॥
చ॥ యిదియె క్షీరాంబుధి యనుచు మరి యిదియె ద్వారక యనుచు।
యిదియె నందవ్రజ మనుచును మఱి యిది దా నయోధ్య యనుచూ।
యిదియె వైకుంఠం బనుచును యిది పరతత్వంబనుచు।
యిదియె పరమపదం బనుచు వేదములు యెన్న గగల మా కొండా॥
చ॥ తలచిన శుకశౌనకాదులకు తలచిన తలపొసగినా।
తలపులోపల నెలకొన్నా దయతో నన్నే లినా।
చెలువుడు మావేంకటరాయడు సిరులనెలవు చేకొన్నా।
కలియుగవైకుఠంబను నామము గలిగివెలయు మాకొండా॥
890) పాడి
ప॥ మచ్చికతోనేలవయ్యా మదన సామ్రాజ్య లక్ష్మి।పచ్చి సింగారాల చేత బండారాలు నిండెను॥
చ॥ కొమరె తురుమునను గొప్ప మేఘముదయించి।చెమటవాసన కురిసె చెక్కులవెంట।
అమర పులకలపైరులు అంతటాను చెలువొంది।ప్రమదాల వలపుల పంటలివె పండెను॥
చ॥ మించుల చూపుల తీగె మెరుపులిట్టేమెరసి।అంచె గోరికల జళ్ళవె పట్టెను।
సంచితపు కుచముల జవ్వనరాసులమించె।పొంచి నవ్వుల యామని పొదిగొనెనిదిగో॥
చ॥ అలమేలుమంగమోవి అమృతము కారుకమ్మి।నలువంక మోహనపు సోనలు ముంచెను।
యెలమి శ్రీవేంకటేశ యింతినిట్టె గూడితివి।కొలది మీరి రతుల కొటార్లు గూడెను॥
891) కేదారగౌళ
ప॥ ఏటికి పరాకు సేసేవిప్పుడునీవు।మాటలాడి ఇకనైన మన్నించరాదా॥
చ॥ చిమ్ము చూపులను జూచి చేతికిచ్చి పూబంతి।కొమ్మ నీకునిదె అందుకొనరాదా।
ఉమ్మగిల చెమరించి ఊరక నీవుండగాను।ఇమ్మిచ్చి తొడమీదట నిడుకొనరాదా॥
చ॥ వినయాన నీకుమొక్కి విందు చెప్పవచ్చె చెలి।గునియక యిట్టె ఇయ్యకొనరాదా।
నినుపు నిట్టూర్పునించి నీవు గుట్టుతోనుండగ।చనవిచ్చి చెక్కునొక్కి సమ్మతించరాదా।
చ॥ కొంగువట్టి పానుపుపై కూర్చుండబెట్టి నిన్ను।ఇంగితమెరిగి మోవి నియ్యరాదా।
చెంగలించిరతిగూడి శ్రీవేంకటేశ మెప్పించె।నంగన నెప్పుడు నిట్టె ఆదరించరాదా॥
892) దేశాక్షి / కాపీ
ప॥ అడుగరె చెలులాల అతనినే ఈ మాట।వుడివోని తమకాన నుండబోలు తాను॥
చ॥ వేడుకగలప్పుడే వెస నవ్వు వచ్చు గాక।వాడి వున్నప్పుడు తలవంపులే గావా।
ఏడనో సతులచేత ఏపున బడి రాబోలు।ఈడనే జెనకగాను ఇటులా నుండునా॥
చ॥ ఆసల గూడినప్పుడే ఆయాలు గరగు గాక।పాసి వున్నప్పుడు తడబాటులే గావా।
బేసబెల్లి వలపులు పిరివీకై రాబోలు।సేసనే బెట్టగాను సిగ్గువడి వుండునా॥
చ॥ సరసమాడినప్పుడే చవులెల్లా బుట్టుగాక।కొరవైనయప్పుడు కొరతలే గావా।
ఇరవై శ్రీవేంకటేశుడింతలోనే నన్ను గూడే।వరుసనిందాక నిటువలె జొక్కకుండునా॥
893) పాడి / అమృతవర్షిణి
ప॥ కలశాపురముకాడ గంధపుమాకుల నీడ।నలరేవు మేలు మేలు హనుమంతరాయ॥
చ॥ సంజీవి కొండ తెచ్చి సౌమిత్రి బతికించి।భంజించితి వసురుల బలువిడిని।
కంజాప్తకులరాఘవుని మెప్పించితివి।అంజనీతనయ వో హనుమంతరాయ॥

చ॥ లంక సాధించితివి నీలావులెల్లా జూపితివి। కొంకక రాముని సీత గూరిచితివి।
లంకెల సుగ్రీవునికి లలి ప్రధానివైతివి। అంకెలెల్లా నీకు జెల్లె హనుమంతరాయ॥
చ॥ దిక్కులు గెలిచితివి ధీరత బూజ గొంటివి। మిక్కిలిప్రతాపాన మెరసితివి।
ఇక్కువతో శ్రీవేంకటేశ్వరుబంట వైతివి। అక్కజపుమహిమల హనుమంతరాయ॥

894) ముఖారి

ప॥ కడవరాదు హరి ఘనమాయ। తెగి విడువగరాదు వేసరరాదు॥
చ॥ చూపుల యెదిటికి సోద్యంబైనది। పాపపుణ్యముల ప్రపంచము।
తీపులు పుట్టించు దినదినరుచులై। పూపలసంసారభోగములు॥
చ॥ మనసులోపలికి మర్మంబైనది। జననమరణములశరీరము।
వెనవెనక తిరుగు వెడ లంపటమై। కనకపుటాసలకర్మములు॥
చ॥ తగుమోక్షమునకు దాపైనదిదె। నగి హరి తలచిన నాలుకిది।
వెగటు దీరె శ్రీవేంకటపతియై। యగపడె నిపుడు పురాకృతము॥

895) సామంతం / శ్రీ

ప॥ గొల్లెతల నింతసేసీ గోవిందుడూ। కొల్లకాడు రేపల్లె గోవిందుడు॥
చ॥ పలుకుల భ్రమయించె భావముల గరగించె। కొలని కరత నవ్వె గోవిందుడు।
యెలయించి యప్పటి మా యింటిలోనే పవ్వళించె। కొలదిమీరినవాడు గోవిందుడు॥
చ॥ వూరక పువ్వుల వేసె నొకటొకటే నేసె। కూరిమి దప్పక చూచె గోవిందుడు।
చేరి మావారుండ వారు చెప్పరాదు తనదూరు। కోరి యశోద నీబిడ్డ గోవిందుడు॥
చ॥ సమ్మతించ జేయి వేసె చన్నులతోనే రాసె। కుమ్మరించె వలపులు గోవిందుడు।
దొమ్మిసేసి మమ్ము గూడె దొరవలె నదె వాడె। కొమ్మరో శ్రీవేంకటాద్రి గోవిందుడు॥

896) రామక్రియ / కల్యాణి

ప॥ గరుడ ధ్వజంబెక్కె కమలాక్షు పెండ్లికి। పరుష లదివో వచ్చె పైపై సేవించను॥
చ॥ పాడిరి సోబాన నదె భారతియు గిరిజయు। ఆడిరి రంభాదులైన అచ్చరలెల్ల।
కూడిరి దేవతలెల్ల గుంపులై శ్రీవేంకటాద్రి। వేడుకలు మీరగ శ్రీవిభుని పెండ్లికిని॥
చ॥ కురిసె పువ్వులవాన కుప్పలై యెందు చూచిన।మొరసె దేవదుందుభి మోతలెల్లను।
బెరసె సంపదలెల్ల పెంటలై శ్రీవేంకటాద్రి। తిరమై మించిన దేవదేవుని పెండ్లికిని॥
చ॥ వేసిరి కానుకలెల్ల వేవేలు కొప్పెరల। పోసిరదె తలబాలు పుణ్యసతులు।
ఆసల శ్రీవేంకటేశుడలమేలుమంగ తాను।సేసలు వెట్టిన యట్టి సింగారపు పెండ్లికి॥

897) భూపాలం / సామ

ప॥ గోవిందా మేల్కొనవయ్యా। కావించి భోగము కడమా నీకు॥
చ॥ కమలజ చల్లని కాగిట తగిలి। సమరతి పాయగ జాలవూ।
కమలభవాదులు కడు నుతియింపగ। విమలపు శయనము విడువగలేవు॥
చ॥ భూసతి తోడుత పొందులు మరిగి। వేసర విదె నీ వేడుకలా।
వాసవ ముఖ్యులు వాకిట నుండగ। పాసివుండ నని పవళించేవు॥
చ॥ నీళామనసిజ లీలలు తగిలి। నాలితోడ మానగలేవు।
వేళాయెను శ్రీవేంకటనాథుడ। పాలించి దాసుల బ్రతికించగనూ॥

898) ధన్యాసి

ప॥ గోవింద నంద నందన గోపాలకృష్ణ నీ-। భావము మాకు జిక్కె గోపాలకృష్ణ॥
చ॥ కొంగువట్టె వదేమోయి గోపాలకృష్ణ మా-। పంగెన కోవుదువా గోపాలకృష్ణ।
దొంగతనాల నవ్వేవు గోపాలకృష్ణ। బంగారు కాశతోడి గోపాలకృష్ణ।
చ॥ కొమ్మలచీర లంటిన గోపాలకృష్ణ। పమ్మి నిన్ను తిట్టము గోపాలకృష్ణ।
కుమ్మరించే వేల సిగ్గు గోపాలకృష్ణ। బమ్మెర పోకిందుల గోపాలకృష్ణ॥

****************************************************************************************************

చ|| కొసరకు మంత నీవు గోపాలకృష్ణ (నీ-) | పస నే నెరగనా గోపాలకృష్ణ |
పొసగ శ్రీవేంకటాద్రి బొందితి నన్ను | పసి మెక్కె మొగము గోపాలకృష్ణ ||

899) బృందావని
ప|| గోవింద గోవిందయని కొలువరే | గోవింద గోవిందాయని కొలువరే ||
చ|| హరియచ్యుతాయని పాడరే | పురుషోత్తమాయని పొగడరే |
పరమపురుషాయని పలుకరే | సిరివరయనుచును చెలగరే జనులు ||
చ|| పాండవవరదా అని పాడరే | అండజవాహను కొనియాడరే |
కొండలరాయనినే కోరరే | దండితో మాధవునినే తలచరో జనులు ||
చ|| దేవుడు శ్రీవిభుడని తెలియరే | శోభలయనంతుని చూడరే |
శ్రీవేంకటనాథుని చేరరే | పావనమైయెపుడును బతుకరే జనులు ||

900) ముఖారి
ప|| గోవిందాది నామోచ్చారణ కొల్లలు దొరకెను మనకిపుడు |
ఆవలనీవల నోర గుమ్మలుగ నాడుద మీతని పాడుదము ||
చ|| సత్యము సత్యము సకలసురలలో | నిత్యుడు శ్రీహరి నిర్మలుడు |
ప్రత్యక్షమిదే ప్రాణులలోపల | అత్యంతము శరణనరో యితని ||
చ|| చాటెడి చాటెడి సకలవేదములు | పాటించినహరి పరమమని |
కూటస్థు డితడు గోపవధూపతి | కోటికి యీతని గొలువరో జనులు ||
చ|| నిలుచున్నా డిదె నేడును నెదుటను | కలిగిన శ్రీవేంకటవిభుడు |
వలసినవారికి వరదు డీతడు | కలడు గలడితని గని మనరో ||

901) వరాళి
ప|| ఎవ్వారు లేరూ హితవుచెప్పగ వట్టి- | నవ్వుల బడి నేము నొగిలేమయ్యా ||
చ|| అడవి బడినవాడు వెడల జోటులేక | తొడరి కంపలకింద దూరినట్లు |
నడుమ దురితకాననములతరి బడి | వెడలలేక నేము విసిగేమయ్య ||
చ|| తెవులువడినవాడు తినబోయి మధురము | చవిగాక పులుసులు చవిగోరినట్లు |
భవరోగముల బడి పరమామృతము నోర | జవిగాక భవములు చవులాయనయ్యా ||
చ|| తనవారి విడిచి యితరమైనవారి | వెనక దిరిగి తా వెత్తైనట్లు |
అనయము తిరువేంకటాధీశు గొలువక | మనసులోనివాని మఱచేమయ్య ||

902) శంకరాభరణం
ప|| ఆడరానిమాటది గుఱుతు | వేడుకతోనే విచ్చేయమనవే ||
చ|| కాయజకేలికి గడు దమకించగ | ఆయములంటిన దది గుఱుతు |
పాయపు పతికిని బరిణాముచెప్పి | మోయుచు తనకిటు మొక్కితిననవే ||
చ|| దప్పిమోవితో తా నను దిట్టగ - | నప్పుడు నవ్విన దది గుఱుతు |
యిప్పుడు దనరూ పిటు దలచి బయలు | చిప్పిల గాగిట జేర్చితిననవే ||
చ|| పరిపరివిధముల పలుకులు గులుకగ | అరమరచి చొక్కినదది గుఱుతు |
పరగ శ్రీవేంకటపతి కడపలోన | సరవిగూడె నిక సమ్మతియనవే ||

903) రీతిగౌళ
ప|| అయనాయ వ్యంగమేలే అతివా ! నీ - | ఆయమే తాకీ మాట లందుకేమీ సేతురా ||
చ|| కప్పురమిందవే వోకలికీ ! మాకు - | నుప్పులవు నీకప్పురా లొల్లము పోరా |
తప్పనాడే వదియేమే తరుణీ ! వోరి | తప్పులెవ్వరెందున్నవో తలచుకో నీవు ||
చ|| నిమ్మ పండిందవే వీ నెలతా ! ఆ - | నిమ్మపండే పాపరవును నే నొల్లరా |
చిమ్మేవు సట లిదేమే చెలియ మేన | చిమ్మురేఖ లెవ్వరందో చిత్తగించు నీవు ||
చ|| కుంకుమపూ నిందవే వో కోమలీ ! నీ - | కుంకుమలే పుప్పొడౌను కీడుకుంటేను |

యింకనేలే కలసితి నింతీ ! వోరి । యింకపు శ్రీవేంకటేశ యిద్దరి చెమటలు ॥

904) శ్రీ

ప॥ అదియెపో శ్రీహరి నామము । తుదిపదమిదియె ధృవమై కలిగె ।

చ॥ తొడరి చిత్రకేతు డే నామము । తడవి లోకమంతయు గెలిచె ।
విడువక బ్రహ్మయు వెస నే నామము । బడిబడి నుడుగుచు ప్రభుడై నిలిచె ॥

చ॥ హరుడే నామము అదె తారకముగ । నిరతి దడవి యెన్నిక మీరె ।
ధర నేనామము దలచి నారదుడు । సురమునియై సంస్తుతులకు నెక్కె ॥

చ॥ ధృవుడే నామము దొరకొని నుతియించి । ధృవ పట్టంబున తుద బ్రదికె ।
జవళి శ్రీ వేంకటేశ్వరుదాసులెల్లాను । భువి నేనామము భోగించి మనిరి ॥

905) సావేరి

ప॥ అదినే నెఱగనా అంతలో భ్రమతు గాక । మదనజనక నాకు మంచిబుద్ధి యియ్యవే ॥

చ॥ యెంత లోకానుభవము అంతయు వృథా నష్టి । కొంతైన బ్రహ్మచింత కోటిలాభము ।
వింతైన జనులతోడి వినోదము నిష్ఫలము । చెంత సజ్జన సంగతి చేరిన యాదాయము ॥

చ॥ నానాదేశ వార్తలు నడుమ చింతా మూలము । పూనిన పురాణ గోష్ఠి పుణ్యమూలము ।
ఆనినకృషివాణిజ్యాలన్నియు దీరని వెట్టి । మానని యాచార మాత్మకు బడ్డపాటు ॥

చ॥ పలు చుట్టరికములు బట్టబయలు తగుళ్ళు । చెలగు నాచార్య సేవ జీవన్ముక్తి ।
బలిమి శ్రీవేంకటేశ పరగ రెండు విధాలు । నిలుకడయినవాడవు నీవే యిన్నిటికి ॥

906) మాళవిగౌళ

ప॥ అవధారు చిత్తగించు హనుమంతుడు వీడె । భువిలోన కలశాపుర హనుమంతుడు ॥

చ॥ రామ నీ సేవకుడిదె రణరంగధీరుడు । ఆముకొన్న సత్వగల హనుమంతుడు ।
దీమసాన లంక సాధించి ఉంగరము దెచ్చె । కామితఫలదుడు యీఘనహనుమంతుడు ॥

చ॥ జానకీరమణ సప్తజలధులు లంఘించి । ఆనుక సంజీవి దెచ్చె హనుమంతుడు ।
పూని చుక్కలెల్లా మొలపూసలుగాగ పెరిగి । భానుకోటికంతితో జొప్పెడు హనుమంతుడు ॥

చ॥ యినవంశ శ్రీవేంకటేశ నీకరుణతోడ । అనుపమజయశాలి హనుమంతుడు ।
పనిపూని ఇటమీది బ్రహ్మపట్టమునకు నీ- । యనుమతి గాచుకున్నాడదె హనుమంతుడు ॥

907) లలిత

ప॥ అన్ని సింగారాలు నీకె అమరుగాక । యన్నిటా దేవతలు నిన్నిందుకే మెచ్చేరు ॥

చ॥ చందురుని వంటిమోము జలజాలే కన్నులట । యిందిర నీకే తగు నీకొత్తలు ।
గొంది నొకటొకటికి గూడవందు రివి నీకు । పొందై పాలవెల్లి తోడబుట్లే కావా ॥

చ॥ ముక్కు సంపెంగవంటిది ముంగురులు తేంట్లట । ఇక్కువలు నీకే తగు నీ కొత్తలు ।
అక్కున వరలక్ష్మివి హరి వసంతమాధవు । డెక్కడా మీ కిద్దరికి యెనయికే కాదా ॥

చ॥ ధర నడుము సింహము తగు గజగమనాలు । తిరమై శ్రీవేంకటేశుదేవి నీకే పో ।
నరసింహుడై యుండి కరిగాచినట్టివాని- । సురత మందితిగాన చుట్టమువేకావా ॥

908) ధన్యాసి

ప॥ ఆతడెవ్వాడు చూపరే అమ్మలాల । ఏతుల నాడేటికృష్ణుడీతడే కాడుగదా ॥

చ॥ కందువ దేవకి బిడ్డగనెనట నడురేయి । అంది యశోదకు కొడుకైనాడట ।
సందడించి పూతకిచంటిపాలు తాగెనట । మందల ఆవుల గాచి మలసెనట ॥

చ॥ మంచిబండి దన్నెనట మద్దులు విరిచెనట । ఇంచుకంతవేల కొండయెత్తినాడట ।
మంచాలపై గొల్లెతలమానాలు చేకొనెనట । మించుల పిల్లగోవివట్టి మెరసెనట ॥

చ॥ కాళింగుని మెట్టెనట కంసు బొరిగొనెనట । పాలించి సురల చేపట్టెనట ।
యీలీల శ్రీవేంకటాద్రి నిరవైనదేవుడట । యేలెనట పదారువేల ఇంతుల నిందరిని ॥

909) సాళంగ నాట

*****************************************************************************************
ప॥ అనంత మద్భుత మాశ్చర్యం బిది। సనాతనుడ నను సరవిగావవే॥
చ॥ బలిమి నసురలకు భయంకరుడవు। అలరి యమరులకు నానందకరుడవు।
తలకొని ఋషులకు తపఃఫలదుడవు। పలు నీ మహిమలు పలుకగ వశమా॥
చ॥ అరయ వేదముల కాధారంబవు। పరగగ జీవుల ప్రాణనాథుడవు।
పరమయోగులకు పరబ్రహ్మమవు। తిరముగ నీమూర్తి దెలియగ వశమా॥
చ॥ జగముల కెల్లను సర్వబంధుడవు। తగిలిన శ్రీకాంతకు నివాసమవు।
జిగి శ్రీవైష్ణవులకు శ్రీవేంకటపతివి। తగు నీ కత లివి తలచగ వశమా॥
910) శంకరాభరణం
ప॥ అహో సురతవిహారోయమ్। సహజ పరాజయశంకా నాస్తి॥
చ॥ యమునాకూలే సుమలతాగృహే। విమలసైకత వివిధస్థలే।
రమణీరమణౌ రమతస్తయోః। ప్రమదస్య పరాత్పరం నాస్తి॥
చ॥ రజనీ కావా ప్రాతః కింవా। త్యజనం భజనం తత్కింవా।
విజయః కోవాపజయః కోవా। భుజపరిరంభ స్ఫుటం నాస్తి॥
చ॥ చీనాంశుక రంజిత మేఖలాని। తానే జఘనం తరతిసతి।
మానవికలనే మానినీమణే। హీనాధిక పరిహృతిర్నాస్తి॥
చ॥ కింవా ఽమిళనం కింవాఽమిళనం। త్వం వాఽహంవా తన్నాస్తి।
సవాదో వా సరసః కోవా। కింవా వాచ్యా క్రియా నాస్తి॥
చ॥ ఆదిదేవ పీతాంశుక బుద్ధా। స్వేద సురభి కాశ్మీరజలం।
సాదురూహ్య లజ్జావివశతయా। ఖేదేన వచః కించిన్నాస్తి॥
చ॥ వరకుచాగ్ర సంవ్యానం కరేణా। హరౌ పరం పరిహరతి సతి।
సరసలోచనాంచల వివశతయా। తరుణ్యాం చైతన్యాం నాస్తి॥
చ॥ సురతాంతశ్రమ సుఖం కింవా। వరలజ్జా సావా కావా।
పరవశతను వైభవం కింవా। నిరతాం తయో నిక్తం నాస్తి॥
చ॥ పరిమళ భరిత ప్రచుర సుశీతల। వరమృదువాయౌ వాతి సతి।
తిరువేంకటగిరిదేవ రాధయో। స్సరసరతి సుఖశ్రాంతిర్నాస్తి॥
911) గౌళ
ప॥ అంగనకు నీవే అఖిలసామ్రాజ్యము। శ్రింగారరాయడ నీకు శ్రీసతినిధానము॥
చ॥ కమలాలపానుపు కాంతకు నీవురము। ప్రమదపు నీమనసు పాలజలధి।
అమరు నీభుజాంతర మట్టె తీగెపొదరిల్లు। రమణీయ (ప్ర)హారాలు రత్నాలమేడలు॥
చ॥ సతికి నీమెడ రతిసాము సేసెకంబము। ప్రతిలేని వయ్యాళి బయలు నీవు।
మతించిన కౌస్తుభమణి నిలువుటద్దము। మితిలేని శ్రీవత్సము మించుబండారుముద్ర॥
చ॥ నెమ్మి నలమేల్మంగ నీకౌగిలి పెండ్లిపీట। చిమ్ముల చందనచర్చ సేసపాలు।
వుమ్మడి మెడనూళ్ళు వుయ్యాలసరపణులు। పమ్మి శ్రీవేంకటేశ నీభావమే భోగము॥
912) మాళవి/ఖరహరప్రియ
ప॥ అరుదీ కపీంద్రుని అధిక ప్రతాపము। సురలకు నరులకీసుద్దులెందు కలవా॥
చ॥ ఉదయాచలము మీదినొక్కజంగ చాచుకొని। ఉదుటున నపరాద్రి నొక్కజంగ చాచుకొని।
తుద సూర్యమండలము తోడ మోము దిప్పుకుంటా। పెదవు లెత్తి చదివె పెద్దహనుమంతుడు॥
చ॥ వొక్కమొలగంట చంద్రు డొక్కమొలగంట రవి। చుక్కలు మొలపూసలై చూపట్టగా।
నిక్కిన వాలాగ్రమందు నిండిన బ్రహ్మలోకము। పిక్కటిల్ల పెరిగెను పెద్దహనుమంతుడు॥
చ॥ పిడికిలించిన చేత బిరుదులపండ్లగోల। తడయక కుడిచేత దశదిక్కుల।
జడియక శ్రీవేంకటేశ్వరుని మన్ననబంటు। బెడిదపు మహిమల పెద్దహనుమంతుడు॥
913) కాపీ
*****************************************************************************************

ప॥ అలమేలుమంగా హరియంతరంగా। కలితనాట్య రంగా కరుణాపాంగా॥
చ॥ అలినీలవేణి అంబుజపాణి। వెలయగ జగదేక విభునిరాణి॥
చ॥ స్మిత(సిత)చంద్రవదనా సింగార సదనా। చతుర దాడిమ బీజచయ సనా (రదనా)॥
చ॥ హితవైన శ్రీవేంకటేశుడిదే ననుగూడె(డునిన్నిదేకూడె)। పతి తలపోతల సమ(తన)కూడె కూడె॥

914) మాళవగౌళ/అఠాణ

ప॥ అదె లంకసాధించె నవనిభారము దించె। విదితమై ప్రతాపము వెలయించె నితడు॥
చ॥ రవివంశ తిలకుడు రాముడితడు। భువిపుట్టె దశరథ పుత్రుడితడు।
భవుడెంచె తారక బ్రహ్మమీతడు। పవనజుకిచ్చినాడు బ్రహ్మపట్టమితడు॥
చ॥ బలువుడు సీతాపతి యితడు। తలకొన్న వాలిమర్దనుడీతడు।
విలసిల్లె ఏకంగ వీరుడితడు। చలమరి కోదండ దీక్షాగురుడితడు॥
చ॥ శరణాగత వజ్ర పంజరుడితడు। సరిలేని అసురభంజకుడీతడు।
వరదుడు శ్రీవేంకటేశ్వరుడితడు। అరయ విజయ నగరాధీశుడితడు॥

915) శంకరాభరణం

ప॥ అలమేలుమంగను నేనైతేనయితిగాక। నిలుచుండి నన్ను జూచి నీకేల లోగను॥
చ॥ చేరి విన్నవించవే సిగ్గువడ నీకేటికి। చీరుమూరుగా వలచినదానవు।
వేరులే కప్పటనుండి వేళగాచుకుందానవు। నేరుపుతో నన్ను జూచి నీవేల లోగేవు॥
చ॥ గట్టిగాను నవ్వవే కడుదాచనేటికి। తొట్టినట్టితమకముతోడిదానవు।
నట్టున నందుకుగానే కోరి లాచి(నాచి)వుందానవు। నెట్టన నేనుండగాను నీవేల లోగేవు॥
చ॥ యెనసి కౌగిలించవే యేకరగ నీకేటికి। పనివడి యట్టే యాసపడదానవు।
మునుపె నన్ను గూడె నిమ్ముల శ్రీవేంకటేశుడు। నిను నాతడే కూడీ నీవేల లోగేవు॥

916) ముఖారి

ప॥ ఆదిమూలమే మాకు నంగరక్ష। శ్రీదేవుడే మాకు జీవరక్ష॥
చ॥ భూమిదేవిపతియైన పురుషోత్తముడే మాకు। భూమిపై నేడనుండినా భూమిరక్ష।
ఆమనిజలధిశాయి అయిన దేవుడే మాకు। సామీప్యముందున్న జలరక్ష॥
చ॥ మ్రోయుచు నగ్ని లో యజ్ఞమూర్తియైన దేవుడే। ఆయములు దాకకుండా నగ్ని రక్ష।
వాయుసుతు నేలినట్టి వనజనాభుడే మాకు। వాయువందు కందకుండా వాయురక్ష॥
చ॥ పాదమాకసమునకు పారజాచే విష్ణువే। గాదిలియై మాకు నాకాశరక్ష।
సాదించి శ్రీవేంకటాద్రి సర్వేశ్వరుడే మాకు। సాదరము మీరినట్టి సర్వరక్ష॥

917) హిందోళ

ప॥ నీ విభుడు వచ్చు దాక నిచ్చలాన నుండ వే।వేవేలకును రేయి వేగించవేమే॥
చ॥ పూయకు కస్తూరి మేన బొద్దుగూకె జీకటంటా।నోయమ్మ చందురుడుదయించెను।
చాయల వెన్నెలదాకి చల్లజంపు యెండలంటా।ఆ యెడ నీవు వేగగ నది చూడలేమే॥
చ॥ గందము పుయ్యకువే కలికి నీ కుచములే।చందనపు గొండలంటా జల్లీగాలి।
అందులో పూవు తావిదాకి అమ్మ మొనలంటెనంటా।మందమై మేను మరువగ మందులు దేలేమే॥
చ॥ వద్దేలే కుంకుమలు వసంతపు జిగురంటా।నద్దితే గోవిల భూతమని లోగేవు।
నిద్దపు శ్రీ వేంకటాద్రి నిలయుడిట్టె కూడె।యిద్దరి మీ వలపులు యింకనెంచలేమే॥

918) ముఖారి

ప॥ నీవెంత నేనెంత నీకు నాకు నెంతదవ్వు।దైవమా సిగ్గుపడక తగిలే నేగాకా॥
చ॥ చెంది నీకు బ్రహ్మాదులు సేవలు సేయుగాను।యిందు మాసేవలు నీకు నేడకువచ్చు।
పొంది వసిష్టాదులట్టే పూజలు సేయగాను।సందడి మాపూజలు సరకా నీకు॥
చ॥ సనకాదియోగులు సారె నిన్ను దలచగా।యెనసి మాతలపు నీ కేడకెక్కును।
నునుపుగా శేషాదులు నుతులు నిన్ను జేయగా।పనివడి మానుతులు బాతేయనా నీకు॥

************************************************************************************************************************

చ॥ కిట్టి నారదాదులు నీకింకరులై వుండగాను। యిట్టె నీదాసుడనను టెంత కెంత।
వొట్టి శ్రీవేంకటేశ మాకొకవుపాయము గద్దు। పట్టి నీదాసులబంటుబంట నయ్యేనికను॥

************************************************************************************************************************